మన జీవిత మిపుడొక పూలబాట
భగవంతుని రహస్య స్థావరమునకు మార్గము
ప్రతి సంవత్సరము మన పయనమందొక యోజనము
ప్రతిదినము జ్యోతిర్లోకమున కొక ప్రవేశ ద్వారము.

శ్రీఅరవిందులు

Publishers: Sri Aurobindo Society, Pondicherry - 605 001. Editor: R.L.N. Sastry, Printers: Sri Aurobindo Ashram Press, Pondicherry.
Licensed to post without prepayment at S.A.A.P.O. on 2, 3, & 4 of every month, Regd. No. TN/PMG(NR)WPP 35/2001

శుభాకాంక్షలు 2002



అఖిల

అఖిల భారత పత్రిక


జనవరి 2002



ప్రభూ! ఈ సంవత్సరాంత సమావేశమున పాతసంవత్సరముతోబాటు పాతబంధములు, భ్రమలు, బలహీనతలకుకూడ వీడ్కోలు పలుకునట్లు నుగ్రహింపుము!

గతజీవన స్మృతులు
నూతనజీవితమున ఎట్టి అవరోధములు కల్గింపక
నిత్యజాగరూకతతో వర్తిల్లునట్లు వివేకము వెలిగింపుము
ఈ నూతన వత్సరమున సర్వము
సహజముగా, సంతోషకరముగా, ప్రతిష్ఠాత్మకముగా సంభవించు నట్లాశీర్వదింపుము!

శ్రీమాత



దేవా! నీవు సర్వోత్తమ శుభప్రదాతవు!
శుచి, సౌందర్య సౌజన్యములతో
మా జీవనములను పావనము చేయు
మహనీయ దయామూర్తివి భాగ్యవిధాతవు!
అట్టి నీకు
ఈ నూతన వత్సరపు తొలిజామును
సవినయముగ
సమర్పించుకొనుచున్నారము.
నిన్ను మనసార స్మరించి వందన సమర్పణ గావించుకొను
చున్నారము.
మా ఆలోచనలకు, ఆచరణకు, అనుభూతికి
అధినాథుడవై నడుప ప్రార్థించుచున్నారము.
నీకివే మా వినమ్రిత నమోవాకములు.

శ్రీమాత




నిన్ను గురించి తెలుసుకోవాలనీ, అధికాధికంగా నిన్నే సేవించాలనే నిరంతర తపన మాలో దినదినాభివృద్ధి జెందుగాక. మా బాహ్య వ్యాపారములన్ని, నిన్నే, నిన్ను మాత్రమే లక్షించుగాక! ఇది ఎలా సాధ్యము? బాహ్య కార్యకలాపములనుకూడ అదే దృష్టితో నిర్వర్తించుటవలన సాధ్యము.

ప్రతి వస్తువు, ప్రతి సన్నివేశము నిన్ను అభివ్యక్త పరచుటకు ఒక ద్వారమగు గాక. పరమశాంతికి, పరమనిశ్చలతకు, తృప్తికి నిజమైన మార్గము ఇదే. అప్పుడే జీవితపుష్పము వికసిస్తుంది. జీవితం ఎంతో విశాలమై, ఎంతటి పెను తుపాను వచ్చినా చెక్కుచెదరని ఆనంద తరంగములతో పొంగిపొరలుతుంది.

వినమ్రుడనై సంభ్రమంతో నిన్ను ఆరాధించెదను. వందనము స్వామి! నీకు వందనము!


శ్రీమాత





నేనొక విచిత్రానుభూతిని పొందుచుంటిని. పరిస్థితులన్ని నా పాత అలవాట్లను పూర్తిగా మరచిపోవునట్లు జేయుచున్నవి! ఈ పరిస్థితులెంత తికమకగా, అనిశ్చితంగా వున్నప్పటికి నేనొక నూతనావస్థను పొంది నీ పరమశాంతినే అనుభవించుచుంటిని. 'నేను' అనే భావము పూర్తిగా పోయి, నీ దివ్యమైన శాంతి సజీవంగా రాణిస్తున్నది. ఎటుచూసినా, ఎందుగాంచినా నీ సౌందర్యమే, నీ సామరస్యమే, నీ పరమశాంతమే. అంతా నువ్వే. ధగధగాయమానమైన సూర్యగోళంలో మెరిసేది నువ్వే. శరీరాన్ని పులకింపజేసే మలయమారుతం నువ్వే. అందరి హృదయాలలోను భాసించేది నువ్వే. సర్వజీవుల లోను నివసించేది నువ్వే. సృష్టిలో మొక్క, మాను, ప్రతి జీవరాశి చెప్పేది నీ మాటే. నా కన్నులకింపు కలిగించే ఈ దృశ్యమంతా నీ రూపమే.

శ్రీమాత



ఏ నియంతా శాసించలేని ఓ శక్తి ఉన్నది.
ఏ భౌతిక విజయమూ అందివ్వలేని ఓ ఆనందం ఉన్నది.
ఏ బుద్ధికుశలతకూ అందని ఓ కాంతి ఉన్నది.
ఏ విజ్ఞానానికీ, ఏ తాత్త్వక చింతనకూ అందని ఓ జ్ఞానమున్నది.
ఏ కోరిక వలన కలగని ఓ తృప్తి ఉన్నది.
ఏ మానవీయ బంధమూ యివ్వలేని ఓ ప్రేమతృష్ణ ఉన్నది.
ఎక్కడా, చివరకి మృత్యువులో సైతం దక్కనంత శాంతి ఉన్నది.
ఆ శక్తే, ఆ ఆనందమే, ఆ కాంతే, ఆ జ్ఞానమే, ఆ తృప్తే, ఆ ప్రేమే, ఆ శాంతే – అంతా ఆ దివ్యానుగ్రహపు వెల్లువ.

శ్రీమాత




నీకు దేవుడు కావాల్నంటే ఎంతో దూరం వెళ్ళనవసరం లేదు. ఆయన నీ లోనే, నీ అంతరంగంలోనే వుంటాడు. నీ అగాధంలో ధగధగాయమానంగా మెరిసిపోతుంటాడు. నిన్ను ప్రేమలోను, శాంతిలోను, జ్ఞానంలోను ముంచెత్తుతాడు. నీ వాయనతో సమైక్యమైనప్పుడు నిన్ను జ్యోతిర్మయము, చైతన్యవంతము చేయగలడు.

అయితే మొదట నీ మనస్సును కుదుటపరచాలి. శాంతింపచేయాలి. మనిద్దరం కలిసి నీలో చెలరేగుతున్న ఈ గందరగోళాన్నంతా హతమార్చెదము. అప్పుడే నీ అంతర్‌జ్యోతిని దర్శించి దానితో ఐక్యము జెందెదవు. అదే నీకు నూతనజన్మ!

శ్రీమాత

4/2/2002



అఖిల

అఖిల భారత పత్రిక

ఫిబ్రవరి 2002

శ్రీమాత 124 వ జన్మదిన ప్రత్యేక సంచిక

విభాగము I: దివ్యజీవన యానము

విభాగము II : లేఖావళి

విభాగము III : ఆత్మజ్ఞానం

విభాగము IV : ఇతర వ్యాసాలు

శ్రీమాత సందేశము

మనము సాధించవలసిన ప్రయోజనము నూతనము – దైవము మనకప్పచెప్పిన అపురూపమైన మహా కార్యము. దీని ప్రాముఖ్యతను గుర్తించి నీకు కలిగిన ఈ అదృష్టాన్ని జారవిడువ కూడదు. దానిని సాధించుటవలన కలిగే ఆనందాన్ని మీరు తప్పక చవిచూడగలరని ఆశిస్తాను. దీనికి అవసరమైన దివ్య శక్తి మీతోటే ఉన్నది. ఆ శక్తిని మీరు అధికాధికంగా పొంది దానిని ఉపయోగించుకోవాలి. ఓ నూతనప్రపంచాన్ని కనిపెట్టగల కొత్త మానవులుగా మీరు నడుచుకోవాలి. అందుకు నా ఆశీర్వాదాలు నిరంతరం మీతోటే వుంటాయి.

శ్రీమాత

నువ్వు శ్రీమాత అనుంగుబిడ్డవు

సాధనకు ముఖ్యమైన అవరోధము నీ మనస్సే. దాన్ని లొంగ తీయాల్నంటే దానికంటె మిన్నయైన శక్తి కావాలి. శ్రీమాతయే ఆ శక్తి. అందుకని ఈ యోగంలో నువ్వు నీ మనస్సుని మర్చి పోయి శ్రీమాత ఒడిలో ఒక చిన్నపిల్లవాని మల్లె అయిపోవాలి. మీ అమ్మకి ఏ విధంగా నువ్వు కన్నబిడ్డవో అటులనే శ్రీమాతకు నువ్వు ఆధ్యాత్మిక బిడ్డవు. ఇది కేవలం భౌతికానుబంధమే కాదు – ఆధ్యాత్మికానుబంధము. అంతరంగికంగా చాలా ప్రత్య క్షమైన అనుభూతి. శ్రీమాతనే నీ తల్లిగా అనుకొని పూర్తిగా ఆమె మీదే ఆధారపడటంవలన నీకామె నిరంతర సహాయం లభిస్తుంది. నీ మార్గాన్ని ఆమెయే వెలిగించి చూపిస్తుంది. నీకిక ఎట్టి బాధ్యత లేదు. నీ బాధ్యతనంతా ఆమెయే వహిస్తుంది.

– సంపాదకుడు

శ్రీమాతకు నిజమైన బిడ్డగా ఉండటానికి ప్రయత్నించు. నీకు ఆ విధమైన భావన ఉన్నప్పటికీ నీ మనస్సు మాత్రం గోల చేస్తూం టుంది. పనికిమాలిన విషయాల నన్నిటినీ పట్టించుకుంటూ వాటిని గురించి పెద్ద రాద్ధాంతం చేస్తూంటుంది. శ్రీమాతను కేవలం కలలో దర్శించుకోవడం కాకుండా ఆమె నీ పక్కనే ఉన్నట్లు, ఎల్లప్పుడూ నీలోనే ఉన్నట్లూ అనుభూతి పొందడం నేర్చుకో. అలా ఉంటే నీ మనసును అదుపుచేసుకొని మారటం తేలికవుతుంది, – పైగా ఆమె నీతోనే ఉండి నీ పనిని నెరవేర్చ గలదు.

*

ఈ భౌతికప్రపంచంలోకి 'క' అనే ఆయనను తీసుకొని రావటా నికి కారణమైన స్త్రీమూర్తి జీవితాంతం ఆయనకు భౌతికంగా తల్లియే కావచ్చు. అయితే ఇక్కడ శ్రీమాతకూ అతనికి ఉన్న సంబంధం ఆధ్యాత్మికమైనది, చైత్యకమైనది. *ఆ మాటకొస్తే ఇక్కడ ఆమె స్వీకరించిన వారందరికీ ఆమె ఆధ్యాత్మికమాతయే. అది*

సాధారణమైన తల్లిబిడ్డల సంబంధంకంటే అధికమైన విలువ కలది. ఎందువల్లనంటే ఆమె మాతృత్వం సహజంగా ఇవ్వగలిగి నదంతా ఉత్కృష్టశైలిలో ఇవ్వటమే కాకుండా, అది నిరవధికంగా ఉండేటట్లు చేస్తారు. ఆ విధంగా అది భౌతికమాతృత్వంకంటే ఉత్కృష్టంగానూ, సంపూర్ణంగానూ ఉండి *బాహ్యజీవితంలోనూ, ఆంతరంగిక జీవితంలోనూకూడా భౌతికస్థానాన్ని ఆక్రమిస్తుంది.* ఏమాత్రం లోకజ్ఞానం ఉన్నా, ఈ విషయంలో తికమకపడే అవ కాశం లేదు. ఈ భౌతికాంశం ఏ విధంగానూ ఉత్కృష్ట చైత్యక, ఆధ్యాత్మికసత్యాలకు అడ్డుగా నిలవలేదు; వాటిని కాదనీ అనలేదు. శ్రీమాతే తన నిజమైన తల్లి అనడంలో అతని వాదం పూర్తిగా సబబైనదే. *ఎందువల్లనంటే అతని ఆంతరంగికజీవితానికి ఆమె పునర్జన్మ నిచ్చింది. ఒక దివ్యమైన జీవితానికి సంసిద్ధం చేస్తోంది.*

శ్రీఅరవిందుల ఆశీర్వాదము

నూతనజన్మ నీ హృదయాంతరంగములో అభివ్యక్తమై శరీరము లోని అన్ని విభాగములను ప్రశాంతపరచి సంతోషింప జేయుగాక. నీ మనస్సును, దృష్టిని, ఇచ్ఛను, అనుభూతులను, శరీరమును, జీవితాన్ని అన్నిటిని ప్రదీప్తము జేయుగాక. ప్రతిరోజు నీలోని ఈ నూతనజన్మ దినదిన ప్రవర్ధమానమై పరిపూర్ణమై నీలోని సర్వము శ్రీమాతయొక్క శిశువు అగుగాక. ఆమె వెలుగు, శక్తి నిన్ను పరి వేష్టించి నిన్ను పోషిస్తూ, అభివృద్ధిపరుస్తూ నీ బహిరాంతరంగిక జీవితమంతా ఒకే ఒక శాంతి శక్త్యానందముల వెల్లువ అగుగాక.

శ్రీఅరవిందులు

శ్రీమాత ప్రవచనములు:

ప్రశ్న: *ఈ యోగంలో శైశవమార్గం అనే దాన్ని గురించి తెలుసు కోవాలనుకుంటున్నాను.*

శిశువు మాదిరిగా ఉండటమంటే నిస్సందేహమైన నమ్మిక, సమగ్రవిధేయత, నిర్వ్యాజమైన సర్వసమర్పణ.

ప్రశ్న: *శిశువు మాదిరిగా ఉండే యోగమార్గం నాకు మంచిదే నంటారా?*

పసిపిల్ల మల్లే ఉండే మార్గం ఎప్పుడూ మంచిదే. అయితే అదంత సులభం కాదు. అప్రయత్నంగా, పూర్ణవిధేయ తతో దాన్ని వహించాలి.

*

ప్రశ్న: *నా దుర్బలత్వాన్ని పోగొట్టు. నన్ను నీ శిశువుగా ఉండనీ తల్లీ.*

అది అందరూ అనుకుంటున్నంత తేలిక కాదు. సమ గ్రంగాను, సంపూర్ణంగానూ శిశువుగా ఉండాలనుకుంటే అతి విధేయతతో, ఋజుప్రవర్తనతో ఉండటం నేర్చుకో. నాకు నిర్భయంగా చూపించలేని వాటిని నీలో ఉంటే సహించకు. నా ముందర చేయటానికి భయపడే పను లను చేయకు.

*

ప్రశ్న: *దివ్యజననీ, నీ సత్పుత్రునిగా ఎలా ఉండగలను?*

నీవు నీవుగా ఉండు. సాదా సీదాగా ఉండు.

*

ప్రశ్న: *మాతా, ఆత్మపూర్వకంగా నీ బిడ్డను కావాలనుంది.*

నీవెప్పుడూ నా బిడ్డవే. అయితే ఆ విషయం నీ స్పృహ లోకి తెచ్చుకోవాలి.

*

నీలోని చైత్యపురుషుడు నా బిడ్డే. నీ చైత్యపురుషుని స్పృహ కలి గినప్పుడు నీకా సంగతి పూర్తిగా అవగతమవుతుంది. నీవు నా బిడ్డగానూ, నమ్మినబంటుగానూ ఉండాలని కోరుకుంటే నిన్నె వరు ఆపలేరని మళ్ళీ మళ్ళీ చెప్తున్నాను.

*

ప్రశ్న: *మధుమయీ మాతా! నీ యథార్థ తనయునిగా ఉండటానికి నాకు సాయం చేయి.*

ఈ తీర్మానం మంచిదే. నా సహాయం నీకు ఎప్పుడూ ఉంటుంది. *నా చైతన్యపు వెలుగురేఖలు సర్వదా నీతో ఉండి నీ కవసరమైనప్పుడు దారి చూపిస్తాయి.* ప్రశాంతంగా నీవు ఆకాంక్షించినప్పుడు నీలోనున్న నా వెలుగును తెలుసుకొని దాని సహాయం అందుకోగలవు.

*

ప్రశ్న: *ప్రియజననీ, నేను నిన్ను ప్రేమిస్తున్నాననీ, నీకే చెందుతాననీ చెప్పడం లేదు. అది నా నడవడి ద్వారా ఋజువు చేసుకోవాలి. అది లేకుంటే చెప్పే మాటలకు విలువ లేదు. వట్టిమాటల ద్వారా నీ రక్షణను, నీడనూ మనుష్యులు కోరతారు. ఏమైనప్పటికీ నేనెప్పుడూ నీ బిడ్డనే.*

అది మంచిది. నిజానికి నీవెప్పటికీ నా బిడ్డవే. నీవు ఇంకా మంచిబిడ్డగా అయి "నిన్ను ప్రేమిస్తున్నాను తల్లీ, నిరవధికంగా నీ బిడ్డగానే ఉంటాను తల్లీ" అని సంపూర్ణ విధేయతతో సత్యప్రమాణంగా చెప్పగలుగుతావు.


శ్రీమాత

అనువాదం: ఎ. వెంకటరామ శాస్త్రి, ప్రభావతి

రూపాంతరీకరణము

శ్రీఅరవిందులు

యోగమనగా ఒక సాహసయాత్ర – మనస్సుకంటె అతీతమైన జ్ఞానాన్ని పొంది దాని వెలుగులో నివసించటం. రూపాంతరీకరణమనగా ఇంకా అధికమైన స్థాయి. అది నేటి కంప్యూటర్లను, చంద్రలోక యాత్రలను మించిన విషయము. ఇది ఎలా సాధ్యమో చూద్దాము. *– సంపాదకుడు*



To be a Yogi, a Sannyasi, a Tapaswi is not the object here. The object is transformation, and the transformation can only be done by a force infinitely greater than your own; it can only be done by being truly like a child in the hands of the Divine Mother.

Sri Aurobindo

మూడు అవసరమైన లక్షణాలు

నిన్ను నీవు రూపాంతరీకరింప చేసుకోవాల్నంటే నిస్సంకోచంగా, నిశ్శేషంగా నిన్ను శ్రీమాత చేతులలో వుంచుకోవాలి. ఆమెను నీలో పనిచేయ నియ్యాలి. *తప్పనిసరిగా మూడులక్షణాలు – చైతన్యము, వెన్నపూసలాంటి మెత్తదనము సంపూర్ణ సమర్పణ ఉండాలి.* ఆమె నీలో పనిచేస్తున్నట్లు నీ మనస్సుకు తెలియాలి. హృదయంలో వేదన కలగాలి. ఆత్మకు స్ఫురించాలి. జీవితంలోని ప్రతి చిన్నవిషయము ఆమె కార్యంగానే భాసించాలి. జీవకణాలలో కూడ ఆమె ఉనికిని పొందాలి. ఆమెయే పనిచేస్తున్నట్లు తెలియాలి. తెర వెనకాల నిల్చొని నీకు తెలియకుండానే ఆమె పనిచేయగలదు అనుకో. కాని జాగృతమై ఆమెతో సజీవమైన సంబంధము కలిగి ఉన్నప్పటిసంగతి వేరు. *నీ ప్రకృతి అంతా ఆమె చేతిలో వెన్నపూసై పోవాలి. దీని అర్థమేమిటి? మనస్సుయొక్క ప్రమేయం పనికిరాదు.*

ఈ మనస్సుయొక్క సంగతి నీకు తెలియదు. అది అయోమయం. అంధకారబంధురం. దానిది చీకటి బ్రతుకు. దానికి ఎవరైనా హితవు చెప్పినా కూడ అది ఒప్పుకోదు. మార్పు నెదిరిస్తుంది. తనకి తనే శత్రువు. కాని రూపాంతరీకరణానికి ఈ సాకులు పనికిరావు.

ప్రాణిక భౌతికాలు పాల్గొనుట

మనిషియొక్క ప్రాణికము మరో మొండిఘటము. అది దాని ఇష్టమొచ్చినట్లుగా ప్రవర్తిస్తుందే తప్ప దైవప్రేరణకి లొంగదు. తన మొండికోరికలు, చెడ్డబుద్ధులు తనవి. ఈ విధమైన జడత్వము, తమస్సు మానవుని భౌతికచైతన్యమువలె తన చిన్న చిన్న కోరికలవలయంలో చిక్కుకొని చీకటిలో గిలగిలా కొట్టుకొంటూ ఎవరైనా తనకి హితవు చెప్పి, వెలుగును చూపించి తన జడత్వాన్ని పొగొట్టి నిద్రలేపినా కూడ ఒప్పుకోదు. బహిరాంతరంగములలో సమర్పణ ప్రక్రియ నిశ్శేషంగా జరిగినప్పుడు ప్రకృతి కూడ కాఠిన్యము తీరి వెన్నపూసవలె మృదువుగా వుంటుంది. పైనుంచి గంగాప్రవాహమువలె దిగివస్తున్న జ్ఞానము, వెలుగు,

శక్తి, సామరస్యము, సౌందర్యములను నువ్వు గ్రహించుటవలన నీలోని అన్ని విభాగములలోను చేతన మేలుకొంటుంది. ఆఖరికి శరీరం కూడ మేలుకొని తన భౌతికత్వాన్ని జ్ఞానవంతము చేస్తుంది. పైనుంచీ, క్రిందినుంచీ, అన్నివైపులనుంచీ కొడుతున్న అతిమానసచైతన్యాన్ని (supramental superconcious force) పొంది, అది శరీరంలోకి చొచ్చుకొనిపోగా నువ్వు దివ్యప్రేమానందములతో జలదరించిపోయెదవు!

అనువాదం: ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి

మన సంకల్పాలను దృఢపరచుకోవడము ఎలా?

శ్రీమాత

నీ మనస్సును దాటి, సాధారణ ప్రకృతిని జయించి అంతకంటె అతీతమైన మరో ఉన్నతస్థాయిని పొంది దాని ననుభవించుటయే యోగము. కాని ఇది అంత తేలికగా జరిగే విషయము కాదు. నువ్వు జయించదలచుకున్న నీ మనస్సే దీనికి ఎదురు తిరుగుతుంది. నువ్వు సదుద్దేశంతోనే గట్టి తీర్మానం చేసుకుంటావు. కాని మరుక్షణమే అది విఫలమైపోతుంది. ఎందుకని? నీ మనస్సుకు అట్టి శక్తిలేదు గనుక. అది ఇంద్రియాలను నియమించలేదు. ప్రకృతిని శాసించలేదు. నువ్వు నీ మనస్సుతో యోగం చెయ్యలేవు. ఎట్టి ప్రయోజనమును సాధించలేవు. నీ హృదయగుహాలో నివసించే ఆత్మ చేతనకే అట్టి సామర్థ్యమున్నది. అది శక్తిమంతము. కార్యశీలి. మనస్సుకంటె భిన్నము. సంకల్ప వికల్పముల కతీతము. నీ తీర్మానములను ఏమాత్రం పొర్లుపోకుండా అమలు చేయగల దిట్ట.

— సంపాదకుడు

ప్రశ్న: మధురాతి మధురమైన మాతా! మా తీర్మానాలను దృఢ తరం ఏ విధంగా చేసుకోగలం?

సమైక్యపరచుకొనుట

సంకల్పం అనేది చాలా ముఖ్యమైన విషయం. నిజమైన సంకల్పం కోసం నిన్ను నీవు పూర్తిగా సమైక్యపరచుకోవాలి. నిజానికి వ్యక్తిగా ఉండాలంటే ముందు తనను తాను సమైక్యపరచుకోవాలి. శుద్ధ వ్యతిరేక ధోరణులకు వ్యక్తి ఇట్టే ఆకర్షింపబడతాడు. తనను తాను తెలుసుకోకుండానే వ్యక్తి మూడొంతులు జీవితాన్ని గడిపేస్తాడు. మరి అలా ఎందుకు చేస్తాడు? అతడు బాహ్యాప్రభావాల పుట్ట. అంతేకాదు – అతని నడవడి, శక్తులు, చర్యలు, ప్రతి చర్యలు – అన్నీ ఆత్మేతరమైనవే. కాబట్టి విడిగా వ్యక్తి లేడు. తనకు ఆత్మబలం ఉందని, సంకల్పబలం ఉందని తెలుసుకోవడం ప్రారంభించినప్పుడు వ్యక్తిగా కావడం ప్రారంభమవుతుంది. అయితే అతడు సమైక్యంగా మమైక్యం చెందనిదే అతనికి ఆత్మ బలం సిద్ధించదు.

"నీ యిచ్ఛయే జరుగు గాక"

ఆత్మబలం సిద్ధించిందా, ఇక అప్పుడు "నీకు కావలసినదే నాకు కావాలి" అని దైవంతో అనగలవు. అంతకుముందు మాత్రం అలా అనలేవు. ఎందుకంటే – దైవం వాంఛించేది నువ్వు వాంఛించాలంటే – నీకు ఆత్మబలం – సంకల్పం ఉండాలి. అవి లేకపోతే నువ్వు దేన్నీ సంకల్పించలేవు. సంకల్పం రావాలంటే – ముందు దాన్ని ఇష్టపడాలి. దాన్ని మరీ ఎక్కువగా ఇష్టపడాలి. దైవం ఏమి చేయాలని వాంఛిస్తున్నాడో దానిపై నీకు ఎక్కువ మక్కువ ఉండాలి. దేవునికి సమర్పించి ఆయనకు అంకితం చేసే ఆత్మబలం నీకు లేదు. మంచి మంచి సంకల్పాల సమూహం ఒక దానితో ఒకటి అతుక్కుపోయినట్టు ఉంటాయి. వస్తువుల చెడు లక్షణాలను మర్చిపోయి మంచివాటిని గ్రహించడం ఉత్తమం. మంచిసంకల్పాలు మగత మగతగా సగం సగం చైతన్యంతో అటూ ఇటూ ఊగుతూ ఉంటాయి.

*

తలతో యోగం చేయలేవు

ఈ విధంగా ఆలోచన మస్తిష్కంలో మసులుతూ ఉంటే (శ్రీమాత తన వేలితో నుదుటిమీద తిప్పుతారు) దానికి శక్తి ఎలా ఉంటుంది? ఉన్నా, అతి స్వల్పశక్తి ఉంటుంది. అది కూడా పరిమితం. అస్తమానం అది తనను తాను వమ్ము చేసుకుంటూనే ఉంటుంది. ఈ పరిస్థితిలో చాలా కష్టం మీద కృత్రిమంగానైనా ఆత్మబలాన్ని సంతరించుకోవాలనుకుంటారు. ఎంతోకొంత సంతరించుకోవడానికి ప్రయత్నించినా, అది మరుక్షణమే మృగ్యమౌతుంది. అసలు దానిని అనుభూతి చెందనే చెందడు. "ఇలా ఎందుకు మారిపోయింది?" అని తనలో తనే మథనపడతాడు.

సాధనతో పట్టు సాధిస్తే తప్ప ఎవరూ తలతో యోగం చేయగలరని నేను అనుకోను.

ఆత్మబలం తలలో లేదు.

నేను అంటున్న ఆత్మబలం ఇక్కడ ఉంది. (శ్రీమాత ఛాతి మధ్యభాగాన్ని సూచిస్తారు) దానికి క్రియాశక్తి ఉంది. అనుభూతి సామర్థ్యం ఉంది.

కేవలం మస్తిష్కంతో చేసే పనులు లెక్కలేనన్ని ఆటుపోటులకు లోనవుతాయి

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు

ఇతరులపట్ల మన వైఖరి

శ్రీఅరవిందులు

యోగికి ఇతరుల తోడి సంబంధమెలా వుండాలి? అభిప్రాయ భేదాలు వచ్చినప్పుడేం చేయాలి. యోగం చేసే వానికి అన్నిటి కంటె వాని సాధనే ముఖ్యం. వాదనలన్నీ మనస్సు చేసే విన్యాసాలే కదా? నువ్వు చెప్పిందే న్యాయమో ఇతరులు చెప్పింది న్యాయమో అన్న విషయం అంత ముఖ్యం కాదు. 'నేనే రైటు'

అని నువ్వు మొండిగా వాదించటంవలన ప్రయోజనం శూన్యం. ఇతరులను తప్పుపట్టి వాళ్లనదే పనిగా విమర్శించటంవలన నీకు ఒరిగేదేం లేదు. నువ్వు దైవంతో ఏకమైనప్పుడు తద్వారా అందరితోటి సత్సంబంధములు వాటంతట అవే ఏర్పడుతాయి. ప్రపంచంలో అందరూ నీవారే అవుతారు. — సంపాదకుడు

సాధకునికి ఇతరులపట్ల రెండువిధములైన ఉద్దేశములు ఉండ వచ్చును. శతృత్వము, మిత్రత్వము లేని సమత్వము లేదా అందరి పట్ల సౌహార్థము.

*

ఇష్టాయిష్టాలు మానవ ప్రాణికంలో (vital) నిక్షిప్తమై ఉంటాయి. తన ప్రాణికంతో సరిపడేవి కొన్ని – వికటించేవి కొన్ని. ఇంకా ప్రాణిక అహంకారం ఒకటి. దానికి దెబ్బ తగిలితే ద్వేషిస్తుంది. ఇతరులు దాని ఇచ్ఛకు అనుకూలంగా ప్రవర్తించకపోతే కూడా బాధపడుతుంది. పైన ఆధ్యాత్మికశాంతి, సమత్వము అందరిపట్ల సౌజన్యము ఉంటాయి. లేదా ఒక స్థాయిలో నిశ్చల ఉదాసీనత ఉంటుంది. చైత్యము (psychic) లో కూడా అందరియందు దయ, ప్రేమ ఉంటాయి – ఏదో కొందరితో ప్రత్యేక అనుబంధముకూడ ఉండొచ్చు. ప్రాణికం (vital) మాత్రం ఎల్లప్పుడూ, ఇష్టాయిష్టాల అసమానతతోనే వ్యవహరిస్తుంది. సాధనతో ప్రాణికాన్ని (vital) శాంతపరచాలి. పై అంతస్థులోనున్న వ్యక్తిత్వమునుండి, శాంతము, అందరి ఎడల సద్భావము గ్రహించాలి. అలాగే ప్రాణికము (vital) చైత్యము (psychic) నుండి ప్రేమను సంతరించుకోవాలి. ఈ సాధనకు కొంత వ్యవధి పడుతుంది. కాని తప్పకుండా ఫలి స్తుంది.

*

ఇతరులతో నీ సంబంధాల విషయంలో నేనొక సూచన ఇస్తాను. ఈ సంబంధాలు నీ ప్రకృతికి విరుద్ధంగానే ఎప్పుడూ కన్పడ వచ్చు. కాని ఏదైనా ఒక తగాదా వచ్చినప్పుడు, మీరు అనుకు న్నదే సరియైనదని భావించకపోవడం మంచిది. ఎదుటివారిదే

తప్పు అని కూడా భావించకపోవడమే మేలు. మీ లోపం ఎంత వరకూ ఉన్నదో, ఆత్మపరిశీలన చేసుకొని, ఆ లోపాన్ని సరి దిద్దుకోవడం వివేకం. తొందరపడి ఎదుటివారిని తప్పుపట్ట కూడదు. ఈ స్థితిని పాటిస్తే సామరస్య వాతావరణం ఏర్పడు తుంది. అది మీ అంతరంగ అభివృద్ధికి తోడ్పడుతుంది. అంతే కాని గెలుపే ప్రధానమని భావించకూడదు.

*

ఒక విషయాన్ని సానుభూతితోనూ, నిష్పక్షపాతంగానూ పరిశీలిం చడం ప్రమాదం కాదు. కాని అనవసరంగా, అనాయాచితంగా, ఇతరులను విమర్శించడం, తప్పుపట్టడంలో కుతూహలం చూపే బుద్ధివలన కలుషితవాతావరణం ఏర్పడుతుంది. అది ఇరువర్గాల వారికి మంచిది కాదు. ఈ దురుసుతనం, కర్కశం, నిందవలన ఏమి సాధిస్తారు? తప్పుపట్టేవారిలో తప్పులుండవా? అసలు ఇత రులలో తప్పు ఎంచే కుతూహలం దేనికి? వారిని దోషులుగా నిర్ధారించి చూపి ఏమి సాధించాలి? అవసరమైన వేళల్లో, కొన్ని నిర్ణయాలు చేయవలసిరావచ్చు. అయినా ముందుగానే వారిలో తప్పు ఉన్నదేమో అనే భావనతో నిర్ణయం చేయకూడదు. తప్పు లెంచడానికి తొందరపాటు కూడదు.

*

సాధకుని యోగ్యతా స్థితులన్నింటిలోకి, దైవంతో ఒంటరిగా వసించడం అత్యున్నతస్థితి. ఆ స్థితిలో అంతరంగంలో భగవం తుని సామీప్యత సిద్ధిస్తుంది. జగత్తుయొక్క ఉనికి హృదయ కుహరంలోనూ, విశ్వవ్యాప్త దైవత్వంతోనూ సంబంధం ఏర్పడు తుంది. అది విభక్తంలో అవిభక్తాన్ని గ్రహించే పునాది. దైవంతో ఐక్యత పొంది, తననూ, సర్వమునూ (జగత్తునూ) దైవంలోనూ తనలోనూ చూచుకొనగలడు. ఇక ప్రాణికమానసిక ఘర్షణలకు ప్రమాదించే అహంకారాలకు అవకాశం లేదు. (No longer in a precarious interchange of mental and vital ego)

అనువాదం: రంగనాథ ఆత్రేయ

బరోడా మహారాణికి శ్రీఅరవిందుల లేఖ

(ఆమె ప్రశ్నలకు జవాబులు)

మనస్సు చంచలమైనది. శాంత్యానందములు అంటె ఏమిటో దానికి తెలియవు. అవి మనస్సు కతీతములు – ఉన్నతచేతన వల్లనే సాధ్యములు. అవి ఆధ్యాత్మికచైతన్యముయొక్క లక్షణ ములు. నీ అంతరంగములోకి పోయి దైవమును ఆకాంక్షించి పూర్తిగా దైవానికి ఆత్మసమర్పణ కావించుకోవటంవలన దైవ శక్తి నీలోకి దిగివచ్చి నీకు కనువిప్పు కావిస్తుంది. దివ్యశక్తి నీలో పనిచేస్తున్నట్లు నీకు తెలుస్తుంది. దాని ప్రభావమువలన నీకు జ్ఞానోదయమవుతుంది. — *సంపాదకుడు*

యోగసాధనవల్ల ఉన్నతమైన ఆధ్యాత్మికచైతన్యం నాకు సిద్ధించిన మాట నిజమే. యోగసాధనవల్ల ఈ చైతన్యం సిద్ధిస్తుంది. దీనివల్ల కొంత యోగశక్తి లభిస్తుంది. ఆధ్యాత్మికజీవనానికి సంసిద్ధంగా వున్నవారితో అంతర్గత సంబంధాలు పెట్టుకోవడానికిగల శక్తి ముఖ్యంగా లభిస్తుంది. అంతేకాదు. మార్పుచెందని ఆంతరంగికప్రశాంతి, శక్తి, ఆనందము నిండివున్న పరిపూర్ణత్వశ్రేణికి చెందిన ఆధ్యాత్మికస్థితి వైపు సాధకులకు తోడ్పడే శక్తి లభిస్తుంది. కాని ఈ ఆధ్యాత్మిక ప్రశాంతి, ఆనందములు, మానసప్రశాంత్యానందముల కన్నా పూర్తిగా భిన్నమైనవి. ఆధ్యాత్మిక సాధన లేకుండా ఈ స్థితిని అందుకోలేము.

ఈ విషయం మహారాణి వారికి సుబోధకం అయిందో లేదో నాకు తెలియదు. చైతన్యానికి రెండు శ్రేణులున్నాయి. ఏదో ఒక శ్రేణిలో ఎవ్వరైనా జీవించవచ్చును. జీవన ఖేలనకు అతీతమైన ఉన్నతచైతన్యం ఒకటి. అది జీవితాన్ని నిర్దేశిస్తుంది. నియంత్రిస్తుంటుంది. దీనినే ఆత్మ అని, పరమాత్మ లేక దైవం అని రకరకాల పేర్లతో పిలుస్తుంటారు. మరొకటి సాధారణ చైతన్యం. మనుషులంతా ఈ స్థాయిలోనే జీవిస్తుంటారు. ఇది ఉపరిభాగంలో ఉంటుంది. జీవనలీలార్థం అది ఆత్మకు ఉపకర



1903. Sri Aurobindo, sitting extreme right,
with staff-officers of the Maharaja of Baroda
on a tour of Kashmir.

ణంగా వుంటుంది. ఈ సాధారణ చైతన్యంలో నివసించేవారిని, పనిచేసేవారిని మనస్సుయొక్క సాధారణ కదలికలే నడుపుతుంటాయి. వారు సహజంగా సుఖదుఃఖాలకు, ఆందోళన, కోరికలకు గురి అవుతుంటారు. సర్వసాధారణమైన జీవనవ్యాపారాలకు గురి అవుతుంటారు. వారికి మానసికశాంతి, ఆనందం లభించవచ్చు. కాని అది ఎప్పటికీ శాశ్వతం కాదు. భద్రంగా ఉండబోదు.

కాని ఆధ్యాత్మిక చైతన్యం సదా కాంతి, శాంతి, శక్తి, ఆనందాలతో నిండి వుంటుంది. ఆ చైతన్యస్థాయిలో ఎవరైనా జీవించగల్గితే, కాంతి, ఆనందం, శాంతి, శక్తి అతని సొంతం అవుతాయి. నిక్షేపంగా అతనిలో నిలిచి వుంటాయి. కాని ఎవ్వరైన పాక్షికంగా అయినా ఆ స్థాయిలో జీవిస్తే, ఆ చైతన్యం వైపు మన ద్వారాలు తెరిచి వుంచితే, ఆధ్యాత్మిక కాంతి, శక్తి, శాంతి, ఆనందం చాలావరకు అతనికి లభిస్తాయి. జీవితంలో ఎదురయ్యే విధివిఘాతాలను ఎదుర్కొని భద్రంగా ముందుకు వెళ్ళగలుగుతాడు.

ఈ ఆధ్యాత్మిక చైతన్యం వైపు తిరిగినవారు దానినుండి ఏమి ఆశిస్తారో అదే లభిస్తుంది. శాంతి కావాలని కోరితే శాంతి లభిస్తుంది. శాంతి, జ్ఞానం కోరుకుంటే, ఒక మహాశాంతిలో జీవిస్తారు. మనిషికి సాధారణమనస్సు పొందలేని ప్రగాఢమైన, నిజమైన జ్ఞానం లభిస్తుంది. వారు శక్తికాని, బలంకాని కోరుకుంటే, అంతర్గత జీవితానికి ఆధ్యాత్మికబలం లభిస్తుంది. బాహ్యమైన కార్యాలు, పనులు నిర్వర్తించడానికి యోగశక్తి లభిస్తుంది. ఆనందం కోరుకుంటే, మామూలు మానవజీవితం ఇచ్చే సుఖసంతోషాలకు మించిన ఆనందపారవశ్య లోకాలలోకి వారు ప్రవేశించగలరు.

ఈ దివ్యచైతన్యం వైపు మనస్సును తెరిచి వుంచడానికి, ఆ చైతన్యంలోకి ప్రవేశించడానికి చాలా మార్గాలు ఉన్నాయి. నిరంతర సాధనతో నేను ఇతరులకు చూపే నా మార్గం ఏమిటంటే, ఏ వ్యక్తి అయినా లోపలికి, చైతన్యపు లోతులలోకి ప్రయాణించడం, ఆకాంక్షతో దైవత్వంవైపు మనస్సును తెరిచి

వుంచడం; దైవం, దైవకార్యాలను గురించిన జ్ఞానం కలిగినట్లైతే, దానికి సంపూర్ణంగా తనను తాను సమర్పించుకోవడం.

ఈ ఆత్మసమర్పణం అంటే భగవంతుని సమీపించి కోరికలు కోరడం కాదు. దివ్యచైతన్యంతో నిరంతర సాయుజ్యం, నిరంతర సంబంధం కొనసాగడం, ఆ చైతన్యపు శాంతి, శక్తి, కాంతి, ఆనందాన్ని ఆకాంక్షించడం, మరేమీ కోరకపోవడం.

ఈ ప్రపంచంలో ఆ చైతన్యం దేనిని అప్పగించితే దానికి జీవితంలోనూ, కార్యాచరణలోనూ ఉపకరణంగా ఉండడం మాత్రమే. ఏ వ్యక్తి అయినా దైవశక్తివైపు, మనస్సు, హృదయం, శరీరంలో పనిచేసే పరమాత్మశక్తి వైపు తన చైతన్యాన్ని తెరిచి వుంచి, ఆ శక్తిని అనుభూతికి తెచ్చుకుంటే, ఇక మిగిలిందల్లా ఆ చైతన్యానికి బద్ధుడై, విశ్వాసపాత్రుడై జీవించడం, నిరంతరం ఆ చైతన్యాన్ని (Divine Consciousness) ఆవాహన చేస్తుండడం, ఆ చైతన్యం తన పనిని తాను చేసుకునేటట్లు చూడడం, నిమ్న చైతన్యానికి, నిమ్నప్రకృతికి చెందిన ఇతర, అధమమైన శక్తిని తిరస్కరించడం ముఖ్యం.

నా పరిస్థితిని, యోగశక్తి స్వరూపాన్ని గూర్చి వివరించ డానికని ఇదంతా వ్రాశాను. కాని ఈ యోగసాధన చేయమని నేను సాధారణంగా ఎవరినీ కోరను. ఎందుకంటే, సాధన చేయా లన్న ఒక స్థిరసంకల్పం, ఒక అంతరాదేశం మొదటినుండి ఉన్న వారికి, లేదా మధ్యలో అటువంటి పటిష్ఠమైన ఆదేశం అభివృద్ధి చేసుకున్న వారికి మాత్రమే ఇది సాధ్యం. ఇతరులు చివరివరకు ఈ మార్గంలో పయనించలేరు. బాహ్యప్రకృతికి సంబంధించి ప్రశాంతత కావాలని కోరే వారికి సహాయపడడానికి నేను తరుచు నా మార్గంనుండి తప్పుకుని వెళ్ళడం జరగదు. అయితే కొందరు వ్యక్తుల విషయంలో అటువంటి సాయం చేయడానికి తిరస్కరిం చబోను. ఒక ఉన్నతచైతన్యాన్ని భూమ్మీదికి అవరోహింప చేయ డానికి ఉపకరించే ఒక ఆధ్యాత్మిక కేంద్రాన్ని సృష్టించడమే నా లక్ష్యం. కేవలం 'ముక్తి' కోసం కాకుండా, భూమిపై దివ్యజీవ నాన్ని తీర్చిదిద్దేశక్తిగా ఆ కేంద్రం ఉండాలని నా అభిమతం.

ఈ లక్ష్యంతోనే నేను సామాజిక జీవనరంగంనుండి దూరమై, పుదుచ్చేరిలో ఒక ఆశ్రమం నెలకొల్పాను. (ఆశ్రమం అనే మాట కన్నా మరో మంచిపదం లేనందున ఆ పదం వాడాను. అయితే ఇది సన్యాసుల ఆశ్రమం కాదు. మామూలు జీవితాన్ని వదిలి ఈ నియమానికి సంసిద్ధులై వున్నవారికి మాత్రమే ఇది ఉద్దేశించబడింది.)

కాని భారతదేశం అంతటా కూడా నాకు కొద్దిమంది శిష్యులు ఉన్నారు. వారు వారి కుటుంబాలతో జీవిస్తున్నా దూరంగా ఉన్నా ఆధ్యాత్మికభూమికలనుండి నా సహాయం పొందుతుంటారు.

ప్రస్తుతానికి ఇదే మహారాణిగారికి నా సమాధానం. మీరు దేనిని అన్వేషిస్తున్నారో దానికి, నేను ఈ లేఖలో వివరించిన విషయాలకు సంబంధం ఉందో లేదో నిర్ణయించుకోవలసింది మీరే.

అనువాదం: యజ్ఞన్న

సంసిద్ధత అంటే సమర్థత అని నేను అనను. కాని సమ్మతము అని అర్థం. జీవితంలో అన్ని కష్టాలను ఎదుర్కోడానికి, ముందుకు పురోగమించడానికి సంకల్పం ఉంటే, ఎంతకాలం పట్టినా పరవాలేదు. అప్పుడు ఆ మార్గాన్ని చేపట్టవచ్చు.

*

సామాన్యసంసారికి జీవితంపట్ల శాంతిరహిత అసంతృప్తి, పూర్ణయోగపథంలో ప్రవేశించడానికి చాలినంత సంసిద్ధత కానే కాదు. ఆధ్యాత్మికజీవితంలో విజయం పొందాలంటే, నిర్దిష్టమైన అంతర్గత ఆదేశం, దృఢసంకల్పం, స్థిరత్వం అవసరం.

శ్రీఅరవిందులు

శ్రీఅరవిందులతో మార్గరెట్ విల్సన్ ఉత్తరప్రత్యుత్తరాలు

[శ్రీ వుడ్రో విల్సన్ మొదటిప్రపంచయుద్ధకాలంలో అమెరికా అధ్యక్షుడు. మార్గరెట్ విల్సన్ వారి కుమార్తె. ఈమె 1932 లో న్యూయార్కు గ్రంథాలయంలో శ్రీఅరవిందుల "గీతావ్యాసాలు" చదివి, ఆధ్యాత్మికంగా ఎంతో ఉత్తేజితురాలైంది. మార్చి 3, 1936 న తన సాధనను గైడ్ చెయ్యమని శ్రీఅరవిందులవారిని అర్థించింది. ఆశ్రమంలో శిష్యురాలిగా వచ్చి ఉండటానికి అనుమతి కోరగా 1938 లో అది లభించింది. శ్రీఅరవిందులు ఈమెకి "నిష్ఠ" అని నామకరణం చేశారు. ఈమె అస్వస్థురాలై 1948 లో మరణించారు. వారిరువురి ఉత్తరప్రత్యుత్తరాలు ఇక్కడ ప్రచురిస్తున్నాము.]

హోటల్ సైమోర్,
50 వెస్టు, 45 వ రోడ్డు
న్యూయార్కు. మార్చి 3, 1936

ప్రియమైన శ్రీఅరవిందులకు,

మీ "గీతా వ్యాసాల" ను గురించి మొదటిసారిగా 1932 వేసవిలో తెలుసుకొన్నాను. అప్పటినుంచి నాకు అవి ఎంతగానో ఉపకరిస్తూ, స్ఫూర్తిని ఇస్తూనే ఉన్నాయి. నేరుగా ఇపుడు మీ సహాకారాన్ని, ప్రేరణని కోరుకుంటూ వినమ్రంగా మీకు ఇది వ్రాస్తున్నాను. ఆ మాత్రం, ఈ మాత్రం జ్ఞానదీపికలైన వ్యక్తులెవ్వరు నాకీ దేశంలో కనిపించటం లేదు. నేనెవ్వరి దరికీ విశ్వాసంతో వెళ్లలేకపోతున్నాను. పోనీ "రామకృష్ణ కేంద్రం" లాంటి ఏ ఆధ్యాత్మిక కేంద్రంలోనైనా చేరుదామంటే, అక్కడ పాటించవలసిన నియమ నిబంధనలు విముక్తిమార్గంలో నడిపే బదులు మనిషిని కట్టిపడవేసేటంత భయంకరంగా ఉంటున్నాయి. మీ ఆశ్రమం తాలూకు వివరాలతో కూడిన కరపత్రం ఒకటి నా

దగ్గర ఉంది. ఆత్మచైతన్యంతో మీరు నిర్దేశించిన విముక్తిమార్గంలో పయనించాలని, ఆత్మోన్నతి పొంది అతీతుడైన పురుషోత్తముని సంసర్గానుభవం పొందగలగాలని ఆశ. ఇది సాహసోపేతమే కావచ్చు. అయినా దైవానుగ్రహంతో, మీ మార్గదర్శకత్వంలో, స్వచ్ఛందంగా క్రమశిక్షణ పాటిస్తూ, సాధించగలనని ఆశిస్తు న్నాను. ఈ సాధనలో గమ్యం ఎంత దూరమో, క్లిష్టతరమో నాకు తెలియక పోలేదు. అయినా సరే ఈ దారిన పయనిస్తాను. గమ్యాన్ని వీలైనంత త్వరగా చేరుకుంటాను. ఆత్మోన్నతి మార్గంలో లభింప చేసుకున్న శక్తిసంపదలను (నా భోగభాగ్యాల కోసం, స్వప్రయోజనాలకి) వెచ్చిస్తూ కాలయాపన చేస్తూ, అసలు లక్ష్యాన్ని విస్మరించను. దివ్యజీవన సాధనలో ఒక సచేతనమైన ఉపకర ణంగా మలుచుకొని దైవకార్యాలే నిర్వహిస్తూ, ప్రక్కదారి పట్ట కుండా పురోగమిస్తాను.

ప్రస్తుతం నేను భయంకరమైన శూన్యంలో దిక్కుతోచక ఉన్నానని తెలుసు. త్రికరణశుద్ధి లేకుండా ఏమి చేసినా వ్యర్థ మని తెలుసు. పైవాడు అనుగ్రహించి నడిపించాలే తప్ప ఈ అల్ప జీవి ఎందుకూ కొరగాదనీ తెలుసు. నాపై నాకు ఎలాటి భ్రమలూ లేవు. దారి తప్పిన నావికుడువలె ఉన్నాను. గమ్యం అయితే కని పిస్తోంది. కాని దారిచూపే దిక్సూచి కొరవడింది.

శిష్యుడు సంసిద్ధుడై ఉన్నప్పుడు "గురువు" తటస్థపడతా డని విన్నాను. నా సంసిద్ధత ఏపాటిదో నాకు తెలియదు. నా యోగ్యత ఎంతో నాకు తెలియదు. మిమ్మల నెంతవరకు అనుస రించగలనో తెలియదు. ఒక్కటి మాత్రం నిజం. పరమోన్నతమైన దివ్యసత్యముతో సచేతనంగా సమైక్యం కావాలనేది నా ఆకాంక్ష. అదే నా గమ్యం. నేనిది హృదయపూర్వకంగా మనవిచేసుకునే సత్యం. ఇందుకే నా కృషి ఎంతైనా! ప్రియమైన ప్రభూ! మిమ్మ లనందులకే వేడుకుంటున్నాను. నిర్భయంగా మీరు చూపే వెలు గులో పయనిస్తాను. నాలోని ఉన్నతచైతన్యానికి ప్రతినిధులు మీరే కదా! కాకపోతే, ఆ ఉన్నతచైతన్యమేదో నాకు ఇంకా ఎరుక లేదు. ఆత్మసాధనలో నా ఆకాంక్ష అంత గాఢము, స్థిరము, చిత్త

శుద్ధితో కూడినది కాకపోతే, ఆ లోపాలను తామే సరిదిద్ది, నన్ను బలోపేతం చేసి, నా ఆకాంక్షను గాఢతరం కావించండి. ఎంత ప్రయాసకైనా వెరువను, విడిచి పారిపోను.

ఆశ్రమవాసులు కానివారు కూడ మీ శిష్యులుగా ఉన్నారని విన్నాను. అమెరికాలో ఉన్నవారిని శిష్యులుగా స్వీకరిస్తారా? మీరు పిలిచినప్పుడు భగవదనుగ్రహంగా భావించి సర్వమూ విడిచి మీ ఆశ్రమానికి వస్తాను. వినమ్రంగా మీ సమాధానం కోసం ఎదురుచూస్తూ ఉంటాను.

ఇంతవరకు తాము అందించిన సహాయానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటూ,

చిత్తశుద్ధితో,
మీ
మార్గరెట్ వుడ్రో విల్సన్

కుమారి మార్గరెట్ విల్సన్‌కు శ్రీఅరవిందుల సమాధానము

పాండిచ్చేరి,
సెప్టెంబరు *7, 1936*

మార్గరెట్ వుడ్రో విల్సన్‌కు,

ఆధ్యాత్మిక జీవనానికి, సత్యాన్వేషణకి, భగవంతుని కనుగొనాలనే జిజ్ఞాస అత్యంత ఆవశ్యకం. ఇది లేకుండా ఏదీ సంభవం కాదు. దైవాన్ని తెలుసుకోవడం, అభివ్యక్తీకరించుకోవడం అంటే నీ పరిమిత చైతన్యాన్ని అపరిమిత దివ్యచేతనగా రూపాంతరీకరించుకొని, అనంతమైన శాంతి, క్రాంతి, ప్రేమ, శక్త్యానందాలతో మనుగడ సాగించడం. ఫలితంగా నీవు దైవోపకరణంగా, దివ్యవాహికగా పరివర్తన చెందడం. అంతర్నిహితమైన దైవాన్ని దర్శించగలిగిన నాడే దివ్యాత్మప్రబోధంతో పని చేయ గలుగుతావు. నీవు ఆధ్యాత్మికంగా రూపాంతరీకరించుకోకుండా నీ పరిమిత బుద్ధిబలంతో మానవాళిలో ఐక్యతను, సమ

తను సాధించాలనే ప్రయత్నం మూలసత్యాన్ని వక్రీకరించడమే అవుతుంది. అంతరంగంలో దివ్యచైతన్యం పెంపొందించుకునే కొలదీ క్రమేపీ దివ్యశక్తి, ప్రశాంత, సత్యకాంతులు అనుభవంలోకి వస్తాయి. భౌతికవ్యక్తిత్వం, దివ్యవ్యక్తిత్వంగా పరిణామం చెందుతుంది. పదార్థం పరార్థంగాను, మానవుడు మాధవుడుగాను వెలుగొందుతాడు. నీలో దివ్యచైతన్యం తొణికిసలాడుతూ ఉన్నప్పుడే లోకంలో దైవాన్ని అభివ్యక్తీకరించ గలుగుతావు. అలాకాక ఏదో ఒక మానసిక ఆదర్శానికి లేక నియమానికి లోబడి తదనుగుణంగా ప్రవర్తిస్తూంటే నీవు మానసికస్థాయికే పరిమితమైపోతావు. అదే నిజమైన ఆధ్యాత్మిక దివ్యజీవనమని పొరబడతావు. నేటి ఆధునిక బుద్ధిజీవి ఇక్కడే తప్పటడుగు వేస్తున్నాడు. మనసునే నమ్ముకుని మోసపోతున్నాడు. దృష్టిని ఆధ్యాత్మికదిశగా మళ్లించాలి. శాంతి, క్రాంతి, ఆనందాలు, దైవానికి చేరువ కావటం ద్వారా మాత్రమే పొందగలుగుతావు. మర్త్యజీవనం దివ్యజీవనంగా పరిణామం చెందాలనేది దివ్యసంకల్పం, అదే దివ్యప్రణాళిక కూడా. ఈ పరిణామం వేగిరం కావటానికి అంతరంగం విశాలం కావాలి. సంకుచిత మనోనియమనిబంధనలకు అనుగుణంగా సాగే వ్యర్థ కార్యకలాపాల ద్వారా ఇది సాధ్యం కాదు.

సాధనలో పాటించవలసిన నియమనిబంధనల గురించి అడిగావు. ఇందుకు అత్యంత ఆవశ్యకమైనది అంతరంగ చైతన్యంలో ఏకాగ్రత. మనసుయొక్క ఉపరితలం సవాలక్ష ఆలోచనలతో నిండి ఉంటుంది. ఇవి అంతరంగ చైతన్యాన్ని కప్పి ఉంచుతాయి. బాహ్యామైన మనసుకి మించిన ఉన్నతచైతన్యం, లోలోపల నిగూఢంగా ఉంది. అదే అసలైన సత్యనిత్యప్రకృతి. ఏకాగ్రతయొక్క లక్ష్యం మనసుని నిశ్చలం చేసుకుని అంతరంగ చైతన్యంలో నివసించగలగడమే. సాధారణ మనస్సుకి అతీతంగా ఉన్న సత్యచైతన్యంలో రెండు కోశాలున్నాయి. అవి హృదయ, మనోకోశాలు. ఏకాగ్రతవల్ల హృదయకోశం తెరుచుకొని లోనున్న చైత్యపురుష సాక్షాత్కారం కలుగ చేస్తుంది. అంటే వ్యక్తి తనలోనున్న దైవాన్ని తెలుసుకోగలుగుతాడు.

అంతరాత్మ తెరుచుకొని దైవం ఆవిష్కృతమయే కొలదీ వ్యక్తి తాలూకు మర్త్యప్రకృతి దివ్యప్రకృతిగా రూపాంతరీకరణం చెందుతూ ఉంటుంది. అంతర్వికాసం కోసం ఆకాంక్షతో ఆత్మార్పణం కావించుకొని హృదయకేంద్రంలో ఏకాగ్రతతో ఉపవిష్ఠులై ఉన్నప్పుడు దివ్యత్వం తాలూకు ఉనికి తెలుస్తుంది ఈ రకమైన ఆధ్యాత్మికమార్గాన్ని అవలంబించడం క్షేమదాయకమైనది; శ్రేయోదాయకమైనది ఇందులో విజయం సాధించినప్పుడు సాధనలో ఇక తిరోగమనమే ఉండదు అంతా పూలబాటే! ఇతర యోగమార్గాలకంటె ఇది సులువు.

మరో మార్గం – మనోమయకోశానికి సంబంధించినది సాధారణ మనసుని అధిగమించి ఉన్నత ఊర్ధ్వ మనోభూమికల నధిరోహిస్తూ, మనోసీమకి మకుటమైన ఊర్ధ్వమనస్సుని చేరుకొని, దానికి ఇంకా పైనఉన్న పరమోన్నత దివ్యచైతన్య సత్య శిఖరాన్ని అందుకోగల్గటం. ఇందుకు ప్రాథమికంగా సాధారణ భౌతికమనస్సును నిశ్చలం, నిరామయం కావించుకోవాలి. అలా చేసుకోగలిగినప్పుడు ఊర్ధ్వమనోభూమికలు తెరచుకొంటవి. ఫలితంగా ఆధ్యాత్మిక దివ్యజ్ఞాన అనుభూతులు అనుభావ్యమౌతవి పరమోన్నత ఆధ్యాత్మిక శిఖరమైన దివ్యచైతన్యమునకు దారి సుగమమౌతుంది దివ్య ఆత్మానుసంధానంవల్ల దివ్యశాంతి, కాంతి, శక్తి, జ్ఞానం, ఆనందాలు అనుభవైకవేద్యమౌతవి మనోకేంద్రంలో ఏకాగ్రతయొక్క లక్ష్యం ఊర్ధ్వచేతనకి చేరువకావటం కోసమే కావాలి. ఈ లక్ష్యం విస్మరిస్తే మనోచేతనకి మాత్రమే పరిమితమైపోయే ప్రమాదం ఉంది మనోస్తరాలన్నిటినీ అధిగమించి అతీతస్థాయికి ఎదగలేకపోతే దివ్యసత్య సాక్షాత్కారం లభించదు. బుద్ధిజీవులకు మనోకోశంలో ఏకాగ్రత, హృదయజీవులకు హృదయకోశంలో ఏకాగ్రత సాధ్యమౌతుంది కొంతమంది ఇరుకోశాలలోనూ ఏకాగ్రత సాధించగలిగే వారు ఉంటారు ప్రారంభదశలో హృదయకోశంలోనే ఏకాగ్రత సాధించ ప్రయత్నించడం అభిలషనీయం. ఇది తేలిక

మరో (యోగ) విధానం వ్యక్తి తన మానసిక ప్రాణిక శారీరక సంబంధమైన సమస్త కర్మలను భగవదర్పణంగా అనుష్ఠించడం. వికసించిన అంతరంగంతో ఆత్మ ప్రబోధానికి లోబడి, శరీర బాహ్యాంతర భాగాల సామరస్యంలో సర్వకర్మలూ నిర్వహింపబడాలి. అంతరంగ వికాసంతో చైత్యపురుమనికి (అంతరాత్మ) చేరువ అయే కొలదీ క్రమేపీ దోషాలన్నీ తొలగిపోతాయి. మానసిక ప్రాణిక శారీరక చైతన్యస్థాయిలలో సకల క్రియాకలాపాలు క్రమపద్ధతిలో కొనసాగుతాయి.

ఏ పని చేసినా నిర్లిప్తంగా నిరామయంగా చేయడం మరో పద్ధతి. మనో ప్రాణిక దేహాలతో మమేకం కాకుండా నిరహంకారంగా అంతరాత్మ సాక్షిగా కర్మలు చేసినపుడు నీవు ఒక దైవోపకరణంగా, దివ్యాత్మ ప్రతినిధిగా భాసిస్తావు. ఈ నిశ్చల నీరవ చేతనలో నీ స్వీకార తృణీకారాలు అన్నీ నీలోని దివ్య చిత్తానికి ఒదిగే ఉంటాయి ఆధ్యాత్మికోన్నతికి మరింతగా దోహదపడతాయి నీ శరీరము, ఇంద్రియాలు మనసు దివ్యచేతనకే లోబడి కర్మానుష్ఠానం చేస్తాయి. ఏ సాధన ప్రక్రియ అయినా వ్యక్తిస్వభావానికి అనుగుణంగా ఉండాలి

సాధన కుంటువడినా సాధకునికి ఏ ఇబ్బంది కలిగినా "గురువు" ప్రమేయంతో సరిచేసుకొని కృతార్థులు కావచ్చు.

అనువాదం కర్రా వేంకటేశ్వర్లు

దివ్యసత్య అన్వేషణ, అభివ్యక్తీకరణలకోసం అనుష్ఠించే యోగంలో అంకితభావం, ఆకాంక్ష తప్పనిసరి. మరి యే ఇతర వ్యాపకాలు ఉండకూడదు. లక్ష్యసాధనలో ఏకాగ్రత లేకపోతే యోగసిద్ధి ఉండదు.

అంతర్దృష్టితో ఆధ్యాత్మిక జీవనానికే పూర్తిగా అంకితమైపోవాలి. మానసిక, ప్రాణిక, శారీరక స్థాయిలలో కోరికలు, భవబంధాలు విడిచివేయాలి. ఈ యోగసాధనలో స్వార్థమనేది అసలే పనికిరాదు. పూర్తిగా దివ్యచిత్తమునకే లోబడి, దివ్యసత్యమార్గంలోనే పయనిస్తూ కర్మలు ఆచరించాలి.

శ్రీఅరవిందులు

'నేను' అంటే ఎవరు?

శ్రీమాత

ఒక ముష్టివాడికి డబ్బు వేస్తే పదిమంది తయారవుతారు. పది మందికి వేస్తే వందమంది తయారవుతారు. దీనికి అంతు ఎక్కడిది? మరియు సంపన్నులు పాఠశాలలు, ఆసుపత్రులు కట్టించవచ్చు. కాని యోగానికి దానధర్మాలకి ఎట్టి సంబంధము లేదు. అది వారి అహంకారాన్నే పెంచుతుంది.

నువ్వు మంచి చెయ్యాలనుకుంటె మొదట నువ్వెవరో కనుక్కోవాలి. నీ నిజస్వరూపాన్ని కనిపెట్టాలి. అసలు 'నేను' అంటే ఏమిటి? అది నువ్వనుకుంటున్నది కాదు. నిరంతరం మారుతున్న నీ ఆలోచనలు కావు. నీ అలవాట్లు, ఫీలింగ్స్ కానే రవు. నీలో మారకుండా వుండే శాశ్వతమైన వస్తువు – అదే దైవము.

– సంపాదకుడు

సంఘసేవ గొప్పదా?

లక్షలాది ఆస్పత్రులు తెరచినంత మాత్రాన ప్రజలు అస్వస్థులు కాకుండా అరికట్టలేవు. పైగా ఈ సదుపాయంవలన జబ్బుపడటాన్ని ప్రోత్సహించినట్టవుతుంది. ఇలాంటి భావాలు మనలో పాతుకుపోయి ఉన్నాయి. ఇదుగో ఇదే నా కర్తవ్యం ఇక వేరే ఆలోచించేపని లేదు. "ఈ ప్రపంచంలోకి వచ్చాను. ఇతరులకు సహాయపడాలి" వ్యక్తి ఇలా ఆలోచిస్తాడు. "నాకు ఏమీ ఆసక్తి లేదు! మానవాళికి సేవ చేస్తాను." ఇదంతా ఆత్మాభిమానం గాక మరొకటి కాదు.

ఒక నాగరికత తర్వాత మరొక నాగరికత వెలుస్తుంది. ఒక ప్రళయంవెంట మరొక ప్రళయం: అయినా పరిస్థితి మారదు. అందులో అసలు విషయం లోపించింది చైతన్యం.

అందులో యోగం లేశమాత్రమైనా లేదు

ఆస్పత్రులు, పాఠశాలలు నీవు నిర్మించాలనుకుంటే అలాగే చేయొచ్చు. నిన్ను అది సంతోషపరిస్తే, నీకది

ఎంతో మంచిది. దానికి ఏమంత ప్రాముఖ్యం లేదు. "మిస్టర్ విన్సెంట్" చలనచిత్రాన్ని చూచినప్పుడు నాకెంతో ఆసక్తి కలిగింది. పదిమందికి అతను అన్నం పెడితే వెయ్యిమంది భోజనానికి వచ్చారు. కోల్‌బర్ట్ అతనితో ఇలా అన్నాడు "నీవు పేదలకు అన్నంపెట్టి వారిని సృష్టిస్తున్నట్లుంది!" ఇది పూర్తిగా అసత్యం కాదు. ఏది ఏమయినా పాఠశాలలు స్థాపించటం, బోధించటం, ఆస్పత్రులు నిర్మించటం మంచిదే. కాని అదేదో ఘనకార్యం అనుకోకూడదు. అదంతా నీ ఆనందం కోసం నీవు చేస్తున్న ఆడంబరం. "నాకు అది ఆనందదాయకం కాబట్టి నేను చేస్తున్నాను" అంటావు. అయితే యోగం గురించి మాట్లాడకు. ఏదో గొప్పపని చేస్తున్నావని నీ నమ్మకం. అంతే, అది నీ ఆత్మతృప్తికోసం....

ఒక సత్కార్యము చేసేముందు, ఆత్మపరీక్ష చేసుకోవాలి. అతిముఖ్యమయిన ఒక విషయాన్ని గురించి తెలుసుకోవాలి – "నేను లేను". ఉన్నది ఒకే విషయం. అది దైవం. ఆ విషయాన్ని తెలుసుకునేదాకా ముందుకు సాగలేవు. నీకు తాత్వికమనస్సు ఉన్నట్లయితే ఇలా ఆలోచిస్తావు....

> *నాలోని మార్పు*
> *జెందని వస్తువు*

'నేను' అనేది ఏది? అది నా శరీరమా? శరీరంలో మార్పు వస్తూ ఉంటుంది. ఇది ఒకటేగా ఉండదు. 'నేను' అన్నది నా భావాలా? భావాలు తరచు మారుతూ ఉంటాయి. అయితే 'నేను' అన్నది నా ఆలోచనలా? ఆలోచనలు వస్తూవుంటాయి. పోతూంటాయి. ఆలోచనలు 'నేను' కాదు. అయితే 'నేను' అన్నది ఎక్కడ ఉంది? శాశ్వతంగా ఉండే భావం నాకెలా కలుగుతుంది?"

నిజాయితీతో నెమరువేసుకుంటూ కొన్నేండ్లనాటి విషయాలు ఆలోచించు. సమస్య మరీ కలవరపెడుతుంది. పరిశీలన కొనసాగిస్తూ ఇలా అనుకొంటావు. "నేను అంటే జ్ఞాపకశక్తి". అయితే జ్ఞాపకశక్తి కోల్పోయినా, వ్యక్తి కొనసాగుతాడు. ఈ ప్రగాఢ అన్వేషణను చిత్తశుద్ధితో కొనసాగిస్తే అన్నీ మటుమాయమయి ఒకటి మాత్రమే నిలుస్తుంది. అదే దైవాంశము, దైవసన్నిధి.

మిగతా అన్నీ మాయమవుతాయి, కరిగిపోతాయి. ఎండలో వెన్న కరిగినట్టు అన్నీ కరిగిపోతాయి....

ఈ విషయం తెలుసుకున్నాక తాను ఓ అలవాట్ల పుట్ట మాత్రమేనని వ్యక్తి గుర్తిస్తాడు. దైవాంశ తెలియక, దైవాంశను గురించిన చైతన్యం లేకపోవటమే అనుకున్న అన్ని భావాలు కూడా. ప్రతి ఒకరిలో అనేక 'నేను'లు వందలు వందలున్నాయి. అవి అనేక రీతుల్లో వెలువడుతాయి. మైమరచినవి, మార్పుచెందేవి, నిలకడ లేనివి. ఈనాడు మాట్లాడే 'నేను' నిన్నటి 'నేను' కాదు. ఇంకొంత ఆలోచిస్తే 'నేను' అన్నది అదృశ్యమైపోయింది. నిలిచేది ఒకటి మాత్రమే – అదే దైవాంశ. అది మాత్రమే ఎప్పటికీ మార్పులేనిది.

అనువాదం: డాక్టర్ జోలెపాళెం మంగమ్మ

నిజమైన స్వేచ్ఛ – ప్రకృతి గుణముల కతీతము

మనిషికి స్వేచ్ఛ ఉన్నదా, యథేచ్ఛగా ప్రవర్తించుట సాధ్యమేనా అనేది విచారించతగ్గ విషయము. మనిషి ప్రకృతి గుణములకు బద్ధుడు. ప్రకృతిశక్తులచే శాసించబడినప్పటికీ తనకి మట్టుకు తన ఇచ్ఛ ప్రకారమే చేస్తున్నాననే భావం కలుగుతుంది. తన ఆత్మను కనుగొని ఆత్మదృష్టితో చూసినప్పుడు ఈ తప్పుడుభావము తొలగిపోతుంది. మానవేచ్ఛ దైవేచ్ఛతో ఏకమైనప్పుడే మనిషికి నిజమైన స్వేచ్ఛ లభిస్తుంది.

– సంపాదకుడు

మనిషి ప్రకృతి గుణములకు బద్ధుడు

ఏకము, అఖండము, సర్వాతీతము, సర్వగతమునైన బ్రహ్మమే ఇచట నుండెడి ఈ సకలమును గూడ, కాని పైకి మాత్రమది ఖండితమైనట్లుగా కనుపించుచుండును –

పైకి మాత్రమే. ఏలయన, యథార్థమున కయ్యది సకలవస్తువుల యందునూ సకల జీవులందునూ సమానముగ, అఖండస్వరూపముననే భాసించుచున్నది. ఖండత్వము బయటికి గోచరించునట్టిది మాత్రమే. అజ్ఞానభూయిష్ఠమైన యీ ఖండానుభూతియందు మనమున్నంతకాలమూ, అహంకారమే మన స్వరూపమై, ప్రకృతి గుణములకు మనము వశులమై వర్తించుచుందుము. బాహ్యావిషయములకు దాసులమై, ద్వంద్వములకు బద్ధులమై, మంచిచెడులు, సుఖదుఃఖములు, పుణ్యాపాపములు, శుభాశుభములు, జయాపజయములు – వీటిమధ్య ఊగిసలాడుచూ, – అయోమయమైన – పూతమెరుగులు మాత్రముగల – మాయాచక్రమున బడి పరిభ్రమించుచుందుము. కొద్దిపాటి సాపేక్షిక స్వాతంత్ర్య మొకవేళ మనకున్ననూ – దానినే మనము తెలియక స్వేచ్ఛయని చెప్పుకొనుచుందుము. అయ్యది నిజమునకు వట్టి భ్రమయే కాని వేరుకాదు. ప్రకృతిగుణములే మన స్వేచ్ఛద్వారా తమ్ము దామభివ్యక్త మొనర్చుకొనుచుండును. ప్రకృతిశక్తియే మనలను వశమొనర్చుకొని, తాను మాత్రము మన వశముగాక, మన యిచ్ఛలను నిర్ణయించుచుండును. బుద్ధిపూర్వకముగ గాని అనాలోచితముగ గాని, మన జీవితము నందనుక్షణమూ మన మే యే విషయముల నన్వేషించవలెనో నిర్ణయించునది ప్రకృతియేకాని స్వాతంత్రాహంకృతి కాదు.

ఆత్మ ప్రకృతి గుణముల కతీతము

పై విధమునగాక, అఖండ బ్రహ్మము నందే మనము వర్తించుచుందుమేని, అహంకారమునూ ప్రకృతినీ అతిక్రమించగలుగుదుము. మన నిజాత్మను పొందగలుగుదుము. ఆత్మస్థులమై, ప్రకృతి ప్రేరణలకూ, గుణములకూ, శక్తులకూ అతీతులమగుదుము. ఆత్మయందూ, బుద్ధియందూ, హృదయమునందూ పూర్ణసమత్వమును సంపాదించి, సకల భూతములతోడను ఏకత్వము భజించెడి, – సకల భూతములలోనూ తన్ను తానభివ్యక్త మొనర్చుకొనుచున్న పరతత్వముతో ఏకత్వమును భజించెడి – నిజస్వరూపమును గాంచగలుగుదుము. ఇట్లీ సమత్వమునూ ఏక

త్వమునూ పునాదులుగ చేసికొనగలిగినప్పుడే, మనము దివ్య స్వరూపులమూ, దివ్యచేతనులమూ, దివ్యకర్ములమూ కానేర్తుము. సకలముతోనూ ఏకత్వము పొందనంతవరకూ ఆధ్యాత్మికముగా మనకు దివ్యత్వము లేదు. సకల వస్తువులయెడలనూ సమత్వము కుదరనంతవరకూ మన దృష్టీ మన జ్ఞానమూ దివ్యములు కానేరవు. ఇతరులయెడ మనము దివ్యభావమున వర్తింపనేరము. నిత్యమూ, అనంతమూనైన ఆ పరతత్వశక్తి సకల వస్తువులకూ సమమై యొప్పుచున్నది. సమమైయొప్పుచున్నందువలననే, తన శక్తిక్రియల యాథార్థ్యానుసారముగనూ, ఆయా వస్తువులయూ జీవులయూ నిజతత్వానుసారముగనూ పరమజ్ఞానముతో నయ్యది వ్యవహరించగలిగి యున్నది.

మానవునకు సాధ్యపడగల నిజమైన స్వాతంత్ర్యముకూడ నిదియొక్కటే. మానసికమైన పృథగ్భావము నతిక్రమించి, ప్రకృతి యందు చేతనాత్మగా విలసిల్లగలిగినప్పుడే ఈ స్వాతంత్ర్య మాత నికి లభించును. ఈ విశ్వమునందు స్వతంత్రమైన యిచ్ఛ ఈశ్వరేచ్ఛ యొక్కటే. దానికి కార్యరూప మిచ్చునది ప్రకృతి. ఇతరములైన సకలేచ్ఛలనూ అయ్యది సృష్టించి అనుశాసించుచుండును. మానవునకు ఒక విధముగా స్వేచ్ఛయున్నమాట నిజమే కాని, ప్రకృతిగుణ సంబంధమైన వస్తుజాతమువలే ఆ స్వేచ్ఛయూ సాపేక్షమే కాని నిరపేక్షము కాదు.

రహస్యమైన దైవేచ్ఛ

మనస్సనునది, ప్రకృతిశక్తులనెడి ఆవర్తము నధిరోహించి కదలాడుచూ పలు దిక్కులలో ఏ దిక్కునకు జరుగునో యనెడి సందిగ్ధావస్థలో నడయాడి, తుదకు ఏదో ఒకవైపునకు మొగ్గి, అచట కుదురుకొని, దానిని తన స్వయంవరణముగా భావించుచుండును. కాని, ఏ మహాశక్తి తన వెనుకనుండి తనచేత ఈ వరణమును (choice) చేయించినదో, దానినది కనుగొననేరదు. ఆ శక్తి సమష్ట్యాత్మకమై, ఇదమిత్థముగ నిర్ణయింపరాని దగుటయే ఇందుకు గారణము. బహుప్రకారములైన ఏ విధినిర్ణయముల రూపమున నీ మహాశక్తి తన లెక్కింపరాని ఆశయములను నెరవేర్చుచుండునో, ఆ నిర్ణయ

ములం దొక కొన్నింటిని మాత్రమే, మనస్సు ఒకమాదిరి విస్పష్టతతోనూ లక్ష్యశుద్ధితోనూ వివేచింపగల్గుచుండును. యంత్రమునందలి ఒక భాగమును మాత్రమే మనస్సు అధిరోహించి యుండును. దేశకాలములందా యంత్రమును చోదనచేయు శక్తులలో నూటికి తొంబదిపాళ్ల శక్తులనది యెరుగనే యెరుగదు. తన పూర్వ ప్రయత్న మెట్లుండెనో, భావిగతి యెట్లుండగలదో తెలిసికొననేరదు.

అది మన పరమోచ్ఛ స్వరూపము

అయిననూ, ఆ యంత్రమును తా నధిరోహించియున్న కారణమున, దానిని తానే నడుపుచున్నట్లు భావించుకొనును. ఒక విధముగా అది పరిగణించదగినదే. ఏలయన, మనస్సునందు మనము 'ఇచ్ఛ' యని పిలుచు 'మొగ్గుదల' యూ, స్వయంవరణముగా పైకి గనిపించెడిదాని 'కుదురుపాటు' నూ ప్రకృతిశక్తి విశేషములే. ప్రకృతి ఉపయోగించు ప్రబల విధి నిర్ణయ సాధనములలో ఈ మానసికేచ్ఛ ఒకటి. కాని ఇది యెన్నడునూ స్వతంత్రము గాదు. ఇదే సర్వస్వమునూ గాదు. ఈ మానవేచ్ఛద్వారా జరుగు అత్యల్ప క్రియాకలాపము వెనుక, ప్రబలమూ బృహత్తరమూ నిత్యమూనైన ఒక మహాశక్తి యున్నది. అది యీ యిచ్ఛ యందలి 'మొగ్గుదల' ను పర్యవేక్షించుచూ, అది తిరగవలసిన దిక్కునకు ఒత్తిడి కలుగజేయుచుండును.

ప్రకృతియందొక సమగ్రసత్యము దాగియున్నది. అది మన స్వయంవరణము (individual choice) కంటె మహత్తరము. ఆ సమగ్రసత్యమునందు – దానికింకనూ అతీతముగాకూడ – నిహితమై యున్నదేదియో ఇచటి సకల ఫలితములనూ నిర్ణయించుచుండును. దాని సాన్నిధ్యమే – అందలి జ్ఞానరహస్యమే – ప్రకృతి విధానమునందు సరియైన సంబంధముల పరిజ్ఞానమునూ, ఏకవిధములూ బహువిధములూనైన అక్కరలనూ (necessities), అనివార్యములైన గతివిశేషములనూ నిలుకడగా పోషించుచుండును. నిత్యము, అనంతము, సర్వజ్ఞము, సర్వశక్తము, అత్యంత గుప్తమునైన ఈశ్వరేచ్ఛ అది. అదియే ప్రతి సమష్టియందునూ, పరిచ్ఛిన్నత్వాది లక్షణోపేతమైన ప్రతివ్యష్టియందునూ తనను

దా నభివ్యక్త మొనర్చుకొనుచున్నది. "ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి, భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా" అని భగవద్గీత చెప్పినది ఈ సూక్తినిగూర్చియే – ఈ సాన్నిధ్యము నుద్దేశించియే.

ఈ యీశ్వరేచ్ఛ మనకు పరాయిదికాదు. మనకూ దానికీ, అత్యంతిక సంబంధమున్నది. ఆ శక్తిలో మనమొక భాగము. అది సాక్షాత్తూ మన ఉన్నతాత్మ స్వరూపమే. దాని శక్తియే అది. అది మన మానసికేచ్ఛ మాత్రము కాదు. మన మానసికేచ్ఛ అంగీకరించినదాని నది తరచుగా త్రోసిపుచ్చుచుండును. త్రోసి పుచ్చినదాని నంగీకరించుచుండును. ఏలయన: అయ్యది సర్వ జ్ఞము. ప్రతి సమష్టి, ప్రతి వ్యష్టి దానికి తెలియును. మన బాహ్యా మనస్సున కట్లు తెలియదు. వస్తుస్వరూపమునందు చాల అల్పాం శము మాత్రమే దాని కెరుక పడుచుండును.

మన ఇచ్ఛా ప్రవృత్తికి మనస్సే మూలము. అది దేనిని తెలిసికొన్ననూ మానసికాలోచనల ద్వారముననే తెలిసికొను చుండును. ఈశ్వరేచ్ఛ మనస్సున కతీతము. సర్వమూ దాని స్వరూపమే కావున, దానికి సర్వమూ తెలియును. ఈ విశ్వశక్తిని కైవస మొనర్చుకొని దాని కాధారభూతమై విలసిల్లు మన ఉన్న తాత్మ ఈ మన అహంకారము కాదు, ఈ మన వ్యక్తిగత ప్రకృ తియూ గాదు. అది సర్వాతీతమూ సర్వగతమూనైన తత్వము. ఈ క్షుద్రవస్తుజాత మంతయూ దాని పైపైనుండు నురుగు వంటిది. ఈశ్వరేచ్ఛకు మన మానసికేచ్ఛను వశంవదమొనర్చి, దానితో ఏకము చేయగలిగినప్పుడే, మనకు యథార్థ స్వాతం త్ర్యము సిద్ధించును. దివ్యస్వేచ్ఛయందు నివాసమేర్పడును గావున, శృంఖలాబద్ధమైన మానసిక స్వేచ్ఛనిక పట్టుకొని ప్రాకులాడము. అసమగ్రములైన మనఃప్రాణవృత్తుల వక్రగతులలో బడిపోవుచూ, సాపేక్షికమై, మిథ్యాభూతమై, అజ్ఞానాత్మకమై యుండు ఈ కీలు బొమ్మ స్వాతంత్ర్యము మనలనిక భ్రమపెట్టజాలదు.

*

స్వతంత్రుడైన యీశ్వరుడు: తదధీనముగ యంత్రప్రాయమై ప్రవర్తించు ప్రకృతి. దీనినే ఇంకొక విధముగ జెప్పినచో, ఏకమై తేజోమయమై భాసించు ఈశ్వరేచ్ఛ: దానిని కార్యరూపమున నెరవేర్చు విశ్వశక్తులయూ గుణములయూ సముదాయము. ఈ రెండింటికినీ గల ముఖ్యభేదమును మనము దృఢముగా గ్రహింపవలసిన యవసరమున్నది.

ప్రకృతి యనుదాని మూలసత్యము చిచ్ఛక్తియే యనుమాట నిజము. కాని, అవిద్యాదృష్టికి మాత్రము, అది వట్టి యంత్రప్రాయమైన జడశక్తి. అయిననూ దాని సకల కార్యములనూ ప్రేరేపించునది మాత్రము చిచ్ఛక్తియే.

అనువాదం: కమలాకర వేంకటరావు (యోగసమన్వయము)

క్షమాదర్శము

శ్రీఅరవిందులు

నీలాకాశంలో తెల్లటి మేఘాలు పరుగెడుతున్నాయి. సెలయేటి గలగలలతో వాతావరణం రమణీయంగా ఉంది. భూమి సగం చీకటి సగం వెన్నెలతో వింత అందాన్ని సంతరించుకొంది. అక్కడ ఎటు చూసినా ఋషుల ఆశ్రమాలు, ఉద్యానవనాలు – చెట్లు, లతలు, పువ్వులతో ఎంతో రమణీయంగా వుంది. ఆ వెన్నెలరాత్రిలో బ్రహ్మర్షి వశిష్టుడు తన భార్య అరుంధతీ దేవిని పిలిచి విశ్వామిత్రుని ఇంటికి వెళ్లి కొంచెం ఉప్పు అడిగి తీసుకు రమ్మన్నాడు. విస్మయంతో ఆమె "ఏమిటి! నా నూరుగురు కొడుకులని చంపిన అతని దగ్గరనుంచా" అని గద్గదస్వరంతో పలికింది. "నా పుత్రులు ఇటువంటి వెన్నెలరాత్రులలో వేదాలను వల్లిస్తూ ఉండేవారు. నా నూరుగురు కొడుకులను అతను చంపేశాడు. అట్టి రాక్షసుడి దగ్గరనుంచి నన్ను ఉప్పు ఎందుకని తెమ్మంటున్నారో నాకర్థం కావటల్లేదు."

వశిష్టుని ముఖము దివ్యతేజస్సుతో వెలిగిపోయింది. తన హృదయసీమల లోనుంచి "నేనతన్ని పూజిస్తాను గనుక". అప్పుడామె "అయితే నువ్వు ఆయనను బ్రహ్మర్షి అని అప్పుడే పిలవాల్సింది. అప్పుడు నా నూరుగురు కొడుకులు నాకు దక్కేవాళ్లు గదా". మళ్లీ వశిష్టుని ముఖము తేజోవిరాజితమైంది. "ఆయన యందు భక్తివలన అట్లు సంబోధించలేదు. అందుకనే ఆయన బ్రహ్మర్షి అయ్యేందుకు ఇంకా అవకాశమున్నది."

ఆ రోజు విశ్వామిత్రుడు ఆగ్రహంతో కంపించిపోతున్నాడు. కూర్చుని తపస్సు చేసుకోలేడు. వశిష్టుడు తనని ఆ రోజు బ్రహ్మర్షిగా గుర్తించకపోతే వాడి ప్రాణం తీస్తాను అని చిందులాడుతూ ఒక కత్తి పట్టుకొని వశిష్టుని ఆశ్రమానికి బయలు దేరాడు. ఆయన ఇంటి దగ్గరకి వెళ్లి ఓరగా నిల్చున్నాడు. వశిష్టుడు తన భార్యతో అన్నదంతా విన్నాడు. కత్తి మీద పట్టుని సడలించాడు. "అపరాధం, అపరాధం ఇంతటి మహాపురుషుని గురించా నేను దుర్భాషలాడాను" అని అనుకుంటూ ఒక వంద తేళ్లు తనని కుట్టినంత మంటతో బాధపడిపోయాడు. లోనికి పరిగెత్తి వశిష్టుని కాళ్ల మీద పడ్డాడు. "నేను మిమ్మల్ని క్షమించమని అడిగేందుకుకూడ అర్హతలేని వాడను" అని పలికేడు. అప్పుడు వశిష్టుడు ఏం చేశాడో తెలుసా? రెండు చేతులు జాపి విశ్వామిత్రుడ్ని లేవదీస్తూ "బ్రహ్మర్షీ లెమ్మ" అన్నాడు. అసలే పరాభవంతో కుమిలిపోతున్న విశ్వామిత్రుడు "ఇంకా నన్నెందుకు అవమానపరుస్తారండి" అని పలికేడు. వశిష్టుడు "నేనెప్పుడూ అబద్ధాలు చెప్పను. నువ్విప్పుడు నిజంగానే బ్రహ్మర్షివయ్యావు. నీ గర్వాన్ని పోగొట్టుకొని ఆ పదవిని సంపాదించుకున్నావు" అని అతనిని బుజ్జగించాడు.

"నాకు బ్రహ్మజ్ఞానాన్ని నేర్పండి" అని విశ్వామిత్రుడు వేడుకున్నాడు. "అయ్యా మీరు అనంతదేవుని దగ్గరకు వెళ్లండి. ఆయనే మీకు ఆ జ్ఞానాన్ని ఇవ్వగలడు" అని వశిష్టుడు పలికాడు.

అనంతదేవుడు తన తలమీద భూమిని మోస్తున్నాడు "ఇదిగో ఈ భూమిని నీ తలమీద పెట్టుకోగలిగితే నేను నీకు బ్రహ్మజ్ఞానాన్ని నేర్పగలను" అని అన్నాడు. విశ్వామిత్రుడు గర్విష్ఠి – భూమిని ఒదిలివేశేయ్ నేను పట్టుకుంటానులే అని అన్నాడు. "ఇదిగో తీసుకోవయ్యా" అంటూ భూమిని దించేశాడు. అది పల్టీలుకొడుతూ కిందపడిపోతోంది.

నా తపశ్శక్తినంతా ధారపోస్తున్నాను, భూమి నిలబడు గాక అని విశ్వామిత్రుడు అన్నాడు. కాని భూమి నిలవలేదు. అప్పుడు అనంతదేవుడు "నువ్వు భూమిని మోసేటంత తపస్సు చేయలేదయ్యా, నువ్వెప్పుడైనా దివ్యపురుషుల సాన్నిధ్యాన్ని పొందేవా? దాని ఫలితాన్ని సమర్పించు" అన్నాడు. "నేను వశిష్టుడితోటి ఒక క్షణమున్నాను" అని విశ్వామిత్రుడన్నాడు. అయితే ఆ ఫలితాన్ని ఇచ్చేయమని అనంతదేవుడన్నాడు. అతనలాగే చేసాడు. దాంతో కిందపడిపోతున్న భూమి వెంటనే నిలిచింది. "ఇక నాకు దివ్యజ్ఞానాన్ని ఇవ్వండి" అని విశ్వామిత్రుడు అడిగేడు. అప్పుడు అనంతుడు "ఓరీ మూర్ఖా! ఎవరి సన్నిధిలో నీవు ఒక్క క్షణం గడపటంవలన భూమి కదలకుండా నిలబడిందో అతన్నడిగే బదులు నన్నడుగుతావేం" అని కోప్పడ్డాడు.

విశ్వామిత్రుడు కోపం భరించలేకపోయాడు. వశిష్టుడు తనని మోసం చేసేడనుకొని అతని దగ్గరకు పరిగెత్తి నన్నెందుకు మోసం చేసేవని అడిగేడు. వశిష్టుడు నెమ్మదిగా జవాబిచ్చాడు. నేను నీకు అప్పుడే బ్రహ్మజ్ఞానం బోధించినట్లయితే నువ్వు నన్ను నమ్మేవాడివి కాదు. ఆ నమ్మకం నీ కిప్పుడే కలిగింది. విశ్వామిత్రుడు వశిష్టమహర్షి దగ్గర్నుంచి బ్రహ్మజ్ఞానాన్ని పొందేడు.

పూర్వం భారతదేశంలో ఇటువంటి మహర్షులుండేవారు. వారి క్షమాదర్శం అటువంటిది. వారి తపశ్శక్తితో భూమిని కూడ కదలకుండా నిల్పోపెట్టగలరు. నేడు కూడా అంతకంటె ఇంకా గొప్ప మహర్షులు, ఈ భారతావనిని గతంకంటె ఇంకా ఎక్కువ వైభోవోపేతము చేయగలిగినవారు ఈ దేశంలో జన్మిస్తున్నారు.

అనువాదం: ఆర్.ఎల్. ప్రసాదమ్మ

వందేమాతరం:

ఉపనిషత్తుల ప్రాశస్త్యము

భారతీయ తత్వము మన వేదోపనిషత్తులలో నిక్షేపింపబడి ఉన్నది. ఆ జ్ఞానము అమోఘము, అద్వితీయము, మన వేద ఋషులు తపస్సుచేసి కనుగొనిన సత్యము. అది బుద్ధి కతీత మైన విశేషజ్ఞానము. మన కళలు, కవిత్వము, సాహిత్యము, శాస్త్రములు అన్నీ కూడ దానినుండి పెల్లుబికిన ప్రత్యేక రూపములే. *– సంపాదకుడు*

ఉపనిషత్ప్రకరణాలు కవిత్వ, వేదాంత తత్వములతో పరిపుష్టమై నవి. స్పష్టత, సందేశాత్మకత, స్వరమాధుర్యంతో ఆకట్టుకొం టాయి. అందుకే వేదగానమని కూడా వ్యవహరిస్తారు.

అయితే, అనువాదాలు మూలంలోని సొబగులను పరిపూ ర్ణంగా అందించలేకపోయినవేమో అనిపిస్తుంది. ఓజోగుణము సూక్ష్మత, స్పష్టత, సంస్కృతభాషకున్న విశేషాకర్షణలు చిన్న మాట లతో పెద్దభావాలు ఇమిడ్చి ఆకట్టుకొనేరీతిలో, చిరకాలం మనో పథంలో మెదిలేలా వ్యక్తీకరించటం సంస్కృతభాషకే చెల్లినది.

వేదాలు, ఉపనిషత్తులు సందేశాత్మకరచనలు. మధుర మంజుల పదజాలంతో హృదయాలను పులకింపజేసే భావవల్లరు లవి. కొన్ని ప్రకరణాలలో సున్నితములగు మానసిక, తాత్త్వి కాంశలు కళాత్మకంగా, కవితాత్మకంగా, పండిత పామర రంజ కంగా ప్రవచించబడ్డాయి. మహోన్నత పరిజ్ఞాన ప్రాప్తికోసం మానవుడు గావించిన ఆధ్యాత్మిక పరిశోధన ఉపనిషద్రచనలలో వర్ణనాత్మకంగా వివరించబడినది. ఉపనిషద్రచనల పరమలక్ష్యము దివ్యజ్ఞాన ప్రచోదనము, తద్వారా శాంతిసౌభాగ్య సాధనమూను!

ప్రాచీన జీవనవిధానము ప్రతిబింబింప జేయుటలో ఉపని షత్ ప్రకరణలు నిలువుటద్దాలలా నిలుస్తాయి. విజ్ఞాన, వివేక సముపార్జనకై రాకుమారులు, పండిత బ్రాహ్మణులు, భూస్వా ములు వనసీమలలోని మున్యాశ్రమములకు సమీపించుటయు

తపోజ్ఞాన సంపన్నులగు ఋషిపుంగవులు వారివారి స్థాయిభేద ముల పరీక్షించి, ప్రచోదము గావించి, వారిని నిష్ణాతుల గావించు టయు మన కనులకు కట్టినట్లు కనిపించు దృశ్యపరంపరలు!

నృపేంద్రులు, రాకుమారులు రథాలపై వస్తే, అనామకు రాండ్రైన సేవకురాండ్ర అక్రమసంతానాలు కాలినడకన సమీపి స్తారు. రాజయోగి జనకభూపతి, సూక్ష్మగ్రాహి అజాతశత్రుడు, ఐహిక పారమార్థిక సంపదలు అనుభవించినను వాటి అనుభూ తులకు, అనుబంధాలకు కట్టుబడకుండ తామరాకుపై నీటిబిందు వులా నిరపేక్షతో వ్యవహరించి, సర్వమును త్యజించి కడకు గృహావసతి కూడ లేకుండ దేశపర్యటన గావించు సత్యవ్రత సమరయోధుడు యాజ్ఞ్యవల్క్యుడు, ఘోరాఋషివర్యునినుండి శాశ్వత సత్యజ్ఞానము సముపార్జించిన దేవకీసుతుడు శ్రీకృష్ణుడు, వీరందరు ఉపనిషత్ ప్రకరణాలలో ద్యోతకమవుతారు. ఋష్యా శ్రమ వాటికలు, సత్యశోధన ఆధ్యాత్మికసాధనా నిపుణులైన నర పతులు, నిర్వపతులు నిర్వహించు న్యాయవిచారణలు, తమతమ విజ్ఞానపరంపరను విశ్లేషించుకొనుచు ఋత్వికవర్యులు నిర్వ ర్తించు యజ్ఞయాగాదిక్రతువులు సమస్తము మన కనులముందు తరలిపోవు కళాత్మక దృశ్యములు. ఆ పవిత్రవాతావరణంలో భారతీయాత్మ వృద్ధిజెందింది, వికసించింది. ఔన్నత్య శిఖరాలను అందుకొంది.

వేదాలు, ఉపనిషత్తులు భారతీయ తత్త్వవిజ్ఞానము, మత సాంప్రదాయ కర్మకాండలకే గాక కళలు, కవిత్వ సాహిత్యము, శిల్ప, సంగీత చిత్రలేఖనాది ప్రక్రియలకు కూడా ప్రాతిపదికలే! ఈ కళారూపములద్వారా భారతీయాత్మ పరిపూర్ణముగ వికసిం చినది, విస్తరించినది. సత్ప్రవృత్తులు చేకూరి మానవునికి మాన సిక వికాసము లభించినది. మహత్తర తాత్త్విక సిద్ధాంతములు, ఉదాత్త ధర్మప్రబోధములు వెల్లివిరిసి, దైవదత్తములుగా లభించి నవి మానవాళికి.

వైదిక ధర్మము, వైదికజీవనవిధానము, వైదిక కర్మకాం డలు మానవజీవితమును ఉత్కృష్టముగ తీర్చిదిద్దినవి. రామాయణ

మహాభారతములనాటి ధీరోదాత్త వీరత్వము, పౌరాణికయుగము నాటి విజ్ఞాన వివేక వికాసము ఆదర్శ మానవత్వమునకు ఆకృతి నొసగినవి.

ఎన్నో నూతన విద్యలు మానవుని మనోవీధులలో మెరిసినవి. కళాత్మకములు, జీవాత్మకములు, ఇంద్రియాత్మకములునగు దివ్యస్పందనలు అనుభవమున కందినవి. మంత్ర తంత్ర పురాణ శాస్త్రముల ద్వారా మతపరము, మానసికపరమునగు విశేషములు అనుభూతికి వచ్చినవి.

రేఖ, వర్ణ, రూపాత్మకమగు సౌందర్యోపాసన, శిలాలోహ శిల్పకల్పనకు మనోజ్ఞమందిర నిర్మాణమునకు మార్గదర్శకమైనది. సంగీత, సాహిత్య, రేఖారూపకల్పనలద్వారా తానుపొందిన దివ్యానుభూతిని ఇతరులకు పంచు ప్రక్రియ ప్రారంభమైనది. తన అనుభవ విజ్ఞాన మకరందమును అక్షరరూపమున, ఆకార రూపమున తరువాత తరాలకై భద్రపరచుటయు జరిగినది.

కాలప్రభావమున గ్రహణబద్ధమైన నెలరాజు వెన్నెలవలె కొంతకాలమీ విజ్ఞాన వికాసము అనుభవమునకు రాకున్నను, మరల వెలుగులు వెలార్చుకొని నేటి మానవుని అనుభూతి కందినది – అందుచున్నది. నూతన నాగరిక జీవనవిధానమునకు నాంది పలికినది – పలుకుచున్నది. నవ్యసృష్టి వికాసమునకు మార్గదర్శకమయినది – అగుచున్నది.

అనువాదము: వి. మట్టిపూడి

నీ స్వభావంలో మార్పు రావాలి. అయితే ఇది ఒక్క రోజులో అయ్యేది కాదు. సూక్ష్మాతిసూక్ష్మంగా నిన్ను నీవు ఎల్లప్పుడు చిత్తశుద్ధితో పరీక్షించుకుంటూ ఉండాల్సిందే.

శ్రీమాత

మన శరీరకణములలో నిక్షిప్తమైవున్న నిధులు

డాక్టర్ల చుట్టూ తిరిగే వారికి ఒక మంచి శుభవార్త – శరీరానికి జబ్బుచేసినప్పుడు దానిని ఒదిలించుకునే శక్తి ఆ శరీరానికే వున్నది. అయితే అందరూ అలా ఎందుకని చేయరు? ఈ మనస్సు ఒకటి వున్నది కదా – ఈ మాయదారి మనస్సు. శరీరం కేవలం జడపదార్థమల్లె కనపడినప్పటికి అది చేతకాని దద్దమ్మ ఏం కాదు. మనస్సుతో సంబంధంలేని స్వతఃసిద్ధ జ్ఞానము దానికున్నది. దానికేమైనా అయినప్పుడు పైనుంచి ఒక శక్తిని పిలిచి నయముచేసుకునే శక్తి దానికున్నది. శరీరకణములలో నిక్షిప్తమై వున్నది. శరీరము మనస్సుయొక్క దౌర్జన్యానికి గురికాకుండావుంటె నిక్షేపరాయుడిలా వుంటుంది.

– సంపాదకుడు

శరీరానికి ఏదైనా ప్రమాదం లేదా అస్వస్థత కలగటానికి ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు, అంటే శరీరంపై దాడి జరుగుతున్నప్పుడు శరీరాన్ని తన సహజస్థితిలో వదిలినట్లయితే అందులో ఒక తపన, ఆకాంక్ష, సహాయంకోసం ప్రాకృతమైన యిచ్ఛ ఉంటాయి. కానీ ఈ ప్రయత్నం ఎప్పుడైతే మెదడుతో చెయ్యబడుతుందో అప్పుడది మనము సాధారణంగా అలవాటుపడిన రూపాన్ని పొందుతుంది. ఈ విధంగా అంతా ధ్వంసం అయిపోతుంది. కానీ దేహాన్ని మాత్రమే తీసుకున్నట్లయితే, అందులో నుండి ఏదో హఠాత్తుగా మేల్కొని సహాయంకోసం అర్థిస్తుంది. ఒక చిన్నపాప తన తల్లికోసం పిలిచినంత విశ్వాసంతో పిలవాలి. మనస్సుయొక్క నిరంతరమైన ప్రభావం పడకుండా శరీరాన్ని తన మానాన విడిచినపుడు ఈ విధంగా జరుగుతుంది – ఏదైనా ఒక కలత ఏర్పడిన వెనువెంటనే అక్కడొక ఆకాంక్ష, పిలుపు సహాయంకోసం ఆక్రందన ఉంటాయి. ఇది చాలా శక్తివంతంగా వుంటుంది. ఏ విధమైన జోక్యం లేనపుడు ఎంతో

బలోపేతంగా ఉంటుంది. – శరీరంలోని కణాలన్నీకూడా ఒక గాఢమైన ఆశ్వాసనతో స్పందిస్తున్నట్లుగా.

ఈ శరీరంలో అమూల్యమయిన, అగోచరమైన నిధులున్నాయి. శరీరంలో కణాలన్నింటిలోను తీక్షణతరమైన ప్రాణశక్తి, ఆకాంక్ష, ప్రగతిచెందాలనే యిచ్ఛ ఉన్నాయి. సాధారణంగా ఎవరూ దీనిని తెలుసుకోరు. శరీరం తన సమతుల్యాన్ని తిరిగి పొందలేకపోతుందీ అంటే ఈ దేహచైతన్యం పూర్తిగా మనస్సు, ప్రాణికశక్తులవలన నిర్వీర్యం చేయబడి ఉండాలి. శరీరంలో ఈ ఆకాంక్ష లేదంటే దైహికచైతన్యం పూర్తిగా మనఃప్రాణాల ప్రభావంవలన నశించిపోయిందని భావించాలి. పాపం శరీరం..... అది కేవలం దేహంపై ఆపాదించబడిన ప్రాణికమయిన లేదా మానసికమయిన వైకల్యం. దేహాన్ని తన నిజస్థితిలో వదిలివేసినట్లయితే ఆశ్చర్యకరంగా అది తన సమతుల్యస్థితిని ఆకాంక్షించటమే కాకుండా తన స్వస్థతను సంతులతను తిరిగి సమకూర్చుకోగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. శరీరాన్ని తనమానాన తనను వదిలేసినట్లయితే, ఆలోచనలు, ప్రాణికమయిన స్పందనలు, భయాలు, అన్నీ తెలుసుననే భావనలనూ ప్రక్కన పెడితే శరీరం తనను తాను పూర్వస్థితికి తెచ్చుకోవటానికి అవసరమయిన కృషిని అప్రయత్నంగానే చేస్తుంది.

శరీరం తన సహజస్థితిలో సమతనూ, శాంతినీ వాంఛిస్తుంది. మిగిలిన భాగాలే దానిని కలుషితం చేస్తాయి.

అనువాదం: డా॥ సరోజ ప్రసాద్

What is necessary is to enter into oneself, find the immortal consciousness within....

The Mother

చివరి మాట – ఒక యథార్థ గాధ

వాళ్లని వెనకబడిన వాళ్లంటె ఎవ్వరైనా నవ్వివోతారు.

కొన్ని సంవత్సరాల క్రితం సియాటిల్ నగరంలో వికలాంగుల కోసం ప్రత్యేకమైన ఒలింపిక్ క్రీడామహోత్సవాలు నిర్వహించిరి. వందగజాల పోటిలో 9 మంది మానసిక, దైహిక వికలాంగులు పరిగెత్తేందుకు తయారుగా గీతమీద పొంచి వున్నారు.

తుపాకి పేలంగానే ఉవ్వెత్తున, ఎలాగైనా సరే పరిగెత్తి గెలవాలనే ఉత్సాహంతో బయలుదేరారు. కాని ఒక్క చిన్న పిల్లవాడు మట్టుకు పాపం పడిపోయి రెండు గిరికీలు కొట్టి ఏడవటం మొదలుపెట్టాడు.

ఆ ఏడుపు విని మిగతా ఎనమండుగురు వెనక్కి తిరిగి చూసారు. అంతే అతని దగ్గరికి పరిగెత్తుకుని వెళ్లారు. ఒక పిల్ల, Down's Syndrome పీడితురాలు, ఆ పిల్లవాడిని ముద్దుపెట్టుకుని "నువ్వింక నయమయిపోతావులే" అని ప్రేమతో సముదాయించింది. తరువాత ఆ 9 మంది ఒకరి నొకరు చేతులు కలుపుకొని అందరూ కలిసి చివరివరకు పరిగెత్తేరు.

ఆ దృశ్యమును చూసిన ప్రేక్షకులందరు నిలుచోని చాల సేపు చప్పట్లుకొట్టి హర్షధ్వనాలు చేసారు. కొన్ని నిమిషాలు జయ జయ ధ్వానాలతో ఆ స్టేడియమంతా మారుమ్రోగింది. అది చూసిన వాళ్లు ఇప్పటికి ఆ మరపురాని సంఘటనను గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారు.

మన అగాధాలలో మనుషులందరు ఒకటే అని, ఒకరితో ఒకరు చేతులు కలుపుకున్న ఒకే ఆత్మ అని తెలుసుకో. జీవితంలో నువ్వు మట్టుకు నువ్వు ఒక్కడివే గెలవటం అంత ముఖ్యం కాదు. నీ కాలస్యమైనా లెక్కచేయక ఇతరులకు కూడ సాయపడి అందరిని ఉమ్మడిగా గెలిపించాలి. అలా చేయటంలోనే నిజమైన శాంతి, తృప్తి, ఆనందములు కలుగుతాయి.

ఇకనైనా మీ ధోరణి మార్చుకోండి! ఈ సందేశాన్ని నలుగురికి చాటించండి.

అనువాదం: రా. లక్ష్మిప్రసాదమ్మ



Sketch of Daiunji Temple, Japan, by the Mother

జపాన్ కబుర్లు (I) – శ్రీమాత

అఖిల భారత పత్రిక – మార్చి 2001 2002

శ్రీమాత ఎవరు?

శ్రీమాత అసలు పేరు మీరా. ఆమె 1878 ఫిబ్రవరి 21 వ తారీఖున జన్మించింది. తండ్రి పేరు మారిస్ అల్ఫాస్సా. ఆయన ఒక బ్యాంకరు. ఆయన పుట్టింది టర్కీలోని ఆడ్రియానపుల్‌లో. తల్లి పేరు మాథిల్డె ఇస్మాలోన్ (జన్మస్థలం ఈజిప్టులోని అలెగ్జాండ్రియా). వీరు శ్రీమాత పుట్టుకకు ఒక సంవత్సరం ముందు కుమారునితోసహా ఈజిప్టునుంచి ఫ్రాన్స్‌కు వలసవెళ్ళి అక్కడే స్థిరపడ్డారు.

శ్రీఅరవిందులు ఒక శిష్యునితో "శ్రీమాత చిన్నప్పడినుంచే అంతర్గతంగా మనుష్యులను మించి ఉండేది" అన్నారు. శ్రీమాత ఒక సందర్భంలో శ్రీఅరవిందాశ్రమంలోని విద్యార్థులతో, చాలా చిన్నతనంలోనే, తనమీద ఏ విధంగా ఏ శక్తులు పనిచేస్తూ నడిపిస్తున్నాయో తెలుసుకోవటానికి ప్రయత్నించేస్తూ, అంతరంగ అవగాహనను, స్వేచ్ఛను పొందటానికి ఎలా కృషిచేసిందీ వివరించారు. ఆమె మాటలలో "నీకు ఇష్టం ఉన్నా లేకపోయినా ఒకరి చెప్పుచేతలలో నడచుకోవడం చాలా చికాకుపరిచే అనుభూతి. అది ఏవిధంగాను సరి అయినది కాదు. పైగా కనపడనిదేదో, మనని బలవంతంగా తాళ్ళతో గుంజుతున్నట్లుగా, బలవంతపెట్టటం మరీ ఘోరం. ఇది నా స్వవిషయం అవడంతో నేనే ప్రయత్నించి తెలుసుకున్నాను. నేను దీనిని ఐదు ఏళ్లప్పుడే మొదలుపెట్టాను."

మరొక సందర్భంలో ఆమె ఈ విధంగా చెప్పారు. "నాకు 11, 13 సంవత్సరాల మధ్యవయసులో చైత్య, ఆధ్యాత్మిక అనుభవాలు కలిగాయి. భగవంతుడు నిజంగానే ఉన్నాడు; మానవుడు ఆయనతో ఏకమూ అవగలడు; ఆయన పూర్ణచైతన్యానుభూతితో కర్మలనూ చేయగలడు, ఈ భువిమీద దివ్యజీవనంద్వారా ఆయనను అభివ్యక్తపరచడం సాధ్యమేనని తెలుసుకున్నాను."

పదునైదుసంవత్సరాల వయసులో చిత్రలేఖనం నేర్చుకోవడానికి ఆమె ఒక పెద్ద స్టూడియోలో చేరింది. ఆమె తన పనిలో

పూర్తిగా నిమగ్నమైపోయేది. అందుకని ఆమెను తోటివారు 'స్ఫింక్స్' (అంతుచిక్కని వ్యక్తి) అనేవారు. ఆమె ఉద్దేశంలో కళలు, సంగీతం, స్వీయాభివ్యక్తికి ఉపకరణాలు. వాటి ద్వారా లోలోతులకు ప్రవేశించగలరు. అంతరంగంలో దాగివున్నదానిని అభివ్యక్తపరచగలరు.

ఆమెకు సుమారు 30 సం॥ వయసులో ట్లెమ్‌సెన్ (అల్జీరియా) కు ప్రయాణం చెయ్యడం జరిగింది. అక్కడ ఆమె రెండు సంవత్సరాలకాలం పోలెండుకు చెందిన ఒక ప్రవీణుడు మాక్స్ థియోన్, ఆయన భార్య ఆల్మాల దగ్గర గూఢవిద్య (occultism) ను నేర్చుకుంది. వారిరువురూ ఆ విద్యలో నిపుణులు.

శ్రీఅరవిందులను కలవడానికి శ్రీమాత తన 36 వ సంవత్సరములో పాండిచ్చేరికి ప్రయాణం చేసింది. ఆయనను 1914 మార్చి 29 వ తేదిన చూసింది. చూడటమే తడవుగా తనకు అంతరంగంలో చాలా సంవత్సరాలుగా ఆధ్యాత్మిక అభివృద్ధికి మార్గదర్శకత్వం వహిస్తున్న వ్యక్తిగా గుర్తించింది.

పాండిచ్చేరిలో 11 నెలలున్న తరువాత ప్రపంచయుద్ధం మూలంగా ఆమె తప్పనిసరిగా ఫ్రాన్సుకు తిరిగివెళ్ళవలసి వచ్చింది. ఆమెభర్త పాల్ రిచర్డ్‌కు యుద్ధంనుండి పిలుపు వచ్చింది. కాని ఆయనకు త్వరలోనే సైనికోద్యోగంనుండి విరమణ, జపానులో మరో ఉద్యోగమూ దొరికినై. అందుకని రిచర్డు దంపతులు మార్చి 1916 లో 'కామోమారు' అనే ఓడనెక్కి, జూన్ నెల 1916 లో టోక్యో చేరుకున్నారు.

శ్రీమాత, పాల్ రిచర్డ్ జపానులో నాలుగు సంవత్సరాలు (1916 – 1920) ఉన్నారు. దాదాపు మొదటి సంవత్సరమంతా టోక్యోలోను, తరువాతి మూడుసంవత్సరాలు క్యోటోలోను గడిపారు. మధ్య మధ్య చాలా వూళ్లు చూసినా ఎక్కువగా యాత్రాస్థలాలు దర్శించడం జరిగింది. కొద్దికాలం చైనాలో కూడా గడిపారు.

టోక్యోలో వారు డా. ఎస్. ఒఖావా దంపతుల ఇంట్లో ఉన్నారు. ఆ రకంగా వారు మంచిమిత్రులయ్యారు. శ్రీమాత

చాలా త్వరితంగా జపాను జీవనసరళిని నేర్చుకొని, అతిసహజంగా 'కిమోనో' వేషధారణ చేయగలిగారు. డా. ఒఖావా, టోక్యో విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు. ఆయన అందించే కోర్సులలో ఆంగ్లేయులు ఏవిధంగా సామ్రాజ్యవిస్తరణ చేసి కాలనీలు ఏర్పరచారో బోధించేవారు. ఆయన ఇండియాలో స్వతంత్రం కోసం ఉద్యమించిన రాష్‌బిహారి బోస్ వంటివారికి సహాయం చేయడమేకాక ఆశ్రయం కూడా ఇచ్చారు.

40 సంవత్సరాల తరువాత సెప్టెంబరు 1957 లో ఇండియా నుంచి జపాను చూడటానికి వెళ్ళిన డా॥ కె.ఆర్. శ్రీనివాస అయ్యంగార్, ప్రొ. వి.కె.గోకాక్‌లు డా॥ ఒఖావాను కలిసారు. వారి మధ్య జరిగిన సంభాషణలలోని కొన్ని అంశాలను అనుబంధంలో ఇవ్వడం జరిగింది.

క్యోటో నగరం జపాను పురాతన రాజధాని. అక్కడ శ్రీమాతకు డా॥ ఒఖాటాతో పరిచయం ఏర్పడింది. డా॥ ఒఖాటా 'నిశ్చల ఆసనం' (still-sitting) అనబడే ఉద్యమం వ్యవస్థాపకుడు. డా॥ కోబాయషి దంపతులు ఆయనకు సహాయకులు. ఆ సమయంలో శ్రీమాతకు శ్రీమతి కోబాయషితో చాలా సన్నిహిత స్నేహం పెంపొందింది. ఆమెకు, డా॥ అయ్యంగారికి, ప్రొ. గోకాక్‌కు జరిగిన సంభాషణలోని కొంతభాగం అనుబంధంలో ఉన్నది.

శ్రీమాత, పాల్ రిచర్డ్ 1920 లో జపానునుంచి బయలుదేరి 1920 ఏప్రిల్ 24 న పాండిచ్చేరిలో అడుగుపెట్టారు. ఆ తరువాత శ్రీమాత ఇండియాను వదిలిపెట్టలేదు. చాలా సంవత్సరాల తరువాత, ఆమె తాను పాండిచ్చేరికి తిరిగిరావడం గురించి చెపుతూ ఇలా అన్నారు – "అది దుష్టశక్తుల మీద నిశ్చితమైన విజయానికి స్పష్టమైన సూచన."

అనువాదం: డా॥ టి. ప్రసన్న కృష్ణ

శ్రీమాత జపానుకిచ్చిన సందేశాలు

1962

Let the Supreme Beauty be manifest in this land of beauty so close to my heart.

1972

ప్రతి వస్తువును అందంగా తీర్చిదిద్దటంలో జపానుని మించిన దేశం మరొకటి లేదు – ఈ విషయంలో అది ప్రపంచానికి గురువు – తన ఔన్నత్యాన్ని ఎప్పటికి విస్మరించరాదు.

ఆశీస్సులు
శ్రీమాత

జపానులో పిల్లల పెంపకం

జపానులో పిల్లలను చాలా శ్రద్ధగా పెంచుతారు. 'నేటి పిల్లలే రేపటి పౌరులు' అనే నానుడిని అక్షరాలా పాటిస్తారు. పిల్లలను ఎవరూ కొట్టరు, తిట్టరు. ఆ పిల్లలు కూడ ఎంతో బుద్ధిమంతులు. స్కూలు తర్వాత టైం వృథా చెయ్యరు. వాళ్ల పాఠ్య పుస్తకాలేకాకుండా వేరే పుస్తకాలు కూడా చదివి, అనేకమైన కొత్త కొత్త విషయాలను గురించి నేర్చుకుంటారు.

— సంపాదకుడు

చిన్నపిల్లలకి జపానుదేశం స్వర్గమనే చెప్పాలి. అక్కడ పిల్లల్ని ఎంత బాగా చూస్తారో చెప్పలేము. అంత హాయిగా, సంతోషంగా వున్న పిల్లల్ని నేను మరెక్కడా చూడలేదు. అక్కడ పిల్లల్ని అసలు కొట్టరు. భవిష్యత్తులో దేశాన్ని ఉద్ధరించవలసింది వాళ్లే కదా అని వాళ్లను చాలా జాగ్రత్తగా పెంచుతారు. ఇంతటి శ్రద్ధా, ప్రేమలతో పెంచటంవలన వాళ్లు చాల గుణవంతులుగా, ఆదర్శవంతంగా తయారవుతారు. పసిపిల్లలను తల్లులు వీపుమీద గమ్మత్తుగా కట్టుకుంటారు. వాళ్లు రోడ్డుమీద నడుస్తు ఉంటె, ఆ పిల్లలు పెద్ద పెద్ద కళ్లతో నీ వంక ఎంతో కుతూహలంగా చూస్తూ ఉంటారు. ఆ పిల్లలు ఎప్పుడూ ఏడవరేమిటి అనిపిస్తుంది. ఏదైన దెబ్బతగిలి కళ్ల వెంట నీళ్లు వచ్చినప్పుడు తల్లితండ్రులు వాళ్ల చెవిలో ఏదో చెబుతారు. అంతే — వెంటనే ఏడుపు మానేస్తారు. ఆ రహస్యమంత్ర మేమిటో తెలుసా? నువ్వు *సమురాయివి* (యోధుడు) కదూ? అంతే, వెంటనే ఆ పిల్లవాడు ఏడుపుని మింగేసి బుద్ధిగా అయిపోతాడు.

వాళ్లు రంగు రంగుల కిమోనో (పెద్ద చేతుల గౌను) లు ధరించి రోడ్డుమీద హాయిగా ఆడుకుంటూ ఉంటే చూసేందుకు ఎంతో ముచ్చటగా వుంటుంది. సైకిళ్లని, రిక్షాలని తప్పుకుంటూ నవ్వుకుంటు కేరింతలు పెడుతూ పాడుకుంటు ఏవేవో క్రీడల్లో మునిగిపోయి వాళ్ల లోకంలో వాళ్లుంటారు.

కాస్త పెద్దవాళ్లయాక ఫారిన్ బట్టలు ధరించి, నెత్తిమీద టోపి, వీపుమీద సంచీలతో సహా చాల గొప్ప గొప్ప విషయాలను గురించి నేర్చుకోబోతున్నారనే సంతోషంతో వాళ్ల ముఖం వెలిగిపోతూ ఉంటుంది. జపాను పిల్లలకి చదువంటె చాల ఇష్టం. ఇంకా కొత్త కొత్త విషయాలని నేర్చుకోవాలని ఎంతో కుతూహలంగా ఉంటారు. స్కూలు పాఠాలు అయిపోయిన తరువాత వేరే పుస్తకాలు కూడ చదువుతారు. జపాను పిల్లలు పుస్తకాల పురుగులు. టోక్యోలో ఒక వీధి వీధంతా సెకండ్‌హాండు పుస్తకాల షాపులే – ఎప్పుడు చూసినా పిల్లలతోటి కిటకిటలాడుతూనే ఉంటాయి.

వాళ్లకి ఇతర దేశపు భాషలు నేర్చుకోవటమంటె చాల ఇష్టం. విదేశీయులతోటి మాట్లాడేందుకు కొంచెం భయపడినప్పటికి పరిచయం చేసుకునేందుకు ప్రయత్నిస్తారు.

పిల్లలని ఇంత అద్భుతంగా పెంచే దేశం తప్పకుండా అభివృద్ధిచెంది తీరుతుంది. చాలాదూరం వెడుతుంది కూడా.

(ఇది 1917 లో వ్రాసిన వ్యాసము)

అనువాదము: ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి

పిల్లలని అసలు కోప్పడకూడదు. కొట్టకూడదు, తిట్టకూడదు. సరదాకైనా వీపు మీద చరచకూడదు. చెంప ముట్టుకోకూడదు.

*

పిల్లలు మొగ్గల్లాంటి వాళ్లు. సూర్యుని స్పర్శతో పువ్వులెలా విచ్చుకుంటాయో చిన్నపిల్లలు కూడ అలాగే వికసిస్తారు.

శ్రీమాత

స్త్రీలతో ఇష్టాగోష్టి

మాతృత్వం యొక్క మొదటి బాధ్యత గర్భధారణ – తగిన జాగ్రత్తలు తీసుకోవటం. అంటె కేవలం పోషకాహారాలు సేవించి గర్భాన్ని పోషించటమే కాదు. బిడ్డని అందంగాను సర్వవిధాలా ఆదర్శవంతంగాను మలచటం అంతకంటె ముఖ్యమైన విషయం. అందమైన పరిసరాలు అవసరమే. అంతే కాకుండా మనసులో గొప్పభావాలు కలిగివుండటం, మహోన్నతమైన ఆదర్శాన్ని మనసులో మననం చేయటం చాలా ముఖ్యం. అప్పుడు గర్భములోని శిశువు కూడ ప్రభావితమై ఆ మంచి ఆదర్శాన్ని ప్రతిబింబింప జేస్తుంది. అయితే "నేటి ప్రపంచపరిస్థితి ఏమిటి?" అని విచారించినట్లయితే 'ఏం లాభం లేదు' అని పెదిమ విరుచుకోవలసి వస్తుంది. కాని నీ అంతర్వాణిని వినిపించుకున్నట్లయితే మరోలా అనిపిస్తుంది. ఎక్కడో దూరంగా ఇంతకంటె అందమైన ఓ నూతనసృష్టి సంభవించేందుకని పొంచివున్నదేమో అనిపిస్తుంది. సూర్యోదయం ముందరే కదా చీకటి చిక్కనవుతుంది. మనం సహకరించినట్లయితే ఆ శుభసమయం తొందరలోనే రావచ్చు. మరి రాబోవు మానవుడెలా ఉంటాడు? అతని రూపురేఖలు ఏమిటి?

– సంపాదకుడు

పిల్లల పెంపకం అతిముఖ్యమైన విషయం

పిల్లలగురించి ప్రస్తావించటమంటే జపాన్ వనితలకు అతి ప్రియమైన విషయం గురించి మాట్లాడటమే. నిజానికి ప్రపంచంలో మరే దేశంలోను పిల్లలకంత ముఖ్యమయిన, కీలకమయిన స్థానం యివ్వరు. ఇక్కడ వారు సంరక్షణకీ, శ్రద్ధకీ కేంద్రాలు: వారి మీదే భవిష్యత్‌యొక్క ఆశలన్నీ కేంద్రీకృతమై ఉంటాయి. అది సమంజసం కూడా. వీరే జాతిసౌభాగ్యసమృద్ధికి సజీవప్రమాణాలు. అందుకే ఆ దేశంలో స్త్రీలకు యివ్వబడిన అతిముఖ్యమయిన పని పిల్లలను పెంచటం.



మాతృత్వం స్త్రీయొక్క ప్రముఖమయిన పాత్రగా పరిగణించబడుతుందక్కడ. కానీ మాతృత్వంయొక్క అర్థము తెలుసుకున్నప్పుడే అది నిజమవుతుంది. ప్రకృతి ననుసరించి, అజ్ఞానంతో యాంత్రికంగా, కుక్క పిల్లలను పెట్టినట్లుగా, ఈ ప్రపంచంలోకి వాళ్లను తీసుకురావటం మాతృత్వం కానేరదు. నిజమయిన మాతృత్వం సచేతనంగా ఒక ఉనికిని సృజించటం. వికాసం చెందటానికై ఒక శరీరాన్ని ఉపయోగించుకోవటానికి వచ్చే ఒక ఆత్మకు ఇచ్ఛాశక్తితో రూపాన్నివ్వడము. స్త్రీ నిజమైన క్షేత్రము ఆధ్యాత్మికము. కాని మనమీ విషయాన్ని తరచుగా విస్మరిస్తాము.

గర్భధారణ ఓ తపస్సు

గర్భాన్ని ధరించి అచేతనంగా ఒక పిండాన్ని తయారు చెయ్యంగానే సరిపోదు. భావన మరియు ఇచ్ఛాబలంతో ఒక ఆదర్శాన్ని ప్రతిష్ఠించగల ఒక వ్యక్తిత్వాన్ని సృజించగలిగినపుడే నిజమైన కార్యము మొదలవుతుంది.

ఆ విధంగా సాధించే శక్తి మనకు లేదని అనవద్దు. ఈ ప్రభావవంతమయిన శక్తికి ఋజువుగా అనేక ఉదంతాలున్నాయి. ముందుగా భౌతికపరిసరాల ప్రభావం చాలాకాలం క్రిందటనే గుర్తించబడింది, అధ్యయనం చెయ్యబడింది. ప్రాచీన గ్రీకులు స్త్రీలను కళాత్మకము, సుందరము అయిన రూపాలమధ్య ఉంచటంద్వారా నెమ్మదినెమ్మదిగా అసామాన్యమయిన సామరస్యమయిన జాతిని సృజించగలిగారు.

ఇందుకు వ్యక్తిగతమయిన నిదర్శనాలు అనేకము ఉన్నాయి. గర్భవతిగా ఉన్న ఒక స్త్రీ ఒక సుందర చిత్రంవైపు నిరంతరం చూడటంవలన సరిగ్గా ఆ చిత్రాన్ని పోలిన బిడ్డకు జన్మనివ్వటం అరుదుకాదు. నేను కొన్ని సంఘటనలు స్వయంగా చూశాను. వాటిలో నాకు బాగా గుర్తున్నది ఇద్దరు చిన్నపాపలు, వంకపెట్టలేనటువంటి అందమయిన కవలలు. విచిత్రమేమిటంటే వాళ్లకసలు తల్లితండ్రుల పోలికలే లేవు. వాళ్లను చూసినపుడు నాకు పేరుపొందిన ఒక ఆంగ్లచిత్రకారుడు రెనాల్డ్ గీసిన చిత్రము గుర్తుకు వచ్చేది. ఒక రోజు ఇదేమాట ఆ పాపల తల్లితో

అన్నాను. ఆమె ఆశ్చర్యంగా "నిజంగానే కదూ, నేను గర్భవతిగా ఉన్నప్పుడు నా మంచంపైన రేనాల్డ్ గీసిన చిత్రం ఉండేది. రోజూ నిద్రకుపక్రమించే ముందూ. మళ్లీ నిద్రలేవగానే నా మొదటిచూపు ఆ చిత్రంపైనే ఉండేది. నేను మనసులో నా పిల్లల ముఖకవళికలు ఈ చిత్రంలో పిల్లల్లా ఉంటే బాగుండునని అనుకునేదాన్ని. నేను బాగా కృతకృత్యురాలినవడం మీరు చూశారు." నిజంగా ఇది ఆమె గర్వించదగ్గ విషయం. ఆమె ఉదాహరణ మిగిలిన స్త్రీలకు చాలా ఆదర్శప్రాయం.

మాతృత్వం ఎంతో పవిత్రమైన బాధ్యత

భౌతికమైన జడపదార్థంలోనే యిటువంటి ఫలితాన్ని పొందగలిగితే, సంకల్పము, భావనల బలం ఎంతో శక్తివంతమయిన మానసికస్థాయిలో మరింత అనుకూలమయిన ఫలితాలను పొందవచ్చు. మనం నిగూఢమయిన, అస్పష్టమయిన, లోపభూయిష్టమయిన, పారంపరికబంధాలను, పురాతనలక్షణాలను ఎందుకు అంగీకరించాలి? అవి మన అవచేతనలో మనను పోలిన వ్యక్తిత్వంపట్ల ఉండే సంస్కారం మాత్రమే. మనము ఎప్పుడైతే ఏకాగ్రతతో, సంకల్పంతో ఉన్నతాదర్శానికి అనుగుణంగా వ్యక్తిత్వాన్ని నిర్మించి ధారణ చెయ్యగలుగుతామో అప్పుడు మాతృత్వం అమూల్యము, పవిత్రమూ అవుతుంది. ఈ పనిలో మనము ఆత్మయొక్క ఉన్నతకార్యములోకి ప్రవేశిస్తాము. మహిళలస్థాయి పశుత్వంలోంచి మనుష్యత్వంలోకి ఎదుగుతుంది. ఈ ప్రయత్నంలోనే మన నిజమైన బాధ్యత ఉంది. ఎప్పుడూ ఈ బాధ్యతే ముఖ్యమయినది. ఈ పృథ్వి పరిణామములో అత్యంత ప్రాధాన్యత కలిగి ఉన్నది.

కొత్త ప్రపంచం ఆవిర్భవించబోతుంది

మనం ప్రపంచచరిత్రలో ఒక ప్రత్యేకమయిన, అరుదైన మలుపు దగ్గర ఉన్నాం. ఇంతకు మునుపెన్నడూ మానవుడిటువంటి ద్వేషం, రక్తతర్పణం, అస్తవ్యస్తమయిన చీకటిదశలో పయనించి ఉండలేదు. అదే సమయంలో ఇంత తీవ్రమయిన బలమయిన ఆశ ప్రజల మనసుల్లో మేల్కొని

ఉండలేదు. మనం హృదయఘోషని వినగలిగితే మనకి తెలియకుండానే న్యాయం, సౌందర్యం, సామరస్యం, భ్రాతృత్వం, సర్వ శ్రేయస్సు నిండిన ఒక క్రొత్త సామ్రాజ్యంకోసం ఎదురు చూస్తున్నాం. అది ప్రస్తుత ప్రపంచస్థితికి భిన్నంగా ఉంది. ఎవరి మనస్సులు స్వంతానికే కాక, వారి కుటుంబాలు దాటి, వ్యక్తిగత లాభాలు, ప్రాంతీయ సంప్రదాయాల కతీతంగా ఎవరైతే తాము తమ కుటుంబానికి, దేశానికి కాక అన్ని దేశాలలోను సమానంగా అభివ్యక్తమయిన భగవంతునికి చెందుతామని భావిస్తారో వాళ్లు మేల్కొని మానవతకోసం నడుంకట్టాలి.

ఈ తరుణంలో ఈ బహుముఖమయిన కార్యంలో స్త్రీపాత్ర ఏమిటి? సామాన్యంగా ముఖ్యకార్యక్రమాలలో, సందర్భాలలో స్త్రీలను ఒక మూలకు త్రోసివెయ్యటం పరిపాటి. అది వారి వ్యవహారం కాదనీ, బలహీనులనీ ముద్రవేయటం అలవాటు. అణకువగా, పసిపిల్లలా, బహుశా సోమరిలా స్త్రీ అందుకు అంగీకరించి ఉండవచ్చు. కనీసం కొన్ని దేశాలలో ఇలా జరుగుతుంది. ఇది గర్హనీయం. వాళ్లు చేసింది తప్పు అని చెప్పటానికి సాహసిస్తున్నాను. భవిష్యత్తులో స్త్రీపురుషుల మధ్య అటువంటి విభజనకి, అసమానతకీ తావులేదు. నిజమైన సంబంధంలో సమానత, పరస్పర సహకారం, సహవాసం కలిసి ఉండాలి. ఈనాటినుండి మనం వాస్తవమైన స్థానం పొంది మన ప్రాముఖ్యతని, ఆధ్యాత్మిక నిర్మాతగా, గురువుగా గుర్తించాలి. తమకున్న కొద్ది సావకాశాలవల్ల పురుషులు దురహంకారంతో, స్త్రీ బాహ్యమైన బలహీనత (ఇది నిజానికి తప్పనిసరి కాదు) ఆధారంగా తృణీభావంతో చూడటం జరుగుతుంది. వారేమనుకున్నా 'అతిమానస పుత్రునికి' జన్మనివ్వబోయేది స్త్రీయే. అందుకు కేవలం గర్వపడితే సరిపోదు. ముందుగా దాని అర్థం తెలుసుకోవాలి; ఎంత గురుతరమయిన బాధ్యతో గుర్తించాలి; మనఃపూర్వకంగా అందుకు సంసిద్ధమవ్వాలి. ప్రపంచవ్యాప్తంగా ఈ పనిలో మనకి అత్యంత ప్రముఖమైన పాత్ర ఉంది. ముందుగా ప్రస్తుతమున్న అస్పష్టత, అస్త

వ్యస్తం నుండి తేజస్సు, సామరస్యతల వైపుగా రూపాంతరం చెందే మార్గం ఏమిటో మనం అర్థం చేసుకోవాలి.

సృష్టి ఒకే చోట చతికిలబడి ఉండదు. అది గతిశీలి – క్రొత్తరకం జీవులను ఆవిర్భవింపజేస్తూ ఉంటుంది. ప్రకృతిలోని ఈ ప్రేరణవలన చైతన్యవంతులై వ్యక్తులు, జాతులు, సమూహాలు పరిణామగతిని అనుసరిస్తూ, ప్రకృతి సాధించనున్న అద్భుతమైన విజయంలో పాల్గొనెదరు. ఈనాడు ప్రకృతి చేసే ఈ ఘోషను మనం వినిపించుకోవాలి. ఉత్సాహవంతులమై ఈ అద్భుతమైన కార్యక్రమంలో పాల్గొనాలి. పరిణామశక్తులచే ప్రేరేపితులమై, నవ్యపథికులమై, సాహసంతో జయ జయ ధ్వానాలు సలుపుతూ కృతకృత్యులమగు గాక!

స్వేచ్ఛానువాదం: డా॥ ఆర్. సరోజ ప్రసాద్

భవిష్య మానవుడు

భావిమానవుడెలా ఉంటాడు? తెలివితేటలతో ఇంకా పెద్దపెద్ద ఆకాశహర్మ్యాలు, నగరాలు నిర్మించుకుంటాడా? లేక దైవాను భూతి కలిగి, కేవలం ధ్యానంలోనే కాకుండ, జీవితంలో కూడ మనస్సుకంటె ఉన్నతమైన చైతన్యంతో ప్రవర్తిస్తాడా? ఈ మానవమేధకు కాలం తీరిపోయింది. పదార్థము – జంతువులు – మానవులు – ఈ క్రమంలో superman *అనగా అతిమాన వుడు రానున్నాడు. అతనికి మేధతో పనిలేదు. మనిషికి వాన రులవలె చెట్లపై జీవించడం ఎలా అవసరంలేకుండా పోయిందో అలాగే అతిమానవునికి మామూలు మేధ అవసరం పోతుంది. అది పరిణతిచెంది అతిమానసంగా మారుతుంది. మనస్సు తెచ్చిపెట్టిన కలతలు, రోగాలు, యుద్ధాలు, ఇక గతచరిత్రకు చెందిన విషయాలు. సత్యజ్ఞానమనంత జ్యోతులిక కేవలం స్వప్నములు కావు. ప్రత్యక్షంగా అతిమానవుని జీవితానికి చెందిన పరమసత్యాలు.*

– సంపాదకుడు

నేటి మానవునే ప్రమాణంగా తీసుకొని, అతనికే మెరుగులుదిద్ది, అతిశయింపజేయుటద్వారా మనము భవిష్యమానవుని చిత్రీకరించటం తగదు. ఇంతవరకు జరిగిన పరిణామక్రమాన్ని కనుక గమనించినట్లయితే మనమిలాంటి పొరపాటు చేయము.

సృష్టిలో తదుపరి సోపానము

ప్రతి నూతనజీవి ఆవిర్భావమూ, ఒక సరికొత్త ధర్మము, సరికొత్త చైతన్యము, సరికొత్తశక్తుల ఆవిష్కారాన్ని ప్రకటిస్తుంది. ఈ నూతన జీవులు నేటివరకు ఆవిష్కారముకాని నూతనశక్తి చైతన్యాలను పొందినప్పుడు కొన్ని పూర్వపులక్షణాలను కోల్పోవచ్చు. ఉదాహరణకి: వానరానికి, ఆ తరువాత పరిణమించిన (పరిణామంలో దాని దగ్గర చుట్టమైన) మనిషికిగల వ్యత్యాసాలు ఏమిటి? కోతులు ప్రాణిక, శారీరక రంగాలలో సాధించిన ప్రగతిని మనిషి పోగొట్టుకోవటం జరిగింది. ఎత్తైన చెట్లపైకి చకచకా ఎగబ్రాకగలగటం, పిల్లిమొగ్గలు వేయటం, ఈ కొమ్మనుంచి ఆ కొమ్మకు దూకటంలాంటివి మనిషి వదులుకొని, వాటి స్థానంలో తెలివి, హేతువాదం, సమన్వయశక్తి, నిర్మాణాత్మకకౌశలాలను పొందాడు. మానసికశక్తి, తెలివితేటలు భూమిపైకి దిగివచ్చాయి. అయితే మనిషి మానసికజీవిగా మారటంతో ఆతని పురోగమనము ఆగిపోలేదు. మనస్సుకు పైనున్న ఇతరలోకాలు, అతీతశక్తులు, ఇతరచైతన్యస్థాయిలను గురించిన చింతనలు, అతనిలో కలుగుతున్నాయంటే, అవి భవిష్యత్పరిణామంలో ఏవిధమైన మార్పులు రానున్నవో చూపించే సూచనలన మాట.

ఆధ్యాత్మిక మానవుని ఆగమనము

అతికొద్దిమంది మాత్రమే ఆధ్యాత్మిక ప్రపంచంలో జీవించగలిగారు. వారు మామూలు మనుషులు కారు; జాతికి అగ్రగాములుగా ముందుండి నడిపించుటకు, పైలోకాల నుంచి మన మధ్యకి దిగివచ్చిన అవతారపురుషులు. వివిధ యుగాల్లో అవతరించిన వైతాళికులు. భవిష్యత్తులో రానున్న జీవుల ప్రముఖ లక్షణాలు కలిగివున్న వారు .

నేటి మానవుడు హేతుజీవి. తర్కముద్వారా జ్ఞానాన్ని గ్రహిస్తున్నాడు. అతని నిర్ణయాలు హేతువుపై ఆధారపడి తీసుకుంటున్నాడు.

నూతనజాతి అంతర్దృష్టిచే (intuition) (భగవన్నిర్ణయాన్ని నేరుగా తెలుసుకొనుటద్వారా) నడపబడుతుంది. అడవులలో ఉన్న కొన్ని గొరిల్లాల మెదడులో అప్పుడపుడు హేతువెలా మెరుస్తుందో అలాగే కొంతమంది మనుష్యులలో కూడా అంతర్దృష్టి కలుగుతుంది.

నిస్తరంగ మనస్సులో, అంతర్బుద్ధి వికాసము

మానవజాతిలో ఎవరైతే అంతరాత్మను స్పృశించగలిగారో వారిలోనున్న అంతఃసత్యాన్ని కనుగొనుటకై తమ శక్తియుక్తుల్ని వినియోగిస్తున్నారో, అట్టివారికి అంతర్దృష్టి (intuition) కలుగుతుంది. నిశ్చలమైన తటాకము లేదా అమలినమైన అద్దంలో నక్షత్రకాంతి ఎలా ప్రతిబింబిస్తుందో, అలాగే నిరామయమైన మనస్సులోకి అతిమానసతేజము దిగివచ్చుటవలన ఈ శక్తి జనిస్తుంది. నిశ్శబ్దమైన మనస్సులో ఈ విధంగా అంతరాత్మ సందేశాన్ని వినటానికి అలవాటుపడినవారు ఆ సందేశపు ప్రేరేపణతో పురికొల్పబడి నడచుకుంటారు.

నేడు ఎంతో అరుదైన ఈ జ్ఞానం రేపటి మానవునికి ఎల్లప్పుడూ, సహజముగా, సునాయాసంగానే అందుబాటులో ఉంటుంది. ఈ జ్ఞానముపైనే పూర్తిగా ఆధారపడటంతో మానవుని హేతుకౌశలము దెబ్బతినవచ్చు. నేటి మానవుడు కోతికిమల్లె చెట్లెక్కలేడు గదా. అలాగే రేపటి మానవుడు మనస్సుతో ఆలోచించడు. జ్ఞానాన్ని తిన్నగా పొందుతాడు. సత్యాన్ని అవలంబిస్తాడు. సూపర్‌మేన్ అంటే ఇతనే.

భవిష్యత్‌లో సామాజిక జీవితము

ఆ దివ్యమానవుడు తన సామాజిక ప్రమాణాలను కూడా ఏర్పాటు చేసుకుంటాడు. అతనిలో పనిచేస్తున్న ఈశ్వరసంకల్పాన్ని తెలుసుకొని అదే ఇంకొక వ్యక్తిలో కూడ పనిచేస్తుందన్న సత్యాన్ని గ్రహించగలుగుతాడు.

తనలోవున్న అస్తిత్వాన్ని గుర్తించి అదే సర్వత్ర ఉన్నదని తెలుసుకుంటాడు. ఆ విధంగా అందరిలోని ఏకత్వాన్ని జ్ఞప్తి యందుంచుకుంటూ, ఇది ఆంతరంగికముగా పదార్థతత్వాన్ని బట్టి కాకుండా తన బాహ్యాస్థాయిల్లో, జీవితంలో, రూపంలో కూడా అదే ఏకత్వాన్ని గుర్తించగలుగుతాడు. అతడు ఒక మానసికజీవిగా, జీవపదార్థంగా ఒక శరీరంగాగాక ఆత్మచేత, చైత్య పురుషునిచేత పోషించబడుచూ, శాంతంగా నిత్యం నిశ్చలస్థితి పొంది యుంటాడు. ఇదే స్వరూపం అన్నింటిలోనుండి ఆ శరీరం, మనస్సు, జీవితాలను శాసిస్తూ పోషిస్తున్నదన్న జ్ఞానాన్ని అంటి పెట్టుకొని వుంటాడు.

జీవరాసులన్నీ తనే

అతనిలోని పురుషుడే సర్వసృష్టికర్త యని, సమస్త కార్యాలకు మూలకారకుడని విశ్వసిస్తూ అన్నింటిలోను వున్నది అతనేనని, విశ్వమంతా నిండియున్న ఆత్మయనీ ఆ పరమాత్మ ముఖపార్శ్వాలే అని సదా జ్ఞప్తి యందుంచుకొంటాడు. అతని ఎదుటవున్న ప్రతి ఆత్మస్వరూపం విశ్వాత్మక దివ్యత్వాన్ని వెలువరించే ముఖచంద్రికగా తలంచుతాడు. ఈ దివ్యభావనలో తనను లయం చేసుకొని తన మనస్సు, జీవం, దేహం ఆ పరమాత్మకు సమర్పించబడే ఉపకరణాలుగా మాత్రమే నమ్ముతాడు. సమస్తంలోను తన చైతన్యమే పనిచేస్తుందని భావిస్తాడు. ఇతర శరీరాలను కూడ తన శరీరాలుగానే భావించి సమస్తప్రకృతి యందున్న సమన్వయాన్ని, చేతనను ఆవాహనం చేసుకుంటాడు. ఇతరుల హృదయంలోను, మనస్సులోను అతనే ప్రతిబింబించుతూ, తనే వారుగాను, వారే తానుగాను అనుభూతిచెందుతూ, అసలైన పరిపూర్ణ వసుదైకస్థితిని పటిష్ఠపరుస్తాడు.

But we must limit to these indispensable hints our description of the superman, and push no further our attempt to picture him, as we are convinced that any endeavour to be more precise would prove not only vain but useless. For it is not a number of imaginings, more or less

exact, which can help us in the formation of the future type. It is by holding firm in our heart and mind the dynamism, the irresistible impetus given by a sincere and ardent aspiration, by maintaining in ourselves a certain state of enlightened receptivity towards the supreme Idea of the new race which wills to be manifested on earth, that we can take a decisive step in the formation of the sons of the future, and make ourselves fit to serve as intermediaries for the creation of those who shall save Humanity.

స్వేచ్ఛానువాదం: గోదావరి, హర్షవర్ధన్

కళాకారుడికి యోగికి చాలా సన్నిహిత సంబంధమున్నది. చిత్రకారుడు కూడ యోగి వలెనే మనస్సు యొక్క లోతులను దాటి అంతరంగిక అగాధాల్లోకి ప్రవేశిస్తాడు. యోగి జ్ఞానాన్ని పొందుతాడు. కళాకారుడు సౌందర్యసామరస్యాల కోసం శోధిస్తాడు. అంతరంగిక మథనంపొంది కళాజ్యోతిని త్రవ్వి, వెలికితీసి తన నైపుణ్యంతో, ఆవిష్కరింపజేస్తాడు. నిజమైన కళా సృష్టి చేయాల్నంటే అంతశ్చేతనలోకి ప్రవేశించాలి. అక్కడ పొందిన చేతనానుభూతిని (సత్యం, శివం, సుందరం) బాహ్యారూపంలో అభివ్యక్త పరచాలి. అది కూడ యోగమే. ప్రఖ్యాత చిత్రకారుడు లియొనార్డో – డా – విన్సీ ఈ కోవకు చెందినవాడే. అయితే అతను కేవలం చిత్రకళే కాకుండా అనేకమైన ఇతర విద్యలలో కూడ ప్రవీణుడయ్యాడు.

శ్రీమాత



The Mother in Japan



The Mother in Japan

జపాన్ – కళలకు కాణాచి

ఒక దేశపు సాహిత్యము, సంస్కృతి ఆ దేశపు మూలభావాలకి చిహ్నములు. జపాన్ పేరు చెప్పగానే ఆటవస్తువులు, రంగు రంగుల సామాన్లు మన కళ్ళ యెదుట తారాడతాయి. వాళ్ళ వేషభాషలు, నివాసగృహాలు, ఉద్యానవనాలు, ఒకరికొకరు వంద నము చేసికొనేతీరు, జీవనసరళి, ఒకటేమిటి వాళ్ళ జీవిత మంతా ఎడతెగని ఒకే ఒక కళారాధన. – సంపాదకుడు

కళ జీవితంలో ప్రతిబింబించాలి

నిజమైన కళయొక్క ఉద్దేశ్యం సౌంద ర్యాన్ని ఆవిష్కరింపజేయడమే. అయితే ఆ సౌందర్యం ఒక్కొక్క అంశంలోనే కాకుండా విశాలవిశ్వంలోను, అంగాంగంలోనే కాకుండా సర్వాం గీణంగానూ వెల్లివిరియాలి. అందులోని అంతర్గతభాగం కావాలి. గొప్ప గొప్ప దేశాలు, ఎంతో సుసంపన్నమైనసంస్కృతి కలిగిన జాతులు కళను వారి జీవనస్రవంతిలో ఒక భాగంగా నడిపిస్తూ, జీవనానికి అనుసంధానం చేశారు. జపానులో 'కళ' అలాంటి సజీవ, సహజరూపంగా భాసించేది. ఆ దేశపు ముఖ్యసంఘటనల మలుపుల్లో ఆమె ఏవిధంగా రూపుదిద్దుకుందో అవే ఆమె కళా చరిత్రలోనూ ముఖ్యమైన మలుపులుగా గుర్తించబడ్డాయి. ఆ విధంగా కళాసరస్వతి ఆ జాతిచరిత్రతో అవినాభావంతో రూపొం దింది.

కాని చాలామంది కళాకారులు పరాన్నభుక్కులవలె జీవి తపు అంచున నిలిచి ఎదుగుతున్నారు. జీవితం మొత్తాన్ని సమ గ్రంగా స్పర్శించటం లేదు. 'కళ' జీవితంలో దైవంయొక్క స్వరూ పమని, అది జీవితంలో పెనవేసుకొపోవాలని, సృష్టి 'లయ' లో భాగం కావాలని అర్థం చేసుకోవటం లేదు. కళ జీవితంలో అన్నిటా, అంతటా ఇమిడి, సర్వత్రా, అన్ని సంబంధాలలోనూ సత్యాన్ని ప్రకటించ గలగాలి. అది సర్వాన్ని ఇముడ్చుకొని అంత ర్లయగా కలసిపోవాలి. జీవితపు ప్రతికదలిక ఆ సత్యానికి, ఆ

సౌందర్యానికి, ఆ సమగ్రతకు, అభివ్యక్తి కావాలి. అంటే కళ జీవకళ కావాలి. కళ జీవితంలోంచి జీవనంలోకి నడవాలి. ఆ కళ సర్వత్రా వ్యాప్తమైన దైవాంశను ప్రకటించాలి. అదే కళ యొక్క మహోన్నత ప్రయోజనం. అది సౌందర్యమై, సత్యమై, శివమై జీవనలయగా మారి మానవుని కళాతపస్సుకు ఉదాత్తతను చేకూర్చాలి.

సత్యమే సౌందర్యం, సౌందర్యమే సత్యం అని ఓ గొప్ప కవి అన్నట్లుగా (Truth is Beauty, Beauty is Truth).

కళ అంటే కేవలం హస్తలాఘవం కాదు. ప్రతిభ కలిగి ఉండడమూ కళ అనిపించుకోదు. సజీవమూ, సౌందర్యమూ, సౌందర్యభరితమూ అయిన కళ జీవనస్రవంతిలో, ఆ సృష్టిగతిలోని అన్ని కదలికలలోనూ వ్యక్తపరచేదిగా ఉండాలి. అదే కళయొక్క ముఖ్యప్రయోజనం.

> *సౌందర్యమనగా దైవాభివ్యక్తియే*

నిజానికి 'అతిమానసం' (Supramental) యొక్క దృష్టికోణంలోంచి పరిశీలించినా దైవంయొక్క ఎన్నో వ్యక్తరూపాలతోపాటు సౌందర్యం, సమగ్రత చాలా ముఖ్యమైన విషయాలు. అయితే వాటిని విడివిడి భాగాలుగా చూడక జీవితపు పూర్ణత్వంతో కలసి జీవనగతిలో ప్రతిఫలింప చేయాలి. నిజమైన కళ పరిపూర్ణమైనది. అన్నింటిని కలుపుకున్నది. ఆ రకమైన కళ ఒకటి, ఒకటిగా ఉండి జీవనగతిలో పడుగు పేకలా కలసిపోతుంది. ఒకదానితో ఒకటి చేరి ఒక అల్లికగా ఇమిడిపోతుంది.

ప్రాచీన గ్రీకు, ఈజిప్టు దేశాలలోని కళాకృతులలో ఈ రకమైన పరిపూర్ణ అనుబంధాన్ని చూస్తాం. అక్కడి చిత్రాలు, శిల్పాలు, అలాగే అన్నిరకాల కళాకృతులు ఏ కట్టడాలలో ఉంచబడ్డాయో ఆ కట్టడంయొక్క వాస్తుకి అనుగుణంగా తయారుచేయడంతోబాటు వాటిని ఒక నిర్దిష్టమైన ప్రదేశంలో ఉంచడం జరిగేది. ప్రతి అంగమును క్షుణ్ణంగా పరిశీలించి సంపూర్ణసామరస్యంతో అచ్చట ఇమిడిపోయేలా ఉంచడం జరిగేది. జపానులో

కూడా కళపట్ల ఇదే విధానాన్ని అనుసరిస్తారు. నిజానికి ఈ మధ్యకాలందాకా అలాగే ఉంది. ఇపుడు ఈ లాభసాటి వ్యాపారాలు, ఆధునికత, దోపిడీ జరిగాక అక్కడా మారిపోయింది.

జపనీయుల ఇల్లు అద్భుత కళాత్మకపూర్ణత్వానికి ప్రతీక. ప్రతివస్తువు సముచితమైన స్థానంలో ఉంచబడుతుంది. ఏదీ స్థానభ్రంశంచెందదు. ఏదీ ఎక్కువగా ఉండదు. తక్కువగానూ ఉండదు. ఏది ఎలా ఉండాలో అలా ఉంచబడుతుంది. అదే కాకుండా ఆ గృహం ఆ చుట్టూ ఉన్న ప్రకృతిలో, వాతావరణంలో సహజంగా ఇమిడి ఒక విడదీయలేని అంశంగా అమరిపోతుంది. ఇండియాలో కూడా చిత్రకళ, శిల్పకళ, మరియు వాస్తుకళ, ఈ మూడూ ఒక ఏకత్వంతో దైవ ఆరాధనాభివ్యక్తిలో పరిపూర్ణసౌందర్యంగా ఏకమై ఒకే కదలికగా ఉండేవి.

ఇప్పుడు కళ నిపుణతని, తెలివిని, ప్రతిభని వ్యక్తపరచే విధానంగా ఉండి, అది ప్రత్యేక విభాగంగా మాత్రమే తన ఉనికిని కలిగి ఉంటోంది. ఒక గృహంలోని సంపూర్ణత్వంతో సమగ్రంగా ఇమిడి సౌందర్యాన్ని ప్రతిఫలించేదిగా లేదు. జీవితవిధానంలో విడదీయలేని అల్లికగా లేదు.

> *నాట్యమనగా భావము యొక్క బహిర్వ్యక్తీకరణ*

ఈ ఆధునికులు నాట్యాన్ని ఎలా తయారుచేశారో చూడండి. గత కాలంతో పోల్చిచూస్తే తెలుస్తుంది ఈ మార్పు. ఒకప్పుడు నాట్యం ఉన్నత ఆంతరంగిక జీవితాన్ని వ్యక్తపరచేది. ఆ నాట్యం ధార్మికమైన విషయాలతో ముడిపడి, పవిత్రకార్యాలలో, ఉత్సవాలలో, పండుగలలో దైవారాధనలో ఒక ముఖ్యాంగంగా కలసిపోయింది. కొన్ని దేశాలలో నాట్యం, సౌందర్యాన్ని అద్భుతమైన పరిపూర్ణత్వాన్ని సంతరించుకుని ఉన్నతశిఖరాన్ని అధిరోహించింది. జపనీయులు నాట్యాన్ని ధార్మికజీవనంలో భాగంగా ఉండే సంప్రదాయాన్ని పాటిస్తారు. ఎందుకంటె సౌందర్యమూ, కళ వారి జీవితంలో, జీవనవిధానంలో చాలా ముఖ్యమైన విషయాలు. అది వారి ఉపాసన. అందుకే ఆ కళ దిగజారిపోకుండా, దాని ప్రాముఖ్యం తగ్గ

కుండా, పరిమితమైన ప్రయోజనాలకోసం వాడకుండా జాగ్రత్త పడతారు. భారతదేశంలోనూ అదే విధానం అనుసరిస్తారు.

ఈ కాలంలో ప్రాచీన గ్రీకు, మరికొన్ని ఇతర నాట్యాలను పునరుద్ధరింపచేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాని ఆ నాట్యాలు దైవారాధన బదులు కేవలం లయబద్ధమైన వ్యాయమంగా (rhythmic gymnastics) మార్పుచెందుతున్నాయి. అది పవిత్రమైన నాట్యం అని ఏమాత్రం అనిపించుకోదు.

అనువాదం: డి. సత్యవాణి

కళాకారుడంటే ఎవరు?

కళ అనేది ఏ ఒక్క ప్రత్యేక రంగానికి చెందినది కాదు. ఏదైనా అందమైన వస్తువును తయారుచేయువాడు కళాకారుడు. భాషా ప్రపంచంలో అందమైన శబ్దములతో రమణీయ వాక్సంపన్నతా మహిమచే ఒక భావమును ప్రకాశింపజేయుట కళయే. జపాను వారికి తోటలంటే పిచ్చి. చెట్లని అందంగా పెంచి ఒక అందమైన దృశ్యమేర్పరచుట వారి ప్రత్యేకత. కొన్ని కొమ్మలు త్రుంచి, మరికొన్నిటిని వంచి వాటినెంతో అందంగా మలుస్తారు. ఆ విధంగా చెట్లతో చిత్రవిచిత్రమైన ఆకృతిని తీర్చిదిద్దేవాడూ కళాకారుడే. ముఖ్యంగా ఒక చెట్టుకు ఈ కొమ్మ కత్తిరించి, ఆ కొమ్మను పొడిగించి అందంగా పెంచటమంటే వారికెంతో ఇష్టం. అంతేకాదు. ఆ చెట్టు అక్కడి పరిసరాలతో కలసిపోయి సహజ సౌందర్యాన్ని ఇనుమడింపచేయాలి. చెట్లని చిత్రవిచిత్రమైన ఆకారాలుగా మలచి ఆ ప్రదేశానికి ఓ వింతసౌందర్యాన్ని సంతరింపజేస్తారు. ఒక తోటలో సరిగ్గా ఎక్కడైతే అవసరమో అక్కడ ఒక చెట్టును పెంచి, ప్రత్యేక ఆకారాన్నిచ్చి ఆ ప్రదేశాన్ని రమణీయంగా ఎంతో మనోహరమైన దృశ్యంగా తయారుచేస్తారు. ఆ మనిషిని తోటమాలి అనేదానికంటె కళాకారుడంటె బాగుం

టుంది. కళాపిపాసులు, రసదృష్టికలవారు ఏ రంగంలో అయినా తమ కళానైపుణ్యంతో రసతన్మయత్వాన్ని కలగజేయగలరు.

అనువాదం: ఆర్.ఎల్.ఎన్ శాస్త్రి

జపాన్ – ప్రకృతిశోభ, కళలు, జీవితము

ఒక్కొక్క జాతికి ఒక్కొక్క ప్రధానధర్మ ముంటుంది. ప్రాచీన గ్రీసుజాతికి భౌతికసౌందర్యం, భారతదేశానికి ఆధ్యాత్మికత. దానినే ఆ దేశప్రజలు వారి వేషభాషల్లోను, ఆచారవ్యవహారా ల్లోను వెలయింపజేసుకుంటారు. జపనీయులు సౌందర్యోపాస కులు. వారి ప్రతికదలికలోను, జీవితంలోని ప్రత్యంశంలోను ఆ భావమునే వెలయింపజేస్తారు. ఏ పని చేసినా అంతర్వాహినిగా అట్టి భావము స్ఫురించాల్సిందే. వారి కళాభిరుచిని ఏ విధంగా జీవితంలో ప్రతిబింబింపజేస్తారో చూద్దాం. – సంపాదకుడు

ప్రశ్న: జపాన్‌వారి చిత్రకళకూ, ఐరోపాదేశీయులు లేక యితరుల చిత్రకళకూ తేడా ఏమిటి?

జపనీయుల కళాభిరుచి బాహ్యావస్తువును కేవలం మనోనే త్రంతో వీక్షించి చిత్రీకరించడం జపాన్‌వారి పద్ధతి. వారికి ప్రాణికదృష్టి (vital) తక్కువ. వారి జీవితంమాదిరిగానే వారి కళారంగం కూడా మనోమయంగా ఉంటుంది. మనస్సులో ముందుగానే నిశ్చయించుకొని దాన్ని యథాతథంగా చిత్రీకరిస్తారు. బాహ్యజీవితంలోమాత్రం వారి సౌందర్యభావన స్వతస్సిద్ధంగా ఉంటుంది. యూరప్‌లో ఎంతో అరుదుగా చూడగలిగినవి ఇక్కడ వారు నిత్యం దర్శించుకుం టారు.

కార్మికులు, రైతులు వంటి సాధారణప్రజలు కూడా విశ్రాంతికోసమైనా, ఆహ్లాదంకోసమైనా చక్కని ప్రకృతిరమణీ యత ఉన్న స్థలానికి వెడతారు. యూరప్‌లో మాదిరి పేకాట

వంటి సరదా కార్యక్రమాలకి వెళ్ళరు. ఒక్కొక్కసారి బృందాలుగా కూడి అందరూ కలిసి రైలో, ట్రాముబండియో ఎక్కి కొంతదూరం వెళ్లి అక్కడనుంచి కాలినడకన రమణీయ దృశ్యాలు కనబడే చోటికి నడిచి వెడతారు. వెళ్ళినచోట అక్కడున్న ప్రకృతికి తగినట్లుగా ఒక చిన్న ఇల్లు, దానినానుకొని విశ్రాంతిగా కూర్చోటానికికొక అరుగు కనిపిస్తాయి. అక్కడ కూర్చొని టీ సేవిస్తూ దానితోబాటుగా అక్కడి రమణీయతను ఆస్వాదిస్తారు. వారికి అంతకు మించిన సరదా వేరేమీ ఉండదు. అదే వారికి పరమానందము. కళాకారులు, విద్యావంతులు, పండితుల సంగతి అలావుంచి సాదాసీదా సగటుమానవులు సహితము ఈ ప్రకృతి ఆనందాన్ని మనసారా కోరుకుంటారు. ఇంట్లో కూర్చొని విశ్రాంతి తీసుకున్న దానికంటె కూడ ఇదే వారికి యిష్టం.

పర్యాటన ప్రదేశాలు

జపాన్‌దేశంలో ఒక్కొక్క ఋతువుకు ఒక్కొక్క స్థలం ప్రసిద్ధి పొందుతుంది. అక్కడ మేపుల్ వృక్షాలు చాలా ఎక్కువ. వీటి ఆకులు శరత్కాలం వచ్చేసరికి మిరుమిట్లుకొలిపే ఎరుపువర్ణంలోని అనేక ఛాయలకు మారి అద్భుతంగా ఉంటాయి. ఒక ఎత్తైన కొండ మీద ఒక గుడి ఉంటే ఆ కొండ చుట్టూ ఈ వృక్షాలను నాటుతారు. అవి శరదృతువు వచ్చేసరికి ఎర్రని ఆకులు కొండంతా పరిచినట్లు దిగ్భ్రాంతిని కలిగిస్తాయి. ఎర్రని చెట్ల మధ్యగా కొండ మీదకు వెళ్లటానికి వేసిన మెట్లు నిచ్చెనలాగా కనిపిస్తాయి. ఆ కొండ చాలా ఎత్తుగా ఉండటంవల్ల కిందినుంచి చూస్తే పైభాగం కనిపించకుండా ఆకాశానికి వేసిన నిచ్చెన మాదిరిగా అచ్చెరువు కొలుపుతుంది. ఇక ఆ మెట్లెక్కుతుంటే ఇటూ అటూ ఎర్రని ఆకులు, వాటి మధ్యన పరుగులు పెడుతున్న పిల్లమేఘాలు వారిని రంజింపచేస్తాయి. కళాకారులు అక్కడికి వెళ్ళారంటే లోకాతీతమైన అపూర్వసౌందర్యభావనలో ఉబ్బితబ్బిబ్బు అవక తప్పదు. అయితే అక్కడ ఎక్కువగా కనిపించేది పసిపిల్లల్ని మోస్తున్న తల్లులూ, పిన్నలూ, పెద్దలూ కలిసి వెడు

తున్న బృందాలు. వారు శరదృతువులో దాన్ని దర్శిస్తారు. వసంతంలో ఇంకొక చోటకు వెడతారు.

రంగురంగుల పువ్వులతో కన్నుల విందు

టోక్యో నగరానికి దగ్గర్లో ఒక చిన్న ఉద్యానవనముంది. దాన్నిండా చిన్న చిన్న కృత్రిమ సెలయేళ్ళు, వాటి పక్కన రంగురంగుల పూలుపూసే ఐరిస్ మొక్కలు కనువిందు చేస్తాయి. ఈ ఐరిస్ మొక్కలను రంగుల వారీగా నాటి పెంచుతారు. ఇక ఆ వనం ప్రవేశించగానే జిగేల్ మంటున్న ఆ రంగుల మెరమెరలకు కళ్ళు మిరుమిట్లు కమ్మవలసిందే. కనుచూపుమేరలో ఎటు చూచినా రాసులు రాసులుగా రంగులు పరిచినట్లుంటాయి. ఇక వసంతఋతువు ప్రవేశిస్తోందనగానే చెర్రీలు పుష్పించడం మొదలుపెడతాయి. అవి తెలుపుతో మొదలుపెట్టి గులాబి, ముదురు గులాబిదాకా వివిధ ఛాయలలో పూస్తాయి. వీటిని పళ్లకోసం కాకుండా పూలకోసమే నాటుతారు. ఇక బాటల కిరుప్రక్కలా గులాబిరంగు పూలతో అంచు కట్టినట్లుంటాయి. కొన్ని పెద్ద పెద్ద వృక్షాలు పూర్తి గులాబి రంగులో కనిపిస్తాయి. ఇంకా ఈ చెర్రీలతో నిండిపోయిన పర్వతాలనేకం ఉంటాయి. అక్కడ ఉన్న చిన్న సెలయేళ్ళపై ఎర్రని లక్కరంగు వంతెనలు కడతారు. ఆ గులాబిరంగు పూలపందిరి మధ్యన లక్కరంగు వంతెనలు, కింద జలజల పారుతున్న పెద్ద నది, ఆకాశాన్నంటుతున్నట్లున్న పెద్దపర్వతం – ఈ కనువిందు నందుకోటానికి వసంతఋతువులో జనాలు అక్కడికి పరుగెడతారు. ప్రతిఋతువుకీ ఒక ప్రత్యేక పుష్పం, ప్రతి పుష్పానికీ ఒక ప్రత్యేకమైన ఉద్యానవనమూ అక్కడి ప్రత్యేకత.

ఇంట్లోంచి బైటికి వెళ్లి ఆనందిస్తారు

ఇక జనం పక్కింటికెళ్ళినంత తేలిగ్గా రైలు ప్రయాణాలు చేస్తారు, చేతిలో ఒక జతబట్టలు మాత్రం పట్టుకెడతారు. దాంతో సరిపెట్టుకుంటారు. కాళ్ళకు నారతోనో, తాళ్ళతోనో తయారైన పాదరక్షలు వాడతారు. పాడైపోయినప్పుడవి పారేసి కొత్తవి కొనుక్కుంటారు. వాటి ధర చాలా తక్కువ.

కాగితం రుమాళ్ళు వాడి ఎక్కడివక్కడ పారేస్తారు. అనవసర మైన మోతబరువులు పెట్టుకోరు. వారి జీవనవిధానమే అంత. రైలుస్టేషన్‌లలో భోజనం చిన్న చిన్న చెక్కపెట్టెల్లో అమ్ముతారు. ఆ భోజనం శుచిగా శుభ్రంగా ఉంటుంది. లోపలున్న చిన్న చాప్‌స్టిక్స్‌తో భోజనం చేసి వాటినక్కడే వదిలేస్తారు. అంతేకానీ వాటిని దాచిపెట్టుకోవాలనుకోరు. అది వాళ్ళ పద్ధతి.

చెట్లను అందంగా పెంచుతారు

పార్కులు, తోటలు ఉంటే వారు వెళ్ళి చెట్లు నాటుతారు. అది కూడా ఎక్కడంటే అక్కడ కాకుండా ఎక్కడ పాతితే అది పెరిగి పెద్దదై అక్కడి ప్రకృతిని శోభింపచేస్తుందో అక్కడే నాటుతారు. ఒక రూపాన్ని మనస్సులో పెట్టుకొని అది వచ్చేటట్లు ఆ చెట్టును కత్తిరించి, తగిన దోహదక్రియలు చేసి తీర్చి దిద్దుతారు. అక్కర్లేని కొమ్మలు కత్తిరించేసి, మిగతావాటిని పోషణ చేసి పెంచి సర్దుబాటు చేస్తారు. ఈ విధంగా చేయటంవల్ల అద్భుతమైన ఆకారాల్లో ఉన్న చెట్లు చూపరులను ఆకర్షిస్తాయి. ఆ దరిదాపుల్లో ఒక ఇల్లు ఉందనుకోండి. అది అక్కడి పరిసర దృశ్యాలతో ఇమిడిపోతుంది. జుగుప్సాకరంగా ఉండదు. దాని రంగు, నిర్మాణసామగ్రి అంతా కూడా అక్కడి దృశ్యానికి తగినట్లుంటుంది. అంతేకానీ యూరప్‌లో మాదిరి దృశ్యాన్నంతటినీ భంగపరిచేటట్లుండదు. సరైనచోట సరైన ఆకృతిలో ఉంటుంది. ఒక పెద్ద వృక్షం, దరిదాపున లతాగుల్మాలు, చెట్లు, వాటి వెనుక దాగినట్లుగా ఇల్లుంటుంది. జపాన్‌వారి దగ్గర్నుంచి అన్నీ నేర్చుకోవలసినదే. ఒక కళాకారిణిగా ఒకదాని తర్వాత ఒకటిగా అనేక అద్భుతాలను తిలకిస్తూ నాలుగుసంవత్సరాల కాలం గడిపాను.

ప్రతి ఇంట్లోను అందమైన చెట్లు

టోక్యోనగరం ప్రపంచనగరాలన్నిటిలోకీ, లండన్‌కంటే గూడా పెద్దది. అది దూరదూరాలకి విస్తరించి ఉంటుంది. ఇప్పుడంతా ఆధునిక భవనాలతో క్రిక్కిరిసి ఉన్నప్పటికీ నేనక్కడున్నప్పుడది పాతఅందాలతోనే ఇంపుగా ఉండేది. ఆ రోజుల్లో నగరశివార్లలోని నివాసగృహాలన్ని చిన్నగా రెండుఅంతస్తులు

మించకుండా, ఇంటి ముందు పూతోటలతో ఒకటి రెండు పెద్దవృక్షాలతో కళకళలాడుతూండేవి. అక్కడ నుంచి వాహ్యాళికి వెడితే మాత్రం తిరిగి ఇల్లు వెతుక్కోవడం కష్టమే. అక్కడ తిన్ననైన వీధులుగానీ, ఇటూ అటూ వరుసవారీగా ఇళ్లుగాని ఉండవు కాబట్టి తేలికగా దారి తప్పిపోతారు. దారితప్పి ఇటూఅటూ తిరుగుతూ ఎక్కడో ఒక మలుపు తిరిగితే స్వర్గద్వారం తెరిచినంత అనుభూతి కలుగుతుంది. ఆ అద్భుతమైన వృక్షాలూ, రమణీయపరిసరాలూ, వాటి మధ్య అందమైన దేవాలయం, ఇక ఏం కావాలి? అక్కడ ట్రాఫిక్‌రొద, ట్రాముమార్గాలు వంటి నగరఛాయలేమీ కనిపించవు. ఒక చక్కటిచోటు – సౌందర్యం రాజ్యమేలుతున్నట్లుంటుంది. నీవక్కడికి ఎలా వెళ్ళావనే విషయం నువ్వూహించలేవు. నీ అదృష్టమే నిన్నక్కడికి తీసుకెళ్ళిందనుకుంటావు. సరే కొన్నాళ్ళైనాక మళ్ళీ ఆ ప్రదేశానికి వెళ్ళాలంటే వెళ్ళలేవు. అది మాయమైపోయినట్లే. ఇది అక్కడ సర్వసాధారణంగా జరిగే విషయమే.

వాళ్ల కథలు తమషాగా ఉంటాయి

అక్కడ కథలు కూడా ఇటువంటివే. వారి సాహిత్యంలో జానపదగాథ లెక్కువ. ఒకానొక రాకుమారుడు దారితప్పి ఒక అద్భుతప్రదేశానికి చేరుకుంటాడు. అక్కడ కిన్నెరకింపురుషులవంటి వారు తిరుగుతూంటారు. అతను వారితో అక్కడి చిత్రవిచిత్రపుష్పాల మధ్య, సంగీతమాధుర్యాలతో కాలక్షేపం చేస్తాడు. మర్నాడు అక్కడి రివాజు ప్రకారం అతను తిరిగి వెళ్ళిపోతాడు. మళ్ళీ తిరిగి అక్కడికి రావాలనుకుంటాడుగానీ రాలేడు! అది ఎక్కడుందో కనబడితే గదా! మాయమైపోయింది! అక్కడ ప్రతిదీ అంతే. ఇవాళ చూసింది రేపు కనబడదు. ఆ దేశంలో ప్రతిదీ అశాశ్వతంగానూ, ఆశ్చర్యంగానూ, అపురూపంగానూ కనిపిస్తాయి. ఎన్నడూ అనుకోనివి నీకు తటస్థపడతాయి. వాటికోసమని మళ్ళీ ప్రయత్నిస్తే అదృశ్యమవుతాయి. దానికి ప్రత్యామ్నాయంగా అంతటి మనోజ్ఞమైంది ఇంకొకటి

కనిపిస్తుంది. కళాభిరతిలోను, సౌందర్యాభిలాషలోను ఇంతటి సుందరమైన దేశం వేరొకటి లేదు.

వాళ్ల సమాజం, సంస్కృతి

నా నాలుగు సంవత్సరాల జపాన్ కథనం ముగించే ముందర ఒక విషయం చెప్పక తప్పదు. ఆ దేశంలో ఆధ్యాత్మికము సున్న. కానీ వారి నైతికస్ఫూర్తి అద్భుతమైంది. కఠినమైన సంఘనియమాలను పాటిస్తారు. వారి జీవనంలో ప్రతి చిన్న విషయానికీ రీతి రివాజులుంటాయి. భోజనం ఏ విధంగా చేయాలో, ఏ విధంగా చేయకూడదో, ఏ విధంగా తలవంచి వందనం చేయాలో, ఏది చేయకూడదో, ఏమి మాట్లాడాలో మొదలైనవన్నీ పాటించాలి. అంతేకాకుండా కొంతమందితో మాట్లాడేటప్పుడొక పద్ధతిలోనూ, మరికొందరితో మాట్లాడేటప్పుడు ఇంకొక పద్ధతిలోనూ మాట్లాడాలి. అది ఎలా ఉంటుందంటే ఏదైనా కొంటానికి వెళ్ళినపుడు వారితో చెప్పే పద్ధతిలో చెప్పకపోతే ఎవ్వరూ కదలరు. నీకు కావలసినది ఇవ్వరు. అప్పుడు సరిగా ఏం మాట్లాడాలో అది చెప్పావంటే వెంటనే నీకు రాచమర్యాదలు చేసి నీ పని చేసి పెడతారు. అక్కడి వ్యవస్థ అలాంటింది. అద్భుతమైన మేధస్సును సంపదనూ కలిపి వ్యవస్థీకరించిన ప్రదేశమది అనే ఆలోచనతప్ప ఇంకో భావము కలగదు. వారి శక్తి అపారము. వారి ప్రాణికభాగమంతా శక్తిమయమే. వారికి అసాధారణమైన ఓరిమి ఉన్నదికాని ఆకాంక్ష లేదు. ఎవ్వరైనా సరే నియమానుసారం నడవాల్సిందే. నియమోల్లంఘన చేస్తూ యూరప్‌లో ఉన్నట్లుంటే వారిని పిలవని పేరంటానికి వచ్చిన మోటువారి కింద జమకడతారు. అందువల్ల జపాన్‌లో ఉండదలచుకుంటే వారి మాదిరిగానే నడచుకోవాలి. అలా లేకపోతే వారి కిష్టముండదు కాబట్టి వారితో ఏ విధంగాను కలవలేవు. వారింట్లో ఉన్నప్పుడు వారి ప్రత్యేకపద్ధతిలోనే జీవించాలి; ప్రత్యేకపద్ధతిలోనే వారి కభివాదం చెయ్యాలి. మా జపాన్ మిత్రునిగురించి మీకు చెప్పే ఉంటాను. అతను మాతో కలిసి పల్లెపట్టున ఉండేవాడు. చైత్యపురుషుని సంస్పర్శను ఏవిధంగా పొందాలో నేనతనికి నేర్పించాను. అతను తాదాత్మ్యాన్ని, మిరు

మిట్లుగొలిపే ఆత్మసాక్షాత్కారాన్ని పొందగలిగాడు. ఆ మర్నాటి నుంచీ కనుపించటం మానేశాడు. తర్వాత ఎప్పుడో పట్నంలో అతను కలిసినప్పుడడిగాను. "ఇన్నాళ్ళూ ఏమైనావు. ఎందుకెళ్ళి పోయావు" అని. దానికతడు "ఏం చేయను? నా ఆత్మను తెలుసుకున్నాను. అది చాలా బలవత్తరమైనశక్తి అని కూడ తెలిసింది. అది నా దేశంపైనా, నా రాజుపైనా నాకుండే విశ్వాసానికంటే అతిశక్తివంతమైంది. నేను దానికి కట్టుబడి ఉంటే నా చక్రవర్తిపై విశ్వాసం ఉంచుకోలేను. అందువల్ల పారిపోయాను" అన్నాడు. ఇది యథార్థ గాథ!

శ్రీమాతకు గోచరించిన దృశ్యాలు

ఆ రోజు మనం జపానుదేశపు రమణీయదృశ్యాలనుగురించి మాట్లాడుకున్నాము గదా! వాటన్నిటినీ, ఇంచుమించు అతిసుందరమైన దృశ్యాలన్నిటినీ నేను ఫ్రాంసులో ఉండగానే దర్శించాను. అప్పటికి నాకు జపాన్ అంటే ఏమీ తెలియదు. ఫొటోలుగానీ, బొమ్మలుగానీ చూడలేదు. అయినప్పటికి అంతర్నేత్రంతో వాటిని చూడగలిగాను. మనుషులు మాత్రం కనుపించలేదు. అయితే అవన్నీ మన లోకానికి సంబంధించినవి కావనీ ఇతర లోకాలలోనివనీ అనుకున్నాను. అంతసుందరమైనవి, అంత అందంగా తీర్చిదిద్దినట్లున్నవి ఇహలోకానివని అనుకోలేకపోయాను. ముఖ్యంగా అక్కడ ఒక కొండమీదకు ఆకాశానికి వేసిన నిచ్చెన మాదిరిగా వెడుతున్న మెట్లు పదే పదే నాకు కనిపిస్తూండేవి. స్వప్నంవంటి ఆ దృశ్యంలో ఆ మెట్లు అలా, అలా సూటిగా పైకి అనంతంగా ఎక్కిపోతున్నట్లు అనిపించేది. జపాన్‌లో వాటిని ప్రత్యక్షంగా దర్శించినప్పుడు నాకు ఫ్రాంసులోని స్వప్నదృశ్యం గుర్తుకు వచ్చింది. అప్పట్లో జపాన్ సంగతి తెలియకపోవటంవల్ల ఆ దృశ్యాలు ఏవో లోకాలకు సంబంధించినవనుకున్నాను. నిజంగా ఉన్న వాటినే దర్శిస్తున్నానని తెలుసుకానీ అంత అద్భుతమైనవి భూలోకంలోనే ఏదో ఒక దేశంలో ఉంటాయని ఊహించలేదు. అది అసాధ్యమనుకున్నాను.

స్త్రీలు – యుద్ధము

('ఫుజీషింబున్' అనే జపనీస్ పత్రికలో 7-7-1916 న తొలిసారి ప్రచురించబడింది)

నిజానికి స్త్రీపురుషుల మధ్య మనం అనుకున్నంత భేదం లేదనియు, పురుషులు చేసే పనులన్ని సమర్థవంతంగా స్త్రీలు కూడ చేయగలరనియు ఇప్పుడు స్పష్టంగా తెలిసిపోయింది. స్త్రీలనగా కేవలం పిల్లలను కనే యంత్రాలు కారు. ముఖ్యంగా సంస్థల నిర్వహణలో వారెంతో నిపుణులని కూడ రుజువయింది. యుద్ధంలో మగవారు అసంభవమని కొట్టిపారేసిన కఠినకార్యములనుకూడ వారెంతో చాకచక్యంగా నిర్వహించారు. ఇక రాజ్యాంగవ్యవహారాల సంగతంటారా పురుషులు ఈ రంగాన్ని ఎంత అధ్వాన్న పరచారో మనం చూస్తూనే ఉన్నాము. మగవారి స్వార్థపరత్వంవల్ల స్త్రీలకి ఇందులో అవకాశం కల్పించుట లేదు. కాబట్టి ఈ విషయాన్ని గుర్తించి, స్త్రీలకు కూడ సమాన అవకాశాలు కల్పించి, ఇరువురు పరస్పరపూరకాలుగా ఉన్నప్పుడే మానవాళి అధికమైన మనుగడను సాధించగలదు.

– సంపాదకుడు

మహిళోద్యమం గురించీ, ప్రస్తుత యుద్ధంవల్ల దానిమీదకలిగే ప్రభావం గురించీ నా అభిప్రాయాలు అడిగారు.

> *ఇద్దరూ పరస్పర పూరకాలే*

యుద్ధం ఈ సమస్యని ఒక కొత్త కోణంలోంచి చూపించింది. స్త్రీపురుషులమధ్య నిరంతరం ఉండే వైరుధ్యం నిష్ప్రయోజనమని తేటతెల్లం చేసింది. యుద్ధంవలన ఏర్పడిన ఈ విపరీతపరిస్థితి, వైరుధ్యం బాహ్యాంశాలకే పరిమితమనీ, ఎల్లవేళలా బయటికి కనబడకపోయినా, వీరి మధ్య నిజమైన పరస్పర సహకారం ఉందనీ, ఇరువర్గాలు ఒకే మానవతలోని పరస్పరపూరకాలేననీ ఎత్తి చూపించింది.

స్త్రీల విశిష్ట సామర్థ్యము

యుద్ధానికి ముందు పురుషులు అలంకరించిన అనేక పదవులని మహిళలు ఎంతో సునాయాసంగా చేపట్టడం వారిని (పురుషులని) ఆశ్చర్యపరచింది. దీనికి తోడు, తమ కార్యసాధనకి, తమ ఉద్యమాలకి ఒక చక్కని సహచారిణిగా స్త్రీని గుర్తించకుండా ఇన్నాళ్ళూ ఎక్కువగా ఆమెని కేవలం ఒక విలాసవస్తువుగానో, గృహిణిగానో, తమ పిల్లల తల్లిగానో మాత్రమే పరిగణించామే అన్న విచారం కూడా కలిగింది. ఎన్నో విశిష్టమైన గుణాలు ఉండబట్టే స్త్రీ ఈ బాధ్యతలని సమర్థవంతంగా నిర్వర్తిస్తుంది. కానీ, స్త్రీసామర్థ్యం కేవలం వాటికే పరిమితం కాదని నేటి పరిస్థితులు చక్కగా రుజువు చేశాయి.

యుద్ధరంగంలో వారి ప్రావీణ్యత

శత్రువుల దాడిని లెక్కపెట్టకుండా, భౌతికంగా ఎంతో క్లిష్టమైన పరిస్థితులలో క్షతగాత్రులకి సేవలందించడానికి వెళ్లడంతో, ఇన్నాళ్ళూ అబలలనబడ్డ వారే తాము శారీరక శక్తిసామర్థ్యాలలోనూ, సహనంలోనూ పురుషులకి ఏమాత్రం తీసిపోరని రుజువు చేశారు. వీటన్నిటికంటే చెప్పుకోదగినదేమిటంటే, స్త్రీలు కార్యనిర్వహణరంగంలో తమ అసాధారణ నైపుణ్యాన్ని రుజువు చేసుకున్నారు. అలనాడు మహమ్మదీయుల ఆక్రమణకి ముందే, భారతదేశంలో స్త్రీలకున్న ఈ కార్యదక్షత గుర్తించబడింది. అప్పట్లో 'ఆడవారి చేతిలో సంపద అభివృద్ధి చెందే సంపద' అన్న లోకోక్తి కూడా ప్రసిద్ధి కెక్కింది. కానీ పశ్చిమదేశాలసమాజాన్ని సెమిటిక్ సాంప్రదాయన్ననుసరించిన (సెమిటిక్ అంటే హిబ్రూ, అరబిక్, అస్సీరియన్ దేశాలు) రోమన్ చట్టం ప్రభావితం చేయడంవల్ల అక్కడ స్త్రీలకి కార్యనిర్వహణలో తమ సామర్థ్యం చూపించే అవకాశం రాలేదు.

ఫ్రాన్సులో మనకి స్త్రీలే ఆర్థికవ్యవహారాలతో సహా తమ ఇంటి వ్యవహారాలన్నింటిమీద పెత్తనం సాగించడం తరచు కనిపిస్తుంటుంది. అందుకేనేమో అక్కడ మధ్యతరగతివారు సంపన్నులు. అయినప్పటికీ ఇప్పటివరకూ ప్రాముఖ్యతగల ఏ కార్యక్ర

మానికీ ఈ మహిళల శక్తిసామర్థ్యాలని ప్రత్యక్షంగా ఉపయోగించింది అరుదే. ప్రజాపరిపాలనారంగంలోని ముఖ్యపదవులు నేటి వరకూ స్త్రీలకి అందుబాటులో లేవు. స్త్రీల సహకారం నిరాకరించడంవల్ల ప్రభుత్వం ఎంతో అమూల్యమైన సహాయాన్ని చేజేతులా కోల్పోయిందని నేటి యుద్ధం ఎత్తిచూపింది. దీనికి ఒక ఉదాహరణ చెప్తాను.

పురుషులను మించిపోయారు

యుద్ధం ఆరంభమైన కొద్దినెలలకే, జర్మనులు బెల్జియంను ఆక్రమించారు. ఆ ఆక్రమితప్రాంతాలలోని ప్రజల బాధ వర్ణనాతీతం. అదృష్టవశాత్తు అమెరికాలో కొంతమంది ధనవంతులైన స్త్రీలు, పురుషులు చొరవతీసుకుని ఈ కష్టాలలో మగ్గుతున్న ప్రజలకి అత్యవసర వస్తువులని అందించేందుకు ఒక సంఘంగా ఏర్పడ్డారు. జర్మన్ సైనికుల చర్యలవల్ల కొన్ని గ్రామాల ప్రజలకి హఠాత్తుగా ఆహారం లేకుండాపోయింది. క్షామం అనివార్యం అనిపించింది. ఈ అమెరికన్ సంస్థ తమలాగే సేవలందించే ఒక ఇంగ్లీషు సంస్థకి ఈ బాధితులకి వెంటనే ఐదువాహనాల నిండా అత్యవసర సరుకులు మూడురోజులలోగా తమ గమ్యం చేరేటట్లు పంపవలసిందిగా సందేశం పంపింది. పురుషులు 'అసంభవం' అని త్రోసిపుచ్చారు. కానీ అదృష్టవశాత్తు ఈ విషయం ఒక మహిళ విని ఇటువంటి ఆపత్కర పరిస్థితులలో 'అసంభవం' అని త్రోసిపుచ్చడం దారుణంగా భావించింది. ఈమె యుద్ధంలో గాయపడ్డవారికీ, బాధితులకీ సహాయంచేసే ఒక మహిళాసంఘానికి చెందిన వ్యక్తి. వీరు వెంటనే ఆ అమెరికన్ సంస్థకి ఈ సరుకు మూడురోజులలో తాము అక్కడికి అందిస్తామని మాట ఇచ్చి, రవాణావిషయంలోనూ, యితర విషయాలలోనూ ఎంతో అసంభవమనిపించే అవరోధాలని అధిగమించారు. చక్కని కార్యనిర్వాహకశక్తి, దృఢసంకల్పంవల్ల ఈ అద్భుతాన్ని సంభవంచేసి, సకాలంలో అన్ని సరుకులు అందించి భయంకర క్షామాన్ని నివారించారు!

రాజకీయాలలో అవకాశం

నేటి యుద్ధం కేవలం స్త్రీల అసమాన సామర్థ్యాలని మాత్రమే వెలికి తేలేదు. వారి బలహీనతలు, లోపాలూ, అల్పత్వం కూడా బయటపడే సందర్భాలు వచ్చాయి. మహిళలు కనుక నిజంగానే దేశపరిపాలనలో స్థానం కావాలనుకుంటే, తమ వ్యక్తిత్వంలో చాలా ప్రగతి సాధించాలి. మనోనిగ్రహం, సంయమం పెంచుకోవాలి. ఆలోచనావిధానంలోనూ దృష్టికోణంలోనూ ఇంకా విశాలత్వం రావాలి. సందర్భోచితంగా ఆలోచిస్తూ ఉద్వేగాలకీ ఇష్టనిష్టాలకీ తావులేకుండా అయినప్పుడే వీరు ప్రజావ్యవహారాల నిర్వహణకి అర్హులౌతారు.

పురుషుల వైఫల్యము

నేడు కేవలం పురుషులే నడిపే రాజకీయాలు వాళ్ల అసమర్థతని రుజువు చేశాయి. అనిశ్చితంగా వుండీ, తొందరపాటువల్లా, స్వార్థభరిత వ్యక్తిగత ప్రయోజనాలని వెతుక్కోవడంవల్లా, వీరు చాలాసార్లు తప్పటడుగులు వేశారు. నిస్సందేహంగా స్త్రీల పాలనలో రాజకీయాలు నిస్వార్థతకీ, దయ, సానుభూతిగల పరిష్కారాలకీ ఎక్కువ అవకాశం ఇస్తాయి. కానీ దురదృష్టమేమిటంటే, ఇప్పుడు స్త్రీలు తామున్న పరిస్థితిలో ఆవేశాలతో తీవ్ర పక్షపాతబుద్ధితో వ్యవహరిస్తూ, పరిపూర్ణ బుద్ధికుశలతవల్ల లభించే ప్రశాంతమైన వివేకాన్ని ఎరుగరు. స్పందన, దయ, జాలి లోపిస్తాయి కనుక ఇది నిస్సందేహంగా ప్రమాదకరమైన లక్షణమే కానీ ఇది సమిష్టి శ్రేయస్సు కోసం చేసే పరిపాలనలో అనవసరమైన ఆవేశాలను అరికట్టడంలో మాత్రం కచ్చితంగా ఉపయోగపడుతుంది.

క్లిష్టమైన పనులు చేయగలరు

పురుషుల స్థానంలో మొత్తం స్త్రీలే నిర్వహణాధికారం చేపడితే వారి బలహీనతలవల్ల ప్రమాదకరమైన లోపాలు జరగవచ్చు కానీ స్త్రీపురుషులిద్దరూ పరస్పర సహకారంతో పనిచేస్తే, ఒకరి లోపాలనొకరు పూరించినట్లవుతుంది. ఇరువురూ పరిపూర్ణత సాధించేటందుకు ఇది ఉత్తమమార్గం. మహిళల పాత్ర కేవలం గృహసీమకీ, లోపలి పనులకీ పరిమితం చేసి, పురుష

లకి కేవలం సాంఘికపరమైనవీ, బయటి పనులూ ఇచ్చి, కలసి మెలసి ఉండవలసిన ఇరు రంగాలనీ వేరుగా ఉంచడం ద్వారా నేడు ఉన్న లోపభూయిష్టమై, ఇరువర్గాలకీ బాధాకరమైన విధా నాన్నే కొనసాగించినట్లవుతుంది. ఉన్నతమైన విధులూ, గంభీర మైన బాధ్యతలూ స్వీకరించడానికి స్త్రీపురుమలిరువురు తమ తమ ప్రత్యేకలక్షణాలని జోడించి నమ్మకంతో ఐకమత్యంగా వ్యవహ రించాలి.

నూతన వ్యవస్థకు అవకాశము

స్త్రీపురుషులు రాజీకుదరని ప్రత్యర్థు లలా ఒకరిపట్ల మరొకరు వైరభావంతో ఉండే రోజులు ఇంకెన్నాళ్ళు? అన్ని దేశాలు ఒక తీవ్రమైన బాధాకరమైన పాఠం నేర్చుకుంటున్నాయి. నేటి ఈ శిథిలాలమీద ఎంతో సుందరమైన, ఇంకెంతో సఖ్యమైన నూత్నసౌధాలని నిర్మించవచ్చు. ఇంక బలహీనతలకీ, క్షణికమైన పోటీలకీ, స్వార్థభరిత దర్పానికీ సమయం లేదు. స్త్రీలైనా, పురుమ లైనా మానవులంతా కలిసి సమిష్టికృషితో అత్యున్నత ఆదర్శాల అవగాహనకి, వాటి ఆచరణకి హృదయపూర్వకంగా కృషి చేయాలి. వీరి బాహ్యప్రక్రియలని ఉత్తమరీతిలో ఉపయోగిం చడం కంటే వీరి ఆంతరంగిక, ఆధ్యాత్మికప్రగతిని గూర్చి చూడ టమే నిజంగా పరిష్కరించవలసిన సమస్య. ఆంతరంగిక ప్రగతి లేకుండా బాహ్యప్రగతి అసంభవం.

అసలు సమస్య ఆధ్యాత్మికము

ఇలా చూస్తే, ప్రపంచంలోని అన్ని సమ స్యలలాగానే, స్త్రీవాద సమస్యకూడా ఆధ్యా త్మికమైనదే. అన్నిటికీ మూలం ఆధ్యా త్మిక సత్యమే. బౌద్ధుల ధమ్మత – దివ్యలోకాల యొక్క శాశ్వత పునాదిపైనే అన్నిలోకాలూ నిర్మింపబడ్డాయి. ఈ అత్యుత్తమ సత్యము ముందు స్త్రీలు, పురుషులు, అందరూ సమానులే. వారి హక్కులలో కానీ, బాధ్యతలలో కానీ ఈ పరిధిలో ఉండగల ఏకైక తారతమ్యం ఆ వ్యక్తియొక్క నిజాయితీ, ఆశయంపట్ల ఆసక్తి, స్థిర సంకల్పములపై ఆధారపడి ఉంటుంది. స్త్రీపురుషుల సంబంధాల సమస్యకి శాశ్వత పరిష్కారం ఈ మౌలిక ఆధ్యా

త్మిక సమానతని గుర్తించినప్పుడే సంభవం. ఈ సమస్యని ఈ ఆధ్యాత్మిక దృష్టికోణం నుంచీ, స్థాయినుంచీ వీక్షించి అర్థం చేసుకోవాలి. ఆ ఆధ్యాత్మిక శిఖరంపై నీ దృష్టిని కేంద్రీకరించి జీవితాన్ని అక్కణ్ణుంచి నడిపించి, ప్రపంచంలో అక్కణ్ణుంచే ప్రవర్తించినట్లయితే నూతన జీవితము, మానవుని భవిష్య సౌధనిర్మాణము సాధ్యమౌతాయి.

అనువాదం: బి. వరలక్ష్మి

స్త్రీలు – పురుషులు

మనిషి సాటివారితో ప్రసన్నంగా ఉండాలి. డంబము, అహంకారము పనికిరావు. మూర్ఖులే అలా ప్రవర్తిస్తారు. సృష్టి యందెల్లడల పరివ్యాప్తమైన అనంతశక్తితో ఏమాత్రం పరిచయమున్నా అలా ప్రవర్తించరు. అట్టివారు మిక్కిలి వినయసంపన్నులై ఉంటారు.

స్త్రీలు బైటికి వెళ్లకుండా ఎక్కువగా ఇంట్లోనే ఉండుట వలన కొంచెమైనా దైవభక్తి కలిగి వినయవిధేయతలతో ప్రవర్తిస్తారు. ఆ కారణంగా వారు మగవాళ్ల మీదే ఆధారపడి జీవిస్తారని చెప్పేందుకు వీలు లేదు. ఆడదానికి మగవాడు ఎంత అవసరమో, మగవాడికి ఆడది అంతే అవసరము. ఇద్దరూ సమానంగా ఒకరి మీద ఒకరు ఆధారపడేవారే.

లౌకికరంగంలో కూడ నిత్యావసరాలకి మగవాళ్లు ఆడవాళ్ల మీద ఎంత ఆధారపడతారో ఆడవాళ్లు కూడ పురుషుల మీద అంతే ఆధారపడతారు. ఈ ఆధారపడటమే కనక అణకువకు కారణమైనట్లయితే మరి మగవాళ్లు కూడ అణకువగా ఉండి స్త్రీల ఆధిపత్యం కింద వుండాల్సిందే....

ఆడవాళ్లు మగవాళ్లను సంతోషపరచుటకై అణిగిమణిగి ఉండాలనుకోవటం సమంజసం కాదు. ఈ వాదమే నిజమైతే

దేవుడు స్త్రీలని కేవలం మగవాళ్ల భోగానికే సృష్టించాడు అనాల్సి వస్తుంది. ఇది విపరీతభావనే కాని సత్యము కానేరదు.

ఈ విశ్వమంతా కూడ భగవల్లీలను ప్రదర్శించేందుకు ఒక రంగము. స్త్రీపురుషులిరువురి కర్తవ్యము వారిలోని దైవాంశమును అభివ్యక్తపరచుటయే. వారికి ఇంతకు తప్ప వేరే లక్ష్యము లేదు. ఈ విషయాన్ని కనుక జ్ఞాపకము పెట్టుకున్నట్లయితే, 'నేను గొప్పంటే నేను గొప్పని' పోట్లాడుకోరు. గిల్లికజ్జాలు పెట్టుకోరు. సేవ లందించటం కంటె సేవల నందుకోవటం గొప్ప అని అనుకోరు. భగవంతుని సేవించటంలో అందరికి సమానమైన హక్కున్నదని, అట్టి సేవను ఇంకా బాగా చేయటమే వారి కర్తవ్యమని గుర్తించగలరు. అంతే కాదు, దానిని వారి సుకృతముగా భావించగలరు.


అనువాదం: రా. లక్ష్మీప్రసాదమ్మ

శ్రీమాత 125 వ జయంతిని పురస్కరించుకొని ప్రతినెలా మీకొక సందేశాన్నందిస్తున్నాము. ఈ నెల సందేశము:

నువ్వు సంపూర్ణంగా దైవానికి వశమైపోవలసిందే. ఈ భావము ఎక్కడో అంతరంగికంలోని చైత్యాత్మ ***(psychic)*** *లోనో లేక ఊర్ధ్వమానసములోనో ఉంటే చాలదు. అంతఃప్రాణికము* ***(inner vital)*** *లొంగినంత మాత్రాన సరిపోదు. అంతర్భౌతిక చైతన్యము* ***(inner physical consciousness)*** *దాని ప్రభావమును పొందినా కూడా సరిపోదు. నీలోని ఏ ఒక్క భాగము – బాహ్యేంద్రియాలు సహితము సంకోచించకూడదు – ఏమాత్రం సంశయము, టక్కరితనము, దాపరికము అసలే పనికి రావు.*

శ్రీ అరవిందులు

6/4/2002



అఖిల

అఖిల భారత పత్రిక

ఏప్రిల్ 2002

6/4/2002.

విషయసూచిక

విభాగము I: పృథ్విపై దివ్యజీవనమును సాధించుట

విభాగము II: యోగసాధన

విభాగము III: ఇతర వ్యాసాలు

24 ఏప్రిల్ దర్శనానికి సంసిద్ధత

ప్రశ్న: మధుమయీ, 24 ఏప్రిల్ దర్శనానికి మేమేవిధంగా సన్నద్ధమవాలి?

శ్రీమాత జవాబు

నీ అంతరంగంలోకి ప్రవేశించి నీ కతిప్రధానమైన, ప్రాణప్రదమైన వస్తువు కోసం శ్రద్ధగా శోధించాలి. దానిని కనుక పట్టుకున్నట్లయితే అది ఎంత అద్భుతమైనదో నీకే తెలుస్తుంది.

*

ప్రశ్న: తాము భగవంతునికి సేవ చేయుటకు మాత్రమే ఇక్కడ ఉన్నామనే విషయము అందరు గుర్తుంచుకోవాలి. సత్యం కోసం, దైవం కోసం ఆకాంక్షిస్తూ, అధోప్రకృతిని తిరస్కరించుకుంటూ, కర్మల నాచరించుట ద్వారా సాధకుడు పాపప్రక్షాళితుడై, శుచిర్భూతుడై దైవాన్ని సేవించాలి. అంతేగాని స్వీయముక్తికిగాని, శ్రేస్తికిగాని, సంతోషానికిగాని కాదు. నేను చెప్పింది నిజమేనా?

శ్రీఅరవిందుల జవాబు

నిజమే, అది చాలా మంచిపద్ధతి. అంతేకాని అహంకారాన్ని, స్వార్థప్రయోజనాలని మనస్సులో పెట్టుకోవటం మంచిది కాదు. నీకు కావలసిన విముక్తి, ఆనందము, యోగసిద్ధి మొ॥ ప్రయోజనాలన్ని నువ్వు దైవంతో మమైకమైనప్పుడు వాటంతట అవే కలుగుతాయి. వాటిని నువ్వు ప్రత్యేకంగా కోరుకోనక్కర్లేదు.

∴

భూలోక చరిత్రలో ఒక కొత్త మలుపు

శ్రీమాత ప్రవచనములు

విజ్ఞానశాస్త్రం ఎంత పతాకస్థాయి నందుకున్నప్పటికి నేటి మానవుడు పరస్పర వైషమ్యాలు, యుద్ధాలు అణుబాంబుల భీభత్సానికి గురౌతున్నాడు. ఒక యుగమంతమైపోతోంది. యుగాంతాన విస్ఫోటమవడము, నూతన సృష్టి జరగడము మామూలే. మన మిప్పుడీ సంధి సమయంలో ఉన్నాము. ఆ శుభసమయ మాసన్నమవుతోంది – అదిగో! వెలుగు అల్లదిగో! "అరె, నాకేమి కనపడుట లేదే" అంటావేమో – నువ్వు కళ్లు తెరిచి చూస్తే గదా! – సంపాదకుడు

సృష్టిలో నూతనాధ్యాయము

యుగయుగాలుగా నడుస్తున్న ఈ భూలోక చరిత్రలో ఒక పరివర్తనము రాబోవుతున్నది. ఒక నూతనాధ్యాయము ఆవిష్కారమయ్యే దివ్యముహూర్తములో మన మిప్పుడున్నాము. అట్టి సమయములో ప్రపంచ చైతన్యము తీవ్రతరమౌతుంది. వేగం పుంజుకుంటుంది. సృష్టి కార్యక్రమము ఇప్పుడొక బృహత్తర దశలో వున్నది. రూపాంతరీకరణ (transformation) సాధించనున్నది. తదనుగుణంగా అలనాడు మానవుడు (మనోగతజీవి) ఎలా అవతరించాడో ఈనాడు మానసాతీతమైన అతిమానసజీవి అవతరించబోతున్నాడు. అందుకై మానవుని మనోభూమికలో తీవ్రమైన మథింపు జరుగుతున్నది. మానవాళి కొన్ని శతాబ్దాల తరబడి ఈ సమయం కోసం వేచి వున్నది. ఆ శుభముహూర్తము ఇప్పుడు రానే వచ్చింది.

మన మాడుకుంటూ పాడుకుంటూ వినోదంగా కాలక్షేపం చేసేందుకు ఇది సమయం కాదు. నడుం బిగించుకొని భవిష్య మానవునికై మార్గమేర్పరచి నూతనసృష్టిని ఆవిర్భవింపచేయుటయే మన తక్షణ కర్తవ్యము.

ఈ విషయాన్ని చెప్పేందుకే మిమ్మల్ని ఇక్కడకు పిలిచాను. మీ కిష్టమైన పనిని తీసుకొని చెయ్యండి – నా సహాయం తప్పకుండా మీకుంటుంది. చిత్తశుద్ధితో కార్యాన్ని చేపట్టండి. *కావలసినంత శక్తిని నేను మీకిస్తాను కదా!* నీ గొప్పతనాన్ని నిరూపించు కునేందుకు సమయం ఇదే.

గొప్పవాళ్లనగా నువ్వు మామూలుగా అనుకుండే సంపన్న వంతులు కాదు. చైత్యాత్మతో (psychic) తాదాత్మ్యము చెంది శరీరాన్నంతా చేతనామయం చేసిన వాళ్లే గొప్పవాళ్లు. అటువంటి ప్రయత్నం చేసేవాళ్లకి నా సహాయం ఎల్లప్పుడూ ఉంటుంది.

ఈ క్షణంలో నువ్వీ భూమ్మీద ఉన్నావంటే దానికి కారణం నువ్వు (నీ ఆత్మ) కోరుకున్నావు కనుక – ఈ విషయం నీకు జ్ఞాపకం లేదు కాని నాకు తెలుసు – అందుకనే నువ్విక్కడున్నావు. ఈ విశేషాన్ని నువ్వు గుర్తించి అందుకు తగినట్లుగా స్పందించాలి. కార్యశూరుడవు కావాలి. ప్రయత్నించి నీ బలహీనతలను జయించాలి. నీ అవధులను అధిగమించాలి. ముఖ్యంగా నీ అహంకారరక్కసితో "నీకు కాలం తీరిపోయింది" అని చెప్పి దాన్ని తరిమేసేయాలి. మన కిప్పుడు లేశమైనా అహంకారం లేని జాతి కావాలి. అహంకారం బదులు దివ్యచైతన్యాన్ని ధరించే నూతన జాతి కావాలి. అదే, ఆ దివ్యచైతన్యమే మనకు కావాలి. మానవుని పరిణమింపజేసి అతిమానసజీవిని ఆవిర్భవింప జేయగల దివ్యచైతన్యం కావాలి.

ఏవో బంధనాల వలన నేనిక్కడ ఉన్నాననుకుంటున్నావేమో – అది నిజం కాదు. నాకెట్టి బంధనాలు లేవు. మానవుని రూపాంతరీకరణానికి మొట్టమొదటి ప్రయత్నమునకై నా శరీరము ప్రయోగింపబడుతోంది. ఈ విషయాన్ని శ్రీఅరవిందులే నాకు తెలియజేసారు. ఈ కర్తవ్యాన్ని నేను నిర్వర్తిస్తున్నాను. ఈ కార్యాన్ని చేపట్టమని నేనెవ్వరిని అడగను. ఎందుకంటె ఇంక ఎవ్వరూ చేయలేరు. ఈ బాధలు భరించలేరు. కాని నేనా కార్యాన్ని నవ్వుతూనే చేస్తున్నాను. దానివలన అందరికి లాభముంటుంది.

నేను కోరేదల్లా ఒక్కటే – నీ అహంకారం చేసే రాద్ధాంతాన్ని పట్టించుకోవద్దు.

నాకు ప్రగల్భాలు వద్దు. ఈ సందేశాన్ని నువ్వు వినిపించుకోని, శ్రద్ధగా ఆచరిస్తే చాలు. అదే పదివేలు.

2 ఏప్రిల్ 1972

*

మనిషి తన తెలివితేటలనే నమ్ముతాడు. అహంకారానికే పెద్దపీట వేస్తాడు. కష్టాలు వచ్చినప్పుడే దేవుణ్ణి గురించి తలుచుకుంటాడు. నెత్తిమీద పెద్దమ్మ కూర్చున్నప్పుడే అతని సహాయం అర్థిస్తాడు. అందుకనే ప్రపంచానికి ఉపద్రవాలు వస్తూంటాయి, ప్రళయాలు సంభవిస్తూంటాయి. మనుమల కళ్లు తెరిపించేందుకే!

నిశ్చలంగా వుండు, దృష్టిని పైకి సారించు

శ్రీమాత ప్రవచనములు

సృష్టి విచిత్రమైనది. ఏకము అనేకమగుట, అఖండచైతన్యము ఖండమగుట మన కర్థము కాని విషయములు. మన పుట్టు పూర్వోత్తరములు గొప్పవే – మూలతః మనమఖండ స్వరూపులమే. కాని మన జీవితంలో ఈ అఖండత్వము కనపడదు. సాక్షికజ్ఞానమే మన ఖర్మ కాని ఇప్పుడు మనం కోరుకుంటే ఆ జ్ఞానము మనకు దొరుకుతుంది. మన జీవితాన్ని చక్కబెడుతుంది. నువ్వే మాత్రం కలవరపడకూడదు. జరగబోవుదాన్ని గురించి భయపడుతూ ఆదిలోనే హంసపాదు పెట్టకు. నీ పనిని నిశ్చలంగా చేసుకుంటూపో. అప్పుడు నీకంటె అధికమైన శక్తులు నీలోకి ప్రవేశిస్తాయి. నీ జీవితకార్యాన్ని చక్కగా నిర్వహించి నిన్ను దివ్యజీవనమార్గంలో నడుపుతాయి. కాబట్టి నీ ధ్యానమంతా ప్రకృతం మీదనే కేంద్రీకరించి అనంతర కార్యక్రమమును దేవతలకు వదిలేసేయాలి. ఆ విధంగా నీ జీవితం దినదినగండంగా కాకుండా ఒక పూలబాట కాగలదు.

– సంపాదకుడు

గందరగోళానికి అసలు కారణం

ఈ గందరగోళానికి కారణం నీ మనస్సే. మనస్సుయొక్క అశక్తతనుగురించి నీకు పాఠం నేర్పేందుకే ఇలా జరుగుతుంది. అందుకని 'రేపేమౌతుందో' అని నువ్వు ఇప్పటినుంచి ఆలోచించ కూడదు. 'అయ్యో ఏం జరగబోతోందో, ఏం దారి' అని నువ్వు ముందురనుంచే చింతించకూడదు. ప్రకృతమే నీ తక్షణ కర్త వ్యము. అందుకని ప్రస్తుతం నువ్వు చేస్తున్న పని మీదనే ధ్యానమును నిలిపి దానిని చక్కగా నిర్వహించాలి. అంతేగాని "అలా చేస్తే బాగుంటుంది, ఇలా చేస్తే బాగుంటుంది" అని ముందరనుంచే ఆలోచిస్తూ కూర్చోటం చాలా ప్రమాదం.

మనస్సుయొక్క జ్ఞానం పరిమితం

అందుకని ప్రతిక్షణము నీ మనస్సును కేంద్రీకరించి నీ పనులను శ్రద్ధగా నిర్వ ర్తిస్తూ ఉండాలి. తరువాత కర్తవ్యము నీకంటె అధికమైన మహాచైతన్యానికి వదిలేసేయాలి. అనంతర కర్తవ్యమేమిటో ఆ విశ్వచైతన్యమే చూసుకుంటుంది. ఎందుకని? నీ దృష్టి పాక్షికము, నీ జ్ఞానము కేవలం అజ్ఞానమే కాబట్టి. ఒక వేళ నువ్వు ఈ అజ్ఞానాన్నే నమ్ముకుని, అటూ ఇటూ పరిగెత్తి నట్లయితే ఎండమావులనే వెంబడించగలవు. ఎండమావులు నీ దాహాన్ని ఎలా తీర్చలేవో అలాగే నీ తెలివితేటలు కూడ నీకు ఎట్టి ఫలితాన్ని తెచ్చిపెట్టలేవు.

(శ్రీమాత ధ్యానంలో నిమగ్నమైపోతుంది)

ఏకమాత్ర చైతన్యమే శ్రీరామరక్ష

ఇంత గందరగోళం, ఈ మహాసం క్షోభం సంభవించినప్పుడు నువ్వు ఒకానొక చైతన్యస్థాయి నందుకో వాలి. అక్కడనుంచి చూసినప్పుడు నీకు ఒకే సత్యము అనుభూ తమౌతుంది. ఒకే చైతన్యము, ఒకే మహాశక్తినిగురించి నువ్వు తెలుసుకుంటావు. నీకు సంక్షోభమల్లె కనబడుతున్నదంతా కూడ ఆ అఖండంలోనే జరుగుతోంది. నీది సంకుచితదృష్టి, మిడిమిడి

జ్ఞానము, తార్కిక దృక్పథము. వీటి విలువెంత? అవి ఏ పాటివి? వీటి నధిగమించిన మహాచైతన్యం ముందర వట్టి గడ్డిపోచలే.

అఖండ చైతన్యము సహస్రశకలములుగా ఎందుకు మారింది? ఈ చీలిపోయిన విభాగములన్ని మళ్లీ మూలరూపంలో జేరి వాటివాటి అఖండత్వాన్ని పొందాలని ఆకాంక్షిస్తాయి. తహ తహ లాడుతాయి. నీ వంతు కూడ అటువంటి తీవ్రమైన ఆకాంక్షను పొంది తహతహ లాడటమే.

ఇదే నీవు చేయాల్సిన పని. ఇదొక్కటే విలువయినది. ఫలితాన్నిస్తుంది. ....మిగిలినదంతా ఒట్టి కల్ల.

అన్ని సమస్యలకు పరిష్కారము

ఈ సంగతి నువ్వు ఎప్పటికీ మరచి పోకూడదు. ఆ పరాచైతన్యము (Supreme Consciousness) తో మమేకమై అన్ని సందర్భాలలోను దాని మీదనే పూర్తిగా ఆధారపడాలి. నువ్వేదైనా పనిని చేయవలసి వచ్చినప్పుడు, చేయలేనప్పుడు; నువ్వు నడిచినప్పుడు, నడవలేనప్పుడు, నువ్వేమాత్రమూ బాధ పడక్కర్లేదు. ఎందుకంటే నీ మనస్సుకంటె వెయ్యిరెట్లు సమర్థ వంతమైన ఆ పరాచైతన్యానిదే బాధ్యతంతా – ఇక నీ కెట్టి బాధ్యతా లేదు. నీ కర్తవ్యాన్ని నిర్వహించి, పర్యవసానం కోసం వేచివుండాలంతే.

ప్రతిక్షణము నీకు సూచనలు

అప్పుడు నీకు ప్రతిక్షణము "ఈ పని చేయాలి, ఈ పని చేయక్కర్లేదు" అని సూచన లందుతూ ఉంటాయి. అన్ని ప్రశ్నలకు అంతే. నీవు జీవించి ఉండాలా అక్కర్లేదా? అదే సూచన నిస్తుంది – నీకు పూచీ లేదు. ప్రతి ఒక సందర్భాన్ని అదే నిర్వహిస్తుంది. ప్రతి సమస్యకు అదే పరిష్కారము. అదొక్కటే పరిష్కారము.

And all activities, all possibilities can be made use of in a natural way – it eliminates all arbitrary personal choice. All possibilities are there, all, all, all are there. All perceptions are there and all knowledge – only the personal arbi-

trariness has been eliminated. And this personal arbitrariness is so childish, so childish... a stupidity full of ignorance....

All that is for teaching the world to turn back to the Lord in its consciousness....

నువ్వు ప్రపంచాన్ని మార్చగలవు

నువ్వా స్థాయిని అందుకున్నప్పుడు నీ సామర్థ్యము పెరుగుతుంది. నువ్వు భగవంతునికి ఒక చక్కని ఉపకరణము కాగలవు. ప్రపంచాన్ని మార్చగలవు. దివ్యశక్తులు నీలోకి ప్రవేశించి నీ ద్వారా నలుదిక్కులకు ప్రవహించగలవు. ఈ విధంగా ప్రసారమైన శక్తులు ప్రపంచంలో దివ్యకార్యమును నెరవేర్చగలవు. నీ మెదడు చాలా చిన్నది – అవునా? ఒక వేళ అది పెద్దదైనా కూడ దైవమార్గమును, దైవోద్దేశమును అర్థము జేసుకొనజాలదు. అందుకనే నీ మెదడును ఎప్పుడూ, ఏం జరిగినా సరే, సర్వవేళలా ఖాళీగా ఉంచుకోమని చెపుతున్నాను.

నీ జీవితావసరాలు

నువ్వు ఒక విషయాన్ని జ్ఞాపకం పెట్టుకోవాలి. నీలో పనిచేసే మహాశక్తులు నీ ప్రమేయం లేకుండానే నీ అవసరాలన్నిటిని ఆటోమాటిక్‌గా తీర్చి నీకు చక్కటి మార్గాన్ని ఏర్పరుస్తాయి. నీ జీవితంలోని ప్రతినిమిషము ఈ ఆలోచనల అవసరం లేకుండానే, సంకల్పవికల్పాలు లేకుండానే, నీ నిర్ణయాల ప్రమేయం లేకుండానే ఒక గంగాప్రవాహాము వలె గడిచిపోతుంది.

శారీరకబాధలు మాయం

ఒకసారి నీవా స్థాయి నందుకున్నట్లయితే నీ ఆరోగ్యాన్ని, బాధల్ని గురించి కూడ నీవు మరిచిపోవచ్చు. శారీరకబాధలన్నీ వాటంతట అవే మాయమయిపోతాయి. భరించలేనంత తీవ్రమైన నొప్పులు కూడ – అదెటుల జరుగునో నాకు తెలియదు – తుస్ – అంతే నొప్పెక్కడిది? మాయమయిపోయింది.

సరే ఇతరులతోడి సంబంధాలంటరా – వైషమ్యానికి తావే లేదు. పరిస్థితులన్నిటికి కూడ ఇదే మంత్రం. చిన్నపిల్లవాడల్లె

అమాయకంగా ఉండటమే నీ పని. వాదోపవాదాలకు దిగవల సిన పని లేదు. ఏది న్యాయమో, ఏది అన్యాయమో ఎవరు రైటో, ఎవరు తప్పో అని మథనపడవలసిన అవసరమే లేదు.

అదీ పరిస్థితి. నేనెప్పుడు ఆ స్థితిలోనే కదలకుండా, మెద లకుండా దృష్టిని పైకి సారించి ఉంటాను.

సంకల్పవికల్పాలు లేని ఆ స్థితిని నువ్వందుకొని నాకిది కావాలి ఇది వద్దు అనే భావం లేకుండా ఒక నమస్కారం పెట్టేసి దర్జాగా కూర్చోవాలంతే.

అన్నిటికంటె ముఖ్యం – భయం నాస్తి!

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

నేను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు

శ్రీమాత ప్రవచనములు

ఒకే వస్తువు విభిన్న మానవులకు విభిన్నముగా కనపడి భిన్న అనుభూతులను కలుగజేస్తుంది – ఏనుగు గుడ్డివాళ్ల కథ గుర్తు చేసుకోండి. మతములు తెచ్చిపెట్టిన నిర్వాకమంతా మన చరిత్ర పుటలలో నిండి ఉన్నది. అభిప్రాయభేదముల వలన వ్యక్తుల మధ్య ఘర్షణ జరుగుతుంది. ఈ అభిప్రాయము కేవలం వ్యక్తిగతమైనదే కాని అసలు సత్యము కాదనే విషయము మనం తెలుసుకోవాలి. మన వైఖరిని వ్యక్తిగతంగా కాకుండా వ్యక్తాతీతంగా విశాలంగా మలుచుకోవాలి.

– సంపాదకుడు

మీ విశ్వాసాలను మాత్రమే "జ్ఞానం" అనే పేరు తగిలించి, ఇత రుల విశ్వాసాలను మాత్రం శుద్ధ తప్పులుగానో, అజ్ఞానంగానో, అదీ కాకపోతే మిథ్యాపాండిత్యంగానో తీసిపారేయడం తగదు. జాతుల సిద్ధాంతాల్నీ, వాటి అసహనాన్ని అపహాస్యం చేయడం కూడా పనికిరాదు.

– *శ్రీఅరవిందులు (Thoughts and Aphorisms)*

ఎవరి నమ్మకం వారికి సత్యం

తమ నమ్మకాలు మాత్రమే శాస్త్రీయమైనవని, ఇతరుల నమ్మకాలు తప్పుల తడకలని, అజ్ఞానభూయిష్టములని, కుహనా సిద్ధాంతాలని కొట్టిపారేసే దురలవాటే – వివిధజాతుల సిద్ధాంతాలు, మతాల అసహనం ఆవిర్భావానికి ఆధారభూతమై, వారిని తమ నమ్మకాన్నే నిజమైన సిద్ధాంతంగా భావించి, ఇతరుల నమ్మకాలను నిర్ద్వంద్వంగా తృణీకరించేలా తయారుచేసింది. మీకు తెలిసింది మాత్రమే సత్యమని, మీ విశ్వాసం మాత్రమే వాస్తవమైనదని, ఇతరుల విశ్వాసాలు సత్యాలు కానేకావని అంటుంటారు. అవునా! ఇలా అనడం ఇంచుమించు అన్ని జాతులకు, అన్ని మతాలకు సర్వసాధారణమే!

అసహనంలో అందరూ ఘనులే

అంటే ఏమిటన్నమాట! – ఇతర జాతులు మతాలు ఏం చేస్తున్నాయో, సరిగ్గా నువ్వూ అదే చేస్తున్నావన్న మాట. అటువంటప్పుడు వాటిని ఎగతాళిచేస్తూ దూషించే హక్కు నీకు ఎలా ఉంటుంది? ఈ విషయం పట్టించుకోకుండానే ఇతరులు చేసినవే నువ్వూ చేస్తున్నావు. ఎందువల్ల?... అది నీ విషయంలో సహజంగా కనిపిస్తుంది కాబట్టి అవునా!

ఈ విషయంలోనే నీకు అవగాహన కలిగించాలని శ్రీఅరవిందులు వాంఛిస్తారు. "మాదే పరమసత్యం. ఈ సత్యానికి వ్యతిరేకమైనదంతా అనృతం" – ఇంత కర్కశంగా చెప్పలేకపోయినా, మరో విధంగానైనా అలా నువ్వు అంటున్నావంటే – అన్ని మతాలు, అన్ని జాతులు చేస్తున్నట్టే నువ్వూ చేస్తున్నావన్న విషయాన్ని శ్రీఅరవిందులు నీకు తెలియజేయాలని అనుకుంటారు.

విషయపరంగా ఆలోచించు

నీకు తెలిసిందంతా, నీవు ఆలోచించేదంతా, సత్యమని నువ్వు భావించేదంతా జ్ఞానమని ఏమాత్రం సంకోచం లేకుండా అదే ప్రధానమైనదని నిర్ణయిస్తున్నావు. "కాదు, కాదు. ఇది ఈ విధంగా ఉంటుంది. అలా కాదు" అని ఎవ్వరైనా వ్యతిరేకిస్తే దాన్ని ఖండిం

చడానికి నువ్వు సదా సంసిద్ధంగా ఉంటావు.... బాగానే ఉంది. కాని దీన్నిగురించి కొంచెం ఆలోచించు. నీ వైపునుండి కాకుండా విషయపరంగా కొంచెం పరిశీలనచెయ్యి.

నువ్వు ఏం చేస్తున్నావో నిన్ను నువ్వు పరిశీలించుకుంటే, వ్యతిరేకభావనను జీర్ణించుకోలేని ఈ అసహనానికి అసలు కారణం ఏమిటో తెలుసుకోగలుగుతావు. దాంతో నిష్ప్రయోజనమైన ఈ చర్చలు అన్నింటిని వదిలిపెట్టగలవు.

అనుభూతి వైయక్తికం

నీకు ఇదంతా ఓసారి చెప్పాను కదా! ఆ విషయాన్నే మళ్లీ జ్ఞాపకం చేస్తున్నాను. నీకు సంబంధం కలిగిన వివిధ విషయాలలో సత్యాన్ని గురించిన అనుభూతి కేవలం నీ వ్యక్తిగతమైనది మాత్రమే. అది ఎంతో కొంత ప్రగాఢమైనది, స్పష్టమైనది, విస్తృతమైనది, పరిశుద్ధమైనదీ కావచ్చు గాక! అది నీకు మిక్కిలి ప్రీతిని కలిగించవచ్చు గాక! అది నిర్ధారణమైన అనుభవమే కావచ్చుగాక.

ఈ స్పర్శ నీ నిర్ణయాలలో అతిప్రాముఖ్యం వహించే అనుభవం అయినంత మాత్రాన అది సార్వజనీనమైన అనుభవం అని నువ్వు ఊహించుకోకూడదు. అదే స్పర్శ ఇతరులకు అదే అనుభూతిని ఇస్తుందని భావించడం సత్యానికి దూరం.

నీకు నువ్వు భావించుకొనేది కేవలం వ్యక్తిగతమైనదని, ఆత్మగతమైనదని, అది కచ్చితమైన సర్వసాధారణ సిద్ధాంతము కాజాలదని నువ్వు గ్రహించగలిగితే – ఇతరుల జ్ఞానాన్ని నువ్వు తృణీకరించలేవు. అంతే కాదు. నీ ఉద్దేశాన్ని, నీ అనుభవాన్ని ఇతరుల మీద రుద్దలేవు కూడా. శుద్ధ అనవసరమైన మానసిక వివాదాలన్నింటిని నిర్మూలించేది ఈ అవగాహనే.

తప్పులెన్నువారు తమ తప్పు లెరుగరు

దీన్నిబట్టి – పై సూక్తియొక్క తొలిభాగాన్ని సలహాగా స్వీకరించవచ్చునని విశదమౌతుంది. అయితే శ్రీఅరవిందులు చెప్పదలచుకొన్నది ఇంతమాత్రమే కాదు. ఇతరుల దోషాలను ఎంచడం కాకుండా మన తప్పులను మనం జాగ్రత్తగా తెలుసుకొన గలగాలంటారు శ్రీఅరవిందులు.

తన తప్పులను తాను చూడకుండా ఇతరుల దోషాలను ఎంచే లక్షణం ఈ ఒక్క విషయంలోనే కాదు. అన్నివిషయాల్లోనూ ఉంటుంది. మన బలహీనతల్లో ఈ లక్షణం మరీ ప్రస్ఫుటం అవుతుంది. ఉదా: మనలో ఒక దురలవాటుగాని, దోషంగాని, అపరిపక్వతగాని ఉంటే, అది మనకు అత్యంత సహజమైనదిగా కనిపిస్తుంది. మరి ఆ బలహీనతే, ఆ పరిపక్వతే, ఆ అవాంఛనీయ అలవాటే – ఇతరులలో మనకు కనిపించిందనుకోండి. అప్పుడు దాన్ని మనం ఏమాత్రం సహించలేం! "ఏమిటి? ఆయన అలా ఉంటారేమిటి?" అంటాం. ఆ "అటువంటిది" మనలో కూడా ఉన్న సంగతిని గమనించనే గమనించం! ఎదటివారి బలహీనతకు, దోషానికి – "అసహ్యం" అనే మరో దానిని కూడా చేరుస్తాం.

నీ ప్రతిబింబమే నీ సమాజం

దీనిలోంచి మనకు ఓ సందేశం లభిస్తుంది. ఒక వ్యక్తిలో నీకు సమ్మతం గాని, నువ్వు భరించలేని దానిని గమనించినప్పుడు "ఏమిటి? అతడు అలా ఉన్నాడేమిటి? అలా ప్రవర్తిస్తాడేం? అస్తమానం అలా మాట్లాడతాడేమిటి? అలా చేస్తాడేమిటి?" అని అనుకోవడం కాదు. "సరే! బాగానే ఉంది. దాన్ని అలావుంచి, అదే పనిని నేను చేస్తేనో? దాన్నే నేను స్వల్ప మార్పులతోనైనా చేయడం లేదు కదా అని నిర్ధారించుకున్న తరువాతనే ఆయన్ని విమర్శించడం ఉత్తమం" అని నీకై నువ్వు అనుకోవాలి. ఇతరులను గురించి తప్పుపట్టే ప్రతీసారీ ఇలా ఆత్మపరిశీలన చేసుకోగలిగే చక్కని భావన, ఆలోచనా ఉంటే జీవితంలో ఇతరులతో నీ సంబంధాలను నువ్వు ఒక దర్పణంగా పరిగణించగలవు. నీలో ఉన్న నీ బలహీనతలను ఆ దర్పణంలో నువ్వు సులువుగా, స్పష్టంగా చూడగలుగుతావు.

వృధా వాదనలు వద్దు

సాధారణంగా ఎదటి వారిలో నువ్వు భరించలేని విషయం ఏదైనా ఉన్నదంటే – అదే విషయం తెర మరుగునో, నిక్షిప్తంగానో, లేదా మరో రూపంలోనో నీలోనూ ఉందన్న మాట. అది

నిన్ను మభ్యపరుస్తున్నది, అంతే! అయితే అసలు విషయం ఏమి టంటే – నీలో ఉన్న ఆ గుణం నీకు దోషం అనిపించదు. కాని అదే విషయాన్ని ఇతరుల్లో చూస్తే మాత్రం అది పెనుభూతంగా మారిపోతుంది!

దీన్ని అవగాహన చేసుకుని, అనుభూతి చెందడానికి ప్రయత్నించు. నీ అంతట నీవు మారడానికి, ఇది ఎంతగానో దోహదం చేస్తుంది. అంతేకాదు. ఇతరులతో నీ సంబంధాల విష యంలో ఇది సహనాన్ని సమకూరుస్తుంది. ఈ అవగాహనవల్ల కలిగే సద్భావం ధర్మమా కాదా అనే వృధా వాదనలు అదృశ్య మౌతాయి.

వివాదాలే ప్రధాన వ్యాపకం కాదు

వివాదాలు లేకుండా మనిషి జీవించ వచ్చు. ఇలా అంటే నీకు ఆశ్చర్యంగా ఉండవచ్చు. ఎందుకంటే ప్రస్తుతపరి స్థితి దీనికి విరుద్ధంగా ఉంది. తమలో తాము వాదులాడుకోవ డమే ప్రజల ప్రధాన వ్యాపకం అయినట్టు మొత్తం ఈ సామాజిక జీవితం అంతా ప్రచ్ఛన్నంగానో, ప్రస్ఫుటంగానో సంఘర్షణల మయమే అయిపోయింది.

ఒరుల తప్పులు మనకు ఉపదేశాలు

ప్రతీ విషయాన్ని ఆప్యాయమైన చిరు నవ్వుతో తిలకించు. నీకు చికాకు కలి గించే అన్ని విషయాలు నీకు సందేశం ప్రబోధిస్తున్నాయని భావించు. అప్పుడు నీ జీవితంలో శాంతి రాజ్యం ఏలుతుంది. దాంతో నీ జీవితం ఎంతో ప్రభావితం కూడా అవుతుంది ఇక. అప్పుడు నీ కర్తవ్యాన్ని నువ్వు ఆచరించడం ప్రారంభించు. వివరంగా చెప్పాలంటే – నువ్వు ఏం చేయాలో తెలుసుకో. ఇతరులు చేయవలసిన విషయం గురించి ఆవేదన చెందకు. అది నీ పని కాదు.

నిజమైన వైఖరికి ఉత్తమమార్గం ఏమిటంటే...

మరేం కాదు.... "నా చుట్టూ ఉన్నవారూ, నా జీవితంలోని సర్వసంఘటనలు, నా సన్నిహితులు – ఈ మొత్తమంతా నాకొక దర్పణం. నేను సాధించవలసిన ప్రగతిని నాకు చూపెట్టడం

కోసం దివ్యాత్మ నాకు ఈ దర్పణాన్ని ప్రసాదించింది.” ఇలా అనుకో హాయిగా. అంతేకాదు. ఇతరులలో నాకు నచ్చనివి ఉన్నాయంటే అవన్నీ నాకు నేను “సాధించుకోవలసినవి అన్న మాట” అని కూడా భావించుకోవాలి.

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు ✓

విభాగము II:

భక్తి

శ్రీఅరవిందుల ప్రవచనములు

శ్రీకృష్ణుడు భక్తసులభుడు అంటారు. తేలికగా అతన్ని ప్రేమించి మనస్సు, హృదయం, శరీరం, ఆత్మ ఆయనకు సమర్పిస్తే చాలట. ఇది ఎంతవరకు నిజం? భక్తి అంటే అసలు ఏమిటి? భక్తియొక్క తీవ్రస్థాయి నందుకొనుటెట్లు? దైవ మెప్పుడు సాక్షాత్కరిస్తాడు? దాని కెన్నాళ్లు పడుతుంది? పోనీ కొంతకాలమైన తరువాత మొదటి చూపైనా దక్కుతుందా? భక్తిసాధన చేసే వారికి ఎదురయ్యే ప్రశ్నలివి. వీటిని గురించిన మీమాంస ఇందున్నది.

– సంపాదకుడు

భక్తుని పారవశ్యత

వైష్ణవభావాన్ని భక్తిని నీవు హృదయపూర్వకంగా అంగీకరించటం. దైవానుభవం కలిగే దాకా దైవానికి ప్రేమను అర్పించలేము అనే నీ పట్టుదలతో జోడిస్తే విభ్రమం కలుగుతోంది. వైష్ణవ దృక్పథంలో భక్త్యానందం దానికోసమే అనేది తప్ప సామాన్యమైన విషయం ఇంకేమి ఉంది? “నాకు దేనినీ ఇవ్వకపోయినా సరే, భక్తిని ఇవ్వు. నిన్ను కలుసుకోటానికి ముందు ఎంతకాలం అయినాసరే, అభివ్యక్తి ఎంత ఆలస్యం అయినా సరే, నా భక్తి, నీ కోసం నా అన్వేషణ, నా పిలుపు. నా ఆరాధన సర్వదా ఉండాలి”

అని అది ఆక్రోశిస్తుంది. "నా జీవితమంతా నీ కోసం వెదుకుతు న్నాను. అయినా నీవు అక్కడ లేవు. కాని నేను వెదుకుతాను. వెదకటం, ప్రేమించటం, ఆరాధించటం ఆపలేను" అని ఎంతగా భక్తుడు గానం చేయలేదు! భగవంతుని అనుభవం మొదట రాక పోతే భగవంతుని ప్రేమించటం అసాధ్యం అనేటట్లైతే ఇదెలా సంభవం అవుతుంది? నిజానికి నీ మనస్సు గుర్రంముందు బండిని పెడుతోంది. ఎవ్వరైనా పట్టుదలతో తీవ్రభావనతో ముందుగా దైవాన్ని అన్వేషిస్తారు. ఆ తర్వాత ఆయనను కనుగొంటారు

భగవత్సాక్షాత్కారం కోసం నిరీక్ష

తాత్కాలికంగా చిన్నమెరుపువంటి దర్శనమైనాసరే ఎంతోకాలం, తీవ్రంగా అన్వేషించిన తర్వాతనే వస్తుంది. భగవత్ప్రేమగానీ ఆయనకోసం హృదయవాంఛగాని మొదట వస్తుంది. ఆ తర్వాత భగవత్ప్రేమను హృదయవాంఛకు, అది ఇచ్చే సమాధానాన్ని, పరమ హర్షానందస్పందనను తెలుసుకోటం జరుగుతుంది. "ముందు నీ ప్రేమను చూపించు, నీ అనుభవాన్ని నామీద కురిపించు, నా కోరికను తృప్తిపరచు. అప్పుడు నీకు అర్హత ఉన్నంతకాలం నిన్ను ప్రేమించగలనో లేనో చూస్తాను" అని దైవంతో ఎవరూ అనరు. ముందుగా అన్వేషించవలసిందీ, ప్రేమించవలసిందీ, అన్వేషణను అనుసరించవలసిందీ, ఎవరిని అన్వేషిస్తున్నావో ఆయన పట్ల ఉద్వేగం పొందవలసిందీ నిశ్చయంగా అన్వేషకుడే – అప్పుడు మాత్రమే తెర ప్రక్కకు తొలుగుతుంది, వెలుగు కనిపిస్తుంది, ఎడారిలో దీర్ఘకాలం ప్రయాణం చేసిన అంతరాత్మకు సంతృప్తినివ్వగల ముఖం అభివ్యక్తం అవుతుంది.

హృదయం గాఢమైన భక్తితో పరిదగ్ధమైపోవాలి

నువ్వు మళ్లీ అనవచ్చు "ప్రేమించినా ప్రేమించకపోయినా సర్వదా నేను కావాలనుకున్నానుగదా! ఇప్పుడు మరింతగా కోరుతున్నాను. కాని నాకు వచ్చిందేమీ లేదు" అని. నిజమే కాని కావాలనుకోటమే సర్వం కాదు. నీవు ఇప్పుడు చూడటం ప్రారంభించినట్లుగా కొన్ని పరిస్థితులను – హృదయపరిశుద్ధి వంటి వాటిని – కలిగించుకోవాలి.

నీ సిద్ధాంతము "దైవం కావాలని నేను ఒకసారి అనుకొంటే దైవం నాకు అభివ్యక్తం కావాలి. నా దగ్గరకు రావాలి, కనీసం తనను గురించిన మెరుపులైనా నా కివ్వాలి, యథార్థమైన, దిట్ట మైన ఇంద్రియగోచరం అయే అనుభవాన్నివ్వాలి. అంతేగాని కేవలం నాకు అర్థంకాని నేను విలువకట్టలేని అస్పష్ట విషయా లను కాదు. నాకు అర్హత ఉండనీ ఉండకపోనీ దైవానుగ్రహం నేను పిలిచినప్పుడు పలకాలి. అలా కాకపోతే దైవానుగ్రహం అనేది లేదు." కొన్ని సందర్భాలలో దైవానుగ్రహం అలాగే చేయ వచ్చు. అయితే అది దైవానికి విధ్యుక్తధర్మంగాని, బాధ్యతగాని, ఒడంబడిక గాని సంధి ఒప్పందం కాని కాదు. దైవం హృదయం లోకి చూస్తాడు. తగిన సమయం అనుకొన్నప్పుడు తెరను తొల గిస్తాడు.

ఆవేశముయొక్క పరాకాష్ఠ

ఎవరైనా ఆయన నామాన్ని ఉచ్చరిస్తే చాలు ఆయన సమాధానం ఇచ్చి తీరాలి. తక్షణం అక్కడ ఉండాలి. అదే భక్తి సిద్ధాంతంమీద నొక్కి చెబుతున్నావు. బహుశా అలా కావచ్చు కాని ఎవరి విషయంలో ఇది నిజం? నామశక్తి అనుభూతిని పొంది, నామ ఉద్వేగాన్ని కలిగి దాన్ని తన పిలుపులో పెట్టగల ఒక విధమైన భక్తుని విషయంలో, ఎవరైనా ఆ విధంగా ఉంటే తక్షణ సమాధానం రావచ్చు. అలా లేకపోతే ఆ విధంగా అతడు కావాలి. అప్పుడు సమాధానం లభించవచ్చు. కాని కొంతమంది సమాధానం లభించేముందు సంవత్సరాలపాటు నామాన్ని ఉచ్చ రిస్తారు. శ్రీరామకృష్ణులకే కొన్ని నెలల తర్వాత అది వచ్చింది. కాని ఎటువంటి నెలలవి! ఆయన అది రాకముందు ఎటువంటి వేదన అనుభవించవలసి వచ్చింది! అయినా ఆయన విజయం సాధించారంటే కారణం ఆయనకు అదివరకే పరిశుద్ధమైన హృదయం, అందులో తీవ్రమైన ఆవేశం ఉన్నాయి.

జ్ఞానికి భక్తునికి తేడా

ముందుగా అనుభవం కావాలనేది భక్తుడు కాదు. జ్ఞానాన్ని పొందిన సాధకుడు. "అను భవం లేకపోతే నాకు తెలిసేదెలా?"

అంటాడు. కానీ అతడు కూడా ముప్పై సంవత్సరాలే అయినా నిశ్చయమైన అనుభవం కోసం శ్రమపడుతూ అన్వేషిస్తూ ఉండవచ్చు. యథార్థంలో మేధావి, హేతువాది ఇలా అంటాడు. "భగవంతుడే గనక ఉంటే తనను ఆయన నాకు రుజువు చేసుకోమను, అప్పుడు నేను నమ్ముతాను. ఆయనను అన్వేషించి ఆయన ఎలా ఉంటాడో చూడటానికి కొంత గంభీరమైన, కొనసాగే కృషి చేస్తాను."

మొదట మనిషి పునీతము కావాలి

ఇప్పుడు చెప్పినదాన్నంతటికీ అర్థం సాధనకు అనుభవంతో సంబంధం లేదని కాదు. అటువంటి బుద్ధిహీన ప్రకటన నేను జేయగలిగిన వాడను కాను. నేను చెప్పిందేమంటే, అనుభవం రావటానికి పూర్వమే దైవప్రేమ అన్వేషణ ఉండగలదు, సాధారణంగా ఉంటుంది అని – అది ఒక అంతఃప్రేరణ. అంతరాత్మలో సహజంగా ఉండే వాంఛ. అంతరాత్మను ఆవరించిన కొన్ని ఆచ్ఛాదనలు అంతర్ధానం అయిన వెంటనే, లేదా అంతర్ధానం కావటం ఆరంభం ఐన వెంటనే అది పైకి వస్తుంది. ఇది చెప్పిన తర్వాత నేనన్నదేమంటే "అనుభవాలు" ప్రారంభం కాక మునుపే, మరొక విధంగా కాదు.

దేవాలయాన్ని పరిశుభ్రపరచాలి

ప్రకృతిని సంసిద్ధం చేయుటం (పరిశుద్ధమైన హృదయం మొదలైనదంతా) మెరుగైనదని, నిజమైన అనుభవంకోసం హృదయం ప్రాణికస్థితి సిద్ధం అయ్యేదాక అనుభవాలు ముందుగా రావటంవల్ల ప్రమాదం ఏర్పడిన అనేక సందర్భాల మీద ఆధారపడి నేనిలా చెప్పాను. చాలా సందర్భాలలో మొట్టమొదట నిజమైన అనుభవం, దైవానుగ్రహ స్పర్శ ఉన్న మాట నిజమే. కాని అది ఎప్పుడూ ఉండదు. స్పృశించి ఉపసంహరించుకొనేది, ప్రకృతి సంసిద్ధం అయ్యేవరకూ వేచి ఉండేది ఏదో అయి ఉంటుంది. ప్రతి సందర్భంలోనూ, అధికసంఖ్యాక సందర్భాలలో అయినా కూడా ఇలా జరగదు అనుకొంటాను. అంతరాత్మకు సహజమైన తీవ్రవాంఛతోనే ఆరంభించాలి. అప్పుడు దేవాలయం

సిద్ధంకావటం కోసం ప్రకృతితో పెనుగులాడాలి. అప్పుడే గర్భా లయంలో శాశ్వత సాన్నిధ్యం

*

భక్తియోగప్రథమదశను సంగ్రహంగాచెప్పే మూడు పదాలున్నాయి.

శ్రద్ధ, అర్చన, విధేయత.

భక్తియోగద్వితీయదశను సంగ్రహంగాచెప్పే మూడుపదాలున్నాయి.

ఆరాధన, ఆనందం, ఆత్మరతి.

భక్తియోగ పరాకాష్ఠ దశను సూచించే మూడు మాటలున్నాయి.

ప్రేమ, పారవశ్యం, శరణాగతి.

*

శ్రద్ధ మన మొదటి అవసరం. దైవంలో, ప్రపంచస్థితిలో, దివ్య అస్తిత్వ సర్వ ప్రాముఖ్యతలో శ్రద్ధ లేకుండా ఆకాంక్షకు అంకిత భావానికి కారణం లేదు. అటువంటి ఆకాంక్షలో శక్తి లేదు. అంకితభావం వెనుక బలం లేదు.

సందేహాలుంటే ఫరవాలేదు. అస్తిత్వకేంద్రంలో ఉన్న శ్రద్ధ అనే కొండరాయికి వ్యతిరేకంగా అవి ఏమీ చేయలేవు. సందేహం నిస్పృహలకు చెందిన వెల్లువ కొద్దిసేపు ఆ కొండరాయిని కప్పి వేయవచ్చు కాని ఆ కొండరాయి స్థిరంగా నాశనం లేనిదిగా బయటపడుతుంది. శ్రద్ధ హృదయానికి చైత్యపురుషుడు నివసించే అంతర్గత హృదయానికి చెందింది. బాహ్యంలో ఉండే హృదయం ప్రాణికజీవికి జీవవ్యక్తిత్వానికి ఆసనం.

*

భక్తి ఒక అనుభవం కాదు. అది హృదయ అంతరాత్మల స్థితి. చైత్యపురుషుడు మేల్కొని ప్రబలమైనప్పుడు వచ్చే స్థితి.

అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రరావు

భక్తి ప్రేమ

శ్రీఅరవిందుల ప్రవచనములు

మనస్సు, ఇంద్రియాలు అనే బంధనాలనుండి విముక్తినిచ్చే మార్గమే యోగము. భక్తి ప్రేమలు ఇందులో చాలా ముఖ్యమైన అంశములు. తనకంటె అధికమైన శక్తి ఒకటి ఉన్నదనే విష యాన్ని గుర్తించి తనను దానికి సమర్పించుకొనుటయే వీటి లక్షణము. అయితే దైవమునకు సమర్పించుకున్నపుడు నువ్వు ఏమాత్రం తొందరపడకూడదు. అయ్యో! ఇన్ని సంవత్సరాలైనా నాకు దైవసాక్షాత్కారము కలుగలేదే అనే ఊహ ఏమాత్రము పనికిరాదు. నువ్వు నీ మనస్సును పూర్తిగా ఖాళీ చేసుకొని "ఇదిగో ఈ పాత్ర నీదే, దీనిని నీ యిచ్ఛవచ్చినట్లు నీ యిచ్ఛ వచ్చిన కాలంలో పూరించుము" అని ఆయనను ప్రార్థేయ పడాలి. అంతే.

– సంపాదకుడు

దైవముయొక్క వైయక్తికరూపము, వ్యాపకరూపము

నువ్వు యోగం ద్వారా నీ మనస్సు యొక్క కోటగోడలను ఛేదించుకొని బైటపడ్డప్పుడు మిరిమిట్లు గొలిపే దైవసాన్నిధ్యంతో నీ ఒళ్ళంతా పులకరించిపోతుంది. ఇది విశ్వవ్యాపమైన ఆదిశక్తి. నీ మనస్సు ఆ దర్శనాన్ని పొంది చాలా తృప్తిచెందుతుంది. కాని నీ హృదయము, ఆత్మ, ఆ దివ్యజలధిలో మునకలు తేలటంతో తృప్తిచెందునవి కావు. నీకు ద్యోతకమైన ఆ దివ్యజ్యోతిని క్రియా శీలము చేయాలి. దైవము గాఢాలింగనంతో నిన్ను పరవశింప చేయాలి.

*

భక్తికి ప్రేమకు తేడా

తనకంటే గొప్పదైన దానిని ఉన్నతమైన దానిని ఆరాధించి, పూజించి, ఆత్మసమర్పణ చేసుకోవడం భక్తియొక్క లక్షణం. ప్రేమతత్వం సామీప్యాన్ని, ఐక్యమవడాన్ని (సాయుజ్యం) కోరు

గుంటుంది. ఈ రెండింటికీ 'ఆత్మసమర్పణ' స్వభావం ఉంది. యోగంలో భక్తి, ప్రేమ, రెండూ అవసరమే. ఒకదానికొకటి తోడైనప్పుడు సంపూర్ణంగా శక్తివంతమవుతాయి.

*

దైవమును ప్రేమించడమెలా?

భగవంతునిపట్ల ఉండే ప్రేమలో కూడా మానవసహజ గుణం కనబడుతుంది. ప్రతిఫలాపేక్ష వుండటంవల్ల, ఆ ప్రతిఫలం రానట్లనిపిస్తే ప్రేమ క్షీణిస్తుంది. స్వప్రయోజనం వుండటంవల్ల, భగవంతుడిని మానవుల కోరికలన్నీ తీర్చేవానిగా ఎంచి, అవి తీరకపోతే భగవంతుని ఎడ దురభిమానం తలెత్తడం, నమ్మకం కోల్పోవడం, ఆసక్తి, ఉత్సాహం క్షీణించడం జరుగుతుంది. వాస్తవానికి భగవంతుని ఎడల వుండే నిజమైన, ఆధ్యాత్మిక, చైత్య (psychic) ప్రేమ ఇలాంటిది కాదు. ప్రేమ, ఆరాధన, సమర్పణ, ఐక్యతలని మనోమయ జీవి వాంఛిస్తాడు. వీటిని ఆ భగవంతుడే సంపూర్ణంగా సంతృప్తిపరచగలడు. జీవియొక్క ఆధ్యాత్మిక చిత్తప్రవృత్తి తన అత్యున్నత, సంపూర్ణతకి, సచ్చిదానంద రూపానికి మూలమైన ఆ భగవంతునితో సంబంధం పెంచుకుని, లీనమై, ఐక్యమవడం. జీవియొక్క ఈ మానసిక, ఆధ్యాత్మిక చిత్త లక్ష్యాలు రెండూ ఒకే అంశానికి రెండు కోణాలు (వాటి లక్ష్యం ఒకటే). మనసు, ప్రాణము, శరీరము – ఈ దివ్యప్రేమకి ఆధారంగాను, గ్రహీతలుగానూ పనిచేస్తాయి, కానీ ఇవి ఇలా సంపూర్ణంగా, నిరాటంకంగా పనిచేయాలంటే, అహంయొక్క నీచ నిర్బంధాలనుంచి విముక్తమై జీవియొక్క మనోమయ, ఆధ్యాత్మిక తత్వానికి అనుగుణంగా మలచుకోవాలి.

*

దివ్యప్రేమకు యోగ్యత

దివ్యప్రేమ మానవప్రేమకంటె భిన్నమైనది. అది లోతుగా, అనంతంగా, నిశ్శబ్దంగా ఉంటుంది. దాని అనుభూతి పొంది, దానిని తెలుసుకుని, దానికి తగిన రీతిలో ఉత్తరమివ్వాలంటే ప్రశాంతత, విశాలత్వం అలవరచుకోవాలి. నిరంతరం భగవంతునికి సంపూర్ణ

అర్పణభావంతో ఉండటమే లక్ష్యంగా పెట్టుకోవాలి. కేవలం భగవత్ చిత్తానికి ఒక పరికరంగానో, మాధ్యమంగానో ఉంటూ, తనని ఏ అవసరానికి, దేనికి, ఎలా వాడుకోవాలో ఆ భగవంతుని దివ్యజ్ఞానానికి, ప్రేమకీ వదిలేయాలి. పరిమితకాలంలో తాను ప్రగతి సాధించి, అభివృద్ధిచెంది, జ్ఞానినవాలని పట్టుపట్ట కూడదు. ఎంతకాలమైనా ఓర్పుతో, దీక్షతో వేచివుండి, కేవలం ఆ భగవంతునికే సమర్పణమై, ఆ దివ్యత్వం అభివ్యక్తమయే మార్గమవడమే తన జీవితలక్ష్యమనుకోవాలి. సాధనరహస్యం ఆత్మసమర్పణే – ఆత్మసమర్పణ ఎంత బాగా జరిగితే (దివ్యత్వాన్ని) స్వీకరించే శక్తి కూడా అంత ఎక్కువగా పెరుగుతుంది. కానీ ఇది సాధ్యమవాలంటే, ఎటువంటి అసహనానికీ, తిరుగుబాటుకీ తావు లేదు. భగవంతుడినుంచి తాను ఏమీ పొందడం లేదనీ, తనకి ఎటువంటి సహాయం లభించడం లేదనీ, తాను ప్రేమించబడడం లేదని మొ॥ అన్ని ఆలోచనలూ పూర్తిగా మాయమవాలి. ఈ మార్గాన్ని, జీవితాన్ని, ఈ ఆధ్యాత్మిక కృషిని త్యజించాలన్న ఊహకు కూడా తావు లేదు.

అనువాదం: బి.వరలక్ష్మి

చైత్యపురుషుని చుట్టూ ఏకీకరణ

శ్రీమాత ప్రవచనములు

మానవజీవితమింత దుర్భరంగా తయారైనందుకు కారణాలేమిటి? మనస్సు దాని కోరికలు, ప్రాణికము దాని ఆవేశములు, దేహము దాని అవసరములు. వీటన్నిటిని కళ్లెం వేసి దైవోన్ముఖం చేయుటమెలా? నీ అంతరాంతరము భగవంతునికి ఆవాసము. నీ హృదయము వెనకాలే చైత్యపురుషుడున్నాడు. ఆయనను పట్టుకోవాలి. మనోప్రాణికదైహికములను ఆయన ఏలుబడి క్రిందకు తీసుకురావాలి. ఇదెలా సాధ్యము? "నేను నీ వాడినే" అని నువ్వు దైవానికి విన్నవించుకోవాలి. అప్పుడు

కాలక్రమేణా నీలోని అన్ని విభాగములు ఆ మార్గమునే అవలంబించి, ఒకదాని కొకటి తోడుగా, ఒకే భావముతో అలరారుతూ దివ్యయానమును సంతోషముగా కొనసాగించగలవు.

— సంపాదకుడు

ప్రశ్న: మన అంతశ్చేతనలో ఏకత్వస్థితిని, మిశ్రమంకాని మేలిమి తత్వాన్ని నెలకొల్పడం ఎలా?

నీ అంతరాంతరములో చైత్య పురుషుడు

నీ సంకల్పాన్ని దృఢంగా ఉంచుకోవాలి. సంయమనం లేకుండా పోయిన నీలోని భాగాలను అవిధేయులైన పిల్లలుగా పరిగణించు. వాటి విషయంలో నిరంతరం ఓర్పుతో ఉండు. వాటి తప్పు లేమిటో వాటికి తెలియచెప్పు. నీ చైతన్య అగాధాలలో చైత్యపురుషుడున్నాడు. నీలోని దైవానికి నిర్మించబడిన దేవాలయం అది. నీలోని అన్ని విభిన్న భాగాలను, నీ చైతన్యంలోని పరస్పరవిరుద్ధ కదలిక లన్నింటినీ ఏకీకరణం చేసే కేంద్రం నీ చైత్యపురుషుడే. చైత్యపురుషుని చైతన్యం, దాని ఆకాంక్ష కనుక నీకు పట్టుపడితే, ఈ సందేహాలను, ఇక్కట్లను రూపుమాపవచ్చును. ఇందుకు కొంతకాలం పట్టవచ్చు. కాని చివరికి నీవు విజయం సాధిస్తావు. ఒకసారి నీవు భగవంతుని వైపు తిరిగి "నేను నీ వాడిని" అన్నప్పుడు, భగవంతుడు "సరే" అని పలికినప్పుడు, ప్రపంచం యావత్తు నిన్ను ఆ భావన నుండి దూరం చేయలేదు. నీలోని కేంద్రీయచైతన్యం సమర్పణ చేసుకుంటే, ప్రధానమైన ఇక్కట్టు మాయమైనట్లే. బాహ్యాచైతన్యం ఒక పొర వంటిది. సామాన్యజనంలో ఈ పొర కఠినమైన శిల వలె గట్టిగా ఉంటుంది. వారికి భగవంతుని పట్ల ఎరుక ఉండదు. ఒక్కసారి, ఒక్క క్షణం మాత్రమే చాలు, నీలోని అంతఃచైతన్యం "నేను ఇక్కడ ఉన్నాను, నేను నీ వాడిని" అని అంటే చాలు. ఒక వంతెన నిర్మించినట్లే. కొద్దికొద్దిగా ఈ పొర పలుచనై, రెండు భాగాలు దగ్గరకు కలిసి, బాహ్య, అంతః చైతన్యాలు ఒక్కటిగా అవుతాయి.

ఆశవల్ల చాలామంది యోగులు దెబ్బతిన్నారు. ఆశ అనేది ఓ కొరుకుపుండు. చాలాకాలం దాగి ఉంటుంది. మొదట ఆశ అనేది లేకుండానే చాలామంది, యోగమార్గంలో నడక ప్రారంభిస్తారు. కాని వారికి శక్తులు రాగానే, ఆశ పెరిగిపోతుంది. అది మరింత తీవ్రరూపం దాల్చుతుంది – ఎందుకంటే మొదట్లో దానిని త్రుంచివేయకపోవడం వల్ల.

మహిమలను ప్రదర్శించరాదు

కొన్ని అద్భుతశక్తులు సిద్ధింపచేసుకున్న ఒక యోగిని గూర్చి ఒక కథ ఉంది. ఆయన శిష్యులు ఆయన్ని విందుకు పిలిచారు. ఒక పెద్ద బల్లపై భోజనం ఏర్పాటు చేశారు. ఏదో విధంగా తమ యోగశక్తిని ప్రదర్శించమని శిష్యులు గొడవ చేసారు. తను అటువంటి శక్తిని ప్రదర్శించకూడదని అతనికి తెలుసు. కాని ఆశ అతనిలో గూడు కట్టుకుని ఉంది. అది చాలా అల్పమైన మహిమ. అటువంటి మహిమలు చేయడం తేలికేనని నిరూపించవచ్చు. భగవంతుని మహిమలనుగూర్చి వారికి బోధించినట్లుగా కూడా ఉంటుందిలే అని అనుకున్నాడు పాపం ఆ పెద్దమనిషి. అప్పుడు ఆయన వారితో అన్నాడు –

"బల్ల తీసివేయండి. పైన ఉన్న పళ్ళాలు, టేబుల్‌క్లాత్ అలాగే ఉంచండి" అని. పైన ఉన్న గుడ్డను అలాగే ఉంచి, బల్లను శిష్యులు తీసివేశారు. పైన పళ్ళాలు అన్నీ పడిపోతాయని వారు భయపడ్డారు. కాని అద్భుతం! పైన గుడ్డ, పళ్ళాలు అలాగే ఉండిపోయాయి. బల్ల ఉన్నట్లుగానే అవి అలాగే గాలిలో నిలబడి ఉన్నాయి. శిష్యులు ఆశ్చర్యచకితులైనారు. కాని గురువు ఒక్క గంతువేసి, గగ్గోలు పెడుతూ, బయటకు పరుగుదీస్తూ "నాకు ఇక శిష్యులు దొరకరు! నా దేవుణ్ణి నేను వంచించాను" అని అరిచాడు.

అతని గుండెలో మంటలు. స్వార్థప్రయోజనంకోసం అతను తన దివ్యశక్తులను దుర్వినియోగం చేశాడు.

దైవేచ్ఛనే పాటించవలెను

శక్తుల్ని ప్రదర్శించడం చాలా ప్రమాదము. అయితే వాటికి

ప్రయోజనం లేదని కాదు. అవి ఏవిధంగా వచ్చాయో అదే విధంగా వాటిని వాడాలి. భగవంతునితో సాయుజ్యం చెందడం వల్ల అవి సిద్ధించాయి. వాటిని భగవదేచ్ఛ ప్రకారం ఉపయోగించుకోవాలే తప్ప ఏవో గొప్ప ప్రదర్శనగా వాటిని వాడరాదు.

నీకెవరైన గుడ్డివాడు తటస్థిస్తే, అతనికి కంటిచూపును ప్రసాదించే శక్తి నీకు ఉంటే, ఒక వేళ ఆ మనిషి చూడాలని భగవంతుడు సంకల్పిస్తే, 'అతని కన్నులు వీక్షించుగాక!' అని మాత్రమే నీవు అనాలి. అతనికి అప్పుడు చూపు వస్తుంది. నీవు అతని గుడ్డితనాన్ని నయంచేయాలన్న ఉద్దేశ్యంతో అతను చూడాలని నువ్వు కోరితే నీ వ్యక్తిగత ఆశను, కీర్తికాంక్షను, తృప్తిపరచడానికి ఆ శక్తిని నువ్వు ఉపయోగించినట్లు కాగలదు. అటువంటి సంఘటనలలో చాలావరకు నీ శక్తిని నువ్వు కోల్పోవడమే కాకుండా, ఆ మనిషిలో నువ్వు ఏదో కలవరం సృష్టిస్తావు. పైకిమాత్రం రెండుమార్గాలు ఒకటే. కాని ఒక సంఘటనలో భగవంతుని సంకల్పం కారణంగా నువ్వు పనిచేస్తే మరొక సంఘటనలో ఏదో వ్యక్తిగత ఉద్దేశంతో నువ్వు పనిచేసినట్లు కాగలదు.

దైవేచ్ఛను గుర్తించటమెలా?

మనల్ని కార్యోన్ముఖుల్ని చేసేది భగవత్సంకల్పమే అని తెలుసుకోవడం ఎలా అని నువ్వు అడగవచ్చు. దైవసంకల్పాన్ని గుర్తించడం కష్టమేమీ కాదు. ఆ దారిలో ఎక్కువ దూరం వెళ్ళకుండానే ఆ విషయం తెలుసుకోవచ్చు. భగవత్ వాక్కును నువ్వు వినగలగాలి. గుండెలో వినిపించే అతిసూక్ష్మ వాణి అది. నువ్వు వినడానికి అలవాటుపడితే, దైవసంకల్పానికి వ్యతిరేకంగా ఏదైనా పని నువ్వు చేస్తే, నీకు ఏదో చికాకు కలుగుతుంది. తప్పుమార్గంలోనే నువ్వు నడుస్తుంటే, నీలో కలవరం బయలుదేరుతుంది. నీ చీకాకుకు ఏదో కారణం చూపి నిన్ను నువ్వు తృప్తిపరచుకొని నీ బాటలో నువ్వు నడిస్తే, నెమ్మదిగా నీ అంతర్దృష్టిని కోల్పోయి, తప్పుపనులు చేస్తూ అసలు ఎటువంటి చికాకు పొందకుండా కాలాన్ని గడిపేస్తావు. ఏదైనా, స్వల్ప

కలవరం నీలో బయలుదేరినట్లు నువ్వు గుర్తిస్తే నువ్వు ఒక క్షణం ఆగి 'దీనికి కారణం ఏమిటి?' అని నీ అంతరాత్మన ప్రశ్నిస్తే, నీకు నిజమైన సమాధానం వస్తుంది. అప్పుడంతా స్పష్ట అవుతుంది. నీకు స్వల్ప కలవరం కలిగినా ఏదైనా చికాకు క గినా ఏదో సమాధానం చెప్పుకొని నిన్ను నువ్వు తృప్తిపరచ కొనే మార్గం విడిచిపెట్టు. నువ్వు ఒక్క క్షణం ఆగి, కారణ కోసం ఆలోచించినప్పుడు, పూర్తిగా చిత్తశుద్ధితో, నిజాయితీత మెలగాలి సుమా! మొదట నీ మనస్సు యుక్తంగా, అందం ఉండే వివరణ ఇస్తుంది. దానిని ఆమోదించవద్దు. ఊర్ధ్వం వైపు వీక్షించి, "ఈ కదలిక వెనుక ఏముంది, నేనెందుకీ పని చేస న్నాను" అని అడగాలి. నీకు ఒక చిన్న తరంగం (అలజడి కనిపిస్తుంది. నీ వైఖరిలో అపమార్గం పట్టే ధోరణి, ఒక మెలి నీకు ఆందోళన, లేదా కలవరం కల్గిస్తున్నట్లు నీకు గోచ స్తుంది.

మానవసేవయొక్క అంతరార్థము

ఆశయొక్క, కాంక్షయొక్క సామాన రూపాలలో ఒకటి మానవాళికి సే చేయాలన్న భావం. అటువంటి సే పట్ల బంధం, వ్యక్తిగతకాంక్ష, ఆశ (ambition) ఉన్నట్లు సూ స్తుంది. మానవాళికి బోధించడానికి ఒక మహాసత్యం తన వ ఉందని భావించే గురువు, తనకు చాలామంది శిష్యులు కావ లని కోరేవాడు, శిష్యులు తనని విడిచి వెళ్ళిపోతే బాధపడేవాడ ఎవరైన వస్తే అతనిని తన శిష్యునిగా చేసుకోవాలనుకునేవాడ — అటువంటి గురువుకు కాంక్ష ఉన్నట్లే. భగవదాదేశం నువ్వు అనుసరించడానికి సంసిద్ధంగా ఉంటే, నీకు ఏ పని అప్పగి చినా, ఎంత బ్రహ్మాండమైన పని అయినా సరే, నువ్వు చేయగ ఉండాలి. ఎంత ప్రశాంతతతో నువ్వు ఆ పనిని చేపట్టావో అం నిర్లిప్తంగా దానిని విడిచిపెట్టగల్గి ఉండాలి. నీదే బాధ్యత అ భావన తగదు. ఏ వస్తువు పట్లగాని, ఏ జీవనవిధానం పట్లగా బంధం (వ్యామోహం) పనికిరాదు. నువ్వు పూర్తిగా స్వేచ్ఛగ ఉండాలి. నీకు నిజమైన యోగవైఖరి రావాలంటే, భగవంతు

నుండి ఏ ఆదేశం వచ్చినా నువ్వు స్వీకరించగలిగి ఉండాలి. దానిని తేలికగా ఎటువంటి విచారం లేకుండా వదులుకునే స్థితిలో కూడా ఉండాలి. "నాకేమీ అవసరం లేదు" అని పలికే యతి, "నాకీ వస్తువు కావాలి" అనే సంసారి ఒక్కటే. ఒకరు సన్యాసంపట్ల వ్యామోహితులైతే, మరొకరు సంపద పట్ల వ్యామోహితులు.

కోరికలు వేరు
దివ్యప్రేరణలు వేరు

నువ్వు భగవంతుడిచ్చే వస్తువుల్ని మాత్రమే స్వీకరించాలి. దాగివున్న కోరికల నుండి కూడా అవి రావచ్చును. అవచేతనలో కోరికలు దాగి ఉంటాయి. అవి తెచ్చే వస్తువులు భగవంతుని నుండి వచ్చేవి కావు. కాని మారువేషాలు ధరించిన కోరికలనుండి వచ్చే వస్తువులు అవి. నువ్వు వాటిని గుర్తించలేకపోవచ్చును.

భగవంతుని నుండి వచ్చే వస్తువు ఏదో నీకు తేలికగా తెలుస్తుంది. నీవు స్వేచ్ఛగా అనుభూతి పొందుతావు. ఎంతో హాయిగా ఉంటుంది. మనసంతా శాంతితో నిండిపోతుంది. ఏదైనా వస్తువు నీకు కనిపిస్తే, నువ్వు దానిపైకి దూకి, "చిట్టచివరికి నాకు దొరికింది" అని అరిస్తే – అది భగవంతుని వద్దనుండి రాలేదని నీకు తెలుస్తుంది.

భగవంతునితో సాయుజ్యానికి, సంబంధం కలిగియుండడానికి శాంతి, సంయమనం అతిముఖ్యం.

అనువాదం: యజ్ఞన్న

మన మిప్పుడు స్వశక్తి మీదనే ఆధారపడవలసిన అవసరం లేదు. దైవము మన సహాయం కోసం తన చైతన్యాన్ని పంపించాడు.

శ్రీమాత

ప్రాణికము యొక్క రూపాంతరీకరణము

శ్రీఅరవిందుల ప్రవచనములు

ఈ సృష్టిలో దేవుడు గారడీలు చేస్తూ ఉంటాడు. పరిణామ ప్రక్రియద్వారా జడపదార్థంలోంచి మనిషి తయారైనాడు. మనిషి యొక్క తదుపరి పరిణామమే ప్రస్తుత విషయము. మనిషి అనగా మనోప్రాణికదైహికముల సంపుటి. రూపాంతరీకరణములో ఈ మూడు విభాగములకు పాత్ర ఉన్నది. మనస్సు ఒక ముఖ్యమైన కేంద్రము. ముందర దానికి నచ్చచెపితే అది ఇతర విభాగములవప కూడ ప్రభావితము చేయగలదు. ప్రాణికము ఇంకా ముఖ్యమైనది. మనిషిని ఆవేశపరుస్తుంది. వశపరచుకుంటుంది. తేలికగా లొంగదు. తరగని ఆకాంక్షతో, చెరగని ఆర్ద్రతతో దానిని కూడ పరిణమింపజేయాలి. అపుడిక చైత్యపురుషుని స్పర్శ కూడ లభించి మన ప్రయత్నము విజయవంతము కాగలదు.

— సంపాదకుడు

పరిణామం మొదటి స్థాయి

జడపదార్థం పరిణమించగా అజ్ఞానభూయిష్టమైన ఈ మనః, ప్రాణ, శరీరాలు తయారైనాయి. అయితే పరిణామప్రక్రియ అపరిపూర్ణమైన జ్ఞానంతో కూడిన ఈ ఘటంతో తృప్తిపడి కూర్చోదు. ధగధగలాడే ఆత్మదర్శనం కలిగి తీరాల్సిందే. ఆ జ్ఞానాన్ని, ఆ కాంతిని మన జీవితంలోకి – మన ప్రాణిక, శారీరక, మానసిక, హృదయసీమలలోకి ప్రసరింప చేస్తుంది.

మానవుని రూపాంతరీకరణము

ఈ పరిణామక్రమంలో అనంతరం వచ్చే ఫలితాలలో అతిముఖ్యమైనది దైవంతో మన సంబంధం, దివ్యచేతనలో జీవించడం. పూర్ణయోగంలోని రూపాంతరమనగా యిదే. ప్రస్తుతం 'మనసు' మనకున్న అత్యధిక సంపత్తి. ఆలోచించే మానసికస్థాయినించి హృదయంలోకి, ఆత్మ, చైత్యపురుషసత్తాలోకి ఆ శక్తిని ప్రసరింపచేయాలి. ఆ శక్తి ముందు చేయవలసినది మన

సుని ప్రధానమైన కేంద్రస్థానంలో స్థిరపరచాలి. ఒక దృఢమైన విశ్వాసం, మానసికమైన దృక్పథం, బలమైన నిజాయితీతో కూడిన ఆకాంక్ష, గాంభీర్యతతో, సద్భావనతో నిండిన హృదయసౌందర్యం – వీటిని దృఢపరచి, సామాన్యమయిన మానసిక సంఘర్షణల నుండి విడిపడాలి. వీటితో పాటుగా జీవితంలో జరిగే సంఘటనల ద్వారా కలిగిన అనుభూతులు, జ్ఞానవికాసం, మానసిక ఆవరణలోకి ప్రసారమైన ఆ శక్తి అవరోహణ, జ్ఞానస్ఫూర్తి ఇవన్నీ ఎంత చిన్నవయినా సరే ఆ అభివృద్ధికి, ప్రగతికి అత్యంత అవశ్యకాలు. ఒక్కోసారి ఎంతో ముఖ్యమైనవి, సమృద్ధమైన అనుభవాలతోపాటు ఏమాత్రం ప్రాధాన్యత లేని స్వల్పవిషయాలు కూడా ఆ అభివృద్ధికి సాయపడే విషయాలుగా గ్రహించాలి. కొందరి విషయంలో ఈ రకమైన అనుభవాలేవీ సంభవించక పోవచ్చు. ప్రాణికసత్తాలో ఏవిధమైన ముఖ్యమార్పులు జరగక పోవచ్చు. అది ఎందుచేతనంటే 'ఆ శక్తి' మనసుని తయారు చేయుటంలో ఏకాగ్రతతో పనిచేస్తుంది. చాలామందిలో సాధన ప్రాణికసత్తాలోనే ప్రారంభమై అనుభవాలు పొందవచ్చు కాని నిజానికి మానసికమైన ప్రయత్నంతో తప్ప ఇది జరిగేపని కాదు. మనసును ఆ శక్తివైపు ఉన్మీలనం చేస్తే తప్ప ప్రాణికసత్తాలో అనుభవాలు సాధ్యం కావు. అయితే ఏ విషయంలోనైనా ప్రాణిక సత్తాతో రూపాంతరం ప్రారంభించడం కష్టసాధ్యమైన విషయం.

మానసికసత్తాలో సంభవించే కష్టాలకన్నా ప్రాణికసత్తాలో సంభవించే కష్టాలు కఠినమైనవి. అసంఖ్యాకమైన పొరపాట్లు కూడా ఈ ప్రయత్నంలోనే ఎక్కువ.

వాంఛలు ఆవేశాలు కప్పివేయుట

అహంకారం, వాంఛలు, కోరికల తెరలతో కప్పబడి ఉండడంవల్లనే ఆత్మను, చైత్యపురుషను చేరడం కష్టసాధ్యం అవుతుంది. ఎవ్వరైనా ఈ ప్రాణికసత్తా ఇచ్చే అనుభవాల మాయాజాలంలో మునిగిపోకుండా ఉండటం కష్టమే. ఎందుకంటే ఆ అనుభవాలన్నీ యోగ్యమైనవి, సత్యమైనవి కావు. చాలావరకు క్షుద్రమైన సిద్ధులు, అపరిపక్వమైన అజ్ఞానాన్ని, అహంకారాన్ని

తృప్తిపరచేవిగా ఉంటాయి. వీటితో పోరాడి దట్టమైన ఆ అజ్ఞానపు తెరల్ని ఛేదించినపుడే, అంతరంగహృదయాన్ని, చైత్యపురుషను అధినేతను చేసినపుడే ఈ ప్రాణికసత్తాలో చేసే సాధన సురక్షితంగా ఉంటుంది.

యోగశక్తి క్రియాశీలత

ఏది ఏమైనా శక్తియొక్క అవరోహణము, ఆ ప్రసారము ప్రాణికసత్తా లోనికి చేరడం కొంత సాధన తరువాత ఒక ఆవశ్యకత, తప్పనిసరి. ఆ శక్తి ఒకేసారి పూర్తిగా మానసికసత్తాను, స్వభావాన్ని మార్చలేదు. కాని మార్పు మొదలవడం తప్పనిసరి. ఆ మెట్టు ఎక్కితే కాని సంపూర్ణరూపాంతరం అన్న ప్రశ్న లేదు. ఆ మొదటి మెట్టు ఎక్కితే మిగిలిన సాధన అంతకు ముందుతో పోలిస్తే సులభసాధ్యమూ, సురక్షితమూ కాగలదు.

ప్రాణికంతో యుద్ధం

అయితే ప్రాణికసత్తా ఎప్పటికీ మనసుపైన, హృదయం మీద ఆధిపత్యం చేస్తూ, ఒత్తిడి తీసుకువచ్చి పీడిస్తూనే ఉంటుంది. ఆ విధంగా 'సాధనను' సక్రమంగా జరగనీయక అపాయకరంగా మారుతుండడం జరుగుతుంది. అందుచేత ఆ విధంగా ప్రాణికసత్తాను అలా సులభంగా ఎక్కువకాలం వదలివేయలేం. ప్రాణికసత్తాయొక్క అహం, కోరికలు ఆ తాలుకు ఆటంకాలు, అడ్డంకులు వాటితో పోరాడవలసి ఉంది. ఒకేసారి వాటిని అధిగమించలేకపోయినా కొంచెం కొంచెంగా వాటిని అతిక్రమించి క్రమానుసారంగా పరివర్తన సాధించాలి. అది క్రమానుగతమైన పరివర్తన, మార్పు, కాంతిని ప్రసరింప చేయుటంవలన ప్రాణికసత్తాలో రూపాంతరం సంభవిస్తుంది. ప్రాణికసత్తా లోటుపాట్లను, అజ్ఞానాన్ని తొలగించుకోవాలంటే ప్రాణికసత్తా లోటుపాట్లను ఆ శక్తి ప్రసరించిన అవగాహనతో మాత్రమే. ప్రాణికసత్తాలో ఆ శక్తి కొంచెం కొంచెంగా చేరినపుడు మాత్రమే సాధించగలం.

ప్రాణిక శిబిరాల నిర్మూలన

ప్రాణిక అహం తనలోని లోటుపాట్లను తెలుసుకొని తానే తొలగించుకుందుకు తోడ్పడాలి. ప్రాణికసత్తా అహం వాటిని

తొలగించుకునే నిర్ణయం చేసుకున్నపుడే గొప్పలు, దురాశలు, వాంఛలు, ఇచ్ఛలు, కరుడుగట్టిన ద్వేషాలు, తిరుగుబాట్లు ఇంకా మిగిలిన సర్వ అపరిపక్వతలు, అపవిత్రతలు, అపరిశుద్ధాలు, అశుభ్రాలు.... ఈ కదలికలన్నీ నిర్మూలించబడతాయి. ఇదే సాధనలో ఇక్కట్లు, తిరుగుబాట్లు, అపాయాలతో కూడిన పరీక్షాసమయం. ప్రాణిక అహానికి తన కోరికలు తిరస్కరిస్తే ద్వేషిస్తుంది. నిరాశలు ఇష్టపడదు. తన అహానికి, గర్వానికి తగిలిన గాయాలపై తిరుగుబాటుచేసి కోపిస్తుంది. ప్రాణికసత్తాకు తనని తాను పరిశుద్ధపరచుకోవడమనే పద్ధతి అసలు ఇష్టం ఉండదు. పైగా ఆ ప్రయత్నం వద్దని సత్యాగ్రహం చేస్తుంది. సహకరించడానికి నిరాకరిస్తుంది. తన ప్రోద్బలాలు, అధికారాలు న్యాయసమ్మతమంటుంది. అనేక రకాలుగా మార్పుచెందటానికి తన అసమ్మతిని తెలియపరుస్తుంది. చివరకు జీవనానికి, సాధనకు అవసరమైన ప్రాణికసత్తా సహాయాన్ని కూడా వెనక్కు మళ్ళించి, పూర్తిగా ఆధ్యాత్మికసాధనయొక్క కృషినే అడ్డగించగలదు. ఇవన్నీ ఎదుర్కొని పోరాడి వాటిపై విజయం సాధించినపుడే ఈ ప్రాణిక సత్తా పవిత్రమై, పరిశుద్ధమై, స్వచ్ఛమై మనలో ఉన్న ఆ దైవం తన స్థానాన్ని అధిష్ఠించి.... అక్కడ పరివేష్టితుడై మన పూజలందుకో గలడు.

అనువాదం: డి. సత్యవాణి

భూలోకంలో ఆవిర్భవించిన నూతనశక్తిని కనుక నీవు గ్రహించగలిగితే నీ ముందర ఒక నూతన మార్గము ఆవిష్కారమౌతుంది. ఏమాత్రం బిగువు లేకుండా నీ శరీరాన్ని సడలించిన యెడల అది కూడ ఆ శక్తిని గ్రహించి అధికమైన బలాన్ని, ఆరోగ్యాన్ని పుంజుకుంటుంది.

శ్రీమాత

ఒక స్వప్నము

శ్రీఅరవిందులు

ఒక నిరుపేద చీకటిగదిలో కూర్చోని తన దౌర్భాగ్యాన్నిగురించీ, దేవుని సృష్టిలో అన్యాయాలగురించీ ఆలోచిస్తున్నాడు. ఆత్మాభిమానం ముంచుకువచ్చి అన్నాడు. "భగవంతుని పేరు చెడకూడదని కర్మసిద్ధాంతము ప్రతిపాదిస్తారు. పూర్వజన్మలో చేసిన పాపఫలితాలు ఇప్పుడు అనుభవిస్తున్నానంటారు. నిజంగా నేనంత పాపినే అయితే ఆ దురాలోచనలే నాలో ఇంకా మెదలుతూ ఉంటాయి. పాపి మనసు ఒక రోజులో మారదుకదా! 'టింకోరి షీల్' విషయం చూడండి. ఆయన సంపద, వెండి, బంగారాలు, పరిచారకులు – అదంతా చూస్తే కర్మసిద్ధాంతం ప్రకారం పూర్వజన్మలో అతను ఒక గొప్పమనిషై ఉండాలి. ఇప్పుడతనిలో ఆ గుణాలు మృగ్యం. అతనికంటే క్రూరుడు, మోసగాడు, చెడ్డవాడు ప్రపంచంలో మరొకడుండడు. కర్మసిద్ధాంతము దేవుడు కల్పించిన ఉచ్చు. మనుష్యులను మోసగించేందుకు ఉపాయం. శ్యామసుందరుడు అతితెలివయినవాడు. నా దగ్గరకు రాడు. వస్తే అతని మాయల్ని బయటపెట్టి గుణపాఠం నేర్పేవాడిని." ఈ మాటలన్నాడో లేదో ఓ మెరుపు మెరిసి నీలమేఘసుందర బాలుడు చిరునవ్వుతో ప్రత్యక్షమయ్యాడు. తలమీద నెమలిపింఛము, కాళ్ళకు అందెలు చూచి శ్యామసుందరుడే వచ్చి తనకు లొంగిపోయాడనుకున్నాడు. పాదాభివందనం చేయాలనిపించింది కాని, బాలుని నగుమోము చూచి కొంచెం వెనకాడి "కృష్ణా, ఎందుకొచ్చావు?" అని అడిగాడు. "నీవు నన్ను పిలిచావు కదా?" అని నవ్వుతూ "నన్ను దండించాలని అనుకున్నావు కదా! నేను లొంగిపోయాను. దండించలేదేమి" అన్నాడు. అంత ముద్దొచ్చే బాలుని దండించలేకపోయాడు. "హరిమోహన్, నేనంటే భయం లేని వారు నన్ను మిత్రమా అంటారు. నాతో ఆడుకోవాలనుకుంటారు. వారు నాకు ప్రీతిపాత్రులు. వారికోసమే ఈ ప్రపంచాన్ని

సృష్టించాను. ఆడుకుందామంటే ఎవరూ తారసిల్లలేదు. ప్రతి ఒక రికీ నేనంటే కోపమే. ఇదీ, అదీ కావాలంటారు. హోదా, ముక్తి, భక్తి అన్నీ కావాలని నిలదీస్తారు. నేను నేనుగా కావాలని ఎవ్వరూ కోరరు. అయినా తృప్తిపరచాలి కదా! అడిగినవి ఇస్తాను, లేకుంటే పీడించేస్తారు. నీకు కూడా ఏదో కావాలి. కోపంతో ఎవరినో దండించాలనుకున్నావు. నన్ను పిలిచావు. ఆ దండననేదో పొందాలని వచ్చాను. ఎవరెలా నన్ను సమీపిస్తే వాళ్లకలా నేను కనబడతాను" ఈ మాటలకు హరిమోహన్ విస్తు పోయి "పసివాడివి నువ్వు నాకేమి బోధిస్తావులే?" అనగానే "చూస్తూవుండు, బోధించగలనో లేదో" అని మందహాసం చేస్తూ హరిమోహన్ తల నిమిరాడు శ్రీకృష్ణుడు. అతని శరీరంలో విద్యుత్ ప్రాకినట్లయింది. వెన్ను అడుగన ఉన్న కుండలినీశక్తి పామువలె బుసకొడుతూ తలలోకి వెళ్ళింది. అపారశక్తి తరంగాలు మెద డులో నిండుకున్నాయి. గదిగోడలు దూరమయి, నామరూపసృష్టి మాయమైంది. అన్ని అనంతంలో కలిసిపోయాయి. మామూలు చైతన్యం మాయమయింది. ఒక కొత్త యింట్లో ఇరువురూ నిల బడి ఉన్నారు. సుదీర్ఘఆలోచనతో, కలతతో, విచారంగా, నిస్పృ హతో ఒక ముదుసలి, చాపమీద కూర్చుని ఉన్నాడు. అంత గొప్పవాడైన ఆ టింకోరి షీలే ఈ మదుసలి అని హరిమోహనం నమ్మలేకపోయాడు. "ఓ క్రృష్ణా! ఏమిటిది? ఇంకొకరి ఇంట్లోకి దొంగలాగ ప్రవేశించావా? పోలీసులు మనలను చావగొడతారు"

దొంగతనమే తన వృత్తి అనీ, పోలిసులంటే తనకు భయం లేదనీ అంటూ దివ్యదృష్టి ప్రసాదించాడు బాలుడు. హరిమోహన్ టింకోరి మనస్సులోకి చూస్తే దయ్యాలు, పిశా చాలు అతని ప్రశాంతతను పాడుచేశాయి. టింకోరి తన ముద్దుల ఆఖరి కుమారునితో దెబ్బలాడి ఇంట్లోంచి తరిమివేశాడు. కూతురు దుశ్శీలి అని ఇంటినుండి తరిమివేసి మానసికభాధను అనుభవి స్తుండగా యమదూతలు బెదిరిస్తున్నారు. టింకోరి గావుకేక పెట్టాడు. ఇదేమి లీల అని హరి ప్రశ్నిస్తే దండించటం, దండ నకు గురికావటం తనకు ఇష్టమనీ, సంఘటనలను లోతుగా



చూడాలనీ టింకోరి నిజంగా సంతోషంగా లేడనీ, సంతోషము, బాధ రెండూ మానసికస్థితి మాత్రమే అనీ అన్నాడు. దరిచేరిన వారెన్నో కోర్కెలు కోరుతారనీ, అయితే తన ఆనందనిలయం చేరినవారు శ్రీకృష్ణుని ప్రేమిస్తారనీ చెప్పాడు. అహంకారంతో పొందే ఆనందం ఆత్మాభిమానంవల్లనే.

మరొకసారి శ్రీకృష్ణుడు హరిమోహన్ తల నిమిరాడు. చేతిస్పర్శ కలిగినంతనే, హరిమోహానునికి వేఱొక దృశ్యము కన పడెను. వృద్ధుని గృహమదృశ్యమై, దాని స్థానమున నొక నిర్జన, రమ్య, పర్వత, వాయుసేవిత, శిఖరముపై నొక సన్యాసి ఆసీనుడై ధ్యాననిమగ్నుడై యుండుట చూచెను. అతని పాదముల ముందర నొక వ్యాఘ్రము రక్షకునివలె పరుండియున్నది. వ్యాఘ్రమును జూచి హరిమోహానుని కాళ్లు భయముచే కదలకుండెను. కాని బాలుడాతని లాగుకొని సన్యాసికడకు దీసికొనిపోయెను. నిస్స హాయుడై బాలకుని సంగమునందు అతడు నడచెను. అప్పుడు బాలకుడు, హరిమోహానుని చూడమని చెప్పెను.

హరిమోహనుని కన్నులయెదుట, సన్యాసి మనసు తెరువబడిన పుస్తకమువలె నున్నది. అందులోని ప్రతిపుటయందు శ్రీకృష్ణుని పేరు వెయ్యిసార్లు లిఖింపబడి యున్నది. సన్యాసి నిర్వికల్ప సమాధిద్వారమును దాటి సూర్యప్రకాశమునందు శ్రీకృష్ణుని సంగమునందు క్రీడసల్పుచున్నాడు. కొన్నిదినముల నుండి సన్యాసి అన్నపానీయములు లేకయే కాలము గడుపుచు రెండురోజులనుండి ఆకలిదప్పులచే శరీరబాధ అతనికి అధికమై యుండెను. ఇట్లుచూచి హరిమోహనుడు చెప్పెను, – "అరే, కన్నయ్యా, ఇదియేమి; వాడు నిన్నింత ప్రేమించుచున్నాడు. ఐనను, అతడు క్షుదపిపాస ననుభవించుచున్నాడు; నీకు సాధారణునికిగల విచారముకూడ లేదు. ఈ నిర్జన వ్యాఘ్రసంకుల అరణ్యమునందతనికి ఆహారము నెవరిత్తురు?" బాలకుడు చెప్పెను "నే నిచ్చెదను. మఱియొక వింతను చూడుము." అంతట, హరిమోహనుడు చూచుచుండగ, వ్యాఘ్రము లేచి తన కాలిగోర్లచే సమీపముననున్న వల్మీకకూటమును నొక దెబ్బ కొట్టెను. అది పగిలి ఆ మంటికుప్పనుండి వేలకొలది చెదలు బయటకు వచ్చి కోపముతో సన్యాసి శరీరముపై పరుగిడుచు కరువ చొచ్చెను. సన్యాసి ఆ యవస్థయందు ధ్యానమగ్నుడై, నిశ్చలుడై కూర్చొని యుండెను. అప్పుడు బాలకుడు మధురస్వరముతో సన్యాసి చెవిలో "సఖే" యను శబ్దము పలికెను. సన్యాసి కన్నులు తెఱచెను. తొల్లి బృందావనమునందు శ్రీరాధికా చెవియందూదబడిన శబ్దమును, తానప్పుడప్పుడే వినుచుండినట్లు కనపడెను. దీని తర్వాత, ఆ వేలకొలది చెదలు తన శరీరమును కఱచుచుండుటను గమనించెను. సన్యాసి తన ఆసనమునుండి కదలక, విస్మయపూర్వక మనస్సుతో, నిట్లు చెప్పెను, – "ఇదియేమి? ఇట్లెప్పుడును జరుగలేదే! ఓహో శ్రీకృష్ణుడు నాచెంత చేరి క్రీడించుచున్నాడు, క్షుద్రసమూహ కీటకరూపమున నన్ను కఱచుచున్నాడు. కీటకములు కఱచు బాధ సన్యాసికి ప్రాణికముగా స్ఫురింపలేదనియు పైగా వాని కాటుబాధ తీవ్రశరీరానందమునే అనుభవింప జేయుచుండెననియు, ఆ యానందముతో, శ్రీకృష్ణ

నామమును పాడుటకును, తాళము వేయుటకును, నాటకమాడుటకును ప్రారంభించుటయు, చెదలు అతనినుండి దిగి మంటిలోనికి పరుగిడుటయును, హరిమోహనుడు చూచి ఆశ్చర్యముతో నడిగెను "అరె కన్నయ్యా యీ మాయ యేమి?" బాలకుడు తాళమువేయుచు, ఒంటికాలిమీద రెండడుగులు వేసి నాట్యమాడుచు, నడచుచు నిట్లు చెప్పెను, – "నేను జగత్తుయొక్క ఏకమాత్రుడనగు ఐంద్రజాలికుడను. ఈ మాయను నీవు అర్థము చేసికొనజాలవు. ఇదియే పరమరహస్యము. చూడుము. బాధయందుకూడ సన్యాసి నన్ను స్మరించుచున్నాడు; ఇంకను చూడుము."

కొంతసేపటికి సన్యాసి సహజస్థితికివచ్చి కూర్చుండెను. అతని శరీరమున ఆకలి దప్పి బాధానుభవము, ప్రారంభమాయెను. అందుచే కలుగు వికారములను శరీరము అనుభవించుచుండినను, అతడు వికృతుడు కాలేదు. లిప్తుడు కాలేదు. ఈ విషయమును హరిమోహనుడు కనుగొనెను. ఈ సమయమునందు కొండ పైభాగమునుండి, ఎవ్వరో వంశీరవ స్వరముతో "సఖే" అని యఱచుటచే, హరిమోహనుడు విస్మితుడయ్యెను. అది శ్యామసుందరుని స్వరమైయుండెను. ఆ తర్వాత కొండశిఖరము వెనుకనుండి ఒక సుందర కృష్ణవర్ణబాలకుడు స్థాలియందుత్తమ ఆహారమును పండ్లను తీసికొని వచ్చుచుండెను. హరిమోహనుడు హతబుద్ధియై శ్రీకృష్ణునివంకకు చూడసాగెను. బాలకుడుకూడ తన ప్రక్కనే నిలిచియుండెను. వచ్చుచుండు బాలకుడుకూడ అవికల శ్రీకృష్ణుడై యుండెను. ఆ రెండవబాలకు డక్కడికివచ్చి సన్యాసికి వెలుతురుచూపి "చూడు, ఏమి తెచ్చియున్నా" నని చెప్పెను.

సన్యాసి నవ్వి యిట్లు మాట్లాడెను, – "వచ్చినావా? ఇన్నాళ్లవఱకు ఆకలిలోనే యుంచితివా? మంచిది, ఎప్పుడు వచ్చితివో, ఇప్పుడు నాయొద్ద కూర్చొని తినుము."

సన్యాసియును, బాలకుడును, ఆస్థలియందుండు బండారమును తిన నారంభించిరి. ఆహారము సమాప్తమైనంతనే, బాలకుడు స్థాలిని తీసికొని అంధకారమునందు విలీనమయ్యెను.

హరిమోహను డేదేదో అడుగనుండెను. కాని శ్రీకృష్ణుడక్కడ నుండలేదు; సన్యాసియును లేడు, పులియును లేదు, పర్వత మును లేదు. ఇప్పుడతడు ఒక గొప్ప మహాలునందున్నాడు. అమిత ధనైశ్వర్యములు, స్త్రీలు, పరివారము, బ్రాహ్మణులకు భిక్ష కులకు నిత్యదానము లిచ్చుటయు, త్రికాలసంధ్య జరుపుచుండు టయు, శాస్త్రోక్త ఆచారవిచారమును యత్నపూర్వకముగ రక్షిం చుచుండుటయి, రఘునందనుడు ప్రదర్శించిన మార్గమును నడ చుచుండుటయు చూచెను. అక్కడ, ఆదర్శపితరుడు, ఆదర్శభర్త, ఆదర్శపుత్రులు నిత్యజీవితమందలి తీవ్రవేదనల ననుభవించు చుండిరి. కాని, ఆ రెండవ క్షణమునందే, ఆ మహాలునందు నివ సించువారి అంతరమున లేశమాత్రమున సద్భావముకాని ఆనం దముకాని లేకుండుటచూచి భయభీతుడయ్యెను. వారు యంత్ర మువలె బాహ్యాచారములను రక్షించుటయే పుణ్యమని తలంచు చుండిరి. ఇట్టి జీవనముచే, హరిమోహానునికి మొదట ఎంత ఆనందము కలిగెనో, యిప్పుడు అంతబాధ కలిగెను. అతనికి దప్పికయినట్లును, నీరు దొఱకనట్లును, ధూళి ఎగురుటచే నోటిలోనికి పోవునట్లును చూచి భయమయ్యెను. అందుచే, అక్కడనుండి పరుగెత్తి వేఱొకగ్రామమునకు పోయెను. అక్క డొక భవనం ముందర, అపూర్వ జనసమ్మర్దమును, వారొస గుచుండిన ఆశీర్వాద కోలాహలమును గాంచెను. హరిమోహ నుడా జనసమూహామునకు కొంచెముదగ్గర పోయెను. అక్కడ టింకోరిశీలుడు వసారాయందు కూర్చొని రెండుచేతులతో దానము చేయుచుండెను. అక్కడనుండి వ్యర్థముగా వాపసుపోయినవారే లేరు. హరిమోహనుడు నవ్వి, అటుయిటు నడచుచు, నిట్లు తలం చెను, – ".ఈ స్వప్నమెట్టిది! టింకోరిశీలుడుకూడ దాతయా? ఆశ్చర్యము." ఆ తర్వాత నతడు టింకోరిశీలుని మనస్సును స్పష్టముగా చూచెను. ఆ వృద్ధుని మనస్సునందు లోభము, ఈర్ష్య, కామము, స్వార్థము మొదలగు గుణలోపములు, నీచప్రవృత్తులు ధ్వనించుచుండెను. పుణ్యముకొఱకును, యశముకొఱకును వాంఛి తుడై, గర్వమునకు వశుడై, టింకోరిశీలుడు తన భావములను

దాచియుండెను; కాని హృదయమునందవి లేకపోలేదు. ఈ సమయమునందే హరిమోహను నెవ్వరో పట్టుకొని పరలోకమునందు నడిపించుచుండిరి. హిందువులయు, క్రైస్తవులయు, ముసల్మానులయు, యునానీలయు, స్వర్గనరకములను, పరలోకములనందు చూచివచ్చెను. దాని తర్వాత అతను మళ్లి తన యింటియందే, తన పూర్వపరిచిత చినిగిన చాపమీద చినిగిన మైలగుడ్డలతో నుండిన పాన్పుపై, కూర్చొనియుండెను. తన యెదుట శ్యామసుందరుడు నిలుచునియుండెను. బాలకుడిట్లు చెప్పెను, – "రాత్రి చాలకాలము గడిచినది. నేనింటికిపోనియెడల నాయింటివారు నన్ను బెదరించెదరు, తన్నెదరు. కనుక అధికముగా మాట్లాడుటకవకాశము లేదు. సంక్షేపముగా, నింతమాత్రము చెప్పెద వినుము. నీవు స్వర్గనరకముల జూచితివి. అవియన్నియు స్వప్నజగత్తుయొక్క కల్పనచే సృష్టియైనవి. మనుష్యుడు మరణానంతరమున స్వర్గమునకు లేక నరకమునకు పోయి గతజన్మముయొక్క ఫలితము నక్కడ అనుభవించును. నీవు పూర్వజన్మమునందు పుణ్యవంతుడై యుంటివి, కాని ఆ జన్మమునందు నీ హృదయమున ప్రేమకు స్థానము దొరకలేదు. మానవునికాని, భగవంతునికాని నీవు ప్రేమించలేదు. అందుచే ప్రాణము త్యజించిన తర్వాత గొప్ప మహలునందు వాసముచేసి పూర్వజీవితఫలితములను అనుభవించితివి. పిదప నీ వలసట చెందితివి; నీ ప్రాణము వ్యాకులము చెందసాగెను; అక్కడనుండి విడిచిపోయి. ఈ ధూళిమయనరకమునందు వాసముచేయ నారంభించితివి; అంత్యమున జీవితముయొక్క పుణ్యఫలము ననుభవించి మరల నీ జన్మము పొందితివి. జీవనమందు చిన్నచిన్న నైమిత్తిక దానములను, నీరస బాహ్యావ్యవహారములను తప్ప, ఎవ్వరియొక్క బీదతనాన్ని దూరముచేయుటకుగూడ నీవేమియు చేయలేదు. అందుచే, నీకీజన్మము నందింత దరిద్రమున్నది. ఈ సమయమున నీవు చేయుచుండు పుణ్యమునకు కారణమిదియే. కేవల స్వప్నజగత్తుయొక్క భోగముచే పాపపుణ్యములు క్షయమొందవు; వాటి సంపూర్ణక్షయము, కర్మఫలమును పృథ్వియందనుభవించుటవల

ననే కలుగును. టింకోరిశీలుడు గతజన్మమునందు దానకర్ణుడై యుండెను. వేలకొలది జనుల ఆశీర్వాదముచే, ఈ జన్మమునందు లక్షాధికారి యయ్యెను. అతనికే వస్తువును కొదువలేదు. కాని అతనికి చిత్తశుద్ధికానందున అతృప్తకుప్రవృత్తులు, తొలగుటకు పాపకర్మలద్వారా, అతడీసమయమున తన్నుదా తృప్తిపఱచుకొనవలసిన అవసరము వచ్చినది. కర్మవాదమిప్పుడైనను నీ కర్థమైనదా? ఈ కర్మవాదము బహుమానదండనములు కావు; ఇది అమంగళద్వారమున అమంగళమును, మంగళద్వారమున మంగళమును సృష్టియగుటకుగల ప్రకృతిశాసనము. పాపము అశుభము; అందుచే దానివలన దుఃఖము కలుగుచున్నది; పుణ్యము శుభము; అందుచే దానివలన సుఖము కలుగుచున్నది. ఈ వ్యవస్థ చిత్తశుద్ధికొఱకు, అశుభవినాశముకొఱకు జరుగుచున్నది. చూడుము, హరిమోహనా, ఈ పృథ్వి, నా విచిత్రమయజగత్తు యొక్క ఒక చిన్నఅంశము మాత్రమే యైయున్నది. మఱియు కర్మద్వారమున అశుభనాశనము కావించుటకు మీరిక్కడ జన్మ పొందుదురు; తర్వాత పాపపుణ్యముల సేతలనుండి పరిత్రాణమునుపొంది ప్రేమరాజ్యమునందు పదార్పణ మొనరించునపుడు, మీరీ కార్యములనుండి విముక్తులగుదురు. వచ్చే జన్మయందు నీకు ముక్తిగలుగవచ్చును. నా ప్రియసోదరియగు 'శక్తిని', ఆమె సహచరియగు 'విద్యను' నీ యొద్దకు పంపెదను; కాని చూడుము, ఒక నియమము మాత్రము అందున్నది. నీవు నా లీలయందు సహచరుడవు కావలెను. ముక్తుడవై యూరక మాత్ర ముండకూడదు. మఱి అది నీ కిష్టమేనా" హరిమోహనుడిట్లు చెప్పెను, – "అరే, కన్నయ్యా, నీవు నాకు చాల ఉపకారము చేసితివి; నిన్ను కౌగలించుకొనుటకు చాల యిష్టమగుచున్నది; ఈ జీవితమందు నాకిప్పుడే వాసనయు లేకుండపోవుచున్నవని నా కర్థమగుచున్నది."

బాలకుడు నవ్వుచూ చెప్పెను, – "హరిమోహనా కొంచెమైనను అర్థము చేసికొంటివిగదా?" హరిమోహనుడు జవాబు చెప్పెను, – "ఎందు కర్థము కాలేదు." దీని తర్వాత కొంచ

మాలోచించి మఱల చెప్పెను. "అరే కన్నయ్యా, నీవు నన్నింకను మోసగిస్తున్నావు. దౌష్ట్యమును నీవేల సృష్టించితివి. కారణం చెప్పనే లేదు." ఇట్లుచెప్పి, అతడు బాలకుని చెయ్యి పట్టుకొనెను. బాలకుడు తన చేతిని విడిపించుకొని, బెదరించుచు నిట్లు చెప్పెను – "దూరముండుము; వహ్వా, ఒక గంటకాలములోనే, నా సమస్త గుప్తవచనములను వినుటకు కోరుచున్నావా?" ఇంత మాత్రము చెప్పి, బాలకుడు దీపమును హఠాత్తుగా ఆర్పివేసి, హరి మోహానునుండి కొంచెము దూరము పోయి నవ్వుచూ ఇట్లు చెప్పెను, "చూడుము, హరిమోహనా, కొఱడాతో కొట్టుట పూర్తిగా మఱచితివి; అందుచే, నీ కౌగిలి లోనికి నేను రాలేదు. నీవు బాహ్యదుఃఖముచే క్రుద్ధుడవై నన్ను, బాగుగా కొట్టుటకేల ప్రయత్నించ లేదు! నీయందు నాకు లేశమాత్రమైనను విశ్వాసము లేదు"

హరిమోహను డంధకారమునందు తన చేతిని చాచెను; బాలకుడు మఱింత దూరము పోయి యిట్లు చెప్పెను – "లేదు, ఈ సుఖమును నీకు మఱియొక జన్మమునందు బాకీయుంచి విడిచెదను. మంచిది నేనింక పోయెదను."

ఇట్లుచెప్పి, బాలకుడు చీకటిరాత్రియం దదృశ్యుడైపోయెను. హరిమోహనుడాతని నూపురధ్వనిని వినుటకు లేచెను; లేచి యిట్లు తలంచెను, "ఎట్టి స్వప్నము చూచితిని! నరకమును స్వర్గమును చూచితిని. మఱియు భగవానుని 'నీవు' అని చెప్పితిని, చిన్నబాలకుడని నిందించితిని, దూషించితిని! పెద్దపాపమును కొడిగట్టుకొంటిని! కానిమ్ము, ఏదిఎట్లైనను, ఒక పూర్వానుభూత శాంత్యానుభవము నా ప్రాణమునందు స్థిరపడినది." హరిమోహను డిప్పుడు ఆ కృష్ణవర్ణ బాలకునియొక్క మోహినీ మూర్తిని ధ్యానించుచు, మధ్యమధ్య, "ఆహా! ఎంతటి సౌందర్యము, ఎంతటి సౌందర్యము" అని నెమరువేసుకొనుచుండెను.

మూలం: బెంగాలీమూలానికి అరవిందబాసుగారి ఆంగ్లానువాదం

అనువాదం: జె. మంగమ్మ, శ్రీ॥ నారాయణరెడ్డి (జగన్నాథుని రథము) నుండి

The Mission of India

Words of Sri Aurobindo

If these things do not satisfy me,
What then do I seek?

I seek a light
that shall be new, yet old,
the oldest indeed of all lights.

I seek an authority
that accepting, illuminating
and reconciling all human truth,
shall yet reject and get rid of
by explaining it all mere human error.

I seek a text and a Shastra
that is not subject to
interpolation, modification and replacement,
that moth and white ant cannot destroy,
that the earth cannot bury nor time mutilate.

I seek an asceticism
that shall give me purity and deliverance
from self and from ignorance
without stultifying God and His universe.

I seek a scepticism
that shall question everything
but shall have the patience
to deny nothing that may possibly be true.

I seek a rationalism
not proceeding on the untenable supposition
that all the centuries of man's history
except the nineteenth
were centuries of folly and superstition,
but bent on discovering truth
instead of limiting inquiry
by a new dogmatism, obscurantism
and furious intolerance
which it chooses to call
common sense and enlightenment;

I seek a materialism
that shall recognise matter
and use it without being its slave.

I seek an occultism
that shall bring out
all its processes and proofs into the light of day
without mystery, without jugglery,
without the old stupid call to humanity,
"Be blind, O man, and see!"

In short, I seek
not science, not religion, not Theosophy.
but Veda – the truth about Brahman,
not only about His essentiality,
but about His manifestation,
not a lamp on the way to the forest,
but a light and a guide
to joy and action in the world,

the truth which is beyond opinion,
the knowledge which all thought strives after –
yasmin vijnate sarvam vijnatam.

I believe that Veda to be
the foundation of the Sanatan Dharma;
I believe it to be
the concealed divinity within Hinduism, –
but a veil has to be drawn aside,
a curtain has to be lifted.

I believe it to be
knowable and discoverable.

I believe
the future of India and the world
to depend on its discovery
and on its application,
not to the renunciation of life.
but to life in the world and among men

మానసిక రుగ్మతల నివారణ

శ్రీమాత మధురోక్తులు

ప్రశ్న: మాతాజీ, నన్ను బాధిస్తున్న విషయాలన్నిటినీ మీ ముందుంచాను కదా!

వాటిని చెప్పినంత మాత్రాన సరిపోదు, అవి తొలగిపోవాలని నువ్వనుకోవాలి.

ప్రశ్న: అమ్మా! ఈ రోజంతా నా మనసు విచారంగా ఉంది. ఏడ్చాను కూడా.

అది చాలా సహజం. అహంభావంతో నువ్వు నీ అంతరాత్మను లెక్కచేయనప్పుడు దుఃఖం రాకుండా ఎలా ఉంటుంది?

ప్రశ్న: ఓ దయామయీ! ఈ నిరుత్సాహాన్నించి, ఈ తిరుగుబాటునుంచీ నన్ను కాపాడు తల్లీ.

నా శాయశక్తులా నిన్ను కాపాడుతానమ్మా, అయితే నువ్వు నాకో అవకాశం కల్పించాలి. To revolt is to reject the Divine love and only the Divine love has the power to save.

ప్రశ్న: ఓ తల్లీ! నేను నీ బిడ్డను కానా? నిజమే నేను అల్లరిపిల్లనే. కాదనను. కానీ అల్లరిపిల్లనైనా కాకపోయినా నీదాన్నే కదా!

ఆ! నువ్వు ఆకతాయివని నేననుకోవటం లేదు. నా బిడ్డవనే అని నాకు తెలుసు.

ప్రశ్న: ప్రశాంతంగా ఉండాలని నా మనస్సు అనుకోటం లేదేమో! శాంతంగా ఉండాలనుకుంటే దానికోసమే ప్రయత్నించేదాన్ని కదా! ఏమంటారు?

మానసికరుగ్మతలలో ఎవ్వరైతే స్వస్థత పొందాలని అనుకోరో వారికి రోగనివారణ కాదు. దేహానికి చెందిన వ్యాధుల విషయంలోనూ అంతే కావచ్చు.

ప్రశ్న: శారీరక, మానసిక వ్యాధులంటున్నారు. నాకేమీ అర్థం కావడం లేదు.

మానసికరుగ్మతలంటే ఆలోచనలకూ, సంవేదనలకూ సంబంధించిన డిప్రెషన్, రివోల్ట్, విచారం మొదలైనవి. దేహానికి వచ్చేవి శారీరక వ్యాధులు.

ప్రశ్న: అమ్మా! రెండ్రోజులనుంచీ అంతులేని నిరాశ, విచారం నన్ను పట్టుకొని వదలటం లేదు. ఇంకా కొన్నాళ్ళు ఇలాగే కొనసాగితే ఇక ఎప్పటికీ నన్నొదిలిపోవేమోనంతగా నన్ను వేధిస్తున్నాయి. ఈ నిరాశ, నిస్పృహలతో ఆత్మహత్య చేసుకుందామా అని కూడా అనిపించింది.

ఈ బాహ్యప్రపంచంలో ఉన్నట్లుగా సూక్ష్మలోకంలో కూడా దొంగలుంటారు. జాగ్రత్తగల గృహస్థు తన ఇంటి తలుపులూ, కిటికీలు మూసి భద్రంగా ఉన్నట్లే నీవు కూడా నీ ఆలోచనల

ద్వారాలనూ, సంవేదనల తలుపులనూ గట్టిగా మూసి పెట్టుకోవాలి.

ప్రాణికలోకపు దొంగలవల్లనే విచారం, నిరాశ, ఆత్మహత్య అనే తలపులు మనిషికి కలుగుతాయి. నీవు డిప్రెషన్‌కి లోనైతే అవి నిన్ను చక్కగా దోచుకుంటాయి. అందువల్ల వాటి మాట నీవు వినకూడదు. అటువంటి దురాలోచనలను విడిలించి పారేసి నీవు నీవుగా మారిపోవాలి. అంటే నా చిట్టి దరహాసినిగా మారిపోవాలి.

అనువాదం: ఎ. ప్రభావతి. ఎ. వెంకటరామశాస్త్రి

సమాచార పత్రం

21 ఫిబ్రవరి 2002 నాడు శ్రీమాత 124 వ జయంతుత్సవములు శ్రీమాతారవిందుల పవిత్రమందిర దర్శనముతో మొదలై సాయంత్రం ధ్యానముతో ముగిసినవి. శ్రీమాత చిత్రముతో కూడిన సందేశ పత్రము పంచబడినది.

Always behave as if the Mother was looking at you; because she is, indeed, always present

Sri Aurobindo

This is not a mere phrase, not simply words, it is a fact. I am with you in a very concrete manner and they who have a subtle vision can see me.

The Mother

ఎల్లప్పుడూ శ్రీమాత నీవంక చూస్తున్నట్లుగానే ప్రవర్తింపుము. ఎందుకంటే ఆమె నిరంతరం ఉండనే ఉంటుంది.

శ్రీఅరవిందులు

ఇవి ఒట్టి మాటలు కావు. లాంఛనంకోసం చెప్పటం కాదు. చాలా ప్రత్యక్షమైన సత్యము. నేను నీతో చాలా కచ్చితంగా ఉంటాను. సూక్ష్మదృష్టిగలవారు నన్ను చూడగలరు.

శ్రీమాత



ఫ్యూజి పర్వతము, జపాను

జపాన్ కబుర్లు (II) – శ్రీమాత

అఖిల భారత పత్రిక – మే 2002

జపాన్ కబుర్లు (II) – శ్రీమాత

శ్రీమాత జపాన్ జీవితపు (1916-20) విశేషాలు

అనుబంధం

ఇతర వ్యాసాలు



The Mother in Japan

జపాను దర్శనము

ఒక దేశాన్ని గురించి తెలుసుకోవాల్నంటే కేవలం నగరజీవితాన్ని, బాహ్యాడంబరాల్ని చూసి మోసపోకూడదు. ఆ దేశపు ఆత్మ, ఆ ప్రజల రక్తనిష్ఠమైన గుణమొకటుంటుంది. నేటి నాగరికత అనిశ్చలత్వమును, అశాంతులను మాత్రమే పెంచుతుంది. కాని అదివరకు జపాను అటుల కాదు. వారిది 'సమురాయి' సంప్రదాయము. అసలు జపనీయుడు మహాశక్తిశాలి. చెల్లాచెదరైపోకుండా శక్తినంతా ముద్దకట్టుకున్న మూర్తి. నోరెత్తకుండా మౌనంగా ఉండటం వారి స్వభావము. ఒక వ్యక్తి నిన్ను గాఢంగా ప్రేమించవచ్చు. దాన్ని పైకి చూపించకపోవచ్చు. కాని అవసరమైనప్పుడు తన ప్రాణమైనా పెట్టి నిన్ను రక్షించేందుకు ఏమాత్రం వెనకాడడు. వారి ఉద్దేశంలో జీవితమంటే సుఖం కాదు – కర్తవ్యపాలన. సౌందర్యాభిలాష కూడ వారి మరో ముఖ్యలక్షణం. వారికి అంతరంగిక జీవిత మక్కర్లేదు. భావిజీవితానికి పునాది వేయగల ఘనతరాశయము వారిది.

– సంపాదకుడు

జపాన్ ఎంతో అద్భుతమైన ప్రదేశం

మీరు జపాన్‌గురించి నా అభిప్రాయం అడిగారు. నిజానికి జపాన్‌గురించి వ్రాయడం కష్టమే. అది చర్విత చర్వణమే అవుతుంది. ఇదివరకే చాలామంది చాలా విషయాలు వ్రాసారు. కొన్ని పనికిరాని విషయాలు కూడా వ్రాయబడ్డాయి. ప్రధానంగా అవి మనుషులను గురించినవి. దేశాన్ని గురించి కాదు. జపాన్ చాలా అందమైన దేశం. ఊహించలేనన్ని సుందర దృశ్యాలకది పుట్టిల్లు. ప్రకృతిశోభ వెల్లవిరుస్తూ, నయనానందకరంగా శోభిల్లుతూ ఉంటుంది. జపాన్ దేశం సమగ్రంగా అభివృద్ధి చెందింది. అన్ని కోణాలలో అక్కడ మనకి ప్రగతి కనిపిస్తుంది, – అది అన్నిదేశాల నాగరికతా సముచ్చయము. ట్రాపికల్‌నుండి ఆర్కిటిక్‌వరకు వాతావరణం అక్కడ మనకు గోచరిస్తుంది. ఏ

కళాత్మక హృదయమైనా వాటిని చూచి స్పందించక మానదు. అనేకమంది అక్కడి శోభలను గురించి వైభవోపేతంగా వర్ణించారు. వారికన్న ఉన్నతంగా చెప్పగలగడం అసాధ్యం. మీకొక నిజం మాత్రం చెప్పాలి. పాపం జపాన్ ప్రజలను చాలామంది అపార్థం చేసుకున్నారు. వారిని గురించి చెప్పిన కొన్ని దురభిప్రాయాలను సరిచేసేందుకు ప్రయత్నిస్తాను.

పాశ్చాత్య నాగరికతా వ్యామోహంలో పడిపోయి కేవలం ధనార్జనాపరులుగా తయారైన వాళ్ళను మాత్రమే కలుసుకోవడం వలన జపాన్ వారంటే ఒక చులకన భావం ఏర్పడింది. ఇక్కడి పాశ్చాత్య నాగరికతా ప్రభావం గోత పుట్టిస్తుంది. జపాన్‌లోని పరిపాలనా వర్గీయులు, రాజకీయవేత్తలు, వ్యాపారవేత్తలను తీసుకుంటే వారు యూరప్ దేశాలలోని ఏ ఇతర కార్యకర్తలకు తీసిపోరు. వారికున్న వనరులసంపదలకు దీటుగా ఇంకా జపాన్ దేశం అత్యున్నత స్థాయికి జేరలేదు.

జపనీయులు బలాఢ్యులు, మహాశక్తిమంతులు. అక్కడ ఆబాలగోపాలం కష్టించి పనిచేస్తారు. చిన్న, పెద్ద వయోవిచక్షణ లేదు. స్త్రీలు, పురుషులు, కార్మికులు, విద్యార్థులు, బాలురు అందరూ కష్టపడి పనిచేస్తారు. కొత్తగా ఐశ్వర్యవంతులైన ఏ కొద్దిమందో తప్ప, దైనందిన జీవనంలో అందరూ కష్టించి పనిచేస్తారు. వారిలో పుష్కలంగా సమీకృతశక్తి ఉంది. వారికి అందమన్నా, ప్రకృతి అన్నా అమితమైనప్రేమ. వారిలో నిక్షిప్తమైన శక్తిని క్రోడీకరించి దేశాభ్యున్నతికి వినియోగించడం వారి ప్రత్యేకత. అదే మీరు ఆ దేశంలో అడుగుపెట్టగానే కనబడే అతి అద్భుతమైన దృశ్యం.

వారి శక్తికి మూలాధారాలు

మాకు లభించిన విధంగా మీకూ నిజమైన జపనీస్ జాతీయులను కలిసే అపూర్వ అవకాశం లభిస్తే వారు తమ ఆర్ష సంప్రదాయమైన 'సమురాయ్' ని వారెంత పవిత్రంగా, సాహసోపేతంగా, సాంస్కృతికపరంగా కాపాడుకుంటున్నారో, అందలి పరమరహస్యమేమిటో అవగతమవుతుంది. అదీ జపాన్‌యొక్క విశిష్టత. వారెంత సున్నితమైన స్వభావం కలవారో అంత శాంతమంతులు. నిశ్శబ్దం

వారి ఊపిరి. మీ ప్రాణాన్ని రక్షించడంకోసం ప్రాణాలనుకూడా అర్పించడానికి వెనుదీయని త్యాగమూర్తులు వారు – కాని ఆ సంగతిని మీకు తెలియనివ్వరు. తెలియకుండా ఉండే సద్గుణ సంపన్నులు, సేవాతత్పరులు, నిస్వార్ధపరులు. మిమ్మల్ని అంతగా ప్రేమిస్తున్నట్లు చెప్పరు. అలా కనబడరు. వారి వెనుకగల ఆంతర్యం అర్థం చేసుకోగలిగితే సరే. లేకపోతే వారిలో బయటకు కనిపించేది మాత్రం వారి వినమ్రతలో అంతర్గతంగా నిక్షిప్త అదృశ్య స్వేచ్ఛాయుత ప్రేమానుభవాలు. గాఢప్రేమ ఉంది కాని అప్రకటితంగా ఉంటుంది. అవకాశం లభించగానే అది ఆచరణ రూపం దాలుస్తుంది. అతివినమ్రంగా అతిగంభీరంగా, అదృశ్యమానంగా, అతిగాఢంగా బహిర్గతమవుతుంది.

నిస్వార్థత వారి లక్షణము

ప్రపంచ దేశాలన్నింటిలోనూ జపాన్ దేశ ప్రజల ప్రత్యేకతే అది. పాశ్చాత్య దేశాల ప్రభావం వారి మీద ఇంకా అంత దట్టంగా ప్రసరించలేదు. అందుకే వారింకా నిస్వార్థులుగ ఉండగలుగుతున్నారు. ఈ నిస్వార్థత ఒక్క విద్యావంతులలో మాత్రమే కాదు. జపాన్ దేశస్థులందరిలోనూ మనకు ద్యోతకమవుతుంది. అన్ని వర్గాల వారిలోనూ ఈ రకమైన నిస్వార్థత గోచరించడం అక్కడి విశేషం. ఏవో కొన్ని ప్రత్యేక సందర్భాలలో తప్ప (పండుగలు, పబ్బాలు) వారిలో మతాభినివేశం కనిపించదు. విధేయత, ఆత్మార్పణభావం వారి దైనందిన జీవనంలో ఒక భాగం.

విధినిర్వహణ వారి ప్రత్యేకత

కర్తవ్యనిష్ఠ జపనీయులకు ఉగ్గుపాలతో నేర్పిన విద్య. వారికి జీవితమంటే ఆనందానుభూతి కాదు – విధి నిర్వహణ. ఎటువంటి కష్టతరమైన పనినైనా అంగీకరిస్తారు. విజయం సాధిస్తారు. ఎంత బాధతో కూడుకున్న పనినైనా సరే ఆనందంగా అంగీకరించి నెరవేరుస్తారు. వారిలో పట్టుదల, దీక్ష, శ్రమైకజీవన ఆకాంక్ష ఎక్కువ. ఎంతో సేవాభావంతో చేస్తారు. “సంతోషం లేదే,” అనే భావన వారికి కలగనే కలగదు.

ఆత్మసంయమనం వారి లక్షణం

జపాన్ దేశం, ప్రపంచానికిచ్చే ఏకైక సందేశం ఆత్మసంయమనం – ఆనంద మయజీవనం కాదు. మానవప్రగతి అవ సరాల వత్తిళ్లమీద, కృషిమీద, శ్రమైకజీవనంమీద ఆధారపడి ఉంటుందని వారి ప్రగాఢవిశ్వాసం. అంతేగాని భారతదేశంలా శాంతియుత, ఆధ్యాత్మికజీవనవిధానం వంటిది కాదు. అది ప్రపం చంలో ఒక్క భారతదేశానికి మాత్రమే పరిమితం. జపాన్‌లో ఈ రకమైన ఆధ్యాత్మికజీవనవిధానం ఎక్కడా కనిపించదు. వారి పరమపవిత్ర దేవాలయాలు, ఆరామాలు, దేవదారు వృక్షములతో శోభాయమానంగా విలసిల్లే పర్వతశ్రేణులలో కూడా మనకు కానరాదు. వాటిని సమీపించడం శ్రమతో కూడుకున్న పని. అక్కడ బాహ్యప్రశాంతతా, నిశ్శబ్దమూ, అనంతత్వము ఉంటాయి కానీ, యథార్థానికి "ఏకమేవా అద్వితీయం బ్రహ్మ" అనే భావము కనబడదు.

సుందరమైన రూపాలు

ఒకరికొకరు విశేషంగా సహాయపడతారు. కాని వారి భావనలోకాని, ఆలోచనలలోను, వారి ఆచరణలోను, ఎవరికి వారే అన్నట్లుగా ఉంటారు. వారికి బాహ్యస్వరూపం అందంగా ఉండాలి. అది వారిలోని నిగూఢసత్యాన్ని, జీవితస్వభావాన్ని తెలియజేస్తుంది. ప్రతి ఆకృతి, ప్రతీ కార్యక్రమం సాంకేతికం. అది అందమైన ఉద్యానవనం కావచ్చు. చక్కటి తేనీటి విందు కావచ్చు.

జపాన్‌లో ప్రతి వస్తువు అందంగా, ముస్తాబుగా ఉండి తీరాల్సిందే. సుందరదృశ్యాలంటే వాళ్ళకి ప్రాణం. అప్రతిహత అధినేతగా సౌందర్యం ఆ దేశాన్ని పాలిస్తూ ఉంటుంది. పరిస రాలు మానసిక, ప్రాణికమైన కార్యశీలతను, అధ్యయనం, పురో గతి, పరిశీలన, కృషిని ప్రేరేపిస్తూ ఉంటాయి. నిశ్శబ్ద ఆనంద మయ ధ్యానానికి వాతావరణం అనుకూలంగా ఉండదు. కాని కార్యశీలత వెనుక ఉన్నత ఆకాంక్ష పరిఢవిల్లుతూంటుంది. జపాన్ ప్రజల భవిష్యత్తు ఆ ఆకాంక్షను ఆవిష్కరిస్తుంది.

అనువాదం: నేరెళ్ల లక్ష్మణరావు


బౌద్ధాలయములు

ఒక మతముయొక్క బాహ్యాస్వరూపానికి ఆ మత దేవాయాల లోని విగ్రహాలు, చెక్కడాలు ప్రతీకలు. ఆ దేవుళ్లు వివిధ రూపా ల్లోను భంగిమలలోను ఉంటారు. ఆ మతముల ముఖ్యమైన గాథలు ఆ ఆలయపు గోడల మీద ప్రదర్శించబడతాయి. బౌద్ధంలో ఉత్తరాదిశాఖ, దక్షిణాదిశాఖ అనే రెండు తెగలున్నాయి. ఉత్త రాదిమతంలో రకరకాల బుద్ధుని విగ్రహాలను దర్శించవచ్చును. వారి ఆలయాలలో లెక్కలేనన్ని బోధిసత్వుల సందోహములు. దక్షిణాదివారికి విగ్రహాలు లేవు. వారిది శూన్యవాదన, 'నేతి, నేతి' నిషేధాత్మకము – నిర్వాణమే ప్రధానము.

– సంపాదకుడు

ఉత్తర, దక్షిణ సాంప్రదాయాలు

బౌద్ధమతాన్ని చూస్తే, దక్షిణాదివారి ఆలో చనలు వేరు, ఉత్తరాదివారి ఊహలు వేరు. దక్షిణాదివారు ఎక్కువ ఆచార పరులు. వారి మతగ్రంథాలని అర్థం చేసుకోవడంలో ఎటువంటి తేడాలు, సడలింపులు ఒప్పుకోరు. విపరీతమైన నిష్కర్షవల్ల దక్షి ణాదివారి భౌద్ధమతం భగవంతుడనే భావాన్నే అన్నివిధాలా తుడిచివేసింది. దీనికి పూర్తి భిన్నంగా మరి ఉత్తరాదివారి భౌద్ధ తత్వం చూస్తే అది ఒక దేవుళ్ళ కొలువే! వీరంతా గతంలో బుద్ధుళ్లన్నమాట నిజమే కానీ, వీరందరినీ దేముళ్లుగా మార్చారు. ఈ పద్ధతే క్రమంగా చైనాకీ, అక్కడినుంచి జపానుకీ వ్యాపిం చింది. అందుకే, జపానులోని బౌద్ధ దేవాలయంలో వేలకొద్దీ బుద్ధుళ్లు కనిపిస్తారు. మధ్యలో ఉన్న బుద్ధుని శిల్పం చుట్టూ వేల వేల బుద్ధుళ్లు చెక్కబడ్డారు. ఎటుచూసినా బుద్ధుళ్లే, ఆలయంలోని వెనగగోడ మొత్తం విగ్రహాలతో నిండిపోయివుంటుంది. చిన్న వారు, పెద్దవారు, లావుపాటివారు, సన్నటివారు, స్త్రీలు, పురుషులు – అందరూ, అన్నిరకాలవారూ, గంభీరంగా ఉంటారు. ఇంకా కిందభాగంలో రకరకాల ఆకారాలలో, ఒక్కోసారి జంతువుల రూపాల్లోకూడా, చిన్నచిన్న (అల్ప) ప్రాణులంతా ఉంటారు –


12-4-57

వీళ్లంతా ఈ బుద్ధుళ్ల ఆరాధకులు! అది రకరకాల రూపకల్పనల కోలాహలం! మరి దక్షిణాన బౌద్ధ ఆరాధనలో విగ్రహాలుండటానికే వీలులేదు. క్రైస్తవులలోని ప్రొటెస్టెంట్లకున్నంత కఠోర నియమాలుంటాయి వీరికి. విగ్రహాలనే కాదు, దివ్యచైతన్యంయొక్క అస్తిత్వాన్నికూడా వీరు నమ్మరు. ప్రతి ఒక్కరు కోర్కెలవల్ల కోర్కెలనిలయమైన ఈ ప్రపంచంలోకి వచ్చి కోర్కెలని జయించడం ద్వారా ఈ సృష్టినుంచి బయటపడి తిరిగి నిర్వాణం పొందుతారు. వీరికి సృష్టికర్తే లేడు.

కోరికలే జన్మకు కారణం
నిర్వాణమే మోక్షం

దక్షిణంలోని బౌద్ధగ్రంథాలు పాలి భాషలో ఉంటే, ఉత్తరాది ప్రాంతాలలో సంస్కృతంలో ఉంటాయి. ఇలాగే, టిబెట్‌లోని మతగ్రంథాలు టిబెటన్ భాషలోనూ, చైనాలో చైనీస్ బాషలోను, జపానులో జపనీస్ భాషలోనూ ఉంటాయి. ఇవన్నీకూడా ఒకదానితో మరొకటి పోలికే లేకుండా ఉండివుంటాయని నా నమ్మకం. సరే. ఇలాగే రామాయణానికి అనేక భాషాంతరాలున్నాయి. మహాభారతానికైతే ఇంకా ఎన్నో భాషాంతరాలున్నాయి.

*

మిరుమిట్లుగొలిపే
బోధిసత్వుల దృశ్యాలు

దక్షిణంలోని బౌద్ధమతమంతా శూన్యవాదమే. ప్రతిదానికీ లేదు, లేదు, కాదు అని అంటుంది. మరి ఉత్తరాదినించి టిబెట్టు, చైనా, అటునించి జపానులో వ్యాపించిన బౌద్ధమతంలో, ఇతర మతాలలోని సాధుసన్యాసులలాగానే, గతంలోని బుద్ధుళ్లు, ఉపదేవతలు, దేవతలుగా కనిపిస్తారు. మీకు ఉత్తరాదివారి బౌద్ధదేవాలయాన్ని దేన్నయినా చూసే అవకాశం దొరికిందో లేదో తెలీదు, (నేను వాటిని చైనాలోను, జపానులోను చూశాను). ఆ బౌద్ధమందిరంలోకి ప్రవేశిస్తే, లెక్కలేనన్ని చిన్న చిన్న విగ్రహాలుంటాయి – అందరూ బోధిసత్వులూ, వారి శిష్యులూ, ప్రకృతిలోని అన్ని శక్తుల దేవతారూపాలు ఉంటాయి. అక్కడున్న దేవతల సంఖ్యకి మనం ఉక్కిరిబిక్కిరవుతాం –

అదే దక్షిణంలోకెళితే ఏమీ ఉండదు – ఒక్క విగ్రహం కూడా వుండదు. బహుశ వారి 'మహాయాన' లోని అనేక విషయాల గురించీ, 'హీనయాన' లోని పరిమిత విషయాల గురించీ మాట్లాడతారేమో! ఈ 'మహాయాన' 'హీనయాన' అనే రెండు పదాలు ఎలా వచ్చాయో నాకు కచ్చితంగా తెలీదు.

అనువాదం: బి. వరలక్ష్మి

అమెరికాపై జపాను ప్రభావము

(ప్రకృతిలో జరిగే మథింపు)

ఆధునిక ప్రచారసాధనాలు, రవాణాసౌకర్యాలు ఈ ప్రపంచాన్ని చాలా చిన్నదిగా చేసాయి. అందుకని దీనికి global village అనే నామము సార్థకమైంది. భిన్నజాతులు దగ్గరకు రావడం, సంస్కృతుల కలయిక దీని పర్యవసానం. యుద్ధంలో గెలిచిన అమెరికా జపానుమీద తన నాగరికతను రుద్దింది. కాని అమెరికా కూడా జపాను ప్రభావానికి లోనయింది. అమెరికాలో ఎక్కడ చూచినా టొయోటా (జపాను) కారులే. ప్రకృతి నిరంతరం నూతనసృష్టికోసం పరిశ్రమిస్తూ ఉంటుంది. ఈ లోకమే దానికి క్షేత్రము. ధాతువులన్నిటిని కలిపి ఒక పెద్ద గంగాళంలో పోసి కళపెళామని ఉడకపెట్టినపుడు మథింపు జరుగుతుంది. అందులోంచి నూతనరూపాలు ఆవిర్భవిస్తాయి.

– సంపాదకుడు

జాతుల సమ్మిశ్రమము

ఆధునిక కాలానికి, ప్రత్యేకించి జుగుప్సాకరమైన వ్యాపారసంస్కృతికి చెందిన ప్రయోజనం ఒకటి ఉంది. అది, ప్రతీదీ మిశ్రమస్థితిలో ఉండటం. తూర్పునుంచి పడమరకు, పడమర నుంచి తూర్పుకు విషయాలు పోతున్నాయి. అవి ఒకదానినొకటి

ప్రభావితం చేస్తాయి. ఇప్పుడు దీనివల్ల గంద్రగోళపరిస్థితి, ఒకరకమైన కలగూరగంప సృష్టి అయింది. కాని దానిలోనుంచే ఒక కొత్తరూపం వస్తుంది. అది రావటం ఏమంత దూరంలో లేదు. ఇప్పుడు మనుష్యులు కలిసిపోతున్నవిధంగా ప్రజలు కలిసిపోతే పరస్పర ప్రభావం తప్పదు. ఉదాహరణకు రాజ్యాలను జయించాలనే ఉన్మాదంతో పశ్చిమరాజ్యాలు ప్రపంచంలోని అన్నిరకాల దేశాలను జయించాయి. తాము జయించిన దేశాల బలిష్ఠప్రభావానికి లోనైనాయి. ప్రాచీనకాలంలో గ్రీసుదేశాన్ని రోము జయించింది. దాన్ని జయించకుండా ఉంటే రోము గ్రీసు ప్రభావానికి ఎంత లోనై యుండేదో, అంతకంటె చాలా ఎక్కువగా ఇప్పుడు లోనయింది.

జపాన్, అమెరికాల పరస్పర ప్రభావము

అమెరికావారు – వారిప్పుడు ఉత్పత్తి చేసేదంతా జపానునే స్ఫురింపజేస్తుంది. బహుశః దీన్ని వారు గుర్తించి ఉండరు. కాని వారు జపానును ఆక్రమించినప్పటినుంచి, అమెరికా నుంచి వచ్చే పత్రికలు చూస్తే జపాను ప్రభావాన్ని ఎవ్వరైనా తెలుసుకుంటారు. అమెరికానుంచి వస్తున్న వస్తువుల కొన్ని వివరాలలో కూడా జపాను ప్రభావం తెలుస్తుంది. దానంతట అదే అలా జరుగుతుంది. ఎప్పుడూ ఒక విధమైన సమతౌల్యస్థితి రావటం విచిత్రం. భౌతికవిజయాన్ని సాధించిన వారిని ఓడిపోయినవారి చైతన్యం ప్రభావితం చేస్తుంది. పరస్పరం ఇది వర్తిస్తుంది. భౌతికవిజయాన్ని సాధించాడు, భౌతికంగా స్వాధీనం చేసుకున్నాడు కాని ఓడినవారి చైతన్యం జయించిన వానిని తనదిగా చేసుకొంటుంది.

ఇది సంపూర్ణ మిశ్రమం. ప్రకృతి విధానాలు మెల్లగా, అస్పష్టంగా చిక్కుగా ఉంటాయి. చైతన్యసాధనాలతో చాలా శీఘ్రంగా, సులభంగా వృథాలేకుండా చేయగలదానిని చేయటానికి ప్రకృతి చాలాకాలం తీసుకొంటుంది. ప్రస్తుతం ప్రపంచంలో విపరీతమైన వృథా జరుగుతోంది. కాని జరగవలసిన పని జరిగింది. ప్రజలను మిశ్రమంచేయటంలో ఆమె విధానం ఆమెది!

ప్రశ్న: ఇది ఉద్దేశపూర్వకం అంటారా?

ప్రకృతిలో వివిధ ధాతువుల మథింపు

మానవులు "ఉద్దేశపూర్వకం" అనే దాన్ని అర్థంచేసుకొనే పద్ధతిలో కాదు. కాని మనం ఏ ఉద్దేశంతో ఏ గమ్యం వైపు పోతున్నామో దానికి అది ప్రకటన అనేది నిశ్చయం. చైతన్యం ఎంత పరిమాణంలో ఉంది అనేదాని మీదనే సర్వం ఆధారపడి ఉంది. మనుష్యునికి ఇది గంద్రగోళంగా కనిపిస్తుంది. కారణం అతడు కేవలం వివరాలను మాత్రం చూడగలడు. అది విపరీతమైన కాలవ్యయంగానే అతడు చూస్తాడు. ఎందుకంటే అతనికి తన జీవితం ఎంతకాలం ఉంటుందో దానికే కాలాన్ని గురించి ఉన్న భావన పరిమితం అవుతుంది. కాని ప్రకృతి ముందు శాశ్వతకాలం ఉంది. వృథా అయినా కాకపోయినా ఆమెకు ఒకటే. కారణం ఒక బ్రహ్మాండమైన గంగాళం ఉన్నవాని వంటి దామె. వస్తువులను ఆమె అందులో పడవేస్తుంది. వాటిని మిశ్రమం చేస్తుంది. ఒకవేళ ఆమె సఫలంకాకపోతే దీన్నంతా బయట పారవేస్తుంది. వాటినే మళ్లీ తీసుకోటంవల్ల మరొక మిశ్రమం చేయవచ్చని ఆమెకు తెలుసు. ఇదీ విషయం! నష్టం అయ్యేదేదీ లేదు. కారణం, సర్వదా అది మళ్లీ ఉపయోగంలోకి వస్తుంది. రూపాలను విచ్ఛిన్నం చేసి, ముడిపదార్థాన్ని తిరిగి తీసుకొంటుంది. ఈ విధంగానే నిరంతరం జరుగుతుంది – ఒక దాన్ని చేయటం, నాశనం చేయటం జరుగుతుంది. దాన్ని తిరగవేస్తుంది – తనకు ఇష్టమైతే వందలు వేలసార్లు ప్రయత్నించటంవల్ల ఆమెకు హాని ఏముంటుంది? ఆమె చేసిన పని తప్ప వృథా అయిందేమీ లేదు. కాని ఆమెకు పని అంటే సంతోషం. పని లేకపోతే ఆమెకు ఉనికి లేదు.

అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రరావు

1919 లో జపానులో ప్రబలిన అంటువ్యాధి

యుద్ధాలవలన జరిగే నష్టం ఇంతా అంతా కాదు. జననష్టం, ఆస్తినష్టం – ఇంకా ముక్కుపచ్చలారని యువకులు అకస్మాత్తుగా చనిపోవడం మరీ ఘోరం. విదేహులైన వారి ఆత్మలు నిరాశులై వాటి జీవితాశయాలను మరో విధంగా నెరవేర్చుకునేందుకు ప్రవర్తిస్తాయి. జపానులో ఇదే జరిగింది. ఘోరపరిణామాలకు దారితీసింది. శ్రీమాత దీనినంతా తన జ్ఞాననేత్రంతో గమనించి చేతనాపరంగా దానికి ప్రతిక్రియ జరిపింది. ప్రళయాన్ని అరికట్టింది. – సంపాదకుడు

దేశమంతా ఫ్లూజ్వరం వ్యాప్తి

1919 సంవత్సరారంభంలో నేను జపాన్‌లో ఉన్నాను. అప్పుడే ఒక భయంకరమైన ఫ్లూ వ్యాధి దేశమంతా వ్యాపించి వందలాదిమందిని పొట్టపెట్టుకుంది. అంత భయంకరంగా అంటువ్యాధులు చాలా అరుదుగా వచ్చి జననష్టం కావిస్తాయి. ఒక్క టోక్యో నగరంలోనే వేలసంఖ్యలో కొత్త కేసులు ప్రతిరోజూ కనిపించేవి. వ్యాధిసోకిన రోగులు మూడురోజుల్లో మరణించడం జరిగేది. మూడురోజల్లో మరణించకపోతే ఏడు రోజులకు స్వస్థత చెందేవారు. కానీ మరణించేవారే ఎక్కువైపోయి దహనసంస్కారాలు చేయటానికి వ్యవధి కూడ ఉండేదికాదు. అది అసాధ్యమైపోయేది. దానితో దేశమంతా అట్టుడికిపోయింది. జపాన్‌వాసులు అతిశుభ్రస్థులు, జాగ్రత్త కలవారు, నీతిమంతులు కావటంవల్ల అక్కడ అంటువ్యాధులు అరుదు. అసలు జబ్బులే తక్కువ. అయినప్పటికీ ఇటువంటి ప్రళయం వచ్చేసరికి జనుల్లో భయం ఏర్పడింది. సూక్ష్మక్రిములు వెళ్ళకుండా జనం ముక్కులకు మాస్కులు తగిలించుకొని తిరిగేవారు.

వ్యాధికి అసలు కారణం

నేనుంటున్న ఇంటివాడు నన్ను నానా విధాల ప్రశ్నించేవాడు. "ఈ వ్యాధి ఏమిటి? ఎందుకు వస్తోంది? దీనికి కారణమేమిటో తెలుసుకోవాలి. మీరు నాకు చెప్పలేరా?" ఈ విధంగా రోజూ

అడిగి విసిగించేవాడు. నేను దీన్ని గురించి ఏమీ పట్టించుకోకుండా నా పనులు చేసుకునేదాన్ని. నా శక్తితో నా చుట్టూ ఒక రక్షకకవచం ఏర్పరచుకొని వ్యాధి సోకకుండా ఉండేదాన్ని. ఇలా ఉండగా ఒక రోజు నగరశివార్లలో ఉన్న నా మిత్రురాలు నన్ను రమ్మని పిలిచింది. తన మిత్రులకు నన్ను పరిచయం చేయాలనీ, నాకు కొన్ని విశేషాలు చూపించాలనీ చెప్పింది. అది ఏమిటనేది నా కిప్పుడు గుర్తులేదుకానీ, ట్రాముబండెక్కి ఊరికి చివరనున్న ఆమె ఇంటికి బయల్దేరాను. దారి పొడగునా మాస్కులు ధరించిన మనుష్యులను, భయపూరితమైన వాతావరణాన్నీ చూస్తుంటే నాలో ఒక సంచలనం కలిగింది. "అసలు ఈ వ్యాధి ఏమిటి? దీనికి మూలకారణం ఎక్కడుంది? ఇది ఏ మహామ్మారి శక్తుల ప్రభావంవల్ల వచ్చింది?" అని ఆలోచించడం ప్రారంభించాను. ఆ విధంగా నేను అనుకున్న చోటకు వెళ్ళి ఒక గంట తర్వాత ఇంటికి తిరిగివచ్చాను. రావటంతోనే విపరీతమైన జ్వరంతో వచ్చి వాలిపోయాను. ఆహా, నాక్కూడా వచ్చింది! అది అంత హఠాత్తుగా వస్తుంది. సాధారణంగా సూక్ష్మజీవులవల్ల కలిగే రుగ్మతలు రావటానికి కొంతసమయం పడుతుంది. అవి లోపల ప్రవేశించడం, లోపల కొంత యుద్ధం జరగటం, నువ్వు గెలిస్తే బాగానే ఉంటావు. ఓడితే రోగానికి గురవుతావు. అంతే తప్ప అందులో ఏమీ చిక్కులుండవు. కానీ ఈ ఫ్లూ పద్ధతే వేరు. ఉత్తరం వచ్చి కవరు చించి లోపల కాగితం తీయటమే తడవు – వెంటనే వ్యాధి ప్రవేశిస్తుంది, జ్వరం వస్తుంది. ఆ విధంగా నాకు జ్వరం సోకి పడుకునేసరికి డాక్టరును పిలిచారు. "నా దగ్గర ఎక్కువ మందు మిగల్లేదు. కానీ ఇది చాలా మంచిమందు. బాగా పనిచేస్తుంది. నీకు తప్పకుండా ఇస్తాను" అన్నాడు. ఎక్కువ మందికి వాడవలసిరావడంవల్ల మందులన్నీ అయిపోయాయి, కానీ నేను మాత్రం "మిమ్మల్ని బ్రతిమాలుతాను. నన్ను వేసుకోమని బలవంతపెట్టకండి. ఆ మందు అవసరమై ఇష్టంగా వేసుకునేవాళ్ళ కోసం అట్టేపెట్టండి" అని చెప్పాను. "అనవసరంగా

ఇక్కడికి రావటం జరిగిందే" అని విసుక్కుంటూ డాక్టర్ వెళ్ళి పోయాడు.

మృతసైనికుల ప్రేతాలు

నేను జ్వరంతో వణుకుతూ పక్కమీదే ఉండిపోయాను. మనసులో మాత్రం "ఈ జ్వరమేమిటి, దీని కారణమేమిటి?" అని ఆలోచిస్తూనే ఉన్నాను. రెండోరోజున అలాగే జ్వరంతో ఒంటరిగా పడుకొని ఉండగా తలలేని మిలిటరీ యూనిఫారంతో ఒక ఆకారం నామీదికి రావటం గమనించాను. అది నా మీదకు ఉరికి నాలోని శక్తిని పీల్చివేయటానికి ప్రయత్నం మొదలు పెట్టింది. దాని వైపు పరకాయించి చూసి నేను మృత్యువుకి దగ్గరగా ఉన్నట్లు తెలుసుకున్నాను. అది నా శక్తిని అంతా లాగేస్తోంది (ఈ జ్వరం వచ్చిన వాళ్ళు మూడోరోజున మరణిస్తున్నారు కదా). నేను అలాగే వళ్ళు తెలియకుండా కదలక మెదలక మంచాన్ని అతుక్కుని ఉండిపోయాను. వాడు అట్లాగే నా శక్తిని లాగేస్తున్నాడు. ఇక అంతా అయిపోయి మృత్యువు సమీపించిందనుకున్నాను. వెంటనే నా తాంత్రికశక్తిని ప్రయోగించి వాడితో పెనగులాడి ఓడించి తిప్పికొట్టాను. వాడింక నిలవలేక పారిపోయాడు. నేను మేల్కొన్నాను.

రక్తం త్రాగే వాంపైర్లు

చూడవలసిందంతా చూసి చివరకు అసలు కారణం తెలుసుకున్నాను. శరీరంనుంచి వేరైపోయిన ఆత్మలే ఈ వ్యాధికి మూలకారణమని తెలిసింది. మొదటి ప్రపంచయుద్ధం ముగిసే సమయంలో కురిసిన బాంబులవల్ల కందకాలలో దాగిన మనుష్యులు ఎక్కడి వారక్కడే హతులైపోయారు. వాళ్ళందరూ చక్కగా ఆరోగ్యంగా ఉండి బాంబులు పడగానే క్షణంలో మృతిచెంది శరీరాలనుంచి తొలగించబడ్డారు. తాము మరణించామనీ, తమ శరీరాలు లేవనీ తెలియకపోవటంవల్ల ఇతరుల శరీరాలద్వారా జీవితం కొనసాగించవచ్చని అనుకున్నారు. ఆ విధంగా అనేకమైన ప్రేతాత్మలు వెలువడి మనుష్యులమీద పడడం ప్రారంభించాయి. అంతేకాకుండా ఫ్లూ వ్యాధినబడి మరణించినవారి ప్రాణికశక్తులు కూడా విచ్ఛి

న్నమై, ఒక బంకగా ఏర్పడిన పొరల్లో ఈ ప్రేతాత్మలు నివాసమై కదలటం మొదలుపెట్టాయి. ఈ మబ్బు పొరలో తగులుకున్న వాళ్ళకు వ్యాధి సోకేదిగానీ వెంటనే నయమైపోయేది. అందులోని ప్రేతాత్మ బారినపడిన వాళ్ళు మాత్రం నిలదొక్కుకోలేక మృత్యువాత పడేవారు. వాటిని ఎదిరించి పోరాడాలంటే ఎంత జ్ఞానమూ, శక్తీ కావాలో నాకు బాగా తెలుసు. అది అప్రతిఘటం, అనివార్యం. అంటే విఘటిత ప్రాణికశక్తులతో కూడిన బంకమబ్బులతో కూడిన బంకమబ్బు పొరలో నివాసంగా ఉన్న ప్రేతాత్మల బారి పడినవాళ్ళు బ్రతికేవారు కాదు. ఇటువంటివి అంతులేకుండా ఉన్నాయన్న విషయము, ఇదంతా చూడటంవల్ల నాకు తెలిసింది.

మదర్ తాంత్రిక ప్రక్రియ

ఎవరైనా నన్ను చూడటానికి వచ్చినా నేను చూడకుండా ప్రశాంతంగా, నా చైతన్యంలో మునిగి, ధ్యానించుకుంటూ నిశ్చలంగా రెండు మూడు రోజులు పడుకొని ఉండిపోయాను. తర్వాత నాకు మంచిస్నేహితుడైన ఒక జపానీయుడు వచ్చి "అరె, నీవు జబ్బుపడ్డావా? నేననుకున్నది నిజమే అయిందన్నమాట. ఈ మధ్య రెండు మూడ్రోజులబట్టి ఎవ్వరికీ ఫ్లూ జ్వరం రాలేదు. ఇంతకు ముందు వ్యాధి వచ్చిన వారిక్కూడా నివారణ జరిగింది. ఎవ్వరూ మృతి చెందలేదు కూడా. వ్యాధి పూర్తిగ అదుపులోకి వచ్చింది. దాని పని అయిపోయింది". జరిగిందంతా అప్పుడు నేను అతనికి వివరించాను. ఆయన అందరికీ చెప్పాడు. దాని మీద పత్రికల్లో వార్తలు కూడా రాశారు.

మందులకంటే వెయ్యిరెట్లు మేలు

చూశారా! మందు పొట్లాలకంటే చైతన్యం ఎంత శక్తివంతమైందో. అప్పటి సంగతి ఎంత ప్రమాదమైనదో కదా! కొన్ని గ్రామాలకు గ్రామాలే తుడిచిపెట్టుకొని పోయాయంటే ఊహించగలరా? వందమంది జనాభా మాత్రమున్న ఒక గ్రామంలో ఒకతనికి ఉత్తరం ఇవ్వడానికి పోస్ట్‌బంట్రోతు వెళ్ళటం తటస్థించింది. (ఎవరికైనా ఉత్తరం వస్తే మాత్రమే పోస్ట్‌బంట్రోతు ఆ గ్రామానికి వెడతాడు) అతను వెళ్ళేసరికి ఊరంతా దట్టంగా

మంచుతో కప్పబడిపోయింది. అంటే అక్కడి వాళ్ళంతా ముందే మరణించటంవల్ల మంచునెవ్వరూ తొలగించలేదన్న మాట. ఆ ఫ్లూ తీవ్రత అటువంటిది. అయితే టోక్యో ఒక మహానగరం కావటం వల్ల అటువంటి పరిస్థితి రాలేదు. ఏమైతేనేమి చివరికి ఫ్లూ వ్యాధి కథ అలా ముగిసింది.

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ.వి.ఆర్.శాస్త్రి

టాల్‌స్టాయ్ కుమారుని సిద్ధాంతం

ప్రపంచశాంతి కోసం అనేకమంది అనేక మార్గాలను అన్వేషిస్తూ ఉంటారు. ఈ ప్రయత్నం ఒక్కొక్కప్పుడు వెర్రితలలు వేస్తుంది. వైవిధ్యం సృష్టియొక్క లక్షణమనే సంగతి మరచిపోయి "అందరూ నాలాగే ఆలోచించాలి, నాలాగే ప్రవర్తించాలి, నాలాగే..." అనే విచిత్రవాదన ఒకటున్నది.

– సంపాదకుడు

వైవిధ్యమే సృష్టి లక్షణము

ఈ ప్రపంచమంతా దేవదేవుని సంక్లిష్ట బాహుళ్యానికి ఒక బాహ్యప్రకటన మాత్రమే అనే భావానికి నీవు ఎదిగిన నాడు యీ లోకంలోని ఎన్నో భేదాలు, భిన్నత్వాలు ఎంతో ఆవశ్యకమని గుర్తిస్తావు. అందరూ నీ లాగుననే యోచించాలి, స్పందించాలి అనే నీ వూహ ఆ క్షణాన ఎంత అసాధ్యమో, అసంగతమో నీకు స్పష్టంగా అవగతమవుతుంది.

సత్యమనగా ఒకే మూసలో పోయటం కాదు

ప్రతి మనిషికి తనదైన ఆలోచనా విధానం, ప్రతిస్పందనా వుంటాయి గదా – మరి అందరూ నీలాగే ఆలోచించాలి, నీలాగే పనులు చేయాలనే కోరిక నీకెందుకు? నీవు నమ్మిన సత్యం, యితరులు నమ్మిన సత్యంకన్న విశిష్టమైనదనే ఒప్పుకుందాం. అసలు యీ "సత్యమ"

నే పదానికేమైనా అర్థం వున్నదా? ఒక దృక్కోణంలోంచి చూస్తే అందరి నమ్మకాలు సత్యాలే, అన్నీ పాక్షికాలే. కాని అన్నీ సత్యాలే, ఎందుకంటే, అన్నీ ఒకే సత్యంలోని పాక్షికభాగాలు కనుక. మరొక విషయమేమంటే నీవు ఏ క్షణాన నీవు నమ్మిన సత్యం యితరులు నమ్మిన సత్యంకన్న విశిష్టమైనదని తలుస్తావో, ఆ క్షణాన నీవు సత్యదూరమవడం ఆరంభమవుతుంది.

అసలు అందరకూ నీవలెనే ఆలోచింపజేయాలనే కోరిక, అటువంటి ప్రయత్నం చేసే అలవాటు నాకెంతో విచిత్రంగా అగుపిస్తాయి. దీనిని నేను "ప్రచారధోరణి" అంటాను. అది యిక్కడితో ఆగదు, చాలా దూరం పోతుంది. నీ ఆలోచనాధోరణిలో మరొక మెట్టు పైకెక్కి యీ లోకమంతా నీలాగే పనులు చేయాలని, నీ వలెనే స్పందించాలని కోరుకుంటావు. నిజానికి అలాంటిదే జరిగితే, వైవిధ్యం లేని యీ లోకమంతా ఒక దుస్సహ పేలవత్వంతో నిండిపోతుంది.

అందరూ ఒకే భాష మాట్లాడాలట

నేను జపాన్‌లో టాల్‌స్టాయి కుమారుడుని కలిసాను. అప్పుడతను విశ్వ మానవ ఐక్యత, కళ్యాణాల కోసం, ప్రపంచ పర్యటనకు సన్నద్ధుడై వున్నాడు. అతని పరిష్కారం గూడ బహు సరళమైనదే. లోకంలోని మానవులందరూ – ఒకే వేషభాషలతో, ఒకే విధమైన ఆహారపానాదులతో, ఏకమార్గాన నడువవలె. నేనిదేమి తమాషాకి అనే మాట కాదు. ఇది సరిగ్గా ఆయన అన్న మాట.

నేనాయనను టోక్యోలో కలిసాను. ఆయనేమన్నారంటే – "అలా ఏకమార్గాన నడిచిన ప్రపంచప్రజలందరు ఒకరినొకరు అర్థం చేసికొని సుఖసంతోషాలతో హాయిగా వుంటారు. పోట్లాటలు, విభేదాలు అంతమయి శాంతియుతంగా వుంటారు". అటువంటి పరిస్థితి ఎంత అసాధ్యమో, అసంగతమో ఆయనకెలా నచ్చచెప్పాలో నాకాక్షణాన తెలియలేదు. ఆ ధ్యేయంతో ఆయన ప్రపంచ పర్యటనకు బయల్దేరాడు. ఆయనను ఎవ్వరైనా 'మీ పేరేమిటి?' అని అడిగితే 'టాల్‌స్టాయి' అని చెప్తాడు. "ఓ మీకు

తెలియదూ – టాల్‌స్టాయ్ – ఓహ్” అనుకుంటారు ప్రపంచ ప్రజలు. కొందరికైతే అసలు టాల్‌స్టాయ్ మరణించినట్లు తెలియనే తెలియదు. వారనుకుంటారు – “ఓహ్! ఎంత అదృష్టం! ఇప్పుడాయన చెప్పే ఓ విశిష్టమైన విషయాన్ని వినబోతున్నాం” అని భావిస్తారు. అదిగో, అప్పుడు ఆయన తను నమ్మిన సిద్ధాంతాన్ని వివరిస్తారు!

ఇది ఒక విధంగ ఒక విచిత్రభావాన్ని ఉత్ప్రేక్షించడమే ననుకోండి.

అయితే నేను మీకొక విషయం మటుకు ఖచ్చితంగ చెప్పగలను. ఏదో ఒకనాడు మీ జీవితాన ఒక క్షణం వస్తుంది. ఆ క్షణాన – మీరు నమ్మిన సత్యాలను యితరులపై రుద్ది వారిని నమ్మింపజూసే మీ ప్రయత్నాలన్నీ – మీకే అసంగతంగ అర్థరహితంగ కన్పట్టి తీరుతాయి.

అనువాదం: ఎస్. పూర్ణచంద్రరావు

శ్రీమాత మహాలక్ష్మి దర్శనము

(జపాన్‌లో ఉన్నప్పుడు రవీంద్రనాథ్ ఠాకూర్‌తోనూ, ఇంకా కొంతమందితోనూ శ్రీమాత కలిసి ఉన్న ఫోటోను శ్రీఅరవిందులకు చూపుతూ ఆమె ఇలా చెప్పారు)

ఈమె మహాలక్ష్మి – మధురం, మృదులం, ప్రేమాన్వితం, సులలితం, సుమనోహరం, సామరస్యభరితం – ఈమెను మళ్ళీ దర్శించాలనీ, మళ్ళీ కలుసుకోవాలనీ ఉంది.

18 డిసెంబరు 1944

*

1919 వ సంవత్సరములో రవీంద్రనాథ్ ఠాకూర్ జపాన్ వెళ్ళినప్పుడు శ్రీమాతను కలుసుకున్నారు. అక్కడ వారిద్దరూ ఒకే హోటల్‌లో ఉన్నారు కూడా. శ్రీమాత మూర్తిత్వాన్ని బాగా అర్థం చేసుకున్న ఆ కవీంద్రుడు శాంతినికేతన్‌కు వచ్చి దాన్ని నిర్వ



Rabindranath Tagore and the Mother in Japan

హించి తీర్చిదిద్దమని ఆమెను అభ్యర్థించారు. అయితే శ్రీమాత అది అంగీకరించలేకపోయారు. భారతదేశమే తన కార్యరంగమని ఆమెకు తెలిసినప్పటికీ తన చోటు వేరేచోట ఉండటంవల్ల అలా చేశారు.

శాంతినికేతన్‌లోకి రవీంద్రసదనమనే మ్యూజియంలో జపాన్‌లో టోక్యో నగరంలో శ్రీమాత, రవీంద్రనాథ్ ఠాకూర్, తదితరులు ఉన్న గ్రూప్ ఫొటో నేటికీ భద్రంగా ఉంది. అప్పట్లో విశ్వకవీంద్రులు తాను ఉపయోగిస్తున్న టైప్‌రైటర్‌ను శ్రీమాతకు బహూకరించగా దాన్నొక జ్ఞాపికగా ఆశ్రమంలో ఇప్పటికీ భద్రంగా దాచిపెట్టారు.

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ.వి.ఆర్.శాస్త్రి

ఎవరైనా పొట్టతో ఆలోచించగలరా?

ఎందుకాలోచించలేరు? అటువంటి వాళ్లు ఉన్నారు కూడా. మనిషి ఆలోచనలకు ఒక్క మెదడే అక్కరలేదు. నీ శరీరంలోని ఏ భాగమైనాకూడా దానికి పనికివస్తుంది. నీ ధ్యానాన్ని ఎక్కడ కేంద్రీకరిస్తే అక్కడ అది జరుగుతుంది. నీ ఆలోచన క్రియాశీలమౌతుంది. ఫలిస్తుంది. — సంపాదకుడు

తలనొప్పికి మందు

నేను 'జపాన్' లో ఉన్నప్పుడు ఒక గుంపును కూడగట్టుకొనిన మనిషిని కలిసేను. వారందరూ సాధన కొరకు గుమికూడిన వారుగా చెప్పలేము. కాని ఒక విధమైన శిక్షణకొరకు కలసినవారు. వారి నాయకునికి ఒక ప్రత్యేక సిద్ధాంతమున్నది. ఆ సిద్ధాంతాన్ని అమలుచేయుటకే అతడీ గుంపును చేరదీసినాడు. మనిషి తన శరీరములోని ఏ అంగముతోనైనా ఆలోచించవచ్చును. ఆ భాగము మీద ఏకాగ్రత నిలుపుతే అక్కడ నుండే ఆలోచన పుట్టుకొస్తుందని అతని సిద్ధాంతము. అంటే తలతోనే ఆలోచించనక్కరలేదు,

ఛాతితో కూడా ఆలోచించవచ్చు అని అర్థము. అతను ఇక్కడ (శ్రీమాత తన పొట్టను చూపుతూ) పొట్టతో ఆలోచించవచ్చు – అంటాడు. అతను పొట్ట "ప్రాణ"స్థానము, అంటే ప్రాణికశక్తి అంటాడు. అతడు, వచ్చీరాని సంస్కృతం మాటలు ప్రయోగిస్తాడు. సరే దానిమాటకేమి? కాని అతనికి తన సిద్ధాంతంమీద పూర్తి నమ్మకం ఉన్నది. మంచివాడు. మానవుని కష్టాలకు మూలం వారు తలతో ఆలోచించడమే – దీనివల్ల తీవ్రమైన తలనొప్పి వస్తుందని, మానసిక నైర్మల్యం నశిస్తుందని అతని వాదన. అలాకాక ఇక్కడ (పొట్టను చూపుతూ) నుండి ఆలోచించడం నేర్చుకుంటే, శక్తి, బలము, స్థిరత్వము వస్తాయని అంటాడు. ఇంకా అతడు తన మానసికశక్తిని ఖచ్చితంగా ఇక్కడకు (పొట్టవైపు సూచిస్తూ) దించగల సమర్థుడైనాడు. మానసిక క్రియాశీలత అతనికి అక్కడే పుట్టేది – మెదడులో కాదు. విపరీతమైన తలనొప్పితో బాధపడే వారిని కొన్ని వందలమందికి బాధ నివారించేడు.

కడుపులో ఆలోచనలు

నేను కూడా, ఆ విధానాన్ని ప్రయత్నించేను. అది చాల సులభం – ఎందుచేతనంటే, మానసికశక్తి, మెదడుతో ముడిపడి లేదు. అది స్వతంత్రమైనది. ఈ విషయం మీకు ఒక క్షణం క్రిందట చెప్పేను. మనకు మెదడు ఉపయోగించడం అలవరచుకున్నాము – కాని మానసికశక్తిని ఏ భాగంనుంచి అయినా, ఏకాగ్రతతో సాధించవచ్చు. ఏకాగ్రతవల్ల అక్కడనుండే ఆలోచనాశక్తి వస్తున్నట్లు భావించబడుతుంది – బొడ్డు దగ్గర మానసికశక్తి కేంద్రీకరించి, అక్కడనుండే ఆలోచనవస్తున్నట్లు భావించవచ్చు.

గొప్పవాళ్ల లక్షణాలు

"గొప్ప" శక్తిమంతులకు పెద్ద బొజ్జ ఉంటుంది మీరు గమనించలేదా అని అడుగుతాడు. (శ్రీమాత నవ్వుతూ) ఇంకా "వారి శక్తిని అక్కడ కేంద్రీకరిస్తారు కనుక వారికి పెద్ద పొట్టలు ఉంటాయి" అని అంటాడు. "వీరు నిటారుగా నిలబడి, తల నిటారుగా అంటే ఇలా కాదు (శ్రీమాత తలను ముందుకు వంచి) ఇలాగ కాదు శ్రీమాత తలను కుడికి వంచి) ఇలాగ కూడా కాదు (తలను ఎడమకు

వాల్చి (శ్రీమాత చూపుతూ) ఇలాగ నిటారుగా తలవుంచి, తమ శక్తినంతా పొట్టపై కేంద్రీకరిస్తారు (పొట్టవైపు చూపుతూ) కనుక వారు చాలా శక్తిమంతులు అవుతారు". అతను ఎప్పుడూ నెపోలియన్ గూర్చే చెబుతాడు. "చూడండి నెపోలియన్" (శ్రీమాత నెపోలియన్‌కు పెద్ద బొజ్జ ఉన్నట్లుగా చూపుతారు) శ్రీరబీంద్రనాథ్ టాగూరు, జపాన్‌లో నున్నప్పుడు, ఈయనను కలిసాను. ఆ విషయం నాకు చెబుతూ "టాగూరును చూచారా, అతను ఎంత నిటారుగా నిలబడతాడో ఇలాగ? మరి టాగూరుకు పెద్దబొజ్జ లేదే" అని నేను అడిగేను. అతను "వస్తుంది, వస్తుంది" అన్నాడు (శ్రీమాత నవ్వుతూ)

ఆలోచనలను కడుపులోకి దింపుట

అతని శిక్షణా కేంద్రంలో వందల మంది ఉండేవారు. వారందరూ తమ మోకాళ్లమీద కూర్చొనేవారు (జపాన్ పద్ధతిలో). అతను కఱ్ఱతో టేబులును తట్టేవాడు. ప్రతి ఒక్కరూ వారి మానసికశక్తిని పొట్ట లోనికి దించేవారు. ఈ విధంగా సుమారు అరగంట అభ్యాసం చేసేవారు. అతను రెండవ సారి టేబిలును తట్టేవాడు. అందరూ మానసికశక్తిని విడిచి, మాటలలో పడేవారు. జపాన్‌వారు మాట్లాడుతారు. కాని, ఎక్కువగా కాదు.

అనువాదం: రంగనాథ ఆత్రేయ

మానసికశక్తి, మెదడుతో ముడిపడి లేదు. అది స్వతంత్రమైనది.

శ్రీమాత



The Mother in Japan

మొక్కలతో సంభాషణ

మనిషి తన పరిసరములలోని వస్తువులతో సానుభూతితో ప్రవర్తించాలి. మొక్కలను పెంచేటప్పుడు వాటిని ప్రేమతో పోషిస్తే అవి కూడా అనుకూలంగా స్పందిస్తాయి. నిన్ను పల కరిస్తాయి, పులకరింపజేస్తాయి. నువ్వు వాటిని సక్రమంగా ఉప యోగించినట్లయితే అవి కూడా నీతో సహకరిస్తాయి.

— సంపాదకుడు

ప్రశ్న: కోడిగ్రుడ్డును తినినప్పుడు దానిలోని కోడిపిల్లను తినినట్లు కాదా?

జవాబు: అది ఇంకా ఏర్పడలేదు. గ్రుడ్డును తినేటప్పుడు ఇంకా పిండమేర్పడని తాజాగుడ్డును తింటే బాగుంటుంది.

ప్రశ్న: మధుమయీ, గ్రుడ్డులోని పిల్లయొక్క బాధ (దానిని తినే టప్పుడు) మనమీద సోకితే, మరి "బీట్‌రూట్, కేరట్" ల సంగతి ఏమిటి?

జవాబు: సరే కోడిపిల్ల చేతనాస్థాయి బీట్‌రూట్, కేరట్‌లకన్నా ఎక్కువే కదా. (నవ్వుతూ) ఈ విషయంలో నా అనుభవం చెబుతా విను. "టోక్యో"లో నాకు ఒక కూరగాయల తోట ఉండేది. అది చాలా పెద్ద తోట. నేనే స్వయంగా, కూరగాయలు పండించేదానిని. రోజూ ఉదయాన్నే నీరు పెట్టి, వాటి రక్షణ చేసి, అన్నింటిని చూస్తూ తోట చుట్టూ తిరిగేదానిని. ఆ తిరుగుతున్నప్పుడు తిన డానికి పనికివచ్చే కూరలకొరకు గాలించేదానిని. వాటి ప్రక్క చూడగానే కొన్ని కూరలు, "వద్దు. వద్దు, నన్ను వద్దు" అనేవి. మరికొన్ని రమ్మని పిలిచేవి. దూరంగానే వాటిని చూస్తే అవి, "నన్ను తీసుకోండి, నన్ను తీసుకోండి అనేవి". అందుచేత నా పని సులభమయింది. "తీసుకోమన్న" వాటిని తీసేది, "వద్దన్న" వాటిని విడిచిపెట్టేది. నా మొక్కలను చాలా గారాబంగా పెంచి, ప్రేమించేదానిని. వాటికి నీరు పోస్తున్నప్పుడూ, సంరక్షణ చేస్తు

న్నప్పుడూ, వాటిలోనికి ఎక్కువగా, చాలా ఎక్కువగా చైతన్యం ప్రవేశపెట్టేదానిని. కనుక వాటికి ప్రత్యేక చైతన్యం ఏర్పడిందని నా భావన.

"ఫ్రాన్సు" లో కూడా ఇలాగే జరిగింది. దక్షిణఫ్రాన్సులో నా తోటలో బటానీ, ముల్లంగి, కేరట్ పండించేదానిని. అక్కడ కూడా, కొన్ని "వద్దు, వద్దు" అనేవి.

ప్రశ్న: అవి ఎందుకలాగ అంటాయి మధుమయీ?

జవాబు: అవి ఎందుకలా అంటాయో తెలుసుకొనేందుకు ప్రయత్నించేను. ఫలితం ఎప్పుడూ ఒకే విధంగా లేదు. ఒక్కొక్కప్పుడు, ఆ మొక్క తినుటకు పనికిరానిది; మంచిదికాదు, కోరకబడనిది, చేదుకలదిగా ఉండేది. ఒక్కొక్కప్పుడు ఇంకా పక్వానికి రానిదిగా ఉండేది. ఒకటి రెండు రోజుల తరువాత వాటంతట అవే "తీసుకోండి, నన్ను తీసుకోండి" అనేవి (నవ్వుతూ శ్రీమాత).

*

ఈ భూమ్మీద ఎన్ని రకాల మొక్కలు పెరుగుతున్నవో ఎవరూ చెప్పలేరు. తెలుసుకొననూ లేరు. అయినా వాడుకచేస్తున్న మొక్కల జాబితా తయారుచేస్తే, మనుషులకు తెలిసినవి చాలా తక్కువ. నేను జపాన్‌లో ఉన్నప్పుడు వారు, "యూరోపియనులు సుమారు మూడువందలయాభైరకాల మొక్కలనే వినియోగిస్తారు, కాని మేము ఆరువందలకుపైగా ఉపయోగిస్తాం" మని అనేవారు. ఈ తేడా తక్కువ ఏమీ కాదు. వారు "ప్రకృతి అనంతమైన సంపదని యిస్తున్నది – దానిని మీరు నిరుపయోగం చేస్తున్నారు" అని అనేవారు.

అనువాదం: రంగనాథ ఆత్రేయ

భగవంతునితో ముచ్చట్లు

(శ్రీమాత డైరీ పేజీలు)

[1]

డిసెంబరు 5, 1916

[మహాప్రభూ]

'నేను' అనే భావమును పూర్తిగా కరగించి వేసితివి. సర్వమునందు నేనే యున్నాననియు, అంతకంటే కొట్టవచ్చినట్లుగా సర్వము నాయందే వసించియున్న అనుభూతియు నీవు నా కను గ్రహించితివి. ఈ సమాధిస్థితిలో, ఈ మహాచైతన్యంలో మునిగి పోయిన నా మనస్సు వెలుపలకు వచ్చుటకు వీలుకాకుండెను.

(అప్పుడు కలిగిన అనుభూతి)

పరాచైతన్యంతో తాదాత్మ్యం చెందిన ఆ నిశ్శబ్దంలోంచి "నీ దృష్టిని భువి వైపుకు మరల్చుము" అనే ఆదేశం వినబడింది. చైతన్యం సర్వభూతాత్మకమైనది. "నువ్వు ఏకేశ్వరుడిని దర్శించిన ప్రతివస్తువులోనూ, మనిషిలోనూ కూడ ఆ చైతన్యము జాగృతమైంది చూడు...."

జపాన్‌లో అదొక వీధి. రంగురంగులతో, ప్రకాశవంతమైన దీపాలతో ఆకర్షణీయంగా అలంకృతమై వుంది. క్రమంగా వీధి నిండా చైతన్యం కదలాడగా, అన్ని వస్తువుల్లోను, అందరిలోనూ స్పష్టమయ్యే భగవత్తత్త్వం దర్శనమైంది. అక్కడ పల్చని గోడలు గల ఇళ్ళున్నాయి. అందులో ఒకటి పారదర్శకమైంది. బంగారు వర్ణమూ, ప్రకాశవంతమూ అయిన రంగుల్తో అల్లికచేయబడిన దివ్యమైన నీలవూదారంగుగల దుస్తులతో ఉన్నతాసనంపై ఆసీనురాలైన ఒక స్త్రీ స్పష్టంగా కనిపించింది. ఆమె చాలా అందంగా ఉంది; వయస్సు సుమారు ముప్పైఅయిదు నలభై మధ్య కావచ్చు. ఆవిడ జపాన్‌దేశపు మూడు తీగల కమానుతో ఒక వాయిద్యం

వాయిస్తూంది. పాదాలవద్ద చిన్న పసిపాప ఉంది. ఆ స్త్రీలో కూడ దైవత్వం స్పష్టంగా కనిపించింది.

[2]

ఏప్రిల్ 1, 1917

మిరుమిట్లు గొల్పే ప్రకృతి దృశ్యాన్ని, పచ్చని చెట్లను, ఆకాశాన్ని కొలుస్తున్నాయా అన్నట్లున్న ఏకాంతమార్గాలను – మూగబోయి నీకై నిరీక్షించే నా ఆత్మకు సందర్శింపజేశావు.

ఓయీ! నా కర్తవ్యమేమిటో నీవు చెప్పనే లేదే! ఆ విషయాన్ని నా నుంచి అంతగా మరుగుపరచాలా?

అన్నివైపులా చెర్రీచెట్లను మరోసారి సందర్శిస్తున్నాను. భగవంతుడా! ఆ పుష్పాలలో ఏదో ఇంద్రజాలశక్తిని నిక్షేపించావు! అవన్నీ నీ ఏకైక సన్నిధినే చాటుతున్నాయి! నీ దివ్యదరహాస రేఖల్ని కొనితెస్తున్నాయి!

నా శరీరం నిశ్చలంగా ఉంది. నా ఆత్మ వికసిస్తోంది. ఓ భగవాన్! ఈ పుష్పభరిత వృక్షాలలో ఏదో చిత్రమైన మహిమను నిక్షేపించావు.

ఓ జపాన్! నీకు నేడు పండుగదినము. నీ సౌహార్ద్రానికి అభివ్యక్తి. ఇది నీ పవిత్రమైన ప్రసాదం! నీ విశ్వాసానికి హామీ! ఆకాశానికి దర్పణం.

దేవదారు వృక్షాలతో అలరారే పర్వతాలతో, చక్కగా దుక్కి చేయబడ్డ లోయలతో నిండిన దివ్యమూ, గంభీరము అయిన దేశాన్ని చూస్తున్నాను. ఈ చిట్టి చైనా గులాబీలు రేపటి బంగారు భవిష్యత్తుకు వాగ్దానాలా?

[3]

ఏప్రిల్ 7, 1917

ప్రగాఢమైన ధ్యానము నన్ను అంతర్ముఖుణ్ణి చేసి సమాధి దగ్గరకు తీసుకుపోయింది. ఒకే ఒక చెర్రీ కుసుమముతో నేను తాదాత్మ్యం చెందుతున్నట్లు గ్రహించాను. తద్వారా అన్ని చెర్రీ కుసుమాలతోను ఐక్యమైపోయాను. ఒక నీలిమ శక్తిప్రవాహము ననుసరించి ఆశ్చర్యంగా నేనే చెర్రీ వృక్షమైపోయాను. తన కొమ్మలను ఆకాశంలోకి జాపి ప్రార్థిస్తున్న ఆ చెట్టుతో నేను తాదాత్మ్యం చెందాను. అప్పుడు నాకీ క్రింది మాటలు వినిపించాయి!

"ఈ విధంగా నీవు చెర్రీ వృక్షాల ఆత్మతో తాదాత్మ్యం చెందావు; ఇది స్వర్గానికి పుష్పముల ద్వారా చేసే ప్రార్థనని గ్రహించుము"

దీన్ని నేను రాసిన తర్వాత అదంతా నామరూపాలు లేకుండా పోయింది. అయితే ఇప్పుడు చెర్రీ వృక్షపు రక్తం నా నరాల్లో ప్రవహిస్తూంది. చెప్పలేనంత ప్రశాంతి, శక్తీ నన్ను ఆవహించాయి. మానవశరీరానికీ, ఆ వృక్షశరీరానికీ తేడా ఏమిటి? వాస్తవానికి ఏమీ లేదు. ఆ రెండింటికీ జీవంపోసే చైతన్యమొక్కటే. అప్పుడు చెర్రి వృక్షం నా చెవిలో గుసగుసలాడింది. [1]వసంతకాలంలోని రోగాలను కుదిర్చే శక్తి ఒక్క చెర్రీబ్లాసమ్‌కే వుంది.

---

[1] ఫిబ్రవరి 11, 1936 న ఒక యువకిశోరం శ్రీమాత నడిగాడు "వసంత కాలంలోని రోగాలను కుదిర్చే శక్తి ఒక్క చెర్రీబ్లాసమ్‌లోనే వుంది" దీని అర్థమేమిటి?

శ్రీమాత సమాధానము:

ముఖ్యంగా వసంతంలో ప్రజలలో కురుపులు, రక్తదోషము మొదలైన అస్వస్థలు కలుగుతాయి. వీటిని చెర్రీబ్లాసమ్‌తో తయారుచేసిన 'టీ' తో జపాన్ వారు నయం చేస్తారు. అయితే 1919 లో నేను చెర్రీ చెట్టుతో మాట్లాడినప్పుడు నాకీ సంగతి తెలియదు.

[4]

ఏప్రిల్ 28, 1917

మిరుమిట్లు గొలిపే కాంతితో రాత్రి దర్శన మిచ్చిన మహా ప్రభూ! నీ శక్తిని ఏమని వర్ణింతును? ఒక్క క్షణంలో నన్ను పరిశుద్ధమూ, ప్రకాశమానమూ పారదర్శకమూ, జాగృతమూ నీవు తప్ప ఎవరు చేయగలరు? చివరి మాలిన్యముల నుంచి విముక్తిని, చివరి బంధనాలనుంచి స్వేచ్ఛను ప్రసాదించగలవు. రాత్రి నీవు నాలో ప్రవేశించి, నన్నాక్రమించి అటుల చేయలేదా? ఎందుకంటే నాలో ఇప్పుడు మానవాతీతమైన శక్తి, అపారప్రశాంతత సమకూర్చబడినవి ఈ ఉన్నతస్థాయి నుంచి పతనం గాకుండా రక్షించుము నా గురువు, దైవమూ అయిన నీవు, ఆ ప్రశాంతి కేవలం నా అంతరంగంలోనే కాకుండా హృదయంలోని మారుమూలల్లోను, బాహిరమైన ప్రతి చర్యలోను కూడ శాశ్వతంగా నన్ను పరిపాలించునట్లనుగ్రహింపుము.

సమస్త ప్రాణికోటిని సంరక్షిస్తున్న ఓ భగవంతుడా! వందనములయ్యా! నీకు వందనములు.

"ఇక్కడ చూడు! పుష్పాలు, ఆశీస్సులున్నాయి! ఇక్కడ భగవత్ప్రేమ దరహాసముంది! అది పక్షపాతరహితము. దాని కందరూ సమానులే ఔదార్యమైన ప్రవాహంతో అందరివైపు ప్రవహిస్తుందే తప్ప, తన అద్భుత బహుమతులను ఎప్పుడూ వెనక్కు తీసుకోదు"

ఆమె హస్తములు పరమానంద ముద్రతో ఈ ప్రపంచంపై పరిశుద్ధ ప్రేమను నిరంతర ధారగా కురిపించెను.

అనువాదం: ఆచార్య ఎస్. గంగప్ప



1920 నాటి శ్రీమాత ఛాయాచిత్రం
(జపాన్‌నుంచి వెళ్ళేముందు పాసుపోర్టు కోసం)

నేను ఏ దేశానికీ, నాగరికతకు, సమాజానికీ, ఏ జాతికి చెందను! ఒక్క భగవంతునికి తప్ప!

నేను ఏ గురువును, ఏ యజమానిని, ఏ చట్టాన్ని, ఏ సాంఘికాచారాలను పాటించను; ఒక్క భగవంతుణ్ణి తప్ప!

భగవంతునికి నా అభీష్టమూ నా జీవితమూ, నా ఆత్మా – సర్వమూ సమర్పించుకొంటిని. భగవంతుడు కోరితే నా రక్తంలోని ప్రతి బొట్టూ ఇవ్వడానికి పరమసంతోషంతో సిద్ధంగా ఉన్నాను. భగవత్సేవలో చేయు ప్రతికార్యమూ పరిపూర్ణానందమే!

జపాన్, ఫిబ్రవరి 1920

అనుబంధం:

జపాన్‌లో శ్రీమాత

(వెదజల్లిన కాంతి కిరణాలు)

1957 సెప్టెంబరులో (శ్రీమాత జపాన్‌ను వదిలిపెట్టిన 37 ఏళ్ళ తరువాత) డా॥ కె.ఆర్. శ్రీనివాస అయ్యంగార్, ప్రొఫెసర్ వి.కె. గోకాక్‌గార్లు P.E.N అంతర్జాతీయ సమావేశాలకోసం జపాన్ వెళ్ళారు. ఆ సందర్భంగా శ్రీమాత స్నేహితులైన డా॥ ఒఖావా, మేడమ్ ఒఖావాలను కలుసుకున్నారు. టోక్యోలో శ్రీమాత వారితో కలిసి ఒక్కే ఇంట్లో ఒక సంవత్సరం గడిపారు. డా॥ అయ్యంగార్, ప్రొ॥ గోకాక్ క్యోటోలో మేడమ్ కొబాయషీని కూడా కలుసు కున్నారు. ఆమె కూడా శ్రీమాత ప్రియతమ స్నేహితురాలు. నిశ్చ లంగా కూర్చొని ధ్యానం చేసే పద్ధతిలో వారు ముగ్గురు నిష్ణా తులు. ఈ రకం ధ్యానంతో వారు అనేకమంది రుగ్మతలు నయం చేశారు. శ్రీఅరవిందులు తమ Evening Talks లో మేడమ్ కొబా యషీ ధ్యానవిధానం గూర్చి ప్రస్తావించారు.

డా॥ కొబాయాషి అనే ఆయన ఒక వైద్యుడు. కేవలం మందులతోటే కాకుండా ధ్యానంతో వ్యాధులకు చికిత్స చేయ వచ్చని కనిపెట్టాడు. ఆ చికిత్సను గురించి శ్రీమాత ఈ విధంగా చెప్పారు

"ఆయన సిద్ధాంతమిది. శరీరంలోని ఏ భాగంలోనైనా రక్తం గడ్డకట్టినప్పుడు ఆ భాగం వ్యాధికి గురౌతుంది. డా॥ కొబా యషి రోగులను తన సరసన కూర్చోపెట్టుకొని ధ్యానం చేయించే వాడు. బుద్ధిని నాభీ కేంద్రంమీద కేంద్రీకరించాలి. పైనుంచి వచ్చిన శక్తిని దోషమున్న చోటుకి ప్రసరింప చేయాలి. అప్పుడా శక్తి గడ్డ కట్టిన రక్తాన్ని కరిగించి వ్యాధిని నయం చేస్తుంది".

డా॥ ఒఖావా, డా॥ కొబాయషీలు ఈ పద్ధతితో వ్యాధు లను నయం చేయడమే కాకుండా అసలు వ్యాధులు రాకుండా కూడా చేసేవారు!

డా॥ అయ్యంగారు, ప్రొ. గోకాక్ వారితో జరిపిన సంభాషణను క్రింద పొందుపరుస్తున్నాము.

[1]

శ్రీమాత గూర్చి మీకేమి తెలుసో చెప్పండి అని మేము ఒఖావాను అడిగాము.

అతని అంధనేత్రాలనుండి ఒక వెలుగు ప్రసరించింది. అతను ఇలా అన్నాడు. శ్రీమాత గూర్చి, ఆసియా తొలి ప్రభాత శుభ దినాలలో మేము అనుభవించిన మహత్తర జీవితం గూర్చి చెప్తా.

భారతీయ తత్వదర్శన సారాన్ని నేను యవ్వనదశలో ఉండగానే నాలో జీర్ణించుకొన్నాను. నవ ఆసియా గూర్చి కలలు కన్నాను. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు నేను శ్రీఅరవిందుల గూర్చి చదివాను. ఆయన చిరునామాకోసం విఫలప్రయత్నం చేశాను. హరప్రసాద్ జపాన్ వచ్చి భారతీయ తత్వశాస్త్రంపై ప్రసంగించారు. ఆ సభకు 50 మంది స్త్రీపురుషులు హాజరయ్యారు. వారిలో ఒక యువతి నాలో ప్రగాఢ ఆలోచనలను రేకెత్తించింది. కారుణ్యం అనండి, ధ్రువనక్షత్రపు కాంతిరేఖ అనండి – ఆమె లోని ఏదో ఒక అజ్ఞాతశక్తి నన్ను ఆమె వైపుకు లాక్కొని వెళ్ళింది. స్వర్గం నుండి ప్రసరించే ఒక సౌరభం ఆమెనుండి ప్రసరించేది. మరపురాని దివ్యస్మృతి పరిమళాల తీయదనం అది. ప్రపంచం కలలు కన్న మహనీయ మహోదయ కాంతిరేఖలు ఆమె కళ్ళల్లో తాండవించడం చూశాను. ఒక సోదరునిగా, ఒక స్నేహితునిగా నేను ఆమెను కలుసుకున్నాను.

ఆమె, ఆమె మిత్రులు నవ ఆసియా గూర్చి, నవప్రపంచం గూర్చి కలలు కన్నారు. బుద్ధుడు జీవించిన వేదభూమిలో అటువంటి కలలు కని దివ్యదర్శన తేజోనివహం చూసిన మహనీయునితో వారు సజీవసంబంధం, సజీవస్పర్శ కలిగి యుండేవారు. ఆయన ఇంకెవరో కాదు – శ్రీఅరవిందులే. ఆ మహాద్రష్ట అనుచరులతో కలిసి పనిచేసిన అదృష్టం నాది. అది విధికృతం!

వారి అలౌకిక కాంతిపుంజాల ఇంద్రజాల వలయంలోనికి నేను ఆకర్షితుడయ్యాను. నాకు తెలియకుండానే స్వర్గం అంచున జీవించాను.

మేము ఒక ఏడాదిపాటు కలిసి జీవించాము. ప్రతి రాత్రి ఒక గంటసేపు మేము ధ్యానంలో గడిపాము. నేను 'Zen' పద్ధతి ననుసరించాను. వారు యోగపథంలో వెళ్ళారు. కాని ఈ రెండూ ఒకే శిఖరానికి చేరాయి.

శ్రీమాత సంకల్పం అజేయం. పర్వతాలనే కదిల్చివేస్తుంది. ఒక ఖడ్గం ఎంత పదునైనదో అంత సునిశితం. ఆమె ప్రజ్ఞాప్రాభవమూ, మార్మిక భావ సంచయమూ సముద్రంకన్నా లోతైనవి. ఆమె మేధాశక్తి ఎంతటి లోతులకైనా వెళ్ళి అన్వేషణ సాగించేది. ఆమె అద్భుత కళాకారిణి. అలౌకిక రామణీయకత ఉట్టిపడే చిత్రాలు వేసేది. ఆమె సంగీత విద్వాంసురాలు. గిటార్‌పై ఆమె వినిపించే సంగీతం నా ఆత్మను పరవశింపచేసేది. ఆమె ఒక సైంటిస్ట్. ఒక నవ స్వర్గాన్ని. ఒక నవ భువనాన్ని, ఒక నవ నక్షత్రమండలాన్ని నిర్మించగల దిట్ట. ఆమె నా ఆత్మ సహోదరి, నా ఆత్మ స్నేహితురాలు. ఆమె గూర్చి నాకు తెలిసింది ఇదే.

మీకు ఆమె దివ్యజనని అని తెలుసు. దివ్యజనని నాకు స్నేహితురాలని, సోదరి అని నాకు తెలుసు. పాశ్చాత్యదుస్తులలో ఆమె చాలా అందంగా వుండేది.

ఆ అగ్నిగుండంలో జీవించిన నేను ఆ అగ్నిజ్వాలల పరిమాణం, ఆ రోచర్నివహం కొలతలు ఎలా చెప్పగలను?

[2]

మేడమ్ ఒఖావాను అడిగాము:

శ్రీమాత గూర్చి మీకేమి తెలుసో చెప్పండి.

ఆమె ఇలా సమాధానం చెప్పారు:

ఆమె నాకు బాగా తెలుసు. ఆమె ఒక దివ్య ఆత్మస్వరూపం. ఆమె ఫ్రాన్స్ నుండి వచ్చారు. కాని ఆమె నాలాగే జపాన్‌లో పుట్టిన స్త్రీమూర్తి అని నా భావన. ఆమె కొద్దిరోజులే వున్నారు. కాని ఆమెతో జీవించడం నాకెంతో ఆనందం కల్గించింది. ఆమె వెళ్ళిపోగానే నా కన్నులలో హిమరేఖలు ఆవరించాయి.

తల్లిప్రేమ నాకు తెలియదు. కాని సోదరిగా వుండడంలో ఎంత మాధుర్యము వుందో నాకు బాగా తెలుసు.

మీరా ఇక్కడ వుండగా, ఆమెకు మరిన్నిసార్లు భోజనం పంపి వుంటే బాగుండేది. అలా చేసివుంటే నాకింకా ఆనందం కలిగేది. ఆమెను నేను సోదరిగానే ప్రేమించాను. భారతదేశం నుండి ఎవరో ఒకసారి వచ్చారు. మీరాకు కాన్కగా ఇవ్వమని ఒక దీపాన్ని ఆయనకు ఇచ్చాను. అది ఆమెకు ముట్టిందో లేదో నాకు తెలియదు. మీ ద్వారా ఆమెకు ఒక కానుక ఇవ్వాలనుకుంటున్నాను. కాని నాకెలా తెలుస్తుంది? అది ఆమెకు చేరుతుందని నమ్మకమేమిటి? ఆమెను మళ్ళీ కలుసుకున్నప్పుడు నేనే ఆమెకు కానుక ఇవ్వాలనుకుంటున్నాను.

మేడమ్ కోబాయషీని కలుసుకొని ఇలా ప్రశ్నించాము:

శ్రీమాత గూర్చి మీకు తెలిసింది చెప్పండి.

ఆమె ఇలా చెప్పసాగింది:

శ్రీమాత ఎంతో తెలివైనది. కళాకారిణి. మధుర హృదయిని. ఆమె నా చిత్రం గీసింది. దానిని ఇంతవరకు దాచి వుంచాను. బుద్ధుని ప్రాచీన భారతభూమికి చెందిన ఒక గురువును ఆమె ఆరాధించేది. ఆయన వాణి రేపటి ప్రవచనం కాగలదని, అది మరో ఉషోదయ వేదగానం కాగలదని ఆమె విశ్వసించేది. ఆయన్ని గూర్చి మాట్లాడుతుంటే ఆమె కన్నులు కొత్త ఆనందంతో, కొంగ్రొత్త కాంతితో మెరిసేవి. నా గురువు ఒఖాటా ధ్యానము యొక్క ఇంద్రజాలాన్ని గురించి నాకు నేర్పేడు. వైద్యుడైన నా భర్త కూడ ఆపరేషన్లు చేయడం మానేశాడు. దాని బదులు నాభికేంద్రం మీద ధ్యానమును కేంద్రీకరించి ఆరోగ్యమును పొందవచ్చని సలహా ఇచ్చాడు.

మీ మదర్ నన్ను కూడ కూర్చోపెట్టుకొని కలసి ధ్యానం చేసేవారు. అంతరంగిక అగాధాలను శోధించేవారు. మా ఇద్దరికి కనపడిన దృశ్యములు, కలిగిన అనుభూతులు ఒకటేనని ఆమె నిరూపించారు.

నాకామె అంటే ఎంతో ఇష్టం. 'నర' అనే ఊళ్లో 'కసుగా' దేవాలయంలో విస్టేరియా పువ్వులను చూసేవా? వాటి పేరు 'హుజీ'. మదర్‌కి ఆ పూలంటే ఎంతో ఇష్టం. తనకి 'హూచికో' అనే జపాన్ పేరును పెట్టుకుందామనుకుంది. నా పేరు 'నొబూకో', 'నొబూ' అంటే నమ్మకం.

ప్రతి మనిషి కలలు కంటాడు. కాని ఏదో ప్రమాదం జరిగి ఆ కలలు విచ్ఛిన్నం అయిపోతాయి. అతని జీవితం ఎడారి బ్రతుకైపోతుంది. ఒకసారి నాకట్లాగే జరిగింది.

నా నేస్తం (మదర్) క్యోటో వదిలి వెళ్లిపోయింది. రెండేళ్ల తరువాత నా గురువు చనిపోయాడు. కొన్నేళ్ల తరువాత నా భర్త

కూడ మరణించాడు. మాకు పిల్లలు లేరు. నేను ఒంటిరిదాన్నై పోయాను.

మా తల్లితండ్రులు టోక్యోలో నన్ను వాళ్లతో ఉండమని చెప్పారు. Still-sitting group అనే ఒక ఉద్యమాన్ని నా గురువు, నా భర్త కలిసి నడిపేవారు. నన్ను క్యోటో వెళ్లి ఆ సంస్థను నడుపమని వాళ్లు పట్టు పట్టేరు.

క్యోటో నా స్వంత ఊరు. నా జీవితము, బాధ్యతలు, నా పని అన్ని అక్కడే వున్నాయి. వివిధ మార్గముల వారందరిని చేరతీసాను. వారు మా సమావేశాలకు వచ్చి Still-sitting నేర్చుకుండేవారు. మేము వారం వారం కలసుకుండేవారం. ఒక మాస పత్రికను నడిపించితిమి. వార్షికోత్సవములు జరుపుకున్నాము. మా ఉద్యమము దేశమంతటా వ్యాపించింది. ఈ విద్యను 5 వేల మంది నేర్చుకున్నారు కాని ప్రతి సంస్థకు ఏవో కష్టాలు వస్తయి కదా. మాకు కూడ అంతే అయింది. రెండో ప్రపంచయుద్ధం వచ్చింది. కేంద్రములు తగ్గిపోయాయి. పత్రిక మూతపడింది. మా నాన్న టోక్యో మీద బాంబులు పడి చనిపోయాడు. మా అమ్మను నా దగ్గరకు తెచ్చిపెట్టుకున్నాను. యుద్ధమంతమైపోయాక మళ్లీ పత్రికను మొదలుపెట్టాను. మా కేంద్రములు కూడ మళ్లీ వస్తున్నాయి. నా 37 ఏళ్లు శ్రమ వృథా కాలేదు. కొంతమంది స్నేహితులు నన్ను ఇంగ్లండ్ వెళ్లి అక్కడ మానసికంగా కృంగిపోయిన మనుషులను బాగుచేయలని సలహా ఇచ్చారు. ఈ విషయంలో జపాను కూడ అంతే. నేనిక్కడే, నా దేశంలోనే వుండి నా పనిని నిర్వహించాలి కదా!

కొంతమంది పెద్దమనుషులు ఈ Still-sitting – నాభి మీద కేంద్రీకరణవలన ప్రయోజనమేమిటని కొట్టిపారేశారు. కాని దీనిని ఇప్పుడు అమెరికన్లు గుర్తించారు. వారు కూడ Diaphragm పైకి, క్రిందకి కదలికని గురించి మాట్లాడుతున్నారు!

ఆమెను నేను ఎంతగానో ప్రేమించాను. ఒక బౌద్ధారామం వద్దగల పూలంటే ఆమెకు ఎంతో ఇష్టం. తరువాత నా జీవితమంతా దుఃఖమయమైపోయింది. ఆమె నన్ను విడిచి వెళ్ళింది.



Mme. Kobayashi and the Mother, in Japan, 1917



Mme. Kobayashi and the Mother, in Pondicherry, 1960

నేను అందర్నీ కోల్పోయి ఈ విశాల ప్రపంచంలో ఏకాకిగా మిగిలి పోయాను.

శ్రీమాతతోపాటు నేను నిశ్చలంగా కూర్చొని ధ్యానం చేసే దానిని. ప్రపంచయుద్ధం రావడంతో ఈ కేంద్రాల సంఖ్య బాగా తగ్గింది.

ఇండియా రావాలని, పుదుచ్చేరి వెళ్ళాలని నాకెంతో కాంక్షగా వుంది. నా స్నేహితురాలికి (శ్రీమాతకు) ఉత్తరం వ్రాయాలని అనుకొనేదానిని. ఆమె నా లేఖ చదువుతుందా? జవాబిస్తుందా? ఆమె దివ్యజననిగా మారిపోయింది గదా! నాకు తిరిగి వ్రాస్తుందో లేదో తెలియదు.

ఒకవేళ ఆమెను కలుసుకుంటే, నా చేతులు ఆమె చుట్టూ వేసి ఒక్కసారి ఆమెను పెనవేసుకోవాలని ఉంది. మీ ఆశ్రమం అధికారులు ఒప్పుకుంటారా? ఇప్పుడు ఆమె దివ్యజనని కదా!

మీకు ఆమె జనని. నాకు ఎంతో ప్రియమైన స్నేహితు రాలు. నా ఆత్మస్నేహమయిని ఈ వింతప్రపంచంలో కలుసు కోవడం నా అదృష్టం. ఒకే కొమ్మపై పూసిన రెండు గులాబీ పువ్వులం మేము. ఆనాటి తీయని పరిమళాలు నా మానస ఏకాంతరాలలో ఇప్పటికీ నిలిచివున్నాయి.

ఆంగ్లమూలం: వి.కె.గొకాక్

అనువాదం: యజ్ఞన్న

స్వప్నములో ఇతర లోకాలను దర్శించుట

ప్రశ్న: ఆ లోకాలను దర్శించటమెలా?

నువ్వు నీ శరీరాన్ని విడిచిపెట్టి బయటకు వెళ్లగలవా? అసలు బయటకు వెళ్ళటమెలాగో నీకు తెలుసా? అంటే కేవలం శాస్త్ర జ్ఞానం కాదు – ప్రత్యక్షంగా నీ శరీరంలోంచి నిష్క్రమించి పోగలవా? ఎప్పుడు కావాలంటె అప్పుడు పోగలవా? నీ భౌతిక కాయాన్ని వదిలేసి సూక్ష్మశరీరంలోకి ప్రవేశించటం, దాన్ని వదిలేసి ఇంకా సూక్ష్మశరీరంలోకి మళ్లీ మళ్లీ అదే విధంగా నువ్వు చెయ్యగలవా? ఎప్పుడైనా చేసేవా?

ప్రశ్న: కలలలో ఇట్లా జరుగుతుంది మదర్.

కలలలోనా – కలలలో నీవెక్కడుండేది నీకు తెలుసా?

కొంచెం తెలుసు మదర్.

కొంచెం తెలుసునా, మంచిది. కలలలో నీ వెక్కడికి వెడతావు?

ప్రశ్న: కొన్ని ప్రాంతాలకు

ఏ ప్రాంతాలు?

ప్రశ్న: ప్రాణిక లోకాలు.

ఓ! ఓ! ప్రాణికలోకంలోకి వెడతావా, సరే. అక్కడ నీకేమైనా అపాయం జరగదు కదా?

ప్రశ్న: తరచు జరుగుతుంది.

అవునా, మరి నువ్వు దాన్ని ఎట్లా తప్పించుకుంటావు?

వెంటనే శరీరంలోకి ప్రవేశిస్తాను.

ఆ లోకాలను గురించి నీకు అంతకంటె ఎక్కువ తెలియదన్న మాట.

కాదు. ఒక్కొక్కప్పుడు ఒక పిలుపు వస్తుంది. వెంటనే శరీరంలోకి ప్రవేశించనవసరం లేదు. కాని ఆ విరామం ఎక్కువసేపు ఉండదు.

ఎక్కువ సేపు ఉండదా, ఆ లోకాలలోకి నీ ఇచ్చవచ్చినట్లు వెళ్లి రాగలవా?

రాలేను.

అదివరకు పలుమారులు వెళ్లిన చోటికి మళ్లి వెళ్లగలవా?

వెళ్లలేను మదర్.

అదే చోటుకి మళ్లీ వెళ్లలేవూ?

నా ఇష్టమొచ్చినప్పుడు వెళ్లలేను.

కాని కొంతమంది పిల్లలు మళ్లీ మళ్లీ అదే ప్రదేశానికి వెళ్లి వాళ్ళ కలలను సీరియల్‌గా చూడగలరు. ప్రతి రాత్రి నిద్రలో ఒకే చోటికి వెళ్లి అదే కలను చూడగలరు.

నా చిన్నప్పుడు అలా చేసేవాడిని.

అయ్యో నువ్విప్పుడు చిన్నపిల్లవాడివి కాకపోవటం చాలా దుర దృష్టం!

నా కప్పుడు బరువు బాధ్యతలు లేవు.

అయితే మళ్లీ చిన్నపిల్లవాడివలె అయిపోయి అలా చెయ్యి.

ఆ అనుభూతి చాలా తమాషాగానే ఉంటుంది. రాత్రులు గడిపేందుకు మా మంచి పద్ధతిలే. ఒక కథ మొదలౌతుంది. తెల్ల వారుతుంది. మెలకువ వచ్చేస్తుంది. ఆ కథ అంతటితో ఆపేసి శరీరంలోకి ప్రవేశిస్తావు. మర్నాడు రాత్రి మళ్లీ అక్కడినుంచే ఆ

అనుభూతిని పొందుతావు. టైము అయిపోగానే అక్కడితోటి ఆపేసి కథని "ఎవ్వరు కదలకండి, నేను వచ్చేంతవరకు" అని చెప్పి మళ్లీ నువ్వు శరీరంలోకి ప్రవేశిస్తావు. ప్రతి రోజు ఇలాంటి అనుభూతిని పొందిన తరువాత కొన్నాళ్లకి నీకు జ్ఞాపకమున్నట్లయితే నువ్వు ఒక అద్భుతమైన కథను రాయగలవు.

అలా జరగాల్నంటే పగలంతా చాల ప్రశాంతంగా ఉండాలి.

అది కాదు. చిన్నపిల్లవాడిలా అమాయకంగా నిష్కల్మషంగా ఉండాలి.

మనస్సులో విమర్శనా బుద్ధి పనికిరాదు. నా చిన్నప్పుడు నేను అలాంటి కథలే చెప్పుకుంటూ ఉండేదాన్ని. మాటలతో కాదు – లోలోపల నిశ్శబ్దంగానే ఒక అందమైన చోటికి వెళ్లటం, అక్కడ ఒక కథను కంటికి కనపడ్డట్టుగా చూడటము జరిగేది. ఈ కథని చెప్పాల్సిన విధంగా కనుక నీవు చెప్పినట్లయితే అది ఎంతో అందంగా అద్భుతంగా ఉంటుంది. అంతేకాదు ఆ 'కథ' నీ జీవితంలో రూపాన్ని దాల్చి నిజంగా జరుగుతుంది. తు.చ తప్పకుండా కాకపోవచ్చు కాని నీకు అనుభూతమైన 'కథ' ప్రత్యక్షంగా రూపుకడుతుంది. అంతే కాదు. అది నీ జీవితాన్నే నిశ్చయిస్తుంది, నిర్వహించగలదు కూడా.

మూలం: శ్రీమాత

అనువాదం: ఆర్. లక్ష్మీప్రసాదమ్మ

సమాచార పత్రం

యువ కార్యక్రమముల నిర్వాహకులకై ఒక శిబిరము 13-17 ఫిబ్రవరి 2002 తేదీలలో నిర్వహించబడినది. నలభైమంది కార్యకర్తలకు శ్రీమాతారవిందుల పూర్ణయోగమును గురించి, ప్రత్యేకముగా యువతరము నుద్దేశించి శిక్షణ యివ్వబడినది.

Dr. M.V నడకర్ణిగారి 'సావిత్రి' అధ్యయన సత్ర 23-2-2002 నుండి 5-3-2002 వరకు నడపబడినది. వారి తదుపరి కార్యక్రమము తరువాత ప్రకటించబడును.

రాంచి (ఝార్‌ఖండ్) శాఖ వారు రాంచి పుస్తకప్రదర్శనలో పాల్గొని శ్రీమాతారవిందుల పుస్తకములను, ఆశ్రమసాహిత్యమును ప్రదర్శించిరి. నైవేలి (T.N) కేంద్రమువారు స్కూలు పిల్లలకై ఒక క్విజ్ కార్యక్రమమును నిర్వహించిరి. పూనె (మహారాష్ట్ర) కేంద్రము వారు 'సావిత్రి' మీద ఎ. జగదేకర్ గారిచే ప్రసంగములను నిర్వహించిరి. చెన్నై శాఖవారు శ్రీమనోజ్‌దాస్ గారిచే "A Preface to the Future" అనే విషయముపై 17 ఫిబ్రవరి 2002 నాడు ఒక ప్రసంగమును ఏర్పరచిరి. భోపాల్‌లో ప్రముఖ హిందీ రచయిత నీరజ్‌గారు శ్రీఅరవిందుల యోగముపై ఒక సుధీర్ఘమైన ఉపన్యాసమునిచ్చిరి. నైరోబి (కెన్యా) వారు శ్రీమాత 124 జయంతిని పురస్కరించుకొని రేడియోలో ఒక చక్కటి కార్యక్రమమును నిర్వహించిరి. శ్రీమాతను గురించిన విశేషములు, భక్తిగీతములు, సావిత్రి పఠనము అందలి అంశములు.

ఫిరంగిపురం (గుంటూరు జిల్లా), బుక్సర్ (W.B) లోను నూతన కేంద్రములు ప్రారంభించబడినవి.

మార్చి సంచికలో ఒక సవరణ:

కవరు పేజీమీద 2001 బదులు 2002 అని ఉండాలి.

ఆంధ్రప్రదేశ్ శ్రీఅరబిందో సొసైటీ స్టేట్ కమిటీ

(1-4-2002 to 31-3-2003)

1. శ్రీ. బి. వెంకట్రామయ్య (స్టేట్ కో ఆర్డినేషన్) ఛైర్మన్
2. శ్రీ. డి.వి.ఎన్. శర్మ (ఉత్తర కోస్తా; పిల్లల విభాగము) వైస్‌ఛైర్మన్
31. డా॥ ఎ.వి.ఎన్. రాజు (దక్షిణ కోస్తా; సాంస్కృతిక భాగము) వైస్‌ఛైర్మన్
4. శ్రీ. పి. ఎన్. శంకర రెడ్డి (రాయలసీమ; కాలుష్యనివారణ) వైస్‌ఛైర్మన్
5. శ్రీ. జె.సురేంద్రాచార్య (తెలంగాణ; ఆర్గనైజేషన్) వైస్‌ఛైర్మన్
6. శ్రీ. వి. సుబ్బారావు (ఫైనాన్స్ కో ఆర్డినేషన్) సెక్రటరి, ట్రషరర్
7. శ్రీ. గంట నారాయణ (లీగల్ సెల్) మెంబరు
8. శ్రీ. పి.సి. స్వరూప్ (యువత) మెంబరు
9. శ్రీ. ఎ. మల్లయ్య (కో ఆర్డినేషన్) మెంబరు
10. శ్రీ. జి. గోవర్ధన్ (కేంద్రములు, సభ్యత్వము) మెంబరు
11. శ్రీ.బి.వి రాజారావు (పాండిచ్చేరిలో కో ఆర్డినేషన్) మెంబరు
12. శ్రీమతి భారతీ దేవి (స్త్రీల విభాగము కన్వీనర్) మెంబరు
13. శ్రీ. ప్రదీప్ నరంగ్ (ఎక్స్ - అఫీషియో మెంబరు)

21 ఫిబ్రవరి, 2002-2003

(శ్రీమాత 125 వ జయంతి ఉత్సవములు)

సాధన గురించి శ్రీఅరవిందుల ప్రవచనాలు

శ్రీమాతకు సేవ, సమర్పణ అనే మిషతో నీ అహంకారపు కోరికలను, ప్రాణికపు అవసరాలను తీర్చుకుండేవు జాగ్రత్త! శ్రీమాత (Divine Shakti) కోసం నీవు చేసే ఆకాంక్ష, తపన నిర్మలంగా ఉండాలిగాని కోరికలతో అపవిత్రం కాగూడదు. ఒక వేళ నీ వలా చేసావో నువ్వు దివ్యానుగ్రహమును పిలవటం, రూపాంతరీకరించమని వేడుకోటం కేవలం బూటకం, దండగే కదా!

9/6/02

సృష్టి – సృష్టికర్త (I)

శ్రీమాత ప్రవచనములు

అఖిల

అఖిల భారత పత్రిక

జూన్ 2002

సృష్టి – సృష్టికర్త (I)

శ్రీమాత ప్రవచనములు

సృష్టి – సృష్టికర్త

స్వయంసృష్టి అంటే ఏమిటి? ఆయన తనను తానే సృష్టించుకుంటాడనమాట.

ఇక్కడ సృష్టి అనగా ఆవిర్భవించుట, కనబడునట్లు చేయుట – ఆయన తనను తానే ఆవిర్భవింపచేసుకుంటాడు. అమూర్తము నుండి మూర్తము జేసుకుంటాడు.

అయితే మామూలుగా 'సృష్టించుట' అనగా ఒక పదార్థంతో వేరే వస్తువును తయారుచేయుట – మట్టితో కుండను తయారుచేయటం లాంటిది. కాని సృష్టి విషయంలో అది నిజం కాదు. అందుకనే శ్రీఅరవిందులు 'స్వయంసృష్టి' తనకు తానే ఒక ఆకారాన్ని ఇచ్చుకొనుట – అన్నారు. అది ఒక వస్తువు యొక్క స్థాయిలో మార్పు మాత్రమే. అనభివ్యక్తంగా ఉన్నది వ్యక్తమౌతుంది. అది దృష్టికోణాన్నిబట్టి ఉంటుంది. ఒకే వస్తువు ఇటునుంచి చూస్తే కనపడదు. అటునుంచి చూస్తే కనపడుతుంది – అంతే. మళ్లీ ఇటు తిప్పుతే కనపడదు. మరోసారి తిప్పితే కనపడుతుంది. **That's all. As simple as that!**

అంతరంగికమైన వస్తువు బహిర్గతము కాగా ఈ ప్రపంచం ఏర్పడింది. నిద్రపోతున్న మనిషి మేల్కొంటాడు. నిశ్చలంగా ఉన్న మనిషి కదలటం మొదలుపెడతాడు. నిశ్శబ్దంగా ఉన్న మనిషి మాట్లాడుతాడు.

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

Creation leaped straight from the hands of God;
Marvel and rapture wandered in the ways.
Only to be was a supreme delight,
Life was a happy laughter of the soul
And Joy was king with Love for minister.

Sri Aurobindo (*Savitri*, p.124)

ఈ సృష్టి ఎందుకు జరిగింది, ఎలా జరిగింది?

సృష్టిరహస్యాలు తర్కముకంటె తపస్సుకే బాగా లొంగుతాయి. దేవుడు మొదట చైతన్యము, వెలుగు, జీవితము, ఆనందము అనే నలుగురు దేవతలను పంపించాడు. కాని ఎక్కడో ఒక పొరపాటు జరిగింది. సామంతరాజులు స్వతంత్రులైనట్లు ఈ నలుగురు దేవతలు తమ ధర్మాలను విస్మరించి క్షుద్రరూపాలను దాల్చినయి. మూలవిరాట్టులు దిగారుగాని ప్రాణప్రతిష్ఠ జరగలేదు. అప్పుడు దేవుడు మరొకసారి దిగివచ్చాడు. తనను తాను నిక్షేపించుకున్నాడు. అచేతన చేతనగా మారింది. సృష్టి వేగం పుంజుకుంది. పరిణామ ప్రక్రియ మొదలైంది.

— సంపాదకుడు

సృష్టిని గురించిన జ్ఞానము హేతువాదనకంటె అంతరంగిక విచారణకే బాగా తెలుస్తుంది. తాత్త్వికులు వ్రాసిన పుస్తకాలను చదివితే వారి సిద్ధాంతమేమిటో అర్థమౌతుంది. నిజానికి ఇది మానవ మేధ కతీతమైన విషయము. నీ తార్కికబుద్ధిని పక్కకు పెట్టి అంతరంగిక నేత్రంతోనే దీన్ని గ్రహించాలి. ఈ విషయము పెద్దవాళ్ల కంటె చిన్నపిల్లల అమాయకమనస్సుకే బాగా అర్థమౌతుంది. నువ్వు కూడ చిన్నపిల్లవాడల్లె అయిపోయి దీనిని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించు.

బాహ్యసృష్టిని అర్థం చేసుకోవాలంటే నువ్వు నీ అంతరంగంలోకి ప్రవేశించి శోధించాలి. యోగీశ్వరులు ఈ విధంగా తరచి చూసి సృష్టిరహస్యాలను గురించి కథలుగా చెప్పేరు. అటువంటి కథే ఒకటి నేను మీకిప్పుడు చెప్పబోతున్నాను. Don't take it as a gospel! Take it as a story.

దేవునికి తనను తను చూసుకోబుద్ధి అయింది. అమూర్తమైన లక్షణాలకు మూర్తిమత్వమివ్వాలి. తనలోనుంచి ఒక శక్తిని — చిచ్ఛక్తిని — బహిర్గతము చేసాడు. సృష్టిని జరపమని ఆదేశ

మిచ్చాడు. స్వేచ్ఛానందములు ఈ సృష్టియొక్క లక్షణములు[1]. చేతనాజ్యోతులు, జీవితము, ఆనందప్రేమలు, సత్యము అనే నలుగురు దేవతలు ఆవిర్భావమైనారు. మరి స్వేచ్ఛ ఈ సృష్టియొక్క లక్షణంగదా — అందుకని ఆ దేవతలకు ఓ దుర్బుద్ధి పుట్టింది. స్వతంత్రించి అట్టడుగు ప్రదేశాలకు చేరి క్షుద్రరూపాలను దాల్చినాయి. చేతన అచేతనమై కూర్చుంది. వెలుతురు చీకటిగాను, ప్రేమ ద్వేషంగాను, సుఖము దుఃఖంగాను, ప్రాణం మృత్యువుగాను, సత్యము అసత్యంగాను మారిపోయినాయి. ఓ క్షుద్రమైన, అతిఘోరమైన సృష్టి మొదలైంది.

దాని ఫలితమే ఈ వింత సృష్టి. ఈ వెలవెలబోతున్న జడపదార్థం తయారైకూర్చుంది. చిచ్ఛక్తి ధిగ్భ్రాంతి చెంది "రక్షించు మహాప్రభో" అని దేవుణ్ణి వేడుకొంది. వెంటనే రక్షణ కార్యక్రమాలు మొదలైనాయి. అపస్మారకమైన జడపదార్థాన్ని మూర్ఛనుంచి లేపాలి. చిచ్ఛక్తి జడపదార్థంలోకి దిగివచ్చి తనను తాను నిక్షేపించుకొంది. అచేతనలోనుంచి చేతనలోకి, దుఃఖంలోనుంచి ప్రేమలోకి, అసత్యంలోంచి సత్యంలోకి తిరుగుప్రయాణం మొదలైంది.

ఈ విధంగా సర్వజ్ఞుడైన భగవంతుడు అంచెలంచెలుగా దిగివచ్చి పదార్థంలో అంతర్లయమైనాడు. ఈ అంతర్లయము (Involution) యొక్క ఫలితమే మన మిప్పుడు చూస్తున్న జడపదార్థము, దానిలోనుంచి వికసించబోయే అతిమానసము, జరగబోయే అతిమానససృష్టి. అయితే ఇదే సృష్టియొక్క చరమదశ అని చెప్పేందుకు వీలులేదు. దేవుని ప్రజ్ఞ అనంతము. తప్పకుండా దీని తరువాత ఇంకా అద్భుతమైన సృష్టి జరుగుతుంది.

స్వేచ్ఛానువాదం: డా॥ టి. ప్రసన్న కృష్ణ, డా॥ ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి

[1] " The sword has a joy in the battle-play, the arrow has a mirth in its hiss and its leaping, the earth has a rapture in its dizzy whirl through space, the sun has the royal ecstasy of its blazing splendours and its eternal motion. O thou self-conscious instrument, take thou too the delight of thy own appointed workings."

Sri Aurobindo, SABCL Vol. 16, p. 288



EVOLUTION

దివ్యప్రేమ దిగివచ్చుట

స్త్రీపురుషులమధ్య ఉండే ఆకర్షణ పేరు ప్రేమ. దైవము తన సృష్టిమీదకు ప్రసరించే భావము పేరు కూడ ప్రేమయే. ఒక్క పేరులో తప్ప ఈ రెండింటికీ మరేవిధమైన సామ్యము లేదు. మానవప్రేమ అందరికి సుపరిచతము. తెలియనిదల్లా దైవ ప్రేమయే. అది చాల మహత్తరమైనది. యథారూపంలో మాన వులు దానిని భరించలేరు. సాధనచేసి, దోషములను పరిహారిం చుకొని, అల్పకత్వాన్ని దాటి కొంచెమైనా శుచిర్భూతుడైనప్పుడే పవిత్రమైన దివ్యప్రేమను రేఖామాత్రంగానైనా గ్రహించగలరు.

— సంపాదకుడు

పదార్థపు పుట్టు పూర్వోత్తరాలు

ఈ సృష్టి ఎలా జరిగింది? భగవంతుడనగా శుద్ధచైతన్యము – కంటికి కనపడునది కాదు. తనను తాను చూచుకొనుటకై తననుండి తాను వేరై ఒక ప్రతిరూపాన్ని ధరించాడు. మెట్లు మెట్లుగా కుంచించుకున్నాడు. కాని ఈ కుంచింపు చాలా దూరం సాగిపోయి పూర్తిగా అచేతనమై కూర్చుంది. పరిణామం చెంది తిరిగి చైతన్యం పొందే అవకాశమే లేదు. ఈ పరిస్థితిని చూసి దైవము మరొకసారి తన శక్తిని పంపించి సృష్టిలో నిక్షేపించాడు. దాని పేరే దైవప్రేమ. దివ్యప్రేమంటే ఏమిటో తెలుసుకున్నప్పుడు నీవు అనిర్వచనీయమైన మధురానుభూతిని పొందగలవు. అది మామూలు ప్రేమ కాదు. ఈ ప్రపంచంలోని దుఃఖాన్ని రూపుమాపే శక్తి దానికున్నది.

దివ్యప్రేమను మానవుడు భరించలేడు

ఈ చరాచర వస్తుజాలమంతటిని ఆవహించి ఉన్న మహాశక్తే దివ్య ప్రేమ. ప్రతివస్తువును పోషించి, ప్రేరేపించి దైవంవైపు పురోగమింపజేయునది ఆ దివ్యప్రేమయే. తమాషా ఏమిటంటే ఇంతటి మహత్తరమైన ఈ దివ్యప్రేమను గురించి మానవులకు తెలియదు! అది వారి ఊహాకందని విష

యము. అది మానవప్రేమ కాదు. కానే కాదు. మానవమాత్రులు దానిని గుర్తించనైనా గుర్తించలేరు. అది చాల పవిత్రమైనది, పరిశుద్ధమైన వస్తువు. ఆ పరమప్రేమను, దాని తీక్షణతను వారు భరించలేరు, దాని శక్తికి తట్టుకోలేరు. అది పలుచనై వికారముచెంది పరమాధమస్థాయికి దిగజారిపోయినప్పుడుగాని ఇంద్రియజ్ఞానమున కందదు. దాని అసలు స్వరూపాన్ని కోల్పోయి కల్మషమైనప్పుడుగాని మానవుడు దాని ముందర నిలబడలేదు. అపుడిక దానికి పెద్ద పీట వేస్తాడు. జోహార్లర్పిస్తాడు. కాని దాని అసలు స్వరూపాన్ని గుర్తించి, దాని వైభవాన్ని సాక్షాత్కరించుకోవాల్నంటే మానవచైతన్యము దివ్యచైతన్యంగా పరిణమించాలి.

*

ప్రశ్న: ప్రేమ సర్వవ్యాపకమైనదని, మొక్కల్లోను గండశిలల్లోను కూడ అది పెంపెసలారుతూ ఉంటుందని తమరు సెలవిచ్చారు. మరి రాళ్లల్లో ఉన్న ప్రేమ మనకు కనపడుతుందా?

అచేతన రాయికంటె ఘోరమైన స్థితి

బహుశః రాయిలోని ధాతువులన్నిటిని సమీకరించునది ప్రేమయేనేమో. ఈ సందర్భంలో నీకో విషయం చెప్పాలి. జడపదార్థంలోకి దివ్యప్రేమ దిగిరావడం వల్లనే దానికి ఒక ఆకారమేర్పడింది. అంతకు పూర్వము అది అచేతనంగా ఉండేది. దానికి ఆకారము లేదు. భౌతికపదార్థంలోకి దివ్యప్రేమ దిగివచ్చి దానిని చైతన్యవంతము చేసినప్పుడే అమూర్తంగా ఉన్నదానికి మూర్తిమత్వము వచ్చింది. నువ్వు అచేతనాభూమికలోకి ప్రవేశించగలిగినట్లయితే (ఇది కొంచెం కష్టమే) అదెంత ఘోరమైనదో నీకు తెలుస్తుంది. రాయిలోని చైతన్యం అంతకంటె వెయ్యిరెట్లు మెరుగు. రాయికంటె నీకు ఎక్కువ తెలివున్నదని విర్రవీగిపోతావేమో. అదే కొలతబద్దతోటి కొలిచినట్లయితే పూర్తి అచేతనకంటే గండశిల వెయ్యిరెట్లు చైతన్యవంతమైనది. కాబట్టి ఒక గులకరాయిని చూసి "ఓస్ ఇంతేనా" అని నువ్వు అనుకోనక్కర్లేదు.

ఈ దివ్యప్రేమ లేనిదే పదార్థానికి మూర్తిమత్వముండదు. పరమాణువులను పోగుచేసి రాయిగాని, ఇనుముగాని చేసేందుకు వీల్లేదు.

మొక్కలలో చైతన్యము

మనుమలు ఆలోచించినప్పుడు మాత్రమే వారికి చైతన్యమున్నదని గుర్తిస్తారు. ఆలోచనలు లేనప్పుడు చైతన్యం లేదన్న మాట. కాని ఇది నిజం కాదు. మొక్కలకు ఆలోచనలుండవు. అయినప్పటికి వాటికి చైతన్యమున్నది. వాటికిగల ఇంద్రియగ్రహణశక్తే దీనికి తార్కాణము. జంతువులకుకూడ ఆలోచనలు ప్రాథమికదశలో ఉంటాయి. మొక్కలకి జంతువులకి కూడ తెలివి (consciousness) ఉన్నది. మనసుతో ఆలోచించవలసిన పని లేదు.

ప్రశ్న: దివ్యప్రేమ రాకముందర భౌతికపదార్థమున్నదా?

అచేతననగా అభావము

భౌతికపదార్థము లేదనే చెప్పాలి. అది అచేతనము – ఒట్టి అభావము. అది నిజంగా అచేతనమే – ఏమాత్రము జ్ఞానంలేని అయోమయస్థితి. మాటలలో వర్ణింపనలవికాని స్థితి. దానిని గురించి తెలుసుకోవాల్నంటే దానిలోకి దిగి చూడాల్సిందే. అది చైతన్యపు ఛాయకూడ లేని మోడు.

ప్రశ్న: దివ్యప్రేమ దిగి రాకపూర్వము ఎవ్వరైనా ఉండేవారా? వారికి తెలివి (జ్ఞానము) ఉండేదా?

భూలోకవాసులైతే లేరు. అచేతనాభూమికలోకి ప్రేమ దిగి వచ్చినప్పుడే భూమి పుట్టింది. జడపదార్థంనుండి దివ్యచైతన్యం వరకుగల భూమికలన్ని అచేతనము ఉద్భవించినతరువాత వచ్చినవే. నేను చెప్పేదంతా ఒక దేశపు చరిత్ర వంటిదనుకుంటున్నావేమో జాగ్రత్త! దేవుడు ప్రపంచాన్ని సృష్టించాలనుకున్నాడు. తనలోనుంచి ఒక అంశ బహిర్గతమై అచేతన (inconscient) పుట్టింది. అనగా ప్రపంచానికి ముందరే ఈ అచేతన పుట్టింది. కాని అప్పుడు ఈ సృష్టి ఎందుకు పనికిరాకుండా పోతోందని

తెలిసిపోయింది. వెంటనే దివ్యప్రేమ (divine love) అచేతనలోకి ప్రవేశించి దానిని రక్షించాల్సి వచ్చింది. అచేతనకి చైతన్యము వచ్చింది. ఇప్పుడు మనకు తెలిసింది ఏమిటి? పరాచైతన్యము అచేతనలోకి దిగి దానిని వెలిగించినప్పుడే లోకాలన్నీ పుట్టినయి. అంతకు పూర్వము సూర్యచంద్రాదులు ఏవీ లేవు (నన్ను క్షమించాలి. ఈ విషయాన్ని మానవమేధకు అర్థమయ్యేట్టుగా చెప్పటం చాలా కష్టం)

భూలోకపు ప్రాముఖ్యత

ఈ విశాల విశ్వమును మెరుగుపరచి పరివర్తింపజేయాలంటే శక్తినంతా కేంద్రీకరించి పనిచేసేందుకు ఒక చిన్న క్షేత్రము కావాలి. ఈ ఉద్దేశంతోటే భూమి సృష్టించబడింది. ఇక్కడ పండించిన ఫలితాలన్నీ విశ్వమంతా ప్రతిబింబిస్తాయి.

నక్షత్రలోకాలతో పోలిస్తే ఈ భూలోకం సూక్ష్మాతిసూక్షమైనది. కాని ఆధ్యాత్మికదృష్టికి అతిప్రధానమైనది. దైవము విశ్వములో తను నిర్వహించవలసిన కార్యంకోసం ఈ భూమినే తన కేంద్రంగా పెట్టుకున్నాడు. *భూలోకంలోనే తన నివాసమేర్పరచుకున్నాడు. ప్రతివస్తువులోను తనను తాను నిక్షేపించుకున్నాడు.*

ఈ కోటానుకోట్ల గోళాలన్నిటిలోకి ఈ భూలోకమే అతి విశిష్టమైనది. ఇతరలోకాలలో తను ప్రత్యక్షంగా లేడు. కుంచించుకున్నాడు. కాని భూలోకంలో అటుల కాదు. ఈ అచేతనలోకి ఆయనే తిన్నగా దిగివచ్చి నిక్షేపించుకున్నాడు.

ప్రశ్న: సూర్యుడి నుంచి విచ్ఛిన్నమైన గ్రహాలలోని పదార్థము ఈ భూలోకంలోని పదార్థము ఒకటేనా?

ఈ భూమియొక్క స్వరూపాన్ని గురించి మీకు అదివరకే చెప్పాను. సృష్టికంతటికి ఇది ఒక ప్రతినిధి, ఒక సంకేతం. ఇక్కడ జరిగే మార్పులన్నీ అన్ని లోకాలలోను ప్రతిబింబిస్తాయి.

*

దివ్యప్రేమ భూలోకంలో నిక్షిప్తము

నా స్మృతిపథంలో ఈ మెరుపు మెరుస్తోంది. – భగవంతుడు ఈ

భూమ్మీద నిక్షేపించిన దివ్యప్రేమ – సృష్టిని మళ్లీ తనవద్దకు చేర్చుటకు భూలోకంలో తను నిక్షేపించిన అంశ. ఆయన ఒక గొప్ప త్యాగమూర్తి. ఎవరైనా శత్రువుల మధ్యకు వెడతారా? కాని ఆయన చేసిన పనే అది. తనకు పూర్తిగా వ్యతిరేకమైన పదార్థంలోకి దిగివచ్చేడు. తన సింహాసనాన్ని వదిలి పృథ్విని తిరిగి దివ్యము చేయుటకై ఈ భూమి యొక్క అజ్ఞానాన్ని వహించాడు. ప్రస్తుతము మరుగునపడివున్న దివ్యప్రేమ తిరిగి బహిరంగమై యథేచ్ఛగా ప్రవర్తించినప్పుడే అది సాధ్యమవుతుంది.

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

దేవతల జన్మ వృత్తాంతము

ప్రశ్న: దేవతలు ఎలా జన్మించారు?

దేవతల ఆగమనము ఈ సృష్టిలోని తొలిఘట్టము. మన శాస్త్రాలలో అదితి అనే దేవతను గురించి ఉన్నది. ఆమెయే సృజన చైతన్యము. ఆమె సృష్టిని ఎలా నిర్వహించింది అనేది ఊహాకందని విషయము. దీని బాహ్యస్వరూపాన్ని మనమొక కథ రూపంలో చెప్పుకోవలసిందే.

సృష్టిని చేయుటకు ఆదేశమివ్వబడింది. అప్పుడామె (అదితి) తనలోనుంచి నాలుగు అంశలను బహిర్గతము చేసి కార్యార్థమై పంపించింది. కాని వాళ్లు సృష్టిని అనుకున్న విధంగా చేయలేదు. అభాసు చేసేరు. సృష్టి ప్రయత్నం విఫలమైంది. అందుకని ఈ సారి సమర్థవంతమైన దేవతలను తయారు చేయాల్సివచ్చింది. వారినే శ్రీఅరవిందులు అధిమానస (Overmind) దేవతలన్నారు. వారే ఈ సృష్టికి అధిష్ఠాన దేవతలు.

ఈసారి సృష్టి ఒక వ్యూహము ప్రకారము చేయబడినది. మెట్లు మెట్లుగా కుంచించబడి జడపదార్థము తయారైంది. ఇది ఒక యజ్ఞం లాంటిది అనుకోండి. భూలోకమే ఆ యజ్ఞానికి

కేంద్రము. యజ్ఞవాటిక. ఈ విశాలాకాశంలో భూలోకం ఒక నలుసే కావచ్చు. కాని విశ్వానికంతా ఒక ప్రతీక. ఒక యజ్ఞము యొక్క ఫలము దేశమునంతా ఎలా సుభిక్షము చేస్తుందో అలాగే భూలోకంలో జరిగిన ప్రయోజనము విశ్వమందెల్లడల ప్రతిఫలి స్తుంది.

నేను మీకు ముందరే చెప్పినట్లు మీ కర్థమయ్యేందుకని ఇలా చెప్పేను కాని తు.చ తప్పకుండ అంతా సరిగ్గా ఇలాగే జరి గిందని అనుకోకండి.[3]

*

ప్రశ్న: మన పురాణాలలో చెప్పిన దేవతలు, గ్రీసు, ఈజిప్టు దేశాల దేవతలు నిజంగా ఉన్నారా?

మన సాంప్రదాయానికి వాళ్ల దేవతలకి చాలా పోలికలు న్నాయి. పశ్చిమదేశీయులు గ్రీకు దేవతలను, పాగన్ (pagan) దేవతలను కేవలం మానవ కల్పితాలేనని ఆక్షేపిస్తారు. కాని ఇది చాలా పొరపాటు. ఈ దేవతలు నిజంగానే ఉన్నారు. సజీవంగా క్రియాశీలంగా వారి వారి లోకాలలో వారి వారి విధులను చక్కగా నిర్వర్తిస్తూ ఉన్నారు. మానవులు ఉన్నా లేకపోయినా వాళ్లు మట్టుకు ఉంటారు. వాళ్లు మానవులకంటె పూర్వకాలం నుంచి ఉంటున్నారు. వాళ్లను గురించి తెలుసుకున్నట్లయితే మీకు నక్షత్ర గమనాలు, భూలోకచరిత్ర మొదలైనవన్నీ చక్కగా అర్థమౌతాయి.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

---

3 వివరాలకు CWM Vol. 5, pp. 372-375 చూడండి

దివ్యజనని – సృష్టికర్త్రిణి

ప్రశ్న: మధుమయీ, ఈ విశ్వాన్ని ఆ దివ్యజనని సృష్టించింద న్నావు కదా, మరి భారతదేశంలో సాధారణంగా బ్రహ్మని సృష్టి కర్త అంటారు కదా.

శ్రీమాత: శ్రీఅరవిందులు ఆ జగన్మాతనే బ్రహ్మకి జనని అన్నారు. ఆవిడే సకల దేవతలకీ తల్లి.

*

ప్రశ్న: జగజ్జననే దివ్యశక్తి, అంటే సృజనశక్తి. ఆవిడే ఈ అనంత విశ్వం. మరి దీనికి అతీతంగా ఉండటమెలా సాధ్యము?

శ్రీమాత: తనను తనే సృష్టించుకోలేదు కనుక ఆమె ఈ సృష్టికి ముందే ఉందేమో! ఆమె తప్పక ఈ సృష్టికి ముందే ఉండి ఉండాలి. ఆవిడే సృజని అయితే, ఈ సృష్టికి ముందే ఉండి ఉండాలి. లేకపోతే, సృష్టించకలిగేది కాదు.

ప్రశ్న: అంటే, సృష్టికి ముందు, జగన్మాత దివ్యపురుషునిలో ఉండేదా?

శ్రీమాత: రూపాతీత స్థాయిలో మాట్లాడేటప్పుడు 'లోపల' 'బయట' అనలేము. కావాలంటే, కొంత బాగా అర్థమవుతుందనుకుంటే, ఆమెని దివ్యచైతన్యం అనుకో, పురుషని క్రియాశక్తి అను, ఆయనయొక్క ఒక స్థాయి, ఒక దశ అనుకో. నీకు ఆ స్థితి గురించి ఎలా అనుకుంటే బాగా అవగాహన కలిగితే, అలా అనుకో.

*

ప్రశ్న: భగవంతుడు నిన్ను ఈ ప్రపంచాన్ని సృష్టించమన్న ప్పుడు, ఏం చెయ్యాలో నీకెలా తెలిసింది?

శ్రీమాత: నాకు కొత్తగా తెలుసుకోవలసింది ఏమీ లేదు.... ఎందు కంటే ఈ సకల జగత్తు, దానిని గూర్చిన సకలమూ, దానిని

సృష్టించే శక్తీ – ఆయనలోనే అంతా ఇమిడి ఉంది. ఈ జగత్తు ఉండాలని ఆయన నిర్ణయించగానే, ప్రప్రథమంగా దాన్ని గురించిన జ్ఞానమూ, సృష్టించే శక్తీ ఇచ్చాడు. అదే నేను. తరువాత నన్ను ఈ ప్రపంచాన్ని సృష్టించమని శాసించాడు.

*

నాకు నేనెవరో కచ్చితంగా తెలుసు. శ్రీఅరవిందులకి కూడా తెలుసు. ఆయన దాన్ని అందరికీ వ్యక్తం చేశారు కూడా. దీన్ని గురించి మొత్తం మానవాళికి సంశయాలు ఉన్నా సరే ఇది నిజం.

కానీ ఇంకో సత్యం గురించి ఇంత నిస్సంకోచంగా చెప్పలేను. నేను ఇక్కడ ఒక శరీరధారినై ఉండి, నేను చేస్తున్న పనుల వల్ల కలిగే ప్రయోజనం ఎంత అన్నది చెప్పలేను. ఇది నేను నా స్వంత కోరికవల్ల చెయ్యడం లేదు. శ్రీఅరవిందులు చెయ్యమన్నారు కనుక, ఒక పవిత్ర బాధ్యతగా, భగవంతుని ఆజ్ఞగా చేస్తున్నాను. ఈ లోకం దీనివల్ల ఎంత లాభపడింది అన్నది కాలమే చెబుతుంది.

*

ప్రశ్న: అమ్మా నువ్వు మాలాగా ఎందుకొచ్చావు? నీవు నీవుగా నీ నిజశక్తితో ఇక్కడికి ఎందుకు రాలేదు?

శ్రీమాత: నేను మీలాగ రాకపోతే, నేను మీ దగ్గరకు ఎలా రాగలను? నీ బుజంమీద చెయ్యివేసి 'నన్ను చూడండి, మీరు కూడా నన్ను చూసి నేర్చుకోండి' అని చెప్పే అవకాశమే ఉండేది కాదు.

అనువాదం: బి. వరలక్ష్మి

Creation's search for self began its stir.
A spirit dreamed in the crude cosmic whirl,
Mind flowed unknowing in the sap of life
And Matter's breasts suckled the divine Idea.

Sri Aurobindo (*Savitri*, p. 101)

ప్రపంచం మిథ్య కాదు

"బ్రహ్మ సత్యం జగన్మిథ్య" అనే భావము మన దేశంలో అందరికి నరనరంలోను జీర్ణించుకుపోయింది. ఇది ఎంతవరకు నిజం? ఈ సృష్టియొక్క బాహ్యాస్వరూపము వింతగానే కనపడుతుంది. ఆత్మదృష్టికిగాని దీని సత్యము తెలియదు. కొంతమంది ఆచార్యులు సత్యాన్ని దర్శించగా వారికీ ప్రపంచం భ్రమగా కనపడింది. మానవబుద్ధికది మాయగా కనబడ్డప్పటికి యోగదృష్టికది సత్యమే

– సంపాదకుడు

ఈ సృష్టి అంతా వట్టి భ్రమ అనుకోవటం పొరపాటే. అసలు భ్రమ అనే భావమే ఒక భ్రమ! మానవమనస్సులో మెరిసే ప్రతి భావమూ ఒకానొక సత్యముయొక్క వికృతరూపమే.

శ్రీఅరవిందులు: మెరపులు, తలపులు

ప్రశ్న: "భ్రమ యనుటయే ఒక భ్రమ" ఈ వాక్యానికి అర్థమేమిటి?

మానవమనస్సు సత్యానికి దూరము కావటమువలన మనిషి ఒక భ్రాంతిలో నివసిస్తుంటాడు. ఈ సృష్టంతయు మాయాకల్పితమవుటవలన అది భ్రాంతిగానే కనపడుతుందని కొందరి అభిప్రాయం. దీనికి వ్యతిరేకంగా ఈ ప్రపంచం వెనక, దానికతీతంగా ఒక శాశ్వతసత్యమున్నదనియు, మన ప్రస్తుతస్థితిలో అది తెలియదనియు, సాధనద్వారా అది అవగతమగుననియు మరికొందరి అభిప్రాయము. ఈ సూక్తిలో ఈ ప్రపంచమంతా కేవలం మిథ్యేగాని సత్యము కాదనియు, అహంకారదృష్టియే, ఇంద్రియాలకు గోచరమయే ఆభాసమే అనియు, అహంకారము మాయమైతే ఈ ప్రపంచము మాయమైపోతుందనే వేదాంతభావనని శ్రీఅరవిందులు ఎత్తి చూపించారు.

కాని శ్రీఅరవిందుల దృష్టి దీనికి పూర్తిగా భిన్నము. పైకి అన్యాయంగా కనపడుతున్న ఈ ప్రపంచము వెనుక ఓ దివ్య సత్యమున్నది. అదియే ప్రపంచాన్ని నడిపిస్తున్నది. కాబట్టి ఈ

ప్రపంచాన్ని మాయ అనేందుకు వీలు లేదు. ఇక్కడ ప్రతీదీ ఉద్దేశపూర్వకంగానే జరుగుతుంది. ఇంతకు ముందర జరిగిన సంఘటనలవలన నిర్ణయింపబడిన ఫలితమే ప్రస్తుత ఘటనలు. నేటి జీవితముయొక్క పర్యవసానమే అనంతరం జరుగుతుంది. ఈ విషయాన్ని జాగ్రత్తగా గమనించండి. అంతేగాని తలవని తలంపుగా ఏదీ జరగదు. అయితే మానవమనస్సుయొక్క దృష్టి పాక్షికముగనుక, దానికి సమగ్రదృష్టి లేదుగనుక, అంతా గందరగోళముగా అనిపిస్తుంది. నిజానికి బాహ్యసంఘటనల వెనుక, పైకి చాల గందరగోళముగా అనిపించే ప్రతిదాని వెనుక ఒక పరమసత్యమున్నది.

మనకు భ్రమగా కనిపిస్తుందిగాని ఈ జగత్తు సత్యమే అని శ్రీఅరవిందులు నుడివిరి.

*

శంకరాచార్యులు మొ॥ గురువులు ఉన్నతలోకాలలోని మూల సత్యాన్ని దర్శించారు. మిరుమిట్లుగొలిపే ఆ లోకం ముందర వారికీ ప్రపంచము చాలా ఘోరంగా కనపడింది. "ఛీ! ఛీ! ఇదంతా ఒట్టి భ్రాంతి. దీన్ని ఎంత తొందరగా ఒదిలించుకొని, ఇక్కడ నుంచి పలాయనము చిత్తగిస్తే అంత మంచిది" అని వాళ్లకనిపించింది. మనంకూడ ఈ ప్రపంచము అసత్యము అనే విషయాన్ని ఒప్పుకుంటాముగాని, దీన్ని ఒదిలేయమని చెప్పము. దాని స్థానంలో సత్యాన్ని నెలకొల్పాలని అంటాము.

మనపూర్వ ఋషులు ఇహలోకజీవితాన్నే సర్వమంగళంగా తీర్చిదిద్దాలన్నారుగాని పరలోకవాసాన్ని కోరలేదు. వారు బంగారు భవిష్యత్తును చూపించారు. కాని విధి వికటించింది. జాతి పటుత్వము సడలింది. బౌద్ధమతము వచ్చి సన్యాసానికే పెద్ద పీట వేసింది. నిర్వాణం నిర్వాణం అంటూ బాహ్యజీవితాన్ని నిరసించింది. ఎప్పుడైతే నువ్వు పనులు చేయటము మానేస్తావో అప్పుడు విశ్వమహాశక్తులను నువ్వు గ్రహించలేవు. అదే ఈ దేశంలో జరిగింది. మనుష్యులలో శక్తి ఉడిగింది. లౌకికజీవితము అసత్య

మని, ఒట్టి మిథ్య అని అన్నారు. భూలోకానికి బంగారు భవిష్యత్తు ఉన్నదనే భావము ఒట్టి కలగానే మిగిలిపోయింది.

*

అసత్యము వేరు, భ్రాంతి వేరు. లేనిది ఉన్నట్లుగా కనబడితే అది భ్రాంతి. కాని ఈ ప్రపంచానికి అస్తిత్వమున్నది కదా. అది భ్రాంతి కానేరదు. తనను గురించి తనకు తెలియదు అంతే. తన మూలమేమిటో తనకు తెలియదు. తన సత్యాన్ని గురించి తెలియదు. అసలు రూపమేమిటో తెలియదు. అందుకని దానిది అయోమయ జీవితము!

*

సృష్టి ఎప్పుడు జరిగింది? ఎప్పుడో ఒకప్పుడు జరిగింది. అయితే అది ఫలానా అప్పుడు 1-1-0000 తేదీన జరిగిందని చెప్పలేము. మన కాలమానము అక్కడ పొసగదు. ఒకానొక చేతనాస్థాయికి మన కాలమానము వర్తించదు. అసలు కాలముయొక్క ప్రసక్తి రాదు. సృష్టి స్థితి లయములు నిత్యము జరుగుతూనే ఉంటాయి. సృష్టికర్త్రిణి ఒకేసారి మూడు స్థితులలో, సృష్టికావల (transcendent), విశ్వస్థాయిలోను (universal), వ్యక్తిలోను (individual) ఉంటుంది. నీకిది అనుభూతమయేదెలా? నీ చేతనాస్థాయిని పెంచి విశాలచైతన్యములోకి ప్రవేశించినప్పుడు నీకీ మూడు స్థాయిలను గురించి ప్రత్యక్షంగా తెలుస్తుంది.

అనువాదము: లక్ష్మీప్రసాదమ్మ, డా॥ ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి

ఈ సృష్టి ఎలా జరిగింది? భగవంతుడనగా శుద్ధచైతన్యము – కంటికి కనపడునది కాదు. తనను తాను చూచు కొనుటకై తననుండి తాను వేరై ఒక ప్రతిరూపాన్ని ధరించాడు.

శ్రీమాత రచనలనుండి

పలాయనమే సృష్టి లక్ష్యమా?

ఈ మానవజన్మకు ఏమైనా ప్రయోజనమున్నదా? అట్టి ప్రయోజనము జీవితపు ఉపరితలములో మాత్రం కనపడదు. సాధన చేసి నీ ఆత్మను కనిపెట్టినప్పుడు "ఆహా ఇది ఎంత అద్భుతమైనది ఇక చేయునది ఏమియు లేదు" అని అనిపిస్తుంది. కాని అలా అనుకోవటంకూడ తప్పే. నీ అహంకారమును త్యజించాలి సరే. కాని నీ అహమును కూడ కూకటివ్రేళ్లతో పీకిపారేసినప్పుడుగాని నీవు ముందుకు పోలేవు. దైవానుగ్రహము నీకు తోడై నిన్ను నడిపిస్తూ ఉన్నప్పుడు నీకింక బెడదెందుకు? చిన్నపిల్లవాడల్లె దైవకారుణ్యం మీద ఆధారపడి ముందుకు సాగిపోవటమే నీ వంతు. — సంపాదకుడు

ఆత్మ నిన్ను పరవశింప జేస్తుంది

ఎవరైతే అంతఃశుద్ధితో ఆత్మను తెలుసుకోవాలనీ, దానితో ఏకత్వంపొంది దాని అధీనంలో జీవనం సాగించాలనీ ప్రయత్నాలు ప్రారంభిస్తారో వారికి ఆత్మ సాక్షాత్కరించినప్పుడు ఒక రకం మైకంలో మునిగిపోతారు. వెంటనే చటుక్కున "ఆహా! నాకు కావలసినది లభ్యమైనది, అమందానందాన్ని పొందగలిగాను" అనే భావన అంతఃకరణంలో కలుగుతుంది. దానితో మిగతా విషయాలు పట్టించుకోరు.

ఆత్మసాక్షాత్కారం పొందిన వారందరికీ ఇంచుమించు ఇదే జరిగింది. అంతటితో ఆగక కొంతమంది అదే ఆత్మసిద్ధికి మూలాధారమని కూడా సూత్రీకరించారు. "ఆత్మను తెలుసుకున్నావు గదా! అంతా సాధించినట్లే, గమ్యస్థానాన్ని చేరుకున్నావు. ఇక చేయవలసిందేమీ లేదని తేల్చేస్తారు."

విముక్తి అంటే ఇదేనా?

నిజానికి ఇంతకు మించి ముందుకు సాగాలంటే ఎంతో ధైర్యము కావాలి. గొప్ప సాహసయోధుడు కావాలి. తాను పొందిన ఆనందము ఇతరులు పొందలేకపోవడం చూసి బాధపడినప్పటికీ, ఏనాటి

కైనా వారు కూడా సిద్ధి పొందగలరనే భావం, తను చేసిన సాధనే వారూ చేసి తరించగలరనే భావంతో ఊరట పొంది, తనకు కలిగిన విజ్ఞతతో వారిపై కరుణ వహించి వితరణగా వారు కూడా గమ్యము చేరటానికి సహాయపడవచ్చు. ఆ విధంగా ఆత్మసాక్షాత్కారం పొందగలిగితే అందరూ పండిపోయినట్లే కదా! ఇక ప్రపంచంలో చేయవలసిందే ముంటుంది. కష్టపడటం ఇష్టం లేని వారికి అంతకంటే ఏం కావాలి? అయితే దైవము ఈ మాత్రానికేనా ఇక్కడ అవతరించింది? కాదు. ఇంతకంటె ఘనత రాశయమేమైనా ఉండి ఉండాలి. (కొంత నిశ్శబ్దం తర్వాత)

పలాయనమే మన లక్ష్యమా?

ఈ అనంతసృష్టికీ, విశ్వావతరణకూ పరమోద్దేశ్యం ఇంతే ననుకుంటే అది ఎంత పరిహాసాస్పదంగా ఉంటుంది? దీన్నుంచి పారిపోవాలనుకునేటట్లయితే అసలు ప్రారంభించడమెందుకు? బాహ్యానికి దుఃఖపూరితంగా, నాటకీయంగా కనబడే ఈ సృష్టి కోసము ఇంత తాపత్రయంతో బాధపడడంలో అర్థమేమిటి? కేవలం అక్కణ్ణుంచి ముక్తి ఎలా పొందాలో నేర్పించడానికే అయితే ప్రారంభించకుండానే ఉంటే సరిపోయేది కదా!

సృష్టికి ఓ మహత్తరమైన ప్రయోజనమున్నది

అసలు విషయము తెలుసుకోవాలంటే మాత్రం అహాన్ని, అహంభావాన్నీ తుడిచిపెట్టి నిష్కామంగా, నిర్మమత్వంతో సర్వసమర్పణ గావించుకోవాలి. అప్పుడు సృష్టికర్త వ్యూహం అర్థం చేసుకోగల సమర్థత కలుగుతుంది. ఇది వ్యర్థ పరిహాసం కాదనీ, అస్తవ్యస్తంగా బయల్దేరి, కఠిన మార్గంలో నడచి బయల్దేరిన చోటకు తిరిగిరావటానికి కాదనీ అప్పుడు తెలుస్తుంది. ఇంకా అస్తిత్వంలోని అందము, జీవించడంలోని ఆనందము, ఉత్కృష్టత మానవులందరికీ బోధపరచడమే సృష్టి చేయడములోని పరమోద్దేశ్యమనీ, ఈ అందము, ఆనందము, ఉత్కృష్టత నిరంతరాయంగా, నిరవధికంగా ప్రగతి పొందడం కూడా ఇందులోకే చేరుతుందనీ తెలుస్తుంది. ఇది తెలుసుకున్న తర్వాత అన్నిటికీ ఒక ప్రయోజనము కనిపిస్తుంది.

ఎవ్వరూ కూడా తాము పడిన కష్టాలకూ, వ్యధలకూ బాధ పడరు. రెట్టించిన ఉత్సాహంతో గమ్యంవైపు ఉరకలు తీస్తారు. గమ్యము సిద్ధిస్తుందనీ, విజయం తథ్యమనీ రూఢి చేసుకుని ఆత్మసిద్ధి ప్రయత్నాలలో మునిగిపోతారు.

ఇలా తెలుసుకోవాలంటే మాత్రం అహంకారిగా ఉండటం మానెయ్యాలి. దైవంతో తన జన్మసంబంధాన్ని తెగతెంపులు చేసుకొని తనలో తాను ప్రత్యేక వ్యక్తిగా ఉండటం మానుకోవాలి. ఈ విధంగా అహాన్ని వదిలించుకున్నప్పుడు అసలైన గమ్యము గోచరిస్తుంది. ఇదే ఏకైక మార్గము. జీర్ణవస్త్రాన్ని వదిలేసినట్లు అహాన్ని తీసిపారేయ్యాలి.

చివరకు లభించే ప్రతిఫలమే నీ శ్రమకు తగిన ఫలితం. నీ పయనంలో ఏకాకివని అనుకోనక్కర్లేదు. విశ్వాసమున్నవారికి సహాయము ఎప్పుడూ ఉంటుంది.

భగవత్ కృప అద్భుతము

భగవత్కటాక్షాన్ని ఒక రెప్పపాటు కాలమైనా నీవు స్పృశించగలిగితే అదే నిన్ను నడిపిస్తుంది. నువ్వు తొందరపడటం కూడా మరిచిపోతావు. ఆ కృపే నీ నడకను వేగవంతము చేస్తుంది. అయితే ఒక పసిబిడ్డ మాదిరి నిర్మలత్వంతో, సరళత్వంతో, నిష్కపటంగా ఆ దైవకృపకే అర్పించుకుంటూ, నిన్ను నడిపించనివ్వాలి.

దీనికి ఎదురుచెప్పే వాటిని పట్టించుకోవద్దు, వ్యతిరేకించే వాటిని నమ్మద్దు. నమ్మకము, సంపూర్ణవిశ్వాసము ఉంటే లాభనష్టాలను బేరీజు వేయకుండా నిన్ను నీవు ఆత్మార్పణ గావించుకోగలవు.

అనువాదము: ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామ శాస్త్రి

It is only immutable peace that can make possible eternity of existence.

సృష్టి అంటే పతనం కాదు

ఈ సృష్టి ఆంతర్య మెవ్వరికీ తెలియదు. తెలిసినట్లయితే ఈ మానవజన్మ ఎందుకెత్తేమా అని తిట్టుకోరు. అది ఘనమైనది, చాలా ప్రయోజనకరమైనది. స్థిరత్వము దేవునియొక్క లక్షణము. చలనము సృష్టియొక్క లక్షణము. సాధన పరిపక్వమై నువ్వు అచేతనయొక్క ఒకానొక స్థాయిలోకి ప్రవేశించావనుకో – అప్పుడా అచేతనలోనే స్థిరత్వము, నిత్యత్వము కూడ కనిపిస్తాయి. అదే సృష్టికి మూలమని కూడ తెలుస్తుంది.

– సంపాదకుడు

శాంతి స్థిరతల ఆవశ్యకత

సృష్టి ఆరంభస్థితి అచేతనకు చెందిన అచలత; "ముందుకు చొచ్చుకొని వచ్చింది" అనలేము. కాని అది నిత్యత్వానికి అచలతకు ఒక విధమైన నిర్జీవ లేదా అచేతనా ప్రతీక. ఈ అనుభవం వచ్చినతర్వాతనే నేను పై సందేశాన్ని వ్రాశానని జ్ఞాపకం. మాటలు ఎందుకూ కొరగానివి. అది 'అచలత' కాదు, అచలతకు నిశ్చలతకు మధ్య స్థితి. ఇక్కడ నేను "ప్రశాంతి" అని వ్రాశాను కాని 'ప్రశాంతి' అనేది చాలా పేదమాట. అది కాదు, ప్రశాంతికన్న అమితంగా ఎక్కువైనది. అది "ఏదో ఒకటి" (నిత్యత్వం అన్న మాటకు కూడా పరిమితమైన అర్థమే ఉంది. మాటలతో ఏదీ సాధ్యం కాదు). ఈ 'ఏదో ఒకటి' అని చెప్పింది అన్నింటికీ మూలం, మూలంతో తిరిగి చేరటానికి జరుగుతున్న అభివ్యక్తికి చెందిన పరిణామానికి అది ఆరంభం (అమ్మ ఒక దాంతో మరొకటి కలిపే చాపరేఖను గీశారు).

అచలత్వమే ఆదిమూలము

అది అచేతనా అచలత్వం – అచేతనకు సంబంధించిన అచలస్థితి. అచేతనకు చెందిన జడ అచలత మాదిరిగా ఉన్నదనే భావన నాకు కలిగింది. పరిణామానికి అది ప్రారంభస్థానం అనిపిస్తుంది. అది దీనికి... దీన్ని ఎలా చెప్పాలో (ఇది మరొక విధ

మైన అచలత, సమస్త గమనాలను తనలో వహించింది) మూలానికి చెందిన అచలతకు ఈ నిశ్చలతకు భాషాంతరీకరణం. పూర్తిగా గడచిపోయిన పరిణామం 'దాన్ని' తిరిగి కనుగొనటం కోసం అలా ఉంది. ఇది చాలా విస్పష్టమైన దర్శనం. దీన్ని వ్రాసినట్లు నాకు జ్ఞాపకం వచ్చింది, దాన్ని చదివినప్పుడు ఆ అనుభవం మళ్లీ తిరిగివచ్చింది. మనం 'పతనాన్ని' గురించి ఎప్పుడూ మాట్లాడుతాం – కాని అది అలా కానేకాదు. 'పతనం' అంటూ ఉంటే ప్రాణికస్థితి స్వతంత్రంగా ఉండాలనే ఇచ్ఛగా మార్పుపొందిన క్షణంలో జరిగింది. ప్రారంభంలో లేదు. మార్గంలో సొంతం పతనం వచ్చింది. ప్రాచీన సంప్రదాయంలో "మూలం నుంచి వేరైపోయినందువల్ల" "చేతనాఅస్తిత్వం" అచేతన అయిందంటారు – ఇది చిన్నపిల్లలకు చెప్పవలసిన కథలలాంటిదనే భావన నాకు కలిగింది.

విచిత్రం! నిశ్శబ్దంలో, దర్శనంలో చాలా స్పష్టంగా తేజోమయంగా అవగాహన అయ్యేదిగా ఉంటుంది. కాని చెప్పాలనుకొన్న తక్షణం అది అర్థంలేనిదైపోతుంది.

అయితే ఇప్పుడున్నట్లుగా ఉండే సృష్టిలో, "ప్రశాంతి" పదం, బహుశః అత్యంత సమీపంగా ఉంటుందనటం నిజమే (ఇది అది కాకపోయినా, చాలా చిన్నది సంకుచితమైనా; ఇది అదికాదు) ఏదైనా తప్పుత్రోవ తొక్కినప్పుడు లేదా క్రమాన్ని తప్పినప్పుడు నివారణగా వచ్చేది అదే, అంతర్గతంగా....

ఈ సందేశంలో "ప్రశాంతి" అని నేను వ్యవహరించింది, ప్రశాంతి అనిపించింది. గమనానికి పరాకాష్ఠ అది సామాన్యం – సామరస్యంతో కూడిందే కాని సామాన్యం.

మాట్లాడటం జరిగిన వెంటనే అది ఒక వ్యంగ్యచిత్రం లాంటిదయిపోతుంది. అదే నిర్వికార ప్రశాంతి (అది 'ప్రశాంతీ' కాదు 'నిర్వికారమూ' కాదు, 'ఏదో'). అదే విషయం అచేతనా జడత్వం లోపల ఉంది. ఎంతో స్పష్టంగా తెలుస్తుంది. సృష్టిభావం సొంతం అక్కడ ఉంది. ఆ విధంగా ఇది 'అది' పై చూపుకు ఒకటిగానే ఉన్నాయి. (కాని అది ఒకటే అది ఒకటే)

తన అభేదస్థితికి చెందిన ఎరుక కలగటానికి కావచ్చు. (కాని ఇవన్నీ కేవలం మాటలే కాని అసలు విషయాన్ని సూచించవు).

అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రారావు

ఈ సృష్టి ఎందుకు చేయాల్సి వచ్చింది?

"When the Oneness is absolute,
Who can know the Oneness?"

సృష్టి మొదట్లో ఏకమే. అణువణువులుగా చీలిపోబట్టి వేర్పాటు భావముదయించింది. ఈ అణువులన్నీ మళ్ళీ కలిసిపోయి తాము ఒకే బ్రహ్మాండంలోని భాగములే అయినప్పుడు ఏకత్వమే రాణిస్తుంది. కాని ఈ ఏకత్వభావన మొదట్లో ఉన్నదానికంటె శ్రేష్టతరమైనది. మూలతః ఉన్నది ఒకే వస్తువు అయినప్పటికి దానిలోని అణువులన్నీ విడివిడిగా చిన్నాభిన్నమైపోయి మళ్ళీ 'మేమందరము ఒకటే' అని అనుకున్నప్పుడు కలిగే భావం వేరు – ఆ అణువులు ప్రతి ఒక్కటి 'నేనే అన్నిటిలోను అధివసిస్తున్నాను' అని అనుకుంటాయి. ఇప్పుడా మొత్తం వస్తువంతా ఒక ఏకత్వభావముల సంపుటి. దీనినిబట్టి మనకో విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఆదిలో దైవము యథాతథంగా ఒకటే అయినప్పటికీ ఆ ఏకత్వాన్ని గుర్తించేందుకు మరొకరుండాలి. అందుకనే దైవము తననుండి తను వేరైపోయి అనేక ప్రతిరూపములను సృష్టించుకున్నాడు.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్ శాస్త్రి

సృష్టియొక్క పరమోద్దేశము

మానవమేధ చాల పరిమితమైనది. మనిషికి తన పరిమితులను దాటి దైవముతో తాదాత్మ్యము పొందినప్పుడుగాని జ్ఞానం కలగదు. తన ప్రయోజకత్వము, నిజస్వరూపము తెలియవు. ఈ ప్రపంచంలో జన్మనెత్తి, అనుభూతులను పొంది, బహుముఖమైన చేతనావిన్యాసముల ద్వారా సుసంపన్నమైనప్పుడే సృష్టియొక్క పరమోద్దేశమును అర్థం చేసుకొనగలుగుతాడు.

— సంపాదకుడు

"Love is, in its essence, the joy of identity; it finds its expression in the bliss of union"

ప్రేమకు పరమార్థం ఐక్యతలోని ఆనందం; తాదాత్మ్యంలో కలిగే బ్రహ్మానందం ద్వారా అది వ్యక్తమవుతుంది.

శ్రీమాత

తాదాత్మ్యానందము

భగవంతుని లోనుంచి వెలువడిన ప్రేమ విశ్వాన్ని చుట్టివచ్చి జనకస్థానాన్ని చేరినప్పుడు భూభ్రమణంలో ప్రోగుచేసుకున్న అనుభవసారమంతా దానిలో చేరుతుంది. ఈ విధంగా తిరిగివచ్చేసరికీ బయల్దేరినప్పుడు లేనటువంటి విశ్వానుభవంతో సుసంపన్నమవుతుంది. దాని కోసమే సృష్టి జరుగుతోంది.

సృష్టి ద్వారా చేతన సుసంపన్నమగుట

ఇలా సృష్టిప్రక్రియలో తనను తాను పరిష్కృతం చేసుకోకపోతే చైతన్యం ఇప్పుడున్నట్లుండేది కాదు. ఇదంతా అంటే ప్రేమ అనే శక్తి జగత్తంతా పరిభ్రమించి తిరిగి యథాస్థానానికి చేరుకోవడం మొదలైనవి కాలంతో అన్వయించి చెప్పుకోలేము. ఇక్కడ దూరము, కాలము అనే ప్రశ్న లేదు. కానీ మానవులకు కాలం దూరం ఒకదాన్నొకటి అనుసరించి ఉంటాయి కనుక ఈ విషయం అర్థం చేసుకోవడం కష్టం. అది వదిలేసి

ఆది, అంతం మధ్య గమనాన్ని కాలంతో ముడిపెట్టకుండా అంత టినీ ఒకే మూసలో ఉన్నట్లు ఊహించగలిగితే ఆ ప్రయాణం కాలానికి సంబంధించకుండా చైతన్యంతో తిరిగిరావటంగా గుర్తిం దవచ్చు. ఇంకా అర్థమయేటట్లు చెప్పాలంటే ప్రేమ తన జనక స్థానానికి తిరిగిరావటం కేవలం తన్మయత్వంలోని ఆనందంగాక సంయోగంలోని పారవశ్యము అయిపోతుంది. మనోవిజ్ఞానశాస్త్ర రీత్యా చూసినా గూడా ఈ విషయమే స్పష్టమవుతుంది. జగతిలో ప్రోగయ్యే అనుభవాలవల్ల చైతన్యం సుసంపన్నంగానూ, సమృద్ధి గాను తయారవుతుంది. అదే ప్రపంచము, సృష్టి లేకపోతే చైతన్యం అంత వృద్ధిపొందేదికాదు కదా!

*

చైతన్యం యొక్క బహుళత్వము

సృష్టియొక్క పరమరహస్యం అదే. ఎలా గంటే చైతన్యం ఒకటే అయినా తిరిగి వచ్చింది బృహచ్చైతన్యం. అది ఏ క్షణా నైతే తనను తాను ప్రతిష్ఠించుకొన్నదో ఆ వెంటనే బహిర్గతమై పోయి, విస్తరించడానికి అనువుగా అనేక శకలాలుగా విడిపో తుంది. ప్రతి ఒక్క శకలము ఒక్కొక్క ప్రత్యేక వ్యక్తిత్వము ఆవిర్భవించటానికి కారణమవుతుంది. ఈ శకలములోని సత్య స్వరూపం లేక మూలసూత్రం ప్రతి వ్యక్తికీ స్వరూపమవుతుంది. ఈ విధంగా ప్రతి రూపానికీ ఒక సూత్రము, సత్యమూ లేకపోతే ప్రత్యేక వ్యక్తిత్వానికి (వ్యక్తి ప్రత్యేకత) అవకాశమే ఉండదు. ఇది అనంతంగా కొనసాగుతుంది. పోయినకొద్దీ వ్యక్తిత్వచైతన్యం కాకుండా కేంద్రీకృతచైతన్యస్థానాలు, కూటములు ఉండవచ్చు. ఒక్కటే చైతన్యం అనేకాలుగా విడిపోయినప్పుడు ఒక్కొక్క శక లపు సత్యాన్నీ ఒక్కొక్క వ్యక్తిత్వం సూచిస్తుంది. ఈ విధంగా అనంతకోటి శకలాలకూ అనేకానేక సూత్రాలు, చైతన్యద్రవ్యాలు, ధృవసత్యాలూ ప్రపంచమంతా వ్యాపించి ప్రత్యేక వ్యక్తిత్వాలుగా తయారవుతాయి. ఈ విధంగా ప్రత్యేక వ్యక్తిత్వంకోసం జనక స్థానానికి దూరదూరంగా వెళ్ళిపోవడంవల్ల వ్యక్తికీ తన ఆవి ర్భావానికీ మూలమైన చైతన్యానికీ అంతరం పెరిగిపోతుంది.

ప్రత్యేక వ్యక్తీకరణ పూర్తికాగానే, అంటే అంతర్గత సత్యం పరిపూర్ణత పొందగానే తన స్థితిని స్ఫురణలోకి తెచ్చుకోవచ్చు. ఈ అనంతకోటి శకలాలలోని ఏకత్వం పునఃస్థాపన కావచ్చు. మనకు అర్థమైనంతవరకూ విశ్వరచనకు అసలు కారణం ఇదే. ఇంత అద్భుతవిషయం కోసమే ఈ ప్రపంచం ఏర్పడింది. పరమాత్మ తన్ను తాను తెలుసుకోవడం కోసం తన్ను తానే ప్రతిష్ఠించుకొన్నాడు.

ఏది ఏమైతేనేమి సృష్టి జరిగింది. దానితో తృప్తిపడి మనకి లభించిన ప్రాపంచిక జీవితాన్ని సార్థకపరుచుకుందాము. వాటి సమయం వచ్చినప్పుడు మిగతావన్నీ వాటంతటవే సిద్ధిస్తాయి.

ప్రత్యేక వ్యక్తిననే భావనకి అహంకారం ఒక కారణమనే విషయం నేనిక్కడ చెప్పలేదు. ఎందువల్లనంటే అహంకారం అసత్యమూ, కపటమూ కావడంవల్ల బుద్ధుడూ, శంకరాచార్యుడూ చెప్పినట్లు వ్యక్తిత్వమే అబద్ధమూ, మాయ అని చెప్పవలసి వస్తుంది. యథార్థంగా వ్యక్తిత్వానికి ఆధారభూతుడు పరమేశ్వరుడే కాబట్టి అహంకారమనేది ఒక తాత్కాలిక వైపరీత్యము. దానికీ ఒక అగత్యం ఉండటంవల్ల కొన్నాళ్ళుండి దాని అవసరం తీరగానే అదృశ్యమైపోతుంది. అప్పుడు సత్యచైతన్యం ప్రతిష్ఠిత మౌతుంది.

మూలం; శ్రీమాత

అనువాదం; ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామశాస్త్రి

ఈ నూతనసృష్టి నిర్మాణంలో మనము కూడ ఒక భాగము కావలసిందే. నిజము చెప్పాలంటే ఇంత అద్భుతమైన అవకాశము వచ్చినప్పుడు నీ పాత అలవాట్లన్నిటిని పరిత్యజించాల్సిందే.

శ్రీమాత రచనలనుండి

ప్రకృతి యొక్క పరమోద్దేశము

కోటానుకోట్ల యోజనాల పర్యంతం వ్యాపించివున్న ఈ విశాల విశ్వం ముందర ఈ భూమి ఎంత? నువ్వెంత? కాని ఈ భూమికి సృష్టిలో చాలా విశిష్ట స్థానమున్నది. పరిణామప్రక్రియ ద్వారా పురోగమించే ఈ సృష్టికిదియే యజ్ఞభూమి, ప్రయోగకేంద్రము. ఈ భూలోకంలోనే దేవుడు తనను తాను నిక్షేపించుకొని సంభూతమవుతాడు. క్రమవికాసము జెందుతూ మళ్లీ తనతో సాయుజ్యము జెందుతాడు. — సంపాదకుడు

పదార్థంలో దైవము గర్భితము

సృష్టియొక్క ఉద్దేశమేమిటి? ప్రకృతి లక్ష్యమేమిటి? పరిణామప్రక్రియద్వారా తన సంకల్పాన్ని నెరవేర్చుకొనుటకై జడపదార్థము లోపల దేవుడు తనను తాను నిక్షేపించుకొన్నాడు. పరమాత్మ తన ప్రతిరూపాన్ని తనే నిక్షేపించుకున్నాడు. ఎందుకని? బైటనుంచి తనెట్లా ఉంటాడు? తననుండి తానే విడిపోయినప్పుడు ఎలా కనబడతాడు? కూటచేతననుపొంది తిరిగి సంభూతమైనప్పుడు ఏమనిపిస్తుంది? ఈ ప్రశ్నలకు సమాధానములే సృష్టికి విషయములు. సృష్టికిదే కారణం. మరియే కారణమూ లేదు. పరిణామం జరగాలి. పరిణామం గాలిలో జరగదు గదా! ప్రయోగం చేసేందుకు ఎదురుకుండా ఒక పాత్రను పెట్టుకోవాలి కదా? ఒక కేంద్రం కావాలి. ఈ భూలోకమే అట్టి కేంద్రము. భూలోక చరిత్రను కనుక మనం చూసినట్లయితే దేవుడు ఏ విధంగా క్రమాభివృద్ధి చెందుతున్నాడో తెలియవస్తుంది. దేవుడు ఈ సృష్టి ద్వారా ఏ విధంగా అచేతనమైన జడపదార్థంతో మొదలై తనను తాను ఎలా పరిణమింపజేసుకుంటున్నాడో తెలిసిపోతుంది. సృష్టి సృష్టికర్తతో – అనగా ప్రకృతి పురుషునితో ఏకం కావాలి. తాదాత్మ్యం చెందాలి.

ఇదియే సృష్టి రహస్యము. ప్రకృతియే దైవశాసనాన్ని అమలుపరుస్తుంది. ఆమెయే కార్యకర్త.

అచేతనలో ప్రతిష్ఠితమైన చైతన్యము

మొదట్లో పూర్తి అచేతనంగా ఉండే ఈ జడపదార్థంలోనుంచి దానిలో అంతర్గతంగా ఉన్న పరమాత్మ చైతన్యాన్ని ప్రేరేపించి అభివృద్ధిపరచి తనను తాను గుర్తించేటట్లుగా చేస్తుంది. కాని ఈ విషయాన్ని రహస్యంగా ఉంచుతుంది. మొదట్లో చెప్పదు. క్రమక్రమాభివృద్ధి చెంది చివరకుగాని ఈ రహస్యాన్ని బయటపెట్టదు. మానవుడు ఇప్పుడా స్థాయికి చేరుకున్నాడు. ఇన్నాళ్లు అజ్ఞాతవాసంలో జరిగిన ప్రక్రియ ఇప్పుడు

మానవునిలో దైవము ప్రవర్థము

పూర్తిగా చైతన్యవంతంగా ఉద్దేశపూర్వకంగా జరుగుతుంది. వేగాన్ని పుంజుకుంటుంది. దైవ సాక్షాత్కారము జరుగుతుంది. అందుకనే మానవునిలో ఆధ్యాత్మిక సత్యము పెరుగుతున్నట్లు మన మిప్పుడు గమనించగలము. అది యథేచ్ఛగా అభివ్యక్తమౌతుంది. నిరభ్యంతరంగా ఆవిష్కారమౌతుంది. మానవుడు ఆవిర్భవించుటకు పూర్వము ఈ ప్రక్రియ వృక్షములలోను, జంతువులలోను ముందరే నిర్ణయించబడి ఒక నిర్ణీత పద్ధతిలో మాత్రమే జరిగేది. కాని మానవునికి తెలివి ఉన్నది. వివేచనాశక్తున్నది. తనకు తానే ఆలోచించుకొని సన్మార్గమును అవలంబించగలడు. దైవము తన ద్వారా దేనిని అభిలషిస్తున్నాడో కనుగొని ఆయనతో సహకరించగలడు.

సృష్టికర్త ఉద్దేశమేమిటో కనుగొని దానిని నిర్వర్తించుటయే ప్రకృతియొక్క లక్ష్యము. సృష్టికర్తకు సృష్టికి ఏమాత్రము భేదముండరాదు. స్రష్టను ఎరిగి ఆయనతో తాదాత్మ్యము చెందుటయే సృష్టి రహస్యము.

కాబట్టి ప్రకృతి అచేతనమైనదేం కాదు. అచేతనంగా ఉన్నట్లు కనపడుతుంది అంతే. కాబట్టి చేతన మొదట్నుంచి ఉండనే ఉన్నది. ప్రకృతి పరిణతి చెందినకొద్దీ పెరిగే వస్తువు చేతన కాదు – చేతనయొక్క అభివ్యక్తి – దాని వికాసము.

*

ప్రశ్న: ప్రకృతి అంటే ఏమిటి? ఆదిశక్తి (Supreme Mother) కి దానికిగల సంబంధమేమిటి?

భూమిని సృష్టించినదియు, ముఖ్యంగా భూలోకంలోని భౌతికపదార్థాన్ని సృష్టించిన సృజనశక్తియే (ఆ శక్తి యొక్క స్థూల రూపము) ప్రకృతియని నేననుకుంటాను.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

మన లక్ష్యం

ఆయువు ఉన్నంతకాలం మనిషి బతకడమేనా లేక జీవితానికే స్థిరంగా ఒక లక్ష్యమున్నదా! ఆత్మ, దేవుడు, ముక్తి లాంటి గొప్ప గొప్ప మాటలను మనం వింటూనే ఉంటాము. అయినప్పటికి లౌకికజీవితం యథాప్రకారం దుఃఖమయంగానే ఉంటోంది. ఈ విషయాలనన్నింటినీ వివేచించి స్పష్టంగా మనస్సుకు అర్థమయ్యేలాగు చూపించడమే ఈ వ్యాసముయొక్క లక్ష్యము.

— సంపాదకుడు

ఓ భగవంతుడా! నువ్వు కానిదేదియు లేదు.

భగవంతుడే ఆశ్చర్యకరమైన ఆనందానుభూతి అని, ఇదే సృష్టి లక్ష్యమని స్పష్టంగా తెలుస్తుంది.

*

ప్రాణులన్నింట దివ్యచైతన్యాన్ని మేల్కొల్పడమే సృష్టి పరమ లక్ష్యం.

*

అనంత చైతన్యమే మన లక్ష్యము

సృష్టికర్తలాగా ప్రాణి చైతన్యవంతం కావాలన్నది సృష్టి లక్ష్యమని ఎవ్వరైనా చెప్పవచ్చు. అదే! అది ఒక పదబంధమే! కానీ అది ఆ మార్గంలోనే ఉంది. అపారచైతన్యమే సృష్టి

లక్ష్యం, సర్వాంతర్యామి, శాశ్వతుడు భగవంతుడు, అపారమూ శాశ్వతమూ సర్వాంతర్యామత్వం – (మతపరంగా భగవంతుడం టున్నాము – అయితే జీవితపరంగా మనకది దివ్యం) కాలాతీ తంగా అనంతం, శాశ్వతం, సర్వాంతర్యామత్వం, ప్రత్యంశమూ భగవచ్చైతన్యం కలిగి ఉండడం.

విభజనమే ప్రపంచాన్ని సృజించింది ఈ విభజనలోనే శాశ్వతత్వం తనకు తానే వికాసం పొందుతుంది అయితే ఈ గహనమైన విషయాలు భాష కందునవి కావు.

*

దైవము వినా అన్యమేదియు లేదు

భగవంతుడు డొక్కడే ఉన్నాడని గ్రహించు, (భాషానుకూల్యం కోసం భగవంతుడన్నాను లేకపోతే) కేవలం భగవంతుడు మాత్రమే, ఇంకేమీ కాదు; ఎరుకతోనే భగవంతుని లోనే అన్నీ జరుగుతాయి ఈ అనంతత్వంలో ఉండే భగవంతు నిలో మనం ఇసుకరేణువులం మాత్రమే.

*

మనిషి అంతరంగంలోనే సర్వజ్ఞత

మానవునిలో నిర్దుష్టమైన శక్తి, నిర్దుష్టమైన తెలివి, నిర్దుష్టమైన విజ్ఞానం ఉన్నాయి, వాటిని పొందాలంటే ఆత్మపరిశీలన, ఏకాగ్రతలవల్ల తనలో ఎంత లోతున, నిక్షిప్తమయ్యామో కనిపెట్టవలసి ఉంది.

ఈ దివ్యశక్తులు అన్ని ప్రాణుల హృదయాంతరాళాల్లోను సమానమే, ఇది అత్యవసరమైన అందరి ఐక్యతాభావాన్ని సూచి స్తుంది, దాన్నుంచి ప్రారంభమయ్యే ఏకీభావం, సోదరభావాల పర్యవసానాలు తెలుస్తాయి.

మానవుని పరిణామము (true progressive evolution) బాహిరమైన సాధనాలపైనగాని, భౌతికాభ్యున్నతపైగాని, సామా జిక పరిణామం పైగాని జరగదు వ్యక్తుల సాధన – లోతైన లోపల ప్రక్రియ మాత్రమే నిజమైన అభ్యుదయమును కలిగించి, ప్రస్తుత పరిస్థితులను సంపూర్ణంగా మార్చగలదు; దుఃఖాన్నీ,

దైన్యాన్నీ పోగొట్టి ప్రశాంతమూ శాశ్వతమూ అయిన సంతృప్తి నివ్వగలదు!

అనువాదము ఆచార్య ఎస్. గంగప్ప

కొన్ని ధర్మసందేహాలు

ఈ సృష్టిని ఒక ఆకాశహర్మ్యంతో పోల్చవచ్చు. పైన అమృతమూ, కింద అంధకారమూ. ఈ రెండింటి మధ్యన అనేక లోకాలు, అనేక చైతన్యశ్రేణులు, వారి వారి విధులను నిర్వహిస్తున్న అనేక జీవులు. ఈ సృష్టినంతా దైవమే చేసినప్పుడు ఇంతటి దుఃఖము, అన్యాయము ఎక్కడనుంచి వచ్చాయనేదే ప్రశ్న దానికి కొంతమంది మధ్యవర్తులే కారణం. దేవుడీ రాయబారులను కిందికి పంపించాడు. కాని వారికి దుర్బుద్ధి పుట్టి స్వతంత్రులైపోయి ఇష్టమొచ్చిన రీతిని ప్రవర్తించడం మొదలు పెట్టారు. ప్రపంచంలోని దౌష్ట్యానికి కారణమిదే.

— సంపాదకుడు

ప్రశ్న నిండుప్రేమస్వరూపుడైన భగవానుడే ఈ సృష్టికి ఆవిర్భావస్థానమైతే, భూమిపై అసంఖ్యాకంగా చెలరేగే దుష్టశక్తులు ఎక్కడనుండి వచ్చాయి?

ప్రపంచ రచనలో మధ్యవర్తుల పాత్ర

అన్నీ భగవంతుడ్నుండే వచ్చాయి. కాని సర్వోన్నతమైన భగవత్ చైతన్యం ప్రపంచాన్ని తననుండి నేరుగా సృష్టించలేదు. ఆ చైతన్యంనుండి ఒక శక్తి బయల్వెడలి, అనేక శ్రేణుల గుండా అధిరోహించి, సాయపడే విశ్వశక్తులతో కదలి వెళ్ళింది. చాలామంది సృష్టికర్తలున్నారు. వారిని రూపకర్తలు (formateurs) అనవచ్చు. విశ్వసృష్టి సంవిధానాన్ని వారు అధిష్ఠించి ఉన్నారు. వారు మధ్యంతర సహాయకశక్తులు. భౌతికపదార్థానికి

రూపము, స్వభావము, మలుపు ఇవ్వడమే వారు చేసిన పని. అందువల్లనే వారిని 'రూపకర్తలు' అని నేను పిలుస్తాను. వారు అనేకమంది ఉన్నారు. కొందరు దయ, సామరస్యంగల మూర్తుల్ని సృష్టించారు. మరికొందరు దుష్టత్వం నిండిన రూపాలను, కీడు తలపెట్టే రూపాలను సృష్టించారు. ఇంకా కొందరు ఉన్నారు. వారు రూపశిల్పులు కారు. అపభ్రంశాలు సృష్టించారు. అంటే ఇతరులు సృష్టించిన మంచిరూపాలను ధ్వంసం చేసారు వారు.

*

ప్రశ్న: చాలామంది సృష్టికర్తలు (రూపకర్తలు) ప్రపంచసృష్టిని అధిష్ఠించి ఉన్నారని అన్నారు. ఎవరీ రూపకర్తలు?

సృష్టి అనేక స్తరముల ద్వారా జరుగుట

వారికి చాలా పేర్లు ఉన్నాయి. అనేక స్థాయిలలో, అనేక రకాల వ్యక్తిగతమూర్తుల ద్వారా సృష్టికార్యము నిర్వహించబడింది. ప్రతి అస్తిత్వపు స్థాయిలోను అమూర్త రూపాలు (entities), వ్యక్తిత్వాలు నిండి ఉంటాయి. ప్రతిమూర్తి తన చుట్టూ ఒక లోకాన్ని సృష్టించుకున్నాడు. భూమిపై జీవులు రూపం దాల్చడానికి ప్రతి మూర్తి తనకు చేతనైనది చేసింది. చిట్టచివరి సృష్టికర్తలు ప్రాణికలోకవాసులు. అధిమానసప్రపంచ వాసులు (దీనినే శ్రీఅరవిందులు "Overmental plane" అన్నారు) ఎన్నో రూపాల్ని సృష్టించారు. తమ అంశలను (emanations) పంపించి కార్యము నెరవేర్చారు. ఆ అంశలు మరికొన్ని అంశలను భూమికి పంపుతాయి. ప్రపంచానికి అవసరమైన రూపం కల్పించడానికి భగవంతుని సంకల్పం భౌతికపదార్థంపై నేరుగా పనిచేయలేదు. అనేక శ్రేణులగుండా, భూమికలగుండా భగవత్ శక్తి ప్రసారితమైంది. ఉదాహరణకు మనోభూమికలో చాలా మూర్తులు ఉన్నారు. వారే రూపకర్తలు, రూపనిర్మాతలు. ప్రాణిక భూమికలలోకూడా అదే సంభవిస్తుంది.

ప్రాణికలోకవాసుల సృష్టి

ఉదాహరణకు కీటకాల ప్రపంచం అంతా ప్రాణికజగత్తులోని రూప

కర్తల నిర్మాణం అని ఒక సంప్రదాయం చాటుతుంది. అందుచే తనే సూక్ష్మదర్శినిలో ఈ సూక్ష్మక్రిములను చూసినప్పుడు అవి అతిభయంకర రూపాలలో కనిపిస్తాయి. నీటిలోని సూక్ష్మజీవులను మీరు గతంలో చూశారు. అవి నిజమైన రూపాలే. వాటిని సూక్ష్మదర్శినిలో చూస్తే చాలా పెద్ద భూతాలుగా కనిపిస్తాయి. వాటికి గనుక పెద్ద దేహాలు ఉంటే మనుష్యుల్ని చాలా భయపెడతాయి. ఇవన్నీ ప్రాణికప్రపంచపు జీవులు. ఏదో తమాషా కోసం ఈ భయానకరూపాలు సృష్టిస్తారు వారు. అదంతా వారికి వినోదం. మనుష్యులకు మాత్రం ప్రాణసంకటం.

ప్రశ్న: ఈ మధ్యంతరజీవులు కూడా భగవత్‌శక్తినుండే వచ్చాయా?

ఔను. మధ్యంతరజీవుల ద్వారా ఈ వికృతమూర్తులు వచ్చాయి. నేరుగా కాదు. ఈ మూర్తులకు భగవంతునితో ప్రత్యక్ష సంబంధం లేదుగాని ఇతరమూర్తులతో సంబంధం ఉంటుంది. వాటికి మళ్ళీ ఇతర మూర్తులతో సంబంధం ఉంటుంది. ఆ ఇతర మూర్తులకు ఇంకా ఇతరమూర్తులతో సంబంధం ఉంటుంది. ఈ విధంగా సర్వోన్నతదైవం వరకు ఒక నిస్రేణికలాగా ఈ మూర్తులుంటాయి.

ప్రశ్న: అవి భగవంతుని నుండి వచ్చినట్లయితే, అవి దుష్టశక్తులు ఎలా అయ్యాయి?

దౌష్ట్యానికి మూలకారణము

దుష్టత్వమా? లోగడ మీకు అది వివరించాను. భగవంతుని ప్రత్యక్షప్రభావం క్రింద ఉండకుండా, భగవంతుని సంకల్పం ప్రకారం జరిగిన సృష్టి విస్తరణను, సృష్టి కదలికను అనుసరించకపోతే చాలు. వారి మధ్య సంబంధం దెబ్బతింటే చాలు, భిన్నత్వం ఏర్పడుతుంది. అపభ్రంశలు వస్తాయి. వారిలో అత్యంత తేజోమయమైన, అత్యంత శక్తివంతమైన మూర్తులైన భగవంతుని సంకల్పం కాకుండా తలో సంకల్ప సంవిధానాన్ని అనుసరించవచ్చు. వారు చాలా అద్భుతంగా ఉంటారు. వారిని

2

మనుష్యులు భగవంతునిగానే పరిగణిస్తారు. విశ్వంతో సామర స్యంగా పనిచేయడానికి బదులు వారు తలో సంకల్పాన్ని అనుస రించడంవల్ల చాలా భయంకరమైన దుష్టశక్తులకు, అపభ్రంశాలకు, క్రమరాహిత్యానికి కారణభూతమవుతారు. అంతేకాదు అసలు సృష్టి కార్యకలాపాన్ని అడ్డగిస్తారు. ఈ ప్రశ్నను సరిగా అడగ లేదు. నాకు నవ్వు వచ్చింది. అది చిన్నపిల్లలు మాట్లాడినట్లు ఉంది.

ఈ ప్రశ్న అడిగిన వ్యక్తి అంటాడు – "ప్రపంచంలో అన్ని వస్తువులు భగవంతుడే అయితే, ప్రపంచంలో దుష్టశక్తులు ఎందుకు ఉన్నట్లు?"

ఆ ప్రశ్న అడిగివుంటే – ఇది నా సమాధానం – 'భగవం తుడు కానిది ఏదీ లేదు. అయితే ఈ ప్రపంచం ఒక క్రమపద్ధ తిలో లేదు. దీనిని ఎవరైన బాగుచేయడానికి యత్నించాలి. భగ వంతుడు ప్రేమస్వరూపం మాత్రమే కాదు. సమస్తమూ ఆయనే. ప్రపంచం మనకు తప్పుగా అక్రమపద్ధతిలో కనిపిస్తే, అది సరి యైన పద్ధతిలో లేదు అని తెలుసుకోవాలి.

ఒక వస్తువును అర్థం చేసుకోవాలంటే, ఆ వస్తువుగా మనం మారాలి. ఈ విశ్వం ఎలా ఎందుకు వచ్చిందని అర్థం చేసుకోవాలంటే నువ్వు విశ్వంతో సాయుజ్యం చెందాలి. అది అసంభవంకాదు. కాని ముఖ్యంగా పిల్లల విషయంలో అది అంత సులభం కాదు.

అనువాదం: యజ్ఞన్న

దైవానుగ్రహము నీకు తోడై నిన్ను నడిపిస్తూ ఉన్న ప్పుడు నీకింక బెడదెందుకు? చిన్నపిల్లవాడల్లె దైవ కారుణ్యం మీద ఆధారపడి ముందుకు సాగిపోవ టమే నీ వంతు.

శ్రీమాత రచనలనుండి

దేవుణ్ణి అర్థం చేసుకోవటమెలా?

మనిషి మనస్సే అతని అజ్ఞానానికి కారణం. దేవుడ్ని అర్థం చేసుకోవాలంటే ముందర నీ మనస్సుయొక్క పరిమితిని గుర్తిం చాలి. నీ అవయవాలన్ని ఎలా నీ శరీరంలోని భాగాలో అలాగే ఈ సృష్టిలోని అంశములన్ని అతని అంగములు. అప్పుడు నువ్వు దేవుణ్ణి 'ఈ విశ్వాన్ని ఇలా ఎందుకు చేశావు' అని అడగ లేవు. నీకు రెండు చేతులే ఉన్నాయి. నాలుగు చేతులు ఎందు కని లేవు అని అడగవు కదా! అలాగే ఈ సృష్టి ఇలా ఎందుకు జరిగింది? మరోలా ఎందుకు జరగలేదు? అని అడిగేందుకు ఆస్కారం లేదు. నువ్వు ఆయనతో ఏకమైనప్పుడు ఆయన సృష్టిరహస్యం కూడ నీకు తెలియవస్తుంది. – సంపాదకుడు

అన్యాయం ఎక్కడినుండి పుట్టింది?

"భగవంతుడు న్యాయస్వరూపుడైతే, లోకంలో అన్యాయం ఎందుకు ఉంది? ఆయన మంచివాడే అయితే లోకంలో దుర్మార్గత్వం ఎందుకు ఉంది?" ఆయన ప్రేమస్వరూపుడైతే ప్రపంచంలో ద్వేషం ఎందుకువుంది? కాని ఆయన ప్రపంచ సర్వస్వం! ఏదో ఒకటో రెండో వస్తువులు కాదు, భగవంతుడే అన్నీ! ఇంకా నిజం చెప్పాలంటే, అన్నీ భగవంతుడే అనాలి. సృష్టిని గూర్చి ఎన్నో భావాలు లోకంలో బహుళవ్యాప్తిలో ఉన్నాయి. మానవ ఆలోచనలో చాలాకాలంగా వాటిని ఆమోదించడం జరిగింది. అవి సంక్లిష్టం కానివి.

"ఏదో ఒక తత్వము" ఉంది (నిజం చెప్పాలంటే అదేమిటో తెలియదు). భగవంతుడొకడున్నాడు. ఆయన ఆ "ఏదో తత్త్వమును" ఒక రూపంగా మార్చి, అందులోనుండి ప్రపంచాన్ని సృష్టించాడు. అటువంటి భావాలు నీకుంటే, ఈ భగవంతుడ్ని అడిగే న్యాయమైన హక్కు నీకూ ఉంది. "ఓ దేవుడా! నువ్వు సృష్టి చేశావు. అది అందంగా ఉంది. అది నీ ప్రపంచం!" అని అడగవచ్చును. ఆ కథ ప్రకారం 7 రోజుల శ్రమానంతరం అది

చాలా మంచిలోకం అని అతను ప్రకటించాడు. అది ఆయనకు మంచిదే. ఆ ప్రపంచం ఆయనకు చాలా వినోదం కలిగించ వచ్చును. కాని ఆ ప్రపంచంలో ఉన్న మనకి మాత్రం అందులో మంచి కనిపించడంలేదు. ఈ భావన, అడిగే తీరు అవివేకంగా లేదూ! ఒక కుమ్మరి కుండ చేసిన కథలాగ ఉంది.

ఈ దేవుడు ఒక మానవమాత్రుడు. విచిత్రంగా మనిషిలాగే కనిపిస్తాడు. రూపంలోనూ, శక్తిలోనూ భయంకరుడు. మనిషి భగవంతుడ్ని తన రూపంలో సృష్టించుకున్నాడు. భగవంతుడు మనిషిని తన రూపంలో సృష్టించలేదు. ప్రతిసారి అసంపూర్ణమైన, తెలివితక్కువ ప్రశ్న అడిగితే, నిజమైన సమాధానం చెప్పడం అసంభవం. అసలు ప్రశ్నే అసంబద్ధంగా ఉంది. నువ్వేదో అంటావు. దానిని రూఢి చేసుకొంటావు. దానిని రూఢి చేసుకొనే హక్కు నీకెక్కడిది? నువ్వు రూఢి చేసుకొంటావు. కాబట్టి నువ్వు ఈ విధమైన నిర్ణయానికి వస్తావు.

> సృష్టి, సృష్టికర్త ఒకే వస్తువుయొక్క భిన్నరూపములు

దీనికి ఒకే పరిష్కారం ఉంది. భగవంతునికి ఆవిర్భావదశలోని విశ్వానికి మధ్య తేడా చూడకూడదు. *ఈ విశ్వం భగవంతుడే. అనంత అంతరాళాలలోకి విస్తరించింది. విశ్వం ప్రభవించిన దశలో భగవంతుడే.* వాటిని విభజించలేవు. సృష్టికర్తకు, అతని సృష్టికి సంబంధించి అది పరస్పర విభిన్నమైన దృక్పథం!! ఇది వివరణను సులభతరం చేస్తుంది. బోధనను ప్రాథమికం చేస్తుంది. కాని అది నిజం కాదు. "సర్వశక్తిమంతుడైన భగవంతుడు ఈ ప్రపంచం ఇలా ఉండటానికి ఎందుకు అనుమతించాడు? అని నువ్వు అడుగుతావు. అది నీ సొంతభావన. బాధాకరమైన పరిస్థితులు మధ్య ఉన్నందున, ఆ భావాన్ని భగవంతునిపై రుద్ది "అటువంటి ప్రపంచాన్ని ఎందుకు చేశావు?" అని అడుగుతావు. "నేను చేయలేదు. నువ్వే చేసుకున్నావు. మళ్లీ నువ్వు నాలాగ అయితే, నువ్వు ఇప్పుడు అనుకుంటున్నట్లు భావించబోవు. నువ్వు అలా ఎందుకు అనుకుంటున్నావంటే నువ్వు ఏమాత్రం నేను కాదు కాబట్టి" అని

భగవంతుడు నీకు జవాబిస్తాడు. దివ్యచైతన్యంతో నీ చైతన్యం సాయుజ్యం చెందితే, అసలు సమస్య ఉండదు. అంత సహజంగా, సవ్యంగా, అది ఎలా ఉండాలో అలా ఉంటుంది. మూలంనుండి నువ్వు వేరుపడిపోతే, ఆయనకు వ్యతిరేకంగా నిలబడితే అంతా అపసవ్యంగా మారుతుంది. ఏదీ సక్రమంగా సాగదు!

దివ్యచైతన్యంతో ఐక్యమగుట

అసలు విషయాలను పతాకస్థాయికి చేర్చే తర్కం గురించి నువ్వు అడిగితే... తనలోని భాగాలు (అంశలు) తననుండి వేరైపోయి ఈ గందరగోళాన్ని సృష్టించడం భగవంతుడు ఎలా సహించాడు అని నీవు ప్రశ్నించాలి! నువ్వు అలా అడగవచ్చు. నా సమాధానం ఇది: "నువ్వు తెలుసుకోవాలంటే, నువ్వు భగవంతునితో సాయుజ్యం చెందడం మంచిది. ఈ సృష్టి, ఈ గందరగోళపరిస్థితులు ఎందుకు సృష్టించాడో తెలుసుకోవడానికి అదొక్కటే మార్గం."

సృష్టి నిరంతరాభివృద్ధి చెందుట

మానసికంగా అతనిని ప్రశ్నించకూడదు. ఎందుకంటే మనస్సుకు అర్థంకాదు. మళ్లీ చెబుతున్నాను. నువ్వు దైవంతో సాయుజ్యం చెందితే అన్ని సమస్యలు పరిష్కృతం అవుతాయి. అసలు సంఘటనలు, సృష్టి తీరుతెన్నులు సక్రమంగా లేవని, అవి మరోలా ఉండాలన్న భావన రావడానికి కారణం – నిరంతరమైన పురోగమనాన్ని, నిత్యం సమావిష్కరించే దివ్యసంకల్పం ఉండడం, గతకాలపు సంఘటనలు భవిష్యత్తులో రాబోయే సంఘటనలకు చోటివ్వడం, ఇతర సంఘటనలకన్నా అవి మరింత మెరుగ్గా ఉండడం....

నిన్న మంచితనం నిండిన లోకం రేపు ఎంతమాత్రం మంచిప్రపంచం కాకుండా పోతుంది. ఒకప్పుడు సామరస్యం, సంపూర్ణత్వం నిండిన ప్రపంచం నేడు సామరస్యాన్ని కోల్పోయి గందరగోళం, అపశ్రుతులతో నిండివుంటుంది. ఎందుకంటే ఇంతకన్న మంచిప్రపంచాన్ని, మరో ప్రపంచాన్ని మనం భావాలలో రూపుదిద్దుకుంటాము. ఈ ప్రపంచం సవ్యంగానే ఉంటే లోన

చేసితీరవలసిన కార్యం చేయకుండా ఉంటాము. ఆ ప్రపంచాన్ని మరింత మహనీయప్రపంచంగా మార్చడానికి అవసరమైన ప్రయత్నం చేయం.

నువ్వు నీలో మూసుకొనిపోకూడదు

ఈ భావాలన్నీ అవివేకంగా, తెలివి తక్కువగా కనిపించే సమయం వస్తుంది? దీనికి కారణం ఏమిటంటే ప్రతివ్యక్తి తనను తన చేతనా పరిధిలో బంధించుకుంటాడు. నీదైన చైతన్యంతో – అది అనంతంలో ఇసుకకణం లాంటిది – నువ్వు అనంతాన్ని తెలుసుకొని, విశ్లేషించాలని, నిజమేదో నిగ్గు తేల్చాలని అనుకుంటున్నావు. అది అసంభవము. నీ నుండి నువ్వు ముందు బయటపడి, అనంతం (దైవం) తో సాయుజ్యం చెందాలి. అప్పుడు నీకు అర్థం అవుతుంది సృష్టి అంతా. అంతకు ముందు నీకే మాత్రం తెలియదు.

నీదైన చైతన్యాన్ని విస్తరింపచేసుకో. నీ ఆలోచనలను నీ అవగాహనని – వీటిని భగవంతుని వైపు ప్రసరింపచేసి "అదంతా తప్పు" అని వేడుకో. నీకు అర్థం అవుతుంది. నిన్ను నీవు గుర్తించకపోతే నీకు తెలిసే అవకాశం లేదు. ఉదాహరణకు –

ఒక నీటిబిందువు సముద్రం ఎంత విశాలమో నీకు చెప్పగలదని నేను అనుకోవడం లేదు. అదీ అంతే!

అనువాదం: యజ్ఞన్న

కోటానుకోట్ల యోజనాల పర్యంతం వ్యాపించివున్న ఈ విశాల విశ్వం ముందర ఈ భూమి ఎంత? నువ్వెంత? కాని ఈ భూమికి సృష్టిలో చాలా విశిష్ట స్థానమున్నది. పరిణామప్రక్రియద్వారా పురోగమించే ఈ సృష్టికిదియే యజ్ఞభూమి, ప్రయోగకేంద్రము.

శ్రీమాత రచనలనుండి

శ్రీమాత అఖండ చైతన్యానుభూతి

ద్వంద్వములే మనిషి దుఃఖానికి కారణాలు. ఈ ద్వంద్వములు ఎక్కడినుంచి వచ్చినై? మూలతత్త్వమునుండి వేరుకావటంవలన వచ్చినై. మూలతత్త్వముతోటి ఏకమైనప్పుడు ఈ వేర్పాటు భావము పోతుంది. అణువణువులోను అఖండత్వాన్ని పొందట మనేది చాల గొప్ప అనుభూతి. శ్రీమాత అట్టి అనుభూతినే పొంది అదెంత అద్భుతంగా ఉంటుందో వర్ణించారు.

— సంపాదకుడు

ఈ పంచభూతాత్మక జగత్తు విభజనతో ప్రారంభమై అనేక విభాగములుగా విస్తృతిజెంది మంచిచెడులుగా, సుఖదుఃఖములుగా, విషాదానందములుగా విభజింపబడుచున్నది. ఈ విభజనను సత్వరము ఆపుచేయవలెను. ప్రతివిభాగమునందు పరిపూర్ణచైతన్యమును దర్శించవలెను. అది బుద్ధిబలముచే ఆలోచించినచో అసంభవము. కాని దాని స్వరూపమదియే! తాత్వికజ్ఞానమును గురించి నేను చెప్పటల్లేదు. అది ఎందుకు పనికిరాదు. కాని నేటి ఉదయము నేను పొందిన దివ్యానుభూతి పరమసత్యము. ఎందుకనగా ఆ అనుభూతి నా ఇంద్రియములందు కలిగినది. నాలో దైవానుభూతి — అద్వైతానుభూతి, ఆనందానుభూతి — దుఃఖానుభూతి, సత్యస్వరూపమును గాంచితిని. ఇది అవాఙ్మానస గోచరము! మాటలకు అందనిది. అద్దానిని స్వయముగా అనుభవించితిని. *ఇందు పూర్ణత్వమును, ప్రతీ అంశమున పరస్పర సహకారమును, సమత్వమును దర్శించితిని.*

పై విధముగ సృష్టిలో సమత్వమును పొందిననప్పుడు ఈ పరిణామ మతిమానసస్థితిలో కలుగును. ఇది మన పంచేంద్రియముల ద్వారా కల్గు మహదానందము మాత్రము కాదు.

ఈ ద్వంద్వస్థితి ఐక్యత నిజమైన చైతన్యమును కూర్చి, చేతనా చేతనలు గుర్తించబడి, నిజమైన చైతన్యానుభూతిని సమ

కూర్చును. అప్పుడు మానవుడు నిజమైన అద్వైతస్థితిని పొందును. అదియే పరమోత్కృష్టమైన శక్తి స్థితి.

ఇదే అనుభూతిని ప్రజలు పొందియుండి ఉండవచ్చును. దానినే ఈ లోకమున సమత్వముగ అనువదించి చెప్పివుండవచ్చును.

సమత్వమనగా ఏకకాలమందు వైరుధ్యరహిత, అవిభాజ్య స్థితి. ఎక్కడ భిన్నత్వముండునో అక్కడే విభజన ఆరంభమగును.

అనువాదము: నేరెళ్ళ లక్ష్మణరావు

ఆద్యంతములు లేవు

మనిషికి తెలిసిన జ్ఞానమెంత? అది పరిమితము. అతని నిత్య కృత్యానికి మాత్రమే సరిపోతుంది. సృష్టి, దైవము మొ॥ గహనమైన విషయాలను గురించి తెలుసుకోనజాలడు. సృష్టి, స్థితి, లయములు మనకు విభక్తములుగా కనబడుతాయి. కాని ఒక దృష్టికి అవన్ని ఒకే లిప్తలో ఒకే ప్రదేశంలో జరుగుతాయి. వాటికి ఆద్యంతముల ప్రశ్నే లేదు! – సంపాదకుడు

The world is a long recurring decimal with Brahman for its integer The period seems to begin and end, but the fraction is eternal; it will never have an end and never had any real beginning

ఈ ప్రపంచం బ్రహ్మమే పూర్ణాంకంగా కలిగి, తిరిగి తిరిగి వస్తూ ఉండే దశాంశభిన్నం. కాలం ఆరంభమై అంతమైనట్లు కనిపిస్తుంది. కాని భిన్నాంకం శాశ్వతం దానికి ఏనాడూ అంతం ఉండదు. దానికి ఎన్నడూ యథార్థంగా ఆరంభం లేదు.

*

The beginning and end of things is a conventional term of our experience; in their true existence these terms have no reality, there is no end and no beginning.

ఆది, అంతము అన్నవి మన అనుభవానికి సంబంధించిన ఆచారసిద్ధమైన పదాలు. నిజస్థితిలో దానికి యథార్థత లేదు ఆదీ లేదు, అంతము లేదు.

*

"Neither is it that I was not before nor thou nor these kings nor that all we shall not be hereafter " Not only Brahman, but beings and things in Brahman are eternal; their creation and destruction is a play of hide-and-seek with our outward consciousness.

"ఇంతకు పూర్వము నేనుగాని, నీవుగాని ఈ రాజులుగాని లేరని కాదు; తర్వాత ఉండబోరు అనీ కాదు". బ్రహ్మ మాత్రమే కాదు. బ్రహ్మలో ఉన్న జీవులు, వస్తువులు కూడా శాశ్వతమైనవే; అవి సృష్టి కావటం, విధ్వంసం కావటం మన బాహ్యాచైతన్యంతో దాగుడుమూతలాట.

శ్రీఅరవిందులు: తలపులు – సూక్తులు

మూలతత్వము మాటల కతీతము

మనం మాటలు ఉపయోగించక తప్పదు కాని అసలు విషయం దొరకకుండా పోతుంది. "శాశ్వతమైన సూత్రం" 'పరమాత్మ' 'దేవుడు' అని మనకు తెలుస్తున్నదానికి ఆదిగాని, అంతంకాని లేదు 'అది ఉంది' అని మాత్రం చెప్పక తప్పదు. కాని సంగతి అది కాదు. ఎందుకంటే అది వ్యక్తానికీ అవ్యక్తానికీ అతీతంగా ఉంది. మనం అర్థం చేసుకోలేనిదీ, అభివ్యక్తిలో గ్రహించతగిందీ 'ఏదో' అది. ఆదీ అంతం లేనిది, అంతం కలిగిన దేనిలోనో అభివ్యక్తం అయింది అంతంకావటానికి రెండే మార్గాలున్నాయి. ఒకటి విధ్వంసంగా కనిపించేది వినాశనం. మరొ

కటి పరివర్తన. అభివ్యక్తి ఇంకా ఎక్కువ పరిపూర్ణమైనప్పుడు వినాశనానికి అవసరం తగ్గిపోతుంది. పూర్తిగా అంతరించిపోయి క్రమాధిక పరివర్తనకు చెందిన ప్రక్రియ దాని స్థానంలో వచ్చే వరకూ ఇలా తగ్గిపోతూ ఉంటుంది. ఈ విధంగా చెప్పటం మాత్రం మానవ బాహ్యాస్థితికి చెందిన విషయము. పదాలు ఎంత అసమృద్ధమో నాకు తెలుసు. కాని అసలు విషయాన్ని మాటల ద్వారా కొంచెమైనా పట్టుకోవాలి. మానవుల ఆలోచనకు అంత కన్నా ఎక్కువగా ప్రకటనకు ఒక క్లిష్టత ఉంది మాటలకు ఎప్పుడూ ఆరంభం అనే భావన ఉంటుంది.

(నిశ్శబ్దం)

సృష్టిలో వ్యాకోచ సంకోచములు

ఈ అభివ్యక్తిని నేను దర్శించాను. వ్యాకోచించటము, సంకోచించటము, వ్యాకోచ సంకోచాలుగల ఒక స్పంద నాత్మకమైన అభివ్యక్తి అని దాన్ని అనవచ్చు. కొత్తరూపాన్ని వహించాలంటే తిరిగి విలీనం కావలసిన అవసరం ఎంతమాత్రమూ లేనంతగా వ్యాకోచం, తరళత, మృదుత్వం, మార్పుపొందే సామర్థ్యం లభించే ఒకానొక సమయం వస్తుంది. అప్పుడు క్రమాధిక పరివర్తన ఉంటుంది. ఇది ఏడవ విశ్వసృష్టి అనీ, ఆరు ప్రళయాలు ఇదివరకే సంభవించాయనీ. ఇది ఏడవ సృష్టనీ, తిరిగి విలీనం కాకుండానే ఇది తన్ను తాను పరివర్తన చేసుకోగలదనీ చెప్పిన ఒక గూఢజ్ఞుడ్ని నేను ఎరుగుదును – దీనికి ఎటువంటి ప్రాముఖ్యతా లేదని వేరే చెప్పవలసిన పని లేదు. కారణం శాశ్వత చైతన్యం లభించినప్పుడు ఇలా ఉందా, అలా ఉందా అనేది అప్రస్తుతం అవుతుంది.

నిత్యత్వమును అనుభూతిచెందుట

కేవలం పరిమిత మానవచైతన్యంలోనే ఈ తీవ్రవాంఛ లేదా అంతం లేనిదేదో కావలసిన అవసరం ఉంటుంది. ఎందుకంటే శాశ్వతత్వానికి చెందిన స్మృతి అనదగినదేదో అంతర్గతంగా ఉంది. ఈ శాశ్వతత్వ స్మృతి, శాశ్వతత్వంలో పాలుపంచుకోటంకోసం అభివ్యక్తిని ఆకాంక్షిస్తుంది. అయితే ఈ శాశ్వతత్వభావన మనలో చురుకుగా ఉంటే దుఃఖిం

చము! పాడైపోయిన బట్టలను పారవేసినప్పుడు మనం దుఃఖ పడము గదా! దానితో మనకు అనుబంధం ఏర్పడి ఉండవచ్చు. అయినా సరే మనం దుఃఖించము! ఇదీ అంతే. ఒక విశ్వము అంత ర్థానం అయిందీ అంటే దాని కర్తవ్యాన్ని అది పూర్తిగా నిర్వర్తిం చిందనీ, తన పరిణతి అంతిమదశకు చేరిందనీ, దాని స్థానంలో మరొకటి రావలసి ఉందనీ అర్థం.

అసలు బాహ్యావాస్తవీకరణలో ఉన్న ఆనందంకోసం అభి వ్యక్తి జరిగింది. అది ఆనందమా, ఆసక్తా? ఒకసారి ఆకృతి ధరిం చిన దానికి కొత్తశక్తులు నిరంతరం మూసపోయటానికి వీలైన మృదుత్వం, స్వీకరణశక్తి, మెత్తదనం ఉంటే దానినే తిరిగి చేయటం కోసం ప్రతిదాన్నీ విచ్ఛిన్నం చేయవలసిన అవసరం ఇక ఉండదు.

"దేనికి మొదలు ఉంటుందో దానికి చివరకూడా ఉండి తీరుతుంది." తప్పనిసరిగా నిజంకావలసిన అవసరంలేని మానవ మానసిక నిర్మాణాలలో ఇదీ ఒకటిగా కనిపిస్తుంది. కాని ఆత్మా శ్రయ (subjective) దృష్టినుంచి ఆసక్తి కలిగించేదేమంటే ఉన్నత స్థాయినుంచి చూచినప్పుడు, ఇంకా కచ్చితంగా చెప్పాలంటే, ఎక్కు వగా కేంద్రబిందువునుంచి చూచినప్పుడు, సమస్యకుగల తీక్షణత క్రమంగా తొలిగిపోతుంది.

ఇది "సూత్రం" కాదు. ఎందుకంటే ఇది సూత్రంలాగ లేదు. వ్యక్తికైనా ప్రపంచాలకైనా విశ్వాలకైనా ధర్మం ఒకటే అని కన పడుతుంది.

అనువాదం తెన్నేటి పూర్ణచంద్రరావు

**Creation took its first mysterious steps,
It made the body's shape a house of soul
And Matter learned to think and person grew;
She saw Space peopled with the seeds of life
And saw the human creature born in Time.**

Sri Aurobindo (*Savitri*, p. 477)

మానవుని భవిష్యత్తు

పరిణామ ప్రక్రియద్వారా సృష్టి ముందుకు సాగిపోతూ ఉంటుంది. జంతువునుంచి మనిషి ఆవిర్భవించినట్లుగా ఇప్పుడు మనిషిలో నుంచి అతిమానవుడు ఆవిర్భవింపబోతున్నాడు. ఈ మార్పులు ఎలా జరుగుతాయి? భగవంతుడు ఆదేశిస్తాడు. పైనుంచి ఒక శక్తి దిగివస్తుంది. పూర్వము మానసికశక్తి దిగివచ్చి జంతువులను ప్రేరేపించింది. ఇప్పుడు అతిమానసికశక్తి దిగివచ్చి మనుషులను ప్రేరేపిస్తోంది. మనమా శక్తిని గ్రహించి మనలో క్రియాశీలము చేసినయెడల మనం కూడ ఈ పరిణామకార్యక్రమంలో పాల్గొనగలుగుతాము.

— సంపాదకుడు

భగవంతుడు ఈ సృష్టిలోని ప్రతివస్తువులోను ఉండకపోయినట్లైతే ఈ సృష్టి ఆయన చేయగలిగేవాడు కాదు. అంటే ఏమిటి? మూలతః ఈ సృష్టి దివ్యమే. ఈ ప్రపంచమూ దివ్యమే. అందుకని ఎప్పుడో ఒకప్పుడు ఆ భగవంతుడు తెర వెనుకనుండి బయటకు వచ్చి నిజరూపంలో అభివ్యక్తమౌతాడు.

ప్రపంచంలో దైవము అభివ్యక్తమగుట

ఇంతవరకు అభివ్యక్తమైన ఈ ప్రపంచంలో దేవుడు మరుగునపడి ఉన్నాడు. అయితే ఆయన అభివ్యక్తి అనంతంగా, ఎడతెరిపి లేకుండా జరుగుతూనే ఉంటుంది. ఇప్పటివరకు వ్యక్తమైన మానసికలోకానికి ప్రతినిధి మానవుడు. తదుపరి ఘట్టము అతిమనస్సు. అనగా మనస్సుకంటే అతీతమైనది. ఇది చాలా గొప్ప పరిణామము. ఎందుకంటే ఇంతవరకు జరిగిన సృష్టి అంతా అపరార్థగోళమునకు చెందినది. అజ్ఞానాంధకారమైన ఈ సృష్టి అచేతన (Inconscient) పర్యవేక్షణ క్రింద జరిగింది. కాని ఇప్పుడు జరగబోవునది మరియొకటి. అది పరార్థగోళమునకు చెందినది. దానికి మూలము అజ్ఞానము కాదు. సత్యము.

అతిమానసము ఆవిర్భవించుట

ఒకానొక లోతైన దృష్టికి ఈ నూతనసృష్టి పాతదానిలో గర్భితమై యున్నది. ఈ ప్రపంచపు అగాధాలలో అదృశ్యంగా, అవ్యక్తంగా, అప్రకటితంగా దాగివున్నది. ఆయినప్పటికి దానిని ప్రేరేపించి క్రిందికి దింపాలి. పైనుంచి అతిమానసిక చైతన్యం (supramental) అతిమానసికశక్తి దిగివస్తేగాని అది సాధ్యము కాదు. ఒక ఏడాదిన్నర క్రిందట అదే జరిగింది. దాని ప్రభావమువలన జాగృతమై జడపదార్థపు లోతులనుంచి దాని ప్రతిబింబము బహిర్గతమై సృష్టిలోకి ప్రవేశిస్తుంది. ఇప్పుడదే జరుగుతోంది. కాని నేను 15 రోజుల క్రితం చెప్పినట్లు నేటి ప్రపంచములో పేరుకుపోయిన జడత్వము చాలా బలంగా ఉండి ఆ అతిమానసికశక్తిని కబళించి వేసింది. మళ్ళీ దీర్ఘమైన సాధనచేసి ఆ జడత్వాన్ని పొగొట్టినప్పుడు గాని మనకు అతిమానసజ్యోతి కనబడదు. ఇప్పుడదే జరుగుతోంది.

దోషములను పరిహరించుట

మనిషి అనగా దోషముల పుట్ట. ఈ మాలిన్యాలన్నీ అడ్డుతగిలి మనిషిని వెనక్కు లాగుతూ ఉంటాయి. కాని మనకిప్పుడు కావలసినది సత్యము. తీవ్రమైన ఆకాంక్షతో, హృదయాన్ని దహించివేసే ఆర్ద్రతతో నీ శక్తినంతా ఉపయోగించి రాబోవు ఉజ్వలభవిష్యత్తులోకి దూకాలి. నీలోని దోషాలన్నిటిని పరిహరించి దేవునిమీద భారంవేసి శరవేగంతో పురోగమించెదవు గాక. పైనుంచి దిగివచ్చిన అతిమానసశక్తిని గుర్తించటమే కాకుండా దానిని నీలో వహించి నూతన సృష్టిలో పాల్గొనెదవు గాక.

మనమొక దివ్యమూహూర్తమునందున్నాము

ఈ సంగతిని ఎప్పటికి విస్మరించరాదు. కాని మనుషులు మనుషులే కదా! నిత్యకృత్యంలో పడిపోయి అసలు సంగతి మరచిపోతారు. కాని మనమొక అపూర్వఘడియయందున్నాము. నీ ఎదురుగుండా బంగారు ద్వారాలు తెరవబడి ఉన్నాయి. ఆ ద్వారాలు బంగారు

భవిష్యత్తుకు మార్గము. ఒక నూతనసృష్టి ఆగమనమును వీక్షించుట ఎంతటి అదృష్టము! మన అవరోధాలైన పాత అలవాట్లను, పోకడలను, పనికిరాని పాతభావాలన్నిటినీ నిర్మోహమాటంగా పరిత్యజించాల్సిందే.

నిత్యము జ్ఞాపకముంచుకొనుట

నువ్వొక మహాసత్యాన్ని దర్శించావు. ఈ విషయాన్ని మరచిపోకుండా అనుక్షణం గుర్తుచేసుకుంటూ ఉండాలి. ఈ అద్భుతాన్ని నిద్రలో కూడా స్మరించుకుంటూనే ఉండాలి. మళ్లీ మేల్కొన్నప్పుడు కూడ ఆ భావనయే నీ మనస్సులో కదలాడుతూ ఉండాలి. ఈ నేపథ్యంలోనే నువ్వు ఊపిరితీయటం, పనులు చేయటం, ఒకటేమిటి – సర్వకార్యములు ఒక నూతనసృష్టిని అభిమంత్రింప చేయుచున్నాము అనే ఉద్దేశ్యంతోనే నిర్వర్తించాలి.

మన మిందులో పాల్గొనవలసిందే. ఈ నూతనసృష్టి నిర్మాణంలో మనము కూడ ఒక భాగము కావలసిందే నిజము చెప్పాలంటే ఇంత అద్భుతమైన అవకాశము వచ్చినప్పుడు నీ పాత అలవాట్లన్నిటిని పరిత్యజించాల్సిందే.

*

మనుషులకు తెలివితేటలు ఎక్కువ అవుతున్నాయి దేవుడికి బుద్ధి లేదుట. పొరపాటున ఈ ప్రపంచాన్ని చేశాడుట. కామన (కోరిక) వలననే ఈ ప్రపంచాన్ని సృష్టించాడు. తనను తాను అభివ్యక్తపరుచుకోవాలని, తనను తాను తెలుసుకోవాలని, అనుభవించాలని ఈ సృష్టి చేశాడు. అంటే కోరికలే ఈ సృష్టికి మూలము. కోరికలు మానేస్తే ఈ పీడ విరగడైపోతుంది!

కాని దేవుడు ఎంత హాస్యగాడో నీకు తెలియదులే. ఈ వినోదకార్యక్రమము ఇంకా పూర్తి కాలేదయ్యా – దీని చరమ ఘట్టము ఇంకా రానున్నది దానిని చూసినట్లయితే నీ అభిప్రాయాన్ని తప్పకుండా మార్చుకుంటావు.

అనువాదము: డి. సత్యవాణి, డా॥ ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి

5/7/02

సృష్టి – సృష్టికర్త (II)

శ్రీమాత ప్రవచనములు

అఖిల

అఖిల భారత పత్రిక

జూలై 2002

సృష్టి – సృష్టికర్త (II)

శ్రీమాత ప్రవచనములు

5/7/02

విశ్వం విశ్వేశ్వరుని అభివ్యక్తి

ఈ ప్రపంచంయొక్క బాహ్యారూపాన్ని చూసి నువ్వు మోసపోయేవు జాగ్రత్త! ఇక్కడ బ్రహ్మాండమైన శక్తి పనిచేస్తోంది. ఇందలి వస్తువులు, సమస్తమైన సన్నివేశములు పరమ సత్యము, ప్రేమానందములను నెరవుటకు సాధనములు. ఈ విషయాన్ని నువ్వుకూడ గుర్తించాలి. ఈ మహాకార్యంలో నీ పాత్రను వహించాలి. ఈ దృష్టితోనే నువ్వీ ప్రపంచాన్ని చూడాలి. ఏ ఒక్క ఘటననీ తేలిగ్గా తీసిపారేయకూడదు. ఈసడింపు పనికిరాదు.

— సంపాదకుడు

భౌతికస్థితిలో అందంగాను, మానసికస్థితిలో జ్ఞానంగాను, ప్రాణాధార (vital) స్థితిలో జీవశక్తిగాను చైత్య (psychic) స్థితిలో ప్రేమగాను దివ్యత్వం ప్రకటితమౌతూ ఉంటుంది. మనం మరింత ఎదిగి పరిణతితో ఆలోచిస్తే ఈ నాలుగుస్థితులు పరస్పరం ఒకే ఒక దివ్య చైతన్యంగా సమ్మిళితమై ప్రేమమయం, జ్ఞానమయం, శక్తిమయం, సౌందర్యమయం, సర్వవ్యాపకమై భాసిస్తోందని అర్థమౌతుంది. ఈ విశ్వలీల కొనసాగుటకై ఒకే ఒక దివ్యచైతన్యం ఇన్ని విధాలుగా విభజింపబడి ప్రకటితమౌతోందని మనం తెలుసుకుంటాము.

*

సత్యము లోతైన దృష్టికి గోచరము

బాహ్యంగా కనిపించే స్థూలదృష్టిని పక్కకు పెట్టి లోతుగా ఆలోచిస్తే, సత్యము, నిత్యము అయిన భగవంతుని దివ్యశక్తిని వెల్లడించడానికే అన్ని సంఘటనలు, పరిస్థితులు ఏర్పడుతూ ఉంటాయనేది పరమసత్యము.

అందుచేత కనిపించే భౌతికప్రపంచంలోని ప్రతి వస్తువులోను, జీవరాసిలోను “నేను ఉన్నాను” అనే మనోహరమధుర భావనను మనం ఎలుగెత్తి చాటాలి. ప్రకటితం చేయాలి. చూస్తున్న ప్రతివస్తువులోను ప్రతి ఒక్కరిలోను “నేనే ఉన్నాను” అనే మధుర

భావన హృదిలో చోటుచేసుకున్నప్పుడు, ఒక సుందర ఆనంద మయ జగత్తును ఆవిష్కరించిన వారమవుతాము.

*

అణువణువులోను దైవసాన్నిధ్యము

ప్రతి అణువులోను, ప్రతిజీవిలోను, సోదర మానవాళిలోను భగవంతుడు నిండి నిబిడీకృతుడై ఉన్నాడు అనే సర్వాత్మభావం వెల్లివిరిసినప్పుడే అజ్ఞానాంధకారం పటాపంచలై మహోన్నత సమతాభావాల ఉషోదయం జగత్తంతా విస్తరించి భేదాల బాధలను తొలగించి, భువిలో దివ్యసామ్రాజ్యస్థాపనకు ద్వారాలు తెరుస్తుంది. అన్నింటిలో భగవంతుడు అంతర్యామిగా ఉన్నాడు – అనే భావన వెల్లివిరిసినప్పుడు మనం కోరుకున్న గొప్ప మార్పు ఆవిష్కరించబడుతుంది.

*

ప్రశ్న: అంతటా నిండివున్న దివ్యత్వము, చెత్తకుండీలో కూడా ఉన్నదా?

జవాబు: జగత్తంతా బ్రహ్మముయొక్క వ్యక్తీకరణమే. సర్వం బ్రహ్మమయమే. ఈ జగత్తులోనికి ప్రవేశపెట్టబడిన ప్రతిజీవి జగత్పిత అయిన భగవంతునినుండి ఆవిర్భవించిన కుసుమమే. మొదట్లో విస్మరించినా, కాలక్రమంలో దివ్యచైతన్యం వైపు మెల్ల మెల్లగా అడుగులు వేసుకుంటూ పయనం సాగిస్తుంది.

*

ఈ సృష్టి భగవంతునినుండి, భగవంతునిచేత రూపుదిద్దుకొన్నది; అణువణువునా ఆయన వ్యాపించి ఉండటమేకాక, "సర్వం తానే అయి ఉన్నాడు" అనే పరమసత్యాన్ని ఒక్క క్షణంకూడా మనం మరువరాదు. ఆయన సృష్టించిన వస్తురూపాలలో, వైఖరిలో భేదాలు ఉండవచ్చు. కానీ అంతటా ఆయనే ప్రకాశిస్తున్నాడు అనే పరమ సత్యాన్ని మనం విస్మరిస్తే, సర్వాన్ని విస్మరించినట్లు కాగలదు.

*

జగత్తులో ఆవిర్భవిస్తున్నది దైవమేకాని అన్యము కాదని సర్వ మానవాళి తెలుసుకొను గాక.

అనువాదం: చదలవాడ వెంకటశేషయ్య

సృష్టి – సృష్టికర్త ఒకటే! వేరు కాదు

ఈ ప్రపంచంలోని దుఃఖాన్ని చూస్తూ ఉంటే భగవంతుడు ఎందుకిలా చేసాడు? అతనొక రాక్షసుడేమో అనిపిస్తుంది. కాని నిజానికి భగవంతునికి, అతని సృష్టికి భేదం లేదు. తనను తానే మరుగుపరచుకొని గుడ్డివాడల్లే అయినాడు. నువ్వు నీ కళ్లకు గంతలు కట్టుకుంటె ఏమి కనపడదు కదా! దేవుడు కూడ కావాలని ఈ అజ్ఞానావతారాన్నెత్తాడు. క్రమవికాసము చెంది తిరిగి తన పూర్ణరూపాన్ని పొందుతాడు. అదే నీ ప్రస్తుత స్వరూపము.

– సంపాదకుడు

మొదట శిల్పి. ఆ తర్వాత శిల్పము. శిల్పి లేకుంటే శిల్పము లేదు. శిల్పము లేకపోతే శిల్పికి గుర్తింపు రాదు. శిల్పి – శిల్పము, సృష్టి – సృష్టికర్తల మధ్య ఆత్మీయత, అనుబంధము ఉన్నవి.

భగవంతుడు ఒక రాక్షసుడా?

భగవంతుడు సర్వశక్తిసంపన్నుడు. అనుకొన్నది చేసితీరే చండశాసనుడు. ఆయన మాటకు తిరుగు లేదు. ఆయనొక బ్రహ్మ రాక్షసుడన మాట! ప్రపంచాన్ని తన ఇష్టం వచ్చినట్లు సృష్టిస్తూ, సమస్యలు కల్పించి, ప్రాణులు బాధపడుతుంటే ఏమాత్రం పట్టించుకోకుండా చిరునవ్వులు చిందించే ఆయనను రాక్షసుడనక ఏమంటాము! ఇది నా అయిదుసంవత్సరాల వయస్సులో భగవంతుణ్ణి గురించి కలిగిన భావన. ప్రతివ్యక్తీ తానున్న స్థాయినిబట్టి ఆలోచిస్తుంటాడు. ఆధ్యాత్మికంగా కొంత స్థాయికి ఎదిగాక, అవగాహన ఏర్పడ్డ వెనుక మరోవిధంగా ఉంటుంది ఆలోచన. తొలుత మనకు సంకుచితమైన ఆలోచనలే వస్తాయి. ఎదగని దశ అది.

భగవంతుడికి కూడా తన లక్షణాలే ఉంటాయని ఊహిస్తాడు మానవుడు. ఆయన కూడా మానవుడే, మానవుడిలాంటి వాడే అనుకొంటాడు. అయితే ఆయన ఆల్ పవర్‌ఫుల్, సూపర్ పవర్‌ఫుల్ అని భావిస్తాడు.

భగవంతుడీ భూప్రపంచాన్ని సృష్టించాడు. తాననుకొన్నది ఆచరణలో పెట్టాడనుకొందాము. అజ్ఞానము, జడత్వము, దుష్ట సంకల్పము, వ్యాధి, బాధలు, విచారము కల్పించాడు. వీటన్నిటి తోబాటు బాధలు భరించలేక బావురుమనే మానవుల్ని కూడా సృష్టించాడనుకొందాము. బాధ భరించలేక ఆ జనావళి ఆహా! ఆనందానికి దూరమవుతున్నాము. ఏ కొద్ది నిమిషాలో మాత్రమే ఆనందాన్ని అనుభవిస్తున్నాము. మిగిలిన రోజంతా సుఖము దుఃఖ మూకాని అయోమయావస్థలో, జీవచ్ఛవంలా గడుపుతున్నాము అని వాపోతుంటారు.

ఇదండీ ఆయనగారి సృష్టి! నరకమంటే ఇంతకంటే వేరేం కావాలి? ఇంతటి శక్తిసంపన్నుడు – కష్టాలూ, కన్నీళ్ళూ తప్ప వేరొకటి సృష్టించటల్లేదంటే ఆయన్ని రాక్షసుడనికాక భగవం తుడని ఎలా అనగలం? ఎనటోల్ ఫ్రాన్స్‌గారితో ఏకీభవించి, మనం కూడా ఆయన్ని (భగవంతుణ్ణి) క్రూరాతిక్రూరుడని, భయం కరాతి భయంకరుడని ఆడిపోసుకుందామా?

సృష్టి, సృష్టికర్త వేరు కాదు

భగవంతుడు ఇలా పరమ దుర్మార్గుడు, క్రూరుడు, దుందుభి అనే భావన ఏర్పడ టానికి కారణం – భగవంతుడూ, ఆయన కల్పించిన సృష్టి రెండు వేరువేరని భావించడమే! భగవంతునికీ, జగత్తుకూ భేదం లేదని గ్రహిస్తే మన అనుభూతి మరోవిధంగా ఉంటుంది. మన బాధే భగవంతుని బాధ అవుతుంది. మనకు తెలియనిది ఆయనకూ తెలియనిదే అవుతుంది. ఈ సృష్టి ద్వారా, ఈ జీవుల ద్వారానే ఆయన తనను తాను దర్శించగలుగుతాడు. మెల్లమెల్లగా తనతో తాను మమేకం చెందుతాడు. తనను తాను అనుభూతికి తెచ్చుకొంటాడు. అర్థం చేసుకొంటాడు. తనను తాను అభివ్యక్తపరచుకొంటాడు. ప్రపంచమంతా ఆయన నియంతగా, నియమనిబంధనా రహితంగా, కసిగా, కక్షగా, ఆలోచనారహి

తంగా చేసిన ఏర్పాటు కాదనీ, అది ఒక అభివృద్ధి ప్రణాళిక అనీ అర్థమవుతుంది. అవగాహనకు వస్తుంది[1] .

అందరిలో తానుగా, తనలో అందరుగా, సమిష్టి సాధన సాగించిన నాడు, బృందజీవనము సాగించిననాడు, మనకు ఆత్మ జ్ఞానము లభిస్తుంది. ఆత్మదర్శనము కలుగుతుంది. విజ్ఞానభావ నకు చేరువవుతాము. దానినుండి దూరం కాకుండా ఉంటాము. తొలిసంకల్పంతో, తొలివెలుగుతో ఏకీభవిస్తాము, ఏకమవుతాము.

అప్పుడు సమస్య సమస్యగా ఉండదు. పరమపరుషునికి మనకు పునస్సంధాన మేర్పడి జీవితము ఆనందప్లావితమవుతుంది.

అనువాదం: దయానిధి

అఖండకాలంలో అనంత వైభవం

నీ అనంత వైభవాన్ని ఎవరు వర్ణించగలరు? నీ అద్భుతాలను ప్రదర్శించేందుకు ఈ విశాల విశ్వం కూడ సరిపోదు.... ఈ ప్రపంచం పరివర్తనాశీలమైనది. నిరంతర పరిణామము దాని లక్షణము. నువ్వు కూడ అందులోని భాగానివే కనుక నువ్వు

---

[1] ఒక మహాపండితుడు నడివేసవిలో ప్రయాణం చేస్తున్నాడు. ఓ పెద్ద మర్రి చెట్టు నీడన విశ్రమించాడు. "దేవుడు అంతగా తెలివికలవాడు కాడు! లేకుంటే ఇంత పెద్ద మర్రిచెట్టుకు అంత చిన్నకాయలు పెట్టటమేమిటి?" అనుకొంటూ నిద్రకు ఉపక్రమించాడు. గాలి బాగా వీచింది. కొంతసేపటికి మెలకువవచ్చింది. తన చుట్టూ, తన మీద కూడా కుప్పలు తెప్పలుగా మర్రికాయలు పడివుండటము గమనించాడు. "ఓరి నాయనో! భగవంతుడు ఈ చెట్లకు నేననుకొన్నట్లే పెద్దకాయలు పెట్టివుంటే నేనీపాటికి పచ్చడి పచ్చడయిపోయి ఉండేవాడినే!" అని వాపోయాడు. భగవంతుడు ఆలో చించే ఈ పెద్దచెట్టుకు చిన్నకాయలు పెట్టాడు అని అర్థం చేసుకొన్నాడు. భగవంతుడు చాలా ఆలోచనాపరుడు. అయన చేసే ప్రతిపనికీ అర్థము, పరమార్థమూ ఉంటాయనే నిర్ణయానికి వచ్చాడు. తన తెలివితక్కువతనా నికి సిగ్గుపడ్డాడు కూడా! — అనువాదకుడు

నీ చుట్టూ గిరిగీసుకొని కూర్చోకూడదు. నీ లక్ష్మణరేఖను దాటి బయటపడి విశాల విశ్వంలోకి ప్రవేశించాలి. — సంపాదకుడు

మహాప్రభో,

నీ అపారమైన నీ అనుగ్రహమును, ఘనకీర్తిని వెయ్యినోళ్ళ శ్లాఘించగలవా? నీ పరిపూర్ణ చైతన్యమును, ప్రేమభరిత నిరతిశయ ఆనందమును మాటలతో కీర్తించగలమా?

నీ అనిర్వచనీయమైన శాంతిని, గంభీర మౌనమును, సర్వశక్తి సమన్విత సత్యమును ఎట్లు స్తుతించగలము, గానము చేయగలము?

ఈ సమస్తప్రపంచము, నీ దివ్యత్వమును, నీ మహిమలను ప్రదర్శించుటకు చాలదు. కాని అనంత కాలంలో ఆ పనిని ఇంకా ఎక్కువగాను, ఇంకా సమర్థవంతంగాను చేయటానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నది.

సమస్తవ్యక్తప్రపంచము నిరంతరం మారుతూనే ఉంది. ఏ క్షణంలోనూ అది పూర్వంవలె ఉండదు. పరస్పర సామరస్యం సంపూర్ణంగా అభివ్యక్తమవుతూనే ఉంది. కాబట్టి ఈ ప్రపంచంలో ఏదీ కూడా ఇంతకు ముందు ఉన్నట్లుగా లేదని అర్థమౌతోంది. చూడటానికి భేదం కనిపించకపోయినా అన్నీ ఎల్లప్పుడూ పురోగతి చెందుతూనే ఉన్నవి. సమభావన ఇంకా ఎక్కువగా సమత్వం సంతరించుకొంటున్నది. సత్యం అభివ్యక్తమౌతూ ఇంకా ఎక్కువ సత్యంగా మారుతోంది. అయితే అది గుర్తించటానికి సమస్తమును ఒకేసారి పరిశీలించి చూడాలి. కాని మానవుడు సమస్తమానవ లోకమును ఏకధాటిని అవలోకించ లేకపోతున్నాడు. అతడు చూడగలుగుచున్నది తన సంకుచిత వ్యక్తిగతప్రపంచం మాత్రమే. మరి అటువంటప్పుడు మనిషికి సరైన అవగాహన ఎలా కలుగుతుంది?

మొత్తానికి ప్రపంచం ముందుకే సాగిపోతోంది. పైనుంచి ఒత్తిడి ఎక్కువ అవుతున్నకొద్దీ మనిషి చైతన్యవంతుడవుతాడు. ఒక్క మనిషే కాదు. సృష్టియందెల్లడలా అది ప్రతిబింబిస్తుంది.

అభివ్యక్తి సచేతనమవుతుంది. అప్పుడు సత్యాన్ని పైనుంచి ఇంకా ఎక్కువగా గ్రహించడం, ఇంకా ఎక్కువగా అభివ్యక్తపరచడం జరుగుతాయి.

అనువాదం: డా॥ కోట వేంకటేశ్వరరావు

ఈశ్వరుడెవరు?

ఈశ్వరుడు పరిపూర్ణ చైతన్యము, సర్వాంతర్యామి
పరిపూర్ణ చైతన్యమే సర్వాంతర్యామి.
ఈశ్వరుడే సర్వాంతర్యామి.
ఈశ్వరుడెవరు? పరిపూర్ణ చైతన్యము.
ఈశ్వరుడే పరిపూర్ణ చైతన్యము, సర్వాంతర్యామి.

*

ఈశ్వరచైతన్యం కాక వేరే చైతన్యం లేదు.
ఈశ్వరేచ్ఛ కాక వేరే ఇచ్ఛ లేదు.
ఈశ్వరజీవనం కాక వేరే జీవనం లేదు.
ఈశ్వరరూపం కాక వేరే రూపం లేదు. అది ఒక్కటే. అదే సర్వమూ (సమస్త విశ్వమూ).

*

ఈ ప్రపంచంలో జరిగే చేష్టలన్నీ ప్రత్యక్షంగా ప్రకృతికతీతమైన ఈశ్వరేచ్ఛకు లోబడే జరుగుతాయి. కాని చాలామందికి అది తెలియదు.

*

అభివ్యక్తిలో అవరోధాలన్నింటిని అధిగమించటం జరుగుతుంది. ఎందుకనగా అభివ్యక్తి అనగా అవరోధాలను అతిక్రమించుటయే.

*

విశ్వంలోని అద్భుతాలకు అంతమే లేదు. మన అల్పాహంత పరిధులను దాటగలిగితే ఈ అద్భుతాలు వాటంతట అవే మనకు గోచరిస్తాయి.

హృదయాంతరనాదం వినగలిగేవాడికి యావత్ప్రపంచమూ బ్రహ్మ బోధ చేస్తుంది.

అనువాదం: డా॥ కోట వేంకటేశ్వర రావు

భౌతికంలో దైవసాక్షాత్కారం

తపోధ్యాన నిరతుడైన యోగి దర్శనానుభూతులను పొందుతాడు. ఉన్నతలోకాలను దర్శిస్తాడు. కాని కళ్లు తెరవంగానే అంతా మామూలుగానే ఉంటుంది. భౌతికప్రపంచం ఇంకా మారలేదు. సాధన మరో స్థాయికి జేరినప్పుడు అది కూడ జరుగుతుంది. మన చుట్టూ ఉన్న వస్తువులు, గాలికూడ మారిపోతాయి. భౌమత్వం పోయి దివ్యత్వం రాణిస్తుంది. – సంపాదకుడు

భౌతికస్థాయిలో సాక్షాత్కారము

మొన్న రాత్రి నాకొక అనుభూతి కలిగింది. ఒక వ్యక్తి (అతని పేరు నేను చెప్పను) నాతో ఇలా అన్నాడు. "నేను పూర్తిగా దైహికచైతన్యంలో కూరుకుపోయి ఉన్నాను. దైవం నాకు ఎక్కడో ఆకాశంలో దూరమైపోయాడు". ఈ విధంగా అతను చెప్తూంటే ఆ క్షణంలోనే గదంతా దైవత్వం ఆవరించినట్లయిపోయింది. "లేదు బాబూ! అక్కడెక్కడో కాదు. ఇక్కడే మన దగ్గరే ఉన్నాడు" అన్నాను. అంతటితో వాతావరణమంతా దైవంతో నిండిపోయినట్లే అనిపించింది. ప్రతిదీ ఆ దివ్యస్పర్శను పొందుతూ (శ్రీమాత తన దేహాన్నంతా స్పృశిస్తూ) అంతా ఆ దివ్యత్వాన్ని అనుభవిస్తున్నట్లయింది. అక్కడున్న ఆ విశిష్ట పదార్థం మిరుమిట్లుకొలుపుతున్న కాంతిపుంజము, ఒక అద్భుతమైన ప్రశాంతత (శ్రీమాత ఒక గంభీరతను సూచిస్తూ) అది ఒక శక్తి, ఒక మధురాతి మధుర భావన; అది పాషాణాన్నైనా కరిగించగలదనే నమ్మకం ప్రతి వారికీ కలుగుతుంది.

అది కరిగిపోకుండా అలాగే ఉండిపోయింది.

శరీరంలో పరంజ్యోతి

ఆ రాత్రంతా ఉండిపోయింది. ఇప్పుడు కూడా అవి రెండూ అలానే ఉన్నాయి. కొంత అనాలోచితమై, సామాన్యచైతన్యమే అయినా, కాస్త నిదానించి ఏకాగ్రతగా దృష్టి నిలిపిచూస్తే అది అక్కడే ఉన్నట్లు తెలిసింది. అది జ్ఞానేంద్రియానుభవమే. పదార్థం ఎంత ప్రత్యక్షమో అంత ప్రత్యక్షంగా ఉంది ఆ దైవసంస్పర్శ. దానిముందర మనం ఎండిపోయిన వరుగల్లే ఉన్నట్లనిపించింది. అలా ఎండి, ముడుచుకుని ఉండటంవల్లనే ఆ దివ్యసంస్పర్శను పొందలేకపోతున్నాము. అందువల్లనే నీకు తెలియడంలేదుగానీ అంతటా దైవం పరివ్యాప్తమై ఉన్నాడు. అంతా ఆ తత్పదార్థం తప్ప మరేమీ లేదు. మనం శ్వాసించేది ఆ పరతత్వాన్నే. మనం తిరుగాడుతున్నది పరదైవతంలోనే. మనమే కాక సమస్తమైన జగత్తూ ఆ పరమాత్మలోనే ఉంది. నేను ఆలోచిస్తున్నది మన అశక్తతగురించే. ఏం చేస్తే ఈ జడత్వము నిస్సారత పోయి భగవంతుని ఉనికిని తెలుసుకోగల్గుతామో? అది చేయగలిగితే అమోఘంగా ఉంటుంది కదా!

పైకి పోనవసరం లేదు

ఆయనతో సంభాషిస్తుంటే అనేక విషయాలు చెప్పారు. నేను ఇలా అడిగాను. "అంతటా నీవే నిండి ఉన్నప్పుడు జనం నిన్ను వెతుక్కుంటూ ఎక్కడెక్కడికో వెడతారెందుకూ?" అలౌకిక దరహాసంతో ఆయన ఇలా అన్నారు. "నేనెక్కడో దూరంగా, వారి చైతన్యానికి అందనట్లుగా ఉండటమే వారిక్కావాలి. అందువల్ల అలా ఊహించుకొని వెతుక్కుంటారు". ఆయన ఇన్ని మాటలతో వివరించలేదు కానీ నాకు అర్థమైంది అది. "అంతటా నిండి ఉన్నదేదో నీలో కూడా ఉంది" అని చాలామంది నిర్ధారించారు. నీలోనే ఉన్న దాన్ని వెతుక్కుంటూ ఎక్కడికో వెళ్ళటమెందుకు? అని అడిగే వారూ లేకపోలేదు.

ఆయన సర్వవ్యాపి.

ఆయన అంతాటా నిండివున్న భావన నీకుంటుంది. అంతటా భగవంతుడే. ఆయన కానిది ఏదీ లేదు. మనం శుష్కించిపోవడంవల్ల మనకి అది తెలియడం లేదు. అది అర్థమయ్యేటట్లు ఎట్లా విడమరచి

చెప్పాలో నాకు తెలియటల్లేదు. మనం ఎంతో కష్టపడి ఆయన నుండి విడిపోయాము. అయితే అది చైతన్యానికి సంబంధించినంత మాత్రమే. వాస్తవానికి కాదు. అంతటా ఆయన నిండి ఉన్నప్పుడు విడదీసుకోవడం ఎలా? మనకి తెలిసినది, మనం చూసేది అంతా ఆయనే. ఇందుగలడందులేడని సందేహాము వలదు. స్పృశించేదంతా తత్పర్థామే. ఆ సర్వాంతర్యామిలో మనం మునిగి తేలుతున్నాము. కాబట్టి దానిలోనే ఇటూ అటూ సంచరించవచ్చు. విడిపోయామనుకునేది ఈ మాయదారి మనస్సే. (శ్రీమాత నుదుటిని చూపిస్తారు)

స్వేచ్ఛానువాదం: అ. ప్రభావతి, అ. వెంకటరామశాస్త్రి

సృష్టిలోని వికృతాలకి కారణం, నివారణోపాయం

అఖండచైతన్యం ఖండమైంది. మహాభూతప్రకృతి అణువణువులుగా చీలిపోయింది. మూలమునుండి వేరైంది. ఎందుకని? అలా జరగని యెడల వ్యక్తిత్వ మేర్పడదు. మనిషంటూ ఉండడు. స్పష్టమైన ఆకారములేని గంజిలాంటి పదార్థమే ఉంటుంది. ఏ విధమైన పురోగమనానికి ఆస్కారముండదు. ఒక కేంద్ర వ్యక్తిత్వ[2] *మేర్పడినప్పుడే గదా తిరిగి మూలరూపాన్ని పొందే కార్యక్రమము మొదలవుతుంది.* — సంపాదకుడు

భౌతికప్రపంచంలో ప్రకటింపబడిన ప్రతిదానికి మూలం పరమసత్యమైనప్పుడు, అది ప్రకటింపబడే సమయంలో

---

[2] That wakes kinetic in earth's dullard slime
And carves a personality out of mud,
(*Savitri*, p. 33)

దానిని వికృతపరచేది ఏది? అసలీ వికృతరూపాలు ఎందుకున్నాయి?

మూలంనుండి వేరగుట

దానికి కారణం మూలానికి అభివ్యక్తికి మధ్య కొన్ని శక్తుల జోక్యం. నేను మిమ్మల్ను మీ అస్తిత్వపు ఆకారమేమిటో తెలుసునా అని అడిగితే మీరేం చెపుతారు? మీకు తెలుసునా? ఆ సమాధానమే ప్రతిదానికి వర్తిస్తుంది. అయినప్పటికి, మీరు ఇప్పటికే చాలా వరకు ఎన్నో రకాలయిన మార్పులకు లోనై ఆలోచనాపరులైన, పరిణతి చెందిన వ్యక్తులు. ఒక రకంగా చెప్పాలంటే, మీరు ఎంత మాత్రం గోడమీద పాకే బల్లివంటి వారు కాదు గదా. అయినప్పటికి మీ అస్తిత్వపు సత్యాన్ని చెప్పగలిగిన స్థితిలో లేరు. సరిగ్గా అదే ప్రపంచంలోని అన్ని వికృతాల రహస్యం. ఎందువల్లనంటే సృష్టిలోని ఈ అచేతనంతా మూలంనుంచి వేరు చేయటం వలననే ఏర్పడింది ఈ అచేతనవల్లనే ఆ 'మూలస్థానం' ఎప్పుడూ ఉన్నా, తనను తాను ప్రకటించుకోలేకపోతున్నది. అది అక్కడ ఉంది కాబట్టి, ఈ ప్రపంచం మనగలుగుతున్నది. కాని ప్రకటనలో వికృతత్వాన్ని పొందింది. ఎందువల్లనంటే, అది అచేతన, అజ్ఞానం, అస్పష్టతల నుంచి వెల్లడి అవుతున్నది.

వ్యక్తీకరణకు కారణములు

సృష్టిక్రియా విధానంలో 'ఇచ్ఛ' అనేది వ్యక్తిగతమైన 'ప్రక్షేపణ' (projection). వ్యక్తిగతమంటే అన్నింటిని కలిగి ఉన్న ఏకత్వం కాకుండా చెల్లాచెదరవటం. అది ఎన్నో అసంఖ్యాకమైన చిన్న చిన్న వ్యక్తిత్వాలతో కూడిన ఏకత్వం. అంటే అవి తమకు తాము వేరనే భావన కలిగినవి. ఆ విధంగా ఇతరుల కంటే వేరనే భావన కలిగి ఉండటమే మీకు ఒక ప్రత్యేక వ్యక్తిత్వభావనను కలిగిస్తుంది. అదే లేకపోతే మీకు మీరు ఒక ద్రవరాశిగా (fluid mass) అనుభూతి పొందేవారు. ఉదాహరణకు, బాహ్యారూపంగురించి, మీకు ప్రత్యేక వ్యక్తిత్వం కలిగించే వాట

న్నింటిని గురించి మీకు ఎరుక లేదనుకుందాం. దానికి తోడు అంతటా తిరుగుతూ ఉండే ప్రాణికశక్తులతోగాని లేక అన్నిటికి పునాదిగా ఉన్న అచేతన ఎరుకగాని ఉంటే, అప్పుడు ఒకదాని నుంచి మరొకదానిని విడదీయలేని అన్ని రకాల వ్యతిరిక్తమైన గతులతో కూడిన ముద్దగా మీరు అనుభూతి పొంది ఉండి ఉండేవారు. మీకు ప్రత్యేక వ్యక్తిత్వానుభూతి ఉండి ఉండేది కాదు. మీరు సమస్తం మధ్యలో ఉన్న ఒకవిధమైన ప్రకంపనగా (vibration) అనుభూతి పొంది ఉండేవారు. మరి, అన్నిటికి ఆధారభూతమైన ఇచ్ఛాశక్తి ఏమనుకున్నదంటే, మళ్ళీ ఒకసారి తమ దివ్యమూలపు ఎరుకను పొందగలిగిన ప్రత్యేక వ్యక్తిత్వరూపాలు గలిగిన జీవులను రూపొందించటం.

చేతన అచేతనగా మారుట

ఈ వ్యక్తిత్వపు పద్ధతిలో, విలక్షణమైన వ్యక్తిగా ఉండటానికి ప్రత్యేకానుభూతి తప్పనిసరి. మీరు ప్రత్యేకతను పొందిన క్షణంలో, మీకు మూలచైతన్యంతో సంబంధం తెగిపోతుంది. కనీసం కనపడే రీతిలో, మీరు అచేతనలో పడిపోతారు. ఎందు వల్లనంటే జీవనపు సజీవత్వం మూలంలో ఉంది. దానినుంచి మీరు బంధం తెంచుకుంటే, సహజంగానే చేతనావస్థ అచేతనావస్థగా మారిపోతుంది. ఈ అచేతనావస్థ మూలంగానే మీ అస్తిత్వపు సత్యం ఎరుక ఏమాత్రం ఉండటం లేదు. ఇది ఒక విధానం. మీరు ఇది అనివార్యమా కాదా అని తర్కించ లేరు. అది ఆ విధంగా ఉంది అంతే. ఈ విధంగా ఏర్పడటం సృష్టించబడటం కారణంగా పవిత్రమైనది దాని పూర్ణసత్యంతో ఏమాత్రం ప్రకటింపబడటం లేదు. దాని పవిత్రతలో అది వికృతమై, అచేతనలో అజ్ఞానంగా ఉంటున్నది. మీరు గనుక మొదట్లోనే ఒక్కసారిగా 'అవును, నాకు నా అస్తిత్వం తెలుసును' అని ఉంటే, అది అక్కడనే పూర్తయి ఉండేది. సమస్య అనేదే ఉండేది కాదు.

దుఃఖానికి కారణము

అందువలననే అంత వికృతం, మరణం. అందు వల్లనే అంత అస్వస్థత, అందువల్లనే ఆ దుష్టత్వం. అందువల్లనే ఆ బాధ. ఇదంతా

వేరు వేరు పరిధులలో, వివిధ ప్రకంపనాలతో ఉంటున్నది. కాని అన్నిటికి కారణం మాత్రం ఒకటే. ప్రత్యేకవ్యక్తిత్వాన్ని రూపొందించే అవసరమే అచేతనను తయారుచేసింది. మళ్లీ చెపుతున్నాను. అలా జరగవలసిన ఆవశ్యకత లేదు. అది వేరే సమస్య. దానిని మనం మరోసారి చూద్దాం. ప్రస్తుతానికి మనం దీనిని ఈ విధంగానే ఉందని అనుకోవాల్సి వస్తుంది.

మరి, దీని నివారణోపాయం? కారణం అటువంటిదైనప్పుడు దానినంతటిని సరిచేయడానికి ఒకే ఒక మార్గం ఏమిటంటే ఎరుక కలిగి ఉండటమే! ఇది చాలా, చాలా తేలిక.

మంచిచెడుల మిశ్రమము

కొన్ని మతాలు ప్రబోధిస్తున్నట్లుగా విశ్వంలో ఒకదాని నొకటి వ్యతిరేకించే రెండు వ్యతిరేకశక్తులు మంచి చెడులున్నాయనుకుందాం. మంచీ, చెడూ అనేది ఎప్పుడూ ఉంటుంది. ఒక సంఘర్షణ, ఒక యుద్ధం, ఒక పోరాటమనేది ఉంటుంది. వాటిలో బలమైనది మంచి కాని, చెడుగాని గెలుస్తుంది. మంచి పాలు ఎక్కువగా ఉంటే మంచి గెలుస్తుంది. అదే చెడుపాలు ఎక్కువగా ఉంటే చెడు గెలుస్తుంది. కాని రెండూ ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. అది గనక అలాగే ఉంటే నిరాశావహం. అప్పుడు ఎవరూ కూడా అది కష్టమని కాని, తేలికని కాని చెప్పనక్కర లేదు. అది అనితరసాధ్యం. ఎవరూ కూడా దానినుంచి బయట పడలేరు. కాని నిజానికి అది ఆ విధంగా లేదు.

దానిని చాలా పేర్లతో పిలుస్తారు. ప్రతివారు తమదైన పద్ధతిలో చెపుతారు. వారు చూసే దృష్టికోణం నుంచి ఎవరి అనుభవం వారికి వేరుగా ఉంటుంది. దైవాన్ని తమలో చూచినవారంతా వారివారి ప్రత్యేక పద్ధతిలో చూస్తారు. ఒకరకమైన అనుభవంతో ఒకకోణంనుంచి చూస్తారు. ఈ కోణం ఎవరికి వారికి తెలుసు. వారు గనుక తమ జాగ్రత్తలో లేకపోతే వారు ఈ విధంగా చెప్పడం మొదలుపెడతారు. "దైవాన్ని కనుగొనాలంటే ఇది చెయ్యాలి, అది చెయ్యాలి. అది అలాంటిది. ఎవరికైనా పోవాల్సిన దారి అది" అలా ఎందుకంటారంటే వారికి ఆ పద్ధతిలో

సాక్షాత్కారమైంది కనుక. ఎవరైనా ఇంకా కొంచెం ముందుకు పోతే, ఇంకొంత అనుభవం పొందితే, వారికి లక్షపద్ధతులతో చేయవచ్చని అవగతమవుతుంది. అక్కడ ఉన్న విషయం నిశ్చయంగా ఒకటే. ఆ కనుగొన్నది ఎప్పుడూ ఒకటే. అది గమనించదగిన సంగతి. ఏ మార్గాన్ని అనుసరించినా, దానికి ఏ రూపం ఇచ్చినా, ఫలితం ఎప్పుడూ ఒకటే. వారి అనుభవం మిగతావారి అనుభవం ఒకటే. వారు దానిని స్పృశించినప్పుడు అది అందరికి ఒకటే. వారు దానిని స్పృశించారనడానికి అసలైన ఋజువు అది అందరికీ ఒకే విషయంగా ఉండటమే. అది గనక ఒకటే కాక పోతే వారు దానిని స్పృశించలేదన్న మాట. వారు స్పృశిస్తే అది ఒకటే. దానికి మీరు మీకు నచ్చిన ఎన్ని పేర్లైనా పెట్టవచ్చు. దానికి వచ్చిన ఇబ్బందేమీ లేదు.

మాటలు మాటలే. వాటి వెనక ఏదో లేకపోతే వాటికి అర్థం లేదు.

అనువాదం: టి. ప్రసన్నకృష్ణ

సృష్టికి కారణం

అసలు సృష్టికి ఏమైనా ప్రయోజనమున్నదా? ఎందుకంటె మూల తత్వము ఎప్పటికి నిక్షేపంగానే ఉంటుంది. పరిపూర్ణత్వము దాని ధర్మము. మరి తనను తానే కుంచించుకోవటమెందుకు? మళ్లీ తపస్సు చేసి తన పూర్ణరూపాన్ని పొందటమెందుకు? దీనివలన ప్రయోజనమున్నది. మూలచైతన్యముయొక్క స్థాయి పెరుగుతుంది. సుసంపన్నమవుతుంది. నువ్వు సృష్టియొక్క ఆవలి దిక్కుకు వెళ్లి చూసినప్పుడు, ఈ ప్రపంచంయొక్క నిజస్వరూపము తెలుస్తుంది. అది ఎంతో అద్భుతంగా ఉంటుంది. ఈ బాధ, దుఃఖము, మృత్యువు ఎక్కణ్ణుంచి వచ్చినయ్యో బాబూ అనిపిస్తుంది.

— సంపాదకుడు

ఈ శోకాలు, దుఃఖాలూ, ఈ పెడబొబ్బలూ ఎందుకుట? అసలీ సృష్టిని ఎవరు చెయ్యమన్నారు? (శ్రీమాత ప్రారంభ బిందువు దగ్గరకే తిరిగి వెళ్లే చక్రాన్ని సూచిస్తూ) నిజమే.... నిజానికి ఇది నిష్ప్రయోజనమే కాబట్టి అర్థరహితమే – కానీ, అది అలా ఉంది అంతే. ఇలా 'ఎందుకు' అని ఎన్నిసార్లడిగినా అలా కాకమానదు. చెయ్యవలసిందల్లా – ఇక ముందయినా అలా కాకుండా ఉండ టానికి ఏం చెయ్యాలో తెలుసుకోవడమే.

ఈ సృష్టి ఒక పొరపాటా?

నేను బుద్ధుడు, అలాంటి వాళ్ల గురించి ఎప్పుడూ తలుచుకుంటుంటాను... వారంతా ఆ భగవంతునిలో ఐక్యమైపోతే ఇంక ఆ పైన ఏమీ లేదుట! (తల చేత్తో పట్టుకుంటూ) ఇంక వాళ్ల సిద్ధాం తం నిజంలా అనిపించడం కోసం ఈ సృష్టిని ఒక 'పొరపాటు' అంటారే, వాళ్ల సిద్ధాంతంలోని లోపం వాళ్లకి కనపడదే. సృష్టి కర్త 'పొరపాటు' చెయ్యడమా? పైగా చేసిన తప్పుకి బాధపడి, తప్పుదిద్దుకొని వెనక్కి తీసుకోవడమేనా ఏమిటి ఈ సృష్టి వైభోగం? ఈ సిద్ధాంతం నమ్మే ప్రజలందరూ తమ కళ్లకి తామే గంతలు కట్టుకున్న మూర్ఖులే.

*

ప్రశ్న: 'అవతలినించి' చూస్తే, ఈ స్థూలప్రపంచం ప్రస్ఫుటంగా కనిపిస్తూనే ఉంటుందా... లేక అంతా మాయం అయిపోతుందా?

సృష్టికావలనుంచి వీక్షణము

వివరించడం కష్టమే కానీ, మనం అను కునే ఈ ప్రపంచమనే 'పొరపాటు' అని వార్యమని నాకు కచ్చితంగా తెలిసింది ఈ మధ్యనే. ఈ ప్రపంచాన్ని మనం చూసే విధానం, తెలుసు కునే విధానం ఈ సృష్టిలోని 'పొరపాటు' లేకుంటే ఉండేవి కావు. పైగా మనకి నిజచైతన్యం కలిగినా కూడా ఇదంతా పూర్తిగా తుడిచిపెట్టుకుపోదు – ఒక ప్రత్యేకరీతిలో – నిజచైతన్యంలోని ఒకానొక దశలోని అనుభవంగా, ఒక ఆలోచనా విధానంగా శాశ్వ తంగా నిలిచిపోతుంది.

You see, there was always this great "Why?" — "Why is it like this?" Why is there all this, which brought about everything that the human consciousness interprets as suffering, misery and helplessness and everything, all the horrors of ordinary consciousness — why? Why is it? And so this was the answer: in the true Consciousness there is a mode of vibration, of precision and exactness and clarity in objectivisation, which could not have existed without that, which would not have had any opportunity to manifest. That is certain. That is the answer — the all powerful answer to the "why".

*

ఈ సృష్టి విధానం గూర్చి శ్రీఅరవిందులు ఇదే చెప్తారు. అవ్యక్త తత్త్వములో ఒక ఆలోచన జాగృతమై, చైతన్యవంతమవగానే దాని అభివ్యక్తీకరణగా ప్రపంచం సృష్టించబడుతుంది.

సృష్టికి ఆలోచన కారణం కాదు. అది కేవలం సృష్టి విధానమే. ఆలోచన అంటేనే మూర్తీభవించి అభివ్యక్త సామర్థ్యముగల ఒక స్పష్టమైన రూపం.

*

పరిపూర్ణ సత్యాన్ని పొరలా కప్పిన అసత్యం వల్లనే మనం ఇక్కడ ఈ దుఃఖము, నిరాశవంటివన్నీ చూస్తాం కనుక దానిని మాత్రం తప్పక తొలగించాలి. అదే లేకపోతే అంతా పూర్తిగా మారిపోతుంది. ఈ అసంపూర్ణ చైతన్యంనుంచి బయటపడి సంపూర్ణ సత్య అవగాహన కలిగితే, 'దుఃఖము' 'బాధ' అనేవసలు ఎలా సంభవమా అనిపిస్తుంది. ఈ మిథ్యనుంచి అవతలి కెళితే వీటిని గురించి ఆశ్చర్యం వేస్తుంది. సాధారణంగా అందరూ ఈ మిథ్యానుభవం ఈ జగత్తుయొక్క లక్షణమంటారు. కానీ శ్రీఅరవిందులు దివ్యజీవనానికి ఈ జగత్తు మిథ్య అనుకోనవసరం లేదంటారు. మిథ్య అసత్యానిది తప్ప ఈ ప్రపంచానిది కాదు. అంటే, అసత్యానికి అతీతంగా ఈ ప్రపంచానికి తనదైన ఒక అస్తిత్వం ఉంది.

అనువాదం: బి. వరలక్ష్మి

ఏమి జరిగినా మన మంచికే – సృష్టి సమస్తము వెల్లడి అవటానికే

ఏది జరిగినా మన మంచికేనా? ఇది సత్కార్యము, ఇది అసత్కార్యము అని నిర్ణయించునది ఎవరు? అది నీ దృష్టినిబట్టి, నీ చేతనాస్థాయినిబట్టి ఉంటుంది. నీ ఇచ్ఛ దైవేచ్ఛతో ఏకమైనట్లయితే ఏది జరిగినా అంతా నీ మంచికే అవుతుంది. కాబట్టి నువ్వు స్వార్థాన్ని వీడి విశ్వంతో ఏకము కావాలి. అప్పుడు నిరంతరం సృష్టికి అభివృద్ధిదాయకమైన పరిస్థితులు నీకు కూడ మేలు చేకూర్చి నిన్ను ఉన్నతస్థాయికి తీసుకువెడతాయి.

– సంపాదకుడు

ప్రశ్న: ఎప్పుడు ఏం జరిగినా మంచికే అనుకుంటే భయముండదన్నారు కదా. అన్ని పరిస్థితుల్లోనూ మంచే జరుగుతుందనుకోవటం న్యాయమేనా? ఏ పరిస్థితుల్లో ఏం జరిగినా మంచే అనుకోవాలా?

అప్పుడున్న పరిస్థితుల్లో అది మంచే అనుకోవాలి. అంత మాత్రాన జరిగింది సర్వశ్రేష్ఠమనుకోరాదు.

దైవేచ్ఛ తప్పక నెరవేరును

అది రెండువిధాలుగా చెప్పుకోవచ్చు. ఒకానొక పరిస్థితిలో జరిగింది సర్వశ్రేష్ఠమా కాదా అనేది ఏం జరగాలని దైవం నిర్ణయించిందో అనే దాన్ని బట్టి ఉంటుంది. ఇంకా దైవసంకల్పంతో చైతన్యపూర్వకంగా అనుసంధించి ఉన్నవారికి తమ ఆత్మసిద్ధికి అదే అనుకూలమైన క్షణం. కుంచిత స్వభావంతో జరిగింది మంచిదా కాదా అని బేరీజు వేయకూడదు. అర్థమయేటట్లు వివరించాను కదా!

మానవ మనస్సుకందని విషయము

సృష్టి సమస్తాన్ని దృష్టిలో పెట్టుకొని చూస్తే ప్రతిక్షణం జరిగేది ఆ దివ్యపరిణామానికి అనుకూలమే అవుతుంది.

ఆ దైవంతో చైతన్యాత్మకంగా అనుబంధించి ఉన్నవారికి కూడా ఆ దివ్యసమాగమములోని పరిపూర్ణతకు ఆ క్షణమే సర్వశ్రేష్ఠము.

అయితే ఆ మంచి. నిరంతరం మారుతూంటుంది తప్ప నిల కడగా ఉండదనే విషయం మరచిపోకూడదు. అది ఆ క్షణానికి మంచిదే అయినా మరుక్షణానికున్నప్పుడు మంచిది కాకపోవచ్చు. ఎందుకంటే మంచిదనుకున్నదాన్ని స్థిరంగా నిలబెట్టాలనుకోవడం మానవనైజమైతే ఆ మంచిని నిలిపి ఉంచడం అసాధ్యమనే విషయం వారి చైతన్యానికి తెలుస్తుంది. మంచిని నిలవ చేయాలనుకుంటే అది అసత్యంగానూ, కపటంగానూ మారిపోతుంది.

(కొంతసేపు నిశ్శబ్దం)

సృష్టినంతా మాయ, క్షణికమాత్రమని బుద్ధభగవానుడెందు కన్నాడో నేనూహించగలను. ఆయన దృష్టిలో పరిపూర్ణత, శాశ్వ తత రెండూ ఒక్కటే. వ్యక్తప్రపంచమంతా అనుక్షణం మారిపో తూండడం గమనించిన అనుభవంతో ఆయన ఈ విధంగా సృష్టి అపరిపూర్ణం కాబట్టి అంతర్ధానం కావలసిందేనని తీర్మానించారు. అవ్యక్తంలో మార్పుకి అవకాశం లేదు కాబట్టి నిజానికి అదే భగ వంతుడు అని బుద్ధుని వాదన. నేను ఆ విషయాన్ని గురించి దీర్ఘంగా ఆలోచించినప్పుడు అది న్యాయంగానే తోచింది. సృష్టి సమస్తమూ అశాశ్వతమే, అవిరామ పరివర్తనమే దాని స్వభావము.

కానీ ఈ సృష్టి పరివర్తన క్రమానుగతిలోనే పరిపూర్ణత ఉంది. దైవగమనంతో ఏకీభవించగలగటమే ప్రధాన పరివర్తనా గతికి పరిపూర్ణత. అంటే దైవలీలానుసారంగా సృష్టి బహిర్గతం కావడమే దాని పరిపూర్ణత. నిశ్చేతనకీ, తామసానికీ సంబంధిం చిన సృష్టి మాత్రం ఎలా ఉన్నది అలాగే ఉండిపోవాలనుకుం టుంది తప్ప నిరంతర పరివర్తనతో శాశ్వతమవాలనుకోదు.

సృష్టి చేయడంలో పొరపాటు జరిగిందా?

ఆ కారణంగానే కొందరు తాత్త్వి కులు ఒక దోషం కారణంగా సృష్టి ఏర్పడిందనే సిద్ధాంతం లేవనెత్తారు. ఇంకా అనేక సిద్ధాంతాలున్నాయి.

- ప్రారంభంలోని పరిపూర్ణసృష్టి – ఒక పొరపాటువల్ల దోష భూయిష్టమైంది.
- అసలు మొత్తం సృష్టే ఒక అధోచలనంగా ఏర్పడింది కాబట్టి అది నశించాలి.
- శ్రీఅరవిందులు వివరించిన వేదపరమైన సిద్ధాంతం ప్రకారం అనిశ్చితంగా, అనంతంగా పరమేశ్వరుడు తనను తానే ఆవిష్కరించుకొని ప్రగతిశీలంగా ప్రకటితం కావడమే సృష్టి.

ప్రతి క్షణము సమస్త విశ్వము పురోగమనము

ఇవన్నీ ఇప్పటివరకూ మానవులు చెప్పుకొనే అర్థాలు, వ్యాఖ్యానాలు, ఎవరి స్థితినిబట్టి వారు అర్థాలు చెప్పుకున్నప్పటికీ దాని పర్యవసాన ఫలితాలే శూన్యవాదం, నిర్వాణవాదం, మాయావాదం, నాస్తికవాదం మొదలైనవన్నీ. ఏదోరకంగా రాక్షసశక్తులు జోక్యం కలుగచేసుకున్నట్లు అన్ని మతాలు ఆరోపిస్తాయి. కానీ అసలు శిసలైన వైదికసిద్ధాంతం మాత్రం పరమాత్మ అమూర్తదశనుండి క్రమక్రమంగా మూర్తరూపము నొందుటయే సృష్టి అని సూచిస్తుంది. అది కూడా ఇష్టానుసారంగా కొద్దిపాటి మార్పులు, చేర్పులతో అనేక చోట్ల, అనేక రకాలుగా కనిపిస్తుంది. కానీ శ్రీఅరవిందులు పరమసత్యంగా అభిప్రాయపడినదాని ప్రకారం, జగత్తు ప్రగతిశీలమైనదని అనుకుంటే, ఎక్కడ ఏమి జరిగినా కూడ, అది సమస్త విశ్వవికాసానికి దోహదమే అవుతుంది. ఇది చాలా తార్కికమైన విశ్లేషణ. సృష్టి అవతరణ గురించి జరిగే తర్కాలన్నీగూడా దానికి ఏదో ఒక స్థానం ఆపాదించటానికే జరుగుతాయి. పాపము, దోషము కారణంగానే సృష్టి జరిగిందనీ వాటి మూలకంగానే మంచిచెడుల మధ్య నిరంతర ఘర్షణ జరుగుతోందనీ నమ్మేవారందరూ ఏం జరిగినా దానితోనే ముడిపెట్టుకుంటారు. కానీ ఎవరైతే దివ్య సత్యానికీ, దైవనిర్ణయానికీ కట్టుబడి నడుచుకుంటారో వారికి మాత్రం ఏ నిమిషంలో ఏం జరిగినా తప్పనిసరిగా వారి ఆత్మ సిద్ధికే ఉపయోగపడుతుందని చెప్పవచ్చు. అంతటా అలానే జరుగుతుంది. అనన్యమైన సర్వశ్రేష్ఠత మాత్రం ఒకరికే లభ్యమవు

తుంది. భగవంతుడు తనకు తానుగా ఆత్మదర్శనం చేసుకోవటం లోనే సృష్టి ఏర్పడిందని గుర్తించగలిగినవారికే అంతటి మంచి జరుగుతుంది.

(నిశ్శబ్దం)

నిజం చెప్పాలంటే ఈ విషయాలకి వేటికీ కూడా ప్రాధాన్యత లేదు. ఏ విధంగానూ మానవచైతన్యానికి అందనంత స్థాయిలో ఉండేదే మూల తత్త్వం.

స్వేచ్ఛానువాదం: ఎ. వెంకటరామశాస్త్రి, ఎ. ప్రభావతి

దేశకాలములు (Time and Space)

ఈ భూనభోంతరాళాలన్నీ సృష్టికి పూర్వము ఎక్కడున్నాయి? భగవంతుడు తనలో ధరించివున్నాడు. భావంలో నిర్మించుకున్నాడు. ఇది మాటల గారడీయేనా లేక మనుషుల కర్థమయ్యే విషయమా? మొదట క్రియారూపము లేకపోయినప్పటికీ వ్యూహమున్నది. కాని సృష్టి లేదు. దేశకాలముల వ్యవహారమింకను లేదు. సృష్టితోనే దేశకాలములు పుట్టినాయి. – సంపాదకుడు

"సాధకుడు భగవంతుని రెండు అవస్థలను గురించి తెలుసుకుంటాడు. తన సామర్థ్యమునంతను గర్భితంగా ఉంచుకున్న ముకుళితస్థితి ఒకటి. వికసితమై తన చేతనాశక్తిని నిర్దేశించి దేశకాలములలో అభివ్యక్తమగుట రెండవస్థితి."

శ్రీఅరవిందులు (*The Synthesis of Yoga*, p. 115)

*

అంతర్భావము – బహిరాభివ్యక్తి

నేను కూడా అదే చెబుతున్నాను. ఒక ప్రక్క ఏదీ లేనట్లుగా ఉంటుంది. అదే ఇలా క్రియాశీలమై (అభినయం చేసి చూపుతూ) అచ్చట విశ్వాన్ని వ్యక్తపరుస్తుంది. అది దృశ్యరూపంలో సృష్టిగా కనుపిస్తుంది. అనభివ్యక్త స్థితిలో దేశకాలాలు

లేవు. అది కాలాతీత స్థితి. ఆ స్థితిలో నిక్షిప్తమైన శక్తి క్రియాశీల మౌతుంది. ఇది కాలీనము, గతి. అంటే రెండు అవస్థలు – ఒకటి నిశ్చలత, రెండవది చైతన్యత. ఉదా: నీవు నిద్రిస్తున్నపుడు చలనము ఉండదు. అయినా నీలో శక్తి ఉన్నది. కాని మెలకువ వచ్చినపుడు, నీ శక్తి క్రియారూపము అయింది. అదే "స్థితి" నుండి "గతి" గా మార్పు. స్థితిలోని శక్తి కనపడదు. గతిలోని శక్తి కనిపిస్తుంది. అయినా రెండూ ఒక్కటే – దృశ్యకోణంలో మార్పు అంతే.

స్థితిలోనుండి క్రియాశక్తి, చైతన్యశక్తి బహిర్గతమైనప్పటికి స్థితిలో మార్పుండదు. దాని ఉనికి కోల్పోదు. రెండూ నిరంతరం సాగేవే. స్థితి పోయి గతిగా మారడం కాని, గతి లేనపుడు స్థితిగా ఉండటంగాని కాదు. చలనము, అచలము రెండూ ఏకకాలంలోనే సాగేవి.

ప్రశ్న: కాలము ఏ క్షణంనుండి మొదలౌతుంది? ఆవిష్కారమైనప్పుడా?

దైవము – దేశ కాలములు

శుద్ధచైతన్యం (Supreme Consciousness) దృశ్యరూపం దాల్చడానికి పూర్వం, తనలో తాను తెలుసుకొనే స్థితికి వస్తుంది. దానిలో విశ్వచైతన్యము, దృశ్యరూపములు కలగాపులగంగా ఉంటాయి. అప్పుడు కాలం ఉండదు. అందుచేతనే ఆవరణ (Space) కూడా లేదు. సృష్టికి పూర్వము చైతన్యంలో, సృష్టియొక్క భావన, అవగాహన, ప్రణాళిక లేకుండా సృష్టించడం సాధ్యపడదు. కనుక భావనలో (plenary consciousness) కాలము లేదు – విశ్వం యొక్క పూర్వరూపమే ఉన్నది. రూపము ఇంకా రాలేదు. దృశ్యరూపంతోనే కాలము (time) ప్రారంభమయింది. కాలము అంటే క్రమానుగతి లేదా ఒక దాని తరువాత మరొకటి వచ్చే ప్రక్రియ.

*

భూతభవిష్యద్వర్తమానములు లేవు

ఒక్క క్షణం నీవే భగవంతుడని ఊహించడానికి ప్రయత్నించు. ఒక్కొక్క విషయాన్ని నీకు నచ్చిన విధంగా

దృశ్యంగా చూపుతావు. నీ ఊహ నీలో ఉన్నది. బహిర్గతం కాలేదు. కనుక దానికి కాలం (time) తో పని లేదు. కాని బహిర్గతం కాగానే, కాలము, దేశము (time and space) ప్రారంభమౌతాయి. అతఃపూర్వము భావనలో కాలము – భూత, వర్తమాన భవిష్యత్తులు – లేవు – అంతా ఏకమై ఉన్నది. అలాగే దైవము కూడా. తన సంకల్పానికి అనుగుణంగా ఒక్కొక్క విషయం బహిర్గతం చేస్తాడు. దేవేచ్ఛను సమగ్రంగా చూడజాలని కించిదజ్ఞులు చిన్నశకలము నొకదానిని మాత్రమే చూడగలరు[1]. వారు భగవంతుని తప్పుపడతారు. అది వారి పొరపాటు. ఈ పొరపాటు, దేశకాల భావనవలన ఏర్పడింది.

అయితే ఈ భావన "ఒకప్పుడు ఉన్నది, ఇప్పుడు లేదు" అన్నట్లుగా ఉంటుంది. అయినా అది నిజమే. కాలభావనే దురవగాహనకు కారణము.

ఒకే విషయం ఏకకాలంలో "ఉన్నది, లేదు" అనడంలో అర్థమేమిటో వివరించండి?

అస్తిత్వము
అనస్తిత్వము

శ్రద్ధగా పరిశీలిస్తే, మనకు తెలుస్తుంది. జగన్నాటక కర్త మహాకవి. తానే జగత్తు, ప్రేక్షకుడు కూడా – తన నాటకాన్ని తనే చూస్తున్నాడు. తన రచన తనకు తెలుసు. మనం ఆయన చేత ఆడింపబడుతున్న కీలుబొమ్మలం – కనుక ఆ బ్రహ్మాండ నాటకంయొక్క పూర్వాపరాలు మనకు తెలియవు.

ఆయనే నటుడు – ప్రేక్షకుడు కూడ ఆయనే. దేశకాలములలోకి ప్రవేశిస్తేగాని తనను తాను చూసుకోలేడు. అప్పుడే ఈ కామెడీ మొదలైంది. అవును ఇది ఒక కామెడీ తప్ప మరేమీ కాదు.

కాని మనము ఏమి తెలియని కీలుబొమ్మలం. ఇదంతా ఒక కామెడీయే అనే విషయం తెలియక ఈ నాటకాన్ని చాలా సీరియస్‌గా తీసుకుంటాము. నువ్వు కీలుబొమ్మల్లె ఆడటం మానే

---

[1] Sees only a little arc of God's vast Sky (*Savitri*, p. 320)

సినప్పుడు గాని "ఓహో, అదా సంగతి, ఇదంతా ఒట్టి కామెడీ యేనా" అని తెలియదు.

ప్రశ్న: కొంతమందికి ఇది ట్రాజెడీ.

అవును దానికి మనమే కారణం. మన వల్లనే ఇది ఒక ట్రాజెడీగా తయారైంది.

స్వేచ్ఛానువాదము: రంగనాథ ఆత్రేయ

చైతన్యం[1]: సృష్టియొక్క మూలవస్తువు

సృష్టియొక్క పైపొరలను తొలగించుకుంటూపోతే చివరకు మిగిలే మూలవస్తువే చైతన్యము. దాని చిత్రవిచిత్ర విన్యాసములే ఈ జగత్తు. దాని అస్పష్ట ప్రతిఫలనమే మనస్సు. – సంపాదకుడు

చైతన్యం అంటే ఏమిటి?

(కొంతసేపు నిశ్శబ్దం తర్వాత) అనేక వివరణలలో ఒక దాన్ని ఎంపికచేయటానికి ప్రయత్నిస్తున్నాను. హాస్యోక్తి అయిన ఒక వివరణ, చైతన్యం అంటే చైతన్యరాహిత్యానికి వ్యతిరేకం! మరొకటి.... అది విశ్వానికి మూలమైన సృజనాత్మకసారం – చైతన్యం లేకపోతే విశ్వం లేదు; కారణం చైతన్యం అంటే వాస్తవీకరణం. చైతన్యం అంటే "ఉన్నదేదో అది" అని కూడా నేను చెప్పగలను. ఎందుకంటే, చైతన్యమే లేకపోతే ఏదీ లేదు – అత్యుత్తమమైన కారణం ఇది. చైతన్యం లేకుండా జీవం లేదు, వెలుగు లేదు, వాస్తవీకరణ లేదు, సృష్టి లేదు, విశ్వం లేదు.

---

[1] సృష్టిలో అంతర్గతంగా ఉన్న యథార్థమే చైతన్యం. అస్తిత్వంలో అది ప్రధానాంశం. విశ్వాన్ని విశ్వంలో ఉన్న సర్వాన్ని చైతన్యానికి చెందిన శక్తి, చలనం, గమనం సృష్టించాయి. స్థూల జగత్తు మాత్రమేగాక సూక్ష్మ జగత్తు కూడా తన్నుతాను ఏర్పాటు చేసుకొంటున్న చైతన్యమేగాని ఇంకేమీ కాదు. – సంపాదకుడు (శ్రీఅరవిందుల రచనల ఆధారంగా)

పరమాత్మలో చైతన్య దీప్తి

బహుశః అవ్యక్త పరమాత్మలో ఒక చైతన్యం ఉంది (కాని ఇలాంటి విషయాలను గురించి చెప్పేటప్పుడు అసంభవ విషయాలను గురించి చెప్పటం ప్రారంభం అవుతుంది.) ముందుగా, పరమాత్మకు తన్ను గురించిన ఎరుక కలిగింది అంటారు. (దీని అర్థం ఇంతకుముందు పరమాత్మకు తన్ను గురించిన ఎరుక లేదు. మనం "చైతన్యం" అని పిలవలేని దశలో ఆయన ఉన్నాడన మాట!) తన్ను గురించి ఎరుక కలగటమే ఆయనలో జరిగిన మొట్టమొదట చలనం. ఎప్పుడైతే ఆయనకు తననుగురించి ఎరుక కలిగిందో అప్పుడాయన తన చైతన్యాన్ని ముందుకు చొప్పించాడు. అదే సృష్టికి రూపకల్పన చేసింది. కనీసం ప్రాచీన సంప్రదాయం చెప్పిందిది. మొదలుకావటం అనేది ఎన్నడూ జరగలేదనే అనుకుందాం. కారణం అది మానవులు చెప్పే విధానం. "ప్రారంభం" పరమాత్మే – అవ్యక్తపరమాత్మకు తన్ను గురించిన ఎరుక కలగటం. ఈ చైతన్యం పూర్తిగా సంతృప్తికరంగా లేదని బహుశః ఆయన కనుగొన్నాడు! దాన్ని ముందుకు విస్తరించాడు; తనకు బయటకాదు – కారణం తనకు బయట ఏదీ లేదు. కాని తనకు వాస్తవీకరణ జరగాలని దాన్ని ఆయన క్రియాశీలచైతన్యంగా మార్పు చేశాడు. దీని పర్యవసానంగా, సర్వసృష్టికీ చైతన్యమే మూలం అని రూఢిగా చెప్పడానికి వీలవుతుంది. మాటలతో సాధ్యమైనంత కచ్చితంగా చెప్పే విధానమిదే.

మానవ చైతన్యం

సర్వసృష్టికీ మూలం చైతన్యం – చైతన్యం లేకుంటే సృష్టి లేదు. మనం "చైతన్యం" అని వ్యవహరించేది, పరమచైతన్యంతో మనకు ఏర్పడిన సుదూర సంబంధం. అది కచ్చితమూ కాదు, సుస్పష్టమూ కాదు. లేదా కావాలనుకొంటే దాన్ని ప్రతిఫలనం అనవచ్చు. కచ్చితంకాని, పరిశుద్ధంకాని అద్దంలో మూలచైతన్యానికి ఏర్పడిన ప్రతిబింబం. మనం 'మన చైతన్యం' అనేది మసకఅద్దంలో (కొన్నిసార్లు చాలా మసకబారిన, వికృతం అయిన అద్దంలో) వ్యక్తి అద్దంలో ఒక ప్రతిఫలనం. ఈ ప్రతిఫలనం ద్వారా నెమ్మదిగా,

ప్రతిబింబించిన దాని మూలానికి వెనక్కిపోతే నిజమైన చైతన్యంతో మనం చేతులు కలపగలం. ఒకసారి నిజమైన చైతన్యంతో సంబంధం కలిగితే, సర్వత్రా అదే ఉన్నదని మనకు తెలిసిపోతుంది. అంతే కాదు, దాన్ని వేరుచేసింది కేవలం వికృతీకరణం మాత్రమే అని తెలుసుకుంటాము. వికృతం కాకపోతే ప్రతి ఒక్కటీ అదే ఏకైక చైతన్యంలో ఉంది. అంటే, వికృతీకరణం, వికృతంచేసి చూపే అద్దంలో ప్రతిఫలనం మాత్రమే విభేదాన్ని విభజనను తెచ్చిపెట్టింది. లేకపోతే అది ఏకైక చైతన్యం. అయితే ఇవన్నీ అనుభవంవల్లనే అర్థం అవుతాయి.

అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రరావు

పృథ్వి జీవితపు ప్రధాన లక్ష్యం

ప్రపంచానికి ఆధ్యాత్మికభిక్ష పెట్టింది భారతదేశం. మన పూర్వ ఋషులు మనుషులందరిలోను ఒకే చైతన్యం రాణిస్తోందని కనిపెట్టేరు. అదే చైతన్యం రాళ్లల్లో కూడా ప్రకాశించటం ఇంకా ఆశ్చర్యకరమైన విషయం. మరో చిత్రమేమిటంటే విశ్వానికి కేంద్రము ఈ భూమి. ఇక్కడ చేతన ప్రదీప్తమైతే అది విశ్వమంతా ప్రతిఫలిస్తుంది. మనమెంత అదృష్టవంతులం! మన మీ విషయాన్నెరిగి, నిరంతరం మననం చేసుకుంటూ ముందుకు సాగిపోవటమే మన ప్రధాన వ్యాపారమగు గాక.

— సంపాదకుడు

దివ్యజీవన గ్రంథంలోని ఆఖరి ఆరుఅధ్యాయాలు శ్రీమాత చదవ నారంభించారు.

"ఈ పృథ్వీరూపాలలో అంతస్థితంగా నిబిడీకృతమైవున్న పరమాత్మ పరిపూర్ణంగా ఆవిష్కృతమయ్యేంతవరకు జరిగే నిరంతర వికాసమే జడపదార్థజగత్తులో సాగే చైతన్యాపరిణామం. ఆధ్యాత్మికపరిణామం ప్రపంచ అస్తిత్వంలో అతి ముఖ్యాంశం, ప్రధాన విశిష్టలక్ష్యం. దట్టమైన నిశ్చేతనలోని

పరమాత్మ, దివ్యవాస్తవికత అంతర్లయన ప్రక్రియవల్ల మొదట్లో ఈ విశిష్టత గుప్తమై ఉన్నది.
ఒక అచేతనాయవనిక చాటున, భౌతికపదార్థంలోని సంవేదనా రాహిత్యపు తెరచాటున ఒక విశ్వజనీన చిచ్ఛక్తి దాగి ఉంది. సర్వ పరివ్యాప్తమైన అచేతనలో ఆ మహాశక్తి పని చేస్తున్నది. పరిణామంలో తొలిసారిగా ఆవిర్భవించిన ఈ మహాశక్తి నిశ్చేతనగా కనిపించినప్పటికీ ఒక అనంతమైన నిగూఢ గుప్తమేధాశక్తి చేసే అద్భుతాలను సృష్టిస్తున్నది" శ్రీఅరవిందులు (*The Life Divine*, p. 824)

వివిధ సిద్ధాంతాల పరిశీలన

ఈ విశ్వముయొక్క పరమార్థమేమిటో, అసలు యథార్థమేమిటో ఈ మొదటి వాక్యం ప్రస్ఫుటం చేస్తున్నది. మనం చదువుతున్న సంపుటంలోని చివరి భాగంలో ఆరు అధ్యాయాలు ఉన్నాయి. ఈ విశ్వం ఎలా, ఎందుకు ఆవిర్భవించిందో ఆ వివరాలను విశదం చేసే అనేక సిద్ధాంతాలను శ్రీఅరవిందులు క్షుణ్ణంగా పరిశీలించారు. చివరికి అవి ఎంత అసంపూర్ణమో, అపరిపూర్ణమో తెలిపారు. అనంతరం నిజమైన పరిష్కారం చూపారు. ఈ సృష్టి ప్రయోజనం ఏమిటో శ్రీఅరవిందులు చూపించారు. ఈ అధ్యాయం అర్థం కావాలంటే 10 సంవత్సరాలు పడుతుంది. ఆయన చెప్పేది అర్థం కావడానికి అన్నిరకాల జ్ఞానం, మేధా వికాసం కావాలి.

భూలోకమే ప్రధాన కేంద్రము

మన పార్థివ జీవనాన్ని వారు ఈ మొత్తం విశ్వానికి ప్రతీకగా, ఒక ప్రతినిధిగా పరిగణించారు. నిజానికి ప్రాచీనసంప్రదాయాల ప్రకారం, ప్రగాఢ ఆధ్యాత్మికకోణంనుండి చూస్తే విశ్వజీవనానికి ప్రతీక కేంద్రంగా భూమిని పరిగణించడం జరిగింది. పరిమితమైన కేంద్రీకృతమైన ప్రదేశంలో పరివర్తన యజ్ఞం తేలికగా జరగాలన్నది అసలు ఉద్దేశం. ఈ పని మరింత సమగ్రంగా, శక్తివంతంగా జరగడానికి సమస్యలోని ముఖ్యాంశాలను ఒక చోట చేర్చి పరిశీలించడం కోసం ఈ విధమైన దృక్పథం

ఏర్పడింది. అందుచేత శ్రీఅరవిందులు పృథ్వి అస్తిత్వం ఒక్కటే పరిగణనలోకి తీసుకున్నారు.

శిలలలో చైతన్యము

కాని అది ప్రతీకాత్మక అస్తిత్వంగా, అంటే అది విశ్వజనీన చర్యకు ప్రాతినిధ్యం వహించేదిగా మనం అర్థం చేసుకోవాలి. అది ప్రతీకాత్మక, కేంద్రీకృత ప్రాతినిధ్యం. భౌతికజగత్తులో నిక్షిప్తమైవున్న పరమాత్మ సంపూర్ణ అభివ్యక్తీకరణలో మేలుకొలిపి, వికసింపచేసి, చివరికి ఆవిష్కృతం చేయడమే పృథ్వి అస్తిత్వపు లక్ష్యం. పరమాత్మను విముక్తం చేసే పురోగమన వికాసం వైపు అంతరాంతరాలలో జడపదార్థాన్ని ప్రచోదితం చేయడం ఈ ప్రక్రియలో జరగవలసి యున్నది.

బాహ్యాదృశ్యమాన స్థితిలో మొదట మనకు రాళ్లు, లోహాలతో నిండిన ఖనిజసామ్రాజ్యం కనిపిస్తుంది. మన బాహ్యాదృష్టికి ఇది పూర్తిగా అచేతనామయం. ఈ అచేతన వెనుక పరమాత్మ జీవనం ఉంది. పరమాత్మ చైతన్యం ఉంది; నిక్షిప్తమై నిగూఢంగా ఉంది. ఈ చైతన్యం సుషుప్తిలో ఉంది – అలా కనిపిస్తుంది అంతే. ఈ భౌతికజగత్తులో చైతన్యం అంతకంతకు అభివ్యక్తం కావడానికి పూర్తిగా నిశ్చేతనాత్మకంగా కనిపిస్తున్న ఈ భౌతిక పదార్థాన్ని మెల్లిమెల్లిగా పరివర్తన చెందించటానికి ఈ పరమాత్మ సుషుప్తిలో సైతం తన పని తాను చేసుకొనిపోతోంది.

మొదట్లో జడభౌతిక పదార్థ యవనిక ఎంత దట్టంగా ఉంటుందంటే, బాహ్యాదృష్టికి, అందులో చైతన్యం కానీ, జీవం కానీ ఉన్నట్లు కనిపించదు. ఒక రాయిని తీసుకొని మాములు నేత్రాలతో, మానవచైతన్యంతో చూస్తే అందులో జీవం, చైతన్యం లేవని కచ్చితంగా చెప్పవచ్చు. అయితే బాహ్యారూపాల వెనుకగల వాస్తవికతను చూడడం ఎలాగో తెలిసిన వ్యక్తికి భౌతికపదార్థ కేంద్రంలో – పదార్థంలోని, అణువులోని ప్రతి కేంద్రంలో ఒక సర్వోత్కృష్ట దివ్యసత్యం నిక్షిప్తమై ఉన్నట్లు కనిపిస్తుంది. లోపల వున్న పరమాత్మను ఆవిష్కరించడానికి జడమయమైన ఈ పదార్థాన్ని నెమ్మదిగా, వేలాది సంవత్సరాలపర్యంతం ఈ సత్యం పరి

వర్తన చెందించడానికి శ్రమిస్తున్నది. తరువాతి జీవన ఇతిహాసం ఎలా పురోగమించింది కనిపిస్తుంది. ఇదీ జీవితపు గాథ.

జీవరాసులు ఉద్భవించుట

రాయినుండి హఠాత్తుగా బీజరూపంలో జీవం ఉద్భవించింది. అనంతరం జరిగిన రూపాంతర ప్రక్రియలో జీవాన్ని ఆవిష్కరించే సేంద్రీయపదార్థం రూపొందింది. ఖనిజ, వృక్షరాజ్యాల మధ్య మధ్యంతర మూలద్రవ్యాలున్నాయి. అవి ఏ శాఖకు చెందినవో తెలియదు. వీటిని అధ్యయనం చేసినప్పుడు కొన్ని జీవాలు అటు ఖనిజరాజ్యానికి కాని, ఇటు వృక్షరాజ్యానికి కాని చెందినట్లు కనిపించవు. తరువాత వృక్షసామ్రాజ్యం వచ్చింది. మొక్కలో పెరుగుదల, తిరిగి నశించిపోవడం కనిపిస్తుంది. రాయిలో కన్న ఈ ప్రక్రియ మొక్కలలో వేగంగా జరిగింది. ప్రకృతిశక్తుల నుండి ఒక రాయిని కాపాడితే, అది శాశ్వతంగా నిలిచి ఉంటుంది. అయితే మొక్కలు అలా కాదు. ఒక పరిమితమైన చైతన్యంతో అవి పైకి పెరిగి కొమ్మలు విస్తరించి తిరిగి నశించి భూమిలో కలిసి పోతాయి.

మొక్కలలో చైతన్యము

వృక్షజాతిలో ఒక చైతన్యం కనిపిస్తుంది. మొక్కలకు సూర్యుని వెలుగు అవసరం. సూర్యుని శక్తివల్ల అవి పెరుగుతాయి. సూర్యకాంతి లేని చోట మొక్కను పాతితే, అది పైకి పెరిగి సూర్యకాంతి అందుకోవాలని యత్నిస్తుంది. మనుష్యులు జోక్యం చేసుకోని అడవులలోని చెట్లలో ఈ విధమైన సంఘర్షణ ఉంటుంది. ఆ చెట్లన్నీ బాగా పైకి పెరిగి సూర్యకాంతిని అందుకోవడానికి యాతన పడతాయి. చుట్టూ గోడలు ఉన్నచోట, సూర్యకాంతి చొరబడని ప్రదేశంలో చిన్నకుండీలలో మొక్కలు వేస్తే అవి సూర్యకాంతి కోసం తహతహలాడుతూ పైకి విస్తరిస్తాయి. వాటిలో ఒక చైతన్యం, జీవించాలన్న సంకల్పం అభివ్యక్తం కావడం మనం చూస్తాం. ఈ మొక్కలలోని రూపాలు కొన్ని నెమ్మదిగా వృద్ధి జెందడంతో అటు మొక్కలు, ఇటు జంతువులు కాని ఒక మధ్యంతర జీవదశ ఏర్పడింది. అటువంటి జీవాలు ఎన్నో ఉన్నాయి.

కొన్ని వృక్షాలకు నోరులాంటి అవయువాలు ఉంటాయి. దాని లోపల మనం ఒక ఈగను వేస్తే దానిని మింగివేస్తుంది. అది వృక్షం కాదు, జంతువూ కాదు. అటువంటి మొక్కలు ఎన్నో ఉన్నాయి. వాటిని మాంసాహార (carnivorous) చెట్లు అంటాము.

జంతువుల ఆవిర్భావము

ఇక జంతువులను పరిశీలిద్దాం. మొట్టమొదటి జంతువులకు, చెట్లకు మధ్య తేడా గుర్తించడం కష్టం. దాదాపు వాటిలో చైతన్యం లేనట్లే. కాని చిన్నమృగాలనుండి ఏనుగులవంటి పెద్ద జంతువులవరకు అవి ఎంతో చైతన్యవంతంగా కనిపిస్తాయి. వాటికి వ్యక్తిగతమైన సంకల్పం ఉంటుంది. అవి స్పృహతో ఉంటాయి. వాటికి చాలా అద్భుతమైన తెలివితేటలు ఉంటాయి. ఉదాహరణకు ఏనుగు. ఏనుగులు గూర్చి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. అవి చాలా తెలివైనవి.

మనిషి ఆవిర్భావము

అంటే అప్పటికే ఛాయారూపమాత్రమైన, దృశ్యమానమైన మనస్సు అవతరించినట్లే. ఈ పురోగతిలో మనకు కోతివంటి మధ్యంతరజాతి, మనకు తెలిసిన కోతి కాకుండా అటువంటి పోలికతో రెండుకాళ్లపైన నడిచే వానరం ఉన్నట్లు మనకు పరిశోధనలో తేలింది. బహుశః ఆ జాతి అంతరించి ఉంటుంది. మనకు అవశేషాలు లభించాయి. అదిగో ఆ దశనుండి మనం మానవుని దశకు వచ్చాము. అక్కడనుండి మానవపరిణామ క్రమానికి నాంది జరిగింది. అతనిలో చాలా అద్భుతమైన మేధ ఉందని చెప్పలేము. చెప్పగలమా? కాని అతనిలో ఒక మనస్సు పనిచేయడం ప్రారంభించింది. అతనిలో ఒక స్వాతంత్ర్యం, పరిసరాలకు, ప్రకృతిశక్తులకు స్వతంత్రమైన ప్రతిస్పందన కనిపిస్తుంది. మనుష్యులలో ఒక పరిణామక్రమం, మానవవికాసక్రమం, ఆధ్యాత్మికజీవితం అందుకోగల ఉన్నతచైతన్యవికాసం మనకు కనిపిస్తుంది.

అనువాదం: కె. యజ్ఞన్న

మనిషి తనను తాను అధిగమించుట

సృష్టి అట్టడుగు స్థాయిలో మొదలై క్రమక్రమాభివృద్ధి చెందు తుంది. ఉన్నతజాతులు ఆవిర్భవిస్తాయి. ప్రతి ఒక్కజాతికి ఆ జాతి లక్షణాలుంటాయి. ఆ జాతి వ్యక్తులలో ప్రతిబింబిస్తాయి. ఉదా: పిల్లులన్నిటికి పిల్లి తెలివితేటలుంటాయి. మనుషులకు మనిషి తెలివితేటలుంటాయి. కాని కొంతమంది మహా మను షులుంటారు. వారు మానవమేధా పరిధుల నధిగమించి మాన వాతీత జ్ఞానమును పొందగలరు. రాబోయే ఉన్నతజాతి ప్రతి నిధులు వారు. — సంపాదకుడు

ప్రశ్న: శ్రీఅరవిందులు అంటున్నారు: "ఈ చైతన్యం మేధకు సంబంధించి పతాకస్థాయి చేరుకుంటుంది. అది మనిషిలో తనను తాను అధిగమిస్తుంది......." అంటే ఏమిటో వివరించండి మాతా!

ప్రకృతి బంధాల నుండి విముక్తి

ఔను. నేను చెప్పింది అదే. ఈ అత్యున్న తదశలో మనిషి ప్రకృతిపై ఆధారపడ కుండా సర్వస్వతంత్రుడుగా ఉంటాడు. అతను పూర్తిగా స్వతంత్రుడు కాగలడు. తనలోని ఆధ్యాత్మిక చైతన్యాన్ని సాక్షాత్కరింప చేసుకున్ననాడు, తనకు తన మూల మైన పరమాత్మతో నేరుగా సంబంధం కలవాడు ప్రకృతికి, ప్రాకృతశక్తికి దూరంగా స్వతంత్రంగా జీవించగలడు. తనను తాను అధిగమించడమంటే అదే అని శ్రీఅరవిందులు చెప్పారు. ప్రకృతి యంత్రాంగం అవసరం లేకుండానే, పరమాత్మతో ప్రత్యక్ష సంబంధం పెట్టుకొనే శక్తిగల ఒక రూపాన్ని తయారుచేయాలి. తనను తాను అభివ్యక్తం చేసుకొనే ప్రయత్నంలో అంతర్గతమైన చైతన్యం, సర్వోత్కృష్ట ఆధ్యాత్మికసత్యం ఒక చైతన్యమూర్తిని రూపకల్పన చేసుకుంటుంది.

*

నూతనజాతుల ఆవిర్భావము

అన్ని రూపాలలో ఉన్న దివ్యచైతన్యాన్ని మరింతగా అభివ్యక్తం చేయడానికి ప్రకృతి ఒక ఆరోహణా పురోగమన క్రమాన్ని

అనుసరిస్తున్నదని శ్రీఅరవిందులు చెప్పియున్నారు. ప్రకృతి ఒక కొత్తరూపాన్ని తయారు చేసినప్పుడు, ఆ రూపంలోని ఆత్మను పూర్తిగా అభివ్యక్తం చేయగల మూర్తిని రూపొందిస్తుంది. ఒక రూపం వస్తుంది. అభివృద్ధి చెందుతుంది. ఉన్నతశ్రేణిని అందు కుంటుంది. తరువాత మరో రూపం వస్తుంది. ఇతర రూపాలు అంతరించిపోవు. కాని వ్యక్తిత్వరూపం పురోగమించదు. ఉదాహ రణకు కుక్క, కోతి – కొన్ని ప్రత్యేకమైన లక్షణాలుగల జాతికి చెందినవి. కోతిగాని, మనిషిగాని సంభావ్యతల ఔన్నత్యం చేరు కొంటే, అంటే ఒక మానవ వ్యక్తిత్వరూపం అత్యుత్తమ మానవ రూపంగా మారుతుంది. అక్కడితో సరి. అంతకు మించి వ్యక్తి గత మానవరూపం ఇక పురోగమించలేదు. అతను మానవజాతి వర్గానికి చెందినవాడు. అలాగే కొనసాగుతాడు. పృథ్వి చరిత్ర దృష్టిలో పురోగతి ఉంది. అంతకు ముందు వచ్చిన జాతులతో పోల్చితే ప్రతి జాతి ఒక పురోగమనాన్ని సూచిస్తుంది. కాని వ్యక్తిగత దృక్పథంలో ఈ పురోగమనం కనిపించదు. మనిషి పుడతాడు. అభివృద్ధి చెందుతాడు. మరణిస్తాడు. అంతరించిపో తాడు. కాబట్టి వ్యక్తి పురోగతి సాధించాలంటే, మరో సాధన (ఉపకరణ) కనుగొనడం అవసరం. ఇప్పుడున్నది చాలదు. ప్రతి రూపంలోను అంతర్గత దైవసాన్నిధ్యం ప్రభావానికి నేరుగా గురియై, మరింత సన్నిహితమయ్యే చైతన్య వ్యవస్థీకరణ ఉంటుంది. ఈ ప్రభావానికి గురియైన శక్తి అంతర్గతంగా కేంద్రీకృతమైనప్పుడు

చైత్యపురుషుని విశిష్టత

భౌతికరూపానికి సంబంధం కాని స్వతంత్ర జీవనం ఆ రూపానికి ఉంటుంది. దీనినే లోకం 'ఆత్మ' అని 'చైత్యపురుషుడు' అని అంటోంది. ఇది మనలోని దైవకేంద్రం చుట్టూ వృద్ధి చెందు తుంది. అది అమరం, చిరంతనం. బాహ్యమైన శరీరం రాలిపో తుంది. ప్రతి జన్మలోను ఆత్మకు కలిగిన అనుభవాల, క్రమంలో అది ఉండిపోతుంది. అందువల్ల ఒక జన్మనుండి మరో జన్మ తీసు కున్నప్పుడు పురోగమనం ఉంటుంది. అది ఒకే వ్యక్తి పురోగ మనం! ఈ చైతన్య చలనం మరో చలనాన్ని పూర్తి చేస్తుంది.

వ్యక్తి మహోన్నత స్థాయికి జేరుట

అంటే ఇతర జాతులతో పోల్చితే, సాపేక్షికంగా చూస్తే, పురోగమించే జాతి బదులు, ఈ జాతుల పురోగమన దశలగుండా వ్యక్తిత్వచైతన్యరూపం కదిలి వెళ్తుంది. ఒక జాతి తన సంభావ్యతల చివరి హద్దు చేరినప్పటికీ, ఈ వ్యక్తిత్వం పురోగమిస్తూ ఉండవచ్చును. మామూలు జాతులు సంభావ్యతల హద్దు దాటి మనలేవు. ఆ హద్దు వద్ద ఆగిపోతాయి. లేదా అదృశ్యమైపోతాయి. అయితే భౌతికరూపంతో సంబంధం లేకుండా స్వతంత్రంగా జీవితం గడిపే వ్యక్తిత్వం (individual) ఒక రూపం లోనుండి మరోరూపంలోకి పురోగమించవచ్చు. తన పురోగమనాన్ని నిరవధికంగా కొనసాగించవచ్చును. దీనివల్ల ద్వివిధమైన పురోగతి కలిగి తనకు తాను సంపూర్ణం చేసుకుంటుంది. అందువల్లనే తను క్షణమాత్రకాలం చెందిన రూపానికి దూరంగా, స్వతంత్రంగా, అత్యున్నతమైన ఆత్మసాక్షాత్కారం, జ్ఞానసిద్ధిని పొందే అవకాశం ప్రతివ్యక్తి కలిగి ఉన్నాడు.

అనువాదం: యజ్ఞన్న

మనం పొందవలసిన సిద్ధి

సృష్టి ఎందుకు జరిగింది? ఎలా జరిగింది? దేవునిలో ఒక స్పందన మొదలైంది. అఖండమైన పదార్థము విచ్ఛిన్నమై ఖండ ఖండములుగా అయింది. తత్ఫలితంగా ఎవరికి వారే అనే వేర్పాటు భావం కలిగింది. మళ్లీ అఖండత్వాన్ని పొందుట ఒక సిద్ధి. అది కళ్లు మిరుమిట్లు గొలిపే దర్శనము. చిత్రవిచిత్రమైన అనుభూతులతో కూడిన శ్రీమాత వివరణ ఆశ్చర్యమును కలిగించక మానదు.

— సంపాదకుడు

సృష్టికి సంబంధించిన ప్రత్యక్షానుభూతి

ఈ ఉదయం 8 గంటల సమయాన నేను అనేక విషయాలు

మీకు చెప్పి ఉండెడిదానను. ఎందుకనగా ఈ ఉదయం జరిగిన ఒక సంఘటనవలన అనేక సమస్యలు ఉత్పన్నమైనాయి. వాటికి స్పష్టమైన సమాధానాలతో కూడిన అనుభవం కూడ నాకు కలిగింది. *ఈ సృష్టి ఎందుకు జరిగింది? ఎలా జరిగింది? అన్న విషయాన్ని గూర్చి నిశ్చల అనుభూతి నాకు రెండుగంటల కాలం సంపూర్ణంగా సమకూరింది.* ఆ అనుభూతి ఎంతో తేజోవంతమైనది, సత్యమైనది. ఆ అనుభూతి తీవ్రత క్రమంగా తగ్గుచూ చివరకు అంతమైపోయింది. దాన్నిపుడు వివరించడం కష్టసాధ్యం. కాని అదంతా అపుడు స్పష్టంగా తేటతెల్లమైంది. అన్నిరకాల విరుద్ధవాదనలు, అన్ని వ్యాఖ్యానాలు, వివరణలు, శ్రీఅరవిందులు చెప్పినదీ, గుప్తవిద్యావేత్త 'థియాన్' చెప్పిన కొన్ని విషయాలు నా స్వానుభవ ఫలితాలుగా గోచరమైనాయి. సృష్టి యందలి ప్రతిదీ దాని దాని స్థానంలో అడుగుభాగాన స్పష్టంగా నిలిచి ఉంది. ఆ అనుభవాలను కలిగియుంటున్న ఆ సమయంలో నేను వాటిని గూర్చి పూర్తిగా చెప్పి ఉండెడిదానను. కాని ఇప్పుడు చెప్పడం కొద్దిగా కష్టమే.

అదొక అద్భుతమైన దివ్యదర్శనము. సృష్టి ఎలా ఏర్పడిందో ఎందుకేర్పడిందో దాని గమ్యమెక్కడికో అన్న వివరాలన్నీ స్పష్టంగా, విస్పష్టంగా నాకు గోచరమైనాయి. ఆ సమయంలో నేను వెలుగులీనునట్టి, కన్నులు మిఱుమిట్లు గొలుపునట్టి స్వర్ణ కాంతుల శోభలో మునిగి ఉన్నానంటే నమ్మండి. మాటల్లో దాన్ని వివరించాలంటే అది "సర్వోత్కృష్టమైన" "పరబ్రహ్మ" మరియు "సృష్టి" అని చెప్పనొప్పును.

పరమాత్ముని అఖండ స్వరూపము

ఆ నిశ్చల నీరవ "పరబ్రహ్మ" సకల సంభావ్యతలు భేదరహితంగా, సమగ్రంగా కూడియున్న ఏకత్వస్థితి. కాని సృష్టి ఈ ఏకత్వంలో కూడియున్న వాటి ప్రక్షేపము (projection). ఈ ప్రక్షేప ప్రక్రియలో పరస్పర వ్యతిరేకశక్తులు వేర్వేరై విభజనకు గురైనాయి. దానివల్ల సృష్టి భిన్నత్వంతో కూడుకొన్నదైంది. ఉదాహరణకు రాత్రి – పగలు, నలుపు – తెలుపు, మంచి

– చెడు వగైరా వగైరా. కాని ఇదంతా, ఈ భిన్నత్వమంతా మన మనఃకల్పిత వివరణే.

ఖండచైతన్యము అఖండత్వము నెరుగుట

వాస్తవంగా చెప్పాలంటే ఆ "పూర్ణం" అనేది సుస్థిరమైన, అభేద్యమైన పరిపూర్ణ ఐక్యతా స్థితియే. సృష్టి అనగా ఈ ఐక్యముయొక్క విచ్ఛిన్నత, వేర్పాటు స్థితి. అనగా చేతనయొక్క విభజన అనవచ్చు. తన ఐక్యతయొక్క ఎరుకను కలిగియున్న ఏకత్వంనుండి ఈ చేతనయొక్క విభజన ప్రారంభమవుతుంది. మరల ఆ విభజన, ఏకత్వంలో భిన్నత్వాన్ని గుర్తించిన మౌలిక ఏకత్వాన్ని చేరడానికే జరిగింది. భిన్నభిన్న ఖండాలవలన ఈ విభజన మార్గం దేశకాలాదులుగా రూపొందింది. మనం ఆదిలో "ఏకమేవా ద్వితీయం బ్రహ్మ" లో ఉండి అనంతరం విడిపోయిన ఖండాలమే గనుక, మనం ఆ ఏకత్వ – అనేకత్వాల ఎరుక కలిగివుండే అవకాశం ఉంది. ఇపుడు కొనసాగుతున్న కార్యమిదే.

వివరంగా చెప్పాలంటే వేరైన చేతనయొక్క ప్రతిసూక్ష్మాతిసూక్ష్మమైన మూలపదార్థం కూడ భిన్నత్వంలోని తన ఖండ చేతనయొక్క ఎరుక కలిగివుంటూ, మౌలిక పూర్ణచేతనను కనుగొనే ప్రక్రియ కొనసాగుతున్నది. దీని ఫలితంగా ఆ మూలచేతన తన ఐక్యతను, సమస్త సృష్టి క్రీడను, ఏకత్వంయొక్క అసంఖ్యాక మూలపదార్థాల ఎరుకను సహా కలిగి ఉంటున్నది. ఈ ప్రక్రియ అచేతనస్థాయినుండి సచేతనస్థాయివరకు కొనసాగుతున్న కాలగమనముగా పరిగణింపబడుతున్నది. ఈ అచేతనం ఏకత్వ చేతనంయొక్క ప్రక్షేపం. ఈ అచేతనం మానవుల్లో అధికాధి చేతనగా తయారవుతున్నది. ఈ మానవులు వారి సూక్ష్మాతిసూక్ష్మ అస్తిత్వాన్ని తెలిసికొనగలిగి ఉంటున్నారు. అదే విధంగా వారు అభివృద్ధి లేదా పరిణామము లేదా రూపాంతరీకరణము ద్వారా మౌలిక ఏకత్వజ్ఞానాన్ని కూడ పొందగల స్థాయికి ఎదుగుతారు. నేను దర్శించిన ఆ దృశ్యం గూర్చిన వివరణ అంతా ఇదే. భౌతికం మొదలు అతిసూక్ష్మం వరకు ప్రతిదీ కూడ అక్కడ ఆ పర

బ్రహ్మలో స్థానం కలిగి ఉంటుంది. ఆ దృశ్యం స్పష్టంగా, విస్ప ష్టంగా ఉంది.

దుష్టత్వ మెందుకున్నది?

చెడు –.మనం చెడు అనే వస్తువు కూడ ఈ పూర్ణంలోఅవశ్యమైన స్థానం కలిగి ఉంది. మనం ఆ "తత్" (పరమాత్మ) ను తెలిసికొన్న తక్షణం ఆ చెడు చెడుగా గోచరించదు. చెడు అనేది, తన అత్యంత సూక్ష్మచేతనను చూస్తున్న అత్యంత సూక్ష్మమూల పదార్థ తత్వం. కాని చేతన తన మూలసారంలో ఒక్కటే కనుక ఆ సూక్ష్మచేతన మౌలికచేతనను తిరిగి పొందగలదు. అపుడు ఆ రెండూ ఒక్కటియే యగును. మనం పొందవలసింది కూడ అలాంటి భిన్నత్వంలో ఏకత్వమే కదా! ప్రొద్దున ఆ క్షణంలో నేను దర్శించిన అద్భుత దృశ్యం అదే!

ప్రారంభంలో ప్రక్షేపిత చేతనయొక్క విభజిత ఖండాలు చేతన మూలకేంద్రంనుండి దూరదూరమై పోయినవి. మూలం నుండి అలా విడిపోయి దవ్వుల కెగసిన ఆ ఖండచేతనలు అనే కానేకంగా పరిణమిస్తాయి. అవి కూడ స్పందనలు, అనుభూతులు, బహుళచేతన కలిగి ఉంటాయి. నిశ్చల పరబ్రహ్మనుండి వేరైన చేతనాకార్యమే ఈ ప్రపంచాన్ని, ఈ సమస్తాన్ని సృష్టిస్తున్నది. దుఃఖము – సుఖము, అంతా, అంతా దీని ద్వారానే ఆవిష్కారమవుతున్నది.

కేంద్ర చైతన్యానుభూతి

మనం "సమస్థితి" లో నివసిస్తున్నామన్న 'థియోన్' మాటలను నేనర్థం చేసికొన్నాను. చేతనయొక్క అసంఖ్యాక బిందువుల సమస్థితి ద్వారాను, వాటి పరస్పర వైరుధ్యాల ద్వారా కేంద్రచేతన తిరిగి కనుగొనబడింది. కాని ఈ చెప్పబడిందంతా వివేకశూన్యమైనదే. ఏ స్థాయి బుద్ధిహీనమైనదో నేను చూచాను. ఐనా దాన్ని అలా తప్ప మరోలా చెప్పలేం. అది సత్యమైనది, విశిష్టమైనది, అది పూర్తిగా "అదే", సర్వోత్కృష్టమైన "పరమాత్మయే"

నేనా పరమాత్మతో అపరోక్షానుభూతినంది ఉన్నంతసేపూ అది అలానే ఉండినది. కాని ఆ స్థితిలో బహుశా నేను ఇలా చెప్పి ఉండలేదు. కాగితంపై ఆ అనుభవాన్ని టూకీగా వ్రాయ సమకట్టితిని. ఐనా ఆ స్థితిలో ఏమి వ్రాసితినో నాకే తెలియదు. మొదట రచింపబడింది ఇదే:

స్థిరత్వము – మార్పు
జడత్వము – రూపాంతరీకరణము
శాశ్వతము – అభివృద్ధి
ఐక్యత – శక్తి – విశ్రాంతి సమ్మేళనం

ఇచట ఉద్దేశమేమనగా తనను తాను ప్రకటించుకొన నభిలషించు చేతనాస్థితిని ఆ రెండుతత్వాలు తిరిగి పొందాయి అనుట.

ఇదంతా జరిగింది విశ్వస్థాయిలోనేగాని వ్యక్తిస్థాయిలో కాదు. ఆ రెండూ ఇంకా కలిసిపోలేదని తెల్పుటకే వాటి మధ్య గీత పెట్టాను.

మనిషి క్షుద్ర చేష్టలు

అన్ని భావాలు, బుద్ధికుశలతతో కూడిన భావాలు సైతం బాల భాషణల మాదిరిగా అనిపించినాయి. All human reactions, even the highest, the purest, the noblest, appeared so childish.

శ్రీఅరవిందులు ఎప్పుడో, ఎక్కడో వ్రాసియుండిన మాట నిరంతరం నాలో స్ఫురిస్తూంటుంది. ఒకనాడు ఆయన ఒక పెద్ద వాక్యం వ్రాశారు. దానిలోని మాట ఇది: “నేను అసూయచెందినపుడు నాలో ఇంకా ఆ పాతమనిషి ఉన్నాడని నాకు తెలుసు”. ఈ వాక్యాన్ని నేను చదివి బహుశా 30 సంవత్సరాలై ఉంటుందని జ్ఞాపకం. “అసూయ” అన్న మాట చదివినపుడు నాలో నేనిలా అనుకొన్నాను: “శ్రీఅరవిందులు కూడ అసూయపడగలరా” అని. అందువల్ల 30 సంవత్సరాల అనంతరం “అసూయ” అనే మాటకు వారి భావన మానవాళి సాధారణంగా అనుకొనే “అసూయ” కాదు. అది పూర్తిగా మరో చేతనాస్థాయికి చెందినదని నేను స్పష్టంగా దర్శించాను.

ఈ ఉదయం ఆ మాట మరల నా మనస్సులో మెరిసింది. "నేను అసూయ చెందినపుడు ఆ పాతమనిషి ఇంకా నాలో ఉన్నాడని నాకు తెలుసు". అసూయగా ఉండడం అనగా ఆయనకు మనమనుకొనే అసూయ కాదు.

మనిషి అనగా ఒక సూక్ష్మాణువు

మనం వ్యక్తి అని పిలుస్తున్నది చేతన యొక్క అత్యంత సూక్ష్మమైన ఒక అణువు. ఈ సూక్ష్మచేతనాణువు మానసికకేంద్రం వద్ద నెలకొని ఉంది. తత్ఫలితంగా చేతనాణువు తన వద్దకు వస్తూ వెళ్తున్న విషయాలను గ్రహిస్తుంటుంది. దాని చెంతకు రాని విషయాలు కూడ ఒక విధమైన జ్ఞానాన్ని దాని కందిస్తాయి. దాన్నే శ్రీఅరవిందులు "అసూయ" అన్నారు. మనలో బైటనుండి కేంద్రానికి ప్రసరించే విషయపరిజ్ఞానం గాక, కేంద్రం నుండి బైటికి విస్తరించే పరిజ్ఞానం ఒకటి ఉంది. అలాంటి పరిజ్ఞానాన్నే ఈ సందర్భంలో శ్రీఅరవిందులు "అసూయ" అన్నారు. కనుక నాలో "అసూయ అనుభవం కలిగిందంటే ఆ పాతమనిషి నాలో ఇంకా దాగివున్నాడని నాకు తెలుసు" అని వారన్నారు. అంటే ఆ సూక్ష్మాతిసూక్ష్మ చేతనాణువు ఇంకా తన కేంద్రంలోనే ఉన్నదన్న మాట. ఆ కేంద్రం క్రియాత్మకము, గ్రహణాత్మకము, సంవేదనాత్మకము అయి ఉంటున్నది.

ఆ హృదయకేంద్రంలో విరుద్ధప్రవృత్తులు లేవు, నిరాకరణలు లేవు. అది సమైక్యతా కేంద్రం; తలపులతో మాటలతో వర్ణింపరానిది; హద్దులు లేని సువిశాల క్షేత్రం. చలనం లేని వెలుగుల నిలయం. గుర్తించబడని విశ్రాంతిధామం. అది "అదే" –

"అతిమానస" మేనని నేనిపుడు నమ్ముతున్నాను.

అనువాదం: బి. నరసింహయ్య

వ్యక్తి జీవితము – విశ్వజీవితము

విశ్వమందెల్లడల ప్రయుక్తమైనది ఒకే ఒక మహాచైతన్యము. ఈ చైతన్యము అక్కడక్కడ వస్తువులయందు కేంద్రీకృతమై అనేక మూర్తులుగా వ్యక్తీకృతమవుతుంది. ఒక్కొక్క మనిషి తనకు తానే ఇతరులతో సంబంధములేని వేరైన భావాన్ని కలిగి ఉంటాడు. కాని ఈ వేర్పాటుభావం నిజం కాదు. నువ్వు నీ ఎల్లలను దాటి విశ్వస్రవంతిలోకి ప్రవేశించినప్పుడు దానిని చవి చూడగలవు. దాని చిత్రవిచిత్రగతులను గ్రహించగలవు.

– సంపాదకుడు

మనిషి అనగా విశ్వవిన్యాసములను వీక్షించే ఒక కొయ్య బొమ్మయేనా? లేక తనకు తానుగా సృష్టిలోను విశ్వ ప్రక్రియలోను పాల్గొనగలడా?

వ్యక్తి – విశ్వముల సంబంధము

అది నీ చేతనాస్థాయిని బట్టి ఉంటుంది. విశ్వమనగా నువ్వు ఒక్కడివే కాదు గదా? విశ్వస్రవమైన శక్తి యున్నది. లోకాలన్నీ కూడా ఆ మహాసముద్రంలో వాటి వాటి ధర్మానుసారంగా ప్రవర్తిస్తాయి. మనుషులు కూడా అంతే. అంతేగాని ఏ ఒక్కటి స్వయంగా స్వయంశక్తితో ప్రవర్తించదు.

విశ్వమంతా ఒక చైతన్యస్రవంతి

ప్రతి వ్యక్తి తను వేరు అనే స్వభావము సర్వజనులయందు ప్రబలియున్నది. నీ మనస్సు చాలా చిత్రమైన వస్తువు. అది ప్రతి వస్తువును వేరుగా మాత్రమే భావించగలదు. ఒకే విశ్వంలోని మహాచైతన్య ప్రవాహంలోని భాగంగా చూడ లేదు. కాని ఈ సృష్టిలోని ప్రతి వస్తువుయొక్క సత్యము అదియే. ఏ ఒక్క వస్తువు అచ్చంగా స్వతంత్రమైనది కాదు.

మరి సత్యానికి భిన్నంగా ఇటువంటి ఖండజ్ఞానము ఎక్కణ్ణుంచి వచ్చింది? సృష్టి క్రీడకు అది అవసరం గనుక. నిజమే గతసృష్టికి అది అవసరమే. కాని ఎల్లకాలానికి అదే విధంగా

ఉండవలసిన అవసరం లేదు. ఈ విశ్వమందెల్లడల ఒకే ఒక ఖేల, ఒకే క్రీడ జరుగుతూంటుంది.

మనుషులు కీలుబొమ్మలు

చాలామంది మనుష్యులు ఏమి తెలియని కీలుబొమ్మలవలె అందులో పాల్గొంటున్నారు. కొంతమందికి అధికమైన జ్ఞానముంటుంది. ఆయినప్పటికి వారి పాత్రను వారు పోషిస్తూనే ఉంటారు. ఇంకా కొంతమంది దివ్యచైతన్యాన్ని ఎరిగి దానితో తాదాత్మ్యముచెంది కూడ, వేరు వ్యక్తులవలెనే తమ విధిని తాము చక్కగా నిర్వహిస్తూ ఉంటారు.

జ్ఞానముయొక్క అనేక అంతస్తులు

ఈ వేరు భావము పేరే అజ్ఞానం. అజ్ఞానానికి సంపూర్ణజ్ఞానానికి మధ్య అనేక శ్రేణులు. నువ్వు ఒక పనిని చేసి అది నీ నిర్ణయం ప్రకారమే జరుగుతుంది అని అనుకోవచ్చు – లేక ఆ పనిని నువ్వు చేసినప్పటికి మరొకశక్తి నీ చేత చేయిస్తున్నది అని తెలియుట ఒక మెట్టు ఎక్కువే. ఆ పని నీవెందుకని చేస్తున్నావో దాని ప్రయోజనమేమిటో తెలియుట తరువాత స్థాయి. నీ అభివృద్ధికి ఈ విధమైన పాక్షికజ్ఞానం అవసరమైనంత వరకు అలాగే కొనసాగుతూ ఉంటుంది. నువ్వు ఒకే మహాచైతన్యానికీ చెందిన ఉపకరణము అని ఎప్పుడైతే తెలుసుకుంటావో అప్పుడు మరొక ఉన్నతచైతన్యాన్ని అందుకుంటున్నావన్న మాట.

ఈ సమస్తమైన సృష్టికి గమ్యం ఒక్కటే – దైవము వైపు ప్రయాణాన్ని సమిష్టిగా నిరంతరం కొనసాగించడమే.

*

మనుషులు వేరైనా అందరిలోను ఉన్న సారాంశము ఒక్కటే అనే విషయము ఆధ్యాత్మిక సాధనవలన తెలుస్తుంది. అయితే అందులో ఉన్న అనంతవైవిధ్యమును గుర్తించి ఆ వైవిధ్యంలోనే సంపూర్ణ వైభవమును పొందుట ఆధ్యాత్మిక జీవితముయొక్క లక్ష్యము.

శ్రీమాత ప్రశ్నోత్తరాలు 1929

ఏకత్వంలో భిన్నత్వం

ఆహా! ఇది సృష్టికి ఎంత చక్కటి లక్ష్యము! సకలమైన సృష్టికి మూల మొక్కటే. కాని ఆ ఏకత్వంలో తన ప్రత్యేకతను నిరూపించుకొనుట ఒక విశేషము. తాను అఖండస్వరూపములోని ఒక భాగమే అని తెలిసికూడ భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించాలి. అంతే కాదు భిన్నత్వంలోనే ప్రతి ఒక్క అంశము తనదైన ప్రత్యేక రీతిలో దివ్యవైభవాన్ని పొందాలి.

ప్రతి వ్యక్తి తన ప్రత్యేకతను ఏ విధంగా అభివ్యక్తపరచాలి?

అంతరంగిక సత్యాన్ని దర్శించి తదనుగుణంగా నడుచుకొని నిరూపించుకోవాలి. "The Science of Living" అనే పుస్తకంలో నేనీ విషయాన్ని ఇంకా విశదంగా చెప్పాను. సత్యమనగా ప్రతి ఒక్కరు వారి వారి విలక్షణత్వమును నిరూపించుకొనుటయే.

కానీ ఈ సత్యము ఒక్కొక్కరికి ఒక్కొక్క రూపంలో ఉంటుంది కదా

ఒక్కొక్కరిది ఒక్కొక్క ధర్మము

అవును. అటులకాని యెడల అందరు ఒకే రూపంతో ఉండి ఒకే విధంగా ప్రవర్తించిన యెడల విచిత్రంగా ఉండదూ! అప్పుడు అందరు ఒకే మాదిరిగా ఉన్న యెడల ఇక ఈ సృష్టి అవసరమెందుకు? అనంతమైన వైవిధ్యం ఈ సృష్టి యొక్క లక్షణం. ఆ వైవిధ్యం ద్వారానే మళ్లీ వాటి సారాంశమైన ఏకత్వం నిరూపించబడుతుంది. అదే ఈ ప్రపంచంలో ఉన్న అద్భుతమైన విషయం.

వ్యక్తి ధర్మమును విస్మరించుట

వ్యక్తి ఏకేశ్వరునితో తాదాత్మ్యము పొందినప్పటికి తన ప్రత్యేకతను పోగొట్టుకోడు. కాని బుద్ధుడు, శంకరుని అనుచరులు ఏకమాత్రభావనను పొందగానే తమ వ్యక్తిత్వాన్ని విస్మరించారు. వారి ఉద్దేశంలో భగవంతునితో ఐక్యమగుట అనగా తమ ప్రత్యేక సత్యాన్ని, ధర్మాన్ని రద్దుపరచుట. కాని ఇది సృష్టి ధర్మానికి విరుద్ధము. ఈ సృష్టి చాల అద్భుతమైనది. ఏకత్వములో భిన్న

త్వము ఎంత వైభవంగా తాండవిస్తుంది! బ్రహ్మభావన కలిగిన పుటికి వ్యక్తిభావనను విస్మరించరాదు. బ్రహ్మలో నిమజ్జనమైపో వటం తేలిక. కాని అదే సమయంలో నీ ప్రత్యేక వ్యక్తిత్వాన్ని కూడ అనుభవించటం ఇంకా గొప్ప సిద్ధి, అద్భుతమైన సత్యము. ఈ రెండు కొనలను కలుపుటకే ఈ విశ్వమేర్పడింది. ఆ అను భూతిలో ఈ రెండు కొనలు ఒకటే – సమస్తము, వ్యస్తము, బహుళము – అని నిరూపించబడుతుంది.

కాని మనుషులందరు తాము వేరని అనుకుంటారు కదా.

బాహ్యరూపమంతే కదా మరి!

అది అజ్ఞానము.

కాదు, సారతః మనుమలందరు ఒకటే అనే సత్యాన్ని గుర్తించకపోవటమే అజ్ఞానము. అభివ్యక్తిలో వేరు వేరు రూప ములు ఉండటం సహజమే. అలా కాకుండా ఒకే రూపముండాల నుకోవటం అవివేకం. అందరూ ఒకే రూపంలో ఉంటె దాని ప్రయోజనమేమిటి? దేవుడు తప్పు చేసేడంటావా? తనేం చేయద ల్చుకున్నాడో తనకు తెలియలేదా? లేక ఒకటి చేయాలనుకొని మరొకటి చేశాడా? ఈ ప్రపంచంలో వస్తువులన్నీ ఒకే రూపంలో ఉండాలనుకోవటం మూర్ఖత్వం. మీరందరూ ఒకే రూపంలో ఉండి ఒకే మాట మాట్లాడుతూ ఒకే ఆలోచన చేస్తున్నట్లయితే నేనిక్కడి నుంచి పారిపోవలసి వస్తుంది!

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి, ఆర్. లక్ష్మిప్రసాదమ్మ

In a high state where ignorance is no more,
Each movement is a wave of peace and bliss,
Repose God's motionless creative force,
Action a ripple in the Infinite
And birth a gesture of Eternity.

(*Savitri*, p. 200)

ఇతర గ్రహాలపై జీవులున్నారా?

భూలోకంలో మనుషులున్నారు. సృష్టిలో మరెక్కడైనా కూడ జీవులున్నారా అనేదే ప్రశ్న. మనకు పరిచయమైన రూపాలు లేకపోవచ్చు. మరోవిధమైన జీవులుండవచ్చు. అయితే ఆ జీవులకు అంతరంగంలో చైత్యపురుషుడుండడు. ఇది మన భూలోకపు ప్రత్యేకత. ఈ విశాలమైన విశ్వంలో భూలోకానికొక ప్రత్యేక స్థానమున్నది. మనం దేవుని ముద్దుబిడ్డలం!

— సంపాదకుడు

ఈ విశ్వంలో అనేక గోళాలున్నాయి. ఒక గోళానికి మరొక గోళానికి సంబంధం లేదనడానికి మన వద్ద ఆధారాలు లేవు.

మన విశ్వం ఒక్కటే దైవాంశభరితమైనదటానికి కూడా ఆధారాలు లేవు. మనమున్న విశ్వమును గురించి మనకి తెలుసు. ఇదే విధంగా అనేకమైన ఇతర గోళాలు కూడా ఉన్నాయి. అవి ఇంతకన్న మెరుగైన స్థితిలో ఉండవచ్చును. మన విశ్వం చూడటానికి దుఃఖభూయిష్టంగా ఉంది. కాని బాహ్యారూపాన్ని దాటి, అంతర్గత దృష్టిని సారిస్తే దుఃఖభరితంగా లేదని, అది మనం చూసే విధానాన్ని బట్టి ఉంటుందని తెలుస్తుంది.

*

ప్రశ్న: బృహస్పతి గ్రహంలోగాని, అంగారక గ్రహంలోగాని జీవులున్నారా?

నన్నడిగితే అన్ని గ్రహాలలోను ప్రాణికోటి ఉందనే అంటాను. ఉన్నది. కాని మనం చూడలేము. అంతే. ప్రతీ గ్రహంలో ఉన్నారు. మనం సాధారణంగా సినిమాలలో చూసిన విధంగా ఉండరు. అంగారకగ్రహంలోని జీవులను బొమ్మలపుస్తకాలలో అతిభయంకరంగా చూపిస్తూ ఉంటారు. వికారంగా చూపిస్తారు. వారు ఆ విధంగా ఉండనే ఉండరు.

ప్రశ్న: ఇతర గోళాలలోని, గ్రహాలలోవున్న వ్యక్తులలో చైత్య పురుషుడుంటాడా?

ఉండడు. అది భూలోకవాసుల ప్రత్యేకత. అయితే చైత్య పురుషులు వారికిష్టమైతే ఇతర లోకాలకు వెళ్లగలరు. బహుశః అక్కడ చైత్యపురుషులను కలుసుకోవచ్చు. వారు భూలోకంనుంచి వెళ్లినవారు అయివుండవచ్చు.

*

ప్రశ్న: మనం ఉంటూవున్న భూగోళం, ఇతర విశ్వగోళాలతో పోలిస్తే చాలా తక్కువ స్థాయిలో ఉంటుంది కదా?

మనది కేవలం భౌతికమైన ప్రపంచం. అంతమాత్రం చేత మనం దానిని తక్కువగా అంచనా వేయరాదు. అది తక్కువగా కనిపిస్తూ ఉందనుకుంటే అది కేవలం అంధకారం, అజ్ఞానం వలనే కాని అది కేవలం భౌతికం కావడంవలన మాత్రము కాదు. మనం భౌతికరూపాన్ని చూసి అజ్ఞానం అనుకోవడం అంధకార బంధురం అనుకోవడం మన పొరపాటే. భౌతికలోకం అన్నింటి లోకి ప్రధానమైన లోకం. ఎందుకంటే అన్ని ప్రపంచలోకాలకి మూలతత్త్వమైనది భౌతికలోకం. ఇది అన్ని లోకాలలోకి ప్రధాన మైనది. ఇక్కడ నుండే సమస్త లోకాలు అభివ్యక్తమవుతాయి.

ప్రస్తుతం అది అంధకారంలో మునిగి ఉంది. అది కేవలం తాత్కాలికమే.

ఒకరోజు ఈ విశ్వం అతిసుందరంగా, లయబద్ధంగా జ్యోతి ర్మయంగా, అనుభవయోగ్యంగా అయితీరుతుంది. దాని ఉద్దేశ్యం అనుభవయోగ్యం కావడమే గనక!

అనువాదం: నేరెళ్ల లక్ష్మణరావు

చరమ లక్ష్యము

ప్రశ్న: ఈ సృష్టికి ఒక నిర్దిష్టమైన గమ్యమున్నదా? లేక ప్రళయము దిశగా అది పయనం సాగిస్తోందా?

ఈ విశ్వానికి అంతము లేదు. అనంతమైన కాలప్రవాహంలో అది శాశ్వతంగా నిర్విరామంగా సాగిపోతోంది. దానికి హద్దులు పరిమితులు లేవు. కాని మన సౌలభ్యం కొరకు దానికి ఊహాజనితమైన హద్దులు నిర్మించుకుంటున్నాము. చిత్రకారుడు గీసే చిత్రాలకు రంగులు, ఫ్రేములు, హద్దులు నిర్ణయించుకొన్న విధంగా, అనంతవిశ్వగమనానికి మనం హద్దులు పెట్టుకుంటున్నాము. నిజంగా విశ్వగమనానికి ఏ హద్దులూ, గమ్యాలు లేవు.

*

ఈ సృష్టి భగవంతునికి అన్యంగా లేదు. రూపరహిత నిర్గుణ పరబ్రహ్మ ఆ నిర్గుణస్థితినుండి వెలుపలకు వెడలివచ్చి, ప్రకృతిగా మారి సగుణాకారంలో తనను తాను అలా దర్శించుకొని పులకించిన విధంగా సృష్టిక్రమం అవిచ్ఛిన్నంగా భగవంతుని ప్రతిరూపంగా భాసిస్తోంది.

అనువాదం: చదలవాడ వెంకట శేషయ్య

Out of the wood and stone of our nature's stuff
A temple is shaped where the high gods could live.
Even if the struggling world is left outside
One man's perfection still can save the world.
There is won a new proximity to the skies,
A first betrothal of the Earth to Heaven,
A deep concordat between Truth and Life:
A camp of God is pitched in human time.

(Savitri, p. 531)

12/7/

యోగము

లక్ష్యము – మార్గము

అఖిల భారత పత్రిక – ఆగస్టు 2002



యోగము – లక్ష్యము, మార్గము

విభాగము I – నిర్వచనములు

విభాగము II – జీవితము, యోగము

ఇతర వ్యాసాలు

ఉపోద్ఘాతము

"యోగమా! దాన్ని గురించి మనకెందుకులే, మేమింకా చిన్న వాళ్లం, లౌకికంలో మునిగి ఉన్నాము. ఈ జపాలు, తపాలు, మంత్రాలు ఇప్పుడెందుకులే బాబు, మాకు కావలసింది సన్యాసం కాదు, activity" అనే వాళ్లు ఉన్నారు. ఇటువంటి అపోహాలు తొలగించి యోగమును గురించి సరైన అభిప్రాయాన్ని కలిగించాలి. చాలామందికి పెద్దపెద్ద పుస్తకాలు చదివేందుకు తీరిక ఉండదు. దీర్ఘమైన ప్రవచనాలు వినేందుకు కూడ ఇష్టముండదు. అందుకని యోగాన్ని గురించిన కొన్ని నిర్వచనాలు, ఎక్కువ కష్టపడకుండా అర్థమయేటట్లు అల్పవాక్యాలతో అనల్పమైన అర్థమునిచ్చే కొన్ని లఘుదీపికలు ఈ సంచికలో పొందుపరుస్తున్నాము.

సంపాదకుడు

యోగమనగా కఠినమైన నిబంధనలు కావు

యోగమనగా ఏవో ఆసనాలు, ప్రాణాయామం, కొన్ని కఠినమైన నియమాలు అనే అభిప్రాయము జనసామాన్యంలో ప్రబలి ఉన్నది. కాని అది నిజం కాదు. అది ఒక ప్రత్యేకమైన వ్యాయామంలాంటిది కాదు. నిత్యజీవితంలో ఆచరించదగిన ఒక విద్య. మామూలు జీవితంలో దొరకని శాంతి, ఆనందము, సంతోషము మొ॥ ప్రయోజనములు దానివల్ల కలుగుతాయి.

— సంపాదకుడు

యోగమనగా ఒక నిర్దిష్టమైన విధానము, ఒక ప్రత్యేకమైన ప్రక్రియ అని అనుకుంటారు. యోగమనగా పతంజలి యోగసూత్రాలు, ప్రాణాయామం, ఆసనాలు వేయటం, ధ్యానం చేయుట, సమాధి అనే అభిప్రాయము ప్రజలలో ప్రబలి ఉన్నది. కాని ఇవన్నీ కేవలం కొన్ని ప్రత్యేక శాఖల వివరణలు మాత్రమే. ప్రాణాయామం, ఆసనాలు, ధ్యానం చేయుటయే యోగము అనుకోవటం సరి కాదు. స్థిరముగా కూర్చున్నప్పుడు, నడుస్తున్నప్పుడు, పనిచేస్తున్నప్పుడు, నిద్రలోను, స్వప్నావస్థలోను, మేలుకొని ఉన్నప్పుడు, తింటున్నప్పుడు, తాగుతున్నప్పుడు, పూర్ణచైతన్యంలోను, అచేతనలోను, అర్ధచేతనలోను ఎటువంటి పరిస్థితిలోనైనా యోగమును అభ్యసించవచ్చును. అది ఒక కఠినమైన నియమావళిగాని, ప్రత్యేకమైన ప్రక్రియగాని కాదు – విశ్వాంతర్గతమైన నిత్యసత్యము.

(*CWSA* Vol. 12, p. 18)

*

ప్రాణాయామం ఆసనాలు మొ॥ ప్రక్రియలు, మతసంబంధమైన మంత్రతంత్రములు, పూజలు పునస్కారాలు యోగానికి కొన్ని సాధనములు మాత్రమే గాని యోగము కానేరవు. కొంతమంది యోగము చాల కష్టమని ప్రమాదమని అనుకుంటారు కాని అది నిజం కాదు. ఒక గురువుని పట్టుకోనిగాని లేక అంతరంగిక

దైవమును నమ్ముకుండేవాళ్లకు అది చాలా తేలిక. వాళ్లేమి భయ పడాల్సిన పని లేదు. దీనికి అందరూ సమర్థులే. ఆ మాత్రం బలము, విశ్వాసము, ప్రేమ అందరిలోను ఉంటాయి. ఈ లక్షణా లలో ఏదో ఒకదాన్ని పట్టుకొని యోగంలో ముందుకు సాగిపో వచ్చు. అందరూ ఒకే జన్మలో గమ్యాన్ని చేరుకోలేకపోవచ్చు. కాని కొన్ని ఫలితములను – అచంచలత్వమును, శాంత్యానంద ములను పొందవచ్చును.

(*SABCL* Vol. 3, p. 345)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

యోగమంటే అసలేమిటి?

యోగమనగా మానవులలో గర్భితంగా ఉన్న శక్తులను వెలికితీసి వాటి ప్రతిభతో జీవితమును ఉద్దీపింపజేయు ఒకానొక ప్రక్రియ.

మానవునిలోను, తారలలోను సాక్షికంగా వ్యక్తమైన విశ్వ గత విశ్వాతీత అస్తిత్వములతో సంయోగము.

(*SABCL* Vol. 20, p. 2)

*

యోగమనగా సంయోగము[1] – మానవాత్మ పరమాత్మతో కలి యుట, మానవమాత్రుని ప్రకృతి పరమాత్మ తత్త్వముతో తాదా త్మ్యము చెందుట.

(*CWSA* Vol. 12, pp. 334 - 335)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

---

[1] యోగము 'యుజ్' అనే సంస్కృత ధాతువునుండి వచ్చిన శబ్దము.

సహజ పరిణామము – యోగము

పరిణామము ఈ సృష్టియొక్క ధర్మము, క్రమపరిణామము దీని విధానము. అది యుగముల పర్యంతం నత్తనడకన జరుగుతూంటుంది. కాని మనిషికి మనస్సు, బుద్ధి, ఇచ్ఛాశక్తి ఉన్నాయి కదా. అందుకని తను ప్రయత్నపూర్వకంగా అతీంద్రియశక్తిని ఆహ్వానించి పరిణామాన్ని వేగిరపరచగలడు. దాని పేరే యోగము.

– సంపాదకుడు

పరిణామ సిద్ధాంతం ప్రకారం జడపదార్థంలో మరుగునపడి, జాంతవిక శరీరమును ధరించిన దివ్యచైతన్యము క్రమవికాసం చెందుతుంది. ఇది జరిగేందుకు కొన్ని యుగాలు పడుతుంది. కాని యోగము ద్వారా ఈ పరిణామమును త్వరితపరచవచ్చును. భగవంతుడు సృష్టిని జేయబూనినప్పుడు తన శక్తిని ప్రయోగించినాడు. సృష్టి, స్థితి, లయములను నిర్వహించినాడు. సహజపరిణామము ప్రకృతిగతమైన అల్పశక్తితో మాత్రమే జరుగుతుంది. కాని యోగము ద్వారా జరిగే పరిణామము అనంతమైన దివ్యశక్తితో జరుగుతుంది. మానవజీవితమును ఉద్దీపింపచేసి దివ్యలక్షణములను పొందుటకు దివ్యశక్తినే సాధనముగా ఉపయోగించుకుంటుంది.

యోగమనగా మామూలు వ్యవహారము కాదు. అది ఒక తపస్సు. దైవమును స్పృశించి, అనుసంధించుకొని, తాదాత్మ్యము పొందుట ద్వారా యోగసిద్ధి కలుగుతుంది.

(*CWSA* Vol. 12, p. 334)

*

మానవచరిత్రను పరిశీలిస్తే మనకు కొన్ని విషయములు తెలుస్తాయి. శరీరగత ఆవేశములను అదుపుజేసి మనస్సును శుద్ధి కావించుటవలన మానవుడు కొంత నాగరికతను పొందినాడు. ఇది మతము ద్వారా, నీతిభీతి ద్వారా, విజ్ఞానశాస్త్ర, తత్త్వశాస్త్రముల ద్వారా, సాహిత్య, సాంఘిక, రాజకీయవ్యవస్థల ద్వారా

జరిగినది. కాని మనిషి మనస్సుకే పరిమితము – దాన్ని దాటి పోలేడు. మానవమేధను, ఆవేశములను జయించి వాటిని దివ్య శక్తి ద్వారా ఉద్దీపింపజేయుట భవిష్యత్తులో జరగవలసియున్నది. ఇది యోగము వలననే సాధ్యము.

(*SABCL* Vol. 3, p. 360)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్ శాస్త్రి, ఆర్. లక్ష్మీప్రసాదమ్మ

మన ప్రస్తుత స్వరూపము

మనను గురించి మనకు తెలిసిన జ్ఞానము
మన ఉపరితల సాక్షికరూపము మాత్రమే

అది మన పూర్ణరూపము కాదు
మన నిజస్వరూపమసలే కాదు
మనలోని శాశ్వతాత్మ
కేవలం ఒక జన్మ కోసం బహిర్గతము చేసిన
పరిమిత వ్యక్తిత్వము.
కాని మనమీ ఒక్క జన్మలోనే జీవించటల్లేదు
మనం గతంలో ఉన్నాము, భవిష్యత్తులోను ఉంటాము.
కాని అంతకంటె మహత్తరమైన వ్యక్తి
మనలో దాగివున్న విరాడ్రూపము.

Especially, there is a secret soul in us
that is our true person;
there is a secret self
that is our true impersonal being and spirit.

To unveil that soul and that self
is one of the most important movements of Yoga.

(*CWSA* Vol. 12, p.345)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

అదే యోగము

సర్వవిధాల పరమోచ్చమైన తత్వముతో
సమైక్యమగుట, అదే యోగము.

సర్వవిధాల సర్వమైన తత్త్వముతో
సమైక్యమగుట – అదే యోగము.

మానవాళిలోని దైవముతో
నీ ఆత్మలోను నీ అవగాహనలోను,
హృదయంలోను, సర్వాంగీణంగా
సమైక్యమగుట – అదే యోగము.

సమస్త ప్రకృతి తోటి సర్వజీవరాసులతోటి
సమైక్య మగుట – అదే యోగము.

ఇదంతయు విశ్వాంతర దైవంతోను
విశ్వాతీత దైవంతోను,
దైవం తనలో తానే సృష్టించుకొన్న సర్వభూతజాతముతోను
సమైక్యమగుట – అదే యోగము.

సమస్తానికి ఆయనే మూలం కనుక, సమస్తము ఆయనలోనే ఉంది కనుక

ఆయనే నీ పరమోచ్చ స్వరూపము గనుక
ఆత్మపరంగా నీవాయనతో ఏకమే కనుక
తత్త్వరీత్యా నీవాయనతో ఏకమే కనుక
ఆత్మపరంగా నీవాయనలోని భాగమే కనుక
ప్రకృతి రూపంలో నీవాయనతో క్రీడించుచున్నావు కనుక
ఈ జగత్తు ఆయనలో ఒక దృశ్యమే కనుక।
ఆ దృశ్యములో ఆయన రహస్యంగా నీ అధిపతి, ప్రియుడు కనుక
నీ నేస్తము, నాథుడు, పోషించువాడు
నీ సమస్తమైన ఉనికికి లక్ష్యము కనుక

ఆయనతో సమైక్యము చెందుటయే
నీ జీవన యానానికి పరమార్థం

(CWSA Vol. 12, p. 333)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

యోగము – దాని ప్రయోజనము

మనిషి సాధారణంగా తన మనస్సు యొక్క పై పొరలలోనే జీవిస్తాడు. కాని అంతకంటె ఎక్కువ ప్రజ్ఞ తన అంతరంగంలో దాగి ఉన్నది. అది మనస్సుకంటె అధికమైన సామర్థ్యము గలది. ఆ యోగచైతన్యమును నిత్యజీవితంలో ఆవిష్కరించి ప్రయోజనము పొందుటయే యోగము. – సంపాదకుడు

'యోగము' అనే మాటకి ఖచ్చితమైన అర్థం ఏమిటి?

అంతరంగ ఆత్మోన్నత చైతన్యానుభవాలు ఆవిష్కరించే అన్ని కార్యకలాపాలకు ఉమ్మడిగా 'యోగము' అనే మాటను సర్వసామాన్యంగా వాడుతూ ఉంటారు.

'యోగము' అనే మాటను సముచితంగా అన్వయించే పరిస్థితులు కొన్ని చెప్పాలంటే – అవి:

1. చైత్యపురుష సాక్షాత్కారాన్ని అభిలషించి చేపట్టిన ఆధ్యాత్మిక సాధనలో పూర్తిగా లేక పాక్షికంగా అదే స్పృహలోనే ఉన్న స్థితి.
2. బాహ్యప్రేరణ ఏమీ కాకుండా లేక క్రమపద్ధతిలో అంతరంగ పరమోన్నత దివ్యసత్యానికి చేరువగా ఉంటూ దైవంతో సమైక్యతానుభవం పొందగలిగి ఉండే స్థితి.
3. సాధారణ జన చైతన్యస్థాయిని అధిగమించి ప్రగాఢమైన ఉత్తమోన్నత చైతన్యస్రవంతిలో ప్రవేశించగలిగి ఉండే స్థితి.

ఆంతరంగిక జ్ఞానోపలబ్ధి

కాగా, యోగసాధనలో మనం బాహ్యా ఉపరి తలస్థితినుంచి అంతఃశ్చేతన అగాధాలలోని మూలాధార కేంద్రానికి ప్రవేశం పొందగలం. మనలో మరుగున ఉన్న దివ్యోన్నత చైతన్య శిఖరాగ్రాన్ని అధి రోహించనూ గలం. అంతరాత్మ మర్మములను, అజ్ఞాత దైవాన్ని యోగం మనకు తెలియపరుస్తుంది. దివ్యజ్ఞానాన్ని, అంతర్దృష్టిని ప్రసాదిస్తుంది. విశ్వవ్యాప్తమై, విశ్వాతీతంగా ఉండే దైవ అస్తి త్వాన్ని ఎరుకపరుస్తుంది. అదే యోగము యొక్క మహత్తర ప్రయోజనము.

దివ్యజ్ఞానోదయము

యోగం నిమ్నస్థాయిలో ఉన్న మన లను సువిశాల అంతరంగ చైతన్యం లోనికి ప్రవేశపెడుతుంది. పర్యవసానంగా అంతరంగ చైతన్య శక్తులు, అనుభవాలు, సాధ్యతలు బహిర్గతమౌతవి. దివ్యజ్ఞాన చైతన్యాలు వశం కావటానికి కీలకం యోగమే! అవిద్య నుంచి దివ్యజ్ఞానోదయ కాంతిమార్గానికి నడిపించేది యోగమే!

*

అయితే యోగంలో పలు విధానాలు, సంప్రదాయాలు, శిక్షణా కార్యక్రమాలు ఉన్నాయి. ఒక్కొక్కటి ఒక్కొక్క నిర్దేశిత పరి మితమైన లక్ష్యంతో ఒక్కొక్క ప్రత్యేక మార్గాన్ని సూచిస్తుంది. తద్వారా జీవుని అస్తిత్వంలో ఏ ఒక్క విభాగానికో పరిమితమై ఆ ఒక్క కార్యరంగంలో మాత్రమే ఉన్నతస్థాయికి చేరుకోగలిగే పరిస్థితి ఏర్పడుతుంది.

అన్ని చైతన్యభూమికలలోను సర్వతోముఖంగా వికసించి ఉన్నతశిఖరాలను అందుకోవటం వ్యక్తికి లక్ష్యం కావాలి. అందుకు పూర్ణయోగమును అనివార్యంగా స్వీకరించాల్సిందే.

(*CWSA* Vol. 12, p. 329)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

దివ్యజీవన మార్గము

మానవ జీవితం ఆనందదాయకమని చెప్పేందుకు వీలు లేదు. తన మూలచైతన్యం విశాలమైనదే అయినప్పటికి శాపగ్రస్తుడై ఇరుకుదారులలో నడుస్తూ ఉంటాడు. ఈ నిర్బంధాలలోంచి బైటపడి విశాలచైతన్యంలోకి ప్రవేశించిన యెడల తన జీవితం దివ్యజీవనంగా మారుతుంది. — సంపాదకుడు

'యోగం' నిర్వచనం

జంతులక్షణాలతో బుద్ధిజీవిగా ఉండే మానవుడు తన నిమ్నస్థాయితో పూర్తిగా తెగతెంపులు చేసుకొని ఉన్నత విశాల దివ్యచైతన్య స్థాయికి ఎదిగేందుకు కృషి చేస్తూనే ఉంటాడు. ఆ ఎదుగుదలకి చేబట్టే కార్యకలాపాలు, వాటి ఫలితాలు అన్నిటికీ కలిపి 'యోగం' అనే సాధారణ నామాన్ని వాడుతూ ఉంటారు.

యోగం వలన ప్రయోజనం

సంకుచిత అహంనుంచి నిరహంకార విశ్వజనీన చైతన్యానికి 'యోగం' ప్రత్యామ్నాయం. నామరహితుడు, సర్వాతీతుడు, లోకేశ్వరుడు, అన్నిటికి, అందరికి ఆధారము అయిన వానిని ఎరుకపరిచేది యోగం. పశువునుంచి ఆలోచించే మనిషిగా పరిణామం చెందిన ఈ జాంతవిక మానవునికి యోగం దివ్యజీవన చైతన్యంలోనికి ప్రవేశం కలుగచేస్తుంది.

మానవుని బాధల పరిష్కారము

నిత్యసత్య శిఖరాగ్ర ఆరోహణలో ఎన్నెన్నో స్థాయిలు, దశలు, ఎత్తుపల్లాలు ఉంటాయి. ప్రాకృత మానవుని ఇచ్ఛాశక్తి ఎంతో ప్రజ్ఞావంతంగా బలోపేతంగా ఉండవచ్చు. బుద్ధి ఎంతో నిశితమైనదిగాను వివేకవంతంగాను ఉండవచ్చు. అయినా ఈ మర్త్యలోకంలో దిగబడిన మానవుడు ఈ ఇహలోకబంధాలకి, ఈతిబాధలకి, పాపాలకి, కళంకాలకి, ఆడంబరాలకి దాసుడే. ఈ విపత్తుల నుంచి జీవాత్మకి విముక్తి ఎలా? అంతరంగ నిబంధనలకు లోబడి పూర్ణయోగసాధన ఏ కాస్త చేపట్టినా అది విముక్తికి

దోహదపడుతుంది. సాధారణ భౌతికజీవన విషవలయం నుంచి విముక్తి కలిగించే మార్గాన్ని చూపటమే యోగము యొక్క పర మార్థం, ప్రయోజనం. భవబంధ విమోచనమే యోగం. యోగము యొక్క నాల్గుప్రాథమిక అంశాలు 'శుద్ధి', 'ముక్తి', 'సిద్ధి' మరియు 'భుక్తి' (అనుభవం). మనోప్రాణశరీర హృదయాలను దివ్యోపక రణాలుగా మలుచుకోవాలి. ఇహలోకమానవసృష్టి స్పష్టమైన దివ్య సంకల్పంతో దివ్యప్రణాళికాబద్ధంగా, దివ్యప్రయోజనము నాశించి జరిగినది. అంతర్వికసనంతో, దివ్యశక్త్యానందాల వెలుగులు వెల్లి విరియగా మానవజాతి అంతా ఒక్కటిగా మనుగడ సాగించాల నేదే దైవసంకల్పం. మానవజాతికి మూలం భగవంతుడు. మానవ వికాసానికి అంతస్సారం భగవంతుడు. దివ్యత్వాన్ని ఎరుకపరు చుకొని విశ్వజనీన దివ్యజీవనంలో వర్తిస్తూ పురోగమించడమే జీవితానికి పరాకాష్ఠ.

(CWSA Vol. 16, pp. 291-292)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

ఏకమే అయినా విభక్తం

ఈ ప్రపంచంలో మనమెల్లెడలా ఏకమే అయినప్పటికి విభక్తమై ఉన్నాము అనే వాస్తవం మీద ప్రధానంగా యోగం నిలిచి ఉంది. మనం అస్తిత్వంలో ఒకటే అయినా విభక్తమై ఉన్నాం. సమస్తమైన సహ జీవరాసులతోటి ఒకటిగా ఉన్నాము కాని విభక్తమై ఉన్నాము. దేవుడు, ప్రకృతి లేదా బ్రహ్మం అని మనం పిలిచే అనంత అస్తిత్వంతో ఒకటిగాను విభక్తంగానూ కూడా ఉన్నాం.

ఒక శరీరంలోని అంతరాత్మ – ఇతర అంతరాత్మలతోను, జాగ్రుతచైతన్యం వెనుక ఉన్న తన భాగాలతో, ప్రకృతిశక్తులతో ప్రకృతిలో ఉన్న వస్తువులతో, ప్రపంచాన్ని పరిపాలిస్తున్న పర

మోత్కృష్టమైన ప్రజ్ఞతో, శక్తితో, ఆనందంతో, సార్థక సంబంధంలో ప్రవేశించే శక్తినే సాధారణంగా యోగం అంటాము.

తనలోనే ఆ ఏకత్వం కోసం గానీ లేదా మన అభివ్యక్తమైన అస్తిత్వాన్ని జ్ఞానాన్ని ప్రజ్ఞను శక్తిని లేక ఆనందాన్ని పెంచటం లేదా మార్పు చేయటం అనే ప్రయోజనం కోసం గానీ ఆ విధంగా జరుగుతుంది.

మన అంతరంగ అస్తిత్వాన్ని బాహ్యాకృతిని ఈ లక్ష్యాల కోసం వ్యవస్థీకరించే ఏ విధానాన్నైనా యోగం అనవచ్చు.

(*CWSA* Vol. 12, pp. 18-19)

అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రరావు

భగవంతునితో సంయోగము

దివ్యచైతన్యంతో పోలిస్తే మనస్సు చాలా చిత్రమైనది. అది అసమర్థము, అర్భకము. అందులోనుంచి బైటపడి మహాచైతన్యమును పొందవలసి ఉన్నది. ఈ మార్గము, దాని విశేషములు ఇందులో చదవండి. — సంపాదకుడు

యోగముయొక్క వివిధస్థాయిలు

భగవంతునితో సంయోగమంటే మొదట భగవంతునితో నిత్యసంస్పర్శ కలిగియుండటం. భగవంతుని చైతన్యంతో సంస్పర్శను పొంది, ఆ సంస్పర్శను వృద్ధి చేసుకోవడం. అప్పుడు మనం దానిని జీర్ణించుకోవడం, లేదా మనల్ని దానిలో జీర్ణింపచేసుకోవడం. తరువాత, ఆ చైతన్యంవలె మారడం, ఆ చైతన్యంతో నిండిపోవడం మాత్రమే కాదు. ఆ చైతన్యంలో అడుగుపెట్టడం, అందులోనే నివసించడం, ఆ దివ్యచైతన్యంగా, ఆ దివ్యపురుషునిగా మారడం, ఆ చైతన్యస్ఫూర్తిలో, సారంలో, స్ఫూర్తిగా, సారంగా మారడం, ఆ విధంగా మనం ఏ దైవంనుండి ఆవిర్భవించామో ఆ

దైవత్వంనుండి మనల్ని వేరుచేస్తున్న సమస్త విభజనను రూపు మాపడం.

*

మానవజాతి లక్ష్యం

సమస్త మానవ ప్రయత్నానికి నిజమైన లక్ష్యం భగవంతుని సిద్ధింప చేసుకోవడమే. ఇతరములైన రాజకీయ, సామాజిక, సాహిత్య, బౌద్ధికమైన ప్రయత్నాలన్నీ దీనికి దోహదం చేసే మార్గాలు మాత్రమే. ఇవన్నీ కూడా భగవంతుని పొందడం అనే లక్ష్యాన్ని సాధించడంలో మానవాళిని సంసిద్ధం చేసేవి మాత్రమే. అయితే సిద్ధియొక్క స్థాయిలోను, పరిధిలోను, సామర్థ్యములోను తేడాలున్నాయి. సాధారణంగా ఈ సిద్ధి మూడురకాలుగా ఉండవచ్చు. అవి భగవంతుని సంస్పర్శ, భగవంతునిలో జీవించడం, భగవంతునిగా మారడం.

మొదటిసిద్ధి ప్రాథమికమైంది. సాధారణ మానవస్వభావపు తెరలు దాటి భగవంతుడ్ని స్పృశించకపోతే, భగవంతుడే మనవైపు వంగి మన ఆత్మల్ని స్పృశించకపోతే, మన హృదయాంతరాలలో, మనస్సులో, మనం చేసే కార్యాలలో, మన చైతన్యపు లోతులలో భగవంతునితో మొదటగా మనం సంస్పర్శ పొందకపోతే, ఆయనలో నివసించడం సాధ్యపడదు. మనలో ఆత్మబలం ఉంటే, ఆ సంస్పర్శ సమగ్రంగా, త్వరితగతిని సంభవం కాగలదు. మనం వెంటనే మేలుకొని భగపంతునిలో నివసించే స్థితి వైపు పురోగమించగలం. మానవాత్మ భగవంతుని ఆత్మలో వ్యక్తి చైతన్యం విశ్వజనీన చైతన్యంలో నివసిస్తుంది. అయితే ఆ దివ్య స్పర్శ, అగ్నిస్పర్శ, అమృతస్పర్శ ఉండి తీరాలి.

(*CWSA* Vol. 12, pp. 332, 338-339)

అనువాదం: కె. యజ్ఞన్న

యోగం అంటే చైతన్య పరివర్తన

ఈ మాయదారి మనస్సును జయించి దాని స్థానంలో దివ్యచైతన్యమును స్థాపించుటయే యోగము. కాని ఇదంత తేలిక కాదు. ఎందుకంటె నీ మనస్సు, అలవాట్లు, నీ పాతప్రకృతి దీనికి ఒప్పుకోదు. చేతనయొక్క నిమ్నరూపమే మనస్సు. ఒక్క మనస్సే కాదు. భారతీయచింతన ప్రకారం ఈ మనస్సు, పదార్థము కూడ ఒకే చిత్‌శక్తి యొక్క వేర్వేరు రూపములు.

— సంపాదకుడు

యోగ లక్ష్యములు

యోగంలో సాధకుడు సిద్ధింప చేసుకోవలసిన ప్రధానలక్ష్యాలు మూడు. భగవంతునితో సంయోగం, లేదా నిత్యసంస్పర్శ, ఆత్మ[2] (Soul, Self, Spirit) విముక్తి, చైతన్యంలో పరివర్తన (ఆధ్యాత్మిక రూపాంతరం). మొదటి రెండులక్ష్యాలను సాధించడానికి చైతన్యంలో మార్పు అవసరం. కనీసం కొంతస్థాయి వరకైనా అవసరం. సాధనలోని సంఘర్షణలకు, కష్టాలకు అదే మూలం. ఎందుకంటే దానిని సాధించడం అంత సులభం కాదు. మన మనస్సు, హృదయం, అలవాట్లను మార్చుకోవాలి. అయితే ఇందుకు మన అజ్ఞానప్రకృతి తీవ్రంగా ప్రతిఘటిస్తుంది

(*SABCL* Vol. 24, p. 1622)

*

యోగం అనేది ఒక శాస్త్రం, ఒక ప్రక్రియ, ఒక ప్రయత్నం, ఒక నిర్దిష్టచర్య. దీని సాయంతో సాధారణ మానవచైతన్యపు పరిమి

---

[2] శ్రీఅరవిందులు కొన్నిచోట్ల soul, Self, Spirit అని ఒకే తత్వంతో వాడుతుంటారు. వాటికి అతిసూక్ష్మమైన, అతిప్రగాఢమైన అంతరార్థాలు ఉన్నాయి. అయితే తెలుగులో దురదృష్టవశాత్తు ఆత్మ అనే పదం ఒకటే ఉంది.

తులలోనుండి మరింత మహనీయమైన ఆధ్యాత్మిక చైతన్యంలోకి ప్రయాణించడానికి మనిషి ప్రయత్నం చేయవలసి ఉంది.

(*CWSA* Vol. 12, p. 327)

*

చైతన్యం మనస్సు కంటే గొప్పది

యోగంలో వాడే 'చైతన్యం' అనే పదం మనస్తత్వం కాదు. తనేవరో తెలిసియున్న అస్తిత్వపు తత్త్వము. మనస్తత్వానికి దిగువగా అది ప్రాణిక, శారీరక (భౌతిక) రూపములను తాలుస్తుంది. ఆ రూపములు మనకు అవచేతనగా కనిపిస్తుంటాయి. వాటికి పైన అది అతిమానసంలోకి అధిరోహిస్తుంది. ఈ అతిమనస్సు మనకు అతీతచైతన్యం. కాని అన్ని శ్రేణులలోను అది ఒక్కటే, విభిన్నరీతులలో వర్తిస్తుంటుంది. 'చిత్' అంటే భారతీయ మహాద్రష్టలు చెప్పిన సారాంశం అది. ఈ చిచ్ఛక్తి లోకాలను సృష్టిస్తుంది. మనస్సు, పదార్థం ఒకే శక్తి యొక్క రెండు భిన్నశ్రేణులు. అస్తిత్వపు చైతన్యశక్తియొక్క (Conscious Force of Existence) విభిన్నస్థితులు.

(*SABCL* Vol. 18, p. 88)

*

సమస్తసృష్టి నేపథ్యంలోను భాసించే ఒక మహాసత్యంలోకి చైతన్య పరివర్తన ద్వారా అడుగుపెట్టడం, సృష్టి బాహ్యారూపాల వలయంలో ఇక ఎంతమాత్రం జీవించకపోవడం — ఇదే యోగ లక్ష్యం.

(*CWSA* Vol. 12, p. 331)

*

సత్యం మనస్సుకంటే లోతుగా, ఎత్తుగా విశాలత్వంలో ఉంటుంది

మనం అన్వేషించే మహాసత్యం మన జీవిత ఉపరిభాగంలో లేదు. ఒకవేళ ఉన్నా అది నిగూఢ

గుప్తమై ఉంది. మనకు అందుబాటులోకి వచ్చిన ప్రగాఢమైన, ఉన్నతమైన, విశాలమైన చైతన్యం మాత్రమే ఈ మహాసత్యాన్ని చేరుకోగలదు. స్పృశించగలదు, తెలుసుకోగలదు. స్వాధీనం చేసుకోగలదు. మన సాధారణ చైతన్యపు అంతఃకుహరంలోకి మనం అవరోహించినా, అక్కడ ఏముందో తెలుసుకోవడానికి ప్రయత్నించినా, ఆ మహాసత్యపు ఏదో ఒక నిర్దిష్ట అంశంలోకి మనం అడుగు పెడతాం.

(*CWSA* Vol. 12, p. 328)

*

దేవేచ్ఛ, జ్ఞానముల ప్రాకట్యము

ఒకానొక అంతర్గత దీక్ష, సంయమనం ద్వారా సృష్టి బాహ్యరూపాల వెనుక తేజరిల్లే ఒక మహాసత్యంతో సాయుజ్యం చెందడానికి ఉపకరించే మార్గమే యోగం. బాహ్యంలోనూ, ఉపరితలంలోనూ సంచరించే చైతన్యానికి అంతస్థితమైన యథార్థ చైతన్యం వైపు నడిపేది యోగమే.

బాహ్యమైన దృశ్యమాన ప్రపంచజ్ఞానాన్ని యోగచైతన్యం తిరస్కరించదు. – అంతర్నేత్రంతో – అంతర్గతమైన ప్రగాఢకరమైన, మరింత మహనీయమైన, యథార్థమైన చైతన్యపు వెలుగులో ప్రపంచజ్ఞానపు విలువలను మార్పుచేసి సరిదిద్దుతుంది. మహాసత్యానికి చెందిన నియమాన్ని అజ్ఞానానికి వర్తింపచేస్తుంది. జీవుల అజ్ఞాననియతిని తారుమారు చేసి ఆ స్థానంలో మనకు భగవత్‌సంకల్పం, భగవత్ జ్ఞానానికి చెందిన నియమాన్ని ప్రసాదిస్తుంది.

చైతన్యపరివర్తనమే ఈ యోగంలోని పరమార్థం.

(*CWSA* Vol. 12, p. 327)

అనువాదం: కె.యజ్ఞన్న

యోగ ఫలితాలు

బాహ్యారూప పరిజ్ఞానానికి మాత్రమే పరిమితమైన చైతన్యస్థాయిని దాటి ఎన్నో యథార్థాలు, ఏకమాత్ర సత్యం పట్ల ఎరుకను కల్గి యుండే మరింత ఉన్నతమైన, విశాలమైన, ప్రగాఢమైన చైతన్యం లోకి అడుగుపెట్టడం – ఇదే సంగ్రహంగా యోగం అంటే. అంతే కాదు. సృష్టి బాహ్యారూపాలు, సంఘటనలలో జీవించడానికి బదులు, సత్యం ప్రకారమే జీవిస్తూ సమస్త కార్యాలు తదనుగుణంగా నిర్వహించాలి.

అజ్ఞానంనుండి ఆత్మజ్ఞానంలోకి, మన బాహ్యాచైతన్యం నుండి మన నిజమైన అంతశ్చేతనలోకి, మన బాహ్యాఘటనాశీలమైన మానస, ప్రాణిక, భౌతిక, జీవనశ్రేణుల నుండి అంతర్ముఖ ఆధ్యాత్మికజీవన శిఖరాల వైపు, ఆధ్యాత్మిక – ప్రదీప్త – ప్రకృతి లోకి పయనించడమే యోగం.

యోగం ద్వారా మనం సృష్టి సంఘటనల వలయంనుండి యథార్థ 'మానవుని' వైపు (real man) బాహ్యా, దృశ్యమాన స్వభావ చైతన్యంనుండి మన నిజమైన ఆత్మ[3] (Atman) చైతన్యం లోకి – అంతరాంతరాలలో అంతస్థిత, అంతర్ముఖ 'పురుషుని' వైపు ప్రయాణిస్తాం. మన సత్య, నిత్య స్వరూపం అదే. మన బాహ్యాచైతన్యమూర్తిలో వచ్చే మార్పులలో, మనస్సు, జీవితం, శరీరాలలో వచ్చే మార్పులలో, మన దృశ్యమాన వ్యక్తిత్వపు మార్పులలో ఈ ఆత్మ, ఈ నిజమైన ఆత్మ మార్పులేకుండా అలరారుతుంటుంది. అది శాశ్వతం, చిరంతనం, అజరామరం. శాశ్వత పరాత్పరుని అంశ, లేదా ఆయన్నుండి అభివ్యక్తమైన అద్భుతం అది.

యోగం ద్వారా మన చుట్టూ అనంత పరివ్యాప్తమైన సంఘటనాత్మక దృశ్యమాన జగత్తు, విశ్వం, లేదా మన చుట్టూ

---

[3] శ్రీఅరవిందులే స్వయంగా self అంటే Atman అని ఇక్కడ అనువదించారు. A పెద్ద అక్షరం పెట్టటం. గుర్తించాలి.

గల ప్రపంచం బాహ్యారూపాల చైతన్యంనుండి కూడా మనం ప్రపంచపు సత్యం, యథార్థచైతన్యం వైపు పురోగమిస్తాం. ఈ ప్రపంచం విశ్వపురుషునిలో (universal being)[4] (విరాట్‌పురుషుడు) అభివ్యక్తమైన విశేషం అని, మనం చూసే, వినే, అనుభవించే సర్వసృష్టి అద్భుతాల వెనుక నిజమైన సత్యం (true truth) ఈ విశ్వపురుషుడని మనం తెలుసుకోగల్గుతాం. విశ్వజనీన మహాశక్తికి వెనుక రహస్యంగా ఉన్న విశ్వచైతన్యం, విశ్వాత్మ, విశ్వదైవం, విశ్వజనీన దివ్యత్వం గూర్చి మనలో స్పృహ కలుగుతుంది.

యోగం ద్వారా మనలో ఆత్మ, లేదా తనలోని నిజమైన (పురుషుడు) చైతన్యం విశ్వాత్మ, విశ్వపురుషుడు ఒక్కటేనని, మనలోని ప్రకృతి విశ్వప్రకృతియొక్క లీలావైభవమేనని కూడా మనం గ్రహించగల్గుతాం. మనకు, విశ్వానికి మధ్యన ఉన్న మహాకుడ్యం అదృశ్యం కావడం ప్రారంభమై, పూర్తిగా అంతర్థానమవుతుంది. అదే సర్వజనీన ప్రపంచం మనలోను, ఇతరులలోను, విశ్వజనీనంగా ఉన్న సృష్టి సర్వత్రా సమస్తభూతాలలోను ఉన్నట్లు గ్రహించగల్గుతాం.

ఈ యోగం ద్వారానే వ్యక్తాత్మకంటే, విశ్వాత్మకంటే బృహత్తరమైన, మహనీయమైన విశ్వాతీత చైతన్యం, లేదా అస్తిత్వం ఉందని కూడా మనం గ్రహించగల్గుతాం. ఈ విశ్వాతీతపురుషుడు మనపైన గానీ, విశ్వం, అస్తిత్వంపైన గానీ ఆధారపడదు. అదే 'సత్' (Being). ఆ సత్‌యొక్క లేదా అందులో అభివ్యక్తమైనదే మన అస్తిత్వం – ఈ సృష్టి. ఆ సర్వోన్నత అస్తిత్వం (Supreme Existence) లో (కాలాతీత, విశ్వాతీత మహోన్నత సత్ – మహత్వంలో) అభివ్యక్తమైన మహాద్భుతం ఈ విశ్వం. (ఇక్కడ రెండు అస్తిత్వాల తేడా గమనించాలి.)

యోగంవల్ల ఈ మహాసత్యం, ఈ మహావాస్తవికతను మనం గ్రహించగల్గుతాం. ఏమిటా సత్యం? అది 'ఏకం సత్', ఒకే ఒక సర్వోత్కృష్ట అస్తిత్వం, మహోన్నత 'సత్', సత్-శక్తి (Supreme

---

[4] universal being అంటే విశ్వసత్తా అని కూడా అనవచ్చు.

Being, Existence, Power of Being) అది ఒక విశ్వాత్మగా, విశ్వపురుషునిగా, విశ్వమయ ఆద్యశక్తిగా, విశ్వప్రకృతిగా అభివ్యక్తమవుతుంది. అందులో మళ్లీ, మనలోని ఆత్మగా అభివ్యక్తమవుతుంది. ఈ ఆత్మ తన వ్యష్టి పురుషునిగా, ప్రకృతిగా గ్రహిస్తుంది.

(*SABCL* Vol. 12, pp. 330-331)

అనువాదం: కె. యజ్ఞన్న

యోగచైతన్యం మనలో ప్రదీప్తమైనప్పుడు మనం సృష్టి సర్వస్వాన్ని మాత్రమే కాకుండా, సృష్టిలోని శక్తులు, శక్తులు మాత్రమే కాదు, ఈ శక్తుల వెనుకగల దేవతని గూర్చి కూడ తెలుసుకుంటాం. వీటి నన్నింటినీ మనలోనే కాకుండా, విశ్వంలో కూడ ఉన్నట్లు తెలుసుకోగల్గుతాం.

(*SABCL* Vol. 24, p. 1150)

ప్రకృతి నిరంతర వేదన

యోగము యొక్క నిజస్వరూపము తెలియక దానినందరు కొట్టి పారేస్తూ ఉంటారు. ఉదా: సృష్టిలో ఆవిరి, విద్యుత్తు ఉన్నాయి. సహజస్థితిలో అవి మనకు ఎక్కువ ఉపయోగపడవు. కాని మనం వాటిని ఉపాయంగా నియంత్రించుటవలన ఆవిరితోను, విద్యుచ్ఛక్తితోను యంత్రాలను నడిపి అధికమైన ప్రయోజనాలను పొందుతున్నాము. రాత్రిళ్లు కూడ మన నగరములను దేదీప్యమానము చేయుచున్నాము. మానవునిలో దాగి వున్న శక్తులు కూడ అంతే అనుకో. సహజస్థితిలో వాటిని గురించి మనము ఎక్కువ పట్టించుకోము. కాని క్రమశిక్షణతో నిర్వహించినప్పుడు మనం వాటివలన అద్భుతమైన ప్రయోజనాలను పొందగలము. మనిషిలో భానూదయమవుతుంది. మామూలుగా దీర్ఘకాలములో

జరిగే పరిణామమిప్పుడు (Evolution) అనతికాలంలోనే జరిగిపోతుంది.

— సంపాదకుడు

ప్రపంచానికి పరీక్షాసమయము

ప్రసవవేదనా బంధురమైన కాలమున మనమిప్పుడు నివసించుచున్నాము. ప్రయోజనాత్మకమైన ప్రాబల్యవిశేషమున నొప్పారునట్టియు, పట్టువీడక ప్రవర్తిల్లెడి యోగ్యతా విశేషమును తమతో గర్భిత మొనర్చుకొనినట్టియు సకల మానసికచింతనలూ, సకల కర్మప్రవృత్తి విశేషములూ నొక మహత్తరమైన పరీక్షకు గురిచేయబడి, పునర్జన్మము నొందుటకై ప్రేరేపింపబడుచున్నవి. సలసల కాగుచున్న ఒక పెద్ద కాగు వంటిది నేటి ప్రపంచము. సకల వస్తువులూ అందు విసరివేయబడి, చిద్రుపలు చిద్రుపలుగా నొనర్చబడుచున్నవి. వాటిని మరల మరల మిశ్రితమొనర్చి ఏదియో చేయవలెననెడి ప్రయత్నమది. అట్లు చేయుటలో అవి పూర్తిగా నశించి నూతనవస్తు విశేషములకు ఉపాదానద్రవ్యముగా మారి పోవుట సంభవించవచ్చును. లేక, పునరుజ్జీవనము పొంది క్రొత్త రూపమున క్రొత్తగా మరికొంత కాలము మనుటయూ జరుగ వచ్చును.

యోగము యొక్క స్వరూపము

భారతదేశమున ప్రచారములోనున్న యోగమనునది మానవజాతి భవిష్యజ్జీవితమును క్రమేణా సుసంపన్న మొనర్పనున్న ఇట్టి శక్తివిశేషములలో నొకటి. మహనీయములగు కొన్ని ప్రకృతిశక్తుల ప్రత్యేక విలసనము దానియందు కానవచ్చును. ప్రత్యేక వైశిష్ట్యములతో పెక్కు శాఖలుగా విభక్తమై అయ్యది అనేక రీతులుగా పెంపొందించబడి ఉన్నది. యుగయుగాల కృషి ఫలితమై తనయందలి సత్వగరిమ, సత్యమహిమలచే ఈనాటి వరకూ సంరక్షింపబడుచూ వచ్చి, ఇన్ని నాళ్ళుగా తాను దాగి యుండిన రహస్యకూటములనుండియూ తపోవనసీమలనుండియూ ఇప్పుడిప్పుడే అది బహిర్గతమగుచూ, సజీవమైన మానవశక్తి విశే

షములయూ ప్రయోజనములయూ భావిసంపుటియందు యథో చిత స్థానమును పొందుటకై ప్రయత్నించుచున్నది.

యోగము యొక్క పునరుద్ధరణ

కాని, ఇందుకు తొలుదొల్త అది తనను తాను మరల గుర్తించుకోవలసియున్నది. ప్రకృతి విధానమునందలి ఏ సామాన్య సత్యమునకు, ఏ నిర్విరామలక్ష్యసాధనకు తాను ప్రాతినిధ్యము వహించుచున్నదో అందు గర్భితమైయున్న పరమగంభీరమైన నిజతత్త్వరహస్యమును వెలికి దీసికొనివచ్చి, అట్లు వినూత్నముగా పొందనేర్చిన ఆత్మావబోధద్వారమున నది పూర్వముకంటె విస్తృతమగు సమన్వయస్థితిని గాంచవలసియున్నది. ఇట్లు పునర్వ్యావస్థను పొందుటలో నది పునర్వ్యవస్థితమగు మానవజీవితమునందు మరింత సులభముగా మరింత శక్తిమంతముగా ప్రవేశింపనేర్చి, అద్దానిని అంతర్ముఖముగా దాని నిజసత్తావ్యక్తిత్వ విశేషముల పరమనిగూఢతలములకునూ, ఊర్ధ్వముఖముగా అట్లే ఆ సత్తావ్యక్తిత్వవిశేషముల ఉన్నతోన్నతసీమలకునూ తన విధానముల ద్వారమున చేర్చుటయే దాని పరమలక్ష్యము.

జీవితమంతయు ఒక మహాయోగమే

జీవితము, యోగము, ఈ రెంటినీ సమ్యగ్దృష్టితో పరిశీలింతుమేని, లక్షితముగానో అలక్షితముగానో జీవితమంతయూ యోగమే యని చెప్పవలసియుండును. ఏలయన, మానవసత్తయందలి గర్భితశక్తుల నభివ్యక్తమొనర్చి, మానవునియందునూ, విశ్వమునందునూ పాక్షికముగా అభివ్యక్తమైయున్న సర్వగత, సర్వాతీత తత్త్వముతో మానవవ్యక్తికి ఐక్యము కూర్చుట ద్వారా ఆత్మసంసిద్ధికై క్రమనిబద్ధమైన ప్రద్ధతి ప్రకారము జరుపబడు ప్రయత్నమునే కదా మనము యోగమని పేర్కొనుచున్నాము. కాని, జీవితమును దాని బాహ్యారూపముల నతిక్రమించి లోతుగా పరిశీలించి చూతుమేని, జీవితమంతయూ ప్రకృతి కొనసాగించు నొక మహాయోగమే యని చెప్పవలసియుండును. తన గర్భితశక్తుల నంతకంత కధికముగా అభివ్యక్తమొనర్చుకొనుట

ద్వారా ఆత్మసంసిద్ధి గాంచి, తన నిజతత్త్వమైన దివ్యత్వముతో తానైక్యము పొందుటకై ప్రకృతి కొనసాగించుచున్న ప్రయత్నమది.

ప్రకృతిశక్తులవలన అధికలాభము

మానవుడామె సాధనము, అతనియందామె ఈ పృథ్విపై తొలుదొల్తగా ఈ మహనీయ ప్రయోజన మధికతర జవసత్త్వములతో నెరవేరుటకై ఎరుకతో సంకల్పపూర్వకముగా జరుగదగు కృషికి సాధనసంపత్తిని సమకూర్చుకొన్నది. వివేకానందస్వామి నుడివినట్లు, స్వపరిణామమును ఒకే జీవితకాలములోగాని, ఒకే జీవితకాలపు కొలది సంవత్సరములలోనో, నెలలలోనో గాని కుదింపజేయుట కనువైన సాధనమే యోగమని చెప్పనొప్పును. ఏ యొక యోగవిధానమైననూ, మహాజననియగు ప్రకృతి ఊర్ధ్వగతికై యొనర్చెడి మహాపరిశ్రమమునందు అంతకు పూర్వమే నెమ్మదిగా, వలుదగా, ద్రవ్యశక్తుల నెంతగానో వృథా చేయుచున్నట్లు కనిపించుచునే, మరింత సమగ్రసంకలన పూర్వకముగా అనుసృతములగు సామాన్యప్రక్రియలను అధికతర శక్తి సమన్వితములగు విశిష్టరూపములలో వెలయింపజేయనెంచు ప్రయత్నమే యగును గాని అన్యము కాజాలదు.

యోగమును గురించిన ఈ దృక్పథము మాత్రమే యోగ పద్ధతుల సుసంగత, హేతుబద్ధ సమన్వయసాధనకు ఆధారభూతమై వెలయగలిగి యున్నది. అట్టి సందర్భములో యోగమనునది, విశ్వప్రకృతియొక్క సామాన్య క్రియాకలాపముతోగాని, ఆత్మసంసిద్ధికై బాహిరంతరములందు ఆమె కొనసాగించెడి ద్వివిధమహోద్యమములలో ఆమె దృష్టియందుంచుకొను ప్రయోజనములతోగాని ఎట్టి సంబంధమూ లేని ఏదో ఒక అసాధారణ నిగూఢవిషయముగా చూపట్టుట పొసగనేరదు. క్రింది స్థాయిలో మరింత సామాన్యరీతిని ఆమె కొనసాగించు కార్యముల యందిది వరకే అభివ్యక్తములై క్రమాధికముగ నింకనూ వ్యవస్థీకరింప చేయబడుచున్న శక్తులను అత్యంత విశిష్టరూపమున అతిప్రగాఢముగ వినియోగమునకు దెచ్చు ప్రక్రియగా మాత్రమే అది మనకు సాక్షాత్కరించును.

మానసిక శక్తుల అధికతర ఉపయోగము

ప్రకృతిలో విద్యుత్తు, నీటిఆవిరి, – వీటి సామాన్య వ్యాపారముల కును, వీటి సహజశక్తిని వైజ్ఞానికముగా వినియోగమునకు దెచ్చుటకును ఎట్టి సంబంధము కలదో, ఒక విధముగా అట్టి సంబంధమే మానవుని సామాన్య మానసిక వ్యాపారములకును, యోగవిధానములకును గలదు. యోగవిధానములు కూడ క్రమబద్ధమైన ప్రయోగము, అనుభవ పూర్వకమైన పరిశీలన, సుస్థిరమైన ఫలితముల ననుసరించి పెంపొందించబడి ధృవీకరించబడిన విజ్ఞాన మాధారముగా రూపొందినట్టివే.

యోగమను సామాన్యపదము క్రింద వర్గీకరించబడిన విధానములన్నియూ ప్రకృతిలోని ఒకానొక స్థిరసత్యమాధారముగా నిర్మాణమైన ప్రత్యేక మానసిక ప్రక్రియలే. సర్వసామాన్యమగు ప్రకృతివ్యాపారములచే సులభముగ అభివ్యక్తముగాక నిగూఢముగ దాగియున్న శక్తులను, ఫలితములను ఆ సామాన్య వ్యాపారములలోనుండియే ఆవిష్కరించుట ఈ ప్రక్రియల లక్ష్యము.

(*SABCL* Vol. 20, p. 1-3)

అనువాదం: కె. వేంకటరావు ('యోగసమన్వయము' నుండి)

జీవితము – యోగము

ఈ సృష్టి జడపదార్థంతో మొదలై అభివృద్ధిచెంది ఉన్నతోన్నత రూపాలను పొందుతుంది. ఇదీ యోగమే, ప్రకృతి జరిపే యోగము. బీజరూపంలో గర్భితంగా ఉన్న మహాశక్తులచే జరగబడుతున్న యోగము. ఎవరి ప్రమేయమూ లేకుండా దానంతట అదే జరిగిపోతుంది. మరి మన యోగం సంగతి ఏమిటి? మన కెవరూ అడ్డుతగలకుండా అడవులలోనికి, కొండగుహలలోకి వెళ్లాల్సి వస్తోంది కదా. మనం చేసే ఈ విశ్వప్రయత్నమెందుకు? ఎప్పుడైతే అది నిత్యకృత్యమువలె అలవాటైపోయి ఎక్కడికి పోకుండా

జీవితంలోనే సాధ్యమౌతుందో అప్పుడది కూడ పైన చెప్పిన 'ప్రకృతి యోగము' వలెనే ఊపిరితీసుకున్నట్లుగానే జనసామాన్యానికందరికి సహజమైపోతుంది. — *సంపాదకుడు*

యోగమనగా పలాయనమా?

యోగప్రక్రియా బాహుళ్య ఫలితముగా యోగి సామాన్యజీవితమునుండి వేరువడిపోయి దానిని తన యధీనమునుండి జారవిడుచుకొనుట తటస్థించుచుండును. తన మానవప్రవృత్తులను సేదపడజేసుకొని ఆత్మసంపత్తిని, బహిర్విషయికముగ మృతినిపొంది ఆంతరంగికముక్తిని అతడార్జించుకొనజూచును. జీవితమును నష్టపోయిగాని ఈశ్వరోపలబ్ధిని పొందనేరడు. జీవితమును విజయసాధనకై అతడు బహిఃప్రవృత్తుడగునో ఈశ్వరోపలబ్ధికి ప్రమాదస్థితి నెదుర్కొనును.

ఐహికజీవితమును నిరసించరాదు

కావుననే, భారతదేశమున ఐహికజీవితమునకూ ఆధ్యాత్మిక వికాస సంస్థితులకూ తీవ్రవైరుధ్యము ఏర్పడినది. లోపల ఆకర్షణకూ, వెలుపలి అవసరమునకూ అఖండమైన సామరస్యము సాధించవలెననెడి సంప్రదాయము, ఆదర్శము ఒకప్రక్క ఉండనేయున్ననూ, దానిని ఆచరణలో పెట్టుట కడు అరుదైపోయినది. నిజమునకు ఏ మానవుడైననూ తన దృష్టినీ, శక్తిసామర్థ్యములనూ అంతర్ముఖ మొనర్చి యోగమార్గమున ప్రవేశించునేని, తప్పనిసరిగా అతడు మన సమిష్టిజీవిత మహాస్రవంతికీ, మానవజాతి ఐహికకృషికీ అక్కరకురానివాడుగనే భావించబడుచున్నాడు. ఎంత బలముగా ఈ భావము వ్యాప్తినొంది, ఎంత విస్తృతముగా దీనిని బహుళప్రచారముగల తత్వశాస్త్రములూ, మతములూ నొక్కి చెప్పుట జరిగినదనిన, జీవితమునుండి తప్పించుకొనిపోవుటయే యోగసాధన ముఖ్యవిధిగనే గాక సామాన్య లక్ష్యముగా కూడ సర్వసాధారణముగా నేడు పరిగణింపబడుచున్నది.

మానవజీవితపు దివ్యీకరణము

విముక్తము, విశుద్ధమునైన మానవజీవితమునందు ఈశ్వర – ప్రకృతులు పునరైక్యమును సాధించుట తన లక్ష్యముగా నిడుకొనని ఏ యోగసమన్వయపద్ధతియు సంతృప్తిదాయకము కాజాలదు. ఇట్టి సమన్వయవిధానము మన బహిరంతఃప్రవృత్తులకూ, అనుభూతులకూ దివ్యత్వసిద్ధి కలిగించుట ద్వారా వాటి సామరస్యసాధనము అనుమతించునదియే గాక అభిలషించునదిగా గూడ నుండవలెను.

ఏలయన, భౌతికజగత్తులోని కవతరించిన ఒకానొక పరసత్తకు ప్రతీకగ వెలసినవాడు మానవుడు, అపరము రూపాంతరము చెంది పరస్వభావమును సంతరించుకొనుటకును, పరము అపరరూప విశేషములందు తనను దానావిష్కరించుకొనుటకును. ఈ భౌతికజగత్తున నవకాశమున్నది. అట్టి దానిని సాధించుటకై తన కీయబడిన జీవితమును మానవుడు త్రోసిపుచ్చుట ఆత్మసంసిద్ధికై అతడొనర్పదగు పరమప్రయత్నమునకు, మహోత్కృష్ట సాధనకు తప్పనిసరియగు విధికృత్యమనిగాని, సమగ్రమైన పరమలక్ష్యమనిగాని గణించుటకు వీలు లేదు. మానవజాతిని మొత్తము మీద ఉన్నతస్థాయికి సిద్ధముచేయు నిమిత్తము ఒక ప్రత్యేకమైన తీవ్రప్రయత్నము నొకవ్యక్తి చేయవలసివచ్చు సందర్భమున తాత్కాలికముగా అట్టి జీవితసన్యాసావశ్యకత కలుగవచ్చును. కాని, యథార్థమూ సమగ్రమూనైన యోగలక్ష్యమూ ప్రయోజనమూ మాత్రము, ఎరుకతో మానవుడు కొనసాగించెడి యోగము ప్రకృతిలో మరుగున కొనసాగు యోగమువలెనే బాహ్యమున జీవితమునంతనూ తనలో ఇముడ్చుకొనినదైనప్పుడే నెరవేరుటకు వీలగును. అట్టి పరిస్థితిలో మనము యోగమార్గమునూ, యోగసంసిద్ధినీ రెంటినీ సమీక్షచేయు సందర్భమున జీవితమంతయూ యోగమే అనెడు మాటను మరింత సమగ్రమూ తేజోవంతమైన అర్థములో మరల నింకొకసారి పునరుద్ఘాటన మొనర్చగలుగుదుము.
(*SABCL* Vol. 20, 3-4)

అనువాదం: కె. వేంకటరావు ('యోగసమన్వయము' నుండి)

సామాన్యజ్ఞానము – యోగము I

ఒక వస్తువుయొక్క తత్త్వమును తెలుపునది జ్ఞానము. దీనిని యథార్థ జ్ఞానమనవచ్చును. మామూలుగా మనకు తెలిసిన జ్ఞానము బుద్ధిబలముతో తెలియునది. ఇది అయథార్థ జ్ఞానము, పరోక్షము, ఆంగ్లములో circumstantial లేక indirect knowledge అని అనవచ్చును. ఒక వస్తువుతో తాదాత్మ్యము జెంది పొందిన జ్ఞానము అపరోక్షజ్ఞానము. అది యోగము ద్వారా లభిస్తుంది. యోగమనగా చాలామందికి కొత్తవిషయము. దానిని గురించి స్థూలమైన అభిప్రాయముండవచ్చునుగాని దాని అసలు స్వరూపమేమిటో తెలియదు. మనము వినోదయాత్రకి వెళ్లినప్పుడు ఒక గైడ్ మనకి అనేకమైన అద్భుతదృశ్యాలు చూపిస్తాడు. విషయాలు వివరిస్తాడు. అలాగే శ్రీఅరవిందులు మనకిక్కడ యోగ ప్రపంచాన్ని గురించిన అనేక విషయాలను ఎత్తి చూపిస్తారు. ఈ వ్యాసం శ్రీఅరవిందుల 'యోగసమన్వయం' (The Synthesis of Yoga) లోనిది.

– సంపాదకుడు

ప్రకృతి, జీవితము భగవంతుని కార్యమునకు క్షేత్రములు

ప్రకృతి మరియు జీవనమాధ్యముల ద్వారా జగన్నాటక సూత్రధారియైన పరమాత్మ ఆడించే ఈ అనంతసృష్టిలీలా వినోదవిభవాన్ని, వైవిధ్యాన్ని, వైశిష్ట్యాన్ని జీవాత్మపరమాత్మల కదలికలలోని కమనీయాంతరంగాన్ని అంతరార్థాన్ని, ఈ తోలు బొమ్మలాట నేపథ్యంలో సాగే అనంత సత్యావిష్కరణా రహస్యాలని మనం అవగతం గావించుకొని అనుభవైకవేద్యం జేసుకొని, ఆ అనంత ఆత్మజ్ఞానాన్ని పదిలపరచుకోటానికి, సువేద్యం గావించుకొని ఆత్మానందడోలికలలో ఓలలాడటానికి మనకు సానుకూలపడే సాధనా సామగ్రి, – విజ్ఞానశాస్త్రము, కళలు, వేదాంతము, నీతిశాస్త్రము, మనస్తత్వశాస్త్రము, మానవుని మేధోసంపత్తి, అతని పుట్టుపూర్వోత్తరాలు, పూర్వానుభవానుభూతులు, స్వయంగా

ఆచరణ సాఫల్యతా వైఫల్యాలున్నూ. తొలుదొలుతగా, వివిధ జీవ సమార్గాలు విధానాలు, మరియు ప్రకృతి రూపసాకల్యమూ మనల్ని ఆకట్టుకొంటాయి, మన అనుభవంలోకి వస్తాయి, జీవనసరళిపై ప్రభావం చూపి గాఢంగా పెనవేసుకొంటాయి. మనం క్రమ క్రమంగా పురోగమించి చింతనాధారను తీవ్రంగా, దీర్ఘంగా, లోతుగా, సునిశితంగా, నిశితానునిశితంగా సారించే కొలదీ సమగ్రమైన సంక్లిష్టతారహితమైన పరిపూర్ణమైన దృక్పథం మన అనుభవంలోనికి ప్రవేశిస్తుంది. మన మనః ఫలకంపై నర్తిస్తుంది. అందలి వివిధకోణాలు, క్రమబద్ధంగా మనల్ని ప్రత్యక్షంగా దైవానికి చేరువగా చేరుస్తాయి. సర్వేశ్వరునితో ముఖాముఖీ సానుకూల్యం చేస్తాయి.

_విజ్ఞానశాస్త్రం కూడా దైవానికే దారితీస్తుంది_

ఆఖరికి విజ్ఞానశాస్త్రం – పదార్థ విజ్ఞానశాస్త్రం కూడా తన అగాధాలలో ఈ దృశ్యమానజగత్తులో అనంతత్వాన్ని, విశ్వజనీనతనీ, ఈ భౌతికజగత్తులో దైవాన్నే చూస్తుంది; దైవాన్ని, ఆయన సంకల్పాన్ని, కౌశలాన్ని అనివార్యంగా దర్శించుకొంటుంది. వేరు మాటల్లో చెప్పాలంటే ఈ దృశ్యమానజగత్తు, కనిపించని పరమాత్మచేతన – ఈ రెండు తత్త్వాల ఏకసూత్రత, తాదాత్మ్యత అనిర్వచనీయం, అమోఘం, అపురూపం, అనంతసత్యం. విడదీయలేని మనోజ్ఞమైన ఈ కలనేత ఈ విశ్వకల్పనాధినేత చేనేత.

_సూక్ష్మలోకాలను గురించిన జ్ఞానము_

విజ్ఞానశాస్త్రంలోనే అతీంద్రియ సంబంధమైన అత్యున్నతమైన అతి సూక్ష్మమైన అంతస్తుల శక్తుల వ్యవహారశైలిని గూర్చి పరిశీలించి, పరిశోధించి, బాహ్యేంద్రియములకు సాధారణ మనోబుద్ధులకు గోచరము గాక, అహంకారావృతమై, అజ్ఞానముచే కప్పబడి, సూక్ష్మాతిసూక్ష్మమైన మనః చైతన్యానికి, జ్ఞానేంద్రియములకు మాత్రమే అవగతమయ్యే హృదయాంతరాళాలలో నిగూఢంగా ఉన్న స్థూల సూక్ష్మ కారణదేహ సంబంధ అనంతరహస్యాలను జీవులకు సువిదం జేసే మనోవిజ్ఞాన శాస్త్రాల

అంతిమ మజిలీ కూడా, విశ్వవిభుని లీలావినోదవిశ్లేషణలే – *లోకంబులు లోకేశులు, లోకస్థులు తెగినతుది అలోకంబౌ పెంజీకటిల కవ్వల వెలిగే* పరంజ్యోతి సందర్శనమే. పుట్టిన ప్రతిజీవి ఆలోచనా సంవిధానం అంతిమ సంకల్పం భగవదైక్యమే, జీవాత్మపరమాత్మల సమైక్యస్థితిని ఎఱుక పరచుకోవటమే. అదే చరాచరజీవరాసుల అంతిమ మనోవిశ్లేషణ.

కళారాధన ద్వారా దైవస్ఫూర్తి

కళ చరమాశయమూ అనంతుని దర్శనమే, ఆత్మ నెఱుక పరచుకోవటమే, తానెవరో తెలుసుకొని నిజమైన తనలో తాను నిలిచిపోవటమే. సౌకుమార్యం సౌందర్యం సౌష్టవం అనే సకారత్రయ అంతర్లీనచైతన్యం కళ. ఈ అంతర్లీన చైతన్యం జీవరాసులలో సహన సౌశీల్య సౌభ్రాత్రత్వాలను దీపింప జేస్తుంది. ప్రకృతిలో, ప్రకృతి సౌందర్యారాధనలో మమైక్యమై, తదేక భావనతో అన్య ధ్యాస ఊసే దెలియక తీవ్రంగా మనసును నిమగ్నం జేసిన లౌకికానంద నిరతుడు, లాస్యప్రియుడు, సౌందర్యారాధకుడు భావోద్వేగోద్రేక విలసితుడనైన మానవుడు తన జీవన క్రమంలో క్రమంగా ఈ లౌకికానంద లహరి నీటిబుడగలమయమని, ఈ పైపై మెరుగుల బాహ్యాసౌందర్యమంతా క్షణికమని ఎఱుకై, అంతర్ముఖుడై, సత్యాన్వేషకుడై విమలనేత్రుడై ప్రకృతిని వీక్షించుచూ అందు దాగి ఉన్న అనంతత్వాన్ని చివరగా దర్శిస్తాడు. అంతే గాదు, ప్రకృతి ఒడిలో ఉన్న పరమాత్మను కూడా అందలి అనంతజీవనంతో సహా సాక్షాత్కారింప జేసుకొంటాడు. మానవ జీవనావృత సౌందర్యమాధురీ భావనా లహరిలో తన్మయుడై ఓలలాడుతున్న మానవుడు అలసిసొలసి, అనుభవానుభూతులనుండి సత్యమెరిగి మానవాళిలో మాధవుణ్ణి దర్శించుకొంటాడు. అంతా పరమాత్మ లీలావిభవమే, అన్నింటా పరమేశ్వర దర్శనమే. చరాచర జీవరాసులలో విశ్వవిభురూపమే. విశ్వమంతా విశ్వనాధుని రూపే, చూపే, మాటే, మనసే – *ఆత్మనో మోక్షార్థం జగద్ధితాయచ.*

తాత్త్విక పరిశీలన ద్వారా అదే ఫలితము

విశ్వమందలి సకల పదార్థముల వస్తువుల విషయముల సంగతుల మౌళికసూత్రాలను గూర్చి కూలంకషంగా విచారించి, ఆ ప్రధాన సూత్రాలపై పరిశోధనా, పరిశీలనా గావించే వేదాంతశాస్త్రం సైతం తన నిజనిర్ధారణాక్రమంలో అంతిమంగా ఈ సకల సూత్రాల మూలసూత్రాన్ని కనుగొని, ఆ మౌళిక స్వరూప స్వభావ, ధర్మగుణములను గూర్చి దాని ఆచరణ ప్రణాళికా ప్రాధాన్యతలను పరిశోధించి, విచారణా ఫలితాలను విశ్లేషించటం ఖాయం.

అంచేత కట్టకడకు నీతిశాస్త్రం కూడా తాను దర్శించే ప్రవచించే నీతి నియమ న్యాయం కూడా, న్యాయస్వరూపుడు సకల న్యాయాధీశుడునైన పరమాత్మ స్వభావ సానుకూలతల పైనే ఆధారపడి ఉంటుందని, నైతిక జీవనవిధానం విలువలు పరమాత్మానుగ్రహ ప్రసాదాలేనని కనుగొనక తప్పదు. వేరుమాటల్లో చెప్పాలంటే శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు. మంచీ చెడూ, విధి నిషేదాలూ – సర్వస్వం భగవదాజ్ఞాను క్రమవిన్యాసాలే.

మనోవిజ్ఞానశాస్త్రం ద్వారా ఆత్మవిజ్ఞానం

మనస్తత్వశాస్త్రం కూడా జీవరాసుల మనస్సులను ఆత్మలను గూర్చి అధ్యయనం చేసి విశ్వంలోని జీవాలకి ఒక్కొక్కదానికి ఒక్కొక్క మనసు, ఆత్మ లేవని, అందరి మనసు విశ్వమయుని మనసు ఒక్కటేనని జీవుల జీవాత్మలన్నీ పరమాత్మేనని నిర్ద్వంద్వంగా, సుస్పష్టంగా అవగతం చేసుకొంటుంది. ఈ అనంత సత్యాన్ని అవలోకనం గావించుకుంటుంది.

మానవ చరిత్రాధ్యయన ప్రయోజనము

అనంతము, విశ్వజనీనమునైన ఏ శక్తి యొక్క ఆలోచనా సంకల్పములచేత ఈ విశ్వమంతా నడుపబడుతున్నదో, ఎవడు ఈ సృష్టి స్థితి లయముల కాధారభూతుడో, ఎవ్వడీ జగన్నాటకమునకు మూలకారణమో, ఎవ్వడనాధిమధ్యలయుడో అట్టివాని సందర్శనమే, అనుగ్రహామే, ప్రకృతి చరిత్ర, ప్రకృతి అధ్యయనముల వలెనే, మానవుని చరిత్ర తద

ధ్యయనముల అంతిమధ్యేయం, అంతిమమజిలీ కూడా. సృష్టి పరిణామానుశీలన, మానవుని పురోగమనక్రమ పరిశోధనా, అంతిమంగా మనకు ఎఱుక పరచేదేమిటంటే జీవుని అంతిమ ధ్యేయం శివుడే. జీవుడే శివుడు. నిమ్నప్రకృతిపై పరాప్రకృతి పరిఢవిల్లి జనులెల్లరు జనార్దనులై నడయాడటమే. అతిమానస రూపాంతరీకరణమే.

కర్మలు కూడా ఏ పరాశక్తి, ఏ పరమాత్మ తన ఆచరణల ద్వారా తన విశ్వవ్యాపక చేతన ద్వారా మన కర్మలను దివ్య కర్మలుగా పరిణమింపజేయునో అట్టి దైవికశక్తితో మనకు అనుబంధము గూర్చును.

మానవ మేధస్సు మాధవసేవా తత్పరత

మేధస్సు గూడా ఉపక్రమించి, పరిశీలించి సువిదతము గావించుకొని, ఏ దైవికశక్తి అనుగ్రహాశీర్వాదములు లేక మానవుడు, ప్రకృతి ఒక్క అడుగైన ముందుకు వేయలేవో, కదలకదలించ నశక్తములో, చైతన్య జ్ఞానరహితములై ఉచ్ఛ్వాస నిశ్వాసములనైన నిర్వహింపజాలలేవో, నిష్క్రియావృతము లౌనో, ఎవని అనుగ్రహముచే జీవరాసులకు అద్వైతస్థితి కలుగునో జీవరాసులకు సద్గతులు కరతలామలకములౌనో, మహోన్నతస్థితి సానుకూలపడునో, సారూప్య సామీప్య సాలోక్య, సాయుజ్యములు స్వచ్ఛందముగ నమరునో అట్టి మహాప్రస్థానము వైపే మన కోర్కెలను మలుపు దిప్పి దుష్కామ్యములను వమ్ము జేసి, సంకల్పములు సాగునట్లు సన్నద్ధము జేయును.

(*SABCL* Vol. 20, pp. 492-493)

స్వేచ్ఛానువాదం: అన్నవరం. ఆదిశేషయ్య

సామాన్య జ్ఞానము – యోగము II

దైవంతో సంయోగానికి మార్గము యోగం

యోగం తన ప్రయత్నాలకు అంకురార్పణ గావించేది నిజానికి ఇక్కడే. జ్ఞానాన్ని, భావోద్వేగోద్రేకాలని చేతనాపూర్వకంగా ఉపయోగించుకొని శుభశ్రీకారం గావిస్తుంది. ఎందుకంటే, భగవత్చేతనలో సంవిలీనం గావటానికి, ఏకీకృతం అవటానికి, అనంతభిన్నతా సాధనకు యోగేతరములన్నిటి సాధనాక్రమం అపరిపూర్ణం, అసమగ్రం, అపరిపక్వం, అవిద్యాపూర్వకం కాగా, యోగం భగవదైక్యానికి చేతనాత్మకమైన, సమగ్రమైన పరిపూర్ణమైన నిశ్చయమైన మార్గం కావటంచేత. అలా తొలిఅడుగు వేసిన తర్వాత భగవదైక్యసాధనాక్రమంలో యోగం తనకు తానుగా కర్మలనుంచి, అవిద్య నుంచి విడివడుతుంది. ఎందుకంటే సామాన్యజ్ఞాన ప్రయత్నాలన్నీ పరోక్షంగా మరియు వెలుపలి నుండి జరుగతవి కనుక అవెన్నడూ పరమాత్మ రహస్య స్థావరాన్ని పసిగట్టి ప్రవేశించలేవు.

యోగం ద్వారా అంతర్ద్వారాల భేదింపు

యోగం మనల్ని అంతర్ముఖుల్ని చేసి లోపలున్న అనంతుని అనంత దర్శనానికి ప్రత్యక్షంగా ప్రయత్నాలు నెఱపుతుంది. భగవత్సాక్షాత్కారాన్ని జ్ఞానమార్గం ద్వారా నడుపుతుంది; అతని ఉనికిని ఆత్మవివేకం ద్వారా ఓ ముఖాచ్ఛాదన వెనుకనుండి అవలోకించి అవగతం గావించుకొంటుంది. యోగం అపరోక్షంగా అన్వేషిస్తుంది. ఆ అన్వేషణా క్రమంలో ముసుగును తొలగించి పూర్ణదృశ్యాన్ని కలగంటి కలగంటినంటూ కమనీయంగా దర్శిస్తుంది. అది మాత్రమే అక్కడ ఆ ఉనికిని, ఆ దివ్యశక్తిని అనుభవైక వేద్యం గావించుకొంటుంది. యోగం ఆ ఉనికి లోనికి ప్రవేశించి ఆ దివ్యశక్తితో తాదాత్మ్యం చెందుతుంది. అక్కడ యోగానికి మాత్రమే ఆ దివ్యశక్తి కదలికల వ్యవహార సాకల్యము ఎఱుక అవుతుంది, తద్వారా అక్కడ యోగానికి అనంతసత్యం కొలదిగా ఓ క్షణికకాలం దర్శనమవుతుంది. యోగం

మనలోని అంతర్యామిని గుర్తుపడుతుంది. అనంత సత్యావృత సాక్షీభూత క్షేత్రజ్ఞుని కనుగొని ఆ అనంత సత్యవీక్షణా క్రమంలో ఆ పరమాత్మ లీలావైచిత్రిని, విస్తృతిని, వైభవాలను ఎఱుక లోనికి తెచ్చుకొంటుంది. అంచేత యోగసాధనా పద్ధతి సామాన్య జ్ఞాన సాధనా క్రమం కంటే భిన్నమయినది, ప్రత్యేకమయినది.

బాహ్యావస్తువుల వెనుక శాశ్వత సత్యము

జ్ఞానమార్గంలో యోగమార్గదృష్టి ఎప్పుడూ దృష్టిని అంతర్ముఖం చెయ్యటమే. దృశ్యమానజగత్తును పరికించి పరిశీలించేటప్పుడు గూడ, లోలోపలికి చొచ్చుకొని పోయి, ఏకైక అనంతసత్యాన్ని దృశ్యమాన రూపాలలో కనుగొనటమే యోగలక్ష్యం. సామాన్యజ్ఞానం పైకి కనిపించే అశాశ్వత విషవలయాలతో పెనవేసుకుపోతుంటే సమున్నత జ్ఞానం ఆ అశాశ్వత బంధాల నుండి విడివడి, వాటి అసలు రూపమైన అనంతానంద ప్రాప్తిని కైవసం చేసుకొనే వైపు సాగటానికి ప్రాధాన్యమిస్తుంది. ఈ అశాశ్వతాలన్నీ ఆ పరమాత్మయొక్క ఆ అనంత శక్తి చైతన్యంయొక్క ఆవిర్భావాలే. అనంతుని అంశలేదప్ప అన్యములీ సువిశాల జగత్తులో మచ్చుకైననూ కనిపించవు. పరిశుద్ధీకరణ (purification), ఏకాగ్రత (concentration), తాదాత్మ్యము (identification) అనే పరస్పరాధారములు, ఒకదాని కలయికతో మరొకటి పరిపూర్ణంగా రూపొందెడి మూడు ఎత్తుగడలతో యోగం అశాశ్వతత్త్వంలో శాశ్వతత్త్వ దర్శనాన్ని సాధిస్తుంది.

సమున్నత జ్ఞానం సామాన్యులకు ఉజ్జ్వల కాంతిశోభలని సమకూరుస్తుంది.

ఐనప్పటికినీ ఈ ప్రపంచపుటునికి రహస్యములపై అసహనమును పెంచుకొనే తీవ్ర వైరాగ్యతత్త్వమును పెంచుకొంటే తప్ప, యోగం సామాన్య జ్ఞానవ్యవస్థను వెలి వేయదు, ప్రక్కకు నెట్టదు. ఈ సృష్టిగమన రహస్యాలు దేవుని ఉనికికి ప్రత్యక్ష సాక్ష్యాలు, దైవామోదితాలు. తన లక్ష్యాల తీవ్రతనుబట్టి, విస్తృతౌన్నత్యములనుబట్టి, లక్ష్యాలకు సరిపోయే సాధనల ప్రత్యేక నిపుణతావసరాలనుబట్టి యోగం తనకు తాను సామాన్య జ్ఞానరూపా

లనుంచి వేఱుపరచుకొంటుంది. కాని తనకు ఉపకరణాలుగా వాటితోనే యోగం క్రియను ప్రారంభిస్తుంది. కొంతకాలం వాటిని తనతో తీసుకెళ్తుంది. దీనిని బట్టి విశుద్ధతా లక్ష్యంగా సాగే యోగ ప్రక్రియలో, సన్నాహ సంవిధానంలో ధార్మిక నైతిక భావనలు, ఆచరణలు, (బాహ్య నడవడికాకుండ) అంతఃశీలము చోటుచేసు కొంటవో ఎఱుకవుతుంది.

యోగం మనోవిజ్ఞాన శాస్త్రానికి ప్రయోగశాల

మరలా, యోగంయొక్క పద్ధతి సర్వ స్వమూ మనసు – దాని చేతనా – దాని తత్త్వములకు సంబంధించినది – మనసాధారిత ప్రక్రియ. ఇంకా చెప్పాలంటే దానిని మనో విజ్ఞానశాస్త్ర నిరంతర ప్రయోగశాలగా భావించవచ్చు. పరిపూర్ణ మైన ఆచరణాత్మక మనోవిజ్ఞానశాస్త్రం యోగం అనవచ్చు. దైవ సాక్షాత్కారానికి యోగం ప్రాథమిక సన్నాహాలు నెరపేది వేదాం తశాస్త్ర మూలాధార సూత్రాల ఆధారం పైనే, ప్రాణిమౌళికాంశా ధారంగానే. వేదాంతశాస్త్రం అందించే మేధో విజ్ఞానవిభవాన్ని, సూక్ష్మాతిసూక్ష్మ అవగాహననీ దైవసాక్షాత్కార ప్రక్రియలో ప్రమే యపరుస్తుంది. ఊహాతీతమైన, చూపులకందని, భావాతీతమైన ఆధ్యాత్మికాన్వేషణా పరిధి లోనికి ప్రవేశపెడుతుంది. నిగూఢంగా వేదాంతం వదలి వేసిన, దూరంగా ఉంచిన విషయాలను యోగం సజావుగా అత్యంత చేరువకు తెస్తుంది. ఆధ్యాత్మికంగా సంఘటి తపరుస్తుంది.

కళోపాసన యోగానికి ఆలంబనము

సౌందర్యారాధన చేసెడి మరియు భావోద్వేగోద్రేక సంభరితమైన మన సును, సౌందర్య స్వరూపములను ప్రకృతి లావణ్యలాలిత్యములను యోగం ఏకాగ్రతాసాధనకు ఉపయోగించుకొంటుంది. జ్ఞానయోగంలోనూ అది ఆధారభూత మవుతుంది. సౌందర్యారాధన ఆనందయోగాన్ని, సచ్చిదానంద పదాన్ని పటిష్టపరుస్తుంది. జీవనమార్గాన్ని, కర్మపథాన్ని ఉత్కృ ష్టపరుస్తుంది. జీవితమంతా యోగమే. ఇవన్నీ సంపూర్ణంగా కర్మ యోగ సాధనా సముచయమే.

లోకవ్యవహారంలో యోగసాధన పాత్ర

ప్రకృతిలో మానవునిలో దేవుని పొడగాంచటం, దైవచింతన చేయటం, మానవునిలో మాధవుని కనుగొని, మానవసేవలో మాధవుని దర్శించటం, గతంలో వర్త మానంలో, భవిష్యత్తులో, విశ్వంలో, విశ్వప్రాణికోటిలో సర్వే శ్వర దర్శనం, అన్నింట సమభావన అన్ని వేళల సమచింతన, అన్ని చోట్ల సమదర్శన – ఇవన్నీ సమంగా జ్ఞానయోగం అన్నిం టిలో – చరాచరజీవకోటిలో అనంతంగా అభిన్నంగా పరమా త్మను దర్శించుకోటానికి విశ్వాసనీయంగా ఉపయోగించుకొన గలిగిన అంశాలు. సర్వమూ ఏక లక్ష్యం వైపే తమ దృష్టిని మళ్ళిస్తున్నాయి, సారిస్తున్నాయి, ఏకీకృతం చేస్తున్నాయి. వాటి ఉద్దేశం, అనంతసంకల్పం, అంకితభావం, ఆర్ద్రత, ఆలోచన, ఆందోళనా అన్నీ, అశాశ్వతాల వైపు, అరిషడ్వర్గాల వైపు అల్ప సుఖాలవైపు అంటుగట్టుకొని సప్తవ్యసన బందీలైన జీవుల అజ్ఞాన తిమిరాలను మట్టి గరిపించి నిజం తెలుసుకొని విమలులై తమను తామెరిగి, విశ్వజనీనమైన విశిష్టమైన, అనంతమైన, నిరంతర చైత న్యమైన శాశ్వతానందానుభూతిని పొంది, శాంతిని పొంది ప్రశాంత జీవనం సాగించేలా చూడటమే.

దివ్యజీవనాన్ని సాధించటం కోసం యోగం

ఒకే ఆత్మ, ఒకే భావన, ఒకే జీవనం – దివ్యజీవనసాధనే యోగం సంక ల్పించినది, సంకల్పించుచున్నది సంకల్పించనున్నది కూడ. ఆ ఏకభావన, ఏకసూత్రత ఏకా త్మావలోకన సాధించిన తర్వాత ఆ శీలమే భాసిస్తుంది. తాను తరించిన యోగి లోకాలను తరింప చేస్తుంటాడు – తన వంశా లను తరింపజేస్తుంటాడు. అంకితభావ పరిపూర్ణపరాభక్తి పరా కాష్ఠగా చెల్వొందుతాడు. దైవసాక్షాత్కారం సాధించిన యోగి తరువాత కూడా నిరంతరం యోగీశ్వరేశ్వరుని గూర్చి తెలుసు కొంటూ ఉంటాడు, దర్శిస్తూ ఉంటాడు. ఈ అశాశ్వతమైన పరి మితమైన జీవనపరిధిలో అనంతాత్మ దర్శనం చేస్తూనే ఉంటాడు. విశ్వంలో దైవచైతన్య, దైవక్రియాంశవాహికగా వర్తిస్తుంటాడు, వర్తి

స్తుంటాడు. అందుచేత విశ్వసంబంధ జ్ఞానము, సృష్టిస్థితిలయా విన్యాసము తత్సంబంధ విషయవివేచనా విశ్లేషణా, జీవన పురోగమనమును, హెచ్చుతగ్గులు, ఇంకా చెప్పాలంటే జీవనచదరంగంలో జీవన పరమపదసోపానపటంలో ఎదురయ్యే గెలుపోటములూ ఒకటేమిటి జీవితానికి సంబంధించిన ప్రతి విషయమూ ఆయన పరిధిలోకి వస్తాయి.

> సర్వే సర్వత్రా దైవదర్శనమే

అప్పుడాయనన్నింటిలోను దైవాన్ని చూస్తాడు, అనంత సత్యాన్ని అవలోకిస్తాడు. మాధవుని దర్శించటానికి, మాధవుడిని గూర్చిన విషయాన్ని సువేద్యం గావించుకోటానికి మానవుని సమాయత్తపరచటమే ఆయన దినచర్య. తన సహ సమాజమంతా దైవాన్ని సాక్షాత్కరింప జేసుకోగల సమర్థతను సంతరించుకొనేలా చూడటమే ఆయన నిరంతర తపన, అకుంఠిత దీక్ష, అనుపమాన కార్యశీలత. ఆయన విజ్ఞానశాస్త్ర మందించే సమాచారం ద్వారా దైవాన్నే చూస్తాడు. వేదాంతం వెలువరించే అంతిమ నిర్ణయాలు, ఆచరణీయ సూత్రాల నేపథ్యంలో దేవుని కనుగొంటాడు. సౌందర్యరూపాలలో మంచివర్తనలో, సదాచారసంపన్నుల సంప్రదాయాలలో, జీవనాంశలన్నింటిలో, గడచిన ప్రపంచ చారిత్రికాంశాలలో, నడుస్తున్న చరిత్ర విన్యాసాలలో, భవిష్యత్తులో సంభవించగల మార్పు చేర్పులలో పరమాత్మను పారవశ్యంతో వీక్షిస్తాడు, విశ్వసిస్తాడు. పై సకలాంశాలలో లేదా కొన్నింటిలో యోగి దైవజ్యోతుల శోభని దీపింపజేస్తాడు. విముక్తమైన దైవిక శక్తిని ప్రేరేపిస్తాడు. సామాన్యజ్ఞానమనే తొలిమెట్టునుండి ఆయన ఉన్నతశ్రేణులనధిరోహిస్తాడు. సమున్నత జ్ఞానం (higher knowledge) సామాన్యజ్ఞానాన్ని (lower knowledge) సముజ్వలం గావించి, తనలో భాగంగా కలుపుకొంటుంది – సమున్నతం సామాన్యభావన లహరిలోని అనుకూలతలను సైతం సహిస్తూ సమభావన వహిస్తూ.

(*SABCL* Vol. 20, pp. 493 - 497)

స్వేచ్ఛానువాదం: అ. ఆదిశేషయ్య

యోగానుభవాల ప్రామాణ్యత

యోగానుభూతులు లౌకికానుభూతులవలె (ఆకలి, దప్పిక మొ॥) రూఢమైనవి కావని, వాస్తవమైనవి కావని కేవలం ఊహాలే, అంతరంగికానుభూతులే అని అధునికుల వాదన. ఇది యోగానుభూతులు పొందని వారి వాదన. ఒక నదీ ప్రవాహామువలె ఆనందము వరవళ్లుతొక్కుతూ నీలోకి ప్రవేశిస్తుంది. ఒక మహాశక్తి సాగరములో నువ్వు తలమునకలవుతారు. దివ్యప్రేమ నీలో పొంగిపొరలుతుంది. ప్రపంచమంతా నీ శరీరమే అవుతుంది. అన్ని భువనములు నీలోనే కదులుతుంటాయి. ఈ అనుభూతులన్నీ తిరుగులేని సత్యములు. మామూలు ఇంద్రియానుభూతులు వలె పైపై మెరుగులు కావు. చాలా గంభీరమైనవి.

— సంపాదకుడు

అనాధ్యాత్మికుల అనుమానాలు

చేతనాత్మక దృక్పథాన్ని నిరసించి జడ పదార్థవాదాన్ని సమర్థిస్తూ వాదించే విక్టోరియా యుగం సంశయవాదులలో మార్పు తీసుకురావటానికి ఏమి ఎంత చెప్పినా నిరుపయోగమే. వారి సంశయాలకు మూలం యోగానుభవం వ్యక్తిగతమనీ, దానికి వైజ్ఞానిక ప్రామాణ్యత లేదనీ, యోగం ద్వారా పరమసత్యాన్ని చేరలేమని యోగానుభవాలెప్పుడు యోగి వ్యక్తిత్వంవలన కలుషితమై ఉంటాయనీ వారు ధృడంగా విశ్వసించటమే. విజ్ఞానశాస్త్రం పరమసత్యాన్ని కనుక్కోగలిగిందాయని ఎవరైనా వారిని ప్రశ్నించవచ్చు. విజ్ఞానశాస్త్రం అభివృద్ధి చెందుతున్నకొద్దీ భౌతికసత్యం కూడా కనుమరుగవుతున్నది కదా! విజ్ఞానశాస్త్ర పరిశోధనలు పరమసత్యం భౌతికమనీ వస్తురూపమనీ, వస్తుసత్యం (objective ultimate) ఆత్మాశ్రయానుభూతులకు (subjective phenomena) సంతృప్తికరమైన సమాధానాల నివ్వగలదనే ప్రతిపాదన మీద ఆధారపడి ప్రారంభమయ్యాయి. యోగం దీనికి విరుద్ధంగా పరమసత్యం అభౌతికము లేక చైతన్యస్వరూపమనీ, అది ఆత్మాశ్రయానుభవం ద్వారానే ఆవిష్కరింపబడగలదనీ, అట్టి సత్యానుభూతి

తోనే ప్రాపంచిక సంఘటనలను పరిశీలించాలనీ చెబుతుంది. ఈ రెండు పరస్పర విరుద్ధ దృక్కోణములైనందున వాటిని సమన్వయం చేయడం కుదిరే పని కాదు.

సత్యానికి గీటురాయి మనస్సేనా?

యోగం నిజంగా వైజ్ఞానికమే. ఎలాగంటే అది వ్యక్తిగత ప్రయోగాల ద్వారా అనుభవాలు పొంది, వాటి ఆధారంతోటే ఫలితాలు సాధిస్తుంది. మానసిక అంతరబోధలను ప్రథమదశలో అనుమతించినా, అవి అనుభవం ద్వారా నిరూపింపబడనిదే వాటిని సత్యాలుగా యోగం అంగీకరించదు. అనుభవానికి విలువ ఉన్నదా అని భౌతికమనస్సు శంకించవచ్చు. ఎందుకనంటే అనుభవం వ్యక్తిగతమే గాని వస్తువుపై ఆధారపడదు. అయితే ఇలా శల్యపరీక్ష చేస్తే ప్రయోజనమేమిటి? జ్ఞానము, అనుభవము సమస్తము వ్యక్తి లేనిదే ఉండవు కదా! మనకు వెలుపలనున్న భౌతికవస్తువులను మనము చూడగలుగుతున్నామంటే దానికి కారణం అది మన మనస్సు, ఇంద్రియాల నిర్మాణంపై ఆధారపడి ఉండటమే. (మనస్సు, ఇంద్రియాలు బహిర్ముఖంగా ఉన్నందున అవి బాహ్యవిషయాల వైపు మాత్రమే పోగలవు. లోపలవున్న ప్రత్యగాత్మను అవి దర్శించలేవు.) మనోదేహేంద్రియాల నిర్మాణం దీనికి భిన్నంగా ఉండి ఉన్నట్లయితే అవి మనకు వేరొక భౌతికప్రపంచాన్ని చూపించి ఉండేవి. విజ్ఞానశాస్త్రం ఈ విషయం స్పష్టం చేసింది కూడా.

సత్యము వ్యక్తులకు దేశకాలాల కతీతము

నీ మిత్రుడి అభిప్రాయం యోగానుభవం వ్యక్తిగతమనీ అది యోగి యొక్క వ్యక్తిత్వంవలన కళంకితమైనదని (స్వచ్ఛంగా ఉండదని) కదా! యోగులకుండే సంస్థాపరమైన నిర్దుష్ట వ్యక్తిగతానుభవాల విషయంలో ఆ అభిప్రాయంలో కొంత నిజం ఉండవచ్చు. ఇక్కడ కూడా భేదం బాహ్యాదృష్టికి చెందిందే. *యోగానుభవం ఎక్కడైనా ఒక్కటేననేది వాస్తవం.* నిజమే, యోగమార్గం ఒక్కటే కాదు. అనేక యోగమార్గాలున్నాయి. మనం అనేక కోణాలుగల అనంతసత్యాన్ని

ధ్యానించేటప్పుడు దానిని ఏ కోణంనుండి ఐనా దర్శించవచ్చు. అయినా స్థూలంగా అన్ని కోణాలు ఒకే విధంగా ఉంటాయి. అంతే గాదు. సత్యం గురించిన అంతరబోధలు, సత్యానుసంధానంవలన కలిగే అనుభవాలు, యోగసిద్ధులు సర్వకాలాలలోను బహుదూర ప్రదేశాలలోను, వేరు వేరు యోగసాధనలు చేసే వారిలోను సమానమే. మధ్యయుగానికి చెందిన భారత, ఐరోపా దేశాలకు చెందిన యోగుల అనుభవాలలో భేదం లేదు. అయితే వాటి పేర్లు, ఆకారాలు, మతపరమైన ముసుగులు వేరు కావచ్చు. వీరిలో కొందరు తమ అనుభవాలు అర్థంకాక సూటిగాగాని, ఉత్తరప్రత్యుత్తరాల ద్వారా గాని పరస్పరం సంప్రదించుకొన్నా లేకపోయినా అనుభవాలలో మట్టుకు ఎటువంటి భేదము ఉండదు. విజ్ఞానశాస్త్రవేత్తల పరిశోధన ఫలితాలు అమెరికాలోని న్యూయార్కు, జపానులోని యోకహోమా నగరాలలో ఎక్కడ జరిగినా ఎటువంటి భేదము లేక సమానంగానే ఉంటాయి కదా! దీనిని బట్టి యోగానుభవాలు సమానమనీ, అవి విశ్వజనీయములనీ సత్యములనీ అర్థమౌతోంది. అయితే వాటిని వివరించే తీరులోనూ అందుకు ఉపయోగించే భాషలోనూ మాత్రం భేదం ఉండక తప్పదు.

పరమసత్యం అజ్ఞేయమనే వాదన

పరమసత్యం విషయంలో విక్టోరియా కాలపు సంశయవాది, భారతీయ వేదాంతి – ఉభయులు కూడా – అది ఉన్నదనీ, అయితే మరుగై ఉన్నదనీ అంగీకరిస్తున్నారు. ఉభయులు పరమసత్యాన్ని తెలిసికోలేమంటారు. వారిద్దరు చెప్పే దాంట్లో కొంత భేదము లేకపోలేదు. వేదాంతి సత్యాన్ని మనస్సు తెలిసికోలేదనీ, వాక్కు దానిని వర్ణించలేదనీ అంటాడు. అయితే మనస్సును, ఇంద్రియాలను అంతర్ముఖం చేసుకొని ప్రత్యగాత్మను దర్శించిన యోగికి మహత్తత్త్వము (సమిష్టి బుద్ధి, మహోవిజ్ఞానము) తో అనుసంధాన మేర్పడినందున ఆ మహోచైతన్యపు వెలుగులో మనస్సు తన బాహ్యాంతరానుభవాలను తెలిసికొన్నప్పుడే, వాక్కు సమస్త విషయాలను సమగ్రంగా వివరించగలదని వేదాంతి స్పష్టీకరిస్తాడు. కాని విక్టోరియా యుగం సంశయవాది ఈ క్రొత్త

ప్రతిపాదనతో అంగీకరించడు. అతడు పాతపాటే పాడుతూ – "పరమసత్యం ఉన్నదో లేదో మనం చెప్పలేం. ఒకవేళ అటువంటి ధోరణి ఉన్నట్లయితే దానిని ఎట్టి పరిస్థితులలోను మనం తెలిసికోలేం" అంటాడు.

(*SABCL* Vol. 22, pp. 189-190)

*

దైవానుభూతి ఎలా ఉంటుందో తెలుసా?

నేను మొదట వేరొక విషయం తెలియజెప్పాలి. అదేమిటంటే ఇంద్రియ గ్రాహ్యములైన భౌతికసంఘటనలు ఎంత స్పష్టమో దేవుడు కూడా అంతే స్పష్టము. సత్యము. ఇక్కడ నిజంగా దేవుడు సత్యమే. జడప్రపంచంలో శ్రోత్రచక్షురాది ఇంద్రియాలు గ్రహించగల వస్తువులకంటె దేవుడు అధికంగా స్పష్టము. సత్యము. ఈ సత్యత కేవలం మానసికం కాదు. అది యథార్థానుభవం. దైవపరమైన శాంతి నీలోకి దిగివచ్చినప్పుడు, దేవుని సత్యస్వరూపము నీ చేతనలో దర్శింపబడినప్పుడు, దేవుని నిరతిశయానందము మహాసముద్రమువలె నిన్ను అన్ని వైపులను చుట్టిముట్టినప్పుడు, గాలికి ఎగురకొట్టబడే ఆకువలె నిన్ను మహావాయువులో నిక్షిప్తమైయున్న దివ్యశక్తి క్రియాశీలుని చేసినప్పుడు, దివ్యప్రేమ నీలో పొంగి సర్వప్రాణుల వైపు ప్రవహించినప్పుడు, దివ్యజ్ఞానము నిన్ను ముంచెత్తి, తన వెలుగులో నీకు స్వస్వరూపజ్ఞానము ప్రసాదించి క్షణమాత్రమున నీలో పూర్వమున్న అజ్ఞాన, దుఃఖ, అస్పష్టతలను తొలగించినప్పుడు, విశ్వమంతటిలో నున్నదంతయును ఏకైకసత్యములో అంతర్భాగమైనప్పుడు, ఆ సత్యమే నిన్ను సర్వదిక్కుల నుండి పరివేష్టించినప్పుడు, తక్షణమే అట్టి చేతనాత్మసంస్పర్శ చేతను, అంతరదృష్టి చేతను, పరివర్తన చెంది ప్రకాశవంతములైన మనోప్రాణదేహేంద్రియముల ద్వారా నీవు సర్వత్రా దేవుని దర్శించగలవు, స్పర్శించగలవు, దైవవాణిని వినగలవు. అప్పుడు నీవు దేవుడు లేడని వాదించవు, ఉన్నాడో లేడోనని సందేహించవు. ఎందుకంటే అప్పుడు దేవుడున్నాడనే

సత్యము నీకు పగటి వెలుతురు, గాలి, ఆకాశములోని సూర్యుని వలె స్పష్టముగా అనుభవమౌతుంది. ఈ వెలుతురు, గాలి సూర్యుడు వంటి భౌతికవస్తువులను నీవు నీ ఇంద్రియముల సహాయముతో మాత్రమే తెలిసికొనగలవు. కాని భగవంతుని గురించిన యథార్థానుభవం నీకు కలిగినప్పుడు, ఇంద్రియగ్రాహ్య విషయముల వలె గాక భగవంతుని తెలియుటలో నీకు ఏమాత్రం అనుమాన ముండదు.

(*SABCL* Vol. 22, p. 168)

*

యోగము ప్రత్యక్షానుభూతి

తత్త్వశాస్త్రమువలె మతములవలె యోగము ఒక సిద్ధాంతం గాని, మూఢనమ్మకం గాని కాదు. యోగము అనుభవయోగ్యమైనది. ఆ అమభవం ఎటువంటిదంటె అది సార్వజనీయ ప్రపంచాతీత చైతన్యపురుమనితో సంయోగము వలన కలిగేది. ఆ అదృశ్యపురుమనితో కలయికవలన కలిగే ఈ ఎరుకతోకూడిన అనుభవాన్ని మరల మరల పొందవచ్చును, తనకు తాను నిరూపించుకొనవచ్చును కూడా. యోగానుభవం భౌతికప్రపంచాన్ని గురించిన మన ఎరుక, అనుభవాలవలె అధికప్రామాణికమైనది. ఈ భౌతికప్రపంచంలోని దృశ్యమాన వస్తువులతోనూ, వాటికి చెందిన అదృశ్య మనస్సులతోను మనం రోజూ పెట్టుకొనే సంబంధం ఎంత సత్యమో యోగానుభవం కూడా అంతే సత్యమూ, ప్రామాణికమూను. యోగం చైతన్యవంతమైన ఐక్యత వలననే సిద్ధిస్తుంది. దానికి చైతన్యపురుమడే సాధనం.

(*SABCL* Vol. 21, p. 531)

అనువాదం: డా॥ కోట వేంకటేశ్వరరావు

యోగము యొక్క ప్రథమ నియమము

యోగమనగా మనిషిలో చంచలత్వము పోయి ఏకమాత్రభావమే రాణించుట. యోగికీ మామూలు మనిషికీ తేడా ఏమిటి? మనిషిని ఇంద్రియాలు పరిపరి విధాల లాగుతూ ఉంటాయి. మనస్సు స్థిరంగా ఉండదు. మనిషి స్థిమితం లేక గంతులేస్తూ ఉంటాడు. ఈ పరిస్థితి మార్చివేసి మనిషిలోని అన్ని విభాగములకు ఒకే లక్ష్యమును చూపించి ఆ దిశగా నడిపించినప్పుడు మనిషికిక చాంచల్యముండదు. ఇంద్రియములన్నీ తలోవైపు కాకుండా ఒకే లక్ష్యానికి అంకితమైనప్పుడు ఎట్టి బెడదా ఉండదు. క్షుద్రప్రవృత్తులనుంచి మళ్లించి ఏకోన్ముఖము చేసినప్పుడు ఇక నువ్వు యోగపథమున స్థిరపడినట్లే. నిరభ్యంతరంగా ముందుకు సాగిపోవటమే ఇక నీ వంతు. — సంపాదకుడు

మనస్సు బదులు దివ్యచైతన్యము

సకల యోగసంసిద్ధియూ స్వభావసిద్ధముగ నొక నూతనావిర్భావము. మనోమయమైన భౌతికజీవనమునుండి, ఉన్నత ఆధ్యాత్మికమైన చేతనలోనికి, — మహత్తరమైన దివ్య సత్తలోనికి ఆవిర్భావమది. బృహత్తరమైన ఈ ఆధ్యాత్మిక సంస్థితిని అవశ్యముగా సాధింపవలసి యున్నదనెడి భావము మన యందత్యుత్కటముగ ప్రబుద్ధమగునంతవరకూ, ఏ యోగసాధనయూ విజయవంతముగ గొనసాగనేరదు.

యోగజీవితానికి పిలుపు

ప్రగాఢమైన ఈ బృహత్పరివర్తనమును సాధించవలసియున్న జీవాత్మకు ఈ ప్రబోధము వివిధమార్గముల గలుగవచ్చును. జీవుని స్వాభావికపరిణామ రహస్య మీ ప్రబుద్ధస్థితిని సాధించుటయే కావున, ఆ పరిణామ ద్వారముననే క్రమక్రమముగ నతనికి మెలకువ కలుగుటకు వీలున్నది. లేక, ఈ మెలకువ ఏ మత ప్రభావముననో, ఏ సిద్ధాంతప్రాబల్యముననో కలుగవచ్చును. క్రమక్రమముగా పొడమిన జ్ఞానమువలననో, ఆకస్మికముగ సంఘ

టించిన సంస్పర్శవలననో ఆఘాతము వలననో కలుగవచ్చును. బాహ్యపరిస్థితుల ఒత్తిడిచేతనో, ఆంతరపరిస్థితుల రాపిడి చేతనో కలుగవచ్చును. హృదయగ్రంథులను భేదించు నేదైన శబ్దశ్రుత మూలముననో, లేక, దీర్ఘవిమర్శ మూలముననో కలుగవచ్చును. యోగమార్గపరిచయము గల దూరస్థగురుని లక్ష్యభూతాచరణ ద్వారముననో, లేక సమీపస్థగురుని నిత్యసంసర్గ ప్రభావముల ద్వారముననో కలుగవచ్చును. జీవుని స్వభావమును బట్టియూ పరిస్థితులనుబట్టియూ నీ ప్రబోధము కలుగుచుండును.

గట్టి నిశ్చయము కావలెను

ఎట్లు కలిగిననూ, మన బుద్ధివృత్తియందునూ ఇచ్ఛాశక్తియందునూ దృఢమైన వినిశ్చయ భావము నెలకొని, తత్ఫలితముగ, సమగ్రమూ సమర్థమూనైన ఆత్మనివేదనము జరుగట కడుంగడు ముఖ్యము. శక్తి సంభరితమగు నొక క్రొత్త ఆధ్యాత్మిక భావవిస్ఫూర్తియూ, ఊర్ధ్వగతి ప్రవణతయూ జ్ఞానోదయ స్థితియూ సాధకునియందు దీప్తముగావలెను. అతని యంతరమున గలుగు పరివర్తన మాతని ఇచ్ఛాశక్తినీ, హృదయాభిలాషనూ ఉద్దీపింపజేయవలెను. యోగమువలన గాంచదగు సంసిద్ధి యంతయూ నీ మహత్తర సంఘటనమందే బీజప్రాయముగ నిమిడి ఉన్నది.

కేవలం మనస్సులో అనుకోటంవలన లాభం లేదు

కేవలము బుద్ధివృత్తితో నన్వేషించు పరతత్వభావన, బుద్ధితత్వము నెంతగా ఆకర్షించగల్గిననూ, ఫలప్రదము కానేరదు. హృదయముచే నభిలషింపదగినదియూ ఇచ్ఛచే సాధింపదగినదియూ అది యొక్కటే యనెడి దీక్ష గుదురవలెను. అప్పుడే యది ఫలప్రదమగును. ఏలయన, ఆత్మతత్త్వము బుద్ధియందు చింతన సేయదగినది మాత్రమే కాదు. జీవితము నందనుభవించదగినది. జీవితమందు దాని ననుభవించవలెనన్న, సాధకుని సత్తయందంతటనూ సమగ్రమైన ఏకాగ్రత గుదురవలెను. ఏకాగ్రతలేని ఇచ్ఛతోనూ, సంకోచరహితము కాని బుద్ధితోను, అసమగ్రమైన శక్తితోను సాధింపబడునది కాదీ

యోగలక్ష్యమగు పరివర్తనము, ఈశ్వరాన్వేషణము సేయువాడు అనన్య భావమున ఈశ్వరునికే తనను దా నివేదించుకొనవలెను. (*SABCL* Vol. 20, pp. 63-64)

*

జీవితములో సాధించవలసిన అనేక లక్ష్యములలో యోగముకూడ నొకటియని భావింపరాదు. యోగమే జీవిత సర్వస్వమునకునూ ఏకలక్ష్యముగ నుండవలెను. యోగములో సిద్ధి పొందుటకు రహస్యమిదియే.

క్షుద్రమైన ఆలోచనలకు ఏమాత్రం చోటివ్వరాదు

దేహేంద్రియవృత్తి ప్రధానమైన సామాన్య జీవనమును గడుపువారే మానవులలో నత్యధిక సంఖ్యాకులు. ఏ కొలదిమందియో మాత్రము, విశేషముగా మనోవృత్తి ప్రధానమయ్యూ పరిచ్ఛినమే యనదగు జీవనమును నడుపుచుందురు. ఈ ఉభయజీవన మార్గముల నుండియూ మరలి, ఆధ్యాత్మికమైన దివ్యజీవన పద్ధతి ననుసరించుటయే యోగముచే సాధింపనగు ముఖ్యాశయము. కావున మనయందలి ఏ శక్తి విశేషమేని, అపరజీవన ధర్మానుసారముగా నపర జీవమునందు అనురక్తమై యుండునేని, అయ్యది మన లక్ష్యమునకూ ఆత్మనివేదనమునకూ విరుద్ధమైనదే యగును. అపరజీవము నందనురక్తమైయుండు ప్రతిశక్తినీ, ప్రతిప్రవృత్తినీ, ఆ యనురక్తినుండి మరల్చి, పరజీవనమున కెంతెంతగా వశంవద మొనర్చగలుగుచుందుమో, అంతంతగా మన ప్రయాణము సాగుచుండును; మన యభివృద్ధిని నిరోధించు ప్రతికూలశక్తులంతంతగా దుర్బలములగుచుండును.

పాత సంస్కారాలను పటాపంచాలు చెయ్యాలి

సకలశక్తి ప్రవృత్తులనూ సంపూర్ణముగ నిట్లు పరివర్తనము నొందించుటలో నెంతేని కష్టమున్నది. యోగమార్గమున గలుగు తడబాటుల కన్నింటికీ నిదియే మూలకారణము. ఏలయన, మన యాధ్యాత్మిక పునర్జన్మమునకు బ్రతికూలములై మన సాధనైకాగ్రతను భంగపరుపజూచు

పలువిధములగు నభ్యాసములూ ప్రేరణలూ, మన స్వభావమునం దేమి తత్పరిసరము నందేమి, మన వ్యష్టాత్మయందేమి, సమిష్ట్యాత్మయందేమి నిండి నిబిడీకృతమై యుండును. ఒక విధముగా మనము, ప్రబలమైన భావములచేతనూ, కామనలచేతనూ, సంసర్గలచేతనూ గుదిగూర్చబడిన దేహ ప్రాణ మనస్సంబంధమైన యభ్యాసముల పుట్టయని చెప్పవచ్చును. కొన్ని ప్రధాన స్పందనలతోపాటు, పునఃపునః ప్రవృత్తమానములగు పెక్కు చిన్నచిన్న శక్తులెన్నియో మనయందు మిశ్రితమైయుండును. దేహప్రాణమనోమయమైన సామాన్యమానవునియందలి ఈ పడియచ్చును భగ్నమొనర్చి, దివ్యత్వమునకూ మానవాతీత ప్రకృతికీ నిలయము కాగల ఒక నూతన దృక్కేంద్రమునూ నూతన వ్యాపార ప్రపంచమునూ సృష్టిచేయుటయే మన యోగసాధన లక్ష్యము.

SABCL Vol. 20, pp. 65-66)

*

వ్రతదీక్ష అత్యావశ్యకత

ఇట్లు, మన సకల సత్తకునూ లక్ష్యమైన పరతత్త్వమునందు దాని నేకాగ్రమొనర్చుచూ, ఆ పరమసత్యమునకు విరుద్ధమైన సమస్తమునూ ఎడతెగక నిరాకరించుచుండుటయే పురుషాకార ప్రధానమైన ప్రథమ దశయందు మన మనుసరించవలసిన పద్ధతి. పట్టుదల వీడని ఈ సాధన ఫలితముగా, మన ఆలోచనలూ, మన భావములూ, మన కర్మలూ, మన సమస్తమూ సంపూర్ణముగ నీశ్వరునకు నివేదితమగుట సంభవించును. ఈ నివేదన పర్యవసానముగ సర్వసమర్పణము సిద్ధించును. సకల ప్రకృతియూ సంపూర్ణముగ, సర్వతోముఖముగ, నీశ్వరాధీనమై పోవుటయే ఈ సాధనకు పరమ సాఫల్యము.

పురుషప్రయత్నము ఈశ్వరాధీన కర్మయోగముగా పరివర్తనము చెందు సంధికాలమున నానాటికి విశుద్ధమగుచూ నొప్పారు నొకవిధమైన నిర్నిద్ర నిశ్చలత్వము (passivity) సాధకుని కలవడును. ఈశ్వరుని దివ్యశక్తి యెడల దివ్యమైన అభిముఖ్యము క్రమ

క్రమముగా వృద్ధినొందును. ఏ తత్ఫలితముగా నొక మహత్తర మైన అప్రాకృత క్రియాశక్తి అంతకంతకు వేగవత్తరమగుచూ మన లోనికి పొర్లుకొనివచ్చును.

(SABCL Vol. 20, 80-81)

అనువాదం: కె. వేంకటరావు ('యోగసమన్వయము') నుండి

ఎప్పుడూ మరువ వద్దు

మనం అభ్యసించే యోగం కేవలం మన కోసమే కాదు, దైవం కోసం; దాని లక్ష్యం ప్రపంచంలో ఉన్న దేవేచ్ఛను పైకి రప్పిం చటం, ఆధ్యాత్మిక పరివర్తనను కలిగించటం, మానవజాతికి చెందిన మానసిక, ప్రాణిక, భౌతిక ప్రకృతిలోకి, జీవితంలోకి, దివ్యప్రకృతిని, దివ్యజీవనాన్ని క్రిందికి తీసుకొని రావటం, యోగానికి అవసరమైన పరిస్థితి మోక్షమే అయినా, దాని లక్ష్యం వ్యక్తిగత ముక్తికాదు, మానవజాతి విముక్తి, పరివర్తన. ఆ లక్ష్యం వ్యక్తిగత ఆనందం కాదు; దివ్యానందాన్ని – క్రీస్తురాజ్యాన్ని, మన సత్యయుగాన్ని భూమి మీదకు తీసుకొనిరావటం. మోక్షం వ్యక్తిగతంగా మనకు అవసరం కాదు; కారణం అంతరాత్మ నిత్య ముక్తం. బంధన ఒక భ్రమ, బంధించబడటం మనకొక క్రీడ తప్ప నిజంగా మనం బంధితులం కాము.

ఈ యోగంలో మొట్టమొదటి ప్రక్రియ 'ఆత్మసమర్పణ సంకల్పం'. నిన్ను నీవు నీ సర్వహృదయంతో నీ సర్వశక్తితో భగవంతుని చేతులలో ఉంచుకో. షరతులు విధించకు; దేనినీ, యోగంలో సిద్ధినికూడా అడగకు. ఆయననుంచి ఏదైనా కోరిన వారికి, వారు అడిగిన వాటిని దైవం ఇస్తాడు కాని దేనిని అడ గకుండ తమ్ము అర్పించుకొను వారికి, వారు ఏది అడిగి ఉండే వారో, ఏది అవసరమో దానిని, దానితోపాటుగా తనను, తన ప్రేమను కూడ ఆయన యథేచ్ఛగా అనుగ్రహిస్తాడు.

(*SABCL* Vol. 16, pp. 411-414)

అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రరావు

వందేమాతరం

హిందు ముస్లిం ఐక్యత

రాజకీయ సర్దుబాట్లవల్ల కాని లేదా కాంగ్రెస్ పొగడ్తవల్ల కాని హిందూముస్లిం ఐక్యత సాధింపబడదు అనే విషయాన్ని మనం కచ్చితంగా చెప్పవచ్చు. ఆ ఐక్యతను ఇంకా లోతుగా మన మనస్సులలో, మన హృదయాంతరాళాల్లో మనం కోరుకోవాలి. దానికి కారణం, ఎక్కడైతే అనైక్యతకు కారణాలుంటాయో, అక్కడే వాటికి ఔషధాన్ని వెతకాలి.

ప్రేమ, ప్రేమనే తిరిగి తప్పక ఇస్తుందనీ, బలం బలంతోనే సమాధానపడుతుందనీ మనం తెలుసుకోవాలి. ఈ సమస్యను పరిష్కరించే ప్రయత్నంలో, అపార్థమే మన విభేధాలకు అతి ముఖ్యకారణమని మనం గుర్తుంచుకుంటే మంచిది.

చక్కటి సదవగాహన, సానుభూతుల ద్వారా మనము అపార్థాలకుగల కారణాలను తొలగించేందుకు ప్రయత్నించాలి. మన ముసల్మాన్ సోదరునికి మనం, ఒక దేశభక్తుని యొక్క తడబాటులేని ప్రేమను అందించగలగాలి. అతనిలోనూ నారాయణుడు నివసిస్తున్నాడని మనమెప్పుడూ గుర్తుంచుకోవాలి. మన మాతృభూమి అతనికీ తన ఎదలో ఒక శాశ్వత స్థానాన్నిచ్చిందని మనం గుర్తుంచుకోవాలి; స్వార్థపూరిత బలహీనత మరియు పిరికితనంతో అతనిని సమీపించటం మనం మానేయాలి. ఈ సమస్యను ఎదుర్కోవటానికి ఇదొక్కటే మార్గం అని మా నమ్మకం. మా అనుభవపూర్వకమైన సత్యము.

ఒక రాజకీయ ప్రశ్నగా, హిందూ ముస్లిం సమస్యపట్ల మాకెప్పుడూ ఉత్సుకత లేదు కాని ఒక జాతీయసమస్యగా అది అత్యంత ముఖ్యమైన సమస్య.

(*SABCL* Vol. 2, p. 24)

*

మత్తైక ఆలోచన మరియు అనుభూతిలో, నీచత్వాన్ని సంకుచిత త్వాన్ని, లోతులేని అల్పబుద్ధిని వదిలివేయి. ఆకాశంకంటె విశాలంగా, కాంచనగంగ శిఖరంకన్నా ఉన్నతమైన, మహాసాగరం కన్న గంభీరమైన భావాలను కలిగి ఉండు.

(*SABCL* Vol. 17, p. 90)


అనువాదం: కాకుమాని తారానాథ్

సమాచార పత్రము

పాండిచ్చేరి బీచ్చాఫీసులో 20-26 మే, 2002 తేదీలలో 50 మంది ఉపాధ్యాయులకు ఒక విద్యాశిబిరము ఏర్పరచబడినది. సర్వసమగ్రమైన విద్య, భాషల బోధన, ఇంద్రియ జ్ఞానము ద్వారా ప్రకృతితో సంయోగము, Project method of teaching etc. ఇందలి అంశములు. ప్రాతఃకాలమున సంస్కృతశ్లోకముల వర్లింపు, యోగాసనములు, చిత్రలేఖనము విద్యాపరికరములు ఈ శిబిరములోని మరపురాని ఘట్టములు. 'హల్ద్వాని' కేంద్రమువారు "శ్రీఅరవిందుల భవిష్యదృష్టి" అనే ఒక హిందీ లఘుదీపికను ఖైదీలకు పంచిపెట్టిరి. శ్రీ నానక్‌చంద్ వారికి శ్రీఅరవిందుల ఆలీపూరు కారాగారానుభూతులను గురించి వివరించిరి.

ఆంగ్లమూలముల సూచన

SABCL	Sri Aurobindo Birth Centenary Library
CWSA	Complete Works of Sri Aurobindo
CWM	Complete Works of The Mother
Bull	Bulletin of the Sri Aurobindo International Centre of Education
MI	Mother India
AIM	All India Magazine



యోగములో సంక్షోభము

అఖిల

అఖిల భారత పత్రిక

సెప్టెంబరు 2002

విషయసూచిక

5/9/02

విభాగము I: నిస్పృహకు కారణాలు, పరిష్కారము

విభాగము II: సరైన వైఖరి

విభాగము III: నిస్పృహ – యోగము

నిస్పృహకు[1] కారణము

శ్రీమాత ప్రవచనములు

యోగసాధనా క్రమంలో హెచ్చుతగ్గులు మామూలే. దివ్యశక్తుల ప్రోద్బలంతో చేతన పెరుగుతూంటే సంతోషంగా ఉంటుంది. నిలిచిపోయినప్పుడు నిరుత్సాహంగా ఉంటుంది. అటువంటప్పుడు ఓరిమితో నీ ప్రయత్నాన్ని ఏమాత్రం సడలించకుండా సాధన కొనసాగిస్తూనే ఉండాలి. అంతేగాని దుష్టశక్తులకు లొంగిపోకూడదు. ఒకవేళ అలా చేసావో ఇక నిన్నెవరూ రక్షించలేరు. ఎందుకంటే దైవానుగ్రహము నీ మీదకు ఎంత ప్రసరించినప్పటికి నువ్వు దానిని గ్రహించలేవు. కాబట్టి ఏం జరిగినప్పటికి నువ్వు నిరాశ చెందకూడదు. — సంపాదకుడు

మానసికంగా క్రుంగిపోకూడదు

నువ్వు నిస్పృహకు లోనైతే సర్వజీవశక్తికి దూరమై నిర్వీర్యమైపోవడమన్న మాట. నీకు శక్తి వచ్చే మార్గములన్నీ మూసుకుపోతాయి. పైనుంచి, క్రిందినుంచి ఎటువైపునుంచీ నీలోకి దివ్యశక్తులు ప్రవేశించలేవు. నువ్విక జడత్వంలోకి, తమస్సులోకి జారిపోతావు. అందుకే నువ్వు నిస్పృహను సంపూర్ణంగా తిరస్కరించాలి. పూర్తిగా వదిలేయాలి. దానికి లోనుకాకూడదు. ఎట్టి పరిస్థితులలోను లొంగిపోకూడదు.

పైగా నిస్పృహ అహంయొక్క విజృంభణకు గుర్తు. నిస్పృహ నీ దగ్గరకు చేరినట్లు అనిపిస్తే నీకు నువ్వే "నాకు అహంకార

---

[1] ఆంగ్లమూలంలో 'Depression' అని ఉంది. సరైన తెలుగు పదము దొరకనందువలన నిరాశ, నైరాశ్యము, నిస్పృహ, వేదన, మనోవేదన, (మానసిక) సంక్షోభము, క్రుంగుట మొదలగు మాటలను ఈ సంచికలో ఉపయోగించాము. ఈ మాటలన్నీ 'Depression' నే సూచిస్తాయని పాఠకులు గమనించ ప్రార్థన.

మనే జబ్బు పట్టుకుంది. ఈ రోగాన్ని నిశ్చయంగా నేను నయం చేసుకుంటాను" అని ఒక గట్టి హెచ్చరిక చేసుకో.

(*CWM* Vol. 4, p. 10)

*

ఏ క్షణంలో నీలో ఆనందం పోయి విచారం చోటు చేసుకుంటుందో ఆ క్షణంలో నీవు "నేను సిన్సియర్‌గా లేను అని వ్రాసుకోవచ్చు". ఎందుకంటే "నేను ఆనందంగా లేను", "నేను సిన్సియర్‌గా లేను" ***అన్న రెండు వాక్యాలు ఒకదానితో ఒకటి జతగా ఉంటాయి. అవి రెండు కవలలు.***

ఇప్పుడేం చేయాలి? ఎక్కడుంది పొరపాటు? అని ప్రారంభిస్తే అసలు విషయాన్ని పట్టుకోడం సులభసాధ్యమౌతుంది.

(*CWM* Vol. 6, p. 216)

2

చిన్న చిన్న కోరికలే నీ నిస్పృహకు కారణం

సర్వసాధారణంగా మామూలు ప్రాణికప్రేరణలకు లోబడి ఉన్నంత వరకూ అతిచిన్న విషయం కూడా నిస్పృహకు కారణమౌతుంది. ఒకచిన్న సంఘటన, చిన్న విషయం చాలు – నేనున్నానంటూ వచ్చేస్తుంది పిలిస్తే పలికినట్టు, నిస్పృహ. నువ్వు బలహీనుడవైతే 'నిస్పృహ', బలవంతుడివైతే 'తిరుగుబాటు' అనమాట. తృప్తి చెందని కోరికలు, మనసుకు ఎదురైన ఆటంకాలు, ఇతరులతో ఘర్షణలు ఇవన్నీ అతిసులువుగా, అతిత్వరగా అశాంతికి, నిస్పృహకు దారితీస్తాయి. లేదా తిరుగుబాటును ప్రోత్సహిస్తాయి. ఎందుకంటె నేటి జీవితంలో జరుగుతున్నది ఇదే.

(*CWM* Vol. 8, p. 192)

*

అందుకనే నిన్ను జాగ్రత్తగా ఉండమని చెప్పేది. నిస్పృహకు తలుపులు తెరవకు. నిరుత్సాహానికి, నిస్పృహకు, తిరుగుబాటుకు తలుపులు తెరవకు. ఎందుకంటె అవి నిన్ను చైతన్యంనుంచి చాలా దూరంగా, చాలా దూరంగా తీసుకుపోతాయి. నీవు ఒక విచార

కరమైన అసందిగ్ధతలో మునిగిపోతావు. అక్కడ ఆ అంధకారంలో ఆనందానికి ఏమాత్రం చోటు లేదు.

నీవు అసంతృప్తికి, తిరుగుబాటుకి, నిస్పృహకు చోటిచ్చావు. నవ్వడంకూడా మర్చిపోయావు. దానితో పాటు నమ్మకం, విశ్వాసం కోల్పోయావు. ఈ పరిస్థితిలో అన్ని దైవశక్తులు నీపై కేంద్రీకరించినా ఫలితం ఉండదు. ఎందుకంటే నీవు వాటిని అందుకోలేవు. నీ స్థితి వాటిని అందుకోనివ్వదు.

(*CWM* Vol. 16, pp. 67-68)

3

మానసిక దౌర్బల్యం పనికి రాదు

నిస్పృహకు లోనుకాకుండా ఉండటం చాలా ముఖ్యం. ఎందుకంటె 'నిస్పృహ' మానసిక దౌర్యల్యం. ఎక్కడో మనలో దాగిన చెడుసంకల్పానికి రూపమే నిస్పృహ. చెడుసంకల్పం అంటే సహాయాన్ని తిరస్కరించడం, ఆ దౌర్బల్యంతోనే తృప్తిపడటం. ఒక నిరుత్సాహమైన, నిరాశామయమైన స్థితికి జారుకోవడం. చెడు భావనలు ఆ స్థితిలో తప్పనిసరిగా ఉన్నాయని అర్థం. ఎందుకంటె నీలోని ఒక భాగం ఆ నిస్పృహను తిరస్కరించినా, అది మంచిది కాదని నచ్చచెప్పినా, బ్రతిమిలాడినా – దాని నోరు మూయించేది ఆ చెడుఆలోచనే కదా.

ఆ తరువాత మళ్లీ మనకి నచ్చచెప్పుకుంటాం. ఇదే ఆఖరుసారని, మరోసారి జరగనివ్వమని అనుకోని ప్రస్తుతం నాకు ఇది బావుంది, నాకు కావాలి, నా కారణాలు నాకు ఉన్నాయి అని సమర్థించుకుంటాం, మళ్ళీ అదే ఊబిలో చిక్కుకుంటాం. అది ఒక తిరుగుబాటు. మనలోని బలహీనత దాన్ని ప్రోత్సహిస్తుంది. మనల్ని బానిసను చేస్తుంది.

(*CWM* Vol. 7, p. 10)

*

మానసికమైన రోగాలన్నీ ఆలోచనలు, ఫీలింగ్స్‌కు సంబంధించినవే. అవే నిస్పృహ, తిరస్కృతి, విచారం మొ॥ రూపాల్లో వ్యక్తమౌతాయి. శరీరరుగ్మతలు శరీరంలో కనపడతాయి.

మానసికపరిస్థితి వలన కలిగే రోగాలు. రోగియొక్క సంపూర్ణ సహకారంతో మాత్రమే నయమౌతాయి. అతడు తన ఇచ్ఛతో, అంగీకారంతో నయం కావాలన్న అభిలాషతో ఉండాలి. ఈ నిస్పృహ అన్న రుగ్మతను నిర్మూలించాలంటే తిరుగులేని నిశ్చయం కావాలి. నిజానికి ఈ విషయాల్లో అన్నిటికంటే బాగుపడాలన్న సంకల్పబలం ముఖ్యం.

(*CWM* Vol. 16, p. 72)

అనువాదం: డి. సత్యవాణి

శ్రీమాత హితవు

చెట్లు, ఆకాశం, సముద్రం ఇవన్నీ మూగవస్తువులు కావు. వాటన్నింటిలోనూ భగవానుడు ప్రత్యక్షంగా ఉన్నాడు. అవి ఆ విషయాన్ని మీకు చెప్పేందుకని ఎంతో తహతహలాడుతుంటాయి కూడాను. కాబట్టి నువ్వు చిన్నపిల్లవాడివలె మారాము చేయకుండా ఈ నిస్పృహ (depression) ని వదిలించుకోని నీ హృదయంలో ఉదయిస్తున్న ఆ సూర్యుని గూర్చి ఆలోచించు.

(*CWM* Vol. 16, p. 119)

*

నేనెల్లప్పుడూ ఉన్నతంగా చూస్తాను. అక్కడ సౌందర్యం, శాంతి, ప్రకాశమూ అన్నీ ఉన్నాయి. దివినుంచి భువికి రావడానికి సిద్ధంగా ఉన్నాయి. అందువల్ల అవి భూమిపై ఆవిష్కరించాలని ఎల్లప్పుడు ఆశించు. పైకి మాత్రమే చూడు.

నీ చూపు ప్రపంచంలోని దుష్టవస్తువులపై కిందికి ప్రసరింపజేయకు. నీవు దుఃఖమనుభవిస్తున్నప్పు డెల్లప్పుడూ ఉన్నతంగా నాతోపాటు చూడు!

(*CWM* Vol. 13, p. 70)

అనువాదం: ఎస్. గంగప్ప

ప్రాణికము అంటే ఏమిటి?

శ్రీమాత ప్రవచనములు

మనకు శరీరమున్నట్లుగానే ప్రాణికము లేక ప్రాణకోశ మొకటున్నది. దాని శక్తి అంతా యింతా కాదు. మనమే పని చెయ్యాలనుకున్నా – దాని సహాయంతో చెయ్యవచ్చు. సాధనకు, రూపాంతరీకరణానికి కూడా తగినంత సహకారాన్ని అది అందివ్వగలదు. అందుకని మన మెప్పుడూ ఏ పనీ చెయ్యకుండా నైష్కర్మ్య సిద్ధాంతాన్నవలంబించ కూడదు!

– సంపాదకుడు

ప్రాణికము క్రియాశీలి

మనయందు ఉన్న ప్రాణికసత్తాయే అన్ని ఆవేశాలకు, కోరికలకు, ఉత్సాహమునకు, హింసాప్రవృత్తులకు, క్రియాశక్తికి తీవ్రమైన నిస్పృహలకు, ఉద్వేగములకు, తిరుగుబాటులకు నిలయమై ఉన్నది. ఈ ప్రాణశక్తి సహకారముతో ఎంతటి కార్యసిద్ధి అయినా సాధ్యమవుతుంది. ఎటొచ్చీ ఈ సహకారము దొరకటమే అపురూపము.

తృప్తి పరచని యెడల దాని శక్తి ఉడిగిపోతుంది

ఈ ప్రాణికసత్త కార్యదక్షత అంతాయింతా కాదు. కాని ఈ సత్తా తన సంతృప్తినే ఎల్లప్పుడు అభిలషిస్తూ ఉంటుంది. ఈ తృప్తి పూర్తిగాగాని, స్వల్పమైనాగానీ లభించనపుడు ప్రాణికసత్తా వైరాగ్యానికి లోనై విసుగు చెందుతూ క్రుంగిపోయి సమ్మె చేయటం ప్రారంభిస్తూ ఉంటుంది. దాని శక్తి ఉడిగిపోయినప్పుడు ఇక దానికి మనుమలన్నా, సంఘటనలన్నా గిట్టదు. అప్పుడు నిరుత్సాహము, తిరుగుబాటు, నిస్పృహ, అసంతృప్తి మొదలైన వికారములే చోటు జేసుకుంటాయి. అందుచేతనే ఇటువంటి సందర్భములలో ప్రశాంతతను పాటిస్తూ ఏ పనిని తలపెట్టకూడదు. ఇటువంటి సమయములలోనే అనాలోచితమైన కార్యములు జేయుట సంభవిస్తూ ఉంటుంది. ఫలితంగా

కొన్ని నెలల తరబడి క్రమముగా పరిశ్రమించి సాధించిన పురోగతంతా కొన్ని క్షణములలో నాశనమై పోతుంది.

*

ప్రాణికసత్తా చక్కటి ఉత్సాహానికి, శక్తికి నిలయము. ఈ ప్రాణమయ సత్తాయందే భావనలు దృఢసంకల్పములుగా పరివర్తనమై చైతన్యమును సంతరించుకొని కార్యరూపము దాల్చును. అయితే ఈ ప్రాణికము హింసాప్రవృత్తులకు, భావోద్రిక్తలకు, తీవ్రప్రతిరోధకములకు కూడా నిలయమే!

(*CWM* Vol. 12, pp. 6, 55)

అనువాదం: టి. మాధవరావు

మానసిక నిస్పృహకు చికిత్స – I

శ్రీమాత ప్రవచనములు

నీలోని చైత్యకేంద్రము నీ నిజస్వరూపము. నువ్వు దాని స్పర్శను కనుక పొందావంటే ఇక నీకెట్టి సమస్య ఉండదు. మొదట్లో దాని ప్రభావము ఎక్కువ కాలముండక పోవచ్చు. ఆ తరవాత అది మరికొంతకాలము నిలిచి నిన్ను సంతోషపెట్టవచ్చు. కాని అది నీలో పూర్తిగా వికసించినప్పుడు నిన్ను ఆనందడోలికలలో ముంచివేస్తుంది. – సంపాదకుడు

ప్రశ్న: మానసికంగా నిస్పృహను (depression) పోగొట్టేదెలా?

నీ చేతనాస్థాయిని పెంచుకోవాలి

ఓ అదా! దానికొక సులభమైన మార్గముంది. ప్రాణమయకోశంలోనే ఉద్రేకాలు సంచరిస్తూ ఉంటాయి. కనుక చైతన్యాన్ని ప్రాణమయకోశంలో నిలపటమే పొరపాటు. ప్రాణికంలోంచి బైటపడి ఆంతరిక చైతన్యంలోకి ప్రవేశించటమే దీనికి మందు. ఉన్నత మనస్సుకు మాత్రమే – అనగా స్వయంప్రకాశమై ఉదాత్తమైన భావాలుగల ఉన్నతమనస్సుకే భౌతికమనస్సు సంక్షోభాన్ని నివా

రించగల సామర్థ్యముంది. అసలు మనిషి ఉన్నతభావ ప్రపంచాన్ని చేరగానే అతని నిస్పృహ మాయమైపోతుంది. ఒకవేళ చైత్యము (చైత్యాత్మ psychic) లో సురక్షితంగా ఉన్నట్లైతే ఇక నిస్పృహాలో పడే ప్రశ్నే లేదు.

నిస్పృహకు కారణాన్ని కనుక్కోవాలి

మానసిక నిస్పృహ రెండుకారణాల వలన సంభవిస్తుంది. ఒకటి ప్రాణిక తృప్తి లోపించుట, రెండు శరీరంలో పెచ్చు మీరిన నరాల బలహీనత. శారీరక అలసటవలన నిస్పృహ సంభవిస్తే, దానిని సులభంగానే పోగొట్టుకోవచ్చు. విశ్రాంతి తీసుకుంటే పరిస్థితి చక్కబడుతుంది. పక్కమీద వాలి పరిస్థితి బాగుపడేవరకు నిద్రపోవటం మంచిది. ఒకవేళ నిద్ర రాకపోతే మంచం మీదనే పడుకొని శరీరానికి అలసట తీరుస్తూ కలలు కన్నా ఫరవాలేదు. ప్రాణిక అసంతృప్తివలన కూడా మానసిక సంక్షోభం సంభవించవచ్చని చెప్పుకున్నాం కదా! ఇక దాని విషయం. దానిని హేతువుతో బుజ్జగించి నచ్చచెప్పాలి. నిస్పృహకు కారణమేమిటో కనుక్కొని దానిని బయటకు గెంటేయ్యాలి. ముఖాముఖి నిలువరించి మనిషి దానికి తన ఆంతరంగిక ఆకాంక్షలకు సంబంధం ఉందా లేక అది కేవలం సాధారణ కోరికేనా అనేది నిగ్గు తేల్చుకోవాలి. సామాన్యంగా మనిషికి తాను మానసిక నిస్పృహకు లోనవుటకు, తన ఆంతరిక ఆకాంక్షలకు ఎలాంటి సంబంధము లేదని అర్థమౌతుంది. అప్పుడతడు తన నిస్పృహను అధిగమించి సాధారణ కార్యక్రమాలను నిర్వర్తించుకొనగలడు. ఒకవేళ దీనివలన పరిస్థితి సరికాకపోతే మనిషి తన చైతన్యపు లోతులకు పోయి తనలోని ఆనందభోక్తయైన చైత్యపురుషుని (ఈశ్వరాంశము) స్పృశించాలి. ఎప్పుడైతే మనిషి నిస్పృహాయొక్క చలనాన్ని ఆనందభోక్తయైన చైత్యపురుషునితో అనుసంధానం చేస్తాడో ఇక మానసికంగా నిస్పృహకు లోనవటం ఉండదు. అది గాలిలో మాయమైపోతుంది.

ఇక ప్రాణికసీమలో యుద్ధం సంగతి — కొందరు యోధులకు ఇది చాలా ఇష్టం. కాని నిజం చెప్పాలంటే అది చాలా కష్టమైన పని.

ప్రశ్న: ముందుకు వచ్చిన ఆనందభోక్త (చైత్యము psychic) తిరిగి వెనుకకు పోగలదా?

చైత్యపురుషానుభూతి

పోగలదు. చైత్యపురుమనితో కలియుటవలన సాధారణంగా కలిగే అనుభవాలు మొదట బాగా సంతోషంగా ఉన్నా తరువాత క్రమేపి అవి తగ్గుముఖం పట్టి చివరకు నశించిపోతై. అయితే వాటిని గురించి కలవరపడ నవసరం లేదు. ఎందుకంటే అది మామూలే. అయితే మరొకసారి — అంటే రెండోసారి — ఆ కలయిక మరీ సులభంగానే ప్రాప్తిస్తుంది. ఆ తరువాత అంత ఎక్కువకాలం పట్టకపోవచ్చు — *ఎప్పుడా సాధకుడు తన దృష్టి నటు సారిస్తాడో అప్పుడు వెంటనే అతనికి ఆ మధురమిలనం లభిస్తుంది.* అయితే సాధకునికి మొదట్లో దాన్ని శాశ్వతం చేసుకోగల శక్తి ఉండకపోవచ్చు. అయినప్పటికి ఐచ్ఛికంగా ఎప్పుడు కావాలంటే అప్పుడు దానిని పొందగలడు. ఇక పరిస్థితి చక్కబడిపోతుంది. ఎప్పుడైనా ఇబ్బంది కలిగినా లేక ఏదైనా సమస్యను పరిష్కరించాలనుకున్నా, ఏదైనా అవరోధాన్ని తొలగించాలన్నా, లేక సూటిగా సంగమం ద్వారా ఆనందం అనుభవించాలనుకున్నా (ఎందుకనంటే ఆ అనుభవం చాలా స్పష్టమైన ఆనందమిస్తుంది) తక్షణం సాధకుడు నిజంగా మహదానందం అనుభవిస్తాడు. అప్పుడుగానీ లేక ఎప్పుడు కావాలంటే అప్పుడు, సాధకుడు చైత్యపురుమని చేరాలని ఆకాంక్షిచినట్లైతే వెంటనే అది జరుగుతుంది. అతడు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ తీరిపోతాయి.

చైతన్యపు లోతుల నందుకొనుట

నేను ఇంతకు ముందు చెప్పినట్లుగా చివరకు ఆ కలయిక శాశ్వతంగా నిలిచిపోతుంది. అది నీ చైతన్యాంతరాళంలోనే ఉండి నీవు తలపెట్టిన కార్యాలలో నీకు సహకరిస్తూ నిన్ను

వదలకుండా ఉండిపోతుంది. అప్పుడు అవాంఛనీయాలనేవి మిగలవు. అసంతృప్తి, పెనుగులాట, అలసట, నిస్పృహ అనేవన్నీ మాయమైపోతాయి. మనిషికి కనుక మేము చెప్పినట్లుగా తన సాధారణ చైతన్యం నుండి వెనుకకు మరలటం అలవాటైనప్పుడు అతడు తనను తానే ఒక ప్రేక్షకునివలె తన ఆనందమయ చైత్యన్యం (psychic consciousness) అనే తెర మీద చూడగలడు – అన్ని పరిస్థితులు, అన్ని సంఘటనలు, అన్నిభావాలు, అన్ని విద్యలు, అన్నీ చూడగలడు – అప్పుడతడు అంతవరకు సాక్షాత్కారంగాని ఆ పరతత్త్వాన్ని (శుద్ధచైతన్య స్వరూప ప్రత్యగాత్మను, భగవదంశను) సందర్శిస్తాడు. ఆ ఆత్మతత్త్వమే తరువాత అతనికి సమస్త విషయాలకు, తలపెట్టిన సమస్త కార్యములకు మార్గదర్శకమై వ్యవహరిస్తుంది. అయితే దాన్ని సాధించటం చాలా కాలం పడుతుంది.

(C*WM* Vol. 6, pp. 32-34)

అనువాదం: డా॥ కోట వేంకటేశ్వరరావు

నిస్పృహకు చికిత్స – II

శ్రీమాత ప్రవచనములు

కష్టాలొచ్చినప్పుడు దిక్కుతోచక నెత్తి మొత్తుకుండేవాళ్లు కొందరైతే ఆత్మవిశ్వాసంతో నిబ్బరంగా ఉండి ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ ఉండేవాళ్లు మరికొందరు! నీ ప్రయాణంలో ఎత్తుపల్లాలు వస్తుంటాయి. పల్లాలు వచ్చినప్పుడు ఎప్పటికీ అక్కడే ఉండిపోవని తెలుసును కదా. మరి విచారమెందుకు? ఏమాత్రం చలించకుండా సంతోషంగా ఉన్నట్లయితే ఎన్ని కష్టాలొచ్చినా అవి నిన్నేం చెయ్యలేవు. నీ ప్రయాణాన్ని ఆపలేవు. రూపాంతర యోగంలో ఇది ఒక చిన్న ఘట్టమే అనీ, నువ్వు గమ్యం చేరుకోటం తథ్యం అనీ తెలుసుకో.

– సంపాదకుడు

చిరునవ్వుతో శత్రువు నోడించండి

మీరు చేసిన తప్పులను తలచుకొంటూ, విలపిస్తూ, నెత్తిమీద గుడ్డ కప్పుకొని కుయ్యో మొర్రో అనుకోనవసరం లేదు. మీ కష్టాల్నీ, అడ్డంకుల్నీ చిరునవ్వుతో ఎదుర్కోనండి బాబూ. హాయిగా మీ శోకాన్ని నవ్వుతూ తరిమికొట్టండి. వందలాది తప్పులు చేసినా పరవాలేదు. నవ్వుతూ మీరు చేసిన తప్పులు తెలిసికొంటూరు. అట్లాగే, భవితలో ఆ తప్పులు పునరావృతం కాకుండా నవ్వుతో తీర్మానించుకుంటారు. విచార భరితమైన భావాన్ని విరజిమ్మునప్పుడు మిమ్ముల నానందపఱచక, కొన్ని విరుద్ధశక్తులు మీలో నిస్పృహను సృష్టిస్తాయి. నిజానికి నమ్రత ఒక ఎత్తు. నిస్పృహ మరో ఎత్తు. మొదటిది దైవ కృత్యము. రెండవది తామసీశక్తుల వికృత వ్యక్తీకరణము. అందు వలన మీ కష్టాలను ఆనందంగా ఎదుర్కోనండి. మీలో పరివర్తనకు దారిచూపేందుకై, అడ్డంకులను ఎనలేని సంతోషంతో వ్యతిరేకించండి. శత్రువును తరిమికొట్టే మార్గం, అతడి ముఖంలోకి చూసి దరహాసం చిందించడమే! కొన్నాళ్లపాటు మీరు పెనగులాడి పోట్లాడవచ్చు. అతడు ఇంకా తరగని బలం చూపించవచ్చు. కాని అతడిపై ఒక్కసారి దరహాసం చిందించండి. అంతే, అతడు కాలికి బుద్ధి చెప్తాడు. ఆత్మవిశ్వాసంతో చిందించిన దరహాసమూ, దైవంలో విశ్వాసమూ శత్రుసేనలను ఛిన్నాభిన్నం చేసి, మిమ్ములను దిగ్విజయపథంలో పురోగమింపజేస్తుంది.

(*CWM* Vol. 3, pp. 138-139)

*

ప్రశ్న: శత్రువును చూసి నవ్వటం అతడ్ని నిర్వీర్యుణ్ణి చేయడమేనని మీరన్నారు కదా! నవ్వటం అంటే ఏమిటి? శత్రువును చూసి నవ్వటమా!

నిర్భయమైన చైత్యపురుష విలాసము

నేనొక అనుభూతిని ఇక్కడ మీ ముందుంచాను. దానిని సామాన్య పరిభాషలో వ్యక్తపరచాను. ఎవరైనా నీకు హాని చేయాలని వస్తే, అటువంటప్పుడు అతడిపై

దరహాసం చిందిస్తే, అతడు చిత్తుచిత్తై పోతాడు. ఇంకేమీ చేయలేడు. కాని ఆ దరహాసం నిష్కపటమైంది కావాలి, స్వచ్ఛమైంది కావాలి. కేవలం పళ్లికిలించటం దరహాసం కాదు. నేనిక్కడ 'నవ్వును' సంపూర్ణ విస్తృతార్థంలో వాడేను. అంటే, ఎవరైనా సంయమనం పాటిస్తే, సామాన్య విషయాల కతీతంగా ఉంటే, బాహ్యంగా కనిపించే మరింత ఉన్నతోన్నత వివేకంలో, సామాన్య మానవ వివేకానికి అతిభయంకరంగా, నాటకీయంగా కనిపించినా, చిన్నారుల చిలిపితనంలో మిమ్ముల‌ను నవ్వింప జేస్తుంది. కావున అన్ని విషయాల్లో నవ్వగలిగే వివేకం ఎవరైనా కలిగివుంటే, (ఏమంటే, అన్నింటి మూలం అవగతం చేసికొన్నప్పుడు, అన్నింటా పనిచేసే శక్తులను పరికించినప్పుడు) అదే వివేకంతో మెలగగలిగితే, అప్పుడు ఏం జరిగినా నవ్వగలిగితే, తక్షణం పరివర్తన వస్తుంది. అయితే అది పైపై మర్యాద నవ్వు కాకూడదు. సామాజిక దరహాసం కాదు. అప్పుడు నవ్వే నవ్వు చైత్యపురుషుడు నవ్వే నవ్వన్న మాట.

(*CWM* Vol. 5, pp. 370-371)

*

ఏం జరిగినా 'నాకేమి' అని చిదానందంగా ఉండాలి

ఓరిమి, అణకువ, వినయం ఓ రకమైన ఆంతరంగికమైన ఉత్తమ దరహాసం మిమ్ములను నిస్పృహ జెందనీయక, ఖిన్నులను జేయనీయక సహకరిస్తూ, అన్ని కష్టాలనూ దరహాసంతో యెదుర్కొనేట్లు చూస్తుంది. దీన్నే ఆంగ్ల పరిభాషలో 'చీర్‌ఫుల్‌నెస్' (చిదానందం) అంటారు. ఆ చిదానందాన్ని మీలో పదిలపరచుకుంటే, మీరు కష్టాలను మరింతగా ఎదిరించగలరు. ఎట్టి సమస్యలనైనా మరింతగా తట్టుకోగలరు! ఈ వెలుగులో, మిమ్ములను పురోగమించకుండా అడ్డుపడే ఆసురీభావాలు పటాపంచలై పోతాయి.

(*CWM* Vol. 8, p. 23)

*

మనిషికి ప్రతిదీ చాలా సీరియస్‌గా తీసుకుండే జబ్బున్నదితే. దాని బదులు అన్ని పరిస్థితుల్లోనూ దరహాసం చిందిస్తే ఎంత బాగుంటుంది! మీమీ బాధల్లోను, భ్రమల్లోను, దురాశల్లోను, దుఃఖాల్లోను, స్పర్థల్లోను తిరుగుబాట్లలోను దరహాసం చిందిం చండి బాబూ! తనను తాను జయించటానికీ 'నవ్వు' ఎంత శక్తి వంతమైన ఆయుధమో!

*

అన్ని పరిస్థితుల్లోనూ నవ్వటం, ఎల్లప్పుడూ నవ్వుతూ ఉండటం, మీ ఖేదమోదాల్లో సైతం నవ్వుతూ ఉండటం, మీ ఆశనిరాశల్లో నవ్వుతూ ఉండటం – నిజంగా మీ ఆత్మవిశ్వాసానికి జోహార్లు చెప్పాల్సిందే.

*

మేఘ సమూహాన్ని చెల్లాచెదరుచేసే సూర్యునిలా, నవ్వు మీ కష్టాలను పటాపంచలు చేస్తుంది.

*

ఎప్పుడూ సణుక్కోకండి. మీరు సణుక్కొంటుంటే అన్నిరకాల శక్తులూ మీలో ప్రవేశిస్తాయి. అవి మిమ్మల్ని చిత్తు చేస్తాయి. నవ్వుతూ ఉండండి. నేనెప్పుడూ జోక్ చేస్తున్నట్లు చిరునవ్వు చిందిస్తూన్నట్లుంటాను. ఎందుకని? ఇది కేవలం జోక్ వేయటం కాదు – 'చిత్' నుండి ఉద్భవించిన విశ్వాసం. దైవం ముందు ఏదీ నిలువబడదనీ తుదకంతా మంచే జరుగుతుందనే విశ్వాసాన్ని నవ్వు ప్రతిబింబిస్తుంది.

(*CWM* Vol. 14, pp. 189-190, 237-238)

అనువాదం: పి. మోహన్

నిస్పృహకు చికిత్స – III

శ్రీమాత ప్రవచనములు

'విశ్వాసం కొండల్ని కూడ కదిలించ గలదు', అనే సామెత మీరు వినే ఉంటారు. నీ సాధన దైవమే చేసిపెడతాడు అని నమ్ము. ఆయన వెయ్యికళ్లతో నిన్ను కాపలా కాస్తూనే ఉంటాడు. తన అనంతమైన శక్తితో నిన్ను పరివేష్టించి కష్టాలనుంచి గట్టెక్కిస్తున్నప్పుడు ఇక నీకు విచారమెందుకు? ఎట్టి సమస్య వచ్చినా 'అది నన్నేం చేస్తుందిలే' అనే గట్టి నమ్మకంతో ఉండు. అప్పుడాయనే నిన్నంటిపెట్టుకొని ఉండి నీ భారాన్ని పూర్తిగా వహిస్తాడు. ఇక నీకెట్టి బాధ్యతా లేదు. భయం నాస్తి!

– సంపాదకుడు

విశ్వాసం ఒక అద్భుతమనీ, అద్భుతాలని సృష్టిస్తుందనీ, చాలా ముఖ్యమైనదనీ మనుషులకి తెలియదు. *నువ్వు ప్రతి క్షణం భగవంతుని దిశగా పురోగమించాలనుకుంటే, సాక్షాత్తు ఆయనే నీ దగ్గరకు వచ్చి నిన్ను పై సోపానాలు ఎక్కిస్తాడు. నీకు ఎప్పుడూ ఎంతో చేరువగా, అత్యంత సన్నిహితంగా ఉంటాడు.*
(*CWM* Vol. 13, p. 78)

*

నిరంతరం నీ మీద భగవదనుగ్రహం ప్రసారం

అంతరంగంలో భగవంతుని కృపపై నమ్మకముంచి, అది తనని ఎల్లప్పుడూ కాపాడుతోందనీ, ఏం జరిగినప్పటికీ, ఆయన కృప ఎప్పుడూ తనకి ఉన్నదనీ అనుకునే వ్యక్తి ఏది జరిగినప్పటికి, భగవంతుని దయ తనపై కలదన్న నమ్మకంతో జీవితంలోని అన్ని కష్టాలనీ, ప్రమాదాలనీ ఎదుర్కోగలడు. ఈ విశ్వాసమే తనకి అత్యంత దృఢమైన, అనంతమైన శక్తినిస్తుంది. ఇది బాహ్యస్థితిగతులమీదకానీ, మరే ఇతర పరిస్థితులమీదా ఆధారపడదు. కేవలం భగవంతుని దివ్యకరుణ

మీదే ఆధారపడటంవల్ల సంపూర్ణ సత్యం పైనే ఆధారపడి అచం చలంగా ఉంటుంది.
(*CWM* Vol. 5, p. 298)

*

సుగమమైన మార్గం

మీ మార్గం అత్యంత సుగమం కావాలంటే, వాదప్రతివాదాలకి తావులేని నిర్మలమైన విశ్వాసం ఉండాలి. *పైకి ఎలా అనిపించినా, జరిగే ప్రతివిషయం మీ మేలుకోసమేనని, అతిత్వరితంగా మిమ్మల్ని కష్టాలలోంచి గమ్యంవైపు నడిపేందుకేననీ పరిపూర్ణ విశ్వాసం ఉండాలి.* భగవంతుని కృపపై నమ్మకం ఉంచాలనే దృక్పథముంటే చాలు, ఎన్నో కష్టాలూ, నిత్యజీవితంలో కూడా ఎన్నో చింతలూ తొలగిపోతాయి.
(*CWM* Vol. 6, p. 445)

*

భగవంతుని కృపను నమ్ముట

నమ్మకముందంటూనే భగవంతునిలో పూర్తి భరోసా లేకపోతే, ఒక వైపునుంచి నమ్మకముందనుకుంటూ కూడా ఆ భగవంతుని దివ్యశక్తి దివ్యకరుణలలో విశ్వాసం కోల్పోతూ ఆయనకి మనపైగల నమ్మకాన్నికూడా పోగొట్టుకుంటాం. కనుక నమ్మకంతోపాటు ఆయన దివ్యకృపపై సంపూర్ణవిశ్వాసం అవసరం. లేనియెడల కష్టాలు తప్పవు.
(*CWM* Vol. 8, pp. 38-39)

*

నమ్మకమంటే భగవంతుని కృపపై నమ్మకం, దివ్యప్రణాళిక యొక్క అంతిమ విజయంపై నమ్మకం.

నమ్మకమంటే ఎన్ని కష్టాలున్నా, ఎలాగో ముందుకి వెళుతున్నామని ఉండే ధైర్యం. నిరాశ అంటే ఇక ముందుకు వెళ్లడమసంభవమనిపించే నిస్సారత. దానితో కుప్పకూలిపోతారు. ఇది జరగకుండా చూసుకోవాలి. ఎందుకంటే ఈ నిరాశావాదం అసుర

శక్తుల అస్త్రం. దాని ఛాయలెక్కడున్నా అక్కడ అసురులు త
అత్యంత శక్తివంతమైన అస్త్రాల్ని వాడుతున్నట్టే.
(*CWM* Vol. 6, pp. 440-441)

*

నిరాశవల్ల మనం మనసులో వేటిని తలచుకు భయపడతావె
వాటివైపే మనం ఆకర్షించబడటం తప్ప ఇంకే లాభమూ లేద
కనుక మన మనసులోంచి ఈ నిరాశా, నిస్పృహలను పారద్రో
మనం ఏది కావాలని కోరుకుంటున్నామో దాన్ని గురిం
మాత్రమే ఆలోచించాలి.
(*CWM* Vol. 16, p. 187)

*

గతం గురించి విచారించ వద్దు. భవిష్యత్తు గురించి ఊహించన
వద్దు. మనసులోని నైరాశ్యాన్ని చేతనయినంత అదుపులోకి తెచ
కుని ఆశావాదిగా మారాలి.
(*CWM* Vol. 12, p. 141)

*

మన ఆలోచనలలోంచి నైరాశ్యాన్ని పూర్తిగా తొలగించితే పూ
జ్ఞానం వైపు కచ్చితంగా దుమికినట్లే.

భగవంతుని కృపయందు నమ్మకాన్ని సంపూర్ణంగా దృ
పరిస్తేనే అవచేతనలోని నైరాశ్యాన్ని జయించగలుగుతాం.
(*CWM* Vol. 16, p. 425)

*

సీరియస్‌గా ఉంటే ప్రమాదం

జీవితాన్ని సీరియస్‌గా తీసుకోటమన
ఎటువంటి ప్రాముఖ్యతాలేని అల్పవి
యాలకి అధికమైన ప్రాముఖ్యత ఇవ
డము, జీవితమంటే ఏవో కొన్ని పవిత్రమైన అంశాలే అనుక
వడం. ఈ లక్షణంవల్ల కొందరికి జీవితం రసహీనంగా, పేలవంగ
చిరాకుగా అయి, వీరు ఆనందంగా స్వేచ్ఛగా ఉన్న వారందరిల
అన్నిటిలో లోపాలే ఎంచుతుంటారు.

ఈ భూలోక జీవితాన్ని పరిపూర్ణంగా, చక్కగా గడపా లంటే, దాని సంపూర్ణరూపాన్ని చూడగలిగేంత ఎత్తునించి, ఉన్నతస్థాయినించి దానిని చూడగలగాలి. అంటే కేవలం వర్తమానంనేకాక త్రికాలాలని ఒకేసారి దర్శించగలగాలి. అప్పుడే అన్ని సంఘటనలూ వాటి సరైన కోణంలోనించీ స్థానంలోనించీ అవగాహన అవుతాయి. ఏ ఒక్క సంఘటననీ తొలగించకూడదు, తొలగించడానికి వీల్లేదు. ప్రతి ఒక్క సంఘటననీ సృష్టిలోని మిగిలిన అన్నింటితో సమన్వయపరచే చూడాలి.
(*CWM* Vol. 10, p. 157)

*

నీవు నిరంతర, ప్రశాంత, తేజోమయ, శాశ్వత ఆనందంలో లేవంటే సంపూర్ణ పునీతమైనస్థాయికి నీవు ఇంకా ఎదగలేదనీ, ఎంత కష్టపడయినా ఎదగాలనీ అర్థం.
(*CWM* Vol. 7, p. 401)

*

సంతోషంగా ఉండటానికి ప్రయత్నించిన వెంటనే నీవు సహాజంగానే జ్ఞానానికీ తేజస్సుకీ చేరువవుతావు.
(*CWM* Vol. 14, p. 193)

*

చిరునవ్వుతో, ప్రశాంతంగా వికసించి, నిరాశయొక్క నీడలు సోకని ఆనందమయ హృదయాన్ని అలవరచుకో.
(*CWM* Vol. 14, p. 192)

అనువాదం: బి. వరలక్ష్మి

ఎప్పుడూ హాస్యధోరణిలో జోక్సువేసుకుంటూ చిరునవ్వులు చిందిస్తూ ఉన్నట్లయితే ఎటువంటి కష్టము వచ్చినాకూడ నువ్వు దానిని సునాయసంగా ఎదుర్కోగలవు.

శ్రీమాత

నిస్పృహకు చికిత్స – IV

శ్రీమాత

నువ్వు నిరంతరం నిన్ను గురించే ఆలోచించటం మానేయాలి. నీ మనస్సు, హృదయం పూర్తిగా భగవంతుని పట్ల కృతజ్ఞతా మయమై పోవాలి. ఇతర ఆలోచనలు వచ్చి ఆ పవిత్రభావాన్ని చెదరనివ్వకూడదు. నీ హృదయంలో ఓ జ్వాల వెలిగిపోతూ నిన్ను ప్రతి నిమిషము పునీతము గావిస్తూ ఉండాలి. నిరంత రాకాంక్ష ఆర్ద్రతలతో నీ హృదయం పొంగిపొరలుతూ ఉండాలి.

– సంపాదకుడు

ప్రశ్న: నిస్పృహ వచ్చినప్పుడు ఏమి చేయాలి?

దాన్ని దుమ్ము దులిపినట్లు దులిపి వేయాలి.

(*CWM* Vol. 17, p. 17)

*

ప్రశ్న: నిస్పృహ రాకుండా ఉండాలంటే ఏం చేయాలి?

దాన్ని పట్టించుకోకూడదు. అది లేనట్లుగానే భావించాలి. మన పని మనం చేసుకుంటూ పోవాలి.

(*CWM* Vol. 14, p. 263)

*

దెబ్బ తినేది నీ అహంకారమే, నువ్వు దానినే మాత్రం లెక్కచేయ కుండ నీ పనిని చేసుకుంటూ పోవాలి. అప్పుడు నీ నిస్పృహ మాయమైపోతుంది.

(*CWM* Vol. 14, p. 264)

*

ప్రశ్న: గత రెండురోజులుగా నేను విపరీతమైన నిరాశాదుఃఖము లకు గురి అవుతున్నాను. ఇదే విధంగా కొన్ని రోజులు కొనసాగితే వీటిని నేనిక వదిలించుకోలేనేమో అని భయమేస్తుంది.

బాహ్యప్రపంచంలో దొంగలున్నట్లే, సూక్ష్మలోకంలో కూడా దొంగలున్నారు జాగ్రత్త! నువ్వు నీ ఇంటి తలుపులు దొంగలు దూరకుండా బిడాయించుకోవు? అలాగే నీ మానసిక ద్వారములు కూడా తప్పక మూసిపెట్టుకోవాలి. విచారం, నిరాశ, ఆత్మహత్యల సలహాలు ప్రాణికలోకపు దొంగల నుండే వస్తాయి. ఇవి నీ దౌర్బ ల్యాన్ని అదనుగా తీసుకొని నిన్ను దోచేయగలవు. నువ్వు వాటి సలహాలను వినకూడదు. వాటి కుతంత్రాలను తిప్పికొట్టి నీ సహజ ధైర్యాన్ని పొందాలి.
(*CWM* Vol. 16, pp. 73-74)

*

నా ముద్దుబిడ్డా:

వ్యాయామం చేసి కండలను పెంచినట్లు, అభ్యాసంతో మనో దార్ఢ్యాన్ని కూడా పెంచవచ్చును.

మీ అభ్యాసం ద్వారా మీరు సహనాన్ని, దౌర్బల్యాన్ని ప్రతిఘటించే శక్తిని సంపాదించవచ్చును. *నేను ఎల్లప్పుడు మీ వెంతనే ఉండి మీకు నా ప్రేమపూరిత సహకారాన్ని అంది స్తూనే ఉంటాను.*
(*CWM* Vol. 16, p. 145)

*

నీ ప్రాణికం (vital) విజృంభించినప్పుడల్లా దాన్ని నాలుగు తన్నులు తన్ని కూర్చొబెట్టు. లేకపోతే భోగభాగ్యాలకోసం అఱ్ఱులు చాచే ఈ రాక్షసితో నువ్వు వేగలేవు.
(*CWM* Vol. 3, p. 137)

*

అమ్మా: నా హృదయం నిస్సారమై, చీకటిగా, విచారంగా ఉంది.

నీకు నచ్చిన పుస్తకం ఏదైన తీసి చదువుకో తల్లీ. అస్త మానం నిన్ను గురించే ఆలోచించకు. ఆలోచనలను నీ నుండి మరలించు.
(*CWM* Vol. 14, p. 263)

నా ప్రియమైన బాలికా:

నాకు నీ వెప్పుడు విచారంగా, మానసిక సంక్షోభంతో వున్నట్లు కనిపిస్తావు. అది అనారోగ్య లక్షణం. నరాల బలహీనత. నువ్వు మంచి ఆహారం తీసుకోవాలి. బాగా నిద్రపోవాలి. ఆరుబయట మంచివాతావరణంలో వ్యాయామం చేయాలి.

(*CWM* Vol. 16, p. 120)

*

తరుచు మనని మబ్బులు కమ్ముకుంటాయి. దిక్కు తోచదు. అప్పుడు నువ్వు నిశ్చింతగా ఉండాలి. ఇవి మనకి ఆధ్యాత్మిక నిశలు. వీటి వెంట తప్పక పగటి వెలుగులు వచ్చి తీరుతాయి. భగవంతుని దివ్యకృపకు కృతజ్ఞతలు చెప్పాలి.

దీనికో తక్షణ పరిష్కృతి ఉంది. నీ హృదయాన్ని పవిత్ర జ్వలితంగా ఉంచాలి. ప్రగతినే ఆకాంక్షించాలి. నీ ఏకాగ్రతను పెంచాలి. లక్ష్యసిద్ధికై కంకణధారణ చేయాలి. ఈ జ్వాల నీ హృదయంలో సదాజ్వలితం కావాలి. కృతఘ్నత మీ లక్ష్యాన్ని కప్పివేయరాదు.

(*CWM* Vol. 14, p. 265)

అనువాదం: నేరెళ్ల లక్ష్మణరావు

సణుగుతూ, గొణుగుతూ ఉండటం చాలా ప్రమాదం. అది దుష్టశక్తులను ఆహ్వానించినట్లే. దాని బదులు సంతోషంగా ఉంటే ఎంతో హాయిగా నీ అని అయిపోతుంది

శ్రీమాత

ఉత్సాహం – నిరుత్సాహం

శ్రీమాత ప్రవచనములు

నైరాశ్యం (depression) ఉత్సాహం అన్నవి రెండూ రెండు విపరీతధోరణులు. రెండింటిలోనూ కష్టాలున్నాయి. ప్రతిబంధకాలూ ఉన్నాయి.

విరాగ సరాగాలు

ఏ వ్యక్తికైనా బలీయమైన సంకల్పం లేకపోతే, అతనికి నిస్పృహ ఇలా సూచిస్తుంది – "ఇదంతా నిస్సారం, నిస్తేజం. యోగపథంలో పురోగమించాలంటే జీవితమంతా నిరీక్షించాలి." ఇక ఉత్సాహం (enthusiasm) ఒక్క రోజులో ప్రాణికం పరివర్తన చెందుతుందని భావిస్తుంది. "నాకు ఎటువంటి చిక్కులు లేవు. యోగమార్గంలో శీఘ్రగతిని పురోగమిస్తాను. ఎట్టి ఇబ్బందులు లేకుండా దివ్యచైతన్యాన్ని సాధించగలను" అని అంటుంది. మరి కొన్ని ఇతర కష్టాలు ఉన్నాయిగాని పరవాలేదు – కాస్త సహనం అవసరం అంతే.

ప్రాణికానికి తొందర ఎక్కువ

కొద్దిగంటల పిమ్మట – కొద్దిరోజుల పిమ్మట – కొద్దినెలల పిమ్మట ప్రాణికం (vital) తనతో ఇలా చెప్పుకుంటుంది. "మన ఉత్సాహంతో ఎంతదూరం వెళ్ళామోయ్? అసలేమైనా సాధించామా? పూర్వస్థితికన్నా అధ్వాన్నస్థితి అది, కొద్దిగా సంక్షుభిత మైనస్థితి? కొద్దిగ కలవరపాటు? యథార్థంగా ఉండవలసినట్లుగా పరిస్థితులు లేవు. భవిష్యత్తులో ఉండవలసినట్లుగా లేవు. అలసటగా ఉంది. నేనేం చేస్తున్నాను? నన్ను ఏకాకిగా వదిలిపెట్టండి బాబూ. నాకు ముందుకు కదలాలని లేదు. నేనెక్కడ ఉన్నానో అక్కడేపడి ఉంటాను. నిన్ను వేధించను. నన్ను బాధపెట్టకు." ఏదైన అసంతృప్తి, విసుగు కలిగినప్పుడు – ప్రాణికంతో ఇలా చెప్పాలి:

ప్రాణికాన్ని శాంతపరచాలి

"నువ్వు ప్రశాంతంగా ఉండబోతున్నావు. నిన్ను అడిగిన పనిని నువ్వు చేయబోతున్నావు. లేకపోతే నాతో తలపడవలసి వస్తుంది" ఉత్సాహంతో ఉత్సాహవంతుడు ఇలా అంటాడు:

"అంతా ఇప్పుడే సాధించి తీరాలి. వెంటనే"

దానికి నీ సమాధానం "కొద్దిగా ప్రశాంతంగా ఉండు. నీ శక్తి అమోఘం. కాని ఆ శక్తినంతనూ అయిదునిమిషాలలో ఖర్చు చేయకూడదు. ఆ శక్తి చాలా కాలంవరకు అవసరమవుతుంది. దానిని జాగ్రత్తగా దాచి ఉంచు. అది అవసరం కాబట్టి నీ సుహృద్భావం నాకు ముఖ్యం. నీలో సుహృద్భావం మెండుగా ఉంది. నీవు శిరసావహిస్తావు. నీవు సణగవు. నీవు నిరసన తెలుపవు. నీవు తిరుగుబాటు చెయ్యవు. "ఔను, ఔను" అని అంటావు.

అడిగినప్పుడు నువ్వు త్యాగం చేస్తావు. హృదయపూర్వకంగా "ఔను" అంటావు.

(*CWM* Vol. 4, pp. 248-249)

*

సహనం అన్ని ప్రతిబంధకాలను తొలగిస్తుంది. యోగమార్గంలో పురోగతికి అడ్డువచ్చే నిస్పృహను కాని, నైరాశ్యాన్ని కాని పెరగనివ్వకుండా ప్రశాంతమైన సహనం చాలా ముఖ్యం. ఆకాంక్షలోని చిత్తశుద్ధి విజయంవైపు భరోసా.

*

సహనం వల్లనే కష్టాలను జయించాలి. వాటినుండి పారిపోయి ఎవరూ ఏమీ సాధించలేరు. విజయమత్యంత సహిష్ణువునికే. నీ పనిని నీవు ఉత్తమంగా చెయ్యి. ఆపైన ఫలితాలను గురించి భగవంతుడే చూసుకుంటాడు.

(*CWM* Vol. 14, pp. 172-174)

అనువాదం: కె. యజ్ఞన్న

స్థూలదేహము చుట్టూ సూక్ష్మదేహము

శ్రీమాత ప్రవచనములు

మన స్థూలశరీరాన్ని పరివేష్టించి ఒక సూక్ష్మశరీరముంటుంది. మొదట ఆ పొరను ఛేదించి వ్యాధి మనలోకి ప్రవేశిస్తుంది. అది మనకొక రక్షణకవచమన్న మాట. అంతేకాదు, బాహ్యస్పర్శలకు అది వెంటనే స్పందించి ఆ స్పర్శలను మన కందిస్తుంది. మంచిచెడులు రెండూ కూడా అదే విధంగా మనలోకి ప్రవేశిస్తాయి.

— సంపాదకుడు

సూక్ష్మశరీరం మన రక్షణకవచం

మానవశరీరాన్ని ఆవరించుకొని అదృశ్యంగా ఒక సూక్ష్మశరీరం ఉంటుంది. దాన్నే నాడీప్రాకారమనీ, ఈథరిక్ శరీరమనీ వ్యవహరిస్తారు. ఇది సర్వదా మనిషిని పరిరక్షిస్తూంటుంది. బాహ్యకారణాల వల్లగానీ, అంతర్గతకారణాల వల్లగానీ ఒక వ్యాధి ప్రవేశించాలంటే ముందుగా ఈ ప్రాకారాన్ని ఛేదిస్తేగాని శరీరాన్ని ఏమీ చేయలేదు. రక్షణకవచమైన ఈ నాడీప్రాకారం ఏ విధమైన లోపాలు లేకుండా, నిండుగా ఉంటే దాన్నేదీగూడా తాకలేదు. అంటే దాని భిన్నాంగములు యథావిధంగా, సంపూర్ణంగా, సమతుల్యంగా ఉంటే శరీరం సురక్షితంగా ఉన్నట్లే. ఈ సూక్ష్మశరీరానికి ఆధారం భౌతికమే అయినా అది భౌతికపదార్థం కంటే భిన్నమైనది. మానసిక శాంతి, సమరస భావం, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యంపై నమ్మకం, సుఖమయ విశ్రాంతి, మానసికోల్లాసం, సంతతమైన ఆనందాది ప్రకంపనాలతోనే ఈ ప్రాకార నిర్మాణం జరుగుతుంది. ఇది చాలా సున్నితమైందే కాక, సుసాధ్యమైందీ, లాఘవమైనదీ కావడంవల్ల బయట జరిగే వ్యవహారములను వెంటనే గ్రహించి తదనుగుణంగా తను కూడా ప్రభావితమౌతుంది. అధైర్యము, నిరాశా నిస్పృహాలు (depression) దీని మీద విపరీత పరిణామాలు కలిగిస్తాయి. దాన్ని తూట్లుపొడిచి

బలహీనపరుస్తాయి. అప్పుడు దుష్టశక్తులు వస్తే వాటిని ఎదిరించ లేక లోనికి ప్రవేశించనిచ్చి అనారోగ్యం పాలవుతుంది.
(*CWM* Vol. 3, p. 89)

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామ శాస్త్రి

కష్టాల నెదుర్కోవటమెలా?

శ్రీమాత ప్రవచనములు

భగవంతుని మీద విశ్వాసముంచినపుడు కష్టాలను నువ్వు లెక్కచేయనవసరము లేదు. ఎందుకంటె ఆ కష్టాలు కొన్ని దుష్ట శక్తుల వలన కలుగుతాయి. కాని వాటికి కూడ సాధనలో పాత్ర ఉన్నది. నీ ఆకాంక్షని, బలాన్ని ఎక్కువ చేసి సాధనని త్వరితపరచగలవు. విశ్వానికి, నీకు అవినాభావ సంబంధ మున్నది. విశ్వమహాశక్తులు నీ పనులలోను, సాధనలోను నీకు సాయపడి మేలు చేస్తూనే ఉంటాయి.

– సంపాదకుడు

ప్రశ్న: కొంతమంది జీవితాలు వారి ఆశయాలకు విరుద్ధంగా నడుస్తాయి. వారు నిరాశ చెందుతారు. ఇది వారి ఆధ్యాత్మిక ఉన్నతికి ఆవశ్యకమా?

కాదు. ఇది బలహీనతకి, అజ్ఞానానికి చిహ్నం. సాధనలో పురోగతిని కావాలని అడ్డగించే దుష్టశక్తులు నిరాశ నిస్పృహాలు.

కష్టాలొచ్చినా విశ్వాసం సడలకూడదు

జీవితంలో ఎట్టి పరిస్థితులలోను నిరాశ నిస్పృహలకు తావివ్వకూడదు. నీలో విశ్వాసం సడలితే, బెంగ, విచారం, నిరాశ చోటు చేసుకుంటాయి. నమ్మకం ముఖ్యం. ఆత్మవిశ్వాసంతో ఎలాటి ప్రతిబంధకాన్నైనా ఎట్టి పరిస్థితినైనా ఎదుర్కొనగలుగుతాము. చివరిదాకా పోరాడగలుగుతాము. నమ్మకం సడలితే మాత్రం ధైర్యం, సహనశక్తి జారుకుంటాయి.

విశ్వ శక్తులతో సంబంధం

వ్యక్తి వేరు, విశ్వము వేరు కాదు. వ్యక్తికి, విశ్వప్రకృతికి అవినాభావ సంబంధం ఉన్నది. ఈ రెంటి సామరస్యస్థాయికి అనుగుణంగా వ్యక్తియొక్క భౌతికజీవన లక్ష్యసిద్ధి ఆధారపడి ఉంటుంది అంటారు శ్రీఅరవిందులు. కొంతమందిలో ఆత్మశక్తి సహజంగానే విశ్వాత్మశక్తికి అనుసంధానమై ఉంటుంది. ఫలితంగా అను చేసే ప్రతికార్యము సఫలీకృతమౌతుంది. ఇందుకు విరుద్ధంగా ఉండేవారు వైఫల్యాలు చవిచూస్తారు.

పరాజయం కూడా ప్రగతికి సాధనమే

పరిణామశీలమైన ఈ లోకంలో ఆధ్యాత్మిక సాధనకి సహకరించనిదేదీ ఉండదు. వ్యక్తి ఆధ్యాత్మిక వికాసం ఎన్నో జన్మలనుంచి సంతరించుకున్న అనుభవాలకి లోబడి ఉంటుంది. ఆత్మవికాసానికి జీవితంలో పొందిన జయాపజయాల అలూకు అనుభవాలన్నీ ఉపకరిస్తాయి. ఇదంతా ఒక్క జన్మకే పరిమితమై ఉంటుందనుకోకూడదు. జీవితంలో ఆధ్యాత్మిక లక్ష్య సిద్ధికి గెలుపులు ఎంత అవుసరమో ఓటమిలు కూడా అంతే అవుసరం. ఆత్మవికాసానికి జయాపజయాలు, సుఖదుఃఖాలు, ఆశా నిరాశలు – ఈ ద్వంద్వాలన్నిటికి సముచిత స్థానం ఉన్నది. ఒక దానిని వెన్నంటి మరొకటి ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది.
(*CWM* Vol. 10, pp. 55-57)

*

దైవానుగ్రహం నీమీద వర్షిస్తూ ఉంటుంది

చేసే పనిలో వైఫల్యం పొందినపుడు ఆత్మశోధన చేసుకొని బాహ్యావైఫల్యానికి ఉపశమనాన్ని అన్వేషిస్తావు. నీలో దివ్యజ్వాల ప్రజ్వలించి ఉండగా దైవం సహకరించి పరిణతుడవై దివ్యజీవన మార్గంలో పయనించేందుకు సన్నద్ధుడవై ఉన్నప్పుడు అఘాతాలు ఒకదాని వెంట మరొకటి రావటం సహజమే. నీ ఉన్నతికి నీ వైఫల్యాలే ఎంతో సూటిగా శక్తివంతంగా సహాయపడతాయి. అపుడనుకుంటావు – అబ్బా! విజయ

సాధనకి ఎంత మూల్యం చెల్లించవలసి వచ్చింది అని. ఇందుకు నీవు ఎంతవరకు సిద్ధంగా ఉన్నావు? ఆలోచించు.
(*CWM* Vol. 6, p. 239)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

నిస్పృహవల్ల ప్రయోజనం

శ్రీమాత ప్రవచనములు

మామూలు జీవితం సుఖదుఃఖాల మిశ్రమం. యోగసాధనలో కూడ అంతే. నీలోని దోషములు బయటపడినప్పుడు నువ్వా సూచనలను గుర్తించి నీ పురోగమనానికి సాధనాలుగా ఉపయోగించుకోవాలి. అనగా నీలో దోషాలను జయించేసావు అనమాట. వాటి ద్వారా నీ చేతనాస్థాయి పెరుగుతుంది. – సంపాదకుడు

పురోగతికి ఉపకరణం

నైరాశ్యంతో క్రుంగిపోయిన పరిస్థితులన్నింటినీ పురోగతికి ఉపకరణాలుగా మార్చుకోవచ్చును. ఇటువంటి నిస్పృహకు నీవు లోనైతే, – అదొక తుఫాను లాంటిది – ఆ సంక్లిష్ట సంక్షోభాన్ని నూతన పురోగతిగా మార్చవచ్చును. గమ్యం వైపు మరో అడుగుగా మార్చుకోవచ్చు. నీ లోపల, ఈ నిస్పృహకు అసలు కారణాన్ని తేరిపార చూడగల నిజాయితీ కనుక నీకు ఉంటే, అసలు బలహీనతను చూడగల్గితే, పొరపాటును, అహంకారాన్ని గుర్తించగల్గితే (అన్నట్లు చెప్పడం మరిచా. మనసుకన్నా ప్రాణికంలో అహంకారం ఎక్కువ పాళ్ళలో కరడుకట్టుకొని ఉంటుంది) వాటిని ముఖాముఖి నీవు చూడగల్గితే, జరిగిందంతా నీ తప్పిదంవల్లనేనని నిజాయితీతో, చిత్తశుద్ధితో నీవు గుర్తించినట్లైయితే, అప్పుడు నువ్వు ఓ నిప్పుకణికను కలుషితమైన ఆ భాగంపై పెట్టగల్గుతావు. ఆ బలహీనతను ప్రక్షాళితం చేసుకొని, దానిని నవచైతన్యంగా మార్చవచ్చును. తుఫాను అంతరించిన పిమ్మట, నీవు

కొంచెం ఎత్తు ఎదిగావని, నీవు నిజంగా పురోగమించావని తెలుసుకుంటావు.

నిస్పృహనుంచి, దుష్టసంకల్పంనుంచి బయటపడినప్పుడు, తనపై దాడి జరిగిందని, ఏదో కొంత పురోగతి సాధించవలసి యున్నదని, ఏది ఏమైన అంతరాంతరాలలో ఏదో పురోగతి సాధించిందని, ముందుకు ఒక అడుగు వేసినట్లు తెలుస్తుంది.

నిస్పృహవల్ల జరిగిన మేలు

నిస్పృహదశ తొలగిపోగానే, అందులోనుండి బయటపడితే, తన లోపల ఏదో మార్పు జరిగిందని తెలుస్తుంది. దుష్టసంకల్పం ఉన్నప్పటికీ, తరుచు పురోగతి సాధించబడుతుంది. అయితే అది వేగంగా కాకపోవచ్చు. తేజోవంతంగా కాకపోవచ్చు. తన మహిమాన్విత ప్రాభవం కోసం కాకపోవచ్చును. అయినప్పటికీ ఏదో పురోగతి సాధించబడింది. ఏదో మార్పు వచ్చింది.

నువ్వు చెప్పింది నిజం. నిన్ను నీవు నిరుత్సాహపరచుకోవద్దు. పతనం చెందినా, తిరిగి పైకి లేవవచ్చు. అంతే కాదు ఇంకా ఉన్నతశిఖరాలు చేరుకోవచ్చు. గమ్యం చేరుకోవచ్చు. అయితే ఇందుకు బలీయమైన ఆకాంక్ష, సుస్థిరసంకల్పం అవసరం.

అనువాదం: కె. యజ్ఞన్న

ప్రాణికము (vitla desires) విజృంభించినప్పుడెల్లా దానిని నిర్దాక్షిణ్యంగా నాలుగు తన్నులు తన్ని కూర్చోపెట్టాల్సిందే! లేనియెడల ఏమాత్రం సందు దొరికినా ఆ రాక్షసి నిన్ను పట్టుకొని ఆడిస్తుంది.

శ్రీమాత

అఘాతాలలో వెలిగే దివ్యజ్యోతి

శ్రీమాత ప్రవచనములు

సాధనలో చాలా కష్టాలు తప్పవని కొంతమంది భావన. కాని అది అనివార్యము కాదు. ఒక వేళ వచ్చినాకూడ వాటివల్ల మనకు లాభమే కలుగుతుంది. మనలో అధికమైన ఆకాంక్షను పుట్టించటం వలన మన హృదయాంతరాళ లోని ద్వారములు తెరుచుకుంటాయి. మనకి వెలుగు, దివ్యజ్ఞానము, ఆనందాను భూతులు కలుగుతాయి. యోగంలో మన మింకా ముందుకు సాగి పోయేందుకు అవి సాధనములు. — సంపాదకుడు

బాధల నివారణ

పట్టరాని దుఃఖం ముంచేస్తున్నప్పుడు, అనుమానం పెనుభూతమై వేధిస్తున్నప్పుడు, భరింపరానిబాధ ధైర్యాన్ని సడలించేస్తున్నప్పుడు బయట పడి స్వాంతన పొందటానికి అమోఘమైన మార్గమొకటున్నది.

అంతరంగాల్లో దివ్యజ్యోతి

మన హృదయాంతరాళాల్లో దేదీప్యమానంగా వెలుగుతూ ఒక దివ్యజ్యోతి ఉంది. సకలజగత్తునూ పాలించి, పోషించే సర్వాంతర్యామి యొక్క దివ్యాంశే ఆ జ్యోతి. దాని శక్తి అపారం; కోరిన వారికి కొంగు బంగారం. దాని కనుసన్నలలో అనుసరించాలనుకునే వారికి దారి చూపే శక్తివంతుడైన మార్గదర్శకుడు. ప్రేమాన్వితమైన ఆ శక్తిని దర్శించి, దాని ఆజ్ఞానువర్తిగా ప్రవర్తించాలనుకునే వారిని దయతో అనుగ్రహించే సహనమూర్తి, విశ్వాసంతో నమ్మి ప్రార్థించే వారి నెన్నడూ నిరాశ పాలు చేయడు. భక్తితత్పరతతో దృఢవిశ్వాసం పెట్టుకుంటే ఎన్నటికీ వృథా కాదు. నమ్మినవారి ఆశలు అడియాసలు కావు.

వెంటనే దైవానుగ్రహము

నా హృదయం దుఃఖంతో నిండి బ్రద్దలై పోతూంటే, బాధ భరించలేక ఆక్రోశిస్తూ క్రుంగిపోయే పరిస్థితుల్లో ప్రభూ! కాపాడు! అంటూ సర్వరక్షకుడవైన నిన్నే ఎలుగెత్తి పిలిచాను. వెంటనే దివ్య

మంగళ స్వరూపుడవైన నీ దివ్యకాంతితో నన్ననుగ్రహించి నా వెతలు తీర్చావు.

మార్గము ఆవిష్కరణ

ఈ విధంగా నీ వైభవం ప్రకాశమానంగా నన్ను ముంచెత్తివేస్తుంటే నేననుసరించవలసిన మార్గము నాకు దృగ్గోచరమైంది. దుఃఖమనేది ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలిసింది. నిజానికి భూదేవి భరిస్తున్న బాధ, సహిస్తున్న వేదనతో పోలిస్తే నన్ను పీడిస్తున్న ఈ దుఃఖం దాని తాలూకు మసగనీడే నని తెలిసివచ్చింది.

దుఃఖాలను గురించి నీకు తెలుసు

స్వయంగా అనుభవించిన వారికే ఎదుటివారి కష్టమేమిటో తెలుస్తుంది. వారే దాన్ని అర్థం చేసుకొని ఉపశమింప చేయగలరు. అందుకే కాదా ప్రభూ! మా బాధలు తెలుసుకొని కరుణించాలనే ఉద్దేశంతో అనేక అవతారాలెత్తి భూలోక బాధలన్నిటినీ అనుభవించావు!

ఇంత చేస్తున్నప్పటికీ నీ భక్తులు కొందరు నిన్నర్థం చేసుకోలేక దయలేనివాడివనీ, క్రూరుడవనీ, బాధలు కల్పిస్తావనీ నిన్ను నిందిస్తున్నారంటే ఆశ్చర్యం!

పదార్థమయమైన ఈ ప్రపంచనిర్మాణంలోని దోషం వల్లనే ఈ బాధలు వస్తున్నాయి. ఈ పదార్థం, జడత్వము అపరిపక్వతల వలన నిన్ను ప్రతిష్ఠించుకోటానికి అనర్హురాలిగా ఉంది. దాని వల్ల కష్టపడి విచారించే మొదటి వ్యక్తివి నువ్వే. ఆ అస్తవ్యస్త పరిస్థితిని చక్కబరచి, వ్యవస్థీకరించి దుఃఖాన్నంతా సుఖంగా మార్చాలనీ, గందరగోళాన్ని సామరస్యపూరితం చేయాలని కష్టపడుతున్నావు.

నిజానికి కష్టాలనేవి అనివార్యమూ కాదు, అభిలషనీయం అంతకన్నా కాదు. అయితే అవి వ్యక్తి పురోగతికి ఎంతో ఉపయోగపడతాయి కదా!

గుండెలు బ్రద్దలైపోయే కష్టాలు వచ్చినప్పుడల్లా హృదయపు లోతుల్లోకి వెళ్ళే తలుపులు తెరుచుకుంటాయి. అందునుంచి సుసంపన్నమైన శ్రేణులెన్నో దర్శనమిస్తాయి. అక్కడ నుంచి

వెలువడే స్వర్ణకాంతులు శిథిలావస్థకు చేరుతున్న జీవులకు క్రొత్త ఊపిరి పోస్తాయి.

ఈ విధంగా హృదయాంతరాల్లోకి దిగి వెడుతూంటే చివరకు నిన్ను కప్పి ఉంచిన తెర అడ్డు తగులుతుంది. దాన్ని తొలగించినప్పుడు దర్శనమిచ్చే నీ దివ్యకాంతిని ఎటుల వర్ణించగలను! వెల్లువై ప్రవహించే ఆ దివ్యశక్తి తీవ్రత, ముంచెత్తివేసే దివ్యకాంతిపుంజము, నన్ను సంపూర్ణంగా పరివర్తన చేస్తున్న ఆ దివ్యప్రేమ పరవశింపును, ఆనందాన్ని ఏమని వర్ణించగలము!
(*CWM* Vol. 2, pp. 19-20)

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామ శాస్త్రి

ఒక ఆప్తమిత్రుని ఆప్తవాక్కు

శ్రీమాత ప్రవచనములు

సాధకుల సాధకబాధకాలను ప్రత్యక్షంగా అనుభవించి, సమస్యలను ఎరిగినవారే పరిష్కారం చూపించటం ఈ వ్యాసం ప్రత్యేకత. దుఃఖమును సంతోషంగా మార్చవచ్చు. బలహీనతను బలముగాను, ఓటమిని గెలుపుగాను, పతనమును ఉత్సాహంగాను, ఒంటరితనాన్ని ఓ సమిష్టి కేంద్రబిందువుగాను, ఇద్దరి మధ్య వైరమును మైత్రిగాను, పరిష్కరించవచ్చు. అయోమయంలోంచి ఆత్మజ్ఞానమును, ఆనందమును సాధించు మార్గమును శ్రీమాత "Sublime nuptials of sovereign love" *అని ఎంతో ముచ్చటగా అభివర్ణించారు.*

— సంపాదకుడు

సాధనలో ఎన్నో ఒడిదుడుకులు, అగ్నిపరీక్షలు తప్పవు. సాధననగా నీ ప్రకృతి నధిగమించటం. అంతిమవిజయం తథ్యమే అయినప్పటికి తాత్కాలికంగా నిరాశ జెందటం, ఓటమిని తట్టుకోలేకపోవటం మామూలే. ఇటువంటి సమస్యలను ప్రత్యక్షంగా ఎదుర్కొని

అగ్నిపరీక్షలోంచి పునీతమై బ్రతికి బయటపడిన ఒక అనుభవ శాలి చూపించిన ఆశాజ్యోతిని నేను మీకందిస్తున్నాను.

జీవితంలో ఎదురుదెబ్బలు తిని, అలసిసొలసి, గాయాలకు తట్టుకోలేక, దిగులుతో పలాయనము చిత్తగించుదామనుకుం టున్న ఓ మిత్రమా ఆలకించు! నీ శ్రేయోభిలాషి మాటలు విను. అతనికి నీ చింతలేమిటో తెలుసు; అవి అతనూ అనుభవించాడు. నీలాగే అతను కూడ కష్టాల ననుభవించాడు. ఈ జీవితపు ఎడా రులను దాటాడు. ఆకలిదప్పికలు, ఒంటరితనము, అతనికి క్రొత్త కావు. అలాగే సందేహాలు, పొరపాట్లు, పరాజయాలు అన్నీ తెలుసు.

ధీరుడవై ఉండు. ప్రతి ఉదయము సూర్యభగవానుడు తన కిరణాలద్వారా భూమికి తెస్తున్న సందేశాన్ని అందుకో. అది ఆశను పుట్టించి, లాలించి ఊరడించే సందేశము.

> *రాత్రి తరువాత పగలు రానే వస్తుంది*

ఓయీ ధైర్యంగా ఉండు! దుఃఖా లకు బెదిరిపోయి, ఈ కష్టాలకు ఇక అంతమే లేదా అని అనుకుం టున్నావు. చీకటి శాశ్వతము కాదు. రాత్రి తర్వాత పగలు రావా ల్సిందే. అలాగే ఈ చెడ్డరోజులు కలకాలము ఉండవు. పొగమంచు ఎంతోసేపు సూర్యుని వెలుగును ఆపలేదు. కారుమేఘాలు శాశ్వ తంగా ఉండవు. అలాగే కష్టాల కడగండ్లు కూడా కలకాలం ఉండవు.

> *ఎంతటి దుఃఖమైనా సంతోషానికే దారితీస్తుంది*

దుఃఖము వెనుక సుఖము తరు ముకు వస్తుంది. వ్యధ అంత రించి ఆనందం కలుగుతుంది. ఓటమి విజయముగా మారుతుంది. ప్రతి అవరోహణ ఆరోహణకు, వైషమ్యం సామరస్యానికి దారితీస్తుంది. ఒక్కొక్కసారి మానసిక విభేదాలే హృదయాలను దగ్గరకు తీసుకువస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే బలముగా పరివర్తనముకాని దౌర్బల్యమే లేదు. అత్యంత బలహీనతలోనే భగవంతుడు తనను తాను ప్రత్యక్షపర చుకొంటాడు.

చూడు బిడ్డా ఇప్పుడు నువ్వు నిరాశానిస్పృహలతో ఉన్నావు. కాని అంతరంగాల లోతులలో చేతన మేల్కొంచిన వానికి శిఖరాగ్రాలు చేరువవుతాయి. ఎంత అగాధములోకి వెడితే అంత ఎత్తైన శిఖరాలు గోచరిస్తాయి.

ఇది నీకు తెలుసా! మహోన్నతశక్తులు దట్టమైన పరదాల మరుగున మోహరించి ఉంటాయి. అజ్ఞానపు చీకట్లనుంచి సర్వోన్నత ప్రేమ వెలికిరావటానికి తాపత్రయపడుతోంది.

నిన్ను కష్టాలు క్రిందికి పడద్రోసినంతమాత్రాన, నువ్వు వేదనల ఊబిలో ఇరుక్కుపోయినంతమాత్రాన చింతించకు. భగవంతుని కరుణ, ప్రేమలు నిన్ను అక్కడ కూడా చేరగలవు. దుఃఖాల అగ్నిపరీక్షలో నెగ్గావు. శిఖరాగ్రాన్ని చేరటమే తరువాయి.

నీవొక అరణ్యంలో ఉన్నావు. అక్కడ నిశ్శబ్దస్వరాలను విను. పొగడ్తలు, ముఖస్తుతులు చెవులకు చాలా ఇంపుగా ఉండొచ్చు. కాని నిశ్శబ్దపు నాదాలు ఆత్మానందం కలుగజేస్తాయి. అవి నీ అంతరంగపు పిలుపులను నీకు వినబడేలా చేస్తాయి. శ్రీకృష్ణుని మురళీగానం వినపడుతుంది.

నీవు ప్రస్తుతము గాఢాంధకారంలో నడుస్తున్నావు. అచ్చట లభ్యమయ్యే అమూల్యరత్నాలను ఏరుకో! ఎందుకంటే ఆధ్యాత్మికసంపదలు, జ్యోతిర్లోకాలకు చేర్చే రహస్యమార్గాలు రాత్రిలోనే గోచరమవుతాయి!

నీనుంచి గోపికావస్త్రాపహరణమువలె సర్వము అపహరించబడినది. ఇక సకలసంపదలు నీవే. నీకంటూ ఏమీ మిగలనప్పుడు సర్వమూ నీకు అందుబాటులోకి వస్తుంది. నిజాయితీపరులకు, సత్యసంధులకు కీడులో కూడా మంచే జరుగుతుంది.

భూమిలో నాటిన ప్రతి విత్తనమూ అనేకాన్ని ఉత్పత్తి చేస్తుంది. అలాగే ప్రతి దుఃఖపు ఘాతమూ నిన్ను ఆకాశానికెత్తుతుంది.

మనిషిని నాశనం చేయాలని అసురుడు చేసే ప్రతి ప్రయత్నము, మనిషిని మరింత దివ్యంగా మారుస్తుంది.

నల్లటి ఆకాశంలో వెన్న ముద్దల్లాంటి నక్షత్రాలు

ఇదే ప్రపంచంలోని విచిత్రము. అసురుని జయము తథ్యం అని పిస్తుంది. అతను తాపసోత్తములను కారుచీకట్లలో పారేస్తాడు, కాని అట్టివారు తారలై ఆకాశాన విరాజిల్లుతారు. అతను సృష్టిని భగ్నం చేయాలనుకుంటాడు. ఈ ప్రపంచాన్ని అల్లకల్లోలము చేసి, దాని సామరస్యాన్ని భగ్నపరచి, ఛిన్నాభిన్నము చేసి సర్వమూ బూడిదపాలు చేసాడు. అద్భుతం! ఆ బూడిదే హిరణ్మయబీజమై, రోదసినంతా ఫలవంతముగావించి జగన్మండలాలను నింపివేస్తున్నది.

అనంతపు పొత్తిళ్ళలోంచి వెలువడుతున్న ఓంకారం ఎంత మధురమైనది. తారాగణముల సమ్మేళనము ఎంత శ్రవణోపేయమైనది! ఆ విజయదుందుభులతో లోకములన్నీ ప్రతిధ్వనించుచున్నవి.

మానవుని హృదయంలో దివ్యప్రేమ నిక్షిప్తము

తన దివ్యమూలమునుంచి వేరుపడిన మానవుని పరిస్థితి చాలా ఘోరమైపోయింది. అతను శత్రువు చేతిలో బందీ అయిపోయాడు. కత్తులను ఝళిపిస్తున్న శత్రుసైనికులు పహారా చేస్తున్నారు. వీటిని దాటుకొని అతను తన మూలమును చేరటము అసాధ్యము. అందుకనే దైవము తనను అతనిలో ప్రత్యక్షంగా స్థాపించుకొన్నాడు. దివ్యతేజాన్ని అందుకోలేడు గనుక, ఆ తేజస్సు అతని హృదయకుహరంలోనే ప్రజ్వరిల్లింది. అతనికి అతీతమైన ప్రేమను అందుకొనే శక్తిలేదు గనుక ఆ దివ్యప్రేమయే భూమిపైనున్న ప్రతి జీవిని, ప్రతి మనిషిని తన ఆవాసముగా, ఆలయముగా చేసుకొంది.

ఈ విధముగా రాయికి కూడ రాజయోగం కలిగింది. జడ పదార్థానికి కూడ దివ్యానుగ్రహభాగ్యము కలిగింది. దానిపై దైవ కృప ప్రసారమైంది. దాని ప్రతి అణువులోను దైవసంకల్పం ఉంది. ప్రతి జీవిలోను భగవంతుడు ఆసీనుడై ఉన్నాడు. మనిషి ఈ సృష్టిలోని అత్యంత అర్భకుడు కావచ్చు, కాని అతనిలో ఉన్నంత దైవత్వం మరెందులోనూ లేదు.

నిజానికి అట్టడుగు స్థాయిలోనే అత్యంత వైభవానికి బీజాలు నిక్షిప్తమై ఉన్నాయి.

28 ఏప్రిల్ 1912

(*CWM* Vol. 2, pp. 41-44)

అనువాదం: గోదావరి

విభాగము III: నిస్పృహ – యోగము

ప్రశ్నోత్తరాలు

శ్రీఅరవిందుల ప్రవచనములు

ప్రశ్న: నా సాధన చాలా గందరగోళంగా ఉంది. నేనే పరిస్థితిలో ఉన్నానో, ఎటు వెడుతున్నానో, ఏం చేస్తున్నానో అంతా చాలా అయోమయంగా ఉంది. నా సందేహాలను నివారించి నాకు కొంచెం దారి చూపిస్తారా?

నీ ప్రశ్నల ధోరణేమిటో నాకర్థం కావటం లేదు. ఈ మధ్యన ఆశ్రమంలో చాలామందికి ఇటువంటి నిరాశా నిస్పృహలు కలుగుతున్నాయిలే. నిన్ను కూడ బహుఃశ ఈ పీడ పట్టుకుంది. నిజానికి ఈ అపోహలకి కారణమే లేదు.

నువ్వెక్కడున్నావు? శ్రీమాత సన్నిధిలో, నాకు దగ్గరగా ఉన్నావు.

నువ్వే దిశగా వెడుతున్నావు? సేవకు అంకితమైపోయి దైవంతో సాయుజ్యము చెందుతున్నావు.

నువ్విక్కడ చేస్తున్నదేమిటి? దైవానికి సేవ, ఆత్మసమర్పణ. నువ్వెంత సంపూర్ణంగా సమర్పించుకుంటావో, ఎంత చిత్తశుద్ధితో సేవ చేస్తావో అంత ఎక్కువగా ముందుకు సాగిపోతావు.

ఒకవేళ చెడ్డతలపులేవైన వచ్చి నిన్ను కలవరపెట్టినట్లయితే వాటిని గురించి మాకు స్పష్టంగా చెప్పాలి. అంతేగాని ఆశ్రమవాతావరణాన్ని కలుషితము చేస్తున్న ఈ దుర్భావములను, దుష్టవిషయాలను పట్టించుకోవద్దని నిన్ను హెచ్చరిస్తున్నాను.

25-5-1935

అనువాదం: టి. మాధవరావు, ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

నిస్పృహ కలిగినప్పుడు ఏం చేయాలి?

శ్రీఅరవిందుల ప్రవచనములు

సాధనాక్రమంలో ఒడిదుడుకులు తప్పవు. తీరని కోరికలే దీనికి కారణం. నీ మనస్సు, ప్రాణికముల లోంచి చెలరేగే ఈ కోరికలు నీ నిజస్వరూపానికి చెందినవి కావు. ఇంతకంటె అధికమైన జ్ఞానము, శక్తి నీలోకి దిగివచ్చినప్పుడు నువ్వు కోరికలకతీతంగా ఉంటావు. నువ్వు ప్రశాంతంగా ఉంటే ఆ శక్తి నీలో పనిచేసి నీ తత్త్వాన్నే మారుస్తుంది. నిన్ను పరివేష్టించి, నీలోకి ప్రవేశించి నిన్ను ఆనందడోలికలలో ముంచివేస్తుంది. ఏకత్వములో ఓలలాడటమే ఇక నీ ఏకైక కర్తవ్యము.

– సంపాదకుడు

నీలోని కోరికయే[1] నిస్పృహకి మూలం. ఆ కోరిక నీ మనస్సులోది కావచ్చును లేక నీ అవచేతనలోది కావచ్చును. ఈ విషయాన్ని గుర్తించి దానిని నీ చేతనలోనుంచి పూర్తిగా బహిష్కరించాలి. కోరికలు నీ అధోచేతనలోనుంచి మనస్సులోకి ప్రవేశిస్తాయి. కాబట్టి ఈ కోరికల అసలు స్వరూపము నీ ప్రాణికానికి తెలియచేసి అక్కడినుంచి కూడ వాటిని పూర్తిగా బహిష్కరించాలి. అప్పుడిక అవి నీ జోలికి రావు.
(*SABCL* Vol. 24, p. 1407)

*

సాధన చేసేందుకు ఎంతో ఓర్పు అవసరం. వెంటనే ఫలితాల కోసం ఆశించటం చాలా ప్రమాదం. అలా చేసిన యెడల నీలో పీఠం వేసుకొనివున్న కోరికలన్ని నిన్ను నిరుత్సాహపరచి చీకట్లో ముంచేస్తాయి. అందుకని నువ్వు ఏమాత్రం చలించకుండా, ఎంతో ప్రశాంతంగా సమత్వంతో ఉండాలి. కేవలం మనస్సులోనే కాకుండా

---

[1] 'కోరిక' అనే మాట విస్తృతార్థంలో వాడబడింది. మనస్సు నిశ్శబ్దం కానంతవరకు అందులో చెలరేగే ఆలోచనలన్నీ కోరికలే!

ప్రాణికంలోను భౌతికంలోను కూడ చలించకుండా నిశ్చలముగా ఉండాలి.
(*SABCL* Vol. 23, p. 655)

*

నువ్వు యోగసాధన మొదలుపెట్టినప్పుడు నీ పాతలక్షణాలు, కోరికలు అమాంతంగా మాయమయిపోవు కదా! అవి నీ ప్రాణికంలోను, మనస్సులోను చెలరేగుతూనే ఉంటాయి. కాని అంతరంగికంలోని నీ చైత్యపురుషుడు (psychic being) వీటి వలన చలించడు. దైవానికి దగ్గరగా ఉండటంవలన ఈ కోరికలు ఆయనను అంటవు. కోరికలు నీ నిజస్వరూపము కాదు గదా. నువ్వు నీ అంతరంగంలోకి ప్రవేశించి ఈ కోరికల కతీతంగా ఉండవచ్చును.
(*SABCL* Vol. 24, pp. 1347-1348)

*

సాధన నడుస్తున్న కొద్ది నీలోని మాలిన్యాలని, దోషాలని తప్పించి ప్రకృతిని పరిశుద్ధము చేయాల్సివస్తుంది. ఈ సుదీర్ఘమైన పోరాటంలో అప్పుడప్పుడు పతనము, అంతరంగిక విఘాతాలు తప్పవు. అప్పుడు నువ్వు నిర్మోహమాటంగా వాటిని గుర్తించి నిబ్బరంగా ఉంటే అన్ని విషయాలు చక్కపడతాయి.
(*SABCL* Vol. 24, p. 1348)

*

యోగంలో పైనుంచి ఒక శక్తి దిగివచ్చి నీలో పనిచేస్తుంది. నీలోని అజ్ఞానాన్ని, అంధకారాన్ని రూపుమాపి నిన్ను బాగుచేస్తుంది. ఈ ప్రక్రియ జరుగుతున్నప్పుడు నిన్ను నువ్వు ఒక ప్రేక్షకునివలె గమనిస్తూ ఉండాలి. అంతేగాని కోపం తెచ్చుకోవటంగాని, మొహం ముడుచుకొని విలపించటంగాని, తికమకపడటంగాని పనికిరావు. *పైనుంచి వచ్చిన మహాశక్తి నీలో పనిచేస్తుంది. నీ చేత సాధన చేయిస్తుంది. కాబట్టి బాధ్యత నీది కాదు. నువ్వు ప్రశాంతంగా ఉంటే చాలు.*
(*SABCL* Vol. 24, pp. 1352-1353)

రెండురకాల శక్తులు నిన్ను పరివేష్టించి నీమీద ప్రభావాన్ని చూపిస్తూ ఉంటాయి. నిన్ను నిరుత్సాహపరచి నిరాశ చెందించే దుష్టశక్తులు, నీకు శక్తినిచ్చి సర్వవిధాల సహాయం చేసి ఆనంద పరచే దివ్యశక్తులు. సాధారణంగా మనిషి ఆ దుష్టశక్తులనే గుర్తిస్తాడు. వాటికి లొంగిపోతాడు. అలా కాకుండా నువ్వు దివ్య శక్తులను గుర్తించి, గ్రహించి, ఆ వెలుగులో నీ జీవితాన్ని గడపటం నేర్చుకోవాలి.
(*SABCL* Vol. 24, p. 1506)

అనువాదం: టి. ప్రసన్నకృష్ణ, ఆర్.ఎల్.ఎన్ శాస్త్రి

విషాదం – సాధనలో ఆవశ్యకం కాదు

శ్రీఅరవిందుల ప్రవచనములు

నిరాశ, అంధకారం, నిస్పృహ సాధనలో ఒక సాంప్రదాయంగా ఉంటున్నాయి – ప్రాచ్య పాశ్చాత్య యోగవిధానాలన్నిటిలోను అవి విధిగా ఉన్నట్లు కనిపిస్తుంది. అయితే, అది అనవసరమైన సాంప్రదాయమనీ, కావాలనుకుంటే వాటిని వదిలించుకోవచ్చని నా అనుభవం.
(*SABCL* Vol. 23, p. 576)

*

ఇక నిర్వేదాన్ని గురించి చెప్పాలంటే నిశ్చయంగా అది భయం కరమైన మోతబరువే! The Pilgrim's Progress అనే కావ్యంలోని క్రిష్టియన్‌లాగ కొన్నిసార్లు నిర్వేదపు బురదలోంచి పోవలసి వస్తుంది. కాని దాన్నే నిరంతరం పునరావృతం చేస్తే అది అవ రోధమే తప్ప మరేమీ కాదు. ప్రత్యేకించి గీత "నిర్వేదానికి లోనుకాని హృదయంతో సాధన చేయి – *అనిర్వణ్ణచేతనా*" అని చెప్తుంది. బాధ, దుఃఖం, సంఘర్షణ, నిస్పృహల తీవ్రతలు, మార్గంలో అనివార్యం కాకపోయినా సహజమేనని నాకు తెలుసు. అవి సహాయపడేవని కాదు. దేనినుంచి మనం కష్టం మీద

వెలుగులోకి పోవలసి ఉందో, మానవస్వభావానికి చెందిన ఆ అంధకారం మనమీద విధించిన ఆంక్షలు.
(*SABCL* Vol. 23, p. 789)

*

దైవం కోసం అనుభవించే తృష్ణ వేరు, నిరాశ వేరు. మొదటిది సంతృప్తిపడకపోవడంవల్ల నిరాశ తప్పక కలిగే పర్యవసానం కాదు. అది ఇంకా తీవ్రమైన పరితాపానికిగాని స్థిరనిశ్చయానికి నిరంతరకృషికీ మరింత ఆరాటంతో కూడిన పిలుపుకు, ఎన్నడూ నిరాశా నిస్పృహలతో ఒకటి కాని చిత్పురుష విషాదానికి (Psychic sorrow) గాని త్రోవ తీయవచ్చు. స్వభావరీత్యా నిరాశమబ్బు కమ్మిన మనకు, నిర్మలమైన వాతావరణంనుంచి కంటె మబ్బు మసక నుంచి వెలుగు రావటం చాలా కష్టం. నిరాశ అంతః ప్రకాశాన్ని అడ్డుకొంటుందనేది సర్వసాధారణమైన అనుభవం.

*

విషాదాన్ని ఒక వాదంగా సిద్ధాంతంగా చేయటం ప్రమాదకరం. ఎందుకంటే ఒకసారి తృప్తిపరిస్తే అది అలవాటై అంటుకుంటుంది. కొన్ని కొన్ని విషయాలు ఒకసారి అంటుకుంటే చాలు శాశ్వతంగా అతుక్కుపోతాయి!

*

నువ్వు చెప్పే విషాదం చిత్పురుషునికి (psychic) చెందింది కాదు. 'బాధాకర పరితాపం' ప్రాణికస్థితికి చెందింది తప్ప చిత్పురుష స్థితికి కాదు. చిత్పురుష స్థితి ఎన్నడూ ఆశాభంగం పొందిన కోరికవల్ల విషాదానికి లోను కాదు. కారణం అది దాని స్వభావమే కాదు. దైవాన్ని తిరస్కరించటం జరిగినప్పుడు, లేదా మానవునిలోగాని ప్రకృతిలోగాని మానసిక ప్రాణిక భౌతికస్థితి సత్యాన్నుంచి విముఖమై వికృతిని, అంధకారాన్ని అజ్ఞానాన్ని అనుసరించినప్పుడు కొన్నిసార్లు అది విషాదానికి లోనవుతుంది.

*

చిత్పురుషస్థితి సృష్టించే అసౌఖ్యం నిరాశ కాదు. పైగా అది దోషభూయిష్ఠమైన గమనాన్ని నిరాకరించే స్వభావం.

అసౌఖ్యంవల్ల నిరాశ లేదా ప్రాణిక అసంతృప్తి కలిగితే అది చిత్పురుష స్థితికి చెందింది కానే కాదు.
(*SABCL* Vol. 24, pp. 1634, 1636, 1430, 1118)

అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రరావు

అందరిలోను నిన్ను, అందరిని నీలోను చూడుము

సర్వభూతములను నీ ఆత్మగానే దర్శించుము
దేనికీ భయపడవద్దు, దేనినీ చీదరించుకోవద్దు
ఎవరికీ భయపడవద్దు, ఎవరినీ అసహ్యించుకోవద్దు
నీ కర్తవ్యాన్ని ధైర్యంగా ఘనంగా నిర్వర్తించు
నీ నిజస్వరూపాన్ని నిరూపించు
గెలిచినా, ఓడినా నీవు దైవానివే
నరకయాతన ననుభవించినా, మరణించినా కూడా నీవు దైవానివే
దేవునికి ఓటమి లేదు, మరణము లేదు
దేవుడెవరికి భయపడాలి? ఎందుకు నిరాశ చెందాలి?
దేవుడు భయంతో వణికిపోవటమా! అసంభవము
వణికేది నీ శరీరాణువులు, నీ మెదడులోని కణములు మాత్రమే
ఆ కణములలోని నీవు మాత్రము చలించవు, చెక్కుచెదరవు
నిశ్చలుడవై వాటిని గమనించెదవు
సర్వజీవులలోను నిన్నే దర్శించుము
నీలో సర్వజీవులను దర్శించుము
అప్పుడు భయము నీకు భయపడి పారిపోతుంది
బాధలు కూడ నీ దగ్గరజేరేందుకు జంకుతాయి
మృత్యువు నీ దగ్గరకు వస్తే ఎక్కడ హాతమైపోతుందోనని నీ జోలికి రాదు!
(*SABCL* Vol. 12, p. 489)

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

చివరి మాట – ఒక యథార్థ గాథ

(ఒక సాధకునికి వ్రాసిన ఉత్తరము నుంచి)

ఈ దుఃఖము, శోకము ఎందుకు? నీకో యథార్థమైన కథ చెపుతా విను.

జర్మనీ దేశపు మతప్రచారకుడైన మార్టిన్ లూథర్ గురించి నువ్వు వినే ఉంటావనుకుంటాను. ఈ ప్రచారకుడే రోమన్ కాథలిక్ చర్చి అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ ప్రొటెస్టెంట్ శాఖకు బాటవేసిన సంస్కర్త. ఒకసారి ఆయన ఏదో తెలియరాని పెద్ద మనోవేదనలో మునిగిపోయాడు. రోజుల తరబడి ఉలుకు పలుకు లేక, మొహంలో నవ్వు కూడా లేక ఉన్నాడు. ఒక రోజున అతగాడి విచిత్ర ప్రవర్తనకు విసిగిపోయిన ఆయన భార్య నల్లని దుస్తులను ధరించి శోకమును ప్రకటించే సందర్భము ఆసన్నమైనట్లుగా ఆయన ముందు నిలబడుతుంది. ఆమె భర్త ఈ దృశ్యం చూసి నిలువునా ఆశ్చర్యపోతాడు. అటువంటి దుస్తులను ఎందుకు ధరించావు అని అడుగుతాడు. సమాధానముగా "భగవంతుడు మరణించాడు గదా" అని అంటుంది.

ఈ మాటలు విన్న లూథర్ కోపంగా భగవంతుడు ఎన్నటికి మరణించడు అని బిగ్గరగా అరుస్తాడు. అప్పుడు ఆయన భార్య చాలా ప్రశాంతంగా అంటుంది. మీరు చెప్పిన విధంగానే ఆలోచిస్తే (శాశ్వత భగవత్సామ్రాజ్యములోని) ఈ ప్రపంచమందు మనిషిని కృంగదీయడానికి బలమైన కారణము ఎంతటిదైనా ఉండగలదా అనే సందేహము కలుగుతుంది. ఈ మాటలు విన్న లూథర్ స్పృహలోనికి వచ్చి తిరిగి ఎప్పుడు హృదయ దౌర్బల్యానికి లోను కాలేదు.

మూలం: అమల్ కిరణ్
అనువాదం: టి. మాధవరావు

కష్టాల నధిగమించటమెలా? ఒక కథ

ఒకసారి ఓ ముసలి గాడిద బావిలో పడిపోయి పెద్దగా కుయ్యో మొర్రో అంటూ ఓండ్ర పెట్టసాగింది. అది విన్న యజమాని దానిని ఎలా బయటకు తీసుకురావాలా అని బాధపడ్డాడు. కాని మళ్లీ అనుకున్నాడు, ఆ గాడిద ఎలాగూ ముసలిదే, ఎందుకూ పనికి రాదు. దాంతో బావినైనా పూడుద్దాము. ఆ పాతబావిని కూడా ఎలాగైనా పూడ్చేయవలసిందే. మరి గాడిదను పైకి తీసుకు రావటము ఎందుకు? అని చుట్టుప్రక్క వాళ్లందరిని పిలిచి బావిని పూడ్చటము మొదలుపెట్టాడు. అందరూ తలా ఒక తట్టా తీసు కొని బావిలో మట్టి వేయడము మొదలుపెట్టారు. విషయం గ్రహిం చిన గాడిద హృదయవిదారకంగా ఓండ్ర పెట్టటం మొదలు పెట్టింది. కాస్సేపటికి అది ఆశ్చర్యకరంగా అరవటం మానేసింది. కుతూహలంతో లోపలికి తొంగిచూసిన రైతుకు దిమ్మతిరిగింది. ఆ గాడిద తనపై పడుతున్న మట్టిగడ్డలను దులిపి కిందపడేసి వాటిమీదకెక్కి నిలబడటం మొదలుపెట్టింది. మట్టి వేస్తున్న కొద్దీ, బావి పూడుతోంది. ఇంకేముంది గాడిదకూడా పైకి రాసాగింది. బావి మట్టితో నిండేసరికి బైటకు దుమికేసి దౌడు తీసింది.

ఇందులో మనుమలకో మంచిపాఠం ఉంది. జీవితం అలా ఇలా జరుగుతూండటం మామూలే. బురద మీద పడుతూనే ఉంటుంది. మనం దానిని దులపరించేసుకొని, దాని ఆధారంగానే పైకి ఎదగటమే. మనకొచ్చే ప్రతి కష్టాన్ని నీ వికాసానికి ఒక మెట్టుగా చేసుకోవాలి. ఎంత లోతైన అగాధంలో పడ్డా జంకు లేకుండా విదిలించుకొని పైకి లేవడమే.


నీకు సంతోషం కావాలనుకుంటే ఈ ఐదు చిట్కాలు చాలు. 1) ఎదలో ద్వేషానికి చోటివ్వకు. 2) దేనిని గురించీ దుఃఖించకు. 3) నిరాడంబరంగా జీవించు. 4) ఇచ్చే బుద్ధి పెంచుకో. 5) పుచ్చు కునే బుద్ధి తగ్గించుకో.

ఆంగ్లమూలం: The Awakening Ray, Vol. 6, No. 3 The Gnostic Centre

అనువాదం: గోదావరి

సమాచార పత్రం

శ్రీఅరబిందో సొసైటీ సర్వసభ్య వార్షికసమావేశమునకు సంబంధించిన ప్రకటన ఈ సంచిక 46, 47 పుటలలో ప్రకటించబడినది. 21-23 నవంబరు 2002 తేదీలలో శ్రీఅరబిందో సొసైటి స్త్రీల విభాగమువారు "Organised Teamwork" అనే విషయంపై పాండిచేరి బీచ్చాఫీసులో ఒక సదస్సును నిర్వహించెదరు. దీనికందరు ఆహ్వానితులే. కేలెండర్లు: 2003 డెస్కు కేలండరులో పువ్వుల వర్ణ చిత్రములతో కూడిన 12 కార్డులు ఉంటాయి; శ్రీమాత చెప్పిన పుష్పముల సందేశములతోసహా గ్రీటింగు కార్డుగా ఉపయోగించేందుకు వీలుగా ఉంటాయి. వెల 50 రూ॥ పోస్టేజి అదనం. వివరాలకు, డిస్కౌంట్ విశేషాలకు NAVAVIHAN, Sri Aurobindo Ashram Pondicherry 605002; E-mail navavihan@eth.net కర్ణాటక రాష్ట్ర సమావేశములు 17-18 జూన్ తేదీలలో Sri Aurobindo Complex, J.P. Nagar Bangalore లో జరిగినవి. 40 మందికి సరిపడే ఒక అందమైన అతిథిగృహమునకు ప్రారంభోత్సవము కూడ జరిగింది. బెంగుళూరు సందర్శించే భక్తులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవచ్చును. ఉజ్జయిని (M.P) లో "శ్రీఅరవిందులు – వేదములు" అనే విషయముపై ఒక శిబిరము నిర్వహించబడినది. చెన్నైలో కిట్టు రెడ్డిగారు "India and her Destiny" అనే విషయంపై ప్రసంగించిరి. గుజరాత్ స్టేట్ కమిటీ వారు మే 9-11 తారీఖులలో శ్రీ చంపక్‌లాల్ శతాబ్ది జరుపుకున్నారు. ఓంపూరి (గుజరాత్) లో సావిత్రి మీద 5 రోజుల శిబిరము, రాజ్‌కోట (గుజరాత్) లో శ్రీఅరవిందుల యోగం మీద 4 రోజుల శిబిరము నిర్వహించిరి. వరంగల్‌లో హనుమకొండ శ్రీఅరవిందుల శాఖ ఉన్న ప్రాంతమును శ్రీఅరవిందనగర్ అనియు ఈ శాఖను, మెయిన్‌రోడ్డునుంచి కలిపే మూడుకిలోమీటర్ల రోడ్డును శ్రీఅరవిందమార్గము అనియు నామకరణము చేసిరి. తమిళ్‌నాడులో ఉదకమండలము, గోబిచెట్టిపాలెము, రామనాథపురాలలోను, రాజస్థానులోని పిలాని, చిరావాలలోను నూతన కేంద్రములు ప్రారంభించబడినవి.



7/10/02

భువిపై దివ్యజీవనము

అఖిల

అఖిల భారత పత్రిక

అక్టోబరు 2002

7/10/12

భువిపై దివ్యజీవనము

శ్రీఅరవిందుల ప్రవచనములు

విషయసూచిక

Divinisation of life means, in fact, a greater art of life; for the present art of life produced by ego and ignorance is something comparatively mean, crude and imperfect....

Sri Aurobindo

దివ్యప్రణాళిక

శ్రీఅరవిందులు

యోగమంటే ఏమిటి? మనకంటె గొప్పది సమర్థవంతమైనది అయిన దైవాన్ని కనిపెట్టటం, ఆయన చేతనను పొంది జీవితాన్ని ఆయన సారథ్యంలో నడిపించటం, ప్రస్తుతం మనస్సు ఏలుబడిలో ఉన్న ప్రాపంచిక జీవితాన్ని కూడ దివ్యచైతన్యముచే నిర్వహింప జేయించటం – ఇవియే మన లక్ష్యములు.

– సంపాదకుడు

ఆధ్యాత్మిక జీవన మెందుకు సాగించాలి?

భగవత్ సాక్షాత్కారమే పరమ లక్ష్యంగా, సత్యాన్వేషణమే పరమావధిగా ఆధ్యాత్మికజీవనాన్ని మనిషి ఎన్నుకొంటున్నాడు. భగవత్ ప్రాప్తికి ఇది ప్రక్కకు పెట్టకూడని, విస్మరించరాని, పవిత్రకర్తవ్యమై ఉన్నది. దీనికంటె ముఖ్య కార్యము వేరొకటి లేదు. దైవదర్శన భాగ్యము పొందిన వ్యక్తి, తన పరిమిత చైతన్యాన్ని అనంతదివ్యచైతన్యంగా ఉద్దీప్తం చేసుకొని, దివ్యపురుషుని లక్షణాలైన అనంత శాంతి, తేజస్సు, ప్రేమ, శక్తి, దివ్యానందము తన స్వభావములోను, నిత్యజీవితంలోను ప్రకటింపజేస్తూ, దివ్యత్వ లక్షణాలను వ్యాప్తం చేసే ఉపకరణంగా నావగా, ప్రముఖవాహకంగా వ్యవహరిస్తాడు.

దివ్యచైతన్యం మనలో వృద్ధిచెంది క్రియాశీలమగుట

మన అంతరంగచైతన్యం వికాసం చెంది ఆధ్యాత్మ సత్యంతో ప్రకాశించినపుడు మన జీవితము, చేష్టలు, దివ్యత్వంతో తాదాత్మ్యం చెంది, దివ్యత్వ ప్రేరణతో జాలువారుతాయి. ఆ దివ్యచైతన్యంతో మనం విరాజిల్లినపుడు, దివ్యత్వవెలుగును, సత్యాన్ని, శక్తిని, పవిత్రతను. దివ్య శాంతిని మనలో దింపుకొనినప్పుడు వాటి సహాయముతో అనవసర మలినాలు తొలగి, మనం దైవప్రతిరూపులమై స్వర్ణకాంతులీనే ఆత్మతేజంతో మహోజ్వలంగా ప్రకాశించగలము.

అంతరంగజీవితము, భౌతికజీవితము, దైవీసంపత్తితో మిళితమైనప్పుడు, అంతరంగసాక్షాత్కార అనుభూతి బాహ్యంగా పొంగిపొరలినప్పుడు, కేవలం మానసిక అనుభూతిగాకాక, మనిషి నడవడిలో దివ్యత్వము అనుక్షణము ప్రకటితమై ఈ జగత్తంతా భగవన్మయమై భాసిస్తుంది. అట్టి స్థితిని అందుకున్నపుడు జీవుని ఊర్ధ్వగతికి జీవేశ్వరుడు నిర్దేశించిన ప్రణాళిక నెరవేరినట్లు కాగలదు.

(*SABCL* Vol. 23, pp. 516-17)

అనువాదం: చదలవాడ వెంకటశేషయ్య

ప్రపంచం యథార్థమా? మిథ్యా?

శ్రీఅరవిందులు

'బ్రహ్మ సత్యం జగన్మిథ్య' అనే భావం మనలో చాల లోతుగా పాతుకుపోయి ఉన్నది. మన మానవనేత్రానికి అలా కనబడుతుందేకాని నిజానికి ఈ జగత్తు సత్యమే. సత్యదృష్టితో కనుక చూసినట్లయితే ఈ సృష్టి మిథ్య కాదనియు కేవలం దేవుని లీలయే అనియు తెలుస్తుంది. మరియు ఈ ప్రపంచం క్రమాభివృద్ధి చెందుతున్న దైవమే అని కూడ తేటతెల్లమవుతుంది.

– సంపాదకుడు

ప్రపంచం మిథ్య అనే వాదన నాకు అంగీకారం కాదు. బ్రహ్మ ఈ ప్రపంచంలోనూ ఉన్నాడు, ప్రపంచాతీత నిరపేక్షంలోనూ ఉన్నాడు. నిజమైన ప్రపంచస్థితిని, అనుభవంలోకి తెచ్చుకోనీకుండా మనని గ్రుడ్డివాళ్లని చేసి నిరోధించే అజ్ఞానాన్ని మాత్రం మనం అతిక్రమించాలి.

(*SABCL* Vol. 22, p. 39)

*

ప్రపంచంలో దేవుడు దాగి ఉన్నాడు

యథార్థస్థితికి అభివ్యక్తి కాబట్టి ప్రపంచం యథార్థమే. ఆ యథార్థ స్థితి ఏమిటి?అనంతుడు నిత్యుడు అయిన దైవం, అనంతము నిత్యము అయిన అస్తిత్వం, చైతన్య శక్తి, ఆనందం. తన శక్తివల్ల ఈ దైవమే ప్రపంచాన్ని సృష్టించాడు లేదా తనదే అయిన అస్తిత్వంలో అభివ్యక్తం చేశాడు. కాని ఇక్కడ భౌతికప్రపంచంలో లేదా దాని ఆధారం వద్ద తనకు వ్యతిరేకంగా కనిపించే అభావంలో, అచేతనలో, జడత్వంలో తనను తానే మరుగుపరచుకొన్నాడు. దీన్నే మనం ఈ రోజుల్లో 'అచేతన' అని పిలుస్తున్నాము. తన అచేతనాశక్తివల్ల అదే భౌతిక విశ్వాన్ని సృష్టించినట్లు కనిపిస్తుంది కాని ఇది కేవలం పైకి కనిపించే రూపమే. ఒక పరోమత్తమమైన, రహస్యమైన చైతన్యమే ఈ ప్రపంచవిధానాలన్నింటినీ ఏర్పాటుచేసి ఉండగలదని చివరకు మనం కనుగొంటాము.

దేవుని మొదటి అభివ్యక్తి

మనకు అచేతనగా కనిపించే భూమికలో దాగిన అస్తిత్వం, ప్రపంచంలో మొదట పదార్థంగా, తర్వాత జీవంగా, ఆ తర్వాత మనస్సుగా, చివరికి ఆత్మగా బహిర్గతం అవుతుంది. పైకి అచేతనగా కనిపించేది నిజానికి దైవానిదే అయిన చైతన్యశక్తి – పదార్థంలో రహస్యంగా ఉండి, జీవంలో బయటకు రావటం ప్రారంభిస్తుంది. మనస్సులో తనను గుర్తించుకోటం మొదలుపెట్టి, ఆధ్యాత్మికచైతన్యంలో తన నిజమైన ఆత్మను, చిట్టచివరకు దివ్యచైతన్యాన్ని పొందుతుంది. యథార్థాన్ని గురించి మనకు ఎరుక గలిగి, మనం అందులో ప్రవేశించి దానితో ఏకం కావటం జరుగుతుంది. దీన్ని మనం పరిణామం అని పిలుస్తున్నాం. ఇది చైతన్యపరిణామం, వస్తువులలోని ఆత్మ పరిణామం కాగా బాహ్యంలో మాత్రం అది జీవజాతుల వికాసం. అదే విధంగా ప్రారంభ అచేతనలో స్థితికి చెందిన ఆనందంగా ఉన్నదేదో అది మొదట సుఖదుఃఖాలలో విరుద్ధ రూపాలుగా బయటకు వస్తూ తర్వాత ఆత్మానందంలో లేదా ఉపనిషత్తులు చెప్పిన బ్రహ్మానం

దంలో తన్ను తాను కనుగొనవలసి ఉంటుంది. 'లైఫ్ డివైన్' లో నేను ప్రవచించిన ప్రపంచసిద్ధాంతముయొక్క కేంద్రీయభావన ఇదే.

*

ఈ ప్రపంచం దైవంయొక్క పాక్షికాభివ్యక్తి

ఏ పరిస్థితులద్వారా ఆయన తన్నుతాను ప్రకటించుకుంటాడో ఆ పరిస్థితులకాయన బద్ధుడై ఉండనవసరంలేదని 'మాయా' సిద్ధాంతం చెపుతుంది. పరిమితమైన ఈ క్రీడ ఆయన కాదు, కారణం ఆయన పరిమితులు లేనివాడు. అది కేవలం నిబంధనలుగల ఒక అభివ్యక్తి. కాని క్రీడను బంధించినట్లు నిబంధనలు ఆయనను బంధించవు. ఆయనదే అయిన ఒక రూపాన్ని ఆయన ప్రపంచంలో ప్రవేశపెట్టాడు. కాని ఆయన ఆ రూపాన్ని మించినవాడు. ప్రపంచం అయథార్థం కాదు. మిథ్య కాదు. కాని మన ప్రస్తుత దృష్టి లేదా చైతన్యం అజ్ఞానమయం కాబట్టి ఇప్పుడు మనకు కనపడుతున్న రీతిలో ప్రపంచం మిథ్య అనవచ్చు. కాని యథార్థమైన ప్రపంచాన్ని మనం చూస్తే అంటే బ్రహ్మకు పాక్షికమైన, అభివృద్ధి అవుతున్న అభివ్యక్తిగా చూస్తే అప్పుడు దాన్ని మిథ్య అనటం కుదరదు. లీల అనవలసివస్తుంది. అయినా సరే తన లీలకన్న తాను అధికుడే కాని దానిలో ఆయన ఉన్నాడు, అది ఆయనలోనూ ఉంది. ప్రపంచం భ్రమ కాదు.

(*SABCL* Vol. 22, pp. 44, 48)

*

ఆరంభంలో వేదాలలో, సమగ్ర సృజనాత్మక జ్ఞానాన్ని, సనాతన వివేకాన్ని తెలియజేసిన 'మాయా' పదం తరువాత కాలంలో వంచన, ఇంద్రజాలం, మిథ్య అనే రెండవ, నిష్పన్న అర్థాన్నే సంతరించుకోటం జరిగింది. ఈ రెండవ ప్రాముఖ్యత నిమ్నప్రకృతికి (అపరాప్రకృతికి) మాత్రమే సరిపోతుంది. తన దివ్యజ్ఞానాన్ని మరిచిపోయి నిమ్నప్రకృతియొక్క 'అహం' అనుభవంలో మునిగిపోయింది.

(*SABCL* Vol. 12, p. 82)

‘మాయ’ యొక్క మూలార్థం ‘భ్రమ’ కాదు

పైకి కనిపించే రూపాలలో ప్రపంచస్థితిని చూచినప్పుడు గాని, శుద్ధ అనంత అవిభాజ్య నిర్వికారస్థితితో పోల్చి చూచినప్పుడుగాని ప్రపంచాన్ని మాయగా చూడటం వర్ణించటం సబబే. మూలార్థంలో మాయ అంటే కలుపుకునేది, తనలో వహించేది అయిన చైతన్యం. ఇముడ్చుకోటానికి, కొలత వేయటానికి, పరిమితం చేయటానికి, ఈ కారణంగా రూపకల్పన చేయటానికి సమర్థత కలది. వస్తువులకు బాహ్యారేఖాకృతినిచ్చి, కొలమానం చేసి మూసపోసేది, మనస్తత్వాన్ని కలిగించేది, అందుమూలంగా అజ్ఞేయాన్ని జ్ఞేయం చేసి దానికి క్షేత్రగణితరూపాలు కలిగించేది అదే. పరిమితులులేని దాన్ని కొలమానం చేయదగిందిగా చేస్తున్నట్లు కనిపిస్తుంది. తర్వాత కాలంలో జ్ఞానం, నేర్పు, తెలివి అనే మూలార్థం నశించి, నీచమైన వంచన, దగా లేదా భ్రమ అనే అర్థం వచ్చింది. తాత్త్విక సిద్ధాంతాలు వ్యామోహానికి భ్రమకు ఈ పదాన్ని ఉపయోగించాయి.

(*SABCL* Vol. 18, p. 101)

అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రరావు

The divinisation of nature of which we speak of is a metamorphosis, not a mere growth into some kind of superhumanity, but a change from the falsehood of our ignorant nature into the truth of God-nature.

Sri Aurobindo

నిర్వాణమే జీవితలక్ష్యమా?

శ్రీఅరవిందులు

నిర్వాణమనగా ఈ ప్రపంచానికతీతమైన ఒక అద్భుతమైన స్థితి – మాటలలో వర్ణింపనలవికాని ఓ బ్రహ్మాండమైన అనుభూతి. శ్రీఅరవిందులు దానిని " an inexpressible Peace, a stupendous silence, an infinity of release and freedom" అని అభివర్ణించారు. కాని ఆ తరువాత ఈ ప్రపంచం పరమసత్యమని కూడా ఆయనకు అనుభూతమైంది. వారీ ప్రపంచాన్ని, అందలి వస్తువులను దివ్యచక్షువులతో దర్శించారు. అనంతకాలాన్ని అనుభవించారు.

– సంపాదకుడు

శ్రీఅరవిందుల నిర్వాణానుభూతి

నిర్వాణప్రాప్తే నా యోగానికి మౌలికమైన ఫలితం. నిర్వాణం నన్ను హఠాత్తుగా మనస్సుకు అతీతమైన మనోరహితస్థితిలో పడేసింది. ఆ స్థితిలో మనోవిజృంభణ, ప్రాణస్పందనలు లేవు; అహంకారం లేదు, దృశ్యప్రపంచం లేదు. ఇంద్రియ వ్యాపారాలన్నీ నిలిచిపోయాయి. అట్టి నిశ్చలేంద్రియాలద్వారా ఏదో మసకగా కనిపించింది. లేకపోతే ఆ కేవల మౌనస్థితిలో ఏమైనా నిలిచివున్నదేమో. ఎలా చెప్పినా అప్పుడు కనిపించిందొక శూన్యరూపాలతో నిండిన ప్రపంచం. ఆ లోకంలోనివన్నీ పదార్థ రహిత భూతఛాయలు మాత్రమే. అక్కడ అద్వితీయ పరమపురుషుడుగాని అతని మందిమార్బలంగాని లేరు. అప్పుడున్నదొక్కటే. అది కేవల తత్త్వం – అసమాన మహాతేజస్సు – నిరాకారం, అసంగం, అనిర్వచనీయం, అచింత్యం. అయినప్పటికి సంపూర్ణ సత్యం, ఏకైక సత్యం. ఈ దృశ్యం మనస్సు చూపించింది కాదు. ఊహ కల్పించింది అంతకంటే కాదు. రూపరహితమూ కాదు.

ఈ అనుభూతి అవాఙ్మానస గోచరము

అది చాలా రూఢిగా ఉంది. రూఢియైన ఏకైక సత్యం. అది మనకు కనిపించే భౌతిక

ప్రపంచం వంటిది కాదు. అయినా అది అంతటా వ్యాపించింది. అంతటా నిండింది. ఈ నామమాత్రపు భౌతికప్రపంచంపై వరదలా ప్రవహించి దాన్ని ముంచేసి వేరొకటి ఉండటానికి అవకాశం లేకుండా చేసింది. అది కాక మరొకటి వాస్తవంగా, స్పష్టంగా, వేరుగా ఉండటానికి వీలు లేకపోయింది. అప్పుడు నాకు కలిగిన అనుభవం నన్ను సంతోషంతో ఉక్కిరిబిక్కిరి చేసిందనిగాని, పారవశ్యంతో మైమరచిందనిగాని చెప్పలేము – (దానిని కొన్ని సంవత్సరాల తరువాత కలిగిన అనిర్వచనీయ ఆనందంతో పోల్చుకున్నప్పుడు) కాని ఆ అనుభవం నాకు చెప్పలేనంత శాంతి నిచ్చింది. బ్రహ్మాండమైన మౌనాన్ని ప్రసాదించింది. శరీరబంధాన్ని తొలగించి అనంతస్వాతంత్ర్యాన్ని సాధించి పెట్టింది. ఆ నిర్వాణస్థితిలో నేను రాత్రింబగళ్లు ఉన్నాను. తరువాతి స్థితిలో బాహ్యావస్తువులు చేరటం మొదలైనాయి. క్రమంగా ఆ స్థితి మారిపోయింది. కాని ఆ హృదయాంతరానుభూతి, దానిని గురించిన నిరంతర జ్ఞాపకం, ఆ స్థితిని – ఆ అనుభవాన్ని మరల పొందగల సామర్థ్యం నిలిచిపోయాయి. చివరికి అదంతా పైనుండి దిగివచ్చిన మహాచైతన్యంలో (superconsciousness) లీనమైపోయింది.

పరమపురుషానుభూతి

ఈ లోగా ఆ ప్రథమ ఆనందానుభూతితో స్వస్వరూపానుభూతి, పరమపురుషానుభూతి మేళవించాయి. ప్రారంభదశలోనే ప్రపంచం భ్రాంతి అనే భావన నాలోనుండి తొలగిపోయింది. బాహ్యాసంఘటనలలో భ్రాంతి[1] ది చాలా చిన్నపాత్ర మాత్రమే. ఆ సంఘటనలను వెనకనుండి నడిపించేది సర్వవ్యాప్త సద్రూప దివ్యచైతన్యం. వాటికి అధిష్ఠానం కూడా ఆ దివ్యచైతన్యమే. అంతేగాదు. వాటికి కేంద్రంలో నిలిచివుండేది కూడా ఆ దివ్యచైతన్యమే. ఈ ప్రాపంచిక సంఘటనలు మొదట సినిమా తెర మీద

---

[1] వాస్తవంగా దీనిని భ్రాంతి అనరాదు. ఎందుకనంటే అది నిరాధారముగాని, అసత్యముగాని యథార్థచైతన్యాన్ని మరుగుపరచేదిగాని కాదు. మనస్సు, ఇంద్రియాల తప్పుడు దృష్టే దానికి కారణము.

బొమ్మలుగాను, తోలుబొమ్మలాటలో నీడలుగాను కనిపించటం వరకే భ్రాంతి. అంతమాత్రాన ఇంద్రియవ్యాపారాలలో మరల బందీ కావటంగాని, మహత్తరమైన నిర్వాణానుభూతి తరగిపోవడంగాని, దాని నుండి జారిపోవటంగాని జరుగలేదు. ఆ నిర్వాణానుభూతి ఇంకా పెరిగి విస్తృతమైంది. చైతన్యమే వస్తువులను చూస్తుంది కాని ఇంద్రియాలు కావు. అనంతచైతన్యంలోని శాంతి, నిశ్చలత, స్వేచ్ఛ నాలో శాశ్వతంగా నిలిచిపోయాయి. ఈ లోకంతో పాటు సర్వలోకాలు పరమేశ్వరుని కాలాతీత శాశ్వతత్వంలో కొనసాగే నిరంతర సంభావ్యములు మాత్రమేనని తెలిసివచ్చింది.

Only the illimitable Permanent
Is here. A Peace stupendous, featureless, still,
Replaces all, – what once was I, in It
A silent unnamed emptiness content
Either to fade in the Unknowable
Or thrill with the luminous seas of the Infinite.

(From Sri Aurobindo's sonnet "Nirvana")

నిర్వాణం దివ్యజీవనానికి మెట్టు

ఇంతకీ నిర్వాణమంటే ఏమిటి? సాంప్రదాయ బౌద్ధం నిర్వాణాన్ని "విచ్ఛిన్నం" (disintegration) అంటుంది. ఇక్కడ విచ్ఛిన్నమయ్యేది ఆత్మ కాదు. ఎందుకంటే బౌద్ధం ఆత్మ అనబడేది ఉన్నదని అంగీకరించదు. బౌద్ధం ప్రకారం మనిషి అంటే మనోశరీరాల సంపుటి మాత్రమే. కాబట్టి నిర్వాణమంటే మనిషిలో చెప్పబడే పంచస్కంధ (ఖండ) సముదాయ విచ్ఛిన్నం.[2] ఇక మాయావాద వేదాంతం నిర్వాణాన్ని విచ్ఛిన్నమనిగాక అంతర్ధానమగుటగా వర్ణిస్తుంది. ఇక్కడ శరీరమంతా తాదాత్మ్యము చెందిన మిథ్యారూప, అసత్య, వ్యష్ట్యాత్మ

---

[2] ఈ పంచస్కంధాలు ఏమంటే మానసికములైన వేదన, సంజ్ఞ, సంస్కార, విజ్ఞానస్కంధములు, శారీకమైన రూపస్కంధము. — అనువాదకుడు

పరమాత్మ లేక బ్రహ్మములో లీనమై అంతర్ధానమవుతుంది – అంతరిస్తుంది. ఇక్కడ అంతరించేది వ్యష్టిభావన, వ్యష్టి అనుభవం. వేరొక విధంగా చెప్పాలంటే మిథ్యాకాంతి సత్యవెలుగును చేరి ఆరిపోతుంది (నిర్వాణం చెందుతుంది). వ్యష్టిభావన సంపూర్ణంగా పరమాత్మలో – అఖండచైతన్యంలో ఐక్యమై నశించటమే నిర్వాణమని ఆధ్యాత్మికానుభవం ద్వారా తెలుస్తుంది. నిర్వాణానంతరం వ్యష్టాత్మ విశ్వచైతన్యానికి, విశ్వశక్తికి, విశ్వకర్మలకు ఒక కేంద్రంగా లేక మాధ్యమంగా మాత్రమే నిలిచి ఉంటుంది. వ్యష్టిభావన పరమాత్మ – పరాచైతన్యంలో లీనమై నశించినట్లు అనుభవమైనప్పుడు అహం (నేను), ఇదం (ఈ విశ్వము) అను ద్వైతభావం సమసిపోతుంది. లేక అప్పుడు వ్యష్టాత్మ తాను విశ్వాత్మనని తెలిసికొని విశ్వకర్మలను సమర్థించును. అయితే మనం దేనిని వ్యష్టాత్మ అంటాం? ప్రకృతి తాను మనస్సు, శరీరముల ద్వారా కర్మ చేయటానికి ఆ రెంటిని అనుసంధానం చేసే సూత్రం లేక సాధనం ఒకటి కన్పిస్తుంది. ఆ సాధనానికే సాధారణ అహంకారం లేక మిథ్యాత్మ అని పేరు. ఈ అహంకారం నిర్మూలింపబడనిదే సంపూర్ణ విముక్తి సంభవించదు. అయితే నిజంగా వ్యష్టాత్మ లేక జీవాత్మ అనబడేది ఈ అహంకారం – శరీరంతో తాదాత్మ్యము చెందిన ఈ మిథ్యాహంత కాదు.

మనిషి యథార్థస్వరూపము

జీవాత్మ వాస్తవంగా ఆధ్యాత్మికపురుషుడు (పురమనబడే శరీరంలో నివసించే స్వప్రకాశ చైతన్యస్వరూప ఆత్మ). అతనిని దివ్యపురుషునిలోని శాశ్వతాంశగా వర్ణించవచ్చు. అతడే అనేకంగా (అనేక శరీరాలలో) అభివ్యక్తమౌతున్న దివ్యపురుషుడు (స్వప్రకాశ చైతన్యము, దేవుడు). మనం అహంకారాన్ని తొలగించుకొని, నేను వేరుగానున్నాననే మిథ్యాభావనను పోగొట్టుకొని సర్వవ్యాపక దివ్యపురుషునితోనూ, సర్వప్రాణులతోనూ ఏకత్వానుభూతిని పొందినప్పుడే ఈ దివ్యమానవుడు సంపూర్ణ సత్యంగా ఆవిర్భవించగలడు. దివ్యమానవుని ఆవిర్భావమువలననే దివ్యజీవనము ప్రాప్తించగలదు. నిర్వాణము దివ్యజీవనానికి సోపానం

వంటిది. మిథ్యారూప వేర్పాటువాద వ్యష్టిభావనను తొలగించు కొననిదే మనము మన యథార్థ శాశ్వత దివ్యాత్మను సాక్షాత్క రించుకొని ఆ దివ్యాత్మలో దివ్యభావనతో జీవించుట సంభవిం చదు. మనం ఈ ప్రపంచంలోనే ఈ దివ్యజీవనం చేయవచ్చు.

*

మనకు కావలసినది ఋత్-చిత్ అనబడే మహాచైతన్యము

మనస్సు, వాంఛాలోలిత ప్రాణికము చేరి ఇహలోక జీవితాన్ని సర్వనాశనం చేసాయి. ఇంతకంటె మంచి జరిగే అవకాశం లేకపోతే ఈ ప్రపంచంనుండి తప్పుకోవటమే శ్రేయస్కరం. కాని నా అను భవం ప్రకారం మనస్సే చైతన్యానికి పరాకాష్ఠ కాదు. సాధారణ మనస్సుకు అతీతంగా వేరొక తత్త్వం (మహామనస్సు అనబడేది) ఉన్నది. సాధారణ మనస్సుది అజ్ఞాన చైతన్యం కనుక దాని భావాలు తప్పులుగాని, తప్పొప్పులు మిశ్రమంగాను, అసంపూర్ణం గాను ఉంటాయి. మనోభావాలు ఒకవేళ నిజమైనా కూడా అవి సత్యానికి పాక్షికప్రతిబింబాలేగాని పూర్ణసత్యాలు కానేరవు. కాని ఋత—చైతన్యమనేది ఒకటున్నది. అది స్థితిశీలము, అంతర్విచార శీలము అయినదేగాక, సృజనశీలత, క్రియాశీలతలు కలది. మహా మనస్సుయొక్క లక్షణమైన ఋత—చైతన్యం సాధించి దానివలన వస్తువుల యథార్థస్వరూపం తెలుసుకోవాలనేదే నా అభిమతం. అంతేగాని దగ్గర దారిన అజ్ఞానయుతమనస్సు ద్వారా వస్తువు లను గురించి తప్పుగా తెలుసుకోవటం కాదు.

(*SABCL* Vol. 22, pp. 49-50)

అనువాదం: డా॥ కోట వేంకటేశ్వరరావు

మన జీవిత పరమావధి

శ్రీఅరవిందులు

మనిషి ఇతరప్రాణులవలెనే కేవలం జన్మనెత్తి బ్రతికినన్నాళ్లు బ్రతకటమేనా, లేక అతని జన్మకు మరొక పరమోద్దేశమేమైనా ఉన్నదా? ఉన్నది. అతనికి ఈ భూలోకచరిత్రలోనూ, దాని పరిణామములోనూ చాల కీలకమైన పాత్ర ఉన్నదని శ్రీఅరవిందులు తన 'దివ్యజీవనము' లో చాల స్పష్టంగా చెప్పేరు. మనిషి యొక్క మనోప్రాణికదైహికముల ప్రస్తుత స్వరూపమే వాటి శాశ్వత స్వరూపము కాదు. అవన్నియు పరిణామము చెందాలి. వాటి నిజస్వరూపమును పొందాలి. మానవ మానవుడు దివ్యమానవుడిగా మారాలి. మర్త్యమానవుడు అమృతపుత్రునిగా పరిణమించాలి. దీనిని గురించిన వివేచన ఈ వ్యాసంలో చదవండి.

— సంపాదకుడు

మానవజన్మ పరమోద్దేశము

మానవుడు తన మనుగడ ఈ ప్రపంచంతోనే ముడిపడి ఉందని నిర్ధారించుకోవటం అతని ప్రథమకర్తవ్యం. అంతటితో సరిపోదు. అతడు పరిణామం చెంది తన ప్రస్తుత అజ్ఞానయుత మానసికస్థితిని అధిగమించాలి. తన శరీరానికే పరిమితమైన ఆత్మను (జీవాత్మను) విశ్వాత్మ (పరమాత్మ) గా విస్తృతపరుచుకోవాలి. తన పరిమిత చైతన్యాన్ని (జీవచైతన్యాన్ని) విశ్వచైతన్యంగా పరిపూర్ణం చేసుకోవాలి. తన పరిసరాలపై ఆధిపత్యాన్ని, విశ్వమంతటితో ఐక్యతను, సామరస్యాన్ని సాధించాలి. అతడు తన వ్యష్టాత్మ (జీవాత్మ) సాక్షాత్కారంతోనే సంతుష్టిచెందక దానిని పరమాత్మతో ఐక్యం చేసి అట్టి అనుసంధానఫలమైన విశ్వజనీయ ఆధ్యాత్మికానందం అనుభవించాలి. అతని మానసిక ప్రవృత్తి అస్పష్టత, అనృతాజ్ఞానాలను తొలగించుకొని పవిత్రమైందిగా పరివర్తన చెందాలి. అతని యథార్థప్రకృతి (స్వభావము) యొక్క స్పష్టమైన ఉద్దేశమేమిటంటే అతడు చివరకు తన దేహా

ప్రాణమనస్సులు కల్పించిన బంధములను దాటి స్వతంత్రుడై విశ్వ మంతటితో సామరస్యము సాధించి తన జ్ఞాన, సంకల్ప, భావ, కర్మ, ప్రవర్తనములను తేజోవంతము చేసుకోవాలనేదే. సృజనాత్మకశక్తి అతని బుద్ధికి నిర్దేశించినది, మనోద్రవ్యానికి ప్రాణ ద్రవ్యానికి అవసరమని భావించినదైన లక్ష్యం అదే. అతడు విశ్వాత్మగా ఎదిగి విశ్వచైతన్యాన్ని సాధించినప్పుడే ఈ ఆశయం సిద్ధించగలదు.

ఆత్మోన్నతి, ఆత్మచరితార్థత

అతని ప్రస్తుత మిథ్యాప్రకృతి ద్వారా పాక్షికంగానూ, అప్పుడప్పుడు మాత్రమే ప్రకటింపబడుతూ అతని చైత్యతత్వములో మరుగునపడి ఉన్నదంతా[3] స్వయంచోదితమై స్వయంవికాసము చెంది పరిపూర్ణమై అతని వ్యక్తిగతజీవితంలో కూడా అభివ్యక్తము కావాలనేదే అతడు మానవుడుగా జన్మించడంలోని పరమోద్దేశం. ఈ ఆశయసిద్ధికి మానవుడు నానావిధ విశ్వసంఘటనల నెదుర్కొనుచు భూమిపైనే నివసించాలని విధింపబడింది. పాంచభౌతికదేహము, పరిమిత మనస్సులలో బందీయైన ఈ అశాశ్వత అల్పాహంత స్థూలశరీరాభిమానియై జీవితం గడుపుచున్నాడు. అతడు యథార్థ ఆంతరిక మానవునిగా రూపొంది తన మనోదేహములపైనను పరిసరములపైనను ఆధిపత్యము సాధించి చివరకు విశ్వపురుషుడు కావాలి. తత్త్వశాస్త్రపు పారిభాషిక పద జాలాన్ని విడిచి సూటిగా చెప్పాలంటే సామాన్య మానవుడు దివ్యమానవునిగా పరిణామం చెందాలి. మృత్యుగ్రస్తులైన మానవులు తాము అమృతపుత్రులమని తెలుసుకోవాలి. ఈ కారణము వలననే మానవజన్మ పరిణామప్రక్రియలో ఒక ముఖ్యమైన మలుపుగాను భూలోకపరిణామంలో కీలకమైన దశగాను వర్ణించబడింది.

---

[3] స్వప్రకాశజ్ఞానము, సత్యసంకల్పము, సర్వవ్యాపకత్వము, సూక్ష్మత్వము, సర్వకర్మప్రవృత్తి, కామనారాహిత్యము, మౌనము, అసంభ్రమము మొదలైనవి. (ఛాందోగ్యోపనిషత్తు, 3-14-2) — అనువాదకుడు

దీనిని బట్టి తెలిసేదేమిటంటే మనం సంపాదించవలసిన జ్ఞానం కేవలం బుద్ధికి చెందిన తార్కికజ్ఞానం కాదు. తనను, ప్రపంచాన్ని గురించిన స్థైన నమ్మకాలు, అభిప్రాయాలు, సమాచారము కూడా కాదు. ఇవన్నీ మనస్సుయొక్క పై పొరలకు చెందిన జ్ఞానం మాత్రమే. దేవుణ్ణి, మనల్ని, ప్రపంచాన్ని వేరు వేరని భావిస్తూ వాటిని గురించి మానసికంగా కల్పించుకున్న దంతా దైనందిన జీవితంలో నిశ్చయాలు చేయటానికి ఎంత ఉపయోగపడినా అది ఆత్మజ్ఞానం కానేరదు. దానివలన మనం అమృతపుత్రులమని తెలుసుకోలేం. ప్రాచీనభారతీయ తాత్త్విక చింతన ప్రకారం ఇంద్రియాల ప్రమేయం లేకుండా అంతరబోధ ద్వారా గడించిన ప్రత్యక్షానుభూతికే జ్ఞానమని పేరు. ఆ పరమ సత్యమును తెలిసికొని, చిదాత్మస్వరూపుడైనవాడే జ్ఞాని అన బడును. అందువలన సత్యధర్మములను గురించి మన బుద్ధికున్న అభిప్రాయాలకు లేక (నైతిక, ప్రాణిక, విజయములద్వారా మనము గడించిన) ప్రాపంచిక జ్ఞానమునకు అనుగుణముగా మన వ్యవహారిక జీవితమును, దైనందిన కర్మకలాపమును రూపొందించు కొనుటయే మన జీవిత పరమావధి కాదు, కాజాలదు. మన జీవిత లక్ష్యము మనము సద్రూపిగాను, చిద్రూపిగాను ఎదిగి ఆ రెండిటి సామరస్య ఆనందరూపమును పొందుట అనగా సచ్చిదానంద పరబ్రహ్మస్వరూపుల మగుటయే.

All our existence depends on that Existence, it is that which is evolving in us; we are a being of that Existence, a state of consciousness of that Consciousness, an energy of that conscious Energy, a will-to-delight of being, delight of consciousness, delight of energy born of that Delight: this is the root principle of our existence. But our surface formulation of these things is not that, it is a mistranslation into the terms of the Ignorance. Our I is not that spiritual being which can look on the Divine Existence and say, "That am I"; our mentality is not that spiritual conscious-

ness; our will is not that force of consciousness; our pain and pleasure, even our highest joys and ecstasies are not that delight of being. On the surface we are still an ego figuring self, an ignorance turning into knowledge, a will labouring towards true force, a desire seeking for the delight of existence....

To exceed ego and be our true self, to be aware of our real being, to possess it, to possess a real delight of being, is therefore the ultimate meaning of our life here; it is the concealed sense of our individual and terrestrial existence.

(*SABCL* Vol. 19, pp. 684-86)

అనువాదం: డా॥ కోట వేంకటేశ్వరావు

మానవజీవనం దివ్యీకరణమనగా ఏమి?

శ్రీఅరవిందులు

ప్రాపంచిక జీవితము కుక్కతోక లాంటిది. ఎన్ని మాట్లు సరిచేసినా మళ్లీ వంకరైపోతుంది. ఈ భూమిని దివ్యధామముగా మార్చే యాలని శ్రీఅరవిందుల నిరంతర తపన. మనం ప్రాపంచిక జీవితాన్ని నిరసించరాదు. మన దృష్టిని అజ్ఞానాంధకారాల నుండి మరలించి దివ్యజ్యోతిస్స్రీమలవైపు తరలించాలి. అంతే కాదు, ఆ దివ్యజ్యోతిలో స్నాతయై మానవుడిని ప్రక్షాళనం గావించి మానవశరీరాన్ని పరివర్తింపజేసి దివ్యదేహధారణ గావించాలి. మానవుని దివ్యీకరణమనగా ఇదే. ఇది ఒక స్వప్నమో లేక ఊహాగానమో కాదు. నిజంగా జరగబోయే సత్యము.

– సంపాదకుడు

మానవజీవితాన్ని నిరసించరాదు

మానవజీవితాన్ని నిరసించమని నీకెవరు చెప్పారు? కొన్ని దివ్యమైన అంశాలకు నేను ప్రాధాన్యమిచ్చిన మాట నిజమే. అంతమాత్రాన మానవ సంబంధమైన ప్రతి విషయాన్ని నేను తిరస్కరించానని అనుకోవటం చాలా పొరపాటు. దివ్యీకరణం (divinisation) అనగా మానవజీవితానికి సంబంధించిన ప్రత్యంశమును ధ్వంసంచేయడం కాదు. వాటిని చేపట్టి, వాటి పరిపూర్ణత్వానికి మార్గమేదో చూపించడం, ప్రక్షాళన, పరిపూర్ణత్వం ద్వారా వాటిని వాటి పూర్ణశక్తి, ఆనందం వైపు సముద్ధరించడం, భువన జీవనసర్వస్వాన్ని దాని పూర్ణశక్తి, ఆనందాలకు సముద్ధరించడం. – ఇదీ దివ్యీకరణం అంటే.

దివ్యాగ్ని ప్రజ్వలితం

Divinisation of life means, in fact a greater art of life. అహంకారం, అజ్ఞానం సృష్టించిన వర్తమాన జీవనం క్షుద్రమైనది, అపరి పూర్ణమైనది, అల్పమైనది (మామూలు మానవమనస్సుకు ప్రాణికానికి మరింతగా ఆకర్షించే కళ, సంగీతం, సాహిత్యం వంటి నిమ్న రూపాల వలె). It is by a spiritual and psychic opening and refinement that it has to reach its true perfection. దానిని దివ్య జ్యోతిస్సులో, అగ్నిశిఖలో ప్రజ్వలితం చేసినప్పుడు మాత్రమే ఇది సాధ్యం. దివ్యఅగ్నిశిఖలో, దివ్యజ్యోతిస్సులో దానికి పట్టిన దట్టమైన తుప్పు వదిలిపోయి, శుద్ధమైన లోహంగా మెరుస్తుంది.

చైత్యపురుషుని వెలుగులో ప్రక్షాళనం

దురదృష్టవశాత్తు ఇందుకు ప్రతిఘటన ఉంది. తమస్సుతో కూడిన మొండి ప్రతిఘటన అది. అందువల్ల యోగసాధనలో ఒక వ్యతిరేక అంగం చోటుచేసుకుంది. యోగ మార్గానికి అడ్డంగా నిలిచే రూపాలను తిరస్కరించడం, ఈ నిరుపయోగ, క్షుద్రరూపాలు అదృశ్యమయ్యేటట్లు వాటిపై వత్తిడి తేవడం, ఉపయోగకరమైన, అపరిపూర్ణ రూపాలపైన వత్తిడి తేవడం, వైకల్యం చెందిన రూపాలు తమ నిజమైన యథాపూర్వ చలనాలను అలాగే ఉండేటట్లు, లేదా తిరిగి పొందడానికి వత్తిడి

తేవడంవంటి వ్యతిరేక గుణాలు యోగసాధనలో చోటు చేసుకున్నాయి. ప్రాణికానికి ఈ వత్తిడి బాధగా ఉంటుంది. ఎందుకంటే అది తమస్సులో కూరుకొనిపోయి ఉంటుంది. దానికి అర్థం కాదు. మరొక విషయం ఏమిటంటే, తమ క్షుద్రకదలికలకు తమను వదిలివేయాలని, తమలో మార్పు రాకూడదని కోరుకునే కొన్ని భాగాలు ప్రాణికంలో ఉన్నాయి. అందువల్లనే చైత్యపురుషజోక్యం సహాయకారిగా ఉంటుంది. ఈ చైత్యపురుషునికి సంతోషప్రదమైన విశ్వాసం, వెంటనే అర్థంచేసుకోగల తత్వం, ప్రతిస్పందన, సహజసిద్ధమైన సమర్పణభావం ఉన్నాయి. గురువు స్పర్శ సహాయకారే కాని, గాయపరచేది కాదని లేదా రాధలాగ దివ్యప్రియుడు ఏమి చేసినా, అది దివ్య ఆనందానికే దారితీస్తుందని దానికి తెలుసు.

అయితే ఈ వ్యతిరేక (negative) చలనాలను దృష్టిలో పెట్టుకుని యోగసాధనను అంచనా వేయకూడదు. ఎప్పుడూ కూడా సానుకూల (positive) పార్శ్యం నుండే దానిని గుర్తించాలి. ఎందుకంటే ఈ ప్రతికూలభాగం తాత్కాలికం, సంధి దశ లాంటిది. అది అంతర్ధానం అవుతుంది. మన ఆదర్శపథంలో భవిష్యత్తుకు పురోగమించడంలో సానుకూలమైన అంశాలు మాత్రమే ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. ఒకవేళ నువ్వు ప్రతికూల పార్శ్యానికి, సంధిదశకు సంబంధించిన పరిస్థితులే భవిష్యత్తువైపు కదిలే నియమంగా, యోగసాధనకి సూచికగా తీసుకుంటే, అది దారుణమైన తప్పిదం అవుతుంది. పూర్ణయోగం జీవితాన్ని, భగవంతునికి సాధకులకు మధ్యగల సన్నిహితత్వం, ప్రగాఢ సామీప్యతలను తిరస్కరించడం కాదు.

భౌతికంలోను, ఇతర భూమికలలోనూ భగవంతునికి, సాధకులకు మధ్య అత్యంతఘనమైన సాన్నిహిత్యాన్ని, సాయుజ్యాన్ని సాధించటం, జీవితంలో అత్యంత దివ్యాతి దివ మైన విశాలత్వం, పూర్ణత్వం, ఆనందాన్ని సిద్ధింపచేసుకోవడమే ఈ పూర్ణయోగలక్ష్యం

(*SABCL* Vol. 22, pp. 124-26)

అనువాదం: యజ్ఞన్న

రూపాంతరీకరణము – దాని ఆవశ్యకత

శ్రీఅరవిందులు

మనము క్రిందిలోకాలలో నివసిస్తూ పైలోకాల చైతన్యాన్ని పొంది తద్వారా ఈ భూలోకజీవితపు స్వరూపము మార్చుటయే రూపాంతరీకరణ యోగము. సాధారణంగా సాధకుడు పైకి వెళ్లినప్పుడు ఉన్నతచైతన్యాన్ని పొంది అందులో ఓలలాడుతాడు. కాని కళ్లు తెరవగానే ఈ మాయదారి మనస్సు అతనిని వేధిస్తుంది. ఈ మనోప్రాణికదైహికముల పాతరూపాలను రూపుమాపి వాటిని పునర్నిర్మాణము గావించుట – దీనినే రూపాంతరీకరణమని అంటున్నాము. – సంపాదకుడు

ఉన్నతచైతన్యం సమర్థవంతమైనది

ఉన్నతమైన చైతన్యస్థాయిలో ఎల్లప్పుడూ సాధకుడు ఉండగల్గితే, అది చాలామంచిదే. కాని ఎందుకు సాధకుడు ఆ స్థాయిలో ఉండలేకపోతున్నాడు? మానవప్రకృతిలో నిమ్నస్థాయి కూడా ఒక భాగమే. అది సాధకుడ్ని తన వైపు లాక్కుంటుంది. ఈ నిమ్నప్రకృతిని గనుక పరివర్తింపజేసినట్లయితే (Transformation), అది ఉన్నతప్రకృతితో ఒక్కటై పోతుంది. ఇక సాధకుడ్ని నిమ్నస్థాయిలోకి దిగజేర్చే స్థితి ఉండదు.

మనోదైహికముల రూపాంతరీకరణము

ఉన్నతచైతన్యాన్ని, ఉన్నతప్రకృతిని, మనస్సు, ప్రాణికం, శరీరంలోకి అవరోహింపచేసి, ఆ ఉన్నత ప్రకృతి నిమ్నశ్రేణిని ఆక్రమించడం – ఇదే పరివర్తన అంటే. మనలోని నిజమైన ఆత్మయొక్క ఉన్నతచైతన్యం ఒకటి ఉంది. అది ఆధ్యాత్మికం. కాని అది పైన ఉంటుంది. సాధకుడు అందులోకి అధిరోహిస్తే, అక్కడ ఉన్నంతకాలం స్వేచ్ఛగా ఉంటాడు.

కాని మనస్సు, ప్రాణికం, శరీరంలోకి దిగివస్తే, లేదా వాటిని ఉపయోగించుకుంటే, సాధకునికి జీవితంతో సంబంధం ఉంటే, క్రిందిస్థాయిలోకి దిగివచ్చి, సాధారణ చేతనతోనైనా ప్రవ

ర్తించాలి లేదా ఆత్మలోనే జీవిస్తూ మనస్సు, ప్రాణికం శరీరాలను ఉపయోగించుకోవాలి. ఈ ఉపకరణాల అపరిపూర్ణతలను భరించి, సవరించుకోవాలి. అది పరివర్తన ద్వారా మాత్రమే సాధ్యము.

ఉన్నతచైతన్యంలోకి కొద్దిగా అధిరోహించానని అంటున్నావే కాని నువ్వు ఎక్కడికి అధిరోహించావు? ప్రశాంత మనస్సులోనికా? ప్రాణికం, మనస్సుకు అతీతంగా నిత్యం ప్రశాంతం, స్వచ్ఛములో, స్వేచ్ఛాయుతమైన భూమికలోకా?
(*SABCL* Vol. 24, p. 1143)

*

పరివర్తన అంటే ప్రకృతిలో ఏదో ఒక మార్పు అని అర్థం కాదు. సాధువు జీవితం, నైతికాభివృద్ధి, యోగసిద్ధులు (తంత్రసిద్ధులు) చిన్మయ (transcendent) శరీరం – ఇవన్నీ పరివర్తవ క్రిందకు రావు.

పరివర్తన అనే పదాన్ని నేనొక ప్రత్యేక విశిష్టార్థంలో వాడాను. పరిపూర్ణమైన, విప్లవాత్మకమైన (radical) చైతన్యపరివర్తన అది. మరింత మహనీయమైన, ఉన్నతమైన శ్రేణికి చెందిన చైతన్యరూపాల ఆధ్యాత్మిక పరిణామవికాస మార్గంలో శక్తివంతమైన, భరోసాతో కూడిన ఒక పురోగతిని సాధించడానికి ఉద్దేశించినది ఈ పరివర్తన. ప్రాణిక, భౌతికజగత్తులో మొదటిసారిగా ఒక మానసరూపం (ఒక మనోజీవి) అవతరించినప్పుడు సంభవించిన పూర్ణత్వం, విశాలమైన పురోగమనాన్ని మించినది ఈ పరివర్తన.

*

పూర్ణయోగంలోని కొన్ని ప్రత్యేక ఆధ్యాత్మిక భావాలను, ఆధ్యాత్మిక సత్యాలను ప్రకటించడానికి ఈ 'పరివర్తన' అనే పదాన్ని నేను వాడాను. కాని ప్రజలు ఆ భావాలను (పదాలను) తీసుకుని, నేను చెప్పిన దానికి సంబంధమేలేని విధంగా ఇష్టం వచ్చిన రీతిలో వాడుకున్నారు. పరమాత్మ ప్రభావంతో మానవస్వభావాన్ని ప్రక్షాళితం చేయడం 'పరివర్తన' కానే కాదు.

ఆ మాటకు చాలా అర్థాలున్నాయి. సర్వసాధారణంగా దానికి నైతికపరమైన అర్థం చెబుతూంటారు. అది నా లక్ష్యానికే విరుద్ధం. ఆధ్యాత్మికపరివర్తన నా ఉద్దేశ్యంలో క్రియాత్మకమైనది (dynamic) (ఆత్మవిముక్తి, పరమాత్మ సాక్షాత్కార సిద్ధి మాత్రమే కాదు. ఎటువంటి అవరోహణ లేకుండా వాటిని సాధించవచ్చు). మన చైతన్యంలోని ప్రతి భూమికలోనూ, అవచేతన (subconscient) తో సహా క్రియాత్మకము అయిన ఆధ్యాత్మిక చైతన్యాన్ని సిద్ధింపచేసుకోవడం. కేవలం ప్రక్షాళన (purification), మనస్సు, హృదయాలలో జ్ఞానప్రకాశం నింపడం, ప్రాణికంలో శాంతిని నెలకొల్పడంవంటి ప్రక్రియలతో మాత్రమే చైతన్యాన్ని వదిలి వేసి, ఆత్మప్రభావంతో ఈ పని సంభవం కాదు. మన చైతన్యం లోని అన్ని విభాగములలోకి క్రియాత్మకము స్థావరము (dynamic and static) అయిన దివ్యచైతన్యాన్ని అవరోహింప చేసుకోవాలి. మన వర్తమాన చైతన్యం స్థానంలో దానిని నింపివేయాలి. అది పరిపూర్ణంగా అవరోహించినప్పుడు మాత్రమే తెర తొలగి పోతుంది. మిశ్రమ జీవనసరళి మాయమవుతుంది. సంపూర్ణ ఆధ్యాత్మిక పరివర్తన సాధ్యమవుతుంది.

*

దివ్యజ్యోతి శక్తి సత్యములు

పాపపంకిలమైన జీవనంనుండి పుణ్యప్రదమైన ఋషి తాపసిక జీవితంగా పరిణమించడం పరివర్తన కాదు. అజ్ఞాన శాపగ్రస్తమైన నిమ్నప్రకృతి నుండి, అజ్ఞానతీరాలకు అతీతంగా తేజస్సు, శాంతి, సత్యం, దివ్యశక్తి, ఆనందంతో ప్రదీపించే దివ్య ప్రకృతిలోకి పరివర్తన చెందడం. అది బౌద్ధిక కాంతిరేఖ కాదు; మానస సూర్యబింబం వెదజల్లే వెలుగు కాదు; ఆధ్యాత్మిక, బౌద్ధిక వలయాతీతమైన, అతిమానస మహోరోచిస్సు. అది ముక్తపురుషుని జీవనతత్వం కాదు. అది దివ్యచేతనా మహాత్వం, ఆత్మ తత్వం, (soul-hood) స్పృహతో కూడిన ఆత్మత్వం, దైవత్వం. (divine-hood) (ఇక్కడ శ్రీఅరవిందులు సొంతంగా coin చేసిన మాటలు వాడారు.)

శుద్ధ నిర్మల ఆత్మశుద్ధత్వం ఈ పరివర్తన లక్ష్యం. మహోత్కృష్ట పరాత్పర ప్రకృతి శుద్ధత్వం, దివ్యత్వం కూడా ఈ పరివర్తన లక్ష్యంలోని భాగాలు.

(*SABCL* Vol. 22, pp. 98, 115-16, 129, 130)

*

శాంతి అవరోహణ, మహాశక్తి అవరోహణ, దివ్యతేజస్సు అవరోహణ, ఆనంద అవరోహణ – ఈ నాలుగూ మానవప్రకృతిలో పరివర్తన తీసుకునివస్తాయి.

(SABCL Vol. 24, p. 1170)

అనువాదం: కె. యజ్ఞన్న

బాహ్యజీవితంలోకూడా యోగము ఫలించుట

శ్రీఅరవిందులు

నీకు దేవుడెప్పుడు కనపడతాడు? బాహ్యప్రపంచాన్ని వీడి అంతరంగికంలోకి ప్రవేశించిన సమాధిస్థితిలోనే కదా. కాని మనం జీవితంలో, నిత్యకృత్యంలో కూడా దైవాన్ని సిద్ధించుకోవాలి. ఇది చాలా అద్భుతమైన విషయము – ఆధ్యాత్మిక చరిత్రలో నూతనము. ఇదెలా సాధ్యము? పైస్తరములలో ఒక సమర్థవంతమైన శక్తి – విజ్ఞానము (supramental) ఉన్నది. సాధనవలన దానినందుకోవాలి. అంతేకాదు. ఆ వెలుగును, శక్తిని భూలోకంలోని తీసుకొని రావాలి. దానినిక్కడ స్థాపించాలి. అప్పుడే భూలోకాన్ని పరిపాలిస్తున్న నిమ్నశక్తులను ఓడించటం, ఇహలోకజీవితాన్ని దివ్యము చేయుటం సాధ్యమవుతుంది.

– సంపాదకుడు

మానవుని సాధారణ జీవితం

"యోగం మాట ఎత్తకుండా మామూలుగా అందరికిమల్లె బ్రతికి ఉన్నట్లయితే నేనెన్నో విజయాలు సాధించి పేరుప్రతి

ష్టలు సంపాదించి ఉండేవాడ్ని. అది కూడా గొప్పే కదా" అని నువ్వు నన్ను సవాలు చేస్తున్నావు. నువ్వు వర్ణించిన తీరు చూస్తూ ఉంటె అది నిజమేనేమో అనిపిస్తోంది కూడ. కాని ఎంత పేరుప్రతిష్టలు సంపాదించినప్పటికి దానివలన నిజమైన తృప్తి, శాశ్వతమైన సౌఖ్యము కలగవు. ఎవరో మాములు పాటక జనాలు, అంతకంటె గొప్ప ఆదర్శాలులేని అల్పులు మాత్రమే అలా తృప్తిపడి సంతోషిస్తూ ఉంటారు. కాని వాళ్లు కూడ చివరకు విసిగి వేసారిపోతారు. దుఃఖము, అనారోగ్యము, అసంతృప్తి ఒకటేమిటి సమస్తమైన జాడ్యాలు కలిగి ఆ మాత్రము సుఖాన్ని గూడ విచ్ఛిన్నపరుస్తాయి. శోకము, మృత్యువు నీకోసం వేచి ఉంటాయి. అనాదిగా మనిషి సుఖసంతోషాలని భ్రమపడుతున్నది, ఎక్కడెక్కడ పోగొట్టుకుంటానో అని నువ్వు భయపడుతున్నది, ఈ మాయదారి సుఖాన్నే కదా!

దుఃఖాన్ని అంటిపెట్టుకొని ఉండటం

మరి నువ్వు మానవుని మామూలు విజయాలను గురించి అంత గొప్పగా అనుకుంటున్నావే – చివరికి దుఃఖమే దాని పర్యవసానమని నీకు తెలియదా? ఈ ప్రాణికము చాలా చిత్రమైనది "నాకు ఇంతకంటె గొప్పదైన దివ్యచైతన్యము వద్దు. నేనీ మానవచైతన్యాన్నే అంటిపెట్టుకోని ఉంటాను" అంటే ఈ బాధలు, దుఃఖమే కావాలి అని మూర్ఖంగా ప్రవర్తిస్తుంది అన మాట. మానసికంగా, ప్రాణికంగా కొంత తృప్తి, సంతోషము కలిగి కొంత ఉపశమనము కలిగే మాట నిజమే కాని అది ఏపాటిది?

ఎప్పటికైనా ఈ రకమైన జీవనానికి స్వస్తి చెప్పక తప్పదు. మేధోపరమైన ఆనందాలు, సృజనాత్మక కార్యకలాపాలు ఓ రకంగా మనిషికి సంతృప్తినిస్తాయి. కాని కేవలం కళాకారుడుగానే వ్యక్తి మనుగడ సాగించలేడు కదా! మానవస్వభావసిద్ధమైన బాహ్యప్రాణికనిమ్నచేతన చాలా కోలాహలం సృష్టించి గడబిడ చేస్తుంది. నిమ్నస్థాయిచేతన, ఊర్ధ్వస్థాయికి చేరుకునేందుకు అంత త్వరగా ఒప్పదు. ఈ ఘర్షణలో ప్రశాంతతత లోపిస్తుంది. నిమ్నస్థాయిజీవనం తాను ఎంతో పోగొట్టుకుంటూన్నట్లు రోది

స్తుంది. ఊర్ధ్వ ఆధ్యాత్మికజీవనంలో నష్టపరిహారం ఎంత అని బేరీజు వేసుకుంటుంది. ఊహించిన దానికంటె లాభం అధికాధికంగానే ఉంటుందని, అంతకు ముందున్న అసంపూర్ణతలు, అసంతృప్తులు, ఆందోళనలు తొలగిపోతవని అది నమ్మలేక పోతుంది. దీనికి కారణం అహంకారపూరిత ప్రాణికస్థాయి తాలూకు మొండిపట్టు, అవివేకం, అస్థిరతలే.

సన్యాస జీవనము

పరస్పర విరుద్ధములైన రెండుభిన్న ధ్రువాల మధ్య మానవప్రాణిక చైతన్య జీవనం కదలాడుతుంది. అందులో ఒకటి – సామాన్యప్రాణేంద్రియ అసంతృప్తికర జీవనం. రెండోది అందుకు పరిష్కారంగా భావించే తద్భిన్నమైన సన్యాసజీవితం. ఈ ఊగిసలాట భారత దేశానికి బాగా అనుభవమే. ఎటొచ్చీ పశ్చిమదేశాలు కూడా ఇప్పుడిప్పుడే ఇంద్రియలాలసతో కూడిన జీవితం ఎంత శుష్కమైనదో తెలుసుకుంటున్నాయి. సంప్రదాయ యోగాలు ఈ రెండు భిన్న ధ్రువాల మధ్య ఊగిసలాడుతున్నాయి. శంకరుడు, బుద్ధుడు, ఇంకా ఎంతోమంది ఇంచుమించు ఈ పంథాలోనే కొనసాగుతూ వచ్చారు. కాగా వైష్ణవ – తాంత్రికవాదులు ఇంద్రియప్రేరణలకి మహనీయత నాపాదించి దానిని సన్యాసంతో జోడించారు. ఫలితంగా ప్రాణికస్థాయి జీవనం ఇంద్రియప్రేరణల ముట్టడికి లోబడి, భ్రష్టమై, తన తాలూకు విశిష్టలక్షణాలనే కోల్పోయింది.

ఈ రెండు భిన్న ధ్రువాల సామరస్య ప్రయత్నం

ఈనాడు ఈ రెండు సంప్రదాయాలను సమన్వయపరచే యత్నం జరుగుతోంది. దీనిని సమర్థించే వారు ఉన్నారు. వారు తెలివితక్కువవారు కాదు. వాళ్లలో పొరపాటేదైనా ఉంటే దానికి కారణం నిమ్నస్థాయిలోని అహంకార పూరిత ఇంద్రియ వశీకరణశక్తిని తట్టుకోలేకపోవటమే. దీనిని నిరోధించే సత్యశక్తి (true force) వారికి లేదు. ఈ సత్యశక్తి (అధిమానసశక్తి) అధోపతనాన్ని నిరోధించగలగడమే గాక నిర్దిష్టమైన భౌతిక, జీవశక్తులను రూపాంతరీకరించి సంతృప్తిపరుస్తుంది. అంతేగాని దానిని తృణీకరించదు. భ్రష్టుపట్టించదు. ఈ పని అతి

మానసశక్తికి (supermind power) మాత్రమే సాధ్యం. మరిదేనికీ కాదు.

ముందుగా అంతరంగ చైత్యపురుషానుభవంతో, బాహ్యా భౌతిక చైతన్యభూమికలను దివ్యంగా రూపాంతరీకరించాలి. ప్రాణికజీవనాన్ని రూపాంతరీకరించకుండా ఉన్నత ఆధ్యాత్మిక చైతన్యంతో దానిని సమన్వయపరచడం కుదరదు. ఇది నా అనుభవం. ఇక్కడ అత్యావశ్యకంగా కావల్సినది సమన్వయం కాదు, రూపాంతరీకరణ.

ప్రాణికమును పవిత్రము జేయుట

వైష్ణవభక్తి సాంప్రదాయంలో ఇంద్రియ వాంఛలను (vital impulses) ప్రేమ ద్వారా వశముగావించి ఒక ఉత్కృష్ట స్థితి వైపు మళ్లించడం ముఖ్యంగా దైవోన్ముఖము గావించడం ఒక గమనీయమైన ప్రయత్నము. అయితే అది అంతరంగిక దివ్యత్వానికే పరిమితమైనది. చైతన్యమహాప్రభువుది అంతరాత్మీయ దైవప్రేమ, ఉత్కంఠితమైన ఒక ప్రాణికప్రక్రియ, రూపములో కాక పోయినా సారములో రూపాంతరీకరణమునకు (transformation) తొలిమెట్టు.

ప్రాణికోద్వేగములను స్వతః ప్రయోజనములకుగాక ఆత్మదర్శనమునకు ఉపకరణములుగా వినియోగించాలని సాధకులను మేము పదే పదే హెచ్చరించాము. భౌతికస్థాయిలో సంపూర్ణ ఆత్మసాక్షాత్కారం మట్టుకు అతిమానసము (supramental) వలననే సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన వైష్ణవ భక్తిపరంపరలో విరహము[3], స్వాభిమానము చోటు చేసుకున్నాయి. కృష్ణుడు బృందావనమునుంచి మధురానగరమునకు నిర్గమించిన తరుణంలో (బృందావనవాసుల హృదయఫలకములలో) ఉత్పన్నమైన మనోవిరహవేదనలు కేవలం కవితలకే పరిమితము గాదు. అవి మధుర

---

[3] కొంతమంది ఈ విధమైన విరహవేదనను గురుశిష్య సంబంధమునకు లేక అవతారపురుషునితోడి సంబంధమునకు కూడా వర్తింపజేశారు. ఇది అంతరంగిక సంబంధమేగాని బాహ్యాసంబంధము కాదని తెలుసుకోవాలి.

మిలనమునకు దారితీయును. సగుణాత్మక దివ్యపురుషాకారముతో సంబంధములవలె గురుశిష్య పరంపరలో గురువుతో శిష్యులు ఏర్పరచుకున్న సన్నిహిత సంబంధము కూడా పూజ్యభావము, గౌరవము, గురూపదేశములో ఆత్మసంతృప్తి, అచంచల విశ్వాస ములతోనే ఇమిడి ఉంది. మార్పుజెందని నిమ్నస్తరప్రాణిక సంబం ధములు గల్పించు అనర్థములే యోగమునందు పురోగతికి అవ రోధములుగా ఎదురవుతూ ఉంటాయి.

అంతరంగసిద్ధి మాత్రమే సరిపోదు

శ్రీరామకృష్ణ పరమహంస యోగము కూడా అంతరంగికసిద్ధి వైపే సాగింది. భగవంతుని కోసమే సర్వస్వము అర్పణ చేసిన సాధకుడు భగవంతునిపై చేయు హక్కు అంత రంగికమే గాని దేహధారియైన విభూతిపై మాత్రము గాదు. భగవద్ ప్రేమికుడు భగవంతునిలో పూర్ణలయము పొందాలనే ఆకాంక్షే భగవత్సంకల్పముగా మారాలని భగవంతుడు కూడ భక్తునితో ఐక్యమొందాలని ఆశించవచ్చు. అయితే ఈ భగవత్ ప్రేమ సాక్షాత్కారము భౌతికతలములో జరుగవలెననేదే నా లక్ష్యము. శ్రీరామకృష్ణుడు కూడా అంతర్ధ్యానావస్థలోనే చాలా కాలము గడిపి తన శిష్యులతో సాన్నిహిత్యమును దూరము చేసుకున్నాడు. బహుకాలిక ఏకాంతవాసములో భగవత్ ప్రేమ సిద్ధిని పొందిన తరువాతనే ఆయన ఇతరులను కలయుటకు సమ్మతించారు. అందుకే కాబోలు, శ్రీ కేశవచంద్రసేన్ మరణ శయ్యపై ఉన్నపుడు నిరంతర ధ్యానము దేహాన్ని దహించి వేయాలి అని శ్రీరామకృష్ణుడు ఆయనకు చెప్పియుంటారు. శ్రీరామ కృష్ణుడు కూడా తన జీవితంలో భగవత్ ప్రేమసాధన యందు ఎన్నో సంవత్సరాలు గడిపి తన దేహాన్ని దహింపజేసారు.

శిష్యుల పాపాలను గురువు భరించాలి

మీకు గొంతులో వ్యాధి మరి ఎందుకు వచ్చింది? అన్న ప్రశ్నకు సమాధానంగా "తమ పాపములను శిష్యులు నా మీదకు త్రోసివేయుగా ఆ పాపములు నన్నింటిని నేను మ్రింగవలసిన కారణంగానే ఆ వ్యాధి సంక్రమించింది"

అని అన్నారు గదా. అందుకే ఇటువంటి ఫలితాలతో, భావాల తోను నేను సరిపెట్టుకోలేను. శ్రీకృష్ణుడు భగవదవతార పురుషుడై ఎన్నో మహాకార్యములను సాధించాడు. ఈ సందర్భములో మహాభారతమందు శ్రీకృష్ణుడు బల్కిన మాటలు కూడ నాకు గుర్తుకు వస్తున్నాయి. "నా అనుయాయులు, ఆరాధకులు, తమ యాచనలను అభ్యర్థనలను ఎన్నో విన్నవించుకుంటూ తమ నిమ్న ప్రకృతిని నాపై గ్రుమ్మరించి ఈ జీవనమును అంతటిని అశాంతమయ పరిచారు" అని శ్రీకృష్ణుడు అంటాడు. ఇక భగవద్గీతలో కూడ అసుఖము, అశాంతములతో కూడిన ఈ మానవ ప్రాపంచికస్థితిని త్యజించడము తప్ప వేరుమార్గము లేదన్నట్లుగా శ్రీకృష్ణుడు సూచించినాడు. అంతటి మహోజ్వల కర్మయోగమును బోధించికూడ ఈ ప్రపంచమును త్యజించడమే సరైనట్లుగా శ్రీకృష్ణుడు భావిస్తాడు.

గతకాలపు సాంప్రదాయక పరంపరలు ఎంత గొప్పవే అయినా వానినే తిరిగి పునరాచరణము గావించడములో ఏమీ అర్థము ఉండదు అనునదే నా దృక్పథము. In the spiritual development of the consciousness upon earth the great past ought to be followed by a greater future.

రూపాంతరీకరణములోని సాధకబాధకాలు

మీరంతా భౌతికతలమునందు దైవీసాక్షాత్కారముచే కలుగు బాధకముల విషయమును పూర్తిగా విస్మరించినట్లు గనపడుతున్నది. భగవంతుడు తన సర్వశక్తితో గనుక దిగివస్తే జరుగవలసిన కార్యమంతా దానంతటదే జరిగిపోతుందని ఇక ఏ కష్టనష్టాలుగాని, సమస్యలుగాని ఉండవు, నియమములుగాని, శాసనములుగాని, విధానములుగాని ఉండబోవు అని అనుకుంటున్నారేమో. అంతా ఒక అద్భుతమైన లీల, ఆశ్చర్యకరమైన గారడీవలె ఉంటుంది అని మీరు భావిస్తూ ఉండవచ్చు. ఆ విధముగా కానపుడు భగవంతుడెక్కడ? భగవంతుడు కానేరడు అని కూడ వాపోతారు. ప్రాణికముగా, భౌతికముగా అపవర్తితముగా (untransformed) ఉంటూనే మానవ

చేతన తన కోరికల నన్నింటిని సాధించుకుంటూ అన్ని అవస్థల లోను, అన్ని పరిస్థితులలోను ఏవిధమైన శ్రమ ప్రయాసలకు, వ్యాధులకు లోనుకాకూడదని ఆశిస్తూ ఉంటారు.

నేను మానవచేతనను దివ్యమయంగా చేయాలని అతి మానసమును క్రిందికి తీసుకురావాలని సత్యచైతన్యము, అనంత ప్రకాశము, అఖండశక్తి, దివ్యానందము, దివ్య ప్రేమలు, భౌతిక స్తరములలోనికి అవతరించాలని ఆకాంక్షించినపుడు దొరికే సమాధానము విముఖత, అయిష్టత, ఇదంతా అసలు సాధ్యపడుతుందా అనే సందేహమూను. ఒకవైపు అనారోగ్యము మొదలైన వికృత పరిణామములు సంభవించనే కూడదు అంటూ మరోవైపు ఏ దైవనియమపాలనలో ఈ సిద్ధి సాధ్యపడుతుందో ఆ నియమములనే అతిక్రూరముగా తీవ్రముగా, నిరసించడము జరుగుతూ ఉంటుంది.

ప్రకృతి దివ్యముగా మారుట

భగవంతుడు అంటేనే అంత భయానకమైన, అంత జుగుప్సాకరమైన భావములు ఎందులకో? ఆ భగవత్ తత్వము భౌతికంలోకి ప్రవేశించినంతనే ఈ భయము, కుంచించుకుపోవుట, నిరాకరణ, ఎందులకు ఉత్పన్నమవుతాయో? తన అల్పసంతోషములకు, వేదనలకు ఆందోళనలకు అజ్ఞాన జీవన రంగమునకు కట్టుబడిన సంస్కారశూన్యమైన నిమ్నప్రాణికసత్తా తన పరివర్తనమును ఇచ్ఛగించకపోవుట, నేను అర్థము జేసుకోగలను. కానీ భగవత్ ప్రేమికుడు, భగవదన్వేషకుడు, సాధకుడు, చేతనను పూర్ణదైవీమయముగా రూపొందించుటకు ఎందుకు భయపడాలి? అతను అభిలషిస్తున్న భగవత్‌తత్వముతో సమైక్యమగుటకు ఎందుకు నిగ్రహించాలి? సాదృశముక్తినుంచి ఎందుకు వెనుతిరగాలి? ఈ భయమువెనుక రెండు కారణాలున్నాయి. మొదటిది: ఉత్తేజపరచే అనేక కామవాంఛలతో మసకచీకట్లలో, మడ్డిలో కూరుకుని, మొరటు అహంకారములతో, సంస్కారహీనతతో, ఆధ్యాత్మిక సౌశీల్యము లోపించిన ప్రాణికసత్తా తనకు అంతము రాబోతోంది అని భావించడము. తరువాత మనస్సు

కున్న అస్పష్టమైన అజ్ఞానపు ఆలోచనలు — ఇది బహుశా సన్యాసజీవన సాంప్రదాయమునకు చెందినది కావచ్చు. దైవీ ప్రకృతి అంటే జీవనసౌరభము లోపించడము, చల్లబారిన జీవిత శైలి అని, శూన్యమని, శుష్కమని, మృత్యుసమానమైన జీవనమని, ఇంకా అహంకార ప్రాణికజీవనములో లభించే సంపదలు, ఐశ్వర్యాలు, పూర్తిగా లోపిస్తాయనే అభిప్రాయాలు నాటుకుపోయాయి. దైవీప్రాణికసత్త అనునది ఏదీ లేనట్లు ఆ దైవీప్రాణిక సత్తాకు అస్తిత్వమే లేనట్లు, ఉచితసాధనములు సరైన ఉపకరణములు లభించినపుడు దైవీప్రాణికసత్తా సమస్త సమగ్రజీవనము ను సౌందర్యమయముగా ఉజ్వలముగా, తేజోమయముగా, సంపన్నమయముగా, మార్పుజేసి, ప్రస్థుత బలహీనతలతో కూడిన బాధలు, అల్పకాలిక ఉత్తేజములు, అనతికాలములోనే ప్రాణిక పరమైన అలసటల స్థానములో దివ్యానంద అనుభూతికి కావలసిన సామర్థ్యమును పెంపొందించగల్గుతుంది.

దివ్యచైతన్యయోగం
శారీరక జీవనసాఫల్యము

నీవు దైవంనుంచి వెనుకంజ వేయటం లేదు అంటున్నావు. పైగా దాన్ని అంగీకరించాననీ అది కావాలని అడుగుతున్నాననీ అంటావు. నీవు అభ్యంతరం చెప్పేది ఒక అసాధారణ, సాక్షిమాత్ర, అగ్రాహ్యా, అనుపగమ్యా దివ్యచైతన్యానికి, ఒక విధంగా కఠోరనిరాకారబ్రహ్మకు అంటున్నావు. తన్ను తానే భయపెట్టుకొని తన దృష్టిని సమర్థించుకొనే నీలోని ఈ ప్రాణికభాగం, పైవిధంగా వర్ణించిన దివ్యచైతన్యాన్ని బూచిగా సృష్టించింది. విచిత్రమైన ఈ వర్ణన వెనక, వేదాంతం చెప్పిన నిర్గుణ, అవాఙ్మానసగోచరమైన పరబ్రహ్మకే దివ్యచైతన్యం మరొకవిధమైన వివరణ అనే భావన ఉన్నట్లు కనిపిస్తుంది. ఆ పరబ్రహ్మ విశాలం, అసాధారణం, ఉదాసీనం, శూన్యం, ఎంతో దూరంగా ఉన్నది, తలమునకలు చేసేది. పూర్తిగా అంతే కాదనుకో, ఎందుకంటే అది క్రిందిగి రాగలదు. కాని ఆచరణాత్మక ప్రయోజనాలన్నింటికీ అది పనికిరాదా ఏమిటి? దివ్యచైతన్యం ఎలా ఉండగలదో తెలియదని ఒప్పుకున్నావు.

అయినప్పటికినీ ఈ మానసికస్థితులలో అది ఎలా ఉందో నిర్ధారించి చెప్పటమే కాక, దానికి ఆచరణాత్మకమైన చెల్లుబాటు లేదనీ, లేదా నాకు తప్ప మరెవ్వరికీ చెల్లుబాటు కాదనీ, దాన్ని గురించి నా అనుభవాన్ని కొట్టిపారవేయటం వింతగా ఉంది. నేను కావాలని చెప్పలేదు. యథాలాపంగానే సమాధానం ఇచ్చాను. ఎందుకంటే ఇప్పుడు నీవు మానవాతీతుడవు, దైవానివి కావలిసిందని నేను అడగడటం లేదు. దివ్యచేతనవు కావాలని అంత కన్నా అడగను; కాని ఈ వ్యాధి సోకినప్పుడల్లా నీవు ఈ విషయానికే తిరిగివస్తున్నావు, దాన్ని నీ నిస్పృహకు పరిభ్రమణ కేంద్రంగా, కనీసం ప్రధానమైన ఆధారంగా చేసుకుంటున్నావు కనుక నేను సమాధానం చెప్పవలసివచ్చింది.

దివ్యచైతన్యం ద్వారా భూలోక జీవితానికి పరిపూర్ణత

దివ్యచైతన్యం (supramental) అసాధారణం, సాక్షిమాత్రం, ఉదాసీనం, కఠోరం కానేకాదు. పూర్ణమైన ప్రాణిక భౌతిక అభివ్యక్తికి అది వ్యతిరేకము కాదు, దానితో పొసగనిదీ కాదు. పైపెచ్చు భూమి మీదగల ప్రాణికశక్తికి భౌతికజీవితానికీ చెందిన నిండైన పూర్ణత్వం సాధ్యంకాగల అవకాశం దానిలో మాత్రమే ఉంది. అది అటువంటిది కనుక, ఆ విధంగానే నాకు వెల్లడి అయింది కనుక నేను దానివెంట పోవటం, దానితో సంబంధం ఏర్పడేటం తవరకు కృషి కొనసాగించటం, దాని శక్తిని ప్రభావాన్ని కొంత వరకైనా క్రిందికి తీసుకొనిరావటం జరిగింది. అంతేగాని మరే ఇతర కారణాలవల్లా కాదు. నా ఆదుర్దా భూమిని గురించేకాని, వాటి కోసమే అవిగా అతీతప్రపంచాలను గురించి కాదు. నేను ప్రపంచంలో సాక్షాత్కారం కోసమే అన్వేషిస్తున్నాను గాని సుదూరశిఖరాలకు ఎగిరిపోవటం కాదు. ఇతరయోగాలన్నీ జీవితం మిథ్య అనో తాత్కాలికం అనో భావిస్తాయి. దివ్యచైతన్యం ఒక్కటి మాత్రమే దాన్ని క్రమాధిక అభివ్యక్తి కోసం దైవమే సృష్టించినట్లు చూస్తుంది. జీవం శరీరం సాఫల్యం పొందటాన్నే లక్ష్యంగా తీసుకుంటుంది. దివ్యచైతన్యం అంటే సత్య-

చైతన్యం, తన అవతరణలో జీవితానికి చెందిన పూర్ణత్వాన్ని, పదార్థగత చైతన్యానికి చెందిన పూర్ణసత్యాన్ని అది తీసుకొని వస్తుంది. దాన్ని చేరుకొనే నిమిత్తం ఉన్నతశిఖరాల పైకి పోవలసి ఉంటుందనేది నిజమే కాని పైకి పోతున్నకొద్దీ, ఎక్కువగా దాన్ని క్రిందికి తీసుకొనిరాగలుగుతాము. జీవశరీరాలు అజ్ఞాన, అపరిపూర్ణ అశక్తవిషయాలుగానే ఉండిపోవలసిన అవసరం లేదు. ఇందులో సందేహం లేదు. అయితే ఇంకా పూర్ణమైన జీవశక్తిగా, ఇంకా పూర్ణమైన శరీరశక్తిగా అది మార్పుచెందితే అవి దూరంగా ఉన్నవీ, ఉదాసీనమైనవీ, కోరదగినవి ఎందుకు కావాలి? ఇప్పుడు శారీరక జీవితం సాధించగల అత్యంతమైన ఆనందం, కొద్దిసేపు ప్రాణికమనస్సుగాని, నాడులుగాని, జీవకణాలుగాని ఉద్రేకం పొందటం. ఆ ఉద్రేకం పరిమితం, అపరిపూర్ణం, త్వరగా అంతరించిపోతుంది. దివ్యచైతన్యం పరివర్తనతో సమస్త జీవకణాలు, నాడులు, ప్రాణికశక్తులు, ఆకృతి పొందిన మానసికశక్తులు వెయ్యిరెట్లు ఆనందంతో నిండిపోగలవు. వర్ణనకు అందని, క్రమంగా అంతరించిపోవలసిన అవసరం లేని దివ్యానందతీవ్రతను అవి పొందగలవు. అవి దూరంగా ఉన్నవి, జుగుప్స కలిగించేవి, కోరదగనివి ఎలా అవుతాయి? దివ్యచైతన్య ప్రేమ అంటే ఆత్మతో ఆత్మ మనస్సుతో మనస్సు, జీవంతో జీవం ఏకం కావటం. ఏకత్వానికి చెందిన భౌతికానుభవం మన శారీరక చైతన్యాన్ని సాంతం ముంచెత్తటం. ప్రతిభాగంలోను దేహంలోని ప్రతిజీవకణంలోను ప్రియుని సాన్నిధ్యం ఉండటం. మరి ఇది కూడ దూరంగా ఉన్నది అసాధారణమైనది కోరదగనిది అవుతుందా! నీవు కావాలంటున్నట్లే, దివ్యచైతన్యపరివర్తనతో శక్తుల సంఘర్షణ, అభిలషణీయంగాని ప్రతిచర్యలు లేకుండా ఆకృతిపొందిన దైవం స్వేచ్ఛగా భౌతికంగా సాధకుని కలుసుకొనే అవకాశం, దివ్యచైతన్యపరివర్తనతో సంభవం, సునిశ్చితం, స్వేచ్ఛకలది అవుతుంది. అది కూడా దూరంగా ఉండేది, కోర



THE MOTHER

దగనిదే కాబోలు! ఇలా పేజీలకు పేజీలు వ్రాస్తూ పోగలనుగాని ఇప్పటికిది చాలు.

(*SABCL* Vol. 22, pp. 84-91)

అనువాదం: కె. వెంకటేశ్వర్లు, టి. మాధవరావు, టి. పూర్ణచంద్రరావు

మానవప్రకృతిని పరివర్తింప చేయడం ఎలా?

శ్రీఅరవిందులు

మనిషి అనగా మనస్సు అనే కిరీటము ధరించిన జంతువే కదా! మనిషి ఎంత నాగరికతను సంపాదించినప్పటికి అతని స్వభావంలో మట్టుకు ఏమాత్రం మార్పు రాలేదు. ఎందుకని? అది మనస్సుయొక్క అశక్తత. అంతకంటె అధికమైన చైతన్య మొకటి ఆవిష్కారమై మనిషియొక్క స్వరూపమునే మార్చి వేయాలి. అది మానవునిలో గర్భితమై ఉన్నది. అదే చైత్యపురుషము (psychic), ప్రస్తుతం మనోప్రాణికములచే కప్పబడి ఉన్నది; తెర వెనుక నుంచి బయటకు రావలసి ఉన్నది. ఇది సాధ్యమేనా? యోగసాధనవలన సాధ్యము. అప్పుడు మనోప్రాణికములు దాని ప్రభావమువలన మారి కొత్తరూపమును సంతరించుకుంటాయి. — *సంపాదకుడు*

ఉన్నతచైతన్యము

మానవప్రకృతిని మార్చుటమంత తేలిక కాదు. అంతరంగిక ప్రక్రియల ద్వారా ఒక పరిశుద్ధమైన ఉన్నతచైతన్యము ఆవిష్కారమై బాహ్యా మానవునిలో ప్రవేశించాలి. కానీ ప్రస్తుతం అది నీ మనస్సుచేత, పాతసంస్కారాలవలన కప్పబడి ఉంది. అందువలన నువ్వు మనస్సుతో ఎంత ప్రయత్నించినా అది బహిర్గతము కాదు. కానీ మొదట ఈ పాతసంస్కారాలను వదిలించుకుంటేగాని అంతరం

గిక అనుభూతులు కలుగవు అంటున్నావు. అది ఎలా సాధ్యము? కోపము, అసూయ, కోరికలు మొ॥ లక్షణములన్నీ మామూలు మనిషియొక్క సహజధర్మములే కదా! ఇంతకంటే గొప్పదైన ప్రగాఢమైన మరియొక నూతనచైతన్యమువలననే అది సాధ్యము.

చైత్యపురుషుడంటే ఎవరు?

నీలో చైత్యపురుషుడు (psychic being) ఉన్నాడు. ఆయన ఎట్టి దోషములు లేని దైవాంశమూ, శ్రీమాతలోని భాగమూను. అది ప్రస్తుతం నీ సాధారణమనస్సువలన, ప్రకృతివలన కప్పబడి ఉంటుంది. ఎప్పుడైతే చైత్యపురుషము ఆవిష్కరించబడి ముందుకువచ్చి ప్రకృతిని పరిపాలిస్తుందో అప్పుడు అది ఈ పాతప్రకృతినంతా మార్చివేస్తుంది. ఈ అదైవిక లక్షణాలన్నింటినీ పారద్రోలి ప్రకృతికి పూర్తిగా క్రొత్త రూపాన్నిస్తుంది. అందుకనే సాధకులు వారి మనస్సులను, అస్తిత్వమునంతను లక్ష్యముపై కేంద్రీకరించాలి. ఈ దోషములన్నిటినీ పారద్రోలి బాహ్యప్రకృతిని పూర్తిగా మార్చగల రహస్యచైతన్యమును ఆవిష్కరింపచేయాలి. ఈ విధమైన ఏకాగ్రత ద్వారా, ధ్యానము ద్వారా నూతనానుభూతులు కలిగి అంతరంగిక ద్వారములు తెరచుకొని, నూతన చైతన్యము కలిగి, నూతనప్రకృతి పొడచూపి, క్రమాభివృద్ధి చెంది బైటికి వస్తుంది. సాధకులు కోరికలని, ప్రాణికచేష్టలని తిరస్కరించుటవలన నిజమైన అసలు చైతన్యము బైటకు రావీలవుతుంది. కానీ కేవలం తిరస్కరించినంత మాత్రాన అది జరగదు. తిరస్కరించటమే కాకుండా, అంతరంగికానుభూతులవలన, అంతరంగిక పెరుగుదల ద్వారా అది సాధ్యమవుతుంది.

(*SABCL* Vol. 23, pp. 906-907)

*

ప్రకృతిని మార్చుడమెలా?

కేవలము ధ్యానమువల్లనే ప్రకృతి మారదు. ఏ పనీ చేయకుండా ఉన్నాకూడా (కర్మసన్యాసము) ఏమీ ప్రయోజనము ఉండదు. అలా చేసిన వాళ్ళలో కొంతమందికి హాని జరిగింది కూడాను.

కాబట్టి నేను చెప్పిన విషయాలని పూర్తిగా గమనించు. ఏకాగ్రత వహించాలి. హృదయంతో ఆకాంక్షించాలి. నీలో శ్రీమాత సాన్నిధ్యాన్ని స్ఫురింపజేసుకోవాలి. పైనుంచి నీలోకి దివ్య శక్తిని దింపుకోవాలి. ఏ పనీ చేయకుండా చేతులు కట్టుకొని కూర్చుంటే ప్రకృతి ఎలా మారుతుందనుకుంటావు? ఇతరులను కలుసుకున్నప్పుడు కదా నీలో మార్పు జరిగిందో లేదో తెలిసేది. ఇంక పని సంగతంటావా – ఇది గొప్ప పని. ఇది నీచమైన పని అని అనుకోవటం చాలా పొరపాటు. ఏ పనైనా సరే దానిని శ్రీమాతకు అర్పించి, సేవాభావముతో, ఆమె కోసమే, ఆమె శక్తి ద్వారానే చేస్తే చాలు.
(*SABCL* Vol. 25, p. 200)

*

It is a spiritual change of consciousness, not the surface manipulation which is the method of Mind and Reason, that can alone make Life other than it now is and rescue it out of its present distressed and ambiguous figure.

సమూల పరివర్తనము

కావున, జీవితమును బాహ్యాసంస్కారముచే గాక, సమూలపరివర్తనముచే, స్పర్థాసంకుల మైన తమోమయ ప్రకృతినుండి సామరస్య పూర్వకమైన తేజోమయప్రకృతిలోనికి రూపాంతరమొందించుటయే పూర్ణయోగ లక్ష్యము. ఈ అంతఃపరివర్తనము, – ఈ రూపాంతర ప్రాప్తి, – ముఖ్యముగా మూడుసందర్భములవలన గాని చేకూరనేరదు. మూడింటిలో ఏ ఒక్కటి లోపించినను పరివర్తనము సంపూర్ణము కానేరదు. మూడుశక్తులూ ఏకమైనప్పుడే సంపూర్ణపరివర్తనము సాధ్యము. మొదటి సందర్భమేమన; కోరికయే జీవితమునకు ప్రస్తుతము ఏడుగడగా నున్నది. కామ చేతనయే (desire-soul) జీవితకేంద్రముగా నేర్పడి సకల జీవనప్రవృత్తులనూ ప్రేరేపించుచూ వాటికి తన విపరీతపు రంగుపులిమి నడిపించుచున్నది. దివ్యజీవనప్రాప్తికి ఈ కామము పూర్తిగ నంతరించి, దాని స్థానమున స్వచ్ఛతరమూ, స్థిరతరమూనైన ప్రేరణ

పొదుకొనవలెను. కామచేతన నిర్మూలించబడి, దాని బదులుగా మనలో ప్రకృతమున దాగియున్న యథార్థ ప్రాణమయపురుషుని శాంతిసౌఖ్యబల సమృద్ధి బయటి కావిష్కరించవలెను

హృత్పురుషుని సామర్థ్యము

ఇక రెండవ సందర్భమేమన, మన జీవిత మిప్పుడు ప్రాణశక్తిచే గొంతయూ మనశ్శక్తిచే గొంతయూ నడపబడుచున్నది. విశేష భాగ మీ మనశ్శక్తి, అజ్ఞానభూయిష్ఠమైన ప్రాణశక్తిప్రేరణకు లోబడియుండుటయో అనుకూలమైయుండుటయో సంభవించుచుండును. ఒక్కొక్కప్పుడు తానే తన కొద్దిపాటి వెలుగుతో దానిని నడుపుచుచుండును. *దివ్యజీవనమునందు, ఈ ప్రాణ మనశ్శక్తులు రెండునూ కేవల ముపకరణములై పోవలెను. అంతర్వర్తియగు హృత్పురుషుడే వాటి స్థానము నాక్రమించి, మార్గదర్శకుడై, పరాత్పరుడే మార్గదర్శకు డగుచున్నాడనుటకు చిహ్నమై వెలయవలెను.*

కాగా, ఇక మూడవ సందర్భము: జీవితమిప్పుడు పృథగ్భావలక్షణములతో గూడిన అహంకార పరితృప్తి కభిముఖమైయున్నది. ఈ అహంకార మంతరించి యథార్థమైన ఆధ్యాత్మిక పురుషుడే దాని స్థానమున నిలువవలెను. *ఇహమునందు పరమును సిద్ధింపజేసికొనుటకే జీవిత మభిముఖము గావలెను. తనలో దివ్యశక్తి యొకటి ప్రబుద్ధమగుచున్నట్లు గుర్తించి, దానికి తాను విధేయమై పోవలెను.*

(*SABCL* Vol. 20, pp. 165-66)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి, కె. వేంకటరావు
(యోగసమన్వయము)

ప్రాణికంలోని ప్రాణశక్తి
(The Life-Force in the Vital)

శ్రీఅరవిందులు

భూలోకజీవితాన్ని దివ్యీకరించడమనేది చాలా అసాధ్యమయిన విషయము. ఇందుకు ప్రాణశక్తి చాలా ముఖ్యమైనది. కానీ ప్రస్తుతం అది మనస్సుయొక్క అధీనంలో ఉండి కోరికలను పుట్టిస్తూ ఉంటుంది. అటులగాక దివ్యచైతన్యమునకు లోబడి నప్పుడు దివ్యశక్తి ప్రాణికము ద్వారా పనిచేస్తుంది. సాధకునికి పైకి వెడుతున్నట్లు అనుభూతమవుతుంది. ఉన్నతచైతన్య మును పొందుతాడు. దివ్యజ్యోతిరానందములను అనుభవిస్తాడు. ప్రాణికము కోరికలనుండి మరలి దైవముకోసమే ఆకాంక్షించి, ఆరాధనాభావముతో పులకరించిపోతుంది. దివ్యచైతన్యము మనస్సులోకి మాత్రమే కాకుండా భౌతికపదార్థములోకి కూడా దిగి వచ్చి దాన్ని ఉద్దీపింప చేస్తుంది. — *సంపాదకుడు*

దేవుని సృష్టికి ముఖ్యమైన ఆయుధము

జడపదార్థము మీదా భౌతిక ప్రకృతి మీదా దైవశక్తి చేసే పనికంతకూ తప్పనిసరి అయిన సాధనం ప్రాణికం (vital) లోని ప్రాణశక్తి (life-force). అందువల్ల ఈ ప్రాణికాన్ని రూపాంతరీకరించి దైవశక్తికొక శుద్ధమయిన పటిష్టమయిన సాధనంగా చేసినప్పుడే దివ్యజీవనమనేది సాధ్యమవుతుంది. అప్పుడయితేనే భౌతికప్రకృతిని రూపాంతరీకరించ గలగడం లేదా బాహ్యాజగత్తులో దైవము తన శక్తినంతనూ యథేచ్ఛగా ప్రయోగించి పనిచేయడం సాధ్యమవుతుంది. ఏమంటే, ఇప్పటి సాధనావిధానాలతో అటువంటి పని సాధ్యం కాదు.

ప్రాణికము అధోశక్తుల చేతిలో ఉండకూడదు

ప్రాణమయపురుషుడు (vital being), మనిషిలోని ప్రాణశక్తీ దైవము నుంచి వేరుపడ్డాయి. ఆ విధంగా వేరుపడి అవి (వాటిని వశీకరించుకోగల, మంచిదయినా, క్షుద్రమయినా, దివ్యమయిన లేదా ఆసురికమయిన) ఏ శక్తికయినా ఒక

ఉపకరణమేనని ఎప్పటికీ గుర్తుంచుకోవాలి. సాధారణంగా ప్రాణశక్తి మానవమనస్సు తాలూకు మానవజీవితపు సామాన్య నిగూఢప్రవృత్తులను లేదా అర్ధచైతన్యవృత్తులను దాని మామూలు భావాలను, ఆసక్తులను గాఢాభిలాషలను కోరికలను ఉపచరిస్తుంది. కాని ప్రాణశక్తికి, సాధారణ పరిమితుల నధిగమించడం సాధ్యమే. ఆ విధంగా అధిగమించినప్పుడు అది, దాని శక్తుల కొొక ప్రేరణను, గాఢతను, ఉత్తేజాన్ని లేదా ఉన్నతిని పొంద గలుగుతుంది. ఆ శక్తులవల్ల అది దైవశక్తులకు కానీ అసురశక్తులకు కానీ ఒక ఉపకరణం కాగలుగుతుంది: దాదాపు అయి తీరుతుంది. లేదా ప్రకృతిలో వినిశ్చితమయిన కేంద్రనియంత్రణ లేనట్లయితే దాని చర్య ఈ (పరస్పర) వైరుద్ధ్యాల సంకుల సమ్మిశ్రణమవుతుంది. లేదా నిరర్థకమయిన ఊగులాటలో ఒకప్పుడు ఒకదాన్నీ మరొకప్పుడు మరొకదాన్నీ ఉపచరిస్తుంది. అటువంటప్పుడు మీలో గొప్ప ప్రాణశక్తి పనిచేస్తూ ఉన్నా చాలదు. దానికి ఉన్నతచైతన్యంతో సంపర్కం కలిగించాలి. దాన్ని నిజమయిన నియంత్రణలో ఉంచాలి. దైవపాలనలో ఉంచాలి. అందుకే, ఒక్కొక్కప్పుడు ప్రాణశక్తి చర్యకు తిరస్కారంగాని దూషణకాని ఎదురవుతూ ఉంటుంది. ఎందువల్లనంటే దానికి చాలినంత జ్ఞానంకాని నియంత్రణకాని ఉండక, అజ్ఞానయుతమూ ఆసురికమూ అయిన ప్రవృతికి బద్ధమయి ఉంటుంది. కనుకనే ఊర్ధ్వము నుంచి స్ఫూర్తీ, శక్తీ రావడానికి, ఉన్మీలనమై ఉండాలి. ప్రాణశక్తి దాని మట్టుకు అది ఎక్కడికీ చేర్చలేదు. అది లక్ష్యరహితమయిన రీతిలో సాగుతుంది. తరచుగా బాధాకరమయిన, వినాశకరమయిన వలయాల్లో సాగుతూ నిన్ను ఓ అగాధంలో పడేస్తుంది. కారణం, దానికి సరైన మార్గదర్శకత్వం లేకపోవడమే. ఉత్క్రుష్టమూ ఉజ్వలమూ అయిన ప్రయోజనం కోసం, దాన్ని ఉన్నత చైతన్యపు క్రియాశీలమైన శక్తితోను, దాని ద్వారా పనిచేసే దైవ శక్తితోను అనుసంధానం చెయ్యాలి[4].

---

[4] రూపాంతరీకరణం అంటే ఉన్నతచైతన్యాన్ని లేదా ప్రకృతిని మనస్సు

రెండు గమనములు నీ మనస్సును తికమకపరుస్తున్న ఈ రెండు గమనములు పరస్పర విరుద్ధములుగా కనపడుతున్నప్పటికీ అవి ఒకే చైతన్యముయొక్క ఆద్యంతములు. ఇప్పుడు ఎడమైన ఈ రెండు వెల్లువలు తిరిగి ఏకమైనప్పుడే ప్రాణశక్తి తన విధులను చక్కగా నిర్వహించగలిగి సఫలీకృతమౌతుంది. అనగా మన లక్ష్యము – రూపాంతరీకరణము నెరవేరుతుంది.

ఈ రెండుకొనలలోనూ ఒకటి ప్రాణశక్త్యాంతర్గతమైన ప్రాణమయపురుషుడు (vital being) కాగా ఊర్ధ్వచేతనాంతర్గతమైన క్రియాశీలత రెండవది. తద్వారా దివ్యసత్యము ప్రాణికమును, దాని ప్రాణశక్తిని వశపరచుకొని ఇక్కడ జరిగే మహత్కార్యమునకు ప్రయోగిస్తుంది. రెండుగమనముల ఆవశ్యకత – ఈ బంధమేర్పడుటకు ఈ రెండుగతులు అవసరమే. ఒకటి ఊర్ధ్వగతమైనది: ప్రాణికము (vital) పైకెగసి ఊర్ధ్వచేతనతో చేతులు కలిపి వెలుగులో నిమజ్జనమై ఊర్ధ్వశక్తియుక్తమౌతుంది. మరియొకటి అధోముఖగమనము. ప్రాణికము నిశ్శబ్దమై, నిశ్చలమై, పరిశుద్ధమై సాధారణ చేష్టారహితమై, పైనుంచి దిగివచ్చే క్రియాశీలశక్తి కోసం నిరీక్షిస్తూ ఉంటుంది. తచ్ఛక్తి ప్రాణికమునకు తన నిజరూపావిష్కారము గావించి తన నిజజ్ఞానమును, నిజశక్తిని కలుగజేస్తుంది. అందుకనే సాధకుడు ఒక్కొక్కప్పుడు మిక్కిలి సౌఖ్యదాయకమైన మహాచైతన్యస్థాయికి ఆరోహించి, జ్యోతిస్సీమల్లోకి ప్రవేశించి, దివ్యానుభూతులను పొందుతాడు. మరికొన్ని సమయములలో అతను "మళ్లీ ప్రాణికములోకి ప్రవేశించి అందులో సాధన చేసి దివ్యచేతనను తీసుకొనిరావాలి" అని అనుకొంటాడు. ఈ రెండుకదలికలు పరస్పరవిరుద్ధములు కావు. పరస్పర పరిపోషకములు. ఒకదానికొకటి అవసరము. *ఊర్ధ్వగమనము వలన దివ్యశక్తి దిగివస్తుంది. దివ్యశక్తి దిగివచ్చుటవలన ఊర్ధ్వగమనముయొక్క ఆకాంక్ష సఫలమై తీరుతుంది.*

లోకి, ప్రాణికంలోకి, దేహంలోకి తీసుకురావడం.

చైత్యాత్మతో అనుసంధానము

నువ్వు నీ ప్రాణికాన్ని దాని దిగువ సానువుల నుండి పైకి తీసుకొనిపోయి చైత్యముతో (psychic) అనుసంధించి నప్పుడు నీ ప్రాణమయసత్త్వము (vital being) ఒకటే ఆకాంక్ష తోను, ఒకటే భక్తిభావముతోను పొంగిపొరలుతూ ఉంటుంది. ఎందుకంటే అవి చైత్యభూమికయొక్క సహజధర్మములు. మరియు అది నిన్ను తన అపారశక్తితో సుసంపన్నము చేస్తుంది. ఆ శక్తి క్రియాశీలము, మానవప్రకృతిని సూక్ష్మస్థాయిలో మాత్రమే కాకుండా భౌతికస్థాయివరకు కూడా పరివర్తింప చేయగలదు. దివ్యచైతన్యమును పృథ్వీతత్వములోనికి సహితము తీసుకొనిరా గల స్తోమత కలిగియున్నది.

చైత్యాత్మను స్పర్శించుటయే గాక ఊర్ధ్వమానసిక (higher mind) పరిష్వంగియై దానితో రమించినప్పుడు ఇంకా ఉన్నతో న్నత జ్యోతిస్సీమలతోను జ్ఞానవిశేషములతోను సంపర్కము కలుగుతుంది. ప్రాణికమునకు ఊర్ధ్వమానసముతో సంపర్కము ఎప్పుడైతే కలుగుతుందో అప్పుడది అనేక రూపములలో మహత్త రమైన తేజోజ్ఞానసంపదలతో – క్రియాశీలమౌతుంది. (a higher intuition and inspiration). చక్కని విచక్షణాశక్తి, దివ్యసత్యమూ, దైవేచ్ఛల పరిజ్ఞానము దాని సంబారములు. *ఈ విధముగా ప్రాణి కము చైత్యశక్తికి, ఊర్ధ్వమనస్సుకు విధేయమైనప్పుడు యౌగిక చైతన్యము బాహ్యారంగమునకుకూడా ప్రసారమై జీవితమును ప్రభావితము చేయగలుగుతుంది.*

దైవశక్తి క్రిందికి దిగివచ్చుట

మన లక్ష్యము: దివ్యజీవనము – పృథ్వీపై దివ్యజీవనమును ప్రతిష్ఠించుట. అందు లకు పైన చెప్పబడిన సిద్ధులు చాలవు. ఊర్ధ్వమానస చైతన్యము తోడి సంపర్కము అవసరమేగాని సరి పోదు. ఇంకా మహోన్నతభూమికలనుండి దివ్యశక్తి దిగి రావాలి. నేడు దృశ్యపరిధిలోకూడా లేని శిఖరాగ్రములనుండి ఒక మహ త్తరమైన శక్తి క్రిందికి దిగిరావాలి. అలా దిగివచ్చినప్పుడే ఉన్నతచైతన్యము అతిమానసజ్యోతిశ్శక్తులుగా పరిణమించగలదు.

ప్రాణికము, దాని జీవశక్తి, దివ్యశక్తియొక్క pure, wide, calm, intense మహాశక్తివంతమైన సాధనములుగా పరివర్తనము జెందుతాయి. భౌతికము కూడా దివ్యజ్యోతియొక్క ప్రతిరూపముగాను, దివ్యచర్యకు సాధనముగాను, దివ్యసౌందర్యానందములకు వాహికముగాను భాసిస్తుంది.

(*SABCL* Vol. 24, pp. 1289-91)

అనువాదం: పి. దక్షిణామూర్తి, ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

పదార్థంలో బ్రహ్మసాక్షాత్కారం

(Matter shall reveal the spirit's face)

శ్రీఅరవిందులు

పరిణామప్రక్రియ ద్వారా పదార్థము, జీవము, మనస్సు ఆవిర్భవించినవి. అతిమానసచైతన్యము కనుక ఆవిర్భవించినట్లయితే ఈ పరిణామము శరవేగంతో సాగిపోతుంది. ఈ మనస్సు, శరీరము కూడ దాని ప్రభావమువలన పరిణతిచెంది నూతన రూపాలను సంతరించుకుంటాయి. దివ్యమనస్సును, దివ్యశరీరాన్ని ధరించిన దివ్యమానవుడు ఆవిర్భవిస్తాడు.

– సంపాదకుడు

దివ్యమైన శరీరంతో దివ్యజీవనం కొనసాగించడమే మనం రూపొందించుకున్న ఆదర్శం. అయితే ఆ దివ్యశరీరం అనేది ఏ విధంగా ఉండాలి?

మనస్సుకతీతమైన స్థాయి

మానవుడు ఆవిర్భవించినప్పటినుంచీ అంచెలంచెలుగా ఎదిగి సంపూర్ణమానసికమూర్తిగా అవతరించడంవల్లనే ఇంతకు మించి ఇంకా పరివర్తన చెందగలడనే అవకాశాన్ని గురించి ఆలోచించగలుగుతున్నాము. మొదట్లో పదార్థమునుంచి ప్రాణి

కోటిగానూ, ఆ తర్వాత మానసికమూర్తిగానూ, పరిణామము కొనసాగించిన ప్రకృతి మనస్సుయొక్క అసమగ్రతనూ, అవధుల నూ దాటి అతిమానసచైతన్యం లేక సత్యచైతన్యమూర్తిని ఆవిష్కరింపచేయాలి. అంటే మన ఉనికినే దివ్యశక్తిపూరితంగానూ, పరిపూర్ణంగానూ తయారుచేయాలి. అయితే ఇంతవరకూ జరిగినట్లు ఈ పరిణామం నత్తనడకతో సాగవలసిన అవసరం లేదు. ఇన్నాళ్లు మాదిరిగానే ఇప్పుడు కూడా మనస్సు అజ్ఞానంతో పైకి పోకుండా వెనక్కి లాగుతుంటే అలాగే జరుగుతుంది.

అతిమానసచైతన్యపు శక్తిసామర్థ్యములు

సత్యచైతన్యమును చేరుకున్న తర్వాత ఆ ఆధ్యాత్మికశక్తితోనే అంతా నిర్ణయమైపోతుంది. అప్పుడు మన బాధ్యత లేకుండా అంతా అదే చూసుకుంటూ మనఃప్రాణ శరీరాలను పరివర్తింప చేస్తుంది. మనఃప్రాణశరీరాలతో చేయవలసినదాన్ని స్వతఃసిద్ధంగా నెరవేర్చడంవల్ల సౌందర్యం, ఆనందం, వెలుగు, పరిపూర్ణంగా వెల్లివిరుస్తాయి. అతిమానససత్యచైతన్యపు సహజశక్తులుగా వెల్లివిరిసిన ఈ శక్తుల స్వభావంతో భూమి మీద కూడా మనస్సును, ప్రాణికభాగాన్ని, శరీరాన్ని మార్పిడి చేసి సత్యచైతన్యమూర్తిగా ఆవిష్కరింపచేస్తాయి. ఆ అతిమానస సత్యచైతన్యపు కాంతిలో భూమిపై క్రీనీడలనేవే ఉండవు. అన్నిటినీ జయించటానికి సరిపడ విశ్వకాంతిని, విశ్వశక్తిని ఆ అతిమానససత్యచైతన్యం తనతో పాటు భూమిపైకి తీసుకొని వస్తుంది గదా! అయితే పృథ్వీమీద కూడా అంతా చేతులు చాచి దాన్ని ఆహ్వానించలేకపోవచ్చు. ఎంతవరకు ఉన్మీలత ఉంటుందో అంత వరకు మాత్రమే మార్పు జరుగవచ్చు. పరివర్తీకరణకు అదే మూల సూత్రం.

ప్రకృతియొక్క రూపాంతరీకరణము

అది ఒక మానసికపరివర్తనైనా కావచ్చు; వ్యక్తి స్వభావంపై ఆత్మ సంపూర్ణ ఆధిపత్యం కావచ్చు; మనస్సు ఒక కాంతితత్వంగా పరివర్తన చెందటం కావచ్చు, ప్రాణికశక్తి ఒక అధికారబలంగా, నిర్మలంగా పరివర్తనం చెంది

సమస్యా పరిష్కారానికి మొదటిమెట్టుగా ఉండటం కావచ్చు. ఇంకా మానవ పరిధులను అధిగమించి భువిపై దివ్యజీవనానికి తార్కాణమని చెప్పేటట్లు ఏదైనా ఏర్పాటు చేయడం, భూమిపై నుండే ప్రకృతికి అనుగుణమైన స్థితిగతుల్లోనే అతిమానసజీవనానికి నాందిగా అతిమానవతను చిత్రీకరించడం మొదలైనవన్నీ పరివర్తీకరణలో భాగాలు కావచ్చు. అయితే ఇది మాత్రమే అభిలషనీయమైన మౌలిక పరివర్తన కారాదు. అది సంపూర్ణపరివర్తనా కాదు, దివ్యశరీరంతో సంపూర్ణ దివ్యజీవనమూ కాదు. భౌతికపరంగా మానవుడిగానే ఉండటంవల్ల మౌలికమైన తన పశుప్రవృత్తితో పరివర్తన చెందిన దివ్యభాగాలపై కూడా తన అపరిహార్య పరిమితులను విధిస్తుంది. పరివర్తన చెందని మనస్సు లోపం ప్రధానంగా అజ్ఞాన, అసత్యాలు గీసిన గీటును దాటలేకపోవడం, పరివర్తన చెందని ప్రాణికశక్తికి లోపం అపరిణత ప్రేరణలు, అధిక ప్రయాసలు, వాంఛలు విధించిన పరిమితులను మీరలేకపోవడం కాగా పరిపూర్ణ పరివర్తన చెందని శరీరానికి లోపాలు ఎన్నో ఉన్నాయి. దైహికచర్యల సామర్థ్యలోపం, తనపై విధించబడిన విహితకర్మలను తన అర్ధచైతన్యంతో నెరవేర్చడంలో లోపం; ఇవేగాక తన మౌలిక పశులక్షణాలైన మొరటుదనం, మాలిన్యాలే దాని పెద్ద లోపంగా ఉంటాయి. ఈ లోపాలన్నీ గలిసి మనలోని దివ్యత్వం చేసే పనిని నిరోధించకుండా మానవు కదా! అందువల్ల ప్రకృతి పరివర్తనలో దైహిక పరివర్తన జరగవలసిన అవసరం ఎంతైనా ఉంది.

శరీరానికి దివ్యచైతన్యము

ఇంకా ఈ పరివర్తన అనేది అంచెలంచెలుగా జరుగుతుందేమో! ఈ పరివర్తనా కార్యంలో శరీరంయొక్క పూర్వపరిణామ క్రమాలు, ముఖ్యంగా దాని పశుప్రవృత్తి పూర్వాపరాలే ఆటంకంగా ఉన్నట్లు కనిపిస్తోంది. మనకు తెలిసిన ఈ శరీరం అచేతన (Inconscient) యొక్క సృష్టి, దానిలోనుంచే ఆవిర్భవించింది కావటంవల్ల అది కూడా అచేతనమైనది, ప్రారంభంలో అచేతనాపదార్థంగా ఉండి క్రమంగా ఊపిరిపోసుకుంది. తర్వాత

పెరగడం మొదలు పెట్టింది. ఆ తర్వాత మనస్సు వికసించడం ప్రారంభించింది. అది వృక్షకోటిలో అవచేతనంగానూ, ఆ తర్వాత జంతువుల్లో బీజరూపంగానూ, కొంత తెలివితో కూడిందిగానూ, ఏర్పడి మానవుని దశలో పూర్తి మేధాశక్తి కలిగిన మనస్సుగా పరిణతి చెందింది. అది ఇప్పుడు మన ఆధ్యాత్మిక ప్రయత్నాలకు ఒక భౌతిక ఆధారంగానూ, సాధనంగానూ తన బాధ్యత నెర వేర్చనుంది. దాని పశుప్రవృత్తి, దాని అవధులు మన ఆధ్యాత్మిక పరిపూర్ణతకు అవరోధాలుగా నిలిచినప్పటికీ వికాసం పొందిన దాని ఆత్మకు అది ఒక సాధనంగా ఉపయోగపడుతోందనే విష యమే చాలు. అది ఇంకా అభివృద్ధి పొంది లోనున్న ఆత్మ అభి వ్యక్తం కావటానికీ, దానికొక ఆలయంగా నిలవటానికీ సామ ర్థ్యాన్ని పొందుతుంది. అప్పుడు అది పదార్థమయ జగత్తులోని ఆత్మపదార్థాన్ని వెల్లివిరిసేటట్లు చేయగలదు. ఇంక అర్ధచైతన్య వంతమేకాక ఆత్మైక్యాన్ని పొందుతుంది. ఈ విధంగా అది దాని స్వాభావిక ప్రకృతిధర్మాన్ని అధిగమించి దివ్యజీవనం గడపటా నికి ఒక అవరోధంగా గాక ఒక సమగ్రసాధనంగా తయారవాలి.

(*SABCL* Vol. 16, pp. 20-25)

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామశాస్త్రి

To arrive at some mental conception of God and ourselves and the world is an object good for the intellect but not large enough for the spirit; it will not make us the conscious sons of Infinity.

Sri Aurobindo

సమాచార పత్రం

15 ఆగష్టు 2002 నాడు శ్రీఅరవిందుల 130 వ జన్మదిన మహోత్సవము జరుపబడినది. సమాధి దగ్గర ధ్యానము, శ్రీఅరవిందుల మందిరదర్శనము, క్రీడాంగణములో కవాతు ప్రదర్శనము, సాయంకాలము ధ్యానము అందలి అంశములు. శ్రీఅరవిందుల చిత్రముతో, శ్రీమాత ప్రవచనములతో కూడిన సందేశపత్రము పంచబడినది.

We are precisely not in an age when men have been left to their own means. The Divine has sent down His Consciousness to enlighten them.

All who are able should take advantage of the opportunity.

The Mother


ఈ సమయంలో మానవులు వారి స్వశక్తి మీదనే ఆధారపడనవసరం లేదు. ఏలన వారికి సహాయపడుటకై సాక్షాత్తుగా దైవమే తన చైతన్యమును పంపియున్నాడు.

ఈ అవకాశమును అందరూ వినియోగించుకొనెదరు గాక.

శ్రీమాత

దేశవిదేశాలలోని శాఖలు, కేంద్రములన్నియు తగిన రీతిలో కార్యక్రమములను నిర్వహించిరి.

శ్రీఅరవిందో సొసైటీ వార్షికసమావేశములు 12-14 ఆగష్టు తేదీలలో పాండిచేరిలో నిర్వహింపబడెను. అన్ని కేంద్రములనుంచి అరుదెంచిన కార్యకర్తలు, సభ్యులు ముందు చేయవలసిన కార్యక్రమములను గురించి చర్చలు జరిపిరి. పూర్ణయోగమును నిత్యకృత్యములో అభ్యసించవలసిన విధానమును గురించి ప్రత్యేకమైన ఉపన్యాసములు ఇవ్వబడినవి.



ఆశ్రమం సింహద్వారము

ప్రత్యేక సంచిక

సిద్ధి దినము – 24 నవంబరు 1926

అఖిల

అఖిల భారత పత్రిక

నవంబరు 2002

అఖిల
ప్రత్యేక సంచిక
సిద్ధి దినము — 24 నవంబరు 1926

విషయసూచిక

ఉపోద్ఘాతము

మనది తపోభూమి, ఆధ్యాత్మికకృషికి క్షేత్రము, తాపసులకు నిలయము. ఇక్కడ హిమాలయపర్వతాలలో ఋషులు తపస్సు చేయగా వారు పొందిన సిద్ధులు ప్రపంచమంతా ప్రతిఫలిస్తాయి. పాతవ్యవస్థలు తారుమారు అవుతాయి. కొత్త మతాలు పుడతాయి. అవి ప్రపంచపరిణామంలో మైలురాళ్లు. 24 నవంబరు 1926 నాడు అటువంటి విప్లవాత్మకమైన సంఘటనే ఒకటి జరిగింది. అది ఒక నూతనసృష్టికి దారి తీస్తుంది. నూతన మానవుడావిర్భవిస్తాడు. దాని రూపురేఖలేమిటో మనము తెలుసుకొనెదము.

— సంపాదకుడు

24 నవంబరు 1926 నాడు జరిగిన విశేషము

1926 వ సంవత్సరంలో కొన్ని కీలకమైన మార్పులు చేయుటకు శ్రీఅరవిందులు నిశ్చయించారు. ఆశ్రమనిర్వహణము, సాధకుల ఆధ్యాత్మిక మార్గదర్శకత్వము శ్రీమాతకు అప్పచెప్పి తను పూర్తిగా ఏకాంతవాసంలోకి వెళ్లిపోయారు. అసలు ఇంతకు ముందరనుంచే 1926 లో (శ్రీఅరవిందులు వహిస్తున్న) సాధకుల ఆధ్యాత్మికజీవితపు బరువుబాధ్యతలన్నీ శ్రీమాతయే తీసుకోవటం మొదలు పెట్టేరు. ఈ విధంగా శ్రీఅరవిందులు తపోదీక్షలో మునిగిపోయేరు. సాధన చాలా తీవ్రస్థాయి నందుకుంటోందని, ఏదో ఒక కొత్తవిశేషము జరగబోతోందనే భావము సాధకులకు తెలియవస్తోంది.

ఆ శుభదినము రానే వచ్చింది. అది 24 నవంబరు 1926. ఆ రోజు సాయంత్రము శ్రీఅరవిందులు తన గదిలోనుంచి బయటకు రాగానే ఏదో గొప్ప సిద్ధి జరిగినట్లు శ్రీమాతకు తెలిసిపోయింది. సాధకులందరిని వెంటనే ధ్యానమందిరంలోకి రమ్మని ఆమె కబురుపంపేరు.

అప్పుడు జరిగిన విశేషాన్ని గురించి అక్కడ ఉన్న సాధకులు వివరించి చెప్పేరు. ఇక్కడ నళినికాంత గుప్తగారి మాటల లోను, మిగతావారి మాటలను తరువాయి పేజీలలోను చూడవచ్చును.

24 నవంబరు 1926

అంతకు ముందరే కొన్నాళ్లుగా శ్రీఅరవిందులు బాహ్యవ్యాపారములనుండి మరలి తన తపస్సులో మునిగిపోవటం మొదలుపెట్టేరు. మధ్యాహ్నపు భోజనానికి రావటం అంతకంతకు ఆలస్యమయ్యేది. శ్రీమాతతో సహా మేమందరం కలసి లైబ్రరీ భవనంలో (ఇప్పుడు రవీంద్ర పళ్లు పెట్టేందుకు ఉపయోగించే గది) భోజనం చేసేవారము. మేము 8 - 10 మంది ఉండేవాళ్లం. ఆ క్రిందటి రోజున శ్రీఅరవిందులు సాయంత్రం 4 గం॥



1926 నవంబరు 24 శ్రీకృష్ణుడు భౌతికంలో అవతరించిన సుదినము.

శ్రీకృష్ణుడు అతిమానసజ్యోతి కాదు. శ్రీకృష్ణుని అవతరణమనగా అతిమానస అవతరణను సంసిద్ధము చేయు అధిమానస దైవత్వపు ఆగమనం మాత్రమే. శ్రీకృష్ణుడు ఆనందమయుడు – అధిమనస్సు ద్వారా పరిణామప్రక్రియ (evolution) కు దోహదమై దానిని ఆనందం వైపుకు నడిపిస్తాడు.

శ్రీఅరవిందులు

(*SABCL* Vol. 26, p. 136)

తరువాత భోజనానికి వచ్చేరు! ఆయన వచ్చేవరకు మేము కూడ భోజనము చేయకుండా ఉండేవాళ్లం.

సరే ఒకనాడు ఆ శుభముహూర్తము రానే వచ్చింది. మేమందరము సాయంత్రం సముద్రతీరానికి వాహ్యాళికి వెళ్లేము. ఒక వార్తాహారుడు పరిగెత్తుకుంటూ వచ్చి శ్రీమాత అందరిని వెంటనే రమ్మంటున్నారని కబురు చెప్పేడు. అలా వెంటనే ఎందుకు పిలిచారో నాకేమి అర్థం కాలేదు. పరిగెత్తుకుంటూ వచ్చేసి పైకి వెళ్లి ప్రాస్పరిటీ గదికి ఎదురుగా ఉన్న వరండాలో కూర్చున్నాను. అక్కడ ప్రతిరోజు, సాయంకాలం శ్రీఅరవిందులు వచ్చి మా ప్రశ్నలకు జవాబులు ఇవ్వడం పరిపాటి. కాని ఆ రోజున అంతా కొత్తగా ఉంది. శ్రీమాతారవిందులు ఇద్దరు అక్కడ ఆసీనులై ఉన్నారు. శ్రీఅరవిందులు ఒక కుర్చీలోను, ఆయన పాదాలచెంత శ్రీమాత, వారి కభిముఖంగా మేమూ కూర్చొని ఉన్నాము. అందరూ వచ్చారో లేదోనని నేను చుట్టూ పరికించి చూసేను. సత్యేంద్రుడు కనపడకపోయేసరికి అతన్ని పిలవాలా అని శ్రీమాతను అడిగేను. అతనిని, మిగతా అందరిని కూడ పిలవాలని శ్రీమాత ఆదేశించారు. కొంతసేపటికి అంతా అక్కడికి వచ్చి కూర్చున్నారు. అక్కడ ఆసీనులైవున్న శ్రీఅరవిందులు, శ్రీమాత, వాళ్ల కెదురుగుండా మేము – అదంతా ఏదో ఒక దివ్య లోకమా అన్నట్లు అనిపించింది.

శ్రీఅరవిందులు తన వామహస్తమును శ్రీమాత శిరస్సు మీద ఉంచి దక్షిణహస్తంతో మమ్మల్ని ఆశీర్వదించారు. ఆ వాతావరణమంతా ఎంత పవిత్రంగా, నిశ్శబ్దంగా, దివ్యంగా ఉన్నదో చెప్పలేను. ఒక్కొక్కరూ వెళ్లి శ్రీమాతారవిందుల చరణారవిందాలకు నమస్కరించారు. కొంతసేపటికి వాళ్లిద్దరు లోపలికి వెళ్లిపోయారు. మాలో దత్తా అనే ఒకామె, as though an inspired Prophetess of the old mysteries ఆవేశపూరితంగా బిగ్గరగా "దేవుడు దిగి వచ్చేడు. ఆయన దుఃఖాన్ని మృత్యువుని జయించారు. అమరత్వాన్ని కిందికి తీసుకొని వచ్చేరు" అంది.

అప్పటినుంచి శ్రీఅరవిందులు ఏకాంతంలోకి వెళ్లిపోయేరు. సాయంకాల సంభాషణలకు రావటం మానేసేరు. మేము శ్రీమాతనే కలుసుకుండేవాళ్లం. ఆమెతో మా సంబంధాలు మొదలయినవి.

(Mother India, Dec. 1962, pp 30-31)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి

24 నవంబరు, 1926 నాటి విశిష్టత

(శ్రీఅరవిందులతో నిరోద్‌బరన్ ఉత్తరప్రత్యుత్తరాలు)

శ్రీఅరవిందులతో శిష్యులు జరిపిన ఉత్తరప్రత్యుత్తరాలకు, సంభాషణలకు ఆశ్రమవాఙ్మయములో చాలా ముఖ్యమైన స్థానమున్నది. శ్రీఅరవిందుల మీద వారి శిష్యులు ప్రశ్నలవర్షం కురిపించేవారు. శ్రీఅరవిందులుకూడ వారిని ప్రోత్సహించేవారు. ముఖ్యంగా కొంతమంది శిష్యులకు బాగా చనువిచ్చేవారు. ఇది శ్రీకృష్ణుడు గోపకుల మధ్య జరిగిన చెలగాటమును స్ఫురింపజేస్తుంది. నిరోద్‌బరన్ శ్రీఅరవిందులను "Stand and deliver" అని సవాలు చేసేరు. ఆయన మాత్రం తక్కువ తిన్నారా? "నాకివాళ నిలబడేందుకు మాత్రమే వ్యవధి ఉన్నది. డెలివరీ తరువాత చేస్తానులే" అని చెప్పి తెలివిగా తప్పించుకున్నారు!

— సంపాదకుడు

మరొక విషయాన్ని గురించి వివరించవలసిందిగా ఇవాళ నేను మిమ్మల్ని కోరుతున్నాను. నవంబరు 24 వ తేది విశిష్టత ఏమిటో విస్పష్టంగా చెప్పండి. ఆ రోజును గురించి విభిన్న వ్యక్తులకు విభిన్నాభిప్రాయాలు ఉన్నాయి. అతిమానసావతారం మీలోకి దిగివచ్చిందని కొందరంటున్నారు.

వఠ్ఠి చెత్త! ఎవరి అభూతకల్పన అది?

మీరు అంతకంతకు అధిమానసీకృతం చెందారని మరి కొందరు అంటున్నారు.

ఓహ్! అది నిజానికి దూరమే అయినా అందులో కొంత నిజం లేకపోలేదు.

ఆ రోజున మీరు అతిమనస్సు (Supermind) సాధించారనే నేను అర్థం చేసుకున్నాను.

మావైపు నుండి అటువంటి ప్రస్తావన ఏదీ లేదే.

ఆ రోజున మీరు అతిమనస్సును సాధించకపోతే, దానిని గూర్చి మాట్లాడడం గాని, తెలుసుకోవడంగాని ఎలా సంభవమైంది మీకు?

బాగు బాగు! ఇదేమి న్యాయమండి. ఒకదానిని సాధించకముందు దానిని గూర్చి నీకేమీ తెలియదా?

ఎందుకంటే నేను దానిని దర్శించాను. దానితో – సంబంధం ఏర్పడింది. ఓ తర్కకిశోరమా! దానిని సాధించడం అనేది వేరే విషయం.

కొన్ని భాగాలు అతిమానసీకృతం అవుతున్నట్లు మీరు చెప్పారు కదా?

అతిమానసీకృతం చెందడం వేరు. అతిమానసాన్ని సాధించడం వేరు.

మీరు అతిమనస్సును సాధించలేదని ప్రకటన చేసి చాలా మందిని భయవిహ్వలుల్ని చేశారు.

హే ప్రభూ! భౌతికంలోకి అతిమనస్సుని తీసికొనిరావడానికి నేను ప్రయత్నిస్తున్నానని పదే పదే చెప్తూ వచ్చాను. నా మాటలు అర్థం కాలేదా? మీరంతా ఏమనుకుంటున్నారు? 1926, నవంబరు 24 న అతిమనస్సును నేను సాధించివుంటే, గత తొమ్మిదిసంవత్సరాలుగా అది భూమ్మీద ఉండేవుండాలి కదా!

మీరు ఆ రోజున నిద్ర, ఆకలి, రోగాలను జయించారని 'దత్త' మాటల్ని బట్టి అర్థం అవుతున్నది. మరి ఏ అధికారంతో ఆమె ఆ ప్రకటన చేశారు?

ఆ మహోజ్వలప్రకటన గూర్చి నాకు తెలియదు. దైవత్వం (కృష్ణుడనండి. దైవసాన్నిధ్యం అనండి. మీ ఇష్టం. ఏ పేరుతోనైనా పిలవండి) భౌతికంలోకి దిగివచ్చిందని చెప్పబడింది. అతిమానసావతరణ కోసం మరింత కృషిచేయడం కోసం, నేను బాహ్యాప్రపంచంనుండి ఏకాంతంలోకి వెళ్తున్నట్లు కూడా ప్రకటించబడింది. నవంబరు 24 నే అంతా సాధించివుంటే, ఇక సాధించడానికి భూమి మీద ఏం మిగిలింది? అతిమానసం భూమ్మీద ఉంటే, ఏ ఉజ్వలప్రయోజనం కోసం నేను ఏకాంతంలోకి వెళ్లాలి? అంతే కాకుండా ఇవన్నీ ఒక్కరోజులో సాధించబడతాయా? 'దత్త' ఏమైనా పలికివుంటే, భవిష్యత్ దర్శనపారవశ్యక్షణంలో పలికి ఉండాలి. వర్తమానంలో భావిదృశ్యం ఆమెకు సాక్షాత్కారించి ఉండాలి!

నేను నిలబడే ఉన్నాను. కాని దేనినీ బహిర్గతం చేయలేదు. ఒకక్షణం నిలబడడానికి నాకువ్యవధి ఉంది. కాని నా మనస్సుకాని అధిమనస్సుకాని ఎంత ఆలోచనా "గర్భితం" అయినప్పటికీ, నేను దేనినీ బహిర్గతం (deliver) చేయలేదు (deliver, pregnant అనే మాటలలో శ్రీఅరవిందుల సునిశిత హాస్యం గమనార్హం). కాని ఎంత తర్కబుద్ధి! ఎవరైనా ముందుగా అతిమానసీకృతం కావాలా? అటు పిమ్మటే అతిమనస్సును గూర్చి తెలుసుకోవడం సాధ్యమవుతుందా? ఆహా! ఎంత తర్కం? అయితే నాకు వ్యవధి ఉన్నప్పుడు మరోసారి దానిని తప్పక బహిర్గతంచేస్తా.

1935, ఆగస్టు 29

అనువాదం: కె.యజ్ఞన్న

Never react with your lower being...
Do not react just like that with
what is most common place in you.

The Mother

అనిల్‌బరన్‌గారి రచన – శ్రీఅరవిందుల సవరణ

The Pioneer పత్రికా సంపాదకుడు 24 నవంబరు 1926 నాటి సిద్ధిని గురించి నన్ను రాయమని అడిగారు. అందులో శ్రీఅరవిందుల 'ది లైఫ్ డివైన్' లో నుంచి నేను చేసిన కొటేషన్:

"అంతర్లీనముగానున్న అధిమానస, అతిమానస (overmind, supermind) తత్త్వములు తెరవెనుక రహస్యస్థావరములనుండి వెలుపలికి రావాల్నంటే – అతిచేతనాశక్తులు, దేవతలు (the beings and powers of the superconscience) మనలోకి ప్రవేశించాలి. మనను ఉద్దీపింపజేయాలి. ఆ శక్తులు దేవతలు మనలోని శక్తులుగా, దేవతలుగా రూపుదాల్చి కార్యమును నిర్వహించాలి. అటుల జరగనిచో ఈ పరివర్తనము, ఈ రూపాంతరీకరణము జరుగనేరవు".

వ్యాసము చివర నేను ఈ విధముగా రాసి ముగించాను. "దీనినే వేదములో – *దేవానాం జనిమాని* – మర్త్యులైన మానవుల యందు దేవతల జననముగా వర్ణింపబడినది. పృథ్వీపై అతిమానస ఆవిర్భావమునకు ఇది తప్పనిసరి అని శ్రీఅరవిందులు నుడివిరి. 24 నవంబరు 1926 నాడు జరిగిన విశేషమిదియే. 'ఇక భూలోకంలో అతిమానసము ఆవిర్భవించుటకు దేవతాశక్తులు తప్పకుండా సహకరించగలవు' అని రూఢి చేసుకొన్న తరువాతనే శ్రీఅరవిందులు ఆశ్రమమును స్థాపించిరి."

నా రచనను శ్రీఅరవిందులు ఈ విధంగా సవరించారు.

24 నవంబరు 1926 నాడు పొందిన సిద్ధి మూలంగా అతిమానస అవతరణమునకు అవకాశం దొరికింది. ఆ రోజున వారు ఏకాంతవాసంలోకి వెళ్ళిపోయి గాఢమైన తపోదీక్షలో నిమగ్నమైపోయారు.

ఈ సవరణను వారు 20 నవంబరు 1950 నాడు చేసిరి. ఇదే శిష్యుల రచనలలో వారు చేసిన ఆఖరి సవరణ. వారు 5 డిసెంబరు 1950 నాడు దేహమును చాలించిరి

(*Mother India*. Dec 1962, p. 29)

అనువాదం టి. మాధవరావు

శ్రీఅరవిందులతో కులాసా కబుర్లు

(ఎ. బి. పురాణిగారి స్మృతులు)

15-9-1926

శిష్యుడు: ఈసారి మన ప్రయత్నము ఫలిస్తుందంటారా? ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఇది విజయవంతం అవుతుందో లేదో చెప్పండి.

శ్రీఅరవిందులు: అవును, కాదు.

శిష్యుడు: అంటే?

శ్రీఅరవిందులు: న్యాయంగా నేను అవుననే చెప్పాలి. కాని వ్యావహారికంలో కాదేమో అనిపిస్తోంది. దానికి కారణం ఈ భౌతిక జగత్తు ఇంకా రెడీగా లేకపోవడమే. ఈ భౌతికలోకంలోని జడత్వమూ, అవరోధాలే దానికి కారణం.

శిష్యుడు: మరి మీరు న్యాయంగా అలాగే జరగాలని అంటారేమిటి?

శ్రీఅరవిందులు: భౌతికతలో, భౌతికప్రపంచములో, తేజశ్శక్తి మరింత ఎక్కువగా దిగివచ్చుచున్నందువలన, ఇంకనూ నిద్రాణమైన భౌతికపురుషుడు మేలుకుంటున్న లక్షణములు గనపరుస్తున్నందు వలన.

శిష్యుడు: ప్రతిరోధములను అతిక్రమించాలంటే ఏ యే నియమాలను పాటించవలసి వస్తుంది? ఈ నియమపాలనలో మా బాధ్యతలు ఏమయినా ఉన్నాయా?

శ్రీఅరవిందులు: నియమములా! నేను జెప్పలేను.... నేను ఒకవేళ చెప్పినా నీవు గ్రహించలేవు.

శిష్యులు: మమ్ములను కనీసము విననీయండి. అర్థము జేసుకోవడానికి ప్రయత్నిస్తాము.

శ్రీఅరవిందులు: సరే, మానవుడు దేవతలలోకాలతో తిన్నగా సంపర్కమేర్పరచుగోగల్గినపుడే అది సాధ్యపడుతుంది.

శిష్యులు: ప్రతిపదమునూ మీరు విపులీకరిస్తే తప్ప నాకు అర్థమగుట లేదు.

శ్రీఅరవిందులు: ఆ సంగతే నేను ముందరే చెప్పాను గదా!

శిష్యులు: నిమ్నలోకపు దేవతలా? లేక ఊర్ధ్వలోకపు దేవతలా?

శ్రీఅరవిందులు: నేను చెప్పినది దేవతలను గురించేగాని ప్రత్యేకంగా ప్రాణమనోలోకముల దేవతలను గురించి గాదు.

శిష్యుడు: భౌతికస్తరపు ప్రతిరోధములను అతిక్రమించుటకు దేవతాలోకములతో ప్రత్యక్షసంబంధము స్థాపించాలి అని మీరు అన్నారు. దీనికి ఏదైనా ఒక పద్ధతి ఉందా? లేక దేవలోకము తనంత తానే క్రిందికి దిగివస్తుందా? లేక ఏదైనా మహాశక్తివలన ఇది జరుగుతుందా?

శ్రీఅరవిందులు: ముందుగా మీరు మీ యూరోపియన్ మనస్తత్వమునకు స్వస్తి చెప్పాలి. అసలు మీరంతా మీ మనస్తత్వములలో సగము యూరోపియనులే, అపర యూరోపియనులు. దేవలోకము క్రిందికి రావాల్నంటే మనస్సును అధిగమించాలి. ప్రపంచాన్ని సామాన్య మానవదృక్పథముతో చూడకూడదు. ప్రాణకోశమునకు చెందిన శక్తులనే యథార్థమైన దేవతలుగా స్వీకరించడము, భౌతికపరమైన దృష్టికి మాత్రమే కట్టుబడి ఉండటము, ఈ రెండు విభిన్నభ్రమలను త్యజించాలి.

శిష్యులు: యూరోపియను మనస్తత్వము భౌతికవాదమే అనుటలో మీ ఉద్దేశ్యమేమిటి?

శ్రీఅరవిందులు: భౌతికపదార్థమే పరిణామ ప్రక్రియకు మూలాధారము అనుకోటం యూరోపియన్ భౌతికవాదము. వేరొక దృష్టికి అలవాటుపడని వారికి ఇది అసంభవముగానే ఉంటుంది.

అయితే యూరోపియన్ మనస్సును కించపరచడము నా అభిమతము గాదు. దాని పరిధిలో, అది సరియైనదే. కాని భౌతిక భూమికలో నిశ్చయమైన మార్పును తీసుకురావాలనేదే మా ప్రయత్నము. మనస్సును భౌతికసూత్రములతో బంధించు భౌతికవాదమే అంతిమసత్యము కాదు అను విషయము బోధపడిన తరువాత

కూడా వేరొక భిన్నమైన పొరపాటును అంటే ప్రాణమయ దేవ తలే నిజమైన దేవతలు అని విశ్వసించే యూరోపియనుల సంగతి గూడా గమనీయము. ఉదాహరణకు భూతపరిశోధనలు, ప్రేతాత్మ లతో సంభాషణలు, మార్మికమాధ్యమములతో ప్రయోగములు స్వచాలిత లేఖనాలు, జేస్తున్న యూరోపియనులుగూడా గలరు.

6-11-1926

శ్రీఅరవిందులు: నేను దేవతాలోకములను గురించి ప్రసంగించ డము జరిగింది. ఆ విధముగా విశదీకరించకపోవుట ప్రమాదకర మైన విషయము. ఆ ఊర్ధ్వలోకములు క్రిందికి దిగివచ్చినపుడు మానవమనస్సు అవగాహన జేసుకోగలిగే స్థితిలో ఉండాలనే ఉద్దేశంతో ఆ సంగతి ప్రస్తావించాను. ఆలస్యము జరుగకుండా భౌతికస్తరములోనికి ఆ దేవతాలోకములను తీసుకువచ్చుటకే నేను ప్రయత్నిస్తున్నాను. ఇంతకు ముందైతే ఈ విషయప్రస్తావన అనా వశ్యకముగా అనిపించవచ్చేదేమో గానీ ప్రస్తుతము ఆ లోకావత రణము గురించి ప్రస్తావించకపోవుట అపాయకరముగా పరిణ మించగలదు.

9-11-1926

శిష్యుడు: దేవలోకము క్రిందికి రాగలదు అని కచ్చితముగా మీరు వాగ్దానము జేయగలరా?
శ్రీఅరవిందులు: నేను ఎటువంటి వాగ్దానము చేయను. “అతిమా నసలోకము క్రిందికి దిగివచ్చిన పక్షములో” – అని మాత్రమే చెప్పగలను.

24 నవంబరు 1926 కు ముందుగానే జరిగిన కొన్ని సంభాషణల సారాంశము:

అవాఙ్మానసగోచరమైన పరతత్వమొకటున్నది. ఆ తత్వమే సచ్చి దానంద స్వరూపములో ఆవిర్భవించును. ఆ సత్‌పదార్థములోనే సమస్తజీవుల వ్యక్తిత్వము ఇమిడియుంది. పిదప మహాబలాన్విత

మైన నాలుగు మహాశక్తులతో కూడిన అతిమనస్సు (Supermind) ఉన్నది. ఈ అతిమానసంలో ఏకత్వమే రాణిస్తూ ఉంటుంది. అది దాని ధర్మము.

అతిమానసలోకమునకు దిగువున, ప్రస్తుతసృష్టికి వెనుక దేవతల లోకాలుంటాయి. హిందూసంస్కృతిలోని శివుడు, విష్ణువు మొదలగు దేవతలు మానసములో నెలకొన్న నామములు, దివ్య మూర్తిత్వములు. భగవత్‌శక్తికి ప్రతినిధులుగా ఈ విశ్వాన్ని పరి పాలిస్తున్న దేవతలే ఈ శివుడు, విష్ణువు మొదలగువారు. There is a heirarchy of these beings. ఈ లోకాల క్రిందనే అభివ్యక్త మైన మన విశ్వమున్నది.

(Evening talks with Sri Aurobindo by A.B. Purani, 1982, pp. 479-81, 508-13)

అనువాదం: టి. మాధవరావు.

శ్రీమాత ప్రసంగ విశేషాలు
(అనిల్‌బరన్ దినచర్య పుస్తకాలనుండి)

24-11-1930: 24 నవంబరు 1926 నాటి విజయాన్ని దత్తా ఈ విధంగా వర్ణించారు "శ్రీఅరవిందులు మానవజీవితాన్ని, మృత్యు వును, సమస్తాన్ని జయించారు. శ్రీకృష్ణుడు అరుదెంచెను."

క్రిందటి రాత్రి శ్రీమాత చెప్పిన వివరణ – "ఇంతకు ముందర శ్రీకృష్ణుడు లేడని చెప్పటం లేదు. అయితే 24 వ తారీ ఖున ఆయన పదార్థచైతన్యంలోకూడా ఆవిర్భవించాడు. ఇక నూతనసృష్టికోసం ప్రయత్నించే సమయమాసన్నమైనదని శ్రీఅర విందులు చెప్పారు."

Psychic atmosphere ఆవహించటంవలన అప్పటి వాతావ రణము చాలా గంభీరంగా ఉన్నదని శ్రీమాత చెప్పారు. దేవతల నివాసభూమియైన అధిమానసలోకము భూలోకాన్ని స్పర్శించింది.

ఈ స్పర్శ చాలా అవసరము. అది లేకపోయిన యెడల అతిమానసరూపాంతరీకరణము (Supramental transformation) జరిగే అవకాశమే లేదు. ప్రస్తుతం మరొక రంగంలో పని జరుగుతోంది. ఎందుకంటె అది అవసరము కనుక.

8-11-1930

ప్రశ్న: మహాకాళి అధిమానస లోకానికి చెందినదా?
శ్రీమాత: అవును, ఆ నలుగురు దేవతలూ (శక్తులు[1]) అధిమానసలోకానికి చెందినవారే.
ప్రశ్న: శ్రీకృష్ణుడో?
శ్రీమాత: ఆయన కూడ అధిమానసానికి జెందినవాడే.
ప్రశ్న: మరి అతిమానసదేవతలంటే ఎవరు?
శ్రీమాత: అతిమానసదేవతలంటూ ఎవరూ లేరు. వాళ్లు అతిమానసలోకంనుంచి వస్తారు, అధిమానసలోకంలో ప్రకటితమౌతారు – అంతే.

శ్రీఅరవింద సర్కిల్ సం. 33 (1977) pp 73-74

అనువాదం: ఆర్. లక్ష్మీప్రసాదమ్మ

Q: **What is the exact significance of your statement: "Always behave as if the Mother was looking at you; because she is indeed, always present"?**

Sri Aurobindo: **It is the emanation of the Mother that is with each sadhak all the time.**

---

[1] మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి,మహాసరస్వతి

24 నవంబరు, 1926 – సిద్ధి దినము

ప్రపంచాన్ని ఉద్ధరించాలని, మానవజీవితాన్ని మెరుగుపరచాలనే సంస్కర్తలకు లోటు లేదు. అయితే అది కేవలం ధనశక్తితో కాని మానసిక వ్యూహంతోగాని జరగదు. దీనికి మూలకారణం మానవచైతన్యంలోని లోపము. ఈ సమస్యను శ్రీఅరవిందులు బాగా అర్థం చేసుకొని దానిని నివారించగల సామర్థ్యము ఒక్క అతిమానసానికే **(Supramental)** *ఉన్నదని కనిపెట్టారు. దాని కోసమని కృషి చేసారు. ఘోరతపస్సులో నిమగ్నమైపోయారు. ఆ ప్రయత్నము 1926 లో ఒక మజిలీకి చేరుకొంది. మొదటి ఘట్టము పూర్తి అయింది. ఆశ్రమంలో అప్పుడు నెలకొన్న విద్యుద్వాతావారణమును గురించి, పైనుంచి దిగివచ్చిన జ్యోతిశ్శక్తులను గురించి, అక్కడి శిష్యుల వర్ణనలు, విశేషానుభూతులను గురించి మనము తెలుసుకొనెదము.* *– సంపాదకుడు*

ఆ రోజుయొక్క ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోవాలంటే 1908-09 సంవత్సరంలో శ్రీఅరవిందులు కారాగారంలో పొందిన అనుభవాలనూ, వారి 1926 నవంబరు 24 నాటి అనుభవాలనూ జోడించాల్సి ఉంటుంది. అంతేగాక శ్రీఅరవిందులు తన వ్యక్తిగతసాధన గురించి 1920 లో శ్రీ బరీన్‌కు వ్రాసిన విషయాలను కూడ లెక్కలోనికి తీసుకోవాలి.

పదియేండ్ల ప్రాథమికదశ

1910 లో తాను పుదుచ్చేరికి రాకముందు 1920 ఏప్రిల్‌లో శ్రీ బరీన్‌కు వ్రాసిన లేఖలో తన యోగస్థాయి "ప్రాథమిక" మైనదిగాను, "ప్రారంభదశకు చెందినది" గాను వర్ణించారు. అంటే అది అతిమానసయోగంలో ప్రాథమికస్థాయి. ఆ లేఖలో ఇలా ఉంది. "మనలో ఉన్న జగద్గురువు అపుడు నా మార్గాన్ని ఆసాంతం నిర్దేశించారు – మొత్తం సిద్ధాంతాన్ని ఆ యోగంలోని దశాంగాలను వివరించారు. ఈ దశాబ్దకాలంలో (1910-1920) అనుభవం

ద్వారా వారు నాచే అభివృద్ధి చేయిస్తూన్నారు. కాని అది ఇంకా పూర్తి కాలేదు.

"మనం ఊర్ధ్వముఖంగా ఎదగనిదే – అంటే అతిమానస స్థాయిని చేరనిదే ప్రపంచపు అంతిమరహస్యాలు ఏమాత్రం అవగతం కావు. అది ఉత్పన్నం చేసే సమస్య అపరిష్కృతంగా మిగిలిపోతుంది.

దైవమే ఈ కార్యమును నడిపిస్తున్నది

"అది అంత తేలిగ్గా జరిగే మార్పు కాదు. ఈ పదిహేనుసంవత్సరాల తర్వాతకూడా నేను అతిమానస స్థాయిమార్గపు మూడుదశలలోని అట్టడుగు స్థాయిని మాత్రమే చేరుకోగలుగుతున్నాను. దానికంటె క్రిందిస్థాయి కార్యకలాపాలన్నిటినీ అందులోనికి తీసికొనే ప్రయత్నం చేస్తున్నాను. అయితే ఈ సిద్ధి పూర్తి అవగానే భగవంతుడు నా ద్వారా ఇతరులకు ఈ సిద్ధిని చాల స్వల్పప్రయత్నంతోనే ప్రసాదించగలడనే నమ్మకం నాకుంది. అప్పుడు నా అసలు కార్యక్రమం మొదలౌతుంది. విజయంకోసం నేనేమీ తొందరపడటలేదు. దైవం నిర్ణయించిననాడు జరిగేది జరుగుతుంది. తొందరపాటుతో రంగంలోకి దూకే ఉద్వేగం నాకు లేదు. ఒకవేళ నేను విజయం సాధించకపోయినా నేనేమీ చలించను. ఎందుకంటే ఈ కార్యం నాది కాదు. దైవానిది. దేవుడు నన్ను నడిపించినట్లుగా నడుస్తానుగాని మరెవరి మాటా వినను.

"వందల, వేల కొద్దీ శిష్యులను నేను కోరటం లేదు. సంకుచితమైన అహంకారాన్ని క్షాళన చేసికొని, భగవంతుని సేవలో పరికరాలుగా మారగల వారు ఒక వందమంది ఉంటే చాలు.

"తానే పరిపక్వంగానివాడు ఇతరులనెలా పరిపక్వం గావించగలడు?"

1920 లో అతిమానసముతో తొలి స్పర్శ

దీని ద్వారా మనం తెలుసుకొనేది ఏమిటంటే శ్రీఅరవిందులు పాండిచ్చేరి వచ్చేనాటికి తన మార్గాన్వేషణలో తడుముకోవటం లేదనీ, వారి మార్గం వారిముందు నిర్దేశింపబడిందనిన్నీ. 1910 తర్వాత వారి యోగం భగవంతుని అధీనం

లోనికి వెళ్ళింది. సాధనాక్రమంలోని దశాంగాల ద్వారా అది వారికి గోచరించింది. మానసికస్థాయికి పైనున్న అతిమానసస్థాయియొక్క ఉనికిని వారు అంత కాలము గమనించియే ఉన్నారు. 1920 నాటికి వారు అతిమానసచైతన్యంలోని అట్టడుగుస్థాయికి ఎదగడంలో విజయం సాధించారు. అంతేకాక వారి ప్రకృతిసిద్ధమైన కదలికలన్నీ అందులోనికి చేర్చుకొని ఉన్నారు.

కాని వారు ఏదో చేసి తీరాలని తొందరపడటం లేదు. అజ్ఞానపు ఉపకరణాలతో కాక ఊర్ధ్వచేతననుండి మాత్రమే పని చేయాలని నిశ్చయించుకున్నారు. అతిమానస అవతరణ పరిపూర్ణంగా స్థిరపడితే, అందరూ దానినుండి తేలికగా అతికొద్ది ప్రయత్నంతోనే లాభాన్ని పొందగలరనే నమ్మకం వారికి ఉన్నది.

సమయానికి శ్రీమాత ఆగమనము

ఈ విధంగా అతిమానససిద్ధి కోసం తన తపస్సు కొనసాగిస్తూ ఉండగా, దైవానుగ్రహమో అన్నట్లు శ్రీమాత వారి ఆంతరంగిక ఆధ్యాత్మికసాధనలో భాగస్వాములయినారు. 1926 ప్రారంభంనుంచి ఆశ్రమంలోని శిష్యులకు శ్రీమాత మార్గదర్శకులుగా ఉంటూ ఉన్నారు. ఇద్దరు, ముగ్గురు మహిళా సాధకులు కూడా ఉండేవారు. వారు శ్రీమాత దగ్గరకు ధ్యానంకోసం వెడుతూ ఉండేవారు. 1926 ఆగస్టు నుండి శ్రీమాత వద్దకు వచ్చే సాధకులసంఖ్య పెరుగుతూ వచ్చింది. శ్రీఅరవిందులు క్రమేణా ఏకాంతవాసం లోనికి వెళ్లిపోవటం, శ్రీమాత సాధకుల అంతర్గత సాధనకు, ఆశ్రమ బాహ్యాజీవన నిర్వహణకు మార్గదర్శకత్వం వహించటం సహజంగానే, అప్రయత్నంగానే జరిగిపోయాయి. ధ్యానాలు రోజు రోజుకీ తీవ్రతరంగాను, ఏకాగ్రంగాను పరిణమించినాయి. శ్రీఅరవిందులు సాయంవేళల్లో బయట కూర్చోవటానికి రావటం నానాటికీ ఆలస్యం అవటం మొదలుపెట్టింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ మార్పులన్నిటినీ ఎవరూ అసహజంగా భావించలేదు. శ్రీమాతారవిందుల ఈ బృహత్తర కార్యక్రమంలో సాధకుల పాత్ర చెప్పుకోదగినది. ఆశ్రమవాతావ

రణంలోని బాహ్య, అంతర్గత పరివర్తనకు వారంతా సాక్షీభూతంగా ఉన్నారు.

1926 లో దివ్యచైతన్యము వత్తిడి చేయుచున్నది

1926 ఆగస్టు 15 కు కొన్ని రోజుల ముందరా, ఆ తర్వాత జరిగిన సాయంకాల ప్రవచనాల ధోరణి చూస్తే అతిమానసానికి, సాధారణ మనసుకూ మధ్యన ఉన్న లంకె ప్రాధాన్యతను సంతరించుకొంటుంది. దీనినే శ్రీఅరవిందులు అధిమనస్సు (Overmind) అని పేర్కొన్నారు. 1920 లో బరీన్‌కు శ్రీఅరవిందులు లేఖ వ్రాసిన నాటినుండి జరిగిన ఆరుసంవత్సరములలో శ్రీఅరవిందులు ఊర్ధ్వచేతన వైపుగా ఎంత ముందుకు వెళ్ళారో అదేవిధంగా దాన్ని ప్రకృతిలోకి దించటానికి కూడా అంతే కృషి చేశారనేది స్పష్టమౌతుంది. 1926 నవంబరు ప్రారంభంలో శ్రీఅరవిందుల సాయంకాలపు ప్రసంగాలు అనేకమార్లు దివ్యచైతన్యపు అవరోహణకుగల అవకాశాలు, దాని ప్రక్రియ అనే అంశం వైపు మళ్లేవి. ఈ సంభాషణలవల్ల చాలామంది సాధకులకు ఈ అవరోహణ దగ్గరలోనే ఉందనే భావన కల్గింది. దేవతలు భూమిపైకి దిగే అవకాశం ఉన్నది" అనేది స్పష్టం అయింది. "దివ్యజీవనం" (The Life Divine) లో శ్రీఅరవిందులు ఊర్ధ్వమానసస్థాయి, చేతన, దేవతలను గూర్చి స్పష్టమైన వివరణ ఇచ్చియున్నారు. 1926 సం॥ నవంబరు 24 న సంభవించిన అవరోహణను అర్థంచేసికోవటానికి సహాయపడే కొన్ని వాక్యాలను ఈ క్రింద పొందుపరుస్తాను.

అతిమానసంలో దేవతలందరూ ఏకమగుట

"మూలసత్త్వము" (Reality) యొక్క శక్తులను మనం అనేక దేవతారూపాలుగా భావించగలిగితే, అధిమనస్సు (Overmind) అనేకవేల దేవతాస్వరూపాలను క్రియలోనికి ప్రవేశపెట్టగలదు. వారిలో ప్రతివారు తనదైన ప్రపంచం ఒకటి సృష్టించుకోగల శక్తి గలిగి ఉంటారు. అయితే ఈ లోకాలు పరస్పరానువర్తితమై, సంబంధీకృతమై అనుబంధాలు కలిగి ఉంటాయి. వేదములలో ఇలాంటి, దైవములకు చెందిన

అనేక సమీకరణాలు ప్రస్తావించబడినాయి. ఆ దేవతలంతా ఒకే సత్తకు చెందినవారని చెప్పబడ్డారు. అయినా ప్రతి దేవత తానే సత్తయొక్క అసలు రూపం అయినట్లుగాను మిగతా దేవుళ్లంతా తనలోనే ఇమిడియున్నట్లున్నూ ఆరాధింపబడ్డారు. కాని ప్రతి దైవం ఒక ప్రత్యేక దైవం. అయితే ఒక్కోసారి సహదైవాలతో కలసి వర్తిస్తూ ఉండటం, లేక వారికి వ్యతిరేకంగాను, వేరుగాను ప్రవర్తిస్తూ ఉండటం కద్దు. అయితే అతిమానసస్థాయిలో ఈ భిన్నత్వం అంతా ఒక సామరస్యపూరిత లీలలా గోచరిస్తుంది. అధిమనస్సులో ఈ మూడుస్థితులూ స్వతస్సిద్ధమైన అభివృద్ధి, పరిణామశీలత కలిగిన విభిన్నస్థితులుగాను, లేక మిగిలిన స్థితులతో కలసి ఇంకా అధికతరసంయుక్తత గలిగిన సామరస్యపూరిత శక్తిగలవిగా కూడా ఉంటాయి.

ఏకైక చైతన్యము అనేక రూపములుగా వేరగుట

ఏకమాత్రసత్త వలెనే చైతన్యము మరియూ శక్తికూడ – ఒకటైన చైతన్యమే. స్వతంత్రప్రతిపత్తిగలిగిన అనేక చైతన్యవిజ్ఞానరూపాలుగా ప్రభవిస్తుంది. ప్రతి ఒకటీ తనదైన సత్యమార్గాన్ని యథార్థ్యం చేసే దిశగా పయనిస్తుంది. విభిన్నముఖాలు కలిగి కూడా ఒక్కటిగా ఉండగలిగిన యథార్థభావన తనకుగల విభిన్నముఖాలుగా విచ్ఛిన్నమై, ఒక్కొక్కటి స్వయంప్రతిపత్తిగల స్వయంభువు కాగల భావనాశక్తిగా అవుతుంది. ఒకటిగానున్న చిచ్ఛక్తినుండి స్వతంత్రమైన శతసహస్రశక్తులుగా విడుదల అవుతాయి. వీటిలో ప్రతిదీ తనను పరిపూర్ణం గావించుకోవటానికిగాని, అవసరమైతే, స్వప్రయోజనార్థమైగాని, ఇతరశక్తులపై ఆధిపత్య నాయకత్వములను సంతరించుకొని వాటిని లోబరచుకోటానికిగాని హక్కు కలిగి ఉంటుంది. అదే విధముగా సచ్చిదానందము కూడ వివిధములైన ఆనందశకలాలుగా విడిపోగలదు. కాని ఈ వేర్వేరు ఆనందశకలాలు స్వతంత్రమైన పరిపూర్ణస్థితిని చేరుకోగలగటంగాని, సర్వసత్తాస్థితిని సాధించటంగాని చేయగలిగి ఉంటాయి. ఈ విధంగా ఊర్ధ్వచేతన ఒకటిగానున్న సచ్చిదానందస్థితికి అనంతములైన అవకాశములను

కల్పిస్తుంది. ఇవన్నీ అనేకమైన లోకాలుగా ప్రభవించటంగాని, ఒకటిగా చేరి ఒకే లోకంగా వర్తిస్తూ నిరంతరం మార్పుచెందగల లీలల ద్వారా తమ సృష్టిని, ప్రక్రియను, గమనాన్ని, పరిణామాన్ని నిర్దేశించుకోగలిగి ఉంటాయి."

అధిమానసలోకపు లక్షణములు

"(అధిమనస్సులో) ప్రతి దైవానికి సత్తలోగల ఇతరదైవాల స్థానము తెలిసి ఉంటుంది. ప్రతిభావన ఇతర భావనలను, ఉనికిలో వాటికిగల స్థానాలను అంగీకరిస్తుంది. ప్రతి శక్తి ఇతరశక్తుల యాథార్థ్యాన్ని, పర్యవసానాలను ఒప్పుకొంటుంది. ప్రత్యేకమైన సాఫల్యతను సిద్ధింపచేసుకొన్న ఏ ఆనందస్థితిగాని, అనుభవముగాని, ఇతరస్థితులను లేక అనుభవముల లోని ఆనందాన్ని త్రోసిరాజనటంగాని, నిషేధించటంగాని చేయదు. ఊర్ధ్వమనస్సు అనేది విశ్వసత్యము యొక్క నియమము. విశాలము, అనంతము అయిన విశ్వసౌజన్యతయే దాని ఆత్మ. పరిపూర్ణ క్రీయాశీలత్వము, మరియు ప్రత్యేక చలనశీలత్వము దాని శక్తి."

ఊర్ధ్వచైతన్యము దిగివచ్చే సూచనలు

సూచనప్రాయమైన వ్యక్తిగత అనుభవంవల్లనైతేనేమి, ఆశ్రమవాతావరణ ప్రభావంవల్లనైతేనేమి ఊర్ధ్వచేతనయొక్క అవరోహణ త్వరలో సంభవించగలదన్న భావన చాలామంది సాధకుల (శిష్యుల) మనసులలో బలపడసాగింది. ఆశ్రమముయొక్క బాహ్యాస్వరూపంలో పెద్దమార్పులు సంభవించగలవని చాలామంది భావించారు. సాయంకాలం కూర్చోటానికి శ్రీఅరవిందులు సాధారణంగా వచ్చే 4-30 గంటలు క్రమంగా ఆరు, ఏడు లేక ఎనిమిది అవుతూ ఉండేది. ఒకరోజు రాత్రి రెండుగంటలకు రావటం ముందెన్నడూ లేనిది! శ్రీఅరవిందుల శక్తులన్నీ ఊర్ధ్వచేతనను అధిరోహింపజేయటానికే వినియోగింపబడుతున్నాయనీ, వారొక లిప్తకాలం కూడ మిగతా వాటికై మరలించటంకాని, వృథాచేయటంగాని జరగటం లేదనేది స్పష్టం అవుతుంది. శిష్యులతో బాహ్యాసంబంధం కలిగివుండటం అవసరమై

యున్నప్పటికీ, తన అంతర్గతమైన పరిశ్రమకు అధికసమయం అవసరమై యుండుటవల్ల, శ్రీఅరవిందులు వారితో గడపటం కష్ట తరం అవుతూ వచ్చింది.

దైవకార్య నిమిత్తమై శ్రీఅరవిందుల ఏకైక దీక్ష

వారి బృహత్తర కార్యక్రమం ఏమీ తెలియనివారు, వారు దైవకార్యంలో ఎంత నిజాయితీతోనూ, ఏకాగ్రతతోనూ ఉండేవారో కొంచెం కూడ గ్రహించలేరు. నిజానికి బయటవ్యక్తులు వారి మహత్తర ప్రయత్నాల ఆచరణీయ ఫలితాలను గురించి సందేహాపూరితంగా ఉండేవారు. వారి ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని గురించి గొప్ప ఆశలు నిర్మించుకున్న నిజమైన ఆరాధకులు సైతం నిరాశపడజొచ్చారు. శ్రీఅరవిందులవారు అఖండమైన పరబ్రహ్మాను వెతుకుతూ ఏ ఊషర క్షేత్రాల్లోనో దారితప్పి ఉంటారనీ, అనంతంలోని అర్థంకాని ఆవృతములలో చిక్కుకొని ఉంటారనీ, తమ అజ్ఞానంవల్ల భావించేవారు! శ్రీఅరవిందులు ఈ భూమిపై పట్టు వదిలివేశారని, వేదనాపూరితమైన మానవాళియొక్క తీవ్రమైన, అత్యవసరమైన సమస్యలను పట్టించుకోవటం లేదనీ నమ్మారు. అలా కాకపోతే వారి దివ్యమైన మరియు ఉపశమనం కల్గించే సహాయం కోసం అంతగా అలమటించే మానవాళికి సహాయం చేద్దామని తొందరపడకుండా ఉంటారా? దివ్యమయిన అట్టి సహాయం అపుడు కాక మరెపుడు అవసరమౌతుంది?

దివ్యచైతన్యము ఫలితములనిచ్చుట

కాని, పైకి కనిపించే అసంబద్ధతలు అలా ఉండగా అదృష్టవశాత్తూ వారి సాన్నిహిత్యంలో నివసించే కొద్దిమంది మాత్రం శ్రీఅరవిందులు భూమ్మీద ఆవిష్కరింపబూనే ఆ ఊర్ధ్వశక్తి ఆచరణయోగ్యమైన ఫలితాలను ఇచ్చే సమర్థత కలిగి యుండుటయేగాక, నిజంగానే అలాంటి ఫలితాలని ఇస్తూ ఉన్నదని బాగుగా గమనించారు. ఊర్ధ్వశక్తితో శ్రీఅరవిందులకుగల సంబంధం, తాదాత్మ్యత ఎలాంటివంటే వారి సామీప్యంలోగాని, దూరంగాగాని ఉన్నవారిని సైతం ఆ శక్తితో ఓ సంబంధం కలి

గేలా చేసేవారు. వారి సహాయంతో శారీరకరుగ్మతలు నయంచేసు కొన్న సందర్భాలు ఉంటూ ఉండేవి. పరబ్రహ్మమార్గంలో దారి తప్పారన్న మాట నిజం కాకపోవటమేగాక, అందుకు భిన్నంగా మారి మార్గాన్ని రోజు రోజుకూ మరింత స్పష్టంగా చూసేవారు. ఆ అవరోహణ భూమ్మీద సంభవించటం సృష్టిలో తప్పనిసరి యైన మరియు సహజమైన పరాకాష్ఠ అని భావించేవారు.

మానవాళిపై శ్రీవారి అనుగ్రహం

శ్రీఅరవిందులుకంటె మరెవరికీ మానవాళిపై ఎక్కువ సానుభూతిగాని, ఆవేదనగాని లేవనేవి వారి శిష్యులకు తెలుసు. వారి నుండి మానవాళికి జాలువారుతున్న నిశ్చల, సుస్థిర సహాయాన్ని వారు కొన్ని సందర్భాలలో గమనించారు కూడ. ఆశ్వపతిని గూర్చి శ్రీఅరవిందులు "సావిత్రి" లో వ్రాసిన "అతని ఆత్మయొక్క నిశ్చలత్వం సంక్షోభిత ప్రపంచానికి తోడ్పడింది" అనే వాక్యాన్ని చదివినపుడు, ఇది శ్రీఅరవిందుల స్వానుభవమే అన్న భావన వారికి తర్వాత కలిగింది. "ప్రయోజకత్వం" అని అందరూ అతిగా చెప్పుకొనేది మరొకటి ఉందా? "మీ సమస్యలు పరిష్కారం చేస్తాను" అనే ప్రగల్భం, సమస్యలను పరిష్కరిస్తుందా? నిజంగా శాశ్వతంగా తీరకపోవటంగాని, పాక్షికంగా తీరటంగాని జరిగి, కర్తకు అసత్యపుతృప్తి మరియు అసత్యపు ఆత్మసంతృప్తి కలగటంగాక మరేమౌతుంది? నిజానికి మాయా కల్పిత సంతృప్తియొక్క భ్రమలో పడనంత దృఢమైన పట్టు ఈ ప్రపంచంపై వారికి ఉన్నది.

'కర్మసు కౌశలం' అంటే ఏమిటి?

వారి దృష్టిలో "కర్మసు కౌశలం" అంటే ఉన్నతమైన సత్యచేతన నుండి వర్తించటమే. ఊర్ధ్వచేతన భౌతికభూమికకు దిగనంతకాలం, అంతేకాదు స్థూలపదార్థ చేతనలోనికి దిగనంతవరకు బాహ్యకార్యక్రమాలను ప్రారంభించాలని వారు కోరటం లేదు. ఆ విధంగా మాత్రమే 'దైవాన్ని సంపూర్ణంగా తనలో వ్యక్తం చేసుకోగల నూతనజీవనం' రూపొందు

తుంది. మానవసమస్యలకు అంతిమపరిష్కారం, వారు ప్రారంభిం చిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో మాత్రమే ఉంది.

శరీరకణములు దివ్య చైతన్యమును గ్రహించుట

రోజులు, నెలలు, సంవత్స రాలు గడచిపోయాయి. శ్రీఅర విందులు తన కార్యక్రమం ప్రారంభించటానికి ఏమాత్రం తొందరపడటం లేదు! ఊర్ధ్వశక్తి దిగిరావటానికి తగిన పరిస్థితులను వారు ఇంతకాలమూ సిద్ధం చేస్తూ ఉన్నారు. అలాంటి ఎట్టి ప్రయత్నానికైనా, అజ్ఞానశక్తుల నుండి రాగల నిరోధం సహజంగా చాల తీవ్రమైనది. దేహకణా లను, ఆ దివ్యతేజఃప్రసారానికి తెరచియుంచటం కోసం బ్రహ్మాం డమైన కార్యక్రమంలో వారు నిమగ్నమైయున్నారని, దీనికి అచే తననుండి తీవ్రనిరోధం ఎదుర్కొనవలసి వస్తున్నదని వారే ఒక సాయంత్రం తమ ప్రసంగంలో తెలిపారు. (మహాబలాఢ్యుడైన వారు మాత్రమే భరించగల ఈ శ్రమ) లేక అతికష్టమైన ఈ శ్రమ శ్రీఅరవిందులు తనకోసంకాక సర్వమానవాళి కోసమే చేపట్టా రనీ, పరిణామక్రమంలో మానవుడు ఒక క్రొత్తపుంత తొక్కటం కోసం ప్రయత్నించారనీ "సావిత్రి" లోని ఈ క్రింది వాక్యాలు వారికే వర్తిస్తాయని స్పష్టమౌతుంది. "The world unknowing, for the world she stood".

అందువలన, శ్రీమాతారవిందుల అనుగ్రహంవలన వారి శిష్యులు కూడ శుభముహూర్తం దగ్గరపడుతూన్నట్లు భావిం చటం, వారి హృదయాలు ప్రతీక్షతో, ఏకాగ్రతతో నిండియుం డటం సహజమే మరి.

నవంబరు 1926 మొదటి నుండి పైనుండి శక్తి వత్తిడి

1926 నవంబరు నుండి "ఊర్ధ్వశక్తి" యొక్క ఒత్తిడి భరించరానిదిగా ఉండేది. చిట్టచివరకు నవంబరు 24 న శ్రీమాత అనేక సంవత్సరాలుగా ఎదురుచూచిన ఆ విశేషదినం రానే వచ్చింది. సూర్యుడు దాదాపు అస్తమించాడు. అందరూ తమ తమ పనులమీద వెళ్లారు. కొందరు సముద్రతీరానికి వాహ్యాళికి వెళ్లారు. ఆ సమయంలో శ్రీమాత

అందరినీ సాధారణంగా ధ్యానం జరిగే వరండాలో వెంటనే సమావేశం కావలసిందిగా కబురు పంపించారు. ఆ వార్త అందరికీ చేరటానికి ఎంతోసేపు పట్టలేదు. ఆరుగంటలకల్లా సాధకులు చాలావరకు అక్కడకు చేరుకున్నారు. అప్పుడే చీకట్లు అలముకొంటూ ఉన్నవి. వరండాలో శ్రీఅరవిందుల గదిగుమ్మం దగ్గర ఆయన కుర్చీ వెనుక మూడుచైనాడ్రాగన్లు (నిప్పులు క్రక్కే సరీసృపాలు) గల నల్లని తెర వ్రేలాడుతూ ఉన్నది. ఆ డ్రాగన్లు ఒకదాని నోట్లో మరొకదాని తోక ఉన్నట్లు చిత్రించబడి ఉన్నాయి. ఆ చిత్రం తెర మొత్తం ఆక్రమించి ఉంది. ఆ తర్వాత మాకు తెలిసింది. చైనాలోని ఒకానొక జోస్యం ప్రకారం ఎప్పుడైతే మూడుడ్రాగన్లూ కలిసి ఉంటాయో అప్పుడు సత్యం భూమిపైకి అభివ్యక్తం అవుతుంది (ఆ డ్రాగన్లే భూమి, మనసు, ఆకాశము). ఈ నవంబరు 24 న సత్యము భూమిపై అవతరిస్తూ ఉన్నది. ఆ తెర ఆ విధంగా ప్రాధాన్యతను సంతరించుకొంటుంది.[2]

దివ్యచైతన్య స్రవంతి

శిష్యులంతా వచ్చిన తరువాత ఒక గాఢమైన ప్రశాంతత అక్కడ నెలకొని ఉన్నది. మహాసముద్రప్రవాహం వలె పైనుండి ఎగసిపడుతున్న ఓ తేజఃపుంజాన్ని చాలమంది తిలకించారు. తలపై ఏదో అవ్యక్తమైన ఒత్తిడిని అందరూ అనుభవించారు. ఒకానొక

---

[2] హార్ధన్ బక్షిగారి దినచర్యపుస్తకంలో 2-12-1926 నాడు రాసిన విషయము (అప్రకటితము)

ఆ తెరమీద బొమ్మను గురించి శ్రీమాత ఈ విధంగా చెప్పారు. అది అమరత్వానికి చైనీయుల (జపాను కూడ) సంకేతము. ఆ తెరగుడ్డ జపాను తయారి. ఆ గాథ ప్రకారం, ఆ మూడు డ్రాగన్‌లు (చైనా సరీసృపాలు) – అఖాతమునకు, భూమికి, వాయువుకు చెందినవి – కలిసినప్పుడు మనిషి అమరుడవుతాడు. చైనాదేశంలో డ్రాగన్ దేవతాచిహ్నము. ఈ సాంప్రదాయము మనదేశంనుండి వెళ్లి వాళ్ల రూపాన్ని పొందినదే. మరియొక నాల్గవడ్రాగన్ క్రిందికి వచ్చినప్పుడుగాని ఆ అమరత్వము లభించదు. అతిమానసదేవతయే ఆ నాల్గవడ్రాగను.

విద్యుదావేశం ఆ ప్రదేశాన్ని ఆవహించినట్లు అనిపించింది. ఆ నిశ్శబ్దంలో కేంద్రీకృతమైన ఆకాంక్ష, ప్రతీక్షలతో నిండియున్న ఆ వాతావరణంలో సర్వసాధారణం అయినా అసాధారణం అని పించే "టిక్" అనే శబ్దం ప్రవేశద్వారపు తలుపు వెనుక వినపడింది. ఆశ ఉవ్వెత్తున ఎగసింది. వారగా తీసిన తలుపుసందుల్లో నుండి శ్రీమాతారవిందులు దర్శనమిచ్చారు. శ్రీమాత తన కను సన్నలతో శ్రీఅరవిందులను ముందుకు అడుగిడవలసినదిగా సూచించారు. అదే విధంగా ఆమెను కూడ రమ్మన్నారు. గంభీరమైన మెల్లని అడుగులతో శ్రీమాత ముందుకు రాగా, శ్రీఅరవిందులు కూడ గంభీరమందయానంతో అనుసరించారు. వారి కుర్చీ ముందుండే చిన్నబల్ల ఆ రోజు లేదు. శ్రీఅరవిందుల కుడి వైపున శ్రీమాత ఒక చిన్నబల్లపీట పై కూర్చున్నారు.

పరిపూర్ణ సజీవనిశ్చలత – దైవత్వం తొణికిసలాడే సజీవ నిశ్చలత అది. ధ్యానం దాదాపు నలభై ఐదు నిమిషాలు కొనసాగింది. ఒకరి తర్వాత ఒకరుగా శిష్యులు శ్రీమాతకు ప్రణమిల్లారు. *శ్రీమాతారవిందులు వారికి తమ దీవెనల నందించారు. ఆ సమయంలో, శ్రీమాత ద్వారా తాను దీవిస్తున్న భావన కలిగేటట్లుగా, శ్రీఅరవిందులు శ్రీమాత వెనుకనుండి తన కుడిచేతిని ముందుకు రానిచ్చారు. అనంతరం అదే మౌనంలో కొద్దిసేపు ధ్యానం జరిగింది.* ఆ ప్రశాంతధ్యానం, దీవెనల విరామంలో అనేక మంది ప్రత్యేక అనుభూతులు పొందారు. అంతా అయిపోయిన తరువాత ప్రతివ్యక్తీ తామొక దివ్యస్వప్నం నుండి మేల్కాంచినట్లు భావించారు. ఆ వైభవము, ఆ పరవశము, ఆ పరిపూర్ణ సౌందర్యానుభూతి వారనుభవించారు. ఏదో వేళ్ళపై లెక్కించగల కొద్ది మంది మాత్రమే శ్రీమాతారవిందుల దీవెనలందుకున్న సమయం కాదది – ఆ సమయం (ముహూర్తం) యొక్క ప్రాధాన్యత అంత కంటే బహువిశిష్టమైనది.

It was certain that a Higher Consciousness had descended on earth. In that deep silence had burgeoned forth, like the sprout of a banyan tree, the beginning of a

mighty spiritual work. This momentous occasion carried its significance to all in the divine dynamism of the silence, in its unearthly dignity and grandeur and in the utter beauty of its every little act. The deep impress of divinity which everyone got was for him a priceless treasure.

శ్రీమాతారవిందులు లోనికి వెళ్ళారు. దత్తా వెంటనే స్ఫూర్తి పొందారు. "దైవం ఈనాడు భౌతికంలోనికి దిగాడు" అని ఆ మౌనంలోనే వారన్నారు. నవంబరు 24 కూడ, శ్రీమాతారవిందుల జన్మదినోత్సవాలకు ఇచ్చే ప్రాధాన్యత ఇవ్వాలనేది న్యాయమే. ఎందుకంటే ఆనాడు వారి ఉద్యమానికి ప్రతీకగా ఊర్ధ్వశక్తి భూమిమీద అవతరించింది. ఏ ఊర్ధ్వమానసమైన అనంతచైతన్యం శ్రీకృష్ణునిగా అవతారం దాల్చిందో అదే చైతన్యం ఈనాడు భౌతిక పదార్థంలోకి దిగివచ్చి, అతిమానసావతరణకి దోహదం చేసింది.

తర్వాతకూడ శ్రీఅరవిందులు అనేక సందర్భాలలో దీన్ని గురించి వ్రాశారు. అక్టోబరు 1935 లో ఇలా వ్రాశారు. "అది (24-11-1926) శ్రీకృష్ణుడు భౌతికంలోకి దిగిన రోజు."

"శ్రీకృష్ణుడు అతిమానసతేజస్సు కాదు. తానుగా తీసికొని రానప్పటికీ, అతిమానసము, ఆనందము పదార్థంలోకి దిగిరావటానికి రంగం సిద్ధం చేస్తున్న ఊర్ధ్వమానసదేవతామూర్తియే శ్రీకృష్ణుడు. ఆయన ఆనందమయుడు, పరిణామక్రియను తన ఆనందంవైపుకు నడిపించటానికి ఊర్ధ్వమానసంద్వారా చేయూతనిస్తాడు"[3]

24 నవంబరు, 1926 నాడు అక్కడున్న శిష్యులు:[4]

1. బిజయ్ కుమార్ నాగ్ 2. నళినీకాంత గుప్త 3. కె. అమృత 4. మోని (సురేష్ చక్రవర్తి) 5. పవిత్ర (ఫిలిప్ బార్‌బియర్ సెయింట్ – హిల్లర్) 6. బరీంద్ర కుమార్ ఘోష్ 7. దత్తా (మిస్ హాడ్గసన్)

---

[3] శ్రీఅరవిందులు, *On Himself*, p. 136

[4] ఇందులో అందరి పేర్లూ లేవేమో అనిపిస్తోంది. హార్ధన్ బక్షి పేరు లేదు.
సంపాదకుడు

8. కె. రాజంగమ్ 9. సత్యేన్ 10. ఎ. బి. పురాణి 11. లీలావతి (పురాణీగారి భార్య) 12. పూనమ్‌చంద్ 13. చంపాబెన్ (పూనమ్ చంద్‌గారి భార్య) 14. రజనీకాంత్ పలిట్ 15. డా॥ ఉపేంద్రనాథ్ బెనర్జీ 16. చంపక్‌లాల్ 17. కనైలాల్ గంగూలీ 18. ఖితీష్ చంద్ర దత్ 19. వేలూరి చంద్రశేఖరం 20. పూజాలాల్ 21. పురుషోత్తమ్ పటేల్ 22. రతి పలిట్ 23. రాంభాయి పటేల్ 24. నానీ బాల.

అనువాదం కె.ఆర్.ఎల్. నరసింహారావు

హరధన్ బక్షి దినచర్య పుస్తకంలోని కొన్ని విశేషాలు

24 నవంబరు 1926:

మీరాదేవి 7 గం॥ లకు మమ్మల్ని మేడమీద వరండాలోకి రమ్మని పిలిచారు. ఇరవైనిమిషాల తర్వాత శ్రీమీరాదేవి, శ్రీఅరవిందులు వచ్చారు. వారికి మేమందరము పాదాభివందనము గావించితిమి. ఆనాడు శ్రీఅరవిందులు నన్ను కొత్తరకంగా ఆశీర్వదించారు. నేను నా లోటుబాట్లకు పశ్చాత్తాపము జెంది, పైనుంచి సత్యము దిగివస్తోందని తలచి, దాన్ని గ్రహించుటకై తయారగుచుంటిని. సామూహికంగా దీక్ష జరుగుతున్నట్లు నా కనిపించింది. అందుకని నా అంతరంగిక కవాటములను తెరచి పెట్టుకొని రిసెప్టివ్‌మూడ్‌లో ఉన్నాను. శ్రీమీరాదేవి శ్రీఅరవిందుల పాదములచెంత కూర్చొని ఉన్నది. ఆయన ఒకచేతిని శ్రీమాత శిరస్సు మీద (ముట్టుకోకుండా) ఉంచి రెండవ చేత్తో మమ్ములను ఆశీర్వదించారు. శ్రీమీరాదేవి కూడ మమ్ముల నాశీర్వదించారు.

గోడమీద ముఖ్మల్‌గుడ్డతో చేసిన తెర ఒకటి ఉన్నది. దాని మీద ముదురునీలము, బంగారుఛాయలతో వేసిన బొమ్మలున్నాయి. అవి కాంతిమయమైన శక్తులను, దేవతలను స్ఫురింపజేస్తూ భగవంతుడిని, ఆయన రాజ్యాన్ని క్రిందికి తీసుకొని వస్తు

న్నట్లనిపించింది. వాటిలో ఒకపక్షి బంగారుఛాయలో ఉండి గరుత్మంతుని పోలివున్నది.

ఆ తరువాత వారిరువురు లోపలికి వెళ్లిపోయారు. I opened myself widely to them to know their demands on me. నా హృదయంలో శ్రీమీరాదేవి స్పర్శను, మనస్సులో శ్రీఅరవిందుల స్పర్శను పొందినట్లు నాకు అనుభూతమైంది. ఇక నా సాధనలోని కష్టాలు పైకి విజృంభించి నన్నెదిరించటల్లేదు. కాని అవింకా మాయం కాలేదు.

నన్ను రక్షించి శిష్యునిగా స్వీకరించమని వారిని ప్రార్థించితిని. చివరకి దత్త "మహాప్రభూ, దిగిరమ్మ. దుఃఖాన్ని, మృత్యువుని ఓడించి మాకు అమరత్వమును ప్రసాదించుము" అని ప్రార్థించెను.

కాని ఆ రహస్యం రహస్యంగానే ఉండిపోయింది. దాన్ని తెలుసుకోవాలి. చైత్యసీమలో (in the psychic) కొంతమంది సాధకులు చుట్టూ కూర్చుని మధ్యలో ఎవరికో (స్పష్టంగా కనపడలేదు) సమర్పించుకుంటున్నట్లు నాకు అనుభూతమైంది. అప్పుడు రాత్రి 10 గం॥ అయింది. శ్రీఅరవిందులు, శ్రీమాత లోపలికి వెళ్లిపోయారు. జరిగినదాన్ని గురించి ఏమైనా సూచన వస్తుందేమోనని నేనా రాత్రి చాలా నిశ్శబ్దంగా ఉన్నాను. నా శరీరంలో ఒక భావము రూపుదిద్దుకుంది. ఎవరో చూపుడువేలుమీద చక్రాన్ని ధరించి ఇంకో చేత్తో నన్నాశీర్వదించినట్లు స్ఫురించింది. (అది శ్రీకృష్ణుడు వస్తున్నాడనే నా ఆలోచనవలన అయివుండవచ్చును.)

25 నవంబరు 1926

నిన్న దత్తాగారు తన ప్రార్థనలలో శ్రీకృష్ణుడు వచ్చినట్లు చెప్పారని రాజంగం గారు నాకు చెప్పారు. శ్రీకృష్ణుడు దిగివచ్చి కొన్ని విభాగముల మినహా భౌతికమునంతను జయించినట్లు మీరాదేవి డాక్టరుబాబుకు చెప్పారు. ఆ పని కూడ ఆగస్టు 15 కి పూర్తిఅయిపోతుంది.

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

శ్రీ బరీన్ ఘోష్[5] జ్ఞాపకాలు
(ఇంతవరకు ప్రచురించబడని వ్రాతప్రతులనుండి)

శ్రీఅరవిందుల మహోన్నత సిద్ధి ఆశ్రమవాతావరణాన్ని పూర్తిగా మార్చివేసే శుభఘడియలు మాకు తెలియకుండానే సమీపిస్తున్నాయి. ఒకరోజు ఉదయం శ్రీఅరవిందులు ప్రత్యేకంగా నన్ను మేడమీదకు పిలిచి సాధకులందరకి వ్యక్తిగతంగా తెలుపమని మృదువుగా నాకో ఆదేశం ఇచ్చారు. ఇకనుండి శ్రీఅరవిందులు తీవ్రమైన యోగసాధన నిమిత్తం పూర్తిగా ఏకాంతవాసంలోని వెళతారని అందరకూ తెలియజేయమన్నారు. మహత్తరమైన దివ్యపరివర్తనము జరుగుటకు ఇది తప్పనిసరి. ఇకముందు సాధకులందరూ వారివారి సాధకబాధకాలను నివేదించుకోవటానికి శ్రీమాత వద్దకే వెళ్లాలనీ, తమ వద్దకు రావద్దనీ ఆదేశించారు. శ్రీమాతే ఆశ్రమనిర్వహణకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను పర్యవేక్షిస్తారనీ, తాను మాత్రం కేవలం పరోక్షంగా సహకరించగలరనీ తెలిపారు.

ఇది విని ఆశ్రమంలోని సాధకులంతా ఆశ్చర్యచకితులైనారని నేను ప్రత్యేకంగా చెప్పవలసిన పని లేదు. వారికి ఏమీ పాలుపోలేదు. శ్రీఅరవిందులకు ఆ అద్భుతమైన సిద్ధి కలిగి వెంటనే ఆశ్రమవాతావరణాన్ని యావత్తూ తేజోభరితంగా మార్చివేసింది గాని లేనియెడల మేమామార్పును తట్టుకుండేవాళ్లం కాదు.

ఒకనాటి మధ్యాహ్నం Miss Hodgson ఒకానొక ఆనందాతిరేకస్థితిలో నావద్దకు వచ్చి ఏదో మహాద్భుతం జరిగిందనీ, శ్రీఅరవిందుల దీవెనలకై సాధకులనందరని వెంటనే పిలువవలసిందిగా నాకు తెలిపింది. చాలా ఆశ్చర్యంతో మేమంతా వెంటనే బయటి వరండాలో సమావేశమయ్యాము. కొంతసేపటికి శ్రీమాత శ్రీఅరవిందులను నడిపించుకొని వచ్చారు. అజ్ఞానాంధకారంతో ఉన్న మనుష్యమాత్రులం మేము, శ్రీఅరవిందులు అధిరోహించి,

---

[5] శ్రీఅరవిందుల తమ్ముడు

తనలో అవతరింపచేసుకున్న ఆ సమున్నత దివ్యఅంతస్సత్త్వాన్ని గమనించే స్థితిలో లేము. శ్రీఅరవిందులు సాక్షికసమాధిస్థితిలో ఉండగా శ్రీమాత వారిని బయటకు తోడ్కొనివచ్చారని మాత్రమే అనుకున్నాము. అతికష్టంమీద వారు కుర్చీలో ఆసీనులైనారు. సాధకులంతా వెంటనే మూక ఉమ్మడిగా వారి పాదాలపై పడి – కొంచెంకూడా అర్థం చేసికొనలేకపోయినా అప్రయత్నంగానే ఆరాధనాభావంతో, సాష్టాంగపడకుండా ఉండలేకపోయారు.

మరునాటి ఉదయంనుండి శ్రీఅరవిందులు మామధ్య లేరు. శారీరకంగా వారు కనుమరుగైనా, సృష్టి వెనుకన ఉన్న అవిచ్ఛిన్న దివ్యత్వంవలె, నిత్యసిద్ధగంభీర మౌనశక్తివలె, మా వెన్నంటే ఉండేవారు. మా మధ్యన కలసిమెలసి ఉన్నప్పటికంటె మేము ఆయననూ, ఆయనతోగల అతీంద్రీయ సంబంధాల ప్రభావాలను ఇంకా స్పష్టంగా అప్పుడు పొందగలిగాము. అనిర్వచనీయమైన ఈ ఏకాంతస్థితివలన వారు ఒక అదృశ్యక్రియాశక్తివలె, వారి అనుభవాలను, తేజస్సును మరింత శక్తివంతంగా ప్రసారం చేస్తూ ఉండేవారు. వారు ఏకాంతాన్ని కోరుకోవటంవలన వాతావరణం ఉద్రిక్తంగా (tense) ఉద్వేగభరితంగా (electric) మారిపోయింది. వారియొక్క ఏకోన్ముఖవాంఛ, మరియు యోగసాధన యొక్క తీవ్రత చాలవరకు ఈ అద్భుతపరిణామాన్ని కలిగించాయి. ప్రచ్ఛన్నమై ఇంద్రియానుభూతికి అతీతమైన శ్రీఅరవిందులు తన ద్వారా దివ్యచైతన్యము ప్రసారమై క్రియాశీలమవటానికి పూర్తి అవకాశం కల్పించారు. అచేతనమై, జడమైన మృత్తికవంటి ఈ దేహకోశము చిన్మయశక్తికి అవరోధమే అవుతుంది. చిన్మయశక్తి అంతస్సత్త్వంగా (essence) రూపాంతరం చెందేవరకు ఈ దేహం దానిని ప్రకటించనూ లేదు, ప్రసరించనూ లేదు.

ప్రాపంచపు పంకిలస్పర్శ నుండి దూరంగా ఉండేందుకే శ్రీఅరవిందులు ఏకాంతవాసంలోనికి వెళ్లారుకాని నిజానికి అధికారం వారి చేతుల్లోనే ఉండేది. ప్రతిచిన్న విషయం వారికి నివేదించబడేది. ప్రతిదానికి, అదెంత చిన్నవిషయమైనా, శ్రీమాత వారిని సంప్రదిస్తూ ఉండేవారు. తనదైన సృష్టిని ప్రచ్ఛన్నంగా

శ్రీమాత ద్వారా పర్యవేక్షిస్తూ, దిశానిర్దేశం చేస్తూ శ్రీమాతయొక్క అద్భుత కార్యనిర్వాహక సామర్థ్యాన్ని, వివిధ విషయాలపై ఆమె కుగల అధికారాన్ని సద్వినియోగం చేసుకుంటూ, ఒక అత్యున్న తశక్తిగా శ్రీఅరవిందులు ఉండేవారు.

అనువాదం: కె.ఆర్.ఎల్. నరసింహారావు

రజనీ పలీట్ స్మృతులు

24 నవంబరునాడు సాయంత్రం సుమారు 4 గం॥ లకు నేను ఆశ్ర మానికి వెళ్లి బిజోయ్‌నాగ్‌గారి గదిలో (ఇప్పుడు పృథ్వీసింగ్‌గారి ఆఫీసుగది) ధ్యానం చేస్తున్నాను. ఒక మహత్తరమైనశక్తి క్రిందికి దిగివచ్చుటకు ప్రయత్నిస్తున్నది. అయితే నానెత్తి మీద కలుగు తున్న ఆ వత్తిడికి నేను ముక్కలయిపోతానేమోననిపించింది. నా తలలో అవరోధాలు ఉండటంవలన ఎంత ప్రయత్నించినప్పటికి నేనా శక్తిని స్వీకరించలేకపోయాను.

సాయంత్రం సుమారు 5 గం॥ లకు 'అమృతా' ను శ్రీమాత పిలిచి శిష్యులందరిని శ్రీఅరవిందుల ఆశ్వీర్వాదములకై మేడ మీద వరండాలోకి రమ్మన్నారు.

నేనిది వినగానే బరిన్‌దా గదిలోకి వెళ్లి చాలాకాలంనుంచి ఎదురుచూస్తున్న శక్తి దిగివచ్చి ఉంటుందని చెప్పేను.

శ్రీమాత సందేశాన్ని అతిథిగృహంలో ఉన్నవాళ్లతో సహా శిష్యులందరికి చెప్పటమయినది. అయితే కొంతమంది వాహ్యాళికి సముద్రతీరానికి, మరికొంతమంది ఫుట్‌బాల్ ఆడేందుకు వెళ్లేరు.

మనుషులను పంపించి అందరిని పిలిపించేరు. అందరూ వచ్చేక మేమందరము కలసి సుమారు 6.30 గం॥ లకు పైకి వెళ్లేము.

అక్కడ ఉన్న వాళ్ల పేర్లు:

1. అమృత	9. క్షితీష్	17. పురాణి
2. బిజయనాగ్	10. లీలావతి	18. పురుషోత్తమ్
3. బరీన్ ఘోష్	11. మోని	19. రాజంగమ్
4. చంపాబెన్	12. నళినీ గుప్త	20. రజని పలిట్
5. చంపక్‌లాల్	13. నాని బాల	21. రాంభాయ్
6. చంద్రశేఖర్	14. పవిత్ర	22. రతి పలిట్
7. దత్తా	15. పూజాలాల్	23. సత్యేన్
8. కనయ్ గంగూలీ	16. పూనమ్‌చంద్	24 ఉపేంద్ర బెనర్జీ

గోడమీద, మధ్యతలుపు దగ్గర ఒక నల్లటి సిల్కుతెర కట్టి ఉన్నది. దాని మీద జరీతో చైనీస్ డ్రాగన్లు కుట్టి ఉన్నవి.

మేము రోజూ కూర్చొని ధ్యానం చేసే కొయ్యకుర్చీలను ఆ రోజు తీసేసి అక్కడ చాపలు పరిచారు.

చీమ చిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్దము అక్కడ నెలకొన్నది. వరండాలో ఆధ్యాత్మికకాంతి వెల్లివిరిసింది. మేమందరం అప్రయత్నంగానే ధ్యానంలో మునిగిపోయి గురువుగారి రాకకోసం ఎదురుచూసేము.

కొన్నినిమిషాల తరువాత సుమారు 7 గం॥ లకు తెర వెనకనున్న తలుపు తెరచుకొని మదర్, మాస్టర్లు అరుదెంచారు. ఠీవిగా నడుస్తూ గురువుగారు, వైభవంగా శ్రీమాత వచ్చారు. ఆయన పట్టుపంచ, ఉత్తరీయం ధరించి, ఆమె పట్టుచీర కట్టుకొని వచ్చారు. శ్రీవారు వారి కుర్చీలో ఆసీనులు కాగా వారి పాదముల వద్ద ఒక చిన్నబల్లమీద ఎడమవైపున శ్రీమాత కూర్చొని ఉన్నారు.

అప్పుడు మా ఎదుటనున్నది మామూలు మానవులు కారు. ఆయన వదనారవిందము తేజోవిరాజితమై మిక్కిలి గంభీరముగా ఉండెను. ఆయన సర్వజ్ఞుడువలె ఉన్నాడు. మరియు సర్వశక్తిమంతుడు, సామ్రాట్, విశ్వనాధుడు, సుదూరప్రాంతముల నుండి గమనిస్తున్న విశాలనేత్రములు, నిర్లిప్తంగా ఉండియు సమస్తలోకములకు ఆధారమై, absolutely powerful సర్వజీవులపట్ల దయ,

అనుగ్రహము కలవాడు. పరమపురుషుడు, స్వరాట్, తనను తాను పూర్తిగా జయించి సర్వాంగములయందు శరీరకణములయందు జ్యోతిరానందములను స్థాపించినవాడు.

వారి దేహము కాంతులీనుచుండెను. సర్వజీవులను తన కాంతిలోను, ప్రేమానందములలోను ముంచివేయుచుండెను.

ఇక శ్రీమాతను ఎటుల వర్ణింపవలయును? ఆమె మూర్తీభవించిన ప్రేమ, కారుణ్యము, purity, సౌందర్యము, యవ్వనము, అనుగ్రహము, కరుణాభరిత నేత్రములతో ఆమె ఎంతో గంభీరముగా నుండెను. ఆమె Mother of universe విశ్వమాత, శక్తి of the Master – శ్రీఅరవిందుల శక్తి.

అది ఒక శుభదినము. పరిణామప్రక్రియకు (evolution) ఆధారభూతమైన ఆనందమూర్తి శ్రీకృష్ణుడు భౌతికములోకి దిగి వచ్చినాడు. ఆ శుభదినమునాడు శ్రీఅరవిందులు పరమాత్మ (Supreme Godhead) గా భాసించెను.

శ్రీఅరవిందులు శ్రీమాత శిరస్సుపై ఎడముగా తన వామ హస్తమును ఉంచి, దక్షిణహస్తముతో వారిరువురికి నమస్కరించుచున్న శిష్యుల నాశీర్వదించెను. కొంతమంది శిష్యులు మళ్లీ మళ్లీ పాదాభివందనము గావించిరి.

ఎవరూ మాట్లాడలేదు. అక్కడ నిశ్శబ్దమే రాజించెను. శ్రీమాతగాని, శ్రీఅరవిందులుగాని మాట్లాడలేదు. ఆ వాతావరణము ఎంత ప్రశాంతంగా, ఆనందం పొంగిపొరలుతూ ఉన్నదో చెప్పలేను. ఆ సమావేశమంతా నిశ్శబ్దంగానే గడచిపోయింది. సుమారు అరగంట తరువాత శ్రీఅరవిందులు, శ్రీమాత గదిలోకి వెళ్లిపోయారు.

అప్పుడు దత్తా లేచి నిలబడి ఆవేశంతో "గురువుగారు శరీరరుగ్మతలను, మృత్యువును, ఆకలినిద్రలను జయించారు" అని ప్రకటించారు. మేమందరము మంత్రముగ్ధులమయిపోయి కదలలేక కాస్సేపు అక్కడే కూర్చున్నాము. స్వర్గలోకాన్ని దర్శించి వచ్చామా అనిపించింది. తరువాత ఒక్కొక్కళ్లము కిందికి దిగి వెళ్లిపోయాము.

ఆ విపరీతమైన పారవశ్యములను, వత్తిడులను నేను తట్టుకోలేకపోయాను. శ్రీమాతతో ఇంటర్వ్యూ కావాలని బరీన్‌దాని అడిగాను.

రాత్రి 9 గం॥ లకు నేను శ్రీమాత పద్దకు వెళ్లి పాదాభివందనము గావించి నా కష్టాలను గురించి విన్నవించుకున్నాను. అంతా సర్దుకుంటుందిలే అని ఆమె హామీ ఇచ్చి నన్నాశీర్వదించారు.

ఆ తరువాత అలవాటు ప్రకారం శ్రీమాత అందరికి 'సూప్' పంచిపెట్టారు.

ఆ మర్నాడో లేక ఒకటి రెండురోజుల తరువాతనో శ్రీఅరవిందులు మమ్మల్ని కలుసుకోవటం మానేసి తన గదిలోకి రిట్టైరయిపోయారు.

అనువాదం: ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి, ఆర్.ఎల్. ప్రసాదమ్మ

(Mother India, Dec. 1962, pp. 22-28)

జయాదేవి (నానిబాల) గారి స్మృతులు

అది 1926 ఆశ్వీయుజమాసం. శ్రీఅరవిందులు దర్శనమిచ్చినప్పుడు నేను "ప్రభూ! ఆశ్వీయుజమాసము వచ్చినది. ప్రతి యేడూ నేను మహాష్టమిపూజ చేస్తానుగదా, కాని ఇప్పుడేమి చేయాలో తోచటం లేదు. ఇంటికి వెడదామా వద్దా అని తటపటాయిస్తున్నాను" "ఎందుకు? ఇక్కడ పూజ చేసేందుకు వీలు లేదా?" అని వారడిగారు. "ఆ వీలుంది 'శివ-దుర్గ' లను పూజించవచ్చును. మిమ్ములను, శ్రీమాతను నేను ఆరాధించగలిగినట్లైతే బహుశ నేనిక్కడ నుంచి వెళ్లనక్కరలేదేమో అని అనుకుంటున్నాను...."

"సరే, నీవు అలా చేయవచ్చును"

మహాష్టమినాడు శ్రీఅరవిందులను శ్రీమాతను రెండుకుర్చీలలో కూర్చోబెట్టి, పూలహారాలు వేసి, నిత్యపూజావిధానం

ప్రకారం పూజ చేసాను. *అప్పుడు శివుడు, దుర్గ మా పూజలను అందుకొనేందుకు క్రిందికి దిగివచ్చారా అనిపించింది.* పూజానంతరం వారు అక్కణ్ణుంచి వెళ్లిపోయారు. మరునాడు వారు "పూజ చేసేశావు గదా. మరి, నీవు వెళ్లాలా" అని అడిగారు. నేను "ఔనండి. నేను కనీవినీ ఎరుగనివిధంగా ఈ పూజ జరిగింది". "సరే మంచిది" అని వారన్నారు.

ఒకరోజు రాత్రి నేను గాలిలో ఎగిరిపోతున్నట్లు, నన్ను పట్టుకోవాలని ఒక ఏనుగు ప్రయత్నిస్తున్నట్లు నాకు కల వచ్చింది. ఉపేన్‌గారు నన్ను పైకి తోస్తూనే ఉన్నారు. నేను వంటిమీద తెలివిలేనట్లు, నిస్పృహాగా తిరుగుతున్నట్లు ఉన్నది.

మరునాటి ఉదయం నేను దర్శనానికి వెళ్లితిని. నా అలవాటు ప్రకారం కుర్చీని పట్టుకొని కూర్చున్నాను. రాత్రి కలను గురించి వారికి చెప్పి అలాంటి కల ఎందుకు వచ్చిందని అడిగాను. "నువ్వు పైకెక్కుతున్నావు. కాని నీ శరీరానికి నీవలా తప్పించుకొనిపోవటం ఇష్టం లేదు. అందుకనే అది నిన్ను వెంబడిస్తోంది. ఉపేన్‌గారు నిన్ను పైకి తోస్తున్నారు. నీ శరీరమే దానిని నిరోధిస్తోంది". ఇంకా అనేక విషయాలను గురించి వారు చెప్పారు కాని, అవన్నీ నాకు గుర్తు లేవు.

నవంబరుమాసం వచ్చింది. సాధకులందరిలోను ఒక వింత ఆనందం పొంగిపొరలుతూంది. పాండిచ్చేరి ఊరంతా అగరువత్తుల ధూమంతో సువాసనభరితమై ఉంది. ఏదో పరమానందము వ్యాపించి ఉన్నది. దుర్గాపూజ పండుగ సమయంలో కలిగే భావమువలెనే ఉన్నది. అయితే అంతకంటె ఇంకా చాలా ఎక్కువగా ఉన్నది. విజయబాబు, బరీన్‌దాలతో నేనీ విధంగా చెప్పాను. "సోదరులారా! నాకు లోపల చాలా సంతోషంగా ఉన్నది. ఎంత ప్రశాంతంగా ఉన్నదో చెప్పలేను. దీనికి కారణం ఏమై ఉంటుంది? "ఔనా! నిజంగానా సోదరీ" అని విజయబాబు అన్నారు. "ఎంత ప్రగాఢమైన శాంతి, ప్రగాఢమైన ఆనందము!" శ్రీఅరవిందుల దర్శనానికి వెళ్లినప్పుడు నేను అన్నాను. "ప్రభూ! కొద్దిరోజులుగా విపరీతమైన శాంతి ఆనందములు నన్ను ఆవహించినవి. మొత్తం

పాండిచ్చేరి ఊరంతా ఏదో పండగ వాతావరణము ఆవహించి యున్నది. ఎటు చూసినా అగరువత్తుల ధూపము, సుగంధపరిమళాలు. దీనికి కారణము ఏమిటి ప్రభూ?"

చిరునవ్వు నవ్వుతూ "నీకీ అనుభూతి కలుగుతున్నదా?" అని అడిగారు.

"ఒక్క నాకే కాదు. సాధకులు అందరూ కూడ ఒక గొప్ప శాంతి తరంగాన్ని, ఆనందసాగరములను అనుభూతి పొందుతున్నారు. ఆంతరంగిక ఆనందంతో నాట్యమాడుతున్నారు. ఎందుకని ప్రభూ?"

"కాస్త ఓపిక పట్టమ్మా, ఇంతకంటె మరింత ఆనందం రాబోతుంది" అని వారన్నారు.

నవంబరు 24 నాడు సాయంత్రం అవుతుండగా సాధకులందరిని రమ్మని చెప్పారు. మేమందరం ఒకరి తరువాత ఒకరం పై వరండాలోకి చేరాము. శ్రీమాతారవిందులిరువురు మమ్ములను ఆశీర్వదించారు. "పరమచైతన్యశక్తి, మహాశక్తి శ్రీఅరవిందులలోకి దిగివచ్చింది" అని నాకు చెప్పారు. *వారి శరీరంలోంచి దివ్యకాంతి బహిర్గతమౌతున్నది, పొంగిపొరలుతోంది.*

ఆ మర్నాడు నేను తులసిదళాలుతో చేసిన రెండుహారములను తీసికొని వెళ్లాను. కాని శ్రీఅరవిందులు తన గదిలోనే ఉంటారని, ఇకనుంచి బయటకి రారని నాకు తెలిసింది. నిస్పృహాజెంది ఆ హారములను వారి గుమ్మంముందు వదిలేసి వెనక్కు మళ్లాను. మా జీవితంలో ఒక అధ్యాయం ముగిసింది.

(బెంగాలీ మూలంనుండి సిసిర్‌కుమార్ ఘోష్‌గారి అనువాదము)

(*Mother India* Dec 1970, pp. 623-25)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి

చంపక్‌లాల్, రాజంగంగార్ల నోట్సు

చంపక్‌లాల్‌గారి దినచర్య పుస్తకం నుండి

24-11-1926

దత్తాగారు ఈవిధంగా చెప్పారు

శ్రీకృష్ణుడు వచ్చాడు.
దుఃఖములను అరికట్టాడు.
బాధలను అధిగమించాడు
మృత్యువును జయించాడు
సమస్తాన్ని జయించాడు.
నేటి రాత్రి ఆయన దిగివచ్చి
అమరత్వాన్ని ఆనందాన్ని తీసుకొనివచ్చాడు

మేము ఒక్కొక్కళ్లము శ్రీమాతకు ప్రణమిల్లినప్పుడు శ్రీఅరవిందులు తన చేతిని ఆమె చేతికిపైన పెట్టి ఆశీర్వదించిరి. వారిరువురికి ప్రణామము గావించినది నేను ఒక్కడినే. నాలో నుంచి ఏదో బయటకు వచ్చి నా చేత అలా చేయించింది.

డా॥ రాజంగంమ్‌గారి స్మృతులు

24 నవంబరు 1926 చాల అద్భుతమైన రోజు. అది శ్రీకృష్ణునిచైతన్యము శ్రీఅరవిందులలోకి దిగివచ్చిన రోజు. దత్తా (శ్రీమాత సేవకురాలైన ఐర్లాండు దేశపు స్త్రీ) పూనకము వచ్చినట్లు (as if in a trance) అయి ఈ విధంగా పలికారు.

వారు జీవితముపై విజయమును సాధించారు.
వారు మృత్యువును జయించారు
వారు సమస్తాన్ని జయించారు.
శ్రీకృష్ణపరమాత్ముడు దిగివచ్చాడు!

(*Breath of Grace* 2002 ed, p. 87)

అనువాదం: ఆర్. లక్ష్మీప్రసాదమ్మ

శ్రీఅరవిందాశ్రమ స్థాపన 1926

"రాజకీయాలలో నిమగ్నమై ఉన్న నన్ను బ్రిటిష్ ప్రభుత్వమే జైలులో నిర్బంధించి ఆధ్యాత్మికజీవితానికి అవకాశం కల్పించారు" అని శ్రీఅరవిందులు అన్నారు. ఆ తర్వాత వారు పాండిచేరి వెళ్లటం, ఆశ్రమాన్ని స్థాపించటం (ఆశ్రమమంటె సన్యాసుల మఠం కాదు) శ్రీమాత రావటం చరిత్రాత్మకమైన విషయాలు. వారి రాజకీయ అనుచరులే వారితోపాటు పాండిచ్చేరి వెళ్లి వారి ప్రథమశిష్యులైనారు. వారితో సహజీవనము గడుపుతూ శ్రీకృష్ణుడు చెలికాళ్లతో ఉన్నట్లు కలసిమెలసి ఉండేవాళ్లు. అనేకమైన ఆశ్రమవిషయాలను ఆ శిష్యుల మాటలలోను, శ్రీఅరవిందుల మాటల్లో కూడ ఇందు తెలుసుకొనెదము.

— సంపాదకుడు

శ్రీఅరవిందవాణి:

1904 లో మొదలైన నా యోగం మొదట ఇతరులతో సంబంధం లేకుండా వ్యక్తిగతంగానే ఉండేది. నాలో జరిగే విషయాలను నాలోనే ఉంచుకోటంవలన నా అనుచరులు నన్నొక సాధకునిగా మాత్రమే తెలుసుకున్నారు. నేను కారాగారంనుండి విడుదలయ్యాక మొట్టమొదటిసారి నా ఆధ్యాత్మిక అనుభూతులను బహిరంగంగా 'ఉత్తరపారా' లో వెల్లడి చేసాను. పాండిచేరి వచ్చే వరకు నేను శిష్యులెవరినీ చేర్చుకోలేదు. ఆ రోజుల్లో రాజకీయ కారణాలవల్ల నాతో ఉన్నవాళ్లు, పాండిచ్చేరిలో నా దగ్గర చేరిన వాళ్లు నాకు స్నేహితులుగా మాత్రమే ఉన్నారు. అది గురుశిష్యుల సంబంధం కానేకాదు. ఆ తరువాత ఆధ్యాత్మిక సంబంధం ఏర్పడి జపాన్ నుండి శ్రీమాత 1926 లో తిరిగివచ్చేసరికి తలవని తలంపుగా ఈ ఆశ్రమం ఏర్పడింది.

*

ప్రశ్న: ఆశ్రమానికి శ్రీమాత 1926 లో ఏ తేదిన పూర్తిగా బాధ్యత వహించారు?
జవాబు: ఆ రోజు శ్రీమాతకు సరిగ్గా గుర్తు లేదు. అది బహుశ ఆగస్టు 15 కి కొన్నిరోజుల తరువాత అయివుండాలి. నేను రిటైరు అయిన తరువాత ఆమెయే పూర్తి బాధ్యతను వహించారు.

(*SABCL* Vol. 26, pp. 68, 479)

1930 లో బరోడా మహారాణికి వ్రాసిన లేఖనుండి:

ఒక ఆధ్యాత్మిక కేంద్రాన్ని ఏర్పరచి తద్వారా పైనున్న చైతన్యాన్ని క్రిందకు తీసికొనివచ్చి, కేవలం మోక్షానికే కాకుండా భూలోకంలో దివ్యజీవనాన్ని నెలకొల్పటమే నా ఉద్దేశము. అందుకనే నేను ప్రజాజీవితాన్ని విరమించుకొని పాండిచేరిలో ఈ ఆశ్రమాన్ని స్థాపించాను. దీనిని 'ఆశ్రమము' అని అనడం ఇంతకుమించి సరియైన పదం దొరకనందువలననే. అయితే ఇది సన్యాసులమఠం మట్టుకు కాదు. ఇతర వ్యాపకాలన్నిటిని వదులుకొని కేవలం దైవపరిపాలనని అభిలషించేవారి కోసమే దీనిని ఏర్పరచాను.

(*SABCL* Vol. 27, p. 416)

*

ప్రశ్న: 1926 లో శ్రీమాత రాకముందు ఉన్న పాతసాధకులు ఈ విధంగా ఉండేవారట. సాధన చాలా తీవ్రంగా ఉండేదని, వాళ్లందరు విశ్వచైతన్యంలో ఓలలాడుతూ ఉండేవారని ఒక వ్యక్తి మరొకరితో చెప్పిన మాట ఎంతవరకు నిజం?
జవాబు: శ్రీమాత రాకముందు అందరూ మనస్సుయొక్క పరిధిలోనే నివసిస్తూ మానసికానుభూతులను, ఫలితాలను మాత్రమే పొందుతూ ఉండేవారు. ప్రాణికము (vital), ఇతర విభాగములు ఇంకా వాటి పాతధోరణులలోనే నడుస్తూ ఉండేవి. చైత్యపురుషుడు (psychic) ఇంకా తెరమరుగునే ఉండిపోయాడు. విశ్వమయచైతన్యంలోకి ఎవరు ఇంకా ప్రవేశించలేదు. రూపాంతరీకర

ణము ఎటుల చేయవలెనో, అతిమానసమునకు (Supramental) మార్గము ఎటులనో అని నేనింకా తడుముకుంటున్నాను. అతి మానసమనగా మామూలు వేదాంతానికి అతీతమైన స్థాయి. అప్పుడున్న కొద్దిమంది శిష్యుల సాధన సందర్భానుసారంగా నడుస్తూ ఉండేది.

(*SABCL* Vol. 26, p. 460)

నళినికాంత గుప్తగారి స్మృతులు:

మా జీవనసరళి అంతా శ్రీమాత రావటంతో తారుమారైపో యింది. శ్రీమాత వచ్చి శ్రీఅరవిందులను ఒక గురువుగా, యోగా ధ్యక్షునిగా ఒక ఉన్నతాసనము మీద కూర్చోపెట్టారు. అంత వరకు మేమాయనను ప్రియమైన నేస్తముగా, దగ్గిర అనుచరునిగా మాత్రమే చూశాము. అంతరంగికంగా గురువైనప్పటికి మాలో ఒకరిగానే చూసేవాళ్లం. ఆయన కూడ ఆశ్రమము అనే పదాన్ని గాని, తనని గురువు అని అనేందుకుగాని ఇష్టపడేవారు కాదు. వారి సరికొత్త పంథాలో వీటికి చోటు లేదు. అయినప్పటికి శ్రీమాత వారిపట్ల మిక్కిలి గౌరవంతో ప్రవర్తించేవారు. గురుశిష్య సంబంధమంటే ఏమిటో ఆమె మాటలలోను చేతలలోను నిరూ పించి చూపించారు. ఆమె బోధించిన విషయాలను ఆచరించి చూపించేవారు. ఆమె గురువుగారికి ఎదురుగుండాగాని ఆయనతో సరిసమానంగాగాని కూర్చోకుండా వినయవిధేయతలతో ప్రవర్తిం చేవారు. శ్రీఅరవిందులు ఒకసారి "నేనెంత కిందికి దిగివచ్చినా కూడా మీరు నన్నుందుకోలేకపోతే నేనేం చేయను" అని వాపో యారు.

అమ్మ మాత్రమే మా కళ్లు తెరిపించి దివ్యదర్శనాన్ని కలి గించారు. అర్జునుడు గీతాచార్యుని దర్శించిన అనుభవంగా మేము భావించి "శ్రీకృష్ణా నిన్నే పేరుతో నేను పిలిచినా పలి కావు. ఓ యాదవా, ఓ సఖా నా తొందరపాటుతో నిన్ను పామ రునిగానే, సాధారణ మిత్రునిగానే భావించాను. ప్రేమతో నీ గొప్పతనం తెలియక నేను కూర్చున్నా, నిలబడ్డా, పడుకున్నా,

తింటున్నా ఎంతో దుడుకుతనంతో అమర్యాదగా ప్రవర్తించి నిన్ను ఎదుటనున్నా గ్రహించలేకపోయాను. ఓ అనంతా! నా అవివేకాన్ని, తప్పుల్నీ మన్నించి దయజూపుము."

*

శ్రీఅరవిందులు మాతో సంభాషించినపుడు మొదట్లో మదర్‌ని 'మీరా' అని స్పష్టంగా సంభోదించుచుండెడివారు. రాను రాను (బహుశ కొన్ని సంవత్సరముల తరువాత) 'మ్' శబ్దం ఉచ్చరించిన పిదప, కొంచెం సందేహించి, తరువాత పూర్తి పేరు పలకడము మేము గమనించాము. మాకు అప్పుడదేమిటో వింతగా తోచేది – అసలు కారణము ఆ తరువాత తెలిసిందనుకోండి. శ్రీఅరవిందుని పెదవులు 'మదర్' అని ఉచ్చరించబోతూ, మళ్లీ మేమందులకు తయారుగా లేనందున, చివరికి 'మీరా' అనియే పలికెడివారు. శ్రీఅరవిందుల పెదవులు 'మదర్' అని ఉచ్చరించిన ఆ పర్వదినం, ఆ సుమూహర్తం ఎప్పుడో, ఎవ్వరికీ సరిగా గుర్తులేదు. కాని అది, మానవచరిత్రలోను, ఈ జగద్విలసనములోను లిఖితముకాని ఒక దివ్యముహూర్తము. ఏలన, అది ఈ భౌతికప్రపంచమందు, మానవుని బాహ్యాచేతనలో 'మదర్' ప్రతిష్ఠితమైన అమృతఘడియ.

అనువాదం: టి.ఎస్. రామచంద్రరావు, ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

A Power beyond earth's scope has touched the earth;
The repose that might have been can be no more;
A formless yearning passions in man's heart,
A cry is in his blood for happier things:

(Savitri)

ఆశ్రమ చరిత్రలో ఒక మహోజ్వల ఘట్టము

నూతనసృష్టి జరుగనున్నది

(సిద్ధి రోజునుండి కొన్ని మాసాలదాకా ఆశ్రమమంతా ప్రాణికశక్తి వెల్లివిరిసింది. ఒకదాని తర్వాత ఒకటి అనేక అనుభవాలు అనూహ్యంగా రావడం ప్రారంభించాయి. అలౌకికమైన ఆధ్యాత్మిక సంఘటనలు చోటుచేసుకున్న సమయమది. అద్భుతాలు జరగడం మామూలైపోయినట్లు అక్కడున్నవారంతా అనుకునేవారు. అధిదేవతలను ఆశ్రమవాసుల్లో ఆవాహన చేయాలని శ్రీమాత ప్రయత్నం చేశారు. 1926 వ సంవత్సరాంతంనుంచీ 1927 వ సంవత్సరాంతందాకా ఇంచుమించు 10 నెలలపాటు ఈ విశేషాలు జరిగాయి. ఈ విషయాన్ని గురించి శ్రీమాత, శ్రీఅరవిందులు, ఇంకా కొందరు సాధకులు చెప్పిన విషయాలను పొందుపరుస్తున్నాము.)

10-7-1957 లో ఆశ్రమవిద్యార్థుల నుద్దేశించి శ్రీమాత చేసిన ప్రసంగములోని అంశములు:

1926 లో శ్రీఅరవిందులు అతిమానస ఆవిర్భావమును శీఘ్రతరం చేయాలనే ఉద్దేశంతో ఏకాగ్రతలోకి వెళ్లటానికై ఆశ్రమ విధినిర్వహణను నా కప్పగించారు. నన్ను శిష్యులందరికీ సహాయ సంపత్తులిచ్చి నడిపిస్తూండమనీ, నేను తరచు వారితో సమావేశమవుతూండగా నా ద్వారా వారు తన పనిని నిర్వహిస్తాననీ ప్రకటించారు. అంతే, వెంటనే విచిత్రమైన సంఘటనలు జరగటం మొదలైంది. అసాధారణరీతిలో ఒక అద్భుతమైనసృష్టి తయారవటం కనిపించింది. దేవతల స్పర్శ, సాక్షాత్కారము, అలౌకిక సంఘటనలు, అద్భుతాలు ఒకటేమిటి ఆశ్చర్యకరమైన అనేక అనుభవాలతో ఉక్కిరిబిక్కిరి అయింది!

మనకీ అధిమానస సృష్టి వద్దు

జరుగుతున్నవన్నీ నివేదించటానికి నేనొకనాడు శ్రీఅరవిందుల సన్నిధికి వెళ్లాను. నిజంగా ఆసక్తికర సంఘట

నలు జరుగుతున్నాయి కదా! ఇవన్నీ చెప్పేటప్పుడు నాలోని ఉత్సాహాన్ని కనిపెట్టిన శ్రీఅరవిందులు నావైపు చూసి ఇలా అన్నారు..... "ఇదంతా అధిమానసపు ప్రభావమే. నిజమే, చాలా గొప్పగా ఉంది. బాగా జరుగుతోంది. ఇక నీవు మహిమలు ప్రద ర్శించి ప్రఖ్యాతి పొందగలవు. ప్రపంచంలో జరిగే సంఘటనల నన్నిటినీ తారుమారు చేయగలవు. నిజంగా...." అని చిరునవ్వు నవ్వి మళ్లీ ఇలా అన్నారు. "కానీ ఇదంతా అధిమానససృష్టి. దీనితో ఘనవిజయం సాధించవచ్చు. మనకు కావలసినది ఇది కాదు గదా! మనం అతిమానసాన్ని సాధించి భూమ్మీద ప్రతి ష్ఠించాలి. సమగ్రమైన అతిమానసలోకాన్ని ఇక్కడ సృష్టించా లంటే తాత్కాలికంగా లభించినదాన్ని పరిత్యజించటం నేర్చుకో వాలి."

నా అంతర్గత చైతన్యంతో అది వెంటనే తెలుసుకున్నాను. కొద్ది గంటల్లోనే ఆ సృష్టి అంతర్థానమైపోయింది. అప్పట్నుంచీ ఇతర ప్రాతిపదికల మీద పని పునః ప్రారంభమైంది.

(*CWM* Vol. 9, pp. 147-48)

శ్రీఅరవిందులు అక్టోబరు 18, 1934 నాడు ఒక సాధకునికి పంపిన లేఖలోని కొన్ని భాగాలు:

దేవతలు శ్రీమాత లోనికి దిగివచ్చుట

కొన్ని సంవత్సరాల క్రితం శ్రీమాత తనలోకి అవిరామంగా కొన్ని నెలల పాటు దివ్యవిభూతులనూ, దివ్యశక్తు లనూ అవతరింపచేసుకొనే రోజులను గురించి నేను మాట్లాడు తున్నాను. ఆశ్రమచరిత్రలోని ఆ మహోజ్జ్వల యుగంలో మాది రిగా శ్రీమాత ఇప్పుడు కూడా చేస్తున్నట్లయితే ఈనాడు ఎదు ర్కొంటున్న విపత్కర ప్రమాదాలను చాలా తేలిగ్గా ఎదుర్కో నేవారు. అసలు అటువంటివి జరిగేవే కాదు. అప్పట్లో శ్రీమాత సాధకులందరినీ స్వయంగా ధ్యానంలోకి తీసుకెళ్లేవారు. మిగిలిన సమయమంతా నిద్రాహారాలు సరిగా లేకుండా ఏకాగ్రతలో నిమ గ్నమై ఉండేవారు. అయినప్పటికీ ఆమెకేమాత్రం అలసటగానీ,

నలతగానీ ఉండేది కాదు. పనులన్నీ వాయువేగంతో జరుగుతూం డేవి. అది అతిమానసశక్తి (supermind) కాకపోయినా అప్పుడు అవతరించిన అధిమానసశక్తే (overmind) అన్నిటికీ సరిపోయేది. అయితే ఆ తర్వాత సాధకుల నిమ్నప్రాణిక, దైహికములు దాన్ని అనుసరించలేకపోయేసరికి శ్రీమాత తనలో పనిచేస్తున్న విభూతులనూ, దివ్యశక్తులనూ నిష్క్రమింపచేశారు. అప్పట్నుంచీ ఆమె స్థూలమానవస్థాయికి దిగి కష్టాలు, సంఘర్షణలు, జాడ్యాలు, జడత్వాలు, అజ్ఞానాలను భరించవలసివచ్చింది.

(*SABCL* Vol. 26, p. 472)

శ్రీఅరవిందుల సాయం సంభాషణలను నిరోద్‌బరన్ స్మృతుల నుండి గ్రంథస్తం చేసిన భాగాలు:

డిసెంబరు 10, 1938

ప్రశ్న: ఆశ్రమచరిత్రలోని ఉజ్వల శకాన్ని గురించి మీరొకసారి మాట్లాడారు.

అవును. అప్పట్లో సాధన ప్రాణికస్థాయిలో జరిగేది. దానితో అంతటా సంతోషం, శాంతి, ఆనందాలు వెల్లివిరిసేవి. అక్కడితో కనుక సాధన ఆపుచేసి ఉంటే ఒక గొప్పమతాన్ని ప్రతిష్ఠించి ఉండేవారమే. అయితే అసలు పని అట్లాగే నిలిచి, పూర్తిగా మూలపడిపోయేది.

1939 జనవరి 7

భౌతికస్థాయి సాధనలో కష్టాలు

ఆశ్రమం మహోజ్వలంగా వెలుగుతున్న ఆ రోజుల్లో అందరం ప్రాణికస్థాయిలో ఉండేవారం. అందరికీ గొప్ప గొప్ప అనుభవాలు కలగడం, ఉత్సాహము, శక్తి ఉండేవి. మన సాధన అలాగే కొనసాగి ఉంటే ఒక గొప్ప మతప్రతిష్ఠ జరిగేది; దానికి తగిన బలగమంతా సృష్టింపబడేది. కానీ మన కార్యరంగం వేరే ఉంది కాబట్టి అవన్నీ వదిలేసి భౌతికస్థాయికి తిరిగి వచ్చేయాల్సి వచ్చింది. భౌతికస్థాయిలో పనిచేయడమంటే నేలను తవ్వడం వంటిది. ఎందువల్లనంటే భౌతికపదార్థమంతా జడ

మయం, బండరాయంత అచేతనం. అక్కడ పని మొదలుపెట్టగానే అదివరకున్న బలమంతా నీరసమైపోయింది. పాత అనుభవాలన్నీ అదృశ్యమైపోయాయి. ఒకవేళ మళ్లీ కనబడినా కూడా ఎక్కువసేపుండేవి కావు. అక్కడ పని చాలా నిదానం. కాస్త పైకి వెడితే వెంటనే కిందపడడం, ఎన్నిసార్లు లేచినా పడిపోవడమే. లోగడ అసురుల సూచనలను అందుకుంటున్నట్లు "నీవేమీ చేయలేవు, ఓడిపోతావు అని అనిపించేది."

అలా సంవత్సరాల తరబడి సాధన చేస్తూ, ఒక కేంద్రం తర్వాత ఇంకొకటి మార్పు చేస్తూ, అత్యంత క్లిష్టమైన అవచేతన మధ్యస్థ కేంద్రానికి చేరాలి. దాన్ని సాధించటం అన్నిట్లోకీ చాలా కష్టం.

సాధకులపై శ్రీమాత వత్తిడి

దాన్ని సాధించేటట్లు ముందుకు నెట్టటానికి ఒకప్పుడు అమితమైన బలాన్ని కూడా శ్రీమాత వారికి ఇచ్చారని చెప్పాను కదా! అది ఆమె స్వభావము. అయితే దాన్ని ఎవ్వరూ తట్టుకోలేకపోయారు. మొత్తం పటాపంచలైపోతుందని అనుకున్నాము. ప్రాణికం అలజడి చెలరేగింది. అందువల్ల మొత్తం పథకాన్నే విరమించాల్సి వచ్చింది. ఇప్పుడైనా ఆ పని శరవేగంతో చేయవచ్చు గానీ ఆ కఠినపరీక్షకు ఎంతమంది సిద్ధపడతారు?

ప్రాణికస్థాయిలో సాధన జరుగుతున్న ఆ సమయంలో అందరూ సరైన వైఖరితో ఉన్నట్లైతే ఇప్పుడీ అవచేతనలో మార్పు కోసం ఇంత కష్టం ఉండేది కాదు. అప్పట్లో శ్రీమాత వశపరచుకున్న శక్తులతో భౌతికస్థాయికి వచ్చి ఇక్కడ పని కూడా అవలీలగా పూర్తిచేసి ఉండేవారే.

కానీ సాధకులంతా కలిసి అది పడనివ్వకుండా శ్రీమాతను అనేక కోరికలతో వత్తిడి చేసేవారు. శ్రీమాత వాళ్లను ఉద్ధరించాలనుకున్నప్పుడు ఆమెనే తమ స్థాయికి దింపటానికి ప్రయత్నించారు. మేము దానికి ఒప్పుకోవలసి వచ్చింది. అదే ఈ ఆలస్యానికి కారణము.

(*Talks with Sri Aurobindo* by Nirodbaran pp. 5-6, 179-82)

నళినీకాంత గుప్తగారి ప్రసంగంలోని కొన్ని అంశాలు

శ్రీమాతతో సామూహిక ధ్యానం

సిద్ధిరోజునుంచీ ప్రతినిత్యం రాత్రి పొద్దుబోయాక శ్రీమాత మా అందరితో కలిసి ధ్యానంలో పాల్గొనేవారు. అప్పట్నుంచీ సామూహికంగా ధ్యానం చేయడమనేది మొదలైంది. మేమందరం కూర్చోడానికి ఆమె ప్రత్యేక ఏర్పాట్లు చేసేవారు. ఆమెకు కుడివైపు కొంతమందినీ, ఎడంవైపు కొంతమందినీ బారులుతీర్చి కూర్చోబెట్టేవారు. కుడిప్రక్క కూర్చున్నవారు దివ్యకాంతికీ, ఎడంప్రక్క కూర్చున్నవారు దివ్యశక్తికీ సూచికలుగా ఉండేవారు. మా అంతర్గత జీవస్వభావాన్ని బట్టి ఆమె కుడి, ఎడమల్లో కూర్చునే అర్హత పొందేవారము. నేనామెకు కుడివైపు వరుసలోను, అమృతగారు ఎడమవైపు వరసలోనూ కూర్చునేవారము.

ధ్యానములో విచిత్ర ప్రవర్తన

ఈ ధ్యానసమయాల్లో రోజూ ఒక విశేషం జరిగేది. మాలో ఒకడైన పురుషోత్తముడు మా అందరికీ ఎడంగా శ్రీమాత ముందర కూర్చొనేవాడు. ధ్యానం ప్రారంభంకాగానే ఆయన అటూ ఇటూ ఊగిపోతూ కళ్లు మూసుకొని ధ్యానం చేస్తునే కూర్చున్నచోటునుంచి కదిలిపోయేవాడు. మేం కూర్చున్న చోటుకి వచ్చి మమ్మల్ని కుదపటం, మా జుట్టు పీకడం, గడ్డాల్ని, మీసాల్ని (ఆ రోజుల్లో మా అందరికీ పొడుగాటి జుట్టు, గడ్డాలు, మీసాలు ఉండేవి) చిందరవందర చేయడంలాంటి పనులు చేసేవాడు. పైగా అది తనకు విహితమైన కర్తవ్యమనీ, మమ్మల్ని శుద్ధిచేసే విధానమనీ చెప్పేవాడు. ఈ ఉత్పీడనాన్ని ఎవ్వరూ నిరోధించకపోగా ఆనందంగా నిబ్బరంగా స్వీకరించేవారు. పైగా అది ఆవశ్యకమైన చర్య అనీ, శ్రీమాత కటాక్షానికి గుర్తనీ భావించేవారము. మాలో కొద్దిమందికే ఈ భాగ్యం కలిగింది. ఇలా జరుగుతున్న సమయంలో శ్రీమాత ధ్యాననిమగ్నురాలైయుండేవారు. ఆమె అంతర్గతనిశ్చలసమతౌల్యపు పర్యవేక్షణలోనూ,

నేతృత్వంలోనూ ఇది జరిగేదనటానికి సందేహం లేదు. ఇలా ఉండగా ఒకరోజు పురుషోత్తముడు గొంతెత్తి తనగురించి ఇలా చెప్పాడు. "అమ్మా! నేను గొప్పకోసం ఇలా చెపుతున్నాననుకోకండి. నా మనసులోని మాటలనే సవినయంగా మనవిచేస్తున్నాను. తల్లీ! పరమోత్కృష్టశక్తిస్వరూపిణివైన నువ్వు పృథ్విలోని అధమాధమ లేక మాతృశక్తినైన నాకు నీ దివ్యకార్యంలో పాలు పంచుకొనే భాగ్యాన్ని కలిగించావు." ఇంకా భూభారాన్ని వహిస్తున్న ఆదిశేషుని అంశమే తాననీ, అందువల్ల ఆ శక్తి తనలో పనిచేస్తున్నదనిన్నీ; తాను నిశ్చేతనాత్మననీ, అధోలోకశక్తితో చీకట్లని తుడిచిపెట్టి వెలుగుకి స్థానం కల్పించే బాధ్యత తనదేననీ, తద్వారా శ్రీమాత ఊర్ధ్వశక్తులకు సాయపడతాననీ కూడ చెప్పేవాడు. ఇలా కొంతకాలం గడిచిన తర్వాత అంతా ఆగిపోయింది. తర్వాత ధ్యానం కొనసాగేది.

సాధకులలోకి దివ్య మూర్తుల ఆవాహన

దివ్యచైతన్యపూరితమైన ఒక కొత్త అంతర్గతలోకాన్ని సృష్టించాలని ఆ రోజుల్లో శ్రీమాత పనిచేసేవారు. ఊర్ధ్వశక్తులను, దేవతలను, భూమిమీదకు తెచ్చి మా అంతర్గతజీవిలోనికి, చైతన్యంలోనికి ప్రవేశపెట్టేవారు. అందులో ప్రధానమైన విషయం ఏమంటే మమ్మలందర్నీ మాలో ఉన్న అంతర్గతదైవంతో అనుసంధాన పరిచేవారు. అంటే ప్రతివ్యక్తికీ తన ఆత్మ సంజనిత అవరోహణ, మళ్లీ ఆరోహణ ఉంటుంది. అంటే ప్రతి వ్యక్తి చైతన్యంలోకీ మహాశక్తినుంచి వచ్చిన ఒక ప్రత్యేక దైవాంశ ప్రవేశిస్తుంది, దైవ విభూతినుంచి వచ్చిన ఒక ప్రత్యేక దేవత అన్న మాట. ఆ దివ్యత్వాన్ని, దాని సంస్పర్శనూ అనుభూతిపొందుతూ, దాని మీదే దృష్టి కేంద్రీకృతంచేసి, దానితో ఐక్యత పొంది, బాహ్యజీవితంలో కూడా దాన్నే అభివ్యక్తంచేస్తూ కాలం గడపటమే మా సాధన లక్ష్యంగా ఉండేది. నిరంతర చింతన, ఏకాగ్రత జరుగుతున్న ఆ కాలాన్ని తాబేలు ఘట్టము సాధనాకాలంగా వ్యవహరించవచ్చు. తాబేలు మాదిరిగా బాహ్యావాసనలేవీ తాకకుండా అంగాంగాలు కూడదీసుకొని ఒక గూడులోపల మునగదీసుకొని

ఉండేవాళ్లము. వ్యక్తిగతచైతన్యాన్నీ, సామూహికచైతన్యాన్నీ నిష్క ళంకంగా, అచంచలంగా ఉన్నతస్థాయిలో నిలిపి ఉంచటానికే ఆ విధంగా తాత్కాలికంగా ఉండవలసి వచ్చింది. బాహ్యప్రపంచంతో సంబంధాలు, ఇచ్చిపుచ్చుకోటాలు చాలా పరిమితంగా జరగటమే కాక ఎంతో జాగ్రత్తగా మెలిగేవారము. మా చుట్టూ ఒక ఇనుప తెర బిగించుకున్నట్లుండేది. అంతేకాక మాలో మేము కూడా ఒక రితో ఒకరు అతిగా మాట్లాడకుండా, ఒకరింటికి ఒకరు వెళ్లకుండా చాలా జాగ్రత్తగా ఉండేవాళ్లము. టాగూర్ మహాకవి వర్ణించిన గాలిలో పుష్పం మాదిరి కొమ్మలు, రెమ్మలు లేకుండా వికసించా లన్నట్లుండేవారం.

ప్రాణిక, భౌతికక్షేత్రములలో కూడ నూతనసృష్టి

ఇలా ఈ మార్గంలో కొంత కాలం సాగిన తర్వాత ఇందులోని లోపం శ్రీమాత గ్రహించారు. ఈ విధంగా కనుక కొత్త సృష్టి జరిగితే అది చాలా సంకుచితంగా ఒక వర్గానికి మాత్రమే పరిమితమైపోయి, అక్కడ కూడా ఆంతరికంగా మాత్రమే ప్రయోజనకారి అవుతుంది. నవ్య మైన సృష్టి జరిగితే అది సమస్త మానవకోటికీ వర్తించాలి, ఒక కొత్త మానవజాతి అవతరించాలిగానీ ఒక చిన్నసంఘంగా మాత్రంకాదు. ఆ నూతనసృష్టికి మానవుని ఆంతరికజీవనమే కాకుండా మొత్తం మానవజీవితమంతా ప్రభావితం కావాలి. అంటే నిమ్నస్థాయిలోకి దిగి, దాన్ని పరిశుద్ధంగావించి అక్కడ ఊర్ధ్వచైతన్యాన్ని ప్రవేశపెట్టి ఉద్ధరించి దానిని ఉన్నతప్రయో జనము సాధించటానికి తగిన పరికరముగా తయారుచేయాలి. అప్పట్నుంచీ ఆ పనికోసమే పడుతూ లేస్తూ ఎగుడుదిగుడు దారిలో సాగిపోతున్నాము.

ఒక విపరీతమైన అనుభూతి

ఆ రోజుల్లో ఎలా ఉండేవారమో మీకు తెలియటానికి ఒక చిన్న ఉదాహరణ చెపుతాను. మేం ఎంతగా కూడదీసు కొని అంతరంగ జీవనం కొనసాగిస్తున్నామంటే ఒకనాడు నేనొక పనిమీద ఆశ్రమపొలిమేరదాటి మార్కెట్టుకు వెడుతుంటే

ఒక వికృతభావం కలిగింది. నా పాదాలు భూమ్మీద లేకుండా తేలిపోతున్నట్లు, నాకాళ్లు తేలిక అయిపోయి ఒక పద్ధతిలో కదల కుండా స్వప్నంలో మాదిరి గాలిలో ఎగిరిపోతున్నట్లై చాలా చిరాకు, భయం కలిగింది. ఒడ్డున పడ్డ చేప మాదిరి బాధ కలిగింది. వెంటనే వెనక్కి తిరిగి గబగబా ఆశ్రమప్రాంతానికి వచ్చి పడి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను.

బాహ్యాంతరంగముల సామరస్యము

ఆ దశ దాటిపోయి చాలాకాలమైంది. ఇపుడు ఇంచుమించు అవతల కొనకి చేరుకున్నాము. అంతరంగంలోనుంచి బయటకు వచ్చేసి బాహ్యావ్యక్తిత్వంలో నిలబడిపోయాము. "పరాంచికాని వ్యాతృనోత్" అని ఉపనిషత్తులలో హెచ్చరించినట్లు ఇంద్రియాలు బాహ్యావిషయాలకు మొగ్గు చూపిస్తాయనటం సహజమే, అయితే అది కూడా మన యోగంలో అవసరమే. ఎందువల్లనంటే మనం ప్రపంచంలో ఒక భాగమే కాబట్టి దానిలో కలిసిపోయిన మనలను విడదీయటం అసాధ్యం. ఈ సమస్త విశ్వాన్ని మనం ప్రతిబింబిస్తాము. దాని సూచికలం మనం, దానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాము. అందువల్ల అది ఏం చేసినా అందులో మనకి భాగం ఉంది, ఆ కర్మలు అనుభవించాలి. శ్రీమాత, శ్రీఅరవిందులు కూడా దీనిని తప్పించుకోలేదు. అయితే అది వేరే సంగతి. ఇంకా మనం మనలో ఏ మార్పులు తీసుకొనిరాగలమో ఆ మార్పులే ప్రపంచమంతటా రావటానికి అవకాశం రాగలదు. ఈనాడు బాహ్యావ్యక్తిత్వాన్ని వృద్ధి చేసుకోటానికే అందరూ మొగ్గుతున్నప్పటికీ మనం మాత్రం పూర్తిగా బాహ్యాత్వానికే అంకితం కాకుండా అంతర్గతసాధన చేయటానికి సిద్ధం కావాలి. ఈ బాహ్యా, అంతర్జీవితాలను రెంటినీ విడగొట్టకుండా, రెండిటినీ సామరస్యపూరితంగా మలుచుకోవడమే యోగము.

నళినీకాంత గుప్తగారి బెంగాలీ మూలానికి ఇంగ్లీషు అనువాదం సనత్కుమార్ బెనర్జీ.

(*Mother India* Dec. 1962, pp. 31-33)

రాజంగంగారి స్మృతులనుంచి

ఆ రోజుల్లో ధ్యానంలో పాల్గొనే వారందరికీ శ్రీమాత నంబర్లిచ్చే వారు. నా నంబరు 9. ఆమె దేవతలను కూడా మాలోకి ఆవాహనం చేసేవారు. నాలోకి ఆవాహన చేసిన దేవత "ఆరాధన"

(*Breath of Grace* 2002 ed. p. 87)

తెలుగుసేత: ఎ. ప్రభావతి, ఎ.వెంకటరామశాస్త్రి

ప్రేమ ప్రాణాన్ని కాపాడగలదు

ఇది మైకెల్ అనే మూడేళ్ల పిల్లవాడు, అతని చిట్టి చెల్లెలికి సంబంధించిన కథ. ఆ చెల్లెలు ఇంకా తల్లి గర్భంలోనే ఉంది. వాళ్ల అమ్మ కేరెన్ వాడికి చెల్లెలు పుడుతుందని చెప్పింది. శిశువు ఆడపిల్ల అని వాళ్లు ముందరే తెలుసుకున్నారు. ఆ పిల్లవాడు ప్రతిరోజు తల్లి కడుపులో పెరుగుతున్న చెల్లెలికి పాటలు పాడి వినిపించేవాడు. అలా ప్రతిరోజు పాడటంవలన ఆ పిల్లవాడికి, కడుపులోని పాపకి గాఢమైన అనుబంధమేర్పడింది. దినదిన ప్రవర్థమానమైంది.

కేరెన్‌కు నెలలు నిండినాయి. ఒకరోజు పురిటినొప్పులు ప్రారంభమైనాయి. ప్రతి 5 నిమిషాలకి, తరువాత మూడేసి నిమిషాలకి, తరువాత నిమిష నిమిషానికి ఆవేదన ఎక్కువైంది. పురుడు రావటం కష్టమైంది. చివరకి పాప పుట్టింది, గాని పిల్ల పరిస్థితి ఏమి బాగులేదు.

ఆ పిల్లని వెంటనే ఏంబ్యులెన్స్‌లో తీసుకొనిపోయి సెయింట్ మేరీస్ ఆసుపత్రిలోని ఇన్‌టెన్‌సివ్‌కేర్ యూనిట్ (I.C.U) లో జేర్చేరు. అక్కడి వైద్యనిపుణులు పాప బ్రతకటం కష్టమని చెప్పేరు. ఆ పిల్ల తల్లిదండ్రులు cemetry లో ఆమెను పాతిపెట్టేందుకు ఏర్పాట్లు చేయాల్సివచ్చింది. అదివరకు ఆ పిల్లకోసం వాళ్ల ఇంట్లో

ఒక ప్రత్యేక గదిని ఏర్పాటుచేసిన ఆ తల్లిదండ్రులు పాపం ఇప్పుడు అంత్యక్రియల ప్రయత్నం చెయ్యవలసివచ్చింది. మైకెల్ తన చిట్టి చెల్లెలిని చూస్తానని బ్రతిమాలాడు. నేను దానికి పాట పాడి విని పిస్తానన్నాడు. ఈ విధంగా ఒక వారం గడిచిపోయింది. రెండో వారం గడుస్తుందో గడవదో అని అనుమానంగా ఉన్నది. మైకెల్ మట్టుకు తన పట్టు విడువలేదు. ఆ వార్డులోకి పిల్లల ప్రవేశం లేదు. అయినప్పటికి వాళ్ల అమ్మ వాడిని తీసుకువెళ్లేందుకు నిశ్చ యించింది. ఆ పాపను ప్రాణంతోటి ఉన్నప్పుడే అతనికి చూపిం చాలని ఆమె కోరిక. అతనికి పెద్దగా వేషంవేసి లోపలికి తీసు కొని వెళ్లబోయింది. కాని అక్కడ నర్సు ఆ పిల్లవాడిని గుర్తుపట్టి "పిల్లలకి ప్రవేశం లేదు. ఈ పిల్లవాడిని బయటకు తీసుకొని పో" అని గదమాయించింది. కాని ఆవిడ పట్టువదల్లేదు. ఏమైనాసరే ఆ పిల్లవాడు తన చెల్లెలికి పాట పాడి వినిపించాల్సిందే అని చెప్పి లోపలకి తీసుకొని వెళ్ళింది. ఆ పాప కొనవూపిరితో తన్నుకోవ టంచూసి వాడు పాట పాడటం మొదలుపెట్టేడు. ఆ పసివాడు సన్నని గొంతుకతో నిర్మలమైన మనస్సుతో "You are my sunshine, my only sunshine, you make me happy when skies are gray" అని పాడేడు. వెంటనే పాపలో మార్పు కనపడింది. నాడి మెరుగైంది. "అలాగే పాట పాడుతూవుండు" అని వాళ్ల అమ్మ ప్రోత్సహించింది. "You never know, dear, how much I love you, please don't take my sunshine away" అని పాడేడు. అంతే అలా పాడగానే ఆ పాప ఊపిరి క్రమబద్ధమైంది. "The other night, dear, as I lay sleeping, I dreamed I held you in my arms". పాప కోలుకుంది. మొహం తేటపడింది. హాయిగా పడుకుంది. "అలాగే ఆపకుండా పాడుతూ ఉండు బాబు". ఆ పొగరుబోతు నర్సు కళ్ల లోంచి కూడ అశ్రువులు రాలినై. కేరెన్ మొహం వికసించింది. "You are my sunshine, my only sunshine. Please don't take my sunshine away..." ఆ మరునాడే పిల్ల పరిస్థితి ఇంకా మెరుగైంది. ఇంటికి కూడ పంపించివేశారు. అద్భుతం! అద్భుతం! అని ఆస్ప

త్రిలో వాళ్లందరు ఆశ్చర్యపోయారు. "దేవుని ప్రేమ ఎంత అద్భుతమైనదో చూడండి" అని కేరెన్ కృతజ్ఞత చెప్పుకుంది.

అనువాదం: ఆర్. లక్ష్మీప్రసాదమ్మ

(మదర్ ఇండియా సౌజన్యంతో)

సమాచార పత్రము

నవంబరు, డిసెంబరు నెలలలో ముఖ్యమైన దినములు

17 నవంబరు, 1973 నాడు శ్రీమాత దేహాన్ని చాలించారు. వారి భౌతికకాయము 20 నవంబరు నాడు సమాధి చేయబడినది. ఈ రెండుదినముల వార్షికోత్సవములు ఆశ్రమంలో ఉచితరీతిని జరుపుకొనెదరు.

24 నవంబరు, 1926 నాడు పృథ్వీచైతన్యం కోసం శ్రీఅరవిందులు సలిపిన పోరాటము విజయవంతమై, పైనుంచి ఒక శక్తి "God-head of the Overmind" దిగివచ్చింది. అతిమానసయోగము నకు ఇది ఒక ప్రధానఘట్టము కనుక దీనిని శ్రీమాత "సిద్ధిదినముగా" ప్రకటించారు. ఆశ్రమంలోని నాలుగుదర్శనదినములలో దీనిని కూడ ప్రత్యేక కార్యక్రమాలతో జరుపుకొనెదరు.

"Organised Teamwork" అనే విషయంపై శ్రీఅరవిందో సొసైటీ స్త్రీల విభాగంవారు 21-23 నవంబరు 2002 తేదీలలో ఒక గోష్టిని సొసైటీ బీచాఫీసులో నిర్వహించెదరు. దీనికందరూ ఆహ్వానితులే.

శ్రీఅరవిందుల గీతావ్యాసములు "Essays on the Gita" మీద ఒక అధ్యయన శిబిరమును 26 నవంబరు – 4th డిసెంబరు 2002 తేదీలలో డా॥ నడ్కర్ణిగారు నిర్వహించెదరు. దీని కందరు ఆహ్వానితులే.

1, 2 డిసెంబరు 2002 తేదీలలో శ్రీఅరవిందుల అంతర్జాతీయ విద్యాకేంద్రము వార్షికోత్సవములను 1 వ తారీకున నాటకముల తోను, 2 న వ్యాయామవిన్యాసములతోను జరుపుకొనెదరు.

శ్రీఅరవిందులు 5 డిసెంబరు 1950 నాడు దేహమును చాలించగా వారి కాయము 9 డిసెంబరునాడు ఆశ్రమప్రాంగణములో సమాధి చేయబడినది.

శ్రీమాత 125 వ జన్మదిన సందర్భములో 2003 పోకెట్ కాలెండరు ఒకటి శ్రీమాత వర్ణచిత్రముతోను, శ్రీఅరవిందుల సందేశము తోను తయారుచేయబడినది. ఆలిండియా మేగజైన్, అఖిల చందా దారులందరికి ఇది పంపబడును. అదనపు కాపీలు కార్డుకు 2. రు॥, పోస్టేజీ 8 కార్డులవరకు 5 రూ॥ చొప్పున శ్రీఅరవిందో సొసైటీ బీచాఫీసు, 1 రంగపిళ్లై స్ట్రీటు, పాండిచేరి 605001 నుండి లభ్యములు. డబ్బు ముందరే పంపాలి. కార్డులు డిసెంబరు 2002 లో పంపబడును. నూరుకార్డులు కొన్నవారికి పోస్టేజి ఉచితము.

కేంద్రములు, శాఖల నుండి వార్తలు:

నరేగల్ (కర్ణాటక) లో 27 జూలై నాడు శ్రీ అరుణ్ కుల్‌కర్ణికారు శ్రీఅరవిందుల పూర్ణయోగాన్ని గురించి ప్రసంగించారు. కాలికట్ (కేరళ) లో స్థానిక పత్రిక 'పుణ్యభూమి' 'Sri Aurobindo - An Introduction' అనే లఘుదీపికను మలయాళంలో ప్రచురించిరి. గుల్‌బర్గ (కర్ణాటక) లో శ్రీఅరవిందుల అవశేషములు ప్రతిష్ఠ వార్షికోత్సవమును 4 ఆగస్టున జరుపుకొనిరి. చెన్నైలో శ్రీ ప్రదీప్ నరంగ్ గారు "The Triple Movement in Sri Aurobindo" అనే విషయంపై ప్రసంగించిరి. చెన్నై అన్నానగరులో ఒక నూతన కేంద్రము ప్రారంభించబడినది. తంజావూరులో పుష్పములు, వాటి ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను తెలిపే ఒక ప్రదర్శన ఏర్పాటు చేయ బడినది. బెంగుళూరులో కొత్తగా కట్టిన అతిథిగృహము తెరవ బడినది. ఇక్కడ భోజనసదుపాయము కూడ కలదు. అక్కడ ఉండదల్చుకున్నవారు "The Administrative Manager, Sri Auro-

bindo Complex, Sri Aurobindo Marg, J.P.Nagar I Phase, Bangalore - 560 078 కి రాయవలెను. 15 ఆగస్టు నాడు అనేక కేంద్రములలో శ్రీఅరవిందుల జన్మదినోత్సవములు జరుపుకొనిన వివరములు మా కందినవి కాని, స్థలాభావముచేత వాటిని ప్రచురించలేకపోతున్నాము.

శ్రీమాత 125 వ జన్మదినోత్సవము

శ్రీఅరవిందుల మార్గదర్శకత్వము

నువ్వేమీ కష్టపడకుండా దైవశక్తియే నీ సమర్పణ కూడ చేసిపెడుతుంది అని భ్రమపడేవు జాగ్రత్త. దేవుడు నిన్ను నువ్వు సమర్పించుకోవాలని కోరుకుంటాడేగాని నిన్ను బలవంతపెట్టడు. నీ తత్వము పూర్తిగా పరివర్తనమయ్యేంతవరకు, "నాకు దైవము వద్దు" అనుకొని ఆయన్ని తిరస్కరించి, నీ సమర్పణను వెనక్కు తీసుకుండే హక్కు నీకు ఉంటుంది. అయితే దాని ఆధ్యాత్మిక పరిణామములు నువ్వు అనుభవించవలసి ఉంటుంది. నువ్వు దైవానికి చేయు సమర్పణ యథేచ్ఛగా, సజీవంగా, క్రియాత్మకంగా ఉండాలిగాని యాంత్రికంగా, జడంగా, ఏదో మొక్కుబడి కోసం చేసినట్లు ఉండకూడదు.



మృత్యువు అంటే ఏమిటి?

అఖిల

అఖిల భారత పత్రిక

డిసెంబరు 2002

మృత్యువు అంటే ఏమిటి? 6/12/02

శ్రీమాత ప్రవచనములు

విషయసూచిక

In fact, there is no death.

The Mother

మృత్యువుయొక్క నిజస్వరూపము

ఈ సృష్టి చిత్రమైనది. జడపదార్థంతో మొదలైనప్పటికి అది పరిణామము చెంది చెంది మానవుడుద్భవించాడు. ఈ మనిషి కూడ అనేకజన్మలద్వారా పరిణామముచెంది దేవతారూపాలను ధరించగలడు. ఒక్కొక్క జన్మలోను ఈ శరీరము కొంతవరకే పరిణామము చెందగలదు. ఎప్పుడైతే ఇక పరిణమించలేదో అప్పుడు ఈ శరీరాన్ని వదిలేసి నూతనశరీరాన్ని ధరిస్తుంది. దానినే మృత్యువు అంటున్నాము. ఇందులో దుఃఖించవలసిందేమున్నది? మన అజ్ఞానంవలన అలా అనుకుంటామేగాని నిజానికి మృత్యువు నూతనదేహధారణామహోత్సవానికి నాంది. ఇది మనం సంతోషంగా ఎదురు చూడాల్సిన విషయమేగదా మరి.

— సంపాదకుడు

మృత్యువు ఆవశ్యకత

పుట్టిన ప్రతిజీవి గిట్టాల్సిందే. అయితే ప్రకృతి ఉద్దేశములో మృత్యువు మానవులు అనుకున్నంత భయంకరమైనదేం కాదు. మానవచైతన్యంలోను ఉన్నతజాతి జంతువులలోను మృత్యువంటే ఒకరకమైన జుగుప్సాభావమున్న మాట నిజమే. అయితే మృత్యువు అవసరము అనే జ్ఞానంకూడ జీవుల అవచేతనలో రహస్యముగా (Subconscious knowledge) దాగివున్నది. జీవుల పునర్జన్మకి, పరిణామానికి, రూపాంతరీకరణానికి మృత్యువు ఒక అవసరమైన దశ.

మృత్యువు – జీవరాసుల పరిణామము

సృష్టి జరిగినప్పుడు భూమ్మీద ఉన్న జడపదార్థముయొక్క చిత్రమైన పరిస్థితులవలన మృత్యువు తప్పనిసరి అయింది. దీనిని అర్థంచేసుకోవాలంటే మనం ముందర పరిణామము (evolution) అంటే ఏమిటో తెలుసుకోవాలి. మొట్ట మొదటిదశ అయిన అచేతనారూపము చైతన్యాన్ని పొందాలి. చైతన్యము అనేకరూపములను పొందాల్సి ఉంటుంది. కొత్తరూపము

లను పొందాల్నంటే పాతరూపములను విసర్జించాలి. కాని ఆ ప్రక్రియ జరుగుటకు ఒక్కొక్కస్థాయిలోను ఒక్కొక్కనిశ్చయమైన రూపమును దాల్చాలి. ఈ తొడుగును మార్చాలంటే పాతతొడుగును మృత్యువు ద్వారా త్యజించాలి.

పాతరూపాలు శిథిలమైపోతాయి

పరిణామకార్యక్రమంలో ప్రాణశక్తులు, చేతనశక్తులు ఒకవస్తువుమీద పనిచేసి దాన్ని పరిణమింపచేస్తాయి. అందుకని ఆ వస్తువు గట్టిగా ఘనరూపంలో ఉండాలి. కాని అది కొంత వరకే మారగలదు. ఆ తర్వాత అది శిథిలమైపోతుంది. ఆ పరిణామశక్తి వత్తిడికి అది తట్టుకోలేదు. అప్పుడది తన రూపాన్ని మార్చుకోవలసివస్తుంది. దాన్నే మనం మృత్యువంటున్నాము. మృత్యువుయొక్క ఆవశ్యకత మీకిప్పుడు అర్థమైందని తెలుస్తోను. అలా కాకుండా పదార్థము తన జడత్వాన్ని పోగొట్టుకొని ఉన్నత శక్తులకు స్పందించి పరిణమించగల సామర్థ్యమును కనుక పొందినట్లయితే మరణించ నవసరముండదు.

*

దేహములో మృదుత్వము లోపించుట

కాని మామూలుగా మానవుని జీవితము మారుతున్న చైతన్యపరిస్థితులకు అణుగుణంగా స్పందించలేదు. మనోమయపురుషుడు ప్రాణమయపురుషుడు విశ్వశక్తులతోపాటు పురోగమించేందుకు చేతనైనంతవరకు ప్రయత్నిస్తాయి. ప్రపంచపు అంతరంగిక రూపాంతరీకరణము ననుసరించి ఈ మానసిక ప్రాణికపురుషులు కొంతవరకు పురోగమించగలవు. అయితే శరీరంమట్టుకు తన జడత్వమువలన మెల్లిగా నత్తనడక నడుస్తూ ఉంటుంది. సుమారు 70 లేక 80 ఏళ్లు, మహా అయితే 100 లేక 200 ఏళ్లకు ఈ భౌతికకాయం ఇక మార్పుచెందలేక కుప్పకూలిపోతుంది; ఆ విశ్వశక్తులకు తట్టుకోలేక అది మరణముగా పరిణమిస్తుంది.

అన్ని స్తరములలోను సమగ్రమైన మార్పు

మనిషిలోని వివిధభాగములు ఒకే సారి పరిణామము చెంది విశ్వము యొక్క అంతరంగికముతోపాటు మనుగడ చెందినట్లయితే రోగాలుండవు. మృత్యువు ఉండదు. అయితే మనిషియొక్క యావత్స్వరూపము (అన్ని స్తరములు) అంటే మృదువుగా ఉండే పైస్తరములనుండి స్థూలమైన క్రింది స్తరములవరకు మార్పుచెందాలి. ఆఖరికి అతికఠినంగా, కర్కశంగా ఉండే భౌతికశరీరంకూడ గొప్పవైన పరిణామశక్తులకు అనుగుణంగా స్పదించి తన రూపమును మార్చుకోవాలి.

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి. ఆర్. లక్ష్మిప్రసాదమ్మ

(*CWM* Vol. 3, pp. 36-37, 87, 90)

మృత్యువు నిర్వహించే పాత్ర

గాలిపటాలు ఆకాశంలో ఎగురుతాయి. ఎదురుగాలి ఎంత ఎక్కువ వేస్తే అంత ఎత్తుగా ఎగురుతాయి. మనిషి విషయంలో కూడ అంతే; తనకెదురైన అడ్డంకులను ఎదుర్కోటంవలన తనస్థాయి పెరుగుతుంది; మృత్యువుద్వారా చేతనాసోపానాల్ని ఆరోహిస్తాడు. తనద్వారా దైవాభివ్యక్తి ఇంకా ఎక్కువగా జరుగుతుంది. దివ్యప్రేమంటే ఏమిటో నీకు తెలియదు. ఈ సృష్టి ఇంకా బాల్యదశలోనే ఉన్నది. తేజస్తిమిరములు, ప్రేమద్వేషములు లాంటి పరస్పర వ్యతిరేకలక్షణముల ద్వారా నీచేతనాస్థాయి పెరుగుతుంది. దివ్యప్రేమ పైనుంచి ధారావాహికంగా వర్షించి నిన్ను తలమునకలు చేస్తుంది. — *సంపాదకుడు*

శ్రీఅరవిందుల 'తలపులూ – సూక్తులు' (Thoughts and Aphorisms) చదువుతూ శ్రీమాత ఇలా వివరించారు:

(88) తన మనుగడకోసమే మృత్యువు ఈ ప్రపంచాన్ని సృష్టించింది. నీవు మృత్యువును బహిష్కరించెదవా? అలా చేస్తే జీవితంకూడా నశించిపోతుంది. నీవు మృత్యువును తప్పించలేవు గాని దానిని మహోదాత్తమైన అమృతత్వస్థితిగా పరివర్తనం చేయగలవు.

(89) తను ప్రేమించటంకోసమే క్రౌర్యం ఈ ప్రపంచాన్ని సృష్టించింది. నీవు క్రౌర్యాన్ని తొలగించగలవా? ఆ ప్రయత్నంలో ప్రేమకూడా తొలగిపోతుంది. నీవు క్రౌర్యాన్ని తొలగించలేకపోయినా తద్వ్యతిరేకమైన ప్రగాఢప్రేమగా దానికి కొత్తరూపాన్ని సంతరింపజేయగలవు.

(90) ప్రపంచం అజ్ఞానప్రమాదాల పునాదిపై నిర్మింపబడినదని వాటికి తెలిసేందుకే అలా జరింగిందేమో? అజ్ఞానప్రమాదాలను నీవు తొలగించగలవా? తొలగించలేవు. పైగా ఆ ప్రయత్నంలో జ్ఞానాన్ని కూడా కోల్పోతావు. తొలగించటం సాధ్యంకాకపోయినా, వాటిని తర్కాన్ని అధిగమించే పరమప్రకాశంగా రూపొందించగలవు.

(91) మృత్యువులేనిజీవితం మాత్రమే ఉంటే, బహుశః అమృతత్వం ఉండేదికాదేమో. క్రౌర్యంలేని ప్రేమమాత్రమే ఉంటే అది నిరుచప్పని క్షణికోల్లాసమే అవుతుంది. హేతుత్వమే (reason) ఉండి, అజ్ఞానమే లేకపోయినట్టయితే, మన ఘనవిజయాలన్నీ లౌక్యాన్నీ, పరిమితమేధనూ అధిగమించగలిగేవి కావు.

(92) మృత్యువు రూపాంతరంచెందితే జీవితమవుతుంది. క్రౌర్యం పరిణామంచెందితే ప్రేమవుతుంది. అది తట్టుకోలేని తలమునకలయ్యే పారవశ్యం. అజ్ఞానం రూపాంతరీకరణం చెందితే, విజ్ఞానవివేకాలకతీతమైన జ్ఞానజ్యోతిగా ప్రకాశిస్తుంది.

ప్రేమయొక్క నిజతత్త్వము

పరస్పరవ్యతిరేకతా, వైరుధ్యమూ అనే లక్షణాలే ప్రగతికి ప్రచోదకాలవుతాయనే భావమిక్కడ వ్యక్తంచేయబడింది. ఎందు

కంటే క్రౌర్యమే లేకపోతే, ప్రేమ గాఢత్వమూ, తీవ్రతాలేకుండా చప్పగా ఉంటుంది. *ప్రేమయొక్క నిజతత్త్వము వ్యక్తావ్యక్తస్థితులకు ఆవల భాసిస్తుంది.* పదార్థపరిణామాన్ని శీఘ్రతరం చేసేందుకు వ్యతిరేకలక్షణాలు చాలా ముఖ్యమని శ్రీఅరవిందుల భావన.

పరమప్రేమ పరమోత్కృష్టత

అనుభూతిగా ఈ విషయం పరమసత్యం. ఏవిధంగానంటే – నిత్యమైన పరమోత్కృష్టప్రేమను దర్శించటం మాటల్లో చెప్పాలంటే – అది ప్రతి ఒక్కరికీ ఒక జ్ఞానోపలబ్ధిగా, ఇంద్రియానుభూతిగా కలుగుతుంది. అది కేవలం ఒక అవగాహనే కాకుండా నిర్దుష్టమైన ఆకారంతో మన ముందు నిలుస్తుంది. ఎంతటి ఉద్దీప్త పదార్థచైతన్యంతో రూపొందించి, సిద్ధపరుపబడినా అది ఆ ప్రేమను వ్యక్తం చేయలేదు. ప్రతివారూ మొట్టమొదట ఈ అశక్తతాభావాన్నే పొందుతారు. దీని తరువాతనే అనుభూతి కలుగుతుంది. అప్పుడు ఒక రూపం సాక్షాత్కరిస్తుంది. దీనిని అచ్చంగా క్రౌర్యమనలేము. ఎందుకంటే అది మనమెరిగిన క్రూరత్వంకాదు గనుక. అన్ని అంశాలనూ పరిగణలోకి తీసుకుని గమనిస్తే కొంత తీవ్రతగలిగిన ఒక స్పందన మనకు కన్పించి అక్కడ వ్యక్తమయే ప్రేమను తిరస్కరిస్తుంది, నిరాకరిస్తుంది. నేను మామూలు ప్రపంచాన్ని గురించికాక, ప్రకృతచైతన్యంయొక్క ఉత్తమోత్తమస్థాయినిగురించి చెప్తున్నాను. జరిగిన ఒక యథార్థాన్ని వివరిస్తున్నాను. అది ఒక అనుభూతి. ప్రతిఘటింపబడి, వైరుధ్యలక్షణంచేత ప్రహరింపబడిన చైతన్యంలోని ఆ భాగం, తిరస్కరణకు గురైన ప్రస్తుతపరిస్థితుల్లో మాత్రమే సాధ్యమయ్యే తీవ్రతలో ప్రేమ నిధానానికి మొరపెట్టుకుంటుంది. *అప్పుడు మహాప్రవాహమొకటి అవధులు త్రెంచుకొని వెల్లువై ప్రవహిస్తుంది. ఇంతకుముందెన్నడూ వ్యక్తంకానిదిప్పుడు ప్రత్యక్షమవుతుంది.*

దేహకణములు ఎలుగెత్తి పిలుచుట

జననమరణాలను ఈ దృక్కోణంనుండి పరిశీలించినట్టయితే సరిగ్గా ఇటువంటి అనుభవమే ఎదురవుతుంది. "సావిత్రి" మహాకావ్యంలో వర్ణింపబడినట్లు మృత్యువును గురించి సుదీర్ఘ

చింతనో, నిరంతరం మృత్యువు మన సమక్షంలోనే వర్తిస్తోందన్న భావనో, ఏ క్షణమైనా మృత్యువు మనల్ని కబళిస్తుందన్న భయమో – వీడని సహచరుడిలా ఆజన్మాంతం మనల్ని వెంటాడుతూ ఉంటుంది. దాంతోబాటే మృత్యువు ఆసన్నమైనప్పుడు మాత్రమే కలిగే తీవ్రతలో మన శరీరంలోని ప్రతికణమూ తీవ్రస్థాయిలో స్పందించి, అమృతత్వశక్తిని ఆవాహనచేసుకుంటుంది. అప్పుడు అవి వ్యక్తీకరణను తీవ్రతరంచేసే మార్గాలని స్పష్టంగా అర్థమవుతుంది. ఇవన్నీ కూడా పురోగతి సాధించడానికీ, పరిపూర్ణతనందుకోడానికీ విధానాలని గోచరిస్తుంది. దీనిని సాధించే విధానాలు మొరటైనవి (crude) ఎందుకంటే దీనివల్ల సాధించబడి వ్యక్తమయ్యేది కూడా ప్రాకృతికంగనుక. అయితే ఇవన్నీ కూడా క్రమక్రమంగా పరిపూర్ణత సంతరించుకుంటూ అంతకంటె ఉత్తమమైన నిరంతరపురోగమనశీలమైన తత్త్వాన్ని వ్యక్తంచేయడానికి యోగ్యమవుతాయి. ఆ ప్రాకృతిక, అపరిపూర్ణవిధానాల స్థానంలో సున్నితమైన సూక్ష్మప్రక్రియలు చోటుచేసుకుంటాయి. ఇటువంటి జాంతవికమైన అమానుష వైరుధ్యాలవసరం లేకుండానే ప్రపంచం పురోగమిస్తుంది. ఎందువల్లనంటే పరిణామ చక్రంలో ప్రపంచం ఇంకా ప్రాథమికస్థితిలోనూ, మానవచైతన్యం శైశవావస్థలోనూ ఉన్నాయి గనుక.

నిశ్శబ్దం

ఇది సృష్టిని తమోగుణంనుంచి మేల్కొల్పడానికి శీఘ్రతరమైన, అతిశక్తివంతమైన విధానం. ఇది సృష్టిని పరిపూర్ణతవైపూ, సాఫల్యతవైపూ నడిపిస్తుంది.

(దీర్ఘ నిశ్శబ్దం)

ఇది అతి త్వరలోనే సంభవం కావచ్చు. అయితే అసలు సమస్య ఇది – ఆకాంక్ష ఎంత (తీవ్రంగా) గాఢంగా, శక్తివంతంగా ఉంటే ఈ క్లిష్టపరిణామం అంత సరళమూ, సులభతరమూ అవుతుంది. క్రౌర్యం ప్రేమగా రూపొందింపబడుతుంది. ఇంకా మిగిలినవి కూడా అంతే.

(*CWM* Vol. 10, pp. 166-170)

(283) ఓ మృత్యుదేవతా! మా ప్రచ్ఛన్న మిత్రమా! మా అవకాశవిధాతా, నీవు ద్వారాన్ని తెరిచేటప్పుడు ముందుగా మాకు తెలియజేయడానికి సంశయించకు. ఆ శబ్దానికి మేము భయపడముతే.

(284) మృత్యువు అప్పుడప్పుడూ మోటుగా ప్రవర్తిస్తుంది. భూలోకపు దుస్తులను విసర్జించి, ధగధగలాడే వసనాల్ని ధరించినప్పుడు, దాని మొరటుహాస్యం, దురుసుతనం క్షమార్హమవుతాయి.

(375) ఇంతకూ నీవు దేనిని మృత్యువంటున్నావు? భగవంతుడు మరణిస్తాడా? చావంటే భయపడేది నువ్వే. నిజానికి జీవితమే మరణకిరీటం ధరించి, భీకరప్రచ్ఛన్నవేషంతో నిన్నేడిపించడానికి నీ దగ్గర కొస్తుంది.

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

మృత్యువు యథార్థజీవితానికి మేలుకొలుపు!

పుట్టటం గిట్టటం కొఱకేనే, పెరుగుట విరుగుట కొఱకేనా, ఇది చాలా అన్యాయం అనే ప్రశ్న ప్రతిమనిషిని వేధిస్తూనే ఉంటుంది. జడపదార్థాన్ని ప్రేరేపించి అందులోనుంచి ఉన్నతోన్నతరూపాలని పుట్టించేందుకు మృత్యువు చాలా అవసరము. కాని పదార్థము వట్టి జడము. ఎద్దుమొద్దుస్వరూపం. దాని సామర్థ్యము పరిమితము. అది కొంతవరకుమాత్రమే మారగలదు. అందుకని దానిని మొదట మృత్యువు ద్వారా విచ్ఛిన్న పరచాలి. పునర్జన్మనెత్తి తదుపరి అవతారమును ధరింపజేయాలి. ఇపుడొక నూతనశక్తి దిగిచ్చింది. ప్రచలితమైంది. తగిన ఆధారాలకోసం వెతుక్కుంటోంది. మనమీ అద్భుతావకాశమును జారవిడువకూడదు. దానికి ఒదిగియుండి, మనవైపు ఆకర్షించుకొని, మనలో క్రియాశీలముగావించి ఆనందాతిరేకముతో నాట్యము చేయుదుము గాక. — సంపాదకుడు

మృత్యువు జీవితాన్ని నిరంతరం సవాలుచేస్తూ ఉంటుంది. తన నిజస్వరూపం ఏమిటో తనకు తెలియదు. దానిని కను గొనుటయే తన ప్రథమకర్తవ్యమని మనిషికి గుర్తుచేస్తూ ఉంటుంది. ఒకవేళ మృత్యువే లేదనుకోండి! అప్పుడు మనిషి శాశ్వతంగా ఈ దరిద్రపుజీవితానికే కట్టుబడి ఉంటాడు; అటుల గాక మృత్యువుచే తరమబడినప్పుడు ఇంతకంటె పర్ఫెక్ట్ లైఫ్‌కి గల అవకాశమును గుర్తించడానికి మార్గమును అన్వేషించటం మొదలుపెడతాడు. — శ్రీఅరవిందులు (Thoughts and Glimpses)

పరిపూర్ణజీవితం కోసం ఆవేదన

చైతన్యం ఏమాత్రమైనా జాగృతమైన ప్రతి వ్యక్తీ తన జీవితంలో ఒక్కసారైనా తనకు తాను వేసుకునే ప్రశ్న ఇది. మనిషి అంత రాంతరాలలో ఆయుష్షను పొడిగించాలనీ, దీర్ఘకాలం బ్రతకాలనీ, జీవనాన్ని వికసింపచేయాల్సిన అవసరం ఉంది. మృత్యువు తొలి సారిగా అడుగుపెట్టిన క్షణంలో అది యాదృచ్ఛికమైన సంస్పర్శ కావచ్చు — అది అనివార్యం. ఆ క్షణంలో చైతన్యమంతా భయంతో వెనుకకు మరలి హఠాత్ తిరోగమనం సంభవిస్తుంది.

మృత్యువంటే ఏవగింపు

సున్నితమైన మనస్తత్వంగలవారికి అది భయోత్పాతం కల్గిస్తుంది. ఇతరులలో క్రోధం కలుగుతుంది. తనలో ఈ విధమైన ఆలోచనలు వస్తాయి — "మనం కోరకుండా, మనం అర్థంచేసు కోలేని, మనం పాల్గొంటున్న ఈ భీతావహాఖేలనం ఏమిటి? మనం చనిపోవడానికే అయితే, అసలు పుట్టటమెందుకు? మృత్యు హోమంలో అంతా సర్వనాశనమైపోతుంటే, అంతా హరించుకు పోతుంటే ఇక అభివృద్ధికి, పురోగతికి, ప్రజ్ఞాప్రాభవాల పాటవా నికి ప్రయత్నించడమెందుకు?

కొంతమందిలో తిరుగుబాటు చెలరేగుతుంది. మరికొందరు బలహీనులలో నిరాశ ధ్వనిస్తుంది. ఎప్పుడూ ఈ ప్రశ్న తలెత్తు తుంది — "ఈ మృత్యువు వికటాట్టహాసం వెనుక ఒక చైతన్య

పూరితమైన సంకల్పమే ఉంటే, అది ఒక పెనుభూతం భీకరా కృతి మాత్రమే."

పదార్థానికి మేలుకొలుపు

కాని శ్రీఅరవిందులు ఏమంటారో తెలుసా –

భౌతికపదార్థచైతన్యంలో పరిపూర్ణత్వ ఆవశ్యకతను, పురోగతి ఆవశ్యకతను ప్రేరేపించే అనివార్యసాధనం మృత్యువు. ఈ విపత్తు లేకపోతే, మనుష్యులంతా బహుశ తాము ఉన్న పరిస్థితులతో సంతృప్తిచెందేవారు. కాని పరిస్థితులు ఎలా ఉన్నా మనం వాటికి తలవంచి జీవితంలో ప్రయాణించవలసిందే. ఇందులోనుండి బయటపడే మార్గం మనం కనుగొని తీరాలని మనకు మనం చెప్పుకోవాలి.

విశ్వ పురోగమనము

అసలు విషయమిది – సృష్టిలో ప్రతీదీ నిరంతర ప్రగతిశీలవికాస స్థితిలో ఉంటుంది. అంటే సృష్టి సర్వస్వం, ఈ విశ్వం యావత్తూ ఒకపరిపూర్ణత్వంవైపు పురోగమిస్తున్నది. అటువైపు మనిషి పురోగమిస్తుంటే, అది (perfection) ఇంకా ముందుకు సాగిపోతుంది. ఈ పురోగమనం ఒకవైపు సాగుతుంటే చైతన్యంలోని అత్యంత సూక్ష్మ అస్తిత్వశ్రేణులు ఆ పురోగతిని అనుసరిస్తూ వుంటాయి. మనిషి ఎంత ఉన్నతశిఖరం చేరితే అంత ఉన్నతంగా పురోగమనం విశ్వపురోగమనాన్ని అనుసరించగలదు. దివ్యవికాసవైభవాన్ని అందుకోగలదు. కాని భౌతికప్రపంచం స్వభావరీత్యా ఓ కఠినమైన గండశిలవంటిది, అది జడము, పరివర్తన నెమ్మదిగా, అతినెమ్మదిగా జరుగుతుంది. మానవచైతన్యం దానిని గమనించడానికి ప్రయత్నిస్తుంది. ఆ పురోగతి కాలం కొలమానానికి దాదాపు అందదు. అందువల్ల బాహ్యా, అంతరాభివృద్ధుల మధ్య నిరంతర సమతుల్యరాహిత్యం ఏర్పడుతుంది. ఈ సమతుల్యంలేని స్థితి, అంతర్గత పురోగతి ననుసరించే బాహ్యారూపాల దుర్బలస్థితి వల్ల ఆ రూపాలవిధ్వంసం ఆవశ్యకత, రూపాలమార్పిడి ఏర్పడుతాయి. కాని అదే వేగాన్ని పొందడానికి ఈ పదార్థంలోకి చాలినంత చైతన్యాన్ని చొప్పించగలిగితే, అంతర్గత పురోగమనాన్ని

అనుసరించడానికి, నవనీతంవలె; పదార్థం మృదువుగా మారితే ఈ సమతుల్యస్థితి దెబ్బ తినదు. మృత్యువు అవసరం ఉండదు.

శ్రీఅరవిందులు చెప్పినట్లు భౌతికచైతన్యంలో అవసరమైన ఆకాంక్ష, మృదుత్వం మేలుకొల్పడానికి ప్రకృతి ఈ విప్లవాత్మక మైన సాధనాన్ని (మృత్యువు) కనుగొన్నది.

పదార్థంలోని జడత్వము

పదార్థంయొక్క ముఖ్యధర్మం జడత్వం. ఈ కర్కశత్వమే కనుక లేకపోతే వ్యక్తిగత చైతన్యం జడమయంగా ఉంటూ, మార్పును కోరకుండా, నిరంతరం స్తబ్దంగానే ఉండిపోయేది. ఏదిఏమైనా, ప్రపంచపరిస్థితులు ఇలాగే రూపొందించబడ్డాయి. కొద్దిగా ఎక్కువ తెలిసిన మనం చేయవలసింది ఒకటి ఉంది. మనకు సాధనాలు ఉన్న మేరకు బలాన్ని, చైతన్యాన్ని, సరికొత్తశక్తిని మనం ఆవాహనచేసి ఈ పరిస్థితిని మార్చాలి. చైతన్యాన్ని రూపాంతరం చెందించి, మృదుపేశలమూ, ప్రగతిశీలం చేయగల ప్రకంపనములను జడపదార్థంలోకి ఆ వినూత్నశక్తి ప్రవేశపెట్టగలదు.

ప్రకృతిలో మార్పుకు అయిష్టత

అయితే సృష్టి ఎప్పటికీ ఇలాగే స్తబ్దంగా శిథిలమైపోతుందని అనుకోకూడదు. మరింత ప్రగాఢమైన జ్ఞానం కలవారు చాలా శీఘ్రంగా పురోగమించాలని కోరడం ప్రకృతి గమనిస్తుంటుంది. ఇష్టంవచ్చిన రీతిలో వలయాలలో పరిభ్రమించడం, వెంటవెంటనే ప్రయత్నాలు సాగించడం, అపజయాలు, తొలిప్రారంభదశలు, కొత్త ఆవిష్కారాలు – ఇవి ప్రకృతికి ఎంతో ఇష్టం. ప్రకృతి సుదీర్ఘకాలం తీసుకుంటే, అది ఎంతో ఆనందదాయకం – ఆమెకు.

పాతవ్యవస్థపట్ల విసుగుదల

కాని ఎంతటి ఉత్తమమైన ఖేలకైన మనిషి విసిగివేసారిపోతాడు. ఆ ఆటల్ని మార్చే అవసరం వస్తుంది. ఏదో ఒకనాడు చివరకి ఒకరకం ఆటను గూర్చి అతడు కలలుకంటాడు. అందులో పురోగమించడానికి ధ్వంసంచేయనవసరం లేదని, కొత్త ఉపకరణాలు, కొత్త వ్యక్తీకరణలు కనుగొనడానికి పురోగతిలోని

ఉత్సాహం చాలునని జడత్వాన్ని, బద్ధకాన్ని, అవగాహనలోపాల్ని, విసుగుదలను, నిర్లక్ష్యాన్ని దాటుకుపోవడానికి చురుకుదనం తీవ్రంగా ఉన్నదని అతను ఆ స్వప్నంలో తెలుసుకుంటాడు.

మృత్యువుకు ఆహ్వానము

కొత్త పురోగతిని సాధించగానే ఒకచోట నిస్తబ్ధంగా ఉండిపోవాలని ఈ దేహం ఎందుకు కోరుకుంటుంది? దేహం అలసిపోయిందన్నమాట. "ఓ, నువ్వు నిరీక్షించాలి. నాకు విశ్రాంతికోసం కొంతసమయం కావాలి" అంటుంది. అదే మరణానికి దారి తీస్తుంది. మరింత బాగా పనిచెయ్యాలని (పురోగమనం) మరింత పారదర్శకంగా మారాలని, మరింత సుందరంగా తేజోమయంగా, శాశ్వతంగా యౌవ్వనంతో ఉండాలని కోరుతూ – చురుకుదనాన్ని దేహం తనలో భావించినట్లయితే, ఈ భయానకమైన ప్రకృతి దరహాసాన్ని (nature's joke) – మృత్యువును తప్పించుకోవచ్చు.

ప్రకృతిలో ధాతువుల మథింపు

కాని ప్రకృతికి ఇదేమంత ముఖ్యం కాదు. ఆమె మొత్తాన్ని, లీలలోని సమగ్రత్వాన్ని చూస్తుంది. తాను ఏమీ నష్టపోలేదని ఆమెకు తెలుసు. ఎటువంటి ప్రాముఖ్యంలేని, అసంఖ్యాక సూక్ష్మమూలద్రవ్యాలను, పరిమాణాలను తను కలబోస్తున్నట్లు ఆమె భావిస్తుంది. తిరిగి వాటిని ఒకపాత్రలో పోసి మథిస్తుంది. అంతే, ఏదో కొత్తది ఆవిర్భవిస్తుంది. కాని ఆ ఆట అందరికీ వినోదంగా ఉండదు. కాని ఎవ్వరైనా ప్రకృతంత విశాలమైన చైతన్యంగా, అంత ఆనందంగా మారగల్గితే, ఆమెకన్నా శక్తివంతమైతే దానినే ఆ వ్యక్తి మరింత బాగా ఎందుకు నిర్వహించలేడు?

నూతనశక్తి ఆవిర్భావము

మనల్ని ఎదుర్కొంటున్న అసలు సమస్య ఇదే. భూమి మీదకు దిగివచ్చిన కొత్తశక్తి సహాయంతో, ఇప్పుడు అభివ్యక్తమవుతున్న, పనిచేస్తున్న శక్తి (force) సహాయంతో ఈ బ్రహ్మాండమైన ఆటను ఎవ్వరైనా ఎందుకు గ్రహించకూడదు? ఆ ఆటను ఎందుకు మరింత అందంగా, సామరస్యమైనదిగా, నిజమైనదిగా చేసుకోకూడదు?

వైతాళికులు కావాలి

ఈ శక్తిని స్వీకరించడానికి, ఒక కార్యాచరణను రూపకల్పనచేయడానికి అవసరమైన, శక్తివంతమైన ప్రజ్ఞ మాత్రమే కావాలి. ప్రకృతి తాను చేసే పద్ధతికన్న ఇంకా ఇతరములైన పద్ధతులున్నాయని ఆమెను ఒప్పించగల శక్తిగల చైతన్యపూరితమైన వ్యక్తులు ఉండాలి. ఇది ఉన్మాదంలాగా కనిపిస్తుంది. కాని వాస్తవాలుగా అవడానికి ముందు ఎన్నో కొత్తవిషయాలు (ఆవిష్కారాలు) ఉన్మాదంగానే కనిపిస్తాయి.

దివ్యముహూర్త మాసన్నమైనది

ఈ ఉన్మాదాన్ని సాక్షాత్కరింపచేసుకునే సమయం ఆసన్నమైంది. మీలో చాలా మందికి మనం అంతా ఇక్కడ ఎందుకు ఉన్నమో హేతువులు తెలియవు. కాని ఆ హేతువులు చాలా చైతన్యవంతమైనవి. మనం ఇక్కడ ఉన్నాం కాబట్టి ఈ ఉన్మాదాన్ని సఫలీకృతంచేయడానికే మనం సన్నద్ధులం కావాలి. కనీసం ఆ ప్రకారం జీవించినా కూడా అది చాలా గొప్పవిషయము.

అనువాదం: కె. యజ్ఞన్న

(*CWM* Vol. 9, pp. 33-36)

భౌతికంగా మృత్యువు అంటే ఏమిటి?

ఈ విశాల విశ్వంతో పోలిస్తే మనిషి ఒక నలుసే కావచ్చు కాని అతనికి చాలా ప్రాముఖ్యత వున్నది. అతని శరీరము చిత్రమైనది. చూసేందుకు ఒట్టి రక్తమాంసములే. కాని ఇందులో నక్షత్రలోకములకు స్థానమున్నది. ఈదేహము విశ్వానికి ప్రతిరూపము. విశాలవిశ్వంలో జరిగే మహత్తరమైన శక్తిప్రయోగాలు, అద్భుతమైన పరిణామాలు మానవశరీరంలో కూడా ప్రతిబింబిస్తాయి. మనమీ విషయాన్ని గుర్తించి దృష్టిని లోపలికి సారించి చూడాలి. శరీరకణములు తపనవలన దివ్యశక్తితో ఉద్దీపమైనట్లయితే అవికూడ దైవమును అభివ్యక్తపరచగలవు. — సంపాదకుడు

ప్రశ్న: భౌతికంగా మృత్యువు అంటే ఏమిటి?

అనేకకోట్లజీవకణాల సంకలితంవల్ల భౌతికదేహము ఏర్పడుతోంది. కొన్నికారణాలవల్ల జీవంపోయి, కేంద్రీకృతమైన కణాలు విచ్ఛిన్నమై విడిపోయినప్పుడు, మృత్యువు సంభవించిందని అంటారు.

మూలవస్తువైన చేతనకి మృత్యువు లేదు. అది భౌతిక ప్రపంచంలో శరీరధారణ చేసేటప్పుడు బాగా మన్నికలిగే పదార్థ రూపాలనే ఎన్నుకుంటుంది.

ఈ విధంగా ఎంచుకున్న భౌతికశరీరం పరివర్తనాకార్యక్రమంలో బహురూపాలు దాల్చి, క్రమానుగతంగా ఉన్నతోన్నత రూపాలను పొంది, పరిపక్వమయేంతవరకూ నిలిచి ఉండవలసినదే.

ప్రశ్న: కేంద్రీకృతమై ఉన్న కణాలన్నీ ఒక్కసారే చెదిరిపోతాయా? లేక దశలవారీగా విడిపోతాయా?

ఒక్కసారే విడిపోవు. దానికి చాలాకాలం పడుతుంది.

జీవకణాలన్నింటినీ ఏకాండంగా ఉంచాలనుకున్న శరీరం, ఆ సంకల్పాన్ని విరమించుకుంటుంది. మొట్టమొదట జరిగేది అదే. ఏదో ఒక కారణంవల్ల భౌతికవ్యక్తిత్వం ఈ విచ్ఛేదనకి ఒప్పుకుంటుంది. నష్టపోయిన సామరస్యాన్ని శరీరం తిరిగి పొందలేకపోవటం ఒక ప్రబలమైన కారణంగా చెప్పవచ్చు. అంతేకాక వాటన్నిటినీ తిరిగి సమన్వయించి, సంబాళించడానికి దానికొకరకంగా విసుగు పుట్టడం కూడా కద్దు. ఇంకా ఇటువంటి కారణాలు చాలా ఉన్నాయి. ఇలా ఉన్నప్పటికీ అకస్మాత్తుగా ఏదన్నా ఘోరవిపత్తు వచ్చిపడితే తప్ప, ఈ కణాలన్నిటినీ ఏకాండంగా కలిపి ఉంచాలనే ఇచ్ఛ ఏదో ఒక కారణం వల్ల (కారణం లేకపోయినాకూడ) తన సంకల్పాన్ని విరమించుకుంటుంది. ఇది తప్పనిసరిగా మృత్యువుకు దారితీస్తుంది.

ప్రశ్న: జీవకణాలు చెల్లాచెదరైపోవటంలో ప్రత్యేకార్థం ఏమైనా ఉందా? అది ఏమిటి?

శరీరం ఏర్పడటానికి కారణమైన సమీకృతశక్తి విరమించుకున్నప్పుడు దేహం విఘటితమవుతుంది. శరీరమున్నప్పుడు అన్ని కణాలు చక్కగా వర్ధిల్లి, లోనున్న దైవాంశస్మృతిని తమలో ఇముడ్చుకుంటాయి. శరీరం అంతంకాగానే అవి చెల్లాచెదరై ఇతర సముచ్చయాలతో చేరతాయి. తమ స్పర్శద్వారా సముచ్చయాలలోని ఇతరకణాలలో దైవచైతన్యాన్ని జాగృతంచేస్తాయి. ఈ విధంగా సమీకృతం, వృద్ధి, విచ్ఛేదఘటనల ద్వారా పదార్థం పరిణామం చెందుతూ, సంపర్కంవల్లనే నేర్చుకొని, అభివృద్ధి చెంది, అనుభవాల్ని పొందుతుంది.

నిజానికి శరీరంతోబాటే కణాలు నశిస్తాయికానీ వీటి చైతన్యం మాత్రం ఇతరసముచ్చయాలతో చేరుతుంది.

ప్రశ్న: జీవకణాలన్నిటినీ సమన్వయించి, సామరస్యపూరితంగా ఉంచే ప్రయత్నంచేస్తున్న శరీరానికి విసుగెందుకు పుడుతుంది?

సాధారణంగా వ్యక్తిభాగాలలో ముఖ్యమైన ఒక భాగానికి (అది మానసిక విభాగం కావచ్చు, ప్రాణికం కావచ్చు) పురోగమించడం ఇష్టంలేక నిరాకరిస్తుంది. ఆ నిరాకరణ ఏవిధంగా వ్యక్తమవుతుందంటే కాలంమీద జీవకణాలు కృశిస్తున్నప్పుడు ఆ క్షీణతను ఎదుర్కోడానికి అది ఏ విధంగాను సహకరించదు. అందువల్ల శరీరానికి విసుగు ఏర్పడుతుంది.

ప్రశ్న: భౌతికశరీరం సంకల్పానికీ, జీవకణాలకీ సంబంధమేమిటి? వాటి మధ్య సంబంధం ఎలా ఏర్పడుతుంది?

శరీరంలోని కణముల నిర్మాణము విశ్వములోని గోళముల నిర్మాణము ననుసరించి ఉంటుంది. అనగా అంతరంగిక పరిస్థితులకు బాహ్యాపరిస్థితులకు మధ్య అంత దగ్గర సంబంధం ఉందనమాట. నిజానికి అది 'బాహ్యం' కానే కాదు. వ్యక్తికి మాత్రమే బాహ్యము. మొత్తం ద్రవ్యధాతువు దగ్గర్నుంచి వచ్చే ప్రకంపనాన్ని జీవకణం తన అంతర ద్రవ్యాంశకంలోకి పరిగ్రహిస్తుంది. ప్రతికణం భిన్నభిన్నకాంతులతో కూడి ఉంటుంది. దాని కేంద్రం

పూర్ణప్రకాశంతో విరాజిల్లుతూ ఉంటుంది. ఈ కాంతిద్వారా అన్ని కణాలూ అనుసంధింపబడి ఉంటాయి. ఇంకా చెప్పాలంటే కేంద్రస్థ ప్రకాశంగా ఉన్న సంకల్పం, వ్యక్తి అంతర్గతసంయోగంతో కణాలలోని కాంతులను స్పృశించి ప్రభావితం చేస్తుంది. *ప్రతి ఒక్క కణమూ మొత్తం విశ్వానికో చిన్ని ప్రతిరూపం!*

ప్రశ్న: ఆధ్యాత్మికజ్యోతి భౌతికవస్తువు కాదు గదా అటువంటప్పుడు కణాలమీద ఎలా పని చేయగలదు?

ఇచ్ఛాశక్తి పదార్థం మీద ఎలా పనిచేస్తుందనే కదా నీ ప్రశ్న. జీవితమంతా ఆ ఇచ్ఛవలనే నడుస్తుంది. పిల్లలకి చెప్పేటప్పుడు జీవితమంతా ఇచ్ఛాశక్తితోనే నడుస్తుందనీ, ఆ సంకల్పమే లేకపోతే ఉనికే ఉండదనీ, పదార్థం చలనరహితమై అచేతనంగా పడివుంటుందని, సంకల్పంవలన కలిగే ప్రకంపనాల ఫలితంగా పదార్థం సచేతనమై జీవితం సాగుతుందనీ చెప్పవచ్చు. దీనికి శాస్త్రపరమైన వివరణ చెప్పటం కొంచెం కష్టమే కానీ అసలు విషయం మాత్రం ఇదే. ఆ వాస్తవాన్ని ప్రతిక్షణం గమనించవచ్చు.

ప్రశ్న: కేవలం పురోగమించాలనే సంకల్పము కాలాన్ననుసరించి కలిగే దేహక్షయాన్ని అరికట్టగలదా? భౌతికసత్త (శరీరవ్యక్తిత్వం) ఈ దేహక్షయాన్ని ఎలా అరికట్టకలదు?

దైహికపరివర్తనమంటే అదే. పరివర్తనచెందినప్పుడు దేహకణాలు చైతన్యవంతమవటమే కాకుండా దివ్యచైతన్యశక్తికి పరిగ్రహీతలవుతాయి. అంటే మహోన్నతచైతన్యాన్ని తమలో పని చేయనిస్తాయి. అదే పరివర్తనా ప్రక్రియ.

ప్రశ్న: మృత్యువును అరికట్టాలంటే మనం ఏం చేయాలి?

నీ చైతన్యాన్ని శరీరం నుండి వేరుచేసి, అంతరంగికంపై కేంద్రీకరించాలి; ఆ లోతైన చైతన్యాన్ని శరీరంలోకి ప్రవేశపెట్టాలి.

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామశాస్త్రి

(*CWM* Vol. 12, pp. 342-48)

భౌతికకాయము – మరణరాహిత్యము

పదార్థం ప్రాణం పోసుకుంది. జీవరాసులు ఉద్భవించినవి. అలాగే అవికూడ విశ్వమహాశక్తులచే మథించబడి పరిణామముచెందుతాయి. కొత్తరూపాలను సంతరించుకుంటాయి. ఈ మార్పు, ఈ పరివర్తనము అంచెలంచెలుగా జరుగుతుంది. జీవాత్మ మానవ జన్మద్వారా మనుగడ సాగిస్తుంది. ఒకజన్మనుండి మరోజన్మకు చేతనాస్థాయి పెరుగుతూంటుంది. నక్షత్రాలలో జరిగేమార్పులు కూడ జీవిలో ప్రతిఫలిస్తాయి! కాని ఈ మార్పులు శరీరానికి బోధపడవు. అందుకే అది ఓడిపోయి నశిస్తుంది. మానవశరీరము అతిమానసీకరణమైనప్పుడు ఇక మృత్యువుయొక్క ఆవశ్యకతే ఉండదు. *– సంపాదకుడు*

మరణరాహిత్యమనగా భౌతికకాయము రాలిపోయిన తరువాత మానసికవ్యక్తి సజీవంగా ఉండటం కాదు. అలా కూడ జరుగుతే జరగవచ్చును కాని సశరీరంగా ఉండికూడ ఆత్మ (జనన మరణములులేని ఆత్మకు ఛాయారూపమైన ఈ శరీరము కేవలం ఒకసాధనము మాత్రమే) జ్ఞానమును పొందుటయే నిజమైన మరణరాహిత్యము.

శ్రీఅరవిందులు (మెరపులు – తలపులు)

మనస్సు – శరీరాల సంబంధం

మానవశరీరానికి శక్తినిచ్చి చరింపచేసేది ప్రాణమయపురుషుడైతే, దాన్ని నియంత్రించేది, చాలావరకూ పాలించేది మనోమయపురుషుడు. ఈ మనోమయపురుషుడు ఎంతవరకు వ్యక్తీకరణపొంది స్పష్టమైన స్వతంత్రవ్యక్తి అయినాడు అనే విషయంలో మనిషికీ మనిషికీ తేడా వుంటుంది. చాలామంది మనుషుల్లో మనస్సు ఆకారం లేకుండా తరళంగా ఉంటుంది. కాబట్టి దానికి వ్యక్తిత్వం లేదు. ఈ విధంగా పద్ధతిప్రకారం తననుతాను ఏర్పాటు చేసుకోకుండా చపలంగా, తనకంటూ సంగ్రహాజీవితం లేకుండా, వ్యక్తిత్వంలేకుండా ఉన్నంతకాలం దానికి మనుగడ

లేదు. భౌతికశరీరం నశించిపోయి మట్టిలో కలిసిపోయినప్పుడు ఈ మనోమయపురుషుడు మానసికలోకంలో కరిగిపోతాడు.

అమరత్వమంటే ఏమిటి

శ్రీఅరవిందులు అమరత్వమని చెప్పింది ఇది కాదు. ఆద్యంతాలుకానీ, జననమరణాలుకానీ లేక, శరీరానికి అతీతంగా ఉండే జీవనమే అమరత్వము. ప్రతిఒక్కరిలోనూ తప్పనిసరిగా ఉండే ఆత్మ జీవనమే అది. ఆ ఆత్మ పరమాత్మకంటే వేరుకాదు. ఈ సారభూతాత్మకు భగవద్భావన ఉంటుంది. నిజానికి అది పరమాత్మ స్వయంవ్యక్తీకరణమే. అది ఆద్యంతాలు, జీవన్మరణాలులేక అనంతకాలం నిలిచిపోతుంది. ఈ పరమాత్మ చైతన్యాన్ని మనం సంపూర్ణంగా పొందినప్పుడు దాని అనంతజీవత్వంలో మనమూ పాల్గొని అమరులవుతాము.

ఈ అమరత్వమనే మాటను అపార్థం చేసుకోవడమూ, కువ్యాఖ్యలుచేయడమూ సర్వసాధారణమే. ఒకే దేహం కలకాలం నిలిచిపోవడమే అమరత్వమని అందరూ అనుకుంటారు.

శరీరానికి అమరత్వము

వారనుకున్నట్లు శరీరం కలకాలం నిలిచిపోగలదు కానీ, అలా నిలిచిపోవాలంటే అది సంపూర్ణంగా తనలోని దివ్యాంశను తెలుసుకొని దానితో ఐక్యతనుపొంది, సారూప్యాన్నిసాధించి, నిరంతర పరివర్తనచెందగల శక్తిసామర్థ్యంతో విశ్వగమనాన్ని అనుసరించగలగలగాలి. శరీరం శాశ్వతంగా ఉండాలంటే ఇది తప్పనిసరి. కానీ శరీరం ఏమాత్రం నమ్యతలేక, కఠినంగా ఉండటంవల్ల అది విశ్వగమనాన్ని అనుసరించలేదు; విశ్వపరిణామంతో ఏకత్వాన్ని పొందగల వేగంతో పరివర్తన చెందలేదు; ఈ కారణాలవల్ల అది కృశించి నశిస్తోంది. దాని స్థిరత్వము, కాఠిన్యము, (పరివర్తనకు) అశక్తతవలన అది నశించితీరవలసినదే. ఆ విధంగా పదార్థం, భౌతికరాసిలో చేరిపోయి పరిణామక్రమంలో పురోగతిచెందగల కొత్తనమూనాలు సృష్టి కావడానికి ఉపయోగపడుతుంది. కానీ ప్రతివారూ అనుకునే అమరత్వం అంటే శరీరంతో నిలిచిపోవడమనేది ఇంతవరకూ సాధ్యంకాలేదని చెప్పవచ్చు.

శరీరం అతిమానసీకరణ

అయితే అది సాధ్యమేనని శ్రీఅరవిందులు చెప్పారు. దానికొక నిబంధన మాత్రం ఉంది. శరీరం అతిమానసీకరణం కావాలి – అంటే అతిమానసలక్షణాలైన మృదుత్వం (నమ్యత) నిరంతరం పరివర్తనచెందగలిగే స్వభావం దానికుండాలి. శ్రీఅరవిందులు మానవశరీరాన్ని కేవలం ఒక సాధనమనీ, ఒక ప్రతిచ్ఛాయ అనీ అనటంలో వారి ఉద్దేశం ఇది. జీవాత్మకు అది కేవలం ఒక ఉప కరణంగానే ఉంటున్నదనీ, పైగా చాలా అనుచితమైన అభివ్య క్తత మాత్రమేననీ. అంటే శరీరం ఇప్పుడున్న స్థితిలో అతిసున్ని తంగా, కాంతివంతంగా వెలుగుతున్న అంతరాత్మకు కేవలం ఛాయా రూపంగా, మసగమసగ వ్యక్తీకరణగా ఉంటూ ఇలాగే దీర్ఘకాలం కొనసాగగలదని వారన్నారు.

ఛాయామాత్రంగా ఉండే శరీరం ఆత్మోన్నతికి ఏవిధంగా పనికివస్తుంది? ఈ ఉపకరణాన్ని ఏవిధంగా సంస్కరించి అభి వృద్ధిచేస్తే రానున్న జన్మలలో బాగా ఉపయోగపడగలదు అనే విషయాలు ఆసక్తికరంగా ఉంటాయి కదా!

ఆత్మ శరీరాన్ని ఎందుకు ధరిస్తుంది?

ఆత్మ మాటిమాటికీ భూమ్మీదికి వచ్చి శరీరమును దాలుస్తుంది. అభి వృద్ధి చెందుటకై నూతనానుభూతు లను పొందుతుంది. మొదట బీజరూపంలోనున్న చైత్యపురుషుడు జన్మలపరంపరద్వారా వృద్ధిపొంది సంపూర్ణచైతన్యమును సాధి స్తాడు. అప్పుడు స్వతంత్రుడై తనకు ఏవిధమైన జీవితం అవస రమో ఆ విధమైన జన్మనెత్తుతాడు. తదనుగుణమైన దేశకాలపరి సరాదులను ఎంచుకుంటాడు.

శరీరధారణ అనగా అంధకారంలోకి ప్రవేశం

ఆత్మభూలోకంలోకి దిగివచ్చిన ప్పుడు అజ్ఞానాంధకారములలో నిమజ్జనమైపోతుంది. అందుకని చాలాకాలము ఈ మొద్దుశరీరంలోకి కొంచెం చైతన్యాన్ని ఉద్దీ పింపచేయటంతోటే సరిపోతుంది. మనము శరీరమును సంస్కరిం పజేయుటకు ముఖ్యమైన కారణమిదియే. క్రమశిక్షణతో శరీరాభి

వృద్ధేకాకుండా ఆత్మకూడా దాంతోపాటు ప్రదీప్తమై పురోగమిస్తుంది.

శరీరకణముల ఉద్దీపనము

శరీరశిక్షణద్వారా శరీరకణములు వికసించి చైతన్యవంతములవుతాయి. ఈ విషయము ఎవ్వరికీ తెలియకపోవచ్చు. కాని అది నిజము. మన దృష్టిని కండరముల మీద కేంద్రీకరించి వాటిని ఉపయోగించినప్పుడు, అవయవములకు శిక్షణ ఇచ్చినప్పుడు వాటి కదలికలను, శక్తిని, చురుకుదనాన్ని, నమ్యతను అభివృద్ధిపరచ దలచినప్పుడు ఒక తమాషా జరుగుతుంది. శరీరకణముల చేతనాప్రమాణము, వాటియొక్క గ్రహణశీలత ఇంతకు ముందరలేని రీతిగా పెరుగుతాయి. ఈ విధంగా శరీరముయొక్క చైతన్యము అభివృద్ధి చెందుతుంది. శరీరవ్యాయామముయొక్క ముఖ్యోద్దేశమిదియే. శరీర చైతన్యమును పెంచుటకు ఇతరమార్గములు కూడ కలవు. కాని సర్వాంగంగా తీర్చిదిద్దుటకిదే మార్గము. నేను మీకు ఒక విషయాన్ని అదివరకే చెప్పాను. మేధావులు ఏ విధంగా మెదడును పదునుపెట్టుకుంటారో అదే విధంగా కళాకారులు వారి హస్తములకు కూడ చేతనాస్ఫూర్తిని కలుగజేయగలరు. అయితే దీనివలన ఒక్కొక్క అవయవము మెరుగుకావచ్చునే కాని మొత్తము శరీరము కాదు. ఈ విధమైన శిక్షణయొక్క అద్భుతపరిణామాలను కనుక నీవు గమనించినట్లయితే శరీరముయొక్క సామర్థ్యాన్ని చూసి ఆశ్చర్యపోతావు. శరీరధారియైన చైత్యపురుషునకు ఇదెంతో ప్రయోజనకారి. సర్వాంగసౌష్ఠవము, సమరసము అయిన శరీరము చైత్యపురుషునకు చాలా అద్భుతమైన ఉపకరణము; దాని కార్యములకు మిక్కిలి సహాయకారి.

శరీరవ్యాయామము నభ్యసించు వారందరికీ ఈ విధమైన ఉద్దేశము లేకపోవచ్చు. వాళ్లకీ విషయాన్ని గురించి లేశమాత్రమైనా తెలియకపోవచ్చు. వాళ్లకీ విషయం తెలిసినా తెలియకపోయినా ఫలితమింతే. మీకు సూక్ష్మదృష్టి కనుక ఉన్నట్లైతే క్రమపద్ధతిలో వ్యాయామవిన్యాసములు జరిపినవాడు నడుస్తుంటే

ఒక విధమైన వెలుగు, చైతన్యము, జీవము అతనిలో ఉట్టిపడుతూ ఉంటాయి. ఇతరులలో ఉండవు.

వ్యాయామం – దేహ పరిశ్రమ

ప్రతివిషయాన్ని బయటకు కనబడినంత వరకే అర్థంచేసుకునేవారి వాదన ఇలా ఉంటుంది. (కాయకష్టం) చేసేవాళ్లూ, బరువులెత్తే కూలీలు బలిష్టంగా, చక్కగా కండలుతిరిగి ఉంటారు. తినికూర్చుని సరదాగా వ్యాయామం చేసేవారికంటే వీరిపనే మెరుగు కదా అంటారు. అది అజ్ఞానం. ఎందువల్లనంటే ఈ రెండింటికీ చాలా తేడా ఉంది. పనిచేసేటప్పుడు శ్రమ ఏవో కొన్ని కండరాలకే పరిమితంకావడం వల్ల అవే వృద్ధిపొందుతాయి. పద్ధతిగా ఒక సమగ్రప్రణాలిక ప్రకారం వ్యాయామంచేసి శరీరభాగాలన్నిటికీ సామరస్యపూరితంగా పనిచేయించినప్పుడుండే కండపుష్టి వేరుగా ఉంటుంది.

వ్యాయామమనగా శరీరసాధన

కార్మికులు, రైతులు మొదలైనవారు వారి వారి వృత్తుల ననుసరించి కొన్నికొన్ని శరీరభాగాల్లో కండరాలను వృద్ధిచేసుకుంటారు కానీ చివరకు వృత్తిపరమైన అంగవికారాలకు లోనవుతారు. పైగా ఇది ఏవిధంగానూ లోనున్న చైత్యపురుషునికి ఉపయోగపడదు. సాధారణంగా పృథ్వీజీవితం చైత్యపురోగతికి సహాయపడుతుందని చెప్పినప్పటికీ ఈ విధమైన చైతన్యరహిత యాంత్రికజీవనంలో చైత్యపురోగతి (psychic progress) చాలా మందకొడిగా సాగుతుంది. అప్పుడు పురోగతికోసమై మళ్లీ మళ్లీ జన్మలెత్తవలసి వస్తుంది. అందువల్ల దైహికశిక్షణ అనేది శరీరం చేసే సాధన అనీ, ఏవిధమైన వ్యాయామమైనా చైత్యపురుషుని (psychic being) లక్ష్యసాధనకోసమేననీ నిర్భయంగా చెప్పుకోవచ్చు. ఎంత బాగా ఈ విషయం స్మృతిలో ఉండి వ్యాయామం చేస్తే అంత తొందరగా విస్తారమైన ఫలితాలు వస్తాయి. ఒకవేళ నీ చైతన్యపథకం అంతదూరం వెళ్లకుండా ఏదో గుడ్డిగా వ్యాయామం చేసినప్పటికీ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడగలవు.

క్రమశిక్షణయొక్క ఆవశ్యకత

చివరికి చెప్పేదేమిటంటే ఏవిధమైన శారీరకశిక్షణను అవలంబించినప్పటికీ నియమానుసారంగా, మనస్ఫూర్తిగా, కఠిన శ్రమకోర్చి చేసినప్పుడు మంచిప్రయోజనముంటుంది. దానివల్ల ప్రస్తుత జీవితలక్ష్యం శీఘ్రంగా నెరవేరటానికే కాకుండా, నూతన జీవితంకోసం సంసిద్ధమవటానికి గూడా అవకాశం కలుగుతుంది. క్రమశిక్షణననగా నూతనజీవితాగమనాన్ని, అతిమానససత్యంతో (supramental reality) సంస్పర్శను శీఘ్రతరం చేయడమే.

ఇప్పుడున్న స్థూలదేహం పరమాత్మ శాశ్వతజీవనానికి ఒక ప్రతిరూపం మాత్రమే. అయితే ఇది ప్రగతిశీలకమైన అభివృద్ధి కాంచగలదు. ఒక్కొక్క శరీరధారణతోనూ అందులోని స్థూల పదార్థం ప్రగతిచెందుతూ ఇప్పుడు మనకు తెలిసిన పార్థివజీవనానికి, భవిష్యత్తులో అభివ్యక్తంకాబోయే అతిమానసజీవనానికీ (supramental life) మధ్య ఒక వారధి కాగలదు.

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామశాస్త్రి,
ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 10, pp. 27-32)

ప్రశ్నోత్తరాలు

ప్రశ్న: ఎప్పుడు ఎలా చనిపోవాలో ఆత్మ ఎంచుకోదా? వరదలు, భూకంపాలు, అణువిస్ఫోటాలలో అసంఖ్యాకంగా జననష్టం కలిగేటప్పుడు, ఆ ఆత్మలన్నీ ఒకేసారి మరణించాలని కోరుకున్నట్టా?

జవాబు: అత్యధికశాతం మానవులు సామూహికవిధికే లోబడి వుంటారు. వారి విషయంలో ఈ ప్రశ్న వర్తించదు. తనదంటూ ప్రత్యేకమైన చైత్యపురుషుడుకల వ్యక్తి ఎటువంటి సార్వజనీన విపత్తులమధ్యనున్నప్పటికి, తాను కోరుకుంటే బయటపడగలడు.

ప్రశ్న: మరణానంతరం జీవియొక్క అన్నమయ, ప్రాణమయ, మనోమయపురుషులనుంచి వేరయ్యాక, ఆత్మకి తన అస్తిత్వం ఎలా తెలుస్తుంది?

జవాబు: ఆత్మ పరమాత్మలోని కిరణమే, ఆ భగవంతునికి తన అస్తిత్వం తెలియడానికి శరీరం అవసరమనుకోను.

ప్రశ్న: అమ్మా, మరణవార్త, అందులోనూ మనకి ప్రియమైనవారిదైతే, ఎలా స్వీకరించాలి?

జవాబు: ఆ పరమాత్మయొక్క ఇచ్ఛ నెరవేరాలని కోరుతూ, చేతయినంత, వీలయినంత ప్రశాంతంగా ఉండాలి.

మన ప్రియమైనవారు గతిస్తే, ప్రశాంతంగా మన ప్రేమ వారిపై కేంద్రీకరిస్తే, పోయినవారికి మేలు జరుగుతుంది.

*

ఆత్మ ఈ శరీరాన్ని వదిలాక, ఈ శరీరానికి ఏమి జరిగినా సాధారణంగా వారికి ఏ బాధా కలగకూడదు. కానీ, ఈ స్థూలశరీరంలో "spirit of the form" అనేది ఒకటి ఉంటుంది. శరీరంలోని కణసముదాయాలనుంచి అది పూర్తిగా వేరవడానికి కొంతకాలం పడుతుంది. అది పూర్తిగా వేరయిన తరువాతే శరీరం క్రుళ్ళడం మొదలవుతుంది. అంతకుముందర దానికి కొంత శరీరస్ఫూర్తి ఉండవచ్చు. అందుకే అంత్యక్రియలు జరిపేందుకు తొందరపడకూడదు.

ప్రశ్న: మనుషులు తమ శరీరాలని ఎందుకు వదిలివేయాలి?

జవాబు: ప్రకృతి దివ్యత్వంవైపుకి చేసే పయనంతో సరిసమానంగా తాము ముందడుగు వేయలేరు కనుక.

ప్రశ్న: మృతదేహాన్ని గౌరవించాలా? ఎలా గౌరవించాలి?

జవాబు: సజీవ నిర్జీవ పదార్థాలన్నింటినీ గౌరవించాలి – అన్నీ ఆ దివ్యచైతన్యంలోనే ఉంటాయి కనుక. గౌరవభావం మనసులో, మన అంతరవైఖరిలో ఉండాలి.

ప్రశ్న: మృతదేహంలో భగవంతుడుంటాడా?

జవాబు: ఆయన సర్వాంతర్యామి. ఆయనకి సజీవ నిర్జీవ భేదాలే లేవు.

ప్రశ్న: ఆత్మ ఆనందంగా ఉండి, మంచివాతావరణంలో, ఆధ్యాత్మిక అభివృద్ధి కలిగేచోట పునర్జన్మించాలంటే మనం ఏం చేయాలి?

జవాబు: మరణించిన ఆప్తులను గురించి ప్రేమతో తలచుకోవాలి. దుఃఖించకుండా, ప్రశాంతంగా ఉండాలి.

ప్రశ్న: ఆత్మలు దుఃఖిస్తాయా?

జవాబు: పరమాత్మనుంచి ఏ కారణంవల్లనయినా వేరయితే దుఃఖిస్తాయి.

ప్రశ్న: ఎవరన్నా దుఃఖిస్తుంటే వారిని ఎలా సముదాయించాలి?

జవాబు: వారి కన్నీరు ఆపే ప్రయత్నం మాని వారిని మనస్ఫూర్తిగా ప్రేమించాలి.

అనువాదం: బి. వరలక్ష్మి

(*CWM* Vol. 11, p. 61; Vol. 16, p. 416; Vol. 15, p. 131-132)

వృద్ధాప్యము – మృత్యువు

యోగదృష్టి మామూలు మానసికదృష్టికంటె వేరైనది లోతైనది. అది మనో, ప్రాణిక, దైహికముల ఉత్పత్తిస్థానమునకుపోయి జ్ఞానాన్ని అక్కడినుంచి తవ్వుకోవస్తుంది. మృత్యువునుగురించి చాలా విపరీతమైన భావములు ప్రచారములో ఉన్నాయి. నీ జీవితం విలువ నీకు తెలియదు. దేవుడొక్కడికే తెలుసు. అందుకని "నా కర్తవ్యము అయిపోయింది. నా విధులను నిర్వర్తించేసాను. ఏదో కాలక్షేపం చేస్తూ పైనుంచి పిలుపుకోసం వేచివుంటానులే" అని అనుకోవటం మూర్ఖత్వం. దేహధారణ నీ మనస్సు చేసిన నిర్ణయం కాదు కదా! ఇదే న్యాయం నీ మృత్యువుకు కూడ వర్తించాలి. నీ సమస్యల పరిష్కారము, బలహీనతలపై విజయము మొ॥ అన్నీ సశరీరంగా ఉన్నప్పుడే సాధ్యములు.

– సంపాదకుడు

ప్రశ్న: జీవితంలో "నా కర్తవ్యాన్ని పూర్తిచేసేసాను. ఇక సాధిం చవలసినదేమీ లేదు" అని ఎవరైనా అనుకుంటే, ఆ వ్యక్తి దిశా హీనంగా అర్థరహితంగా బ్రతికేబదులు మరణించి మళ్ళి ఇంకో జన్మెత్తితే సరిపోతుంది కదా!

దైవమునకే చెందియుండుట

నెరవేరని గంపెడు కోరికలతో నిరాశజెం దిన వ్యక్తి అలాగే అనుకుంటాడు. కానీ భగవంతునికి జెంది సత్యమయజీవన మునే గడపాలనుకున్న వ్యక్తి అలా అనుకోడు. ఈ భూమిమీద ఎంతకాలము తన ఉపయోగము ఉండేటట్లు భగవంతుడు నిర్ణ యిస్తే అంతకాలము జీవించితీరాలి అని గుర్తిస్తాడు. "తనవలన ఇక ఎటువంటి ఉపయోగము ఉండబోదు" అని భగవంతుడు నిర్ణయించినప్పుడే తన జీవయాత్రను ముగిస్తాడు. అందుకని ఈ ప్రశ్నే ఉదయించదు; ఆ నిర్ణయాన్ని దైవానికే ఒదిలేసి ప్రశాంతంగా జీవితమును గడుపుతాడు.

ప్రశ్న: మీరు నిన్న వ్రాసారు "భగవంతునికి జెందిన వ్యక్తి" అని. అందరు భగవంతునికి జెందిన వారేగదా?

నిరంతర దైవానుభూతి

"భగవంతునికి జెందిన ఏ వ్యక్తి అయినా" అని అన్నప్పుడు ఏ వ్యక్తి అయితే అహం కారమును తనలో పూర్తిగా నిర్మూలించి భగవత్ స్ఫురణలోనే ఎల్లప్పుడూ ఉంటూ తనదంటూ ఇచ్ఛ ఏదీ లేక దైవప్రేరణాధీనంలోనే ప్రవర్తిస్తూ వేరొక ఆశయము లక్ష్యమూ గాక భగవంతుడు ఆదేశించిన విధముగానే జీవయాపన జేస్తుం టాడో అటువంటి వ్యక్తినే ఉద్దేశించి అన్నాను. ఇటువంటి చైతన్య స్థితిలో ఎక్కువమంది ఉంటారని నేననుకోను. ఈ వ్యక్తులు నిజా నికి తమ జీవితములు ఉపయోగకరముగా ఉన్నాయాలేవా అని చింతించనే చింతించరు. వీరికి వేరుగా వ్యక్తిగత జీవనమనేదే ఉండదు. వీరందరు భగవంతునికోసమే, భగవత్సంకల్పముచేతనే జీవిస్తారు.

మనందరము దేహధారులమై ఉన్నంతవరకు వయస్సు ఎంతైనా, బాధలు ఏవైనా, మనము ఏదో ఒక పనిజేయడానికో

లేక నెరవేర్చుకోటానికో జీవిస్తున్నాము అన్న దృఢభావము అన్ని క్లిష్టపరిస్థితులను ఎదుర్కొనడానికి కావలసిన బలమును మనకు ఇస్తుంది. శాశ్వత ప్రశాంతతకోసమైనా, లేక నిర్వాణానంద ప్రాప్తికైనా సరే దేహమునుంచి త్వరగా నిర్గమించాలనే తొందరపాటు పనికిరాదు. మనము దేహములో ఉన్నంతవరకు నిస్సందేహముగా ఇంకా చేయవలసినవి, నేర్చుకోవలసినవి చాలా మిగిలియున్న వనమాట.

*

శరీరమే రక్షణకవచము

దేహమును త్యజిస్తే ఈ గొడవ ఒదిలి పోతుందనుకోకు. ఈ శరీరమే నీ బాధలను తగ్గిస్తుంది. ఈ శరీరమిచ్చే సంరక్షణే లేనపుడు భౌతిక, ప్రాణిక జీవనంలో ఎదురయ్యే బాధలను నిన్ను ఇంకా ఎక్కువగా పట్టుకొని పీడిస్తాయి. ఆ బాధలనుపశమింప జేయుటకు, ఏది మార్పుజేయాలో అది మార్పుజేయుటకు, ఏది సరిజేయాలో అది సరిజేయుటకు ఉపయోగపడే శరీరసాధనమును కూడా కోల్పోతావు. మరింత ప్రకాశమయమై, ఆనందమయమై, ఉత్కృష్టమైన చైతన్యములోనికి జీవనమును మరల్చడానికికూడా శరీరము ఎంతగానో ఉపయోగపడుతుంది.

You must make haste to do your work here, for it is here that you can truly do it.

మృత్యువునుంచి ఏదీ ఆశించకు. జీవనమే నీ విముక్తి. జీవిస్తూనే నిన్ను నువ్వు రూపాంతరించుకోగల్గుతావు. ఈ పృథ్వి మీదనే నువ్వు పురోగతిని సాధించగలవు. ఈ పృథ్వీమీదనే సిద్ధిని పొందగలవు. ఈ దేహములోనే నువ్వు విజయమును సాధించగలవు.

*

మృత్యువును గురించిన ఆలోచన అహంభావమునుంచే వస్తుంది – ఎందుకంటే త్వరలోనే తన సామ్రాజ్యాధిపత్యమును వదులుకోవలసివస్తుందని. నువ్వు ప్రశాంతముగా నిర్భయముగా ఉండు. ప్రతీదీ తనంతటతానే చక్కదిద్దుకుంటుంది.

నువ్వు పూర్ణత్యాగమును గురించి మాట్లాడుతున్నావు కానీ శరీరమును త్యజించుట పూర్ణత్యాగము అనిపించుకోదు. అహంకారమును త్యజించుటే యథార్థమైన, సంపూర్ణమైన త్యాగము. ఇదే చాలా క్లిష్టతరమైన సాధన. అహంకారమును త్యజించక శరీరమును మాత్రమే త్యాగముజేస్తే నీకు స్వేచ్ఛ ఎక్కడా లభించదు.

*

Death is not at all what you believe it to be. You expect from death the neutral quietness of an unconscious rest. But to obtain that rest you must prepare for it.

కోరికలను త్యజించుట

నువ్వు మృతి జెందినప్పుడు నీ దేహమును కోల్పోవడమేగాక భౌతికప్రపంచముతో సంబంధము, దానిపై నీ ప్రభావమునుకూడా కోల్పోతావు. నీ శరీరము అంతమైనా ప్రాణికానికి జెందినదంతా అంతరించదు. అంటే నీ కోరికలు, సాంగత్యాలు, భోగకామనలు, ఇంకా నిన్ను వెంటాడుతూనే ఉండి, అసంపూర్తిగానే మిగిలిపోతాయి. తత్ఫలితంగా నువ్వు అనుభవించే యాతనలు, ఆశలన్నీ అడియాశలుగా మిగిలిపోతాయి. ఆశించిన ప్రశాంతత లభించలేదనే వ్యాకులతతో నువ్వు తీవ్రముగా బాధపడుతూ ఉంటావు. సుస్పష్టమైన సాధన ద్వారానే కోరికలను నిర్మూలించగలవు.

మనకు దేహమున్నంతవరకు కర్మలు చేస్తూనే ఉండాలి. ఏదో ఒక పనిలో నిమగ్నమవాలి. అయితే ప్రతిఫలమును ఆశించకుండా లేక ఆ ఫలితము ఈ విధముగాగానీ మరొకరీతిగా కానీ ఉండాలని భావించనపుడు మనము సంగరహితులమై ప్రశాంతముగా మరణించడానికి తగిన యత్నము జేసినవారమవుతాము.

*

నువ్వు మృత్యువునుంచి విముక్తుడవ్వాలంటే నశ్వరముల బంధములలో చిక్కుగోకు! మృత్యువును గురించి భయపడినవాడు మృత్యువుచే అప్పుడే జయింపబడ్డాడు.

*

ప్రశ్న: నాది బలహీనమైన ప్రకృతి కనుక సాధారణవస్తువులను సహితమూ త్యజించుట కష్టంగా ఉంది. ఒకటిమాత్రము నిజం. నాకు కావలసినది మీరొక్కరే. మీరేకనుక లేకపోతే మరణమే శరణ్యము. మరి ఇక ఏమీ లేదు.

మరణించుట అనే ప్రశ్నే ఉదయించకూడదు. శరీరమును వదలిపెట్టుట పరిష్కారము గాదు. నీ కోరికలతోనే నువ్వు మిగిలి పోతావు. అది ఇంకా అధ్వాన్నస్థితి. దానికి బదులు నీ కోరిక లకు అంతము కావలయునని ఆశించడము ఇంకా తర్కసంగ తముగాను, యథార్థముగాను ఉంటుంది. అసలు నీ కోరికలన్నీ నిరర్థకములని, నిరుపయోగములని పూర్తిగా గ్రహించి వాటినన్ని టిని హతమార్చు. నువ్వు ఆశిస్తున్నది దివ్యజీవనము గనుక ఓటమిని చవిజూడవలసివస్తుందనే భయము అక్కరలేదు. త్రికర ణశుద్ధితో కూడిన ఆకాంక్ష చివరకు సఫలీకృతమై తీరుతుంది. బలహీనతలనన్నింటిని అధిగమించాలనే ఒక దృఢమైన సంక ల్పము నువ్వు జేసుకో. నీలోని బలహీనతలను, అవరోధములను, దోషములను అతిక్రమించుటకు నాశక్తి నీతో ఎల్లప్పుడూ ఉంటుంది. నీకు నా ఆశీస్సులు

ఆత్మహత్య

ఆత్మహత్యవలన సమస్య తీరిపోదు

ఆత్మహత్యకు పూనుకోవడమనేది మహామూర్ఖత్వము అని స్పష్టముగా గ్రహించు. ఎందుచేతనంటే శరీరము అంతమైన మాత్రాన చైతన్యము కూడా అంతమైపోతుందనేది నిజం గాదు. నువ్వు జీవిస్తున్నపుడు ఏదైతే నిన్ను వేధిస్తోందో అది మరణానంతరము గూడా నిన్ను వెంటాడుతూనే ఉంటుంది.

ప్రశ్న: నేను వట్టి అసమర్థుడిని, సాధించవలసిన కర్తవ్యమేమీ లేనివాణ్ణి. అటువంటుపుడు ఈ ప్రపంచమునుంచి పలాయనం చిత్తగించడమే మంచిది కదా?

ప్రపంచంలోనే మార్పు సంభవం

ఈ ప్రపంచములోనే, జీవితంలోనే నువ్వు మారాలి – అది సంభవము కూడాను. ప్రపంచమును వదిలి పారి పోయావంటే నువ్వు మళ్లీ బహుశా మరింత దుర్భరపరిస్థితులలో ఇక్కడికే రావాల్సి ఉంటుంది – మళ్లీ అంతా మొదటికి వస్తుంది కూడ. పిరికివానివలె పారిపోకుండా నిన్ను బాధిస్తున్న ఆ పరిస్థితుల్ని తక్షణమే ఎదుర్కొని జయించాలి. మా సహాయము నీకు ఎల్లప్పుడూ ఉంటుంది. ఆ సహాయమును ఎలా ఉపయోగించుకోవాలో నేర్చుకోవాలి. ప్రేమపూర్వక ఆశీస్సులు.

అనువాదం: టి.మాధవరావు

(*CWM* Vol. 10, pp. 320-21; Vol. 15, p. 129; Vol. 3, p. 198; Vol. 15, p. 129- 130; Vol. 17, pp. 62-63, vol. 15, pp. 138-39)

నువ్వు నిష్ప్రయోజనంగా గడిపిన సంవత్సరాలే నిన్ను ముసలివాణ్ణి చేస్తాయి.

నిష్ప్రయోజనంగా గడపటమనగా ఏమాత్రము మనుగడలేకుండా, నీ చేతనాస్థాయి పెరగకుండా, పరిపూర్ణత్వాన్ని పొందుటకు ఏమీ ప్రయత్నం చేయని సంవత్సరము.

నీ కంటే ఉన్నతము, విశాలము అయిన వ్యక్తిత్వాన్ని సిద్ధింపచేసికొనేందుకై నీ జీవితాన్ని అంకితం చేయి. ఇక నీకు వయోభారమనేదే ఉండదు.

శ్రీమాత

మరణసమయం ముందే నిర్ణయింపబడుతుందా?

మనిషి జీవితానికి చాలా ముఖ్యమైన వస్తువు అతని చేతన. బాహ్య.జీవనమంతా దాని నిర్ణయమే. మృత్యువు విషయంలో కూడా అంతే. కొన్ని బాహ్యపరిస్థితులవలన నీకు మృత్యువు ఆసన్నమవుతున్నట్లు కనిపించవచ్చును. కాని నీవుకనుక పై స్తరములలోకి ప్రవేశించి వాటిని క్రిందికి దింపుకొనినయెడల, బాహ్యపరిస్థితులు నిన్నేమీ చేయలేవు. ఒకవేళ అది అతిమానసస్తరమే అయినట్లైతే దాని ప్రభావమువలన నీజీవితస్వరూపమే మారిపోతుంది. — *సంపాదకుడు*

ప్రశ్న: మరణసమయాన్ని వేగిరపరచనూ లేము, ఆలస్యమూ చేయలేమని మీరన్నారు. దీని అర్థం మనిషి పుట్టినప్పుడే అతని మరణం సమయం కూడ నిర్ణయింపబడి ఉంటుందనా?

> *నిర్ణయం భౌతికచైతన్యానిది*

మరణసమయం ముందే నిర్ణయింపబడదు. అది వేరేస్థాయిలో జరుగుతుంది. మనిషి మరణించటానికి ఒప్పుకున్నప్పుడే అతడు మరణిస్తాడని నేను ఎక్కడో వ్రాసినట్లు జ్ఞాపకం. అది నేను ఇక్కడ చెబుతున్నదానికి వ్యతిరేకం. అయితే ఇదే సత్యం. ఈ విషయం నీకు ఇంతకుముందే చెప్పాననుకుంటాను. ఏమైనా ఇదికూడా నెనెక్కడో వ్రాసిపెట్టాను. మరణం విషయంలో రెండు భిన్నాభిప్రాయాలున్నవి. ఇంతకుముందు నేను సాధారణ భౌతికపరమైన అభిప్రాయం వెల్లడించాను. అది భౌతికచైతన్యానికి చెందినది.

మన జీవితము అనేక అస్తిత్వముల సంపుటి[1] అని నేనదివరకే మీకు చెప్పినట్లు గుర్తు. ఒక్కొక్క అస్తిత్వము ఒక్కొక్క స్తరమునకు చెందినదై దానిచే నియంత్రింపబడుతుంది. అనగా

---

[1] ...there are, as it were, different "layers of determinisms" in our being.

మన భౌతిక అస్తిత్వము భౌతిక layer of determinism కు కట్టు బడి ఉంటుంది; అటులనే ప్రాణిక మానసిక విభాగములు. ఊర్ధ్వ మానసికము, చైత్యము (higher mental and the psychic) ఆయా లోకము (స్తరము) ల న్యాయములను (determinism) పాటిస్తాయి. ఉన్నత అస్తిత్వానికి అతిమానస అస్తిత్వానికి వాటి వాటి నియంత్రణములు (determinisms) (ఈ విషయాలను గురించి నేనింతకు ముందరే రాసినట్లు గుర్తు). ఉదాహరణకు భౌతికపరి స్థితులవలన నీ మృత్యుఘడియలే వచ్చినయ్యనుకో; కాని అప్పుడు నువ్వు ఉన్నతలోక (అతి అతిమానసలోకమే కావచ్చు) సంప ర్కమును పొంది, దాని ప్రభావమువలన ఈ భౌతికఘటనను అనగా మృత్యువును నివారించగలవు[2]. భౌతికపరిస్థితులవలన నిశ్చ యించబడిన మృత్యువును మార్చి దాన్ని తిప్పికొట్టవచ్చు!

రెండురకముల దృక్పథాలు

ఆ వ్యాసంలో నేను ఇది చెప్పలేదు. అక్కడ నేను కేవలం భౌతికదృక్పథాన్నే వెల్లడిం చాను. అక్కడ నేను కొంతమంది మను షులనుగురించి చెప్పాను. వారు కేవలం భౌతికచైతన్యం (అనగా శారీరక, ప్రాణిక, మానసికచైతన్యముల సంపుటి) లోనే నివసించి 50 సంవత్సరాల వయస్సు రాగానే మరణించాలని భావిస్తూనే 87 ఏళ్లు వరకు బ్రతికారు. అటువంటి మనిషినొకణ్ణి నేనెరుగు దును. దీనికి పూర్తిగా భిన్నమైన ఉదాహరణ మరొకటి ఉంది. అతడు తాను చేయవలసిన పనులు చాలా ఉన్నాయి కాబట్టి తొందరగా మరణించకూడదనీ, చాలాకాలం బ్రతకాలనీ కోరు కుంటూ ఆరోగ్యం విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకొనికూడా మరణించాడు. కొందరివిషయంలో పరస్పర వైరుధ్యాలు కనిపిం చినా అవి వాస్తవము కావు. వీటన్నిటికి వివరాణాత్మకమైన సమా ధానాలు దొరుకుతాయి. ఎలాగంటే వారి పరిస్థితులు కొన్ని భౌతిక సూత్రాలకు లోబడే ఉంటాయి. అక్కడ నేను కేవలం భౌతిక దృష్టినే తెలియజేసాను.

---

[2] ఇది హైకోర్టుకిగాని, సుప్రీమ్‌కోర్టుకిగాని అప్పీలు చేసుకొనటము వంటింది.

ఉన్నతజ్ఞానం ప్రమేయం

ఉన్నత నిర్ధారిత అస్తిత్వాన్ని నీవు ఆహ్వానించకపోతే నీవేదీ మార్చలేవు. అటువంటి జోక్యంవలననే నీవు నీ నిర్ధారిత భౌతిక అస్తిత్వాన్ని మార్చుకోగలవు. నీవు భౌతికచైతన్యంలోనే స్థిరంగా వుంటూ నీ నిర్ధారిత భౌతిక అస్తిత్వాన్ని మార్చుకుందామంటే కుదరదు. మొదటిప్రపంచయుద్ధసమయంలో నేనెరిగిన ఒక కుర్రాడికి తుపాకీగుండు తగిలి మరణిస్తాడని ఎవరో చెప్పారట. (యుద్ధంలో మరణం తరచుగా జరిగేదే) అంతేగాక అతనికి దాదాపు మరణతేదీనికూడ అందించారు. దీనివలన ఆ కుర్రాడు తీవ్రంగా బాధపడి దీర్ఘకాలపు సెలవు తీసుకొని ప్యారిస్ చేరాడు. అతడు రక్షణవ్యవస్థలో అధికారియైనందున అతని జేబులో ఎప్పుడూ పిస్తోలు ఉండేది. అతడొక రోజున ట్రాముబండినుండి దూకి క్రిందపడిపోయాడు. జేబులోని పిస్తోలు పేలిపోవండవలన అక్కడికక్కడే మరణించాడు! అంతే, మరణం తప్పించుకోలేక పోయాడు!

ఉన్నతస్తరముల సంపర్కము

నేను ఇటువంటి ఉదాహాణలను ఎన్నైనా చెప్పగలను. అయితే ఇక్కడ మరణం ఒకేస్థాయికి – భౌతికస్థాయికి – the purely material physical, mental and vital planes కి చెందినది. ఉన్నతజ్ఞానము, ఉన్నతస్తరముల స్పర్శ, అట్టి ఉన్నతస్తరములు భౌతికస్థాయిలోకి దిగిరావటం మాత్రమే ఈ పరిస్థితులను మార్చగలదు. ఈ విధంగా అతిమానసస్థాయిని (Supramental) శాశ్వతంగా భౌతికజీవనంలోనికి తీసుకురాగలిగితే భౌతికజీవనం పరిణామం చెందగలదు – అంటే పూర్తిగా మారిపోతుంది. అయితే ఆ నిబంధనకు లోబడి మాత్రమే – అనగా అతిమనస్సు భౌతిక అస్తిత్వంలోనికి దిగిరావటం వలననే – భౌతికజీవనంలో సంపూర్ణపరిణామం సంభవించగలదు.

అనువాదం: డా॥ కె. వేంకటేశ్వరరావు

(*CWM* Vol. 6, pp. 47-49)

మనం మరణానంతరం ఏమవుతాము?

ఆత్మ శరీరాన్ని ధరించి భూలోకంలోకివచ్చి భౌతిక, ప్రాణిక, మానసిక ముడిపదార్థాలతో ఇక్కడ మనుగడ సాగిస్తుంది. ఈ ముడిపదార్థాలన్నీ మరణానంతరము వాటి వాటి లోకాలలోకి వెళ్లిపోతాయి. మనుష్యగతమైన అనుభవాలను జీర్ణించుకునేందుకై ఆత్మ తన లోకమునకు పోయి మళ్లీ సమయంవచ్చినపుడు జన్మ ఎత్తుతుంది. శరీరాన్ని ధరించినప్పుడే అది వృద్ధిచెందగలదు. భూలోకమే ఆ అభివృద్ధికి క్షేత్రము. అందుకని "చచ్చిపోతే పీడ విరగడైపోతుంది, సమస్యలు తీరిపోతాయి" అని అనుకోవటం చాలా పొరపాటు. నీవు చచ్చిపోతే ఏమీ సాధించలేవు. ఈ జన్మలో ఏ స్టేషన్‌వరకు వెళ్లావో సరిగ్గా అక్కడనుండే నీ మలి జన్మ మొదలవుతుంది. అందుకనే ఈ మానవజన్మ చాల విలువైనది. ఈ అవకాశాన్ని జారవిడువకూడదు. — *సంపాదకుడు*

మరణానంతర 'జీవితం'

మృత్యువుగురించి, తర్వాత జరిగేతతంగాన్ని గురించి, అనంతరం కొత్తదేహం ఎలా పొందుతారనేదానిని గురించి నన్ను అడిగారు. ఈ విషయం విచారిస్తే చాలా గ్రంథమే ఔతుంది. ఏ రెండు సందర్భాలు ఒకేలా ఉండవు. వ్యక్తి బ్రతికి ఉండగా తనకు ఏమైనా ఎలా సంభవమో, అలాగే మరణానంతరము కూడా. ఇలా నిజాలు చెప్పుకుంటూపోతే సిద్ధాంతీకరించినట్లు ఉంటుందిగాని ఈ సమస్యని పరిశీలిస్తే ఆసక్తికరమైన విషయాలే బహిర్గతమౌతవి.[1]

అంతిమఘడియలలో జీవునికి దేహంమీద ఉన్న వైఖరిపై తన చావు ఆధారపడి ఉంటుంది. ఆ వైఖరి తప్పనిసరిగా తన అంతరంగ పరిపక్వత, సమైక్యతలతో ముడిపడి ఉంటుంది.

*

[1] పూర్తి ప్రసంగం కోసం CWM Vol. 8, pp. 333-38; Vol. 3, 144-46; Vol. 4, pp. 191-92, 204-05; Vol. 5, pp. 33-36, 130-40, 215-18, 261-69; Vol. 7, pp. 86-87 చూడండి.

ప్రశ్న: అమ్మా! ప్రతి క్రొత్తజీవుని మనోప్రాణికదైహికాలు నూతనమైనవి కాగా, అతని గతజన్మల అనుభవాలు అతనికెలా ఉపకరిస్తాయి? అవే అనుభవాలను మళ్లీ అనుభవించాలా?

చైత్యజీవుని పురోగమనము

అది వ్యక్తులమీద ఆధారపడి ఉంటుంది. జన్మజన్మలకి అభివృద్ధిచెంది వికసించేది చైత్యపురుషడే[2] (జీవాత్మ) కాని మనోప్రాణికములు కావు. (పరిణామక్రమంలో అభివృద్ధిసాధించి ఆధ్యాత్మికంగా బాగా పురోగమించిన అసాధారణవ్యక్తుల విషయము వేరు). జీవాత్మ (the psychic) ఒకప్పుడు క్రియాశీలంగాను, తర్వాత విశ్రాంతిగాను ఉంటుంది. జీవాత్మ పురోగతి, జీవుని దైహిక, ప్రాణిక, మానసిక క్రియాశీల అనుభవాలు, వాటి ఫలితాలకు, అనుగుణంగా ఉంటుంది. మరో క్రొత్తదేహం ధరించేముందు గత జన్మ అనుభవాలు, ప్రగతి జీర్ణించుకొని, సంలీనంచేసుకొని, సాధించిన పురోగతిని బేరీజు వేసుకొని, మళ్లీ ఈ భూమ్మీద క్రొత్తశరీరంతో జన్మిస్తుంది. సాధించిన ప్రగతికి అనుగుణమైన దేహాన్ని, జీవనవాతావరణాన్ని ఎన్నుకుంటుంది. బాగా అభివృద్ధి జెందిన జీవాత్మలు మరణానికి ముందే రాబోయే జన్మకి కావల్సిన జీవనాన్ని నిర్ణయించుకోగలుగుతవి.

సామాన్యుల విషయము

అంతరాత్మ క్రమపద్ధతిలో వికసనం పొందకుండానే సామాన్యులు ప్రశాంతంగా మరణిస్తారు. అలా మృతిచెందినవారి జీవాత్మ దేహాన్ని విడిచివెళ్లాక కూడా వారి మనోప్రాణికరూపాలు కొంతసేపు నిలిచి ఉంటాయి. అలాకాక లెక్కలేనన్ని భవబంధాలతో తీవ్రమై ఉద్వేగంతో ఆకస్మికంగా మృత్యువు సంభవించినప్పుడు వివిధ జీవితభాగాలు చెల్లాచెదరై కొంతకాలం తమ తమ స్వక్షేత్రాలలో సజీవంగా ఉండి తర్వాత మాయమౌతాయి.

---

[2] psychic, psychic being = చైత్యము, చైత్యజీవి, చైత్యపురుషడు.

చైత్యజీవుని విశ్రాంతి

ఎప్పుడూకూడ, దేహంలోని జీవాత్మయే (the Psychic) రూపాంతరీకరణానికి కేంద్రంగా ఉంటుంది. సామాన్యంగా జీవాత్మ దేహం నుంచి వేరైనపుడు మిగిలిన శరీరభాగాలు తమ స్వక్షేత్రాలలో (లోకాలలో) తాత్కాలికంగా కొంచెంసేపు సజీవంగా ఉండి, తర్వాత చెదిరిపోతాయి కాబట్టి విగతశరీరంలోకూడా. జీవాత్మ అభివృద్ధిపథాన సాగుతూనే ఉంటుందనుకోవటం పెద్ద పొరపాటు.

వ్యక్తి జీవన (జీవాత్మ) ప్రగతికి ఆస్కారం భూలోక జీవనమే. ఇక్కడ సాధించిన ప్రగతిని జీవాత్మ ఒక జన్మనుంచి మరో జన్మకు కొనిపోతుంది. పరిణామక్రమంలో క్రమబద్ధంగా అభివృద్ధిపొందేది జీవాత్మయే.

*

మృత్యులోకమంటే? ఈ ప్రశ్న ప్రతిమతానికి రకరకాలుగా చర్చనీయాంశమే. గ్రీకులకు ఇది పడవప్రయాణంలో దాటి చేరుకునే 'ఎలీషియమ్' (Elysium). సరే స్వర్గాలు నరకాలు గురించి చెప్పనే అక్కర లేదు.

ప్రాణికలోకాలు

వ్యక్తి మరణానంతరం తన భౌతికచైతన్యం భూభౌతిక ప్రాణికప్రాంతం (వాతావరణం) లోనికి సాగిపోతుంది. ఈ ప్రాంతాన్నే సాధారణంగా మృత్యులోకం (domain of death) అంటారు. ఈ లోకం చీకటిలోకం. పంచభూతాత్మకమైన దుష్టకామనలు, హానికరమైన భ్రష్ట శిథిల రూపాల కాలవాలమీ లోకం. ఇవి మనిషిని పీల్చిపిప్పిచేసే భూతపిశాచాల లాంటివి. మానవునికి మృత్యువు ఒక హఠాత్సంఘటన. అంతిమ అఘాతం. (ఏ కొద్దిమందికోగాని, స్పృహతో కూడిన ఇచ్ఛామరణం సిద్ధించదు).

శరీరమే రక్షణకవచం

మరణించిన జీవునినుంచి వైదొలగిన భౌతిక ప్రాణికమే (ఆసూక్ష్మ) దుష్టజీవాలకి జీవనోపాధి. వ్యక్తి బ్రతికి ఉన్నంతవరకు ఇవి అతని దరిచేరవు. శరీరం అతనికి రక్షణకవచంలా పనిచేస్తుంది. భయానకమైన పీడకలలు వచ్చి మెలకువ వచ్చాక హమ్మయ్య!

అనుకుంటాం. జీవుని శరీరబంధం విడిపోనంతవరకు అవి అతని జోలికిరావు. కాగా, మరణించిన సమయంలో ఆప్తులైనవారు మృతుని దగ్గర ఏకాగ్రతతో ప్రేమపూర్వకంగా మృతునిగూర్చి భావిస్తూ ఉంటే, ఆ సమ్యగ్భావనలు మృతుని ప్రాణికజీవనానికి ఆశ్రయము, రక్షణ కల్పిస్తాయి. అలాకాక శత్రువులు చుట్టూచేరి ఉంటే అతని ప్రాణికం దుష్టశక్తుల దాడికి లోనవుతుంది. అదొక భరింపరాని అవస్థ.[3] దుష్టశక్తులు మృతుని గాఢభౌతికచైతన్యాన్ని మాత్రమే స్పృశించగలుగుతాయి. అవి ఉన్నత చైతన్యశక్తుల జోలికి పోలేవు.

చైత్యజీవుని వృత్తాంతము

ఏ శక్తులదాడికీ వశం కాకుండా ఉండి, అన్నిటికి అతీతంగా ఉండేది జీవాత్మయే (Psychic being). ఇది స్వేచ్ఛాజీవి. ఎక్కడికి కావాలంటే అక్కడికి పోగలదు; సామాన్యంగా జీవుడు మృతిచెందాక ఆత్మలోకాలలో విశ్రాంతిగా ఉంటుంది. ఆ దివ్యానందసమాధిలో గతజన్మ అనుభవాలను అంతర్లీనం చేసుకుంటూ ఉంటుంది. ఈ సమాధిస్థితి తర్వాత మరొక్రొత్త జన్మకోసం క్రిందికి దిగుతుంది. జీవాత్మనేదీ స్పృశించలేదు; దాని స్పృహ ఎవ్వరికోగాని ఉండదు. అలాటివారికి గతజన్మ తాలూకు భౌతిక, ప్రాణిక, మానసిక అనుభవాలు ఎరుకలో ఉంటాయి. ఇది సాధ్యపడేది జీవనము, జీవాత్మతో అనుసంధానమై ఉన్నప్పుడే! అలా

---

[3] మరోచోట మదర్ ఈ విధంగా చెప్పారు. ప్రాణిక, శారీరకములు విడిపోకపూర్వమున్న ఆఖరి చేతనాస్థాయి చాలా ముఖ్యము. చివరి క్షణాలలో ఆతని చేతనాస్థాయి – ఆతని ఆఖరి కోరిక అనండి, ఆశ అనండి, ఆశయము లేక ఆకాంక్ష అనండి – అతని మరణానంతర యాత్రకి చాల ముఖ్యము. ఆ విషయంలో ఆతని చుట్టూవున్న అనుచరుల, బంధుమిత్రుల బాధ్యత చాల ఉన్నది. వాళ్లు అతనినే అంటిపెట్టుకొని తమవైపుకు లాక్కొన్నట్లయితే అతనికి తెగతెంపులు చేసికొని వెళ్లటం చాలా కష్టమవుతుంది. అలా చేసే బదులు తన ఉన్నతచేతనలోనికి ప్రవేశించేందుకు అతనికి సహాయపడితే మంచిది.

కాకపోతే మృతుని గతజీవనానుభవాలు చెదిరిపోతాయి. మిగిలేది దీపకళికలా జీవాత్మ ఒక్కటే.

ఇదీ మృత్యువును గురించిన నిబంధనావళి. ఇదంతా సామాన్యమానవుల మరణానంతరం జరిగే తతంగం. ఇకపోతే, ఉన్నత ఆధ్యాత్మికమానవుల విషయంలో ఈ నియమావళి సడలిపోతుంది. కొంతమంది (మహానుభావులు) ఉంటారు. గొప్ప సంయోజనశక్తిపరులుగా ఉంటారు. దేహదాసులుకారు వారు. అలాటివారు ఈ ప్రమాదాల నధిగమించటం కోసం ప్రాణిక స్థాయిలో రక్షణమార్గాలు, వారధులు ఉంటాయి. మృతిచెందగానే వారికి ఆశ్రయమిచ్చి రక్షణ కల్పించే మండలాలు ఉంటాయి.

ఈ ఆధ్యాత్మికపురోగతి ఊహించుకున్నంత మాత్రాన సిద్ధించదు. పాటించవలసిన కఠోర ఆధ్యాత్మిక నియమాలు ఉన్నాయి. ఈ భూమి మీద మనిషిగా (పశువునుంచి) పరిణామంచెంది పుట్టింది ఆధ్యాత్మిక దివ్యజీవిగా బ్రతకటానికే! అలా బ్రతకటల్లేదు కాబట్టే ఈ లోకంలో ఇంత అల్లకల్లోలం. అలా బ్రతుకుతే ఎంత బాగుంటుంది!

అనువాదం: క.రా. వెంకటేశ్వర్లు

(CWM Vol. 8, pp. 333-37; Vol. 9, pp. 268-70; Vol. 6, pp. 54-57)

Some ancient deep impulsion labours on:
Our souls are dragged as with a hidden leash,
Carried from birth to birth, from world to world,
Our acts prolong after the body's fall
The old perpetual journey without pause.

Sri Aurobindo

(*Savitri* p. 197)

మృత్యుభీతిని జయించటమెలా?

అసలు మృత్యువంటే ఏమిటి? మృత్యువు శరీరానిదే కాని దానిలో అధివసించే ఆత్మది కాదు. ఆత్మ అవినాశి. సమస్తప్రాణికోటిలోని జీవము ఏకము. దాని రూపాలు అనేకము. మరణాన్ని జయించ దలచుకున్న వారు ఈ విషయాన్ని మరచిపోకూడదు. తమ చైత న్యాన్ని ఈ శాశ్వతమైన జీవపదార్థంతో అనుసంధించుకోవాలి. ఇది మొదటిమెట్టు. ఈ భయాన్ని జయించేందుకు పలుమార్గాలు కలవు. ప్రతిమనిషి తన ప్రకృతి కనుగుణమైన విధానాన్ని అనుసరించవచ్చును. "మృత్యువు అనివార్యము కదా! మరి దానిని గురించి బాధపడటమెందుకు?" అని తార్కికబుద్ధి చెపు తుంది. తర్కము కాకుండా హృదయావేశము ప్రధానంగా కల వారైతే, వారి హృదయకుహరంలోని చైత్యపురుషుణ్ణి వేటాడి పట్టుకుని ఆత్మశాశ్వతత్వాన్ని గురించిన అభిజ్ఞతిని పొందవచ్చు. కొంతమంది దైవంమీద గాఢమైన భక్తి కలవారు – దేవుని పాదాలచెంతనే శరణాగతిని పొందుతూ ఉంటారు. అట్టివారు దైవసంరక్షణలో నిర్భయంగా కాలం గడుపుతూ ఉంటారు. మృత్యువును లెక్కచేయరు. మరికొంతమంది యోధులుంటారు. వారి నరాలలో క్షత్రియరక్తం పారుతూ ఉంటుంది. వారు మృత్యువుని గురించి సచేతనంగా పోరాటం సలిపేందుకు వెన కాడరు.

– సంపాదకుడు

మానవుని ప్రగతిపథంలో ఎదురయ్యే అవరోధాలకెల్లా మొత్తం మీద చెప్పాలంటే భయమే అతితీవ్రమైనదని తేల్చవచ్చు. ఈ భీతి బహుముఖి, బహురూపి. తనకు తానే విఘాతం. అంతేకాదు. సాధారణంగా హేతువుకు అందనిదీ, తర్కానికి లొంగనిదీను. ఒక్కొక్కప్పుడు అకారణంగానే ఈ భీతి ఆవరిస్తూ ఉంటుంది.

భయానికే భయం

రకరకాల భయాలన్నిటిలోకి మృత్యుభయం చాలా బలమైనది. ఇది వదిలేది కాదు – అలా వెంటాడుతూనే ఉంటుంది. ఈ మృత్యుభీతి అవ

చేతనలో బాగా నాటుకుని ఉంటుంది. దీన్ని పోగొట్టుకోవటం అంత సులువు కాదు. ఎందుకంటే ఇది అనేక విభిన్నఅంశాల అల్లిక జిగిబిగితో గూడుకట్టుకుని ఉంటుంది. ఆత్మసంరక్షణ, ఏదైనా కొత్తదాన్ని చూస్తే దడ, అనుకోని హఠాత్సంఘటనల వల్ల కలిగే ఆవేదన, ఇవన్నీ మృత్యుభయానికి తోడుదొంగలు.

"మరణమేమీ తప్పనిసరి కాదు – కొన్ని నిబంధనలను పాటించినట్లైతే దానిని జయించవచ్చును" అనే విశ్వాసం అన్నిటి కంటె ప్రధానమైనది. ఇది శరీరంలోని కణకణాలలో నిక్షిప్తమై ఉంటుంది. అయితే ఈ విజయాన్ని సాధించడానికి భయమే ఓ పెద్దఅవరోధం. ఎందుకంటే – దేన్ని గురించి భయపడతామో దాన్ని సాధించడం అసాధ్యం. మృత్యువంటే భయపడి బెదిరి పోయేవారిని భయమే జయిస్తుంది.

మరి ఈ భయాన్ని అధిగమించడం ఎలా?

దీనికి అనేక పద్ధతులు చేపట్టవచ్చు. అయతే ఈ సాధన మనకు సులువుగా ఉండడానికి తొలుత కొన్ని ప్రాథమికభావ నలు అవసరం.

జీవితమొకటే రూపాలు అనేకం

మొట్టమొదటిదీ, అతిప్రధానమైనదీ అయిన భావన ఏమిటంటే – "ఈ జీవితం అనేది ఒకటే! దానికి నాశనం లేదు" అని తెలుసుకోవడం. "రూపాలు మాత్రం అనేకం. అవి అన్నీ క్షణభంగురాలూ, బుద్బుదప్రాయాలూను" అనే ఎరుక మనస్సులో శాశ్వతంగా నాటుకుపోవాలి. అన్ని రూపాలకు అతీతమై స్వతంత్రంగా ఉండే శాశ్వతజీవితంలో ప్రతీవారూ సాధ్యమైనంతవరకు సారూప్యం సాధించాలి. సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోడానికి అవసరమైన మానసికభూమిక దీనివల్ల ఏర్పడుతుంది.

భయాలన్నిటికీ అతీతంగా ఉండాలన్న విషయం ఆత్మకు అవగతమైనప్పటికీ, మన శరీరంలోని కణకణాలలో భయబీజం ప్రచ్ఛన్నంగా ఒదిగే ఉంటుంది; అదృశ్యంగా ఉంటూనే తనంతట తాను బహిర్గతం అవుతూ ఉంటుంది. ఇది హేతువాదానికి అందదు. సాధారణ మానసికజ్ఞానం దీన్ని కనిపెట్టలేదు. అంత

రాంతరాల్లో, అంధకారంలో ఉండే దీనిని జాగ్రత్తగా పసిగట్టి దానిపై వివాదరహితమైన విజ్ఞానాన్ని ప్రసరింపజేయాలి.

జీవానికి మరణం అనేది అసలు లేనే లేదు. రూపాలు మాత్రమే రద్దవుతూ ఉంటాయని (life does not die, but the form is dissolved) కదా మనం తెలుసుకున్నాం. అయితే ఈ రద్దే భౌతిక మనస్సుని భయకంపితం చేస్తుంది. విచారసాగరంలో ముంచు తుంది. అభివృద్ధిచెందే దిశలో నిత్యం రూపం మారే ఈ చర్యను ఏదీ ఆపలేదు. ఈ అభ్యుదయ పరిణామమే మృత్యువును తప్పని సరి కాకుండా చేస్తుంది. అయితే దీన్ని సాధించడం చాలా కష్టం. దీన్ని సాధించాలంటే కొన్ని నియమాలు ఉండితీరాలి. వాటిని బహుకొద్దిమంది మాత్రమే సాధించగలరు. అంటే మృత్యుభయాన్ని అధిగమించడానికి అనుసరించతగ్గ విధానం వ్యక్తిలక్షణాన్నిబట్టి, మానసికస్థితినిబట్టి ఉంటుంది. ఈ విధానాలను ప్రధానంగా నాలుగురకాలుగా వర్గీకరించవచ్చు. మళ్లీ ప్రతీరకంలోను అనేక విభాగాలు. అయితే ప్రతివ్యక్తి తన చికిత్సావిధానము తనే తయారు చేసుకోవాలి.

హేతువాదం

మొదటిపద్ధతి కార్యకారణ సిద్ధాంతానికి సంబంధించినది. ప్రస్తుతప్రపంచపరిస్థితిలో మృత్యువు అనివార్యమని, పుట్టినవారు గిట్టక తప్పదని, దాని సమయం ఆసన్నమైనప్పుడు అది వచ్చితీరుతుందని, ఆ ఘడియవస్తే, ఒక్క క్షణం ఆగడానికి వీల్లేదని ఎవరైనా చెపుతారు. మరణాన్ని కోరు కుంటూ దానికోసం ఎదురు చూసేవారు ఎంత తొందరపడినా లాభం లేదు. ఆ క్షణం కోసం ఆగవలసిందే! అలాగే మృత్యువు అంటేనే భయపడేవారు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా అది హఠా త్తుగా వచ్చి తీరుతుంది. కాబట్టి మరణఘడియ మనకు తెలియక పోయినా కూడా కచ్చితంగా నిర్ధారణ అయ్యే ఉంటుంది. ఏవో కొన్ని అతీతశక్తులు కలిగివున్నవారు తప్ప మానవమాత్రులు ఎవరూ దాన్ని మార్చలేరు.

మరి, అటువంటప్పుడు, మనం తప్పించుకోలేని దానికోసం భయపడ్డం అవివేకమని ఈ హేతువాదమే మనకు స్పష్టంగా తెలి

యచేస్తుంది కదా! మరెందుకు బెడద? మనం చేయగలిగిందల్లా ఒక్కటే ఒక్కటి – మరణం అనే విషయాన్ని అంగీకరించి, ఎప్పుడు ఏది జరుగుతుందోనన్న విచారం ఏమాత్రం లేకుండా, ఏ రోజుకి ఆ రోజే, ఏ క్షణానికి ఆ క్షణమే మన శ్రాయశక్తులా జీవయాత్రను కొనసాగించుటయే. హేతువాదసిద్ధాంతం ప్రకారం నడచుకొనే మేధావులు ఈ విధానాన్ని అనుసరిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

ఆత్మావలోకనం

అవేశపరులకు మాత్రం హేతువాదం అంత లాభసాటి కాదు. కాబట్టి వారి విధానాన్ని వారే నిర్ణయించుకోవాలి. ఇటువంటివారు ఆత్మావలోకనం అనే రెండోవిధానాన్ని ఆశ్రయించవలసి ఉంటుంది.

అన్ని ఆవేశాలకు అతీతంగా మనలో నిరాయమై శాంతి మయమైన అంతరాత్మ లోలోపల ఓ కాంతి నిత్యం దేదీప్యమానంగా ప్రకాశిస్తూ ఉంటుంది. అదే నీ చైత్యభానుడు. ఆ కాంతిని తెలుసుకోవడానికి కృషిచేయాలి. ఆ తరువాత దాని మీదే ధ్యాస నిలుపుకోవాలి. ఆ కాంతి నీ అంతరంగంలోనే ఉంది. ప్రగాఢమైన ఆకాంక్షకు దృఢమైన దీక్షను జతచేస్తే దానిని నీవు తప్పక కనుక్కోగలవు. దాన్ని కనుక్కోగలిగావో ఇక అక్షయమైన అనుభూతిస్థాయికి నువ్వు ఎదగగలవు. ఇంతవరకు ఉన్నది, ఇక ముందు కూడ ఉండబోయే శరీరానికి పూర్తిగా అతీతంగా, స్వతంత్రంగా ఉంటావు. నీ అనుభూతులు ఇక దానిపై ఆధారపడి ఉండవు.

నీ ఉనికిని అభివ్యక్తీకరించే ఓ తాత్కాలిక పరికరం మాత్రమే ఈ శరీరం అనిపిస్తుంది. మరణం అంటే లయము కానేకాదు. అది కేవలం ఓ మార్పు మాత్రమే – అని నమ్ముతావు. దాంతో భయాలన్నీ వెంటనే మటుమాయమైపోతాయి. అప్పుడు నిరాయమైన పరిశుద్ధమైన స్వేచ్ఛామానవునిగా నువ్వు నీ మనుగడను సాగించగలవు.

శరణాగతి

ఇది మూడోపద్ధతి – దేవునిపై భక్తివిశ్వాసాలు ఉన్నవారికి, వారి ఇష్టదైవం కోసం తమను తాము సమర్పించుకొనేవారికి అనువైనది. అటువంటివారు సంపూ

ర్ణంగా దైవంలో భాగమే అయిపోతారు. *వారి జీవితంలోని అన్ని సంఘటనలు దైవనిర్ణయాలే! వారు వాటిని పూర్తి విధేయతతో మాత్రమే కాకుండా కృతజ్ఞతతో కూడా స్వీకరిస్తారు. అటువంటి వారు తమకు సంభవించేవన్నీ తమ ఇష్టదైవానికే సంభవిస్తున్న వని అనుకుంటారు.* వారికి తమ దైవంపట్ల అనూహ్యమైన ప్రగాఢవిశ్వాసం ఉంటుంది. అంతేకాదు, వారు వారి ఇష్టదైవంతో వైయక్తికమైన సంబంధాన్ని కూడా కలిగి ఉంటారు. తమ అభీష్టాన్ని ఆ దైవానికి పూర్తిగా అర్పిస్తారు. జీవనసంఘటనలకు, ఆఖరికి మరణానికి సైతం లొంగకుండా పూర్తి స్వతంత్రంగా ఉంటూ భగవంతుని అద్భుతమైన ప్రేమను, రక్షణను వారు అనుభూతిచెందుతూ ఉంటారు.

సంపూర్ణశరణాగతిభావంతో తమ ఇష్టదైవం పాదాలచెంతనే ఉన్నట్లు వారు నిత్యం అనుభూతి చెందుతారు. భగవంతుని కరకమలాలలో ఊయలలూగుతూ పూర్తి రక్షణను అనుభవిస్తారు. ప్రశాంతం, ఆహ్లాదం, ఆనందం ఆవరించుకునివున్న అటువంటి మహానుభావుల మనస్సులో భయానికి తావు ఎక్కడిది? అయితే అటువంటి యోగాన్ని ఎంతమంది సాధించగలరు?

సాహసం

ఇక మిగిలింది – ఆఖరిది. పుట్టుకతోనే క్షత్రియ లక్షణాలు కలిగివుండేవారు – తమ జీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగా స్వీకరించలేరు. శాశ్వతంగా ఉండడం తమ హక్కు అనేది వారి నరనరాల్లో జీర్ణించుకుపోయి ఉంటుంది. ఈ భూలోకజీవితం సంపూర్ణమని, శాశ్వతమని వారు భావిస్తారు. మరణం అనేది ఒక వ్యసనం అని భావించడం వారి నైజం. ఆ వ్యసనాన్ని జయించాలన్న ధ్యేయంతోనే తాము జన్మించినట్లు వారు వ్యవహరిస్తారు.

అయితే దొంగచాటుగా దాడి జరిపే అతిక్రూరమైన సైన్యంతో నిరాశాపూరితమైన పోరాటాన్ని వారు ఈ కృషిలో జరపవలసి వస్తుంది. నిరంతరపోరాటం నిత్యం క్షణక్షణం జరపవలసివస్తుంది. ఎటువంటి పరిస్థితులకైన తలవొగ్గని సాహసం కలవారే దీన్ని చేపట్టాలి. ఈ పోరాటానికి చాలా పార్శ్వాలు ఉంటాయి. పర

స్వరం కలిసిపోయి ఒకదానికి ఒకటి దోహదపడే అనేక స్తరా లపై ఈ పోరాటం ఉంటుంది....

మృత్యుభయాన్ని జయించేమార్గం మరోటి ఉంది. అయితే అది బహుకొద్దిమందికిమాత్రమే సాధ్యమౌతుంది. బ్రతికివుండగానే మృత్యుసామ్రాజ్యంలోకి సాహసంగా ప్రవేశించి అక్కడనుండి తిరిగివచ్చి మళ్లీ భౌతికశరీరంలోనే ప్రవేశించాలి. ప్రాపంచికజీవి తాన్ని తిరిగి కొనసాగించాలి. అయితే అటువంటిదానిని సాధిం చాలంటే – వారు ఉపాసకులై ఉండాలి.

(*CWM* Vol. 12, pp. 82-87)

ఒకవేళ ఏదైనా కారణంవలన ఈ శరీరాన్ని వదిలేసి మరో శరీ రాన్ని ధరించాల్సి వచ్చిందనుకోండి. అటువంటప్పుడు శోకంతో ఏడ్చి రాగాలుపెట్టేబదులు సంతోషంగా, వైభవంగా ఒక శుభ కార్యోద్యుక్తుడవై ఎందుకుండకూడదు? మృత్యువును ఒక శుభ మంగళంవలెనే భావిస్తే బాగుంటుంది. అలా కాకుండ పాతజీవి తాన్నే అతుక్కొని ఉండి కనీసం కొన్ని నిమిషాల తరబడి అయినా దాన్ని పొడిగిద్దామనుకొనేవాళ్లు – అట్టివాళ్లు ఆత్మజ్ఞానం లేనివా రన్నమాట. మృత్యువంటే ఏమిటి? అది ఒక సాధనమే కదా! మరి దాన్ని ఒక అవకాశముగా మనమెందుకనుకోకూడదు? If one is conscious one can make a beautiful thing of it, a very beautiful thing, as of everything. మృత్యువంటే ఏమాత్రం భయం లేకుండా, ఏమాత్రం ఆవేదనపడకుండా నిరంతరం దాన్ని గురించే ఆలోచించకుండా ఉన్నవారు, చాల ధైర్యంగా, మరణ మాసన్న మైనప్పుడు తలెత్తుకుని చిరునవ్వుతో ఇదిగో – "నేను సిద్ధంగానే ఉన్నాను" అని దానినాహ్వానించగలరు.

అటువంటివారు వారి జీవితాల్ని చాల ఉపయోగకరంగా గడపగలరు. "నేను ఎన్నాళ్లు ఉండాల్సివస్తే అన్నాళ్లు ఉంటాను. నా లక్ష్యాన్ని సాధించేందుకు ఒక క్షణం కూడా వృథాచేయ కూడదు". అట్టివారు సమయూమాసన్నమైనప్పుడు ఉత్సాహంగా ఉంటారు. ఎందుకని? వారు భోగభాగ్యములను లెక్కచేయరు.

వారికి కావలసింది జీవితలక్ష్యమును సాధించుటయే. జీవితంలోని ప్రతిచర్య దానికి అంకితం చేయుటయే. వారి జీవితానికి ఇది తప్ప వేరే కారణం లేదు. ...and in all things they can see this ideal, this reason of existence, and never do they come down into the sordidness of material life.

కాబట్టి గుర్తుంచుకోవలసిన విషయాలు – మృత్యువును ఎప్పుడూ కోరుకోకూడదు. మృత్యువంటే ఏమాత్రం భయపడ కూడదు. అన్ని పరిస్థితులలోను నిన్ను నీవు అధిగమించాల్సిందే!

(*CWM* Vol. 4, pp. 355-56)

అనువాదం: పి. నాగేశ్వరరావు, ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

ఒక గ్రీకు గాథ

ఒకప్పుడు థెబీస్ అనే నగరాన్ని నాశనంచేసి, స్త్రీ ముఖము, శునక శరీరము, పాము తోక, సింహపు పంజాలుగల ఒక వింత జంతువు ఎడారి మార్గంలో ఒక ఎత్తైన గుట్టమీద కాచుకొని కూర్చుండేది. దారేపోయే బాటసారులను పట్టుకొని చిక్కుప్రశ్నలు వేసి సవాలుచేసేది. పొద్దున నాలుగుకాళ్లతోను, మధ్యాహ్నం రెండుకాళ్లతోను, సాయంకాలము మూడుకాళ్లతోను నడిచే జంతువు ఏది? దీనికి సూర్యాస్తమయం లోపులో జవాబివ్వాలి. జవాబు ఇచ్చినవాళ్లను వెళ్లనిచ్చేది ఇవ్వనివాళ్లని చంపి తినేసేది.

బాటసారులెవరూ ఆ రాక్షసి చేతిలో మృత్యువును తప్పించుకోలేకపోయేవారు. చిట్టచివరకు ఓడిపస్ అనే ఆయన "ఆ ప్రశ్నకు జవాబు నేనే" నని జవాబిచ్చాడు. మనిషి చిన్నప్పుడు నాలుగుకాళ్లతో పాకుతాడు, తరువాత రెండుకాళ్లతో నడుస్తాడు. ముసలితనంలో కట్టతీసుకొని మూడుకాళ్లతో నడుస్తాడు!

అంతే, ఆ జవాబు విన్న వెంటనే ఆ Sphinix కొండమీద నుంచి దూకి చచ్చిపోయింది.

ఈ గ్రీకు రోమన్ గాథలో ఉపనిషత్తుల ప్రతిధ్వనే కనబడుతుంది. తనను తాను తెలుసుకోలేని వాడు తన మూర్ఖత్వంవల్లనే మరణిస్తాడు. ఎప్పుడైతే ఆత్మజ్ఞానాన్ని పొందుతాడో అప్పుడు మరణించేది మృత్యువు. ఆ Sphinx రూపాన్ని పరిశీలించినట్లైతే అది కేవలం కల్పితమైనది, నిజంకాదు అని తెలిసిపోతుంది. ఈ విధంగా నిన్ను తెలిసికోవటమంటే నువ్వు మనోశారీరకావేదనలకు ఆవలనున్న యథార్థరూపము నెరుగుటయే.

మూలం: మనోజ్‌దాస్
అనువాదం: ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి

సమాచార పత్రం

"దర్శనదినములను, డిసెంబరు 5, 9 వ తేదీలను, పుట్టినరోజును మేము ఏవిధంగా గడపాలి" అని శ్రీమాతను 1969 లో ఒకరు అడుగగా వారీ విధంగా సెలవిచ్చిరి:

"దర్శనదినములలో మామూలు మనోవిషయకమైనజ్ఞానము కంటె యథార్థమైన జ్ఞానాన్ని అన్వేషించాలి. 5, 9 డిసెంబరు తేదీలలో మృత్యువంటే ఏమిటో అర్థంచేసుకోవాలి. పుట్టినరోజున నీ జీవితపులక్ష్యమేమిటో కనిపెట్టాలి".

ఈ సంచికలో మృత్యువును గురించి శ్రీమాత చెప్పిన విషయాలను, వ్రాసిన ప్రవచనాలను చదివి తెలుసుకొంటారని మీ ముందుంచుచుంటిమి.

ఒక రూపాయి వెలగల 12-16 పేజీల లఘుదీపికలను 'ధ్యానముయొక్క ప్రాముఖ్యత', 'దేవునియందు విశ్వాసము' 'అంతరంగిక ప్రశాంతత' మొ॥ విషయాలపై ఆంగ్లములోను, హిందీలోను ప్రచురించితిమి. అక్టోబరు 2002 నుంచి వీటి ఖరీదు రు॥ 1.50. తపాలా ఖర్చులు అదనము.

21-2-2003 నాడు శ్రీమాత 125 వ జన్మదినమహోత్సవము జరుపబడును. ఆశ్రమంలో ప్రొద్దున 6 నుండి 6-30 వరకు